T.T.D. Religious Publication Series No. 1002
Price :

ఇటీవలి ప్రచురణలు

తిరుపతి పరిసర క్షేత్రాలు : శ్రీ గోపీకృష్ణ

వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక :ఆచార్య మసన చెన్నప్ప

కేయూరబాహు చరిత్ర : సంపాదకులు డా॥ శ్రీరంగాచార్య

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం
అప్పలాయగుంట : శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

శ్రీ లక్ష్మీనరసింహ పురాణం : శ్రీ యామిజాల పద్మనాభస్వామి

శ్రీ కోదండరామస్వామి ఆలయం-
తిరుపతి : శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

వేటూరివారి పీఠికలు-భాగం 2 : శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి

నిత్యకల్యాణపురం శ్రీనివాస మంగాపురం: శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

శ్రీ వేంకటాచలమాహాత్మ్యం (పద్యకావ్యం) పరిష్కర్త:
మాతృశ్రీ తరిగొండవెంగమాంబ : ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

Published by **Sri L.V. Subrahmanyam,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

రామనాటక విమర్శనము

-పంగనామల బాలకృష్ణమూర్తి

తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

రామనాటక విమర్శనము

(పది రామాయణనాటకములపైన విమర్శ)

రచయిత

విద్వాన్, సాహిత్యశిరోమణి;

పంగనామల బాలకృష్ణమూర్తి, ఎం.ఏ.,

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2013

RAMANATAKA VIMARSANAMU

By

P. Balakrishna Murthi M.A.,

Edited by

Prof. Ravva Sri Hari
Vidwan Mudivarthi Kondamacharyulu

Editor-in-Chief
Prof. Ravva Sri Hari

T.T.D. Religious Publication Series No:1002

© All Rights Reserved

First Edition : 1959

Second Edition : 2013

Copies:1000

Published by :
L.V. SUBRAHMANYAM, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Office of the Editor- in- Chief,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

ముందుమాట

శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయంలో తెలుగు రీడరుగా ఖ్యాతి గాంచిన విద్వాన్, సాహిత్యశిరోమణి శ్రీపంగనామాల బాలకృష్ణమూర్తి, ఎం.ఏ., గారు సరళ గ్రాంథికంలో వ్రాసిన ఈ "రామాయణనాటక విమర్శనం" తి.తి.దేవస్థానములు 1959లో ప్రథమంగా ప్రచురించింది.

రమారమి అర్ధశతాబ్ది తర్వాత పునర్ముద్రిత మవుతూ ఈ పుస్తకం పాఠకుల కరకమలాలను అలంకరించబోతున్నందుకు నే నెంతో ఆనందిస్తున్నాను. ఇలాగే ఇంతకు మునుపు దేవస్థానములు ప్రచురించిన గద్యపద్యాత్మకాలైన గ్రంథాలన్నీ సత్వరం పునర్ముద్రితాలై చదువరులను అలరించాలని నా ఆశయం; ఆకాంక్ష. భక్తి జ్ఞాన విజ్ఞాన బోధకాలై సాహిత్యపు విలువలతో కూడిన ఇలాంటి రచనలు విరివిగా పాఠకులకు అందించాలన్నదే తి.తి.దే సంకల్పం.

సులభ సుందర శైలిలో సాగిన ఈ "రామనాటక విమర్శనం"లో సంస్కృత భాషలో మహాకవి ప్రణీతాలైన పది ప్రసిద్ధ రామనాటకాల పరామర్శ చక్కగా సాగింది.

భాసుడు రచించిన అభిషేక, ప్రతిమానాటకాలు, భవభూతి కృతములైన మహావీర చరితం, ఉత్తర రామచరితం, దిఙ్నాగుని కుందమాల, మురారి కవి అనర్ఘరాఘవం, రాజశేఖరుని బాలరామాయణం, శక్తిభద్రుని ఆశ్చర్య చూడామణి, రామభద్రదీక్షితుల జానకీపరిణయం, జయదేవుని ప్రసన్నరాఘవం అనే నాటకాల్లోని కథాసంగ్రహాలతోపాటు, ఆయా నాటకాల్లోని విశేషాలు తెల్పుతూ మనం జ్ఞప్తిలో ఉంచుకోదగిన

ఆ నాటకాల్లోని సుమనోహర సూక్తులు ఈ గ్రంథంలో సమకూర్చబడ్డాయి. ఈ ప్రసిద్ధ సంస్కృత నాటక సమగ్ర సమీక్ష చదవాలి అన్న అభిలాషను కల్గిస్తుంది గనుక పాఠకుల ఆదరానికి పాత్రం కాగలదని మా విశ్వాసం.

సదా శ్రీవారి సేవలో....

అంక వెంకట సుబ్రహ్మణ్యం
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

విషయసూచిక

	పుట.
1. అభిషేకనాటకము–భాసుడు	1
అభిషేకనాటకమున–సూక్తులు	22
2. ప్రతిమానాటకము–భాసుడు	23
ప్రతిమానాటకమున–సూక్తులు	49
3. మహావీరచరితము–భవభూతి	52
మహావీరచరితమున–సూక్తులు	82
4. ఉత్తరరామచరితము–భవభూతి	87
ఉత్తరరామచరితమున–సూక్తులు	139
5. కుందమాల–దిఙ్నాగుడు	144
కుందమాల–సూక్తులు	183
6. అనర్ఘరాఘవము–మురారి	185
అనర్ఘరాఘవమున–సూక్తులు	240
7. బాలరామాయణము–రాజశేఖరుడు	245
బాలరామాయణమున–సూక్తులు	304
8. ఆశ్చర్యచూడామణి–శక్తిభద్రుడు	312
ఆశ్చర్యచూడామణి–సూక్తులు	349

9. జానకీపరిణయము–రామభద్రదీక్షితులు 353
జానకీపరిణయమున–సూక్తులు 395
10. ప్రసన్నరాఘవము–జయదేవుడు 397
ప్రసన్నరాఘవమున–సూక్తులు 432

ఉపోద్ఘాతము

"వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే।
వేదః ప్రాచేతసాదాసీత్సాక్షా ద్రామాయణాత్మనా॥"

అని వేదవేద్యుఁడగు పరమపురుషుఁడు శ్రీరామచంద్రుఁడుగా లోకమున నావిర్భవింపగా, వాల్మీకివలన నా వేదమే రామాయణముగ నాయెనని శ్రీమద్రామాయణము చాల గొప్ప ప్రమాణగ్రంథముగ గ్రహింపఁ బడుచున్నది. ఇక్ష్వాకు వంశప్రభువు లందరును దృఢవ్రతులు, సచ్ఛీలురు, లోకారాధన తత్పరులునై విలసిల్లిరి. వారిలో నెల్ల శ్రీరామచంద్రుఁడుత్త మోత్తముఁడు. సాక్షాద్విష్ణువే భువి శ్రీరామరూపమున నవతరించె ననియే ప్రమాణము. అతని చరిత్రముత్తమాదర్శము. కావుననే యతని చరితమగు నీ రామాయణమును గూర్చి గొప్పగా–

"చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్।
ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్॥

అని నుడువఁబడుచున్నది. సత్యముగ నా రామచరిత మట్టిదే. శ్రీరామద్రామాయణ సారాయణము సర్వాభీష్టప్రద మనియు, నందును సుందరకాండ ప్రభావ మనన్య సామాన్యము ననుట పలువురు భారతీయులు పఠించుట. పారాయణములు చేయుట. పురాణములు చెప్పుట. కాలక్షేపములు చేయుట మనము చూచుచునే యున్నాము. ఈ రఘురామునిచరితము పలువురు కవులను రసపుష్టిచేత,వస్తు గాంభీర్యముచేతను, నీతిబోధక మగుటచేతను నాదర్శచరితమగుట మిక్కిలి యాకర్షించినది. కొందరు శ్రవ్యకావ్యములుగను. కొందరు దృశ్యకావ్యములుగను, మరికొందరు గేయకావ్యములుగను. నింకను నెన్నో విధములుగ రఘురాముని చరితమును వివిధరూపములగు వాఙ్మయశాఖలలో

కవిశేఖరులు కృతులుగ రచించి తనిసి యితరులఁగూడఁదన్పిరి. ఇంతకును నా రామాయణమునందలి రుచి యట్టిదనియే యూహింపవలసి వచ్చుచున్నది. భారతదేశమున నా బాల వృద్ధము రామనామ మెఱుంగని హైందవుఁడుండడన్న సత్యదూరము కానేరదు. ఇంతటి విపుల ప్రసిద్ధినందుటకు సత్యముగ రాముని మాహాత్మ్యమే కారణము. శ్రీరాముడు లోకోత్తర మహాపురుషుఁడు. భారతదేశమున రామచరిత మన్ని భాషలలోను రచింపబడియున్నది. పాశ్చాత్యులుగూడ నీ రామాయణమును చాల గొప్పగా ప్రశంసించియున్నారు. సంస్కృతభాషయందు శ్రీమద్రామాయణమే యాదికావ్యమని పేర్కొనఁబడినది. దీనిని రచించిన వాల్మీకియే ఆదికవియని కీర్తింపఁబడుచున్నాఁడు. ధ్వన్యాలోకకారుఁడగు ఆనందవర్ధనాచార్యులు 'శ్లోకః శ్లోకత్వ మాగతః' అని వాల్మీకికి, క్రౌంచమిథునమున మగపక్షి బోయవాని పెట్టునఁబడి మరణింప. నాఁడు పక్షి దీనముగా నేడ్చుచుండ నాదృశ్యముం జూచి సానుభూతితో తానుగూడ దుఃఖించుచు వివశుఁడై యీ క్రింది శ్లోకము నుడివె ననెను.

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః।
యత్క్రౌంచ మిథునాదేక మవధీః కామమోహితమ్॥

వాల్మీకి శోకమే యీ శ్లోకరూపమున వెలువడినది. కావుననే యింతటి రసమయ కావ్య మిన్నినాళ్ళు చిరస్థాయిగానుండి యింకను నెన్నోశతాబ్దములేగాక యాచంద్రతారార్కముగ వెలయఁ గల్గుచున్నది. ఇట్టి రసమయ కావ్యమును తొట్ట తొలుత రచించినది వాల్మీకి కావున నతనిని ఆదికవి యని నుడుపుచున్నారు. తర్వాతివారు ఎన్నిరామాయణములు వ్రాసినను రామకథ లెన్ని మార్పులతో వ్రాయఁబడినను వానికన్నింటికిని మూల మీ వాల్మీకిరామాయణమే. తర్వాతికవుల కందర కన్నిట

నీరామాయణము మార్గదర్శకమై దీనినుండి విషయములను వర్ణనములను అనుకరింప దగియున్నది. రామాయణములందు విషయము ఒక్కటేయైనను సూక్తివైచిత్ర్యముచే భిన్నములుగా గానుపించుచుండును. వాల్మీకి రచింపని, ఆదర్శశీలము గాని, సత్యము గాని, సౌందర్యము గాని, రసము గాని లేదు. శైలియందును, వస్తైక్యమునందును, విషయమునందును, వర్ణనాదులందును వాల్మీకి నతిశయింప గలది యొండు లేదనుట యతిశయోక్తి కాఁజాలదు. అద్భుతములగు ప్రకృతి దృశ్యములు గల యారణ్యకసీమలు, తపోనిష్ఠాగరిష్ఠులగు వసిష్ఠుఁడు. అగస్త్యుఁడు మున్నగువారి పటకుటీరములు, వారి తపఃప్రభావములు, ధీరోదాత్తాది గుణములు; చొక్కమగు వీరలక్షణములు, సీతారాముల హృదయ పరిపాకములు, వారి దివ్యము నమలినమునగు ప్రణయము. గుహ, సుగ్రీవ, విభీషణ, హనుమదాదుల సౌహార్దము మున్నగు భావముల నెంతో రమణీయముగ మానవహృదయ తత్త్వముల నెఱింగి, మనసున హత్తుకొనునటువంటి భావములతో నీ రామాయణమును వాల్మీకి అద్వితీయముగ రచించి లోకపూజ్యుఁడైనాఁడు. సర్వవాఙ్మయమునకును నిదియే మూలమునై యలరారుచున్నది.

అంతేకాక, మానవహృదయమునఁగల మాలిన్యమంతయు రావణాది రాక్షసభావముల మూలమునఁ జిత్రించి గుణదోషముల నెల్ల చమత్కారముగ నీ గ్రంథమున వర్ణించి వాల్మీకి ప్రసిద్ధుఁడాయెను. ఈ రామాయణమందే బ్రహ్మ యీ రామకథనుగూర్చి ప్రశంసించి యేమనెనో తిలకింపుఁడు.

"యావత్ స్థాస్యంతి గిరయ స్సరితశ్చ మహీతలే।
తావత్ రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి॥

(సర్గము 1. శ్లోకము 240)

శ్రీరామచంద్రునిపేరు, ఆతని వీరగాథలును నీ భూతలమున నెంతదనుక పర్వతములును. నదులు నుండునో అంతదనుక ప్రచారమున వెలయఁ గలవని నుడివెను.

లౌకికముగకూడ వాల్మీకి యీ గాథయందు కష్టసుఖముల పర్యాయముగ గూర్చి మానవజీవితమున నివి సహజము లనియు. సుఖమునఁ దనకన్న సుఖులఁజూచి గర్వింపరాదనియు, దుఃఖమునఁ దనకన్న దుఃఖితులఁజూచి దిగులపడక యుత్సాహపడవలయు ననియు, దైవనిర్ణయ మట్టులుండు ననియు బోధించుచున్నాఁడు. ఈశ్వరాజ్ఞ బలీయమైనదని యీ రామకథయే చాటుచున్నది. గీతావచనము 'నహి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి' యనునదికూడ సీతారాముల వనవాసమునను త్రికరణశుద్ధిగ కల్యాణకార్యముల గావించుటచే వారి కవ్వల సుఖమేగల్గెను. సీతకూడ హనుమంతునిద్వారా రాముని విషయము విన్నంత నేమనుచున్నదో చూడుఁడు.

"కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే।
ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి॥

ఈ లోకమున మానవుడు నూరుసంవత్సరములకైనను ఆనందము నందునను విషయ మీ రామకథామూలమున వ్యక్తము కాగలదని యీ లౌకికగాథ కల్యాణకరమని నుడుపుచున్నది.

రామాయణమను పేరుతోనున్న గ్రంథములు

1. తత్వసంగ్రహరామాయణము: దీనిని రామబ్రహ్మానందులు రచించిరి. ఏడధ్యాయముల గ్రంథము. వాల్మీకిరామాయణమున లేని కొన్ని సంఘటనలిందు గూర్చినాఁడు.

2. వాసిష్ఠరామాయణము: దీనినే జ్ఞానవాసిష్ఠమనియు నందురు. ఇది వాల్మీకిరచితమనియే నుడువఁబడుచున్నది. శ్రీరామునకు వసిష్ఠుఁడుప దేశించిన విషయ మిందుండుటచే దీనికీ పేరు తగియున్నది. ఇది ఆఱు అధ్యాయముల గ్రంథము. ఇందు వైరాగ్య, ముముక్షుత్వ, ఉత్పత్తి. స్థితి. ఉపాసనా, నిర్వాణములఁగూర్చియు, ముఖ్యముగా యోగమును గూర్చియు సోదాహరణగాథల రూపమునను, విషయము రచింపఁబడినది. ఇది ఆనందానుభూతికనువగు తిన్నని మార్గమును అద్వైత వేదాంత మూలమున బోధించుచున్నది.

3. అద్భుతరామాయణము: ఇదికూడ వాల్మీకి విరచితమని యందురు. ఇందు నిరువదియేడు సర్గలు కలవు. సీతయొక్క పూర్వచరితమును, యథార్థస్వరూప స్వభావములును వర్ణింపఁబడినవి. ఇందు నూరుతలలు గల రావణుని. రాముఁడు రూపు మాపలేని తఱి సీత యా రావణుని బరిమార్చినట్లు వర్ణింపఁబడియున్నది.

4. ఆధ్యాత్మరామాయణము: ఇది బ్రహ్మాండపురాణాంతర్గత భాగము. ఇది ఏడు భాగములుగ విభజింపఁబడి శ్రీరాముఁడే పరమాత్మయనియు, సీతయే ప్రకృతి స్వరూపిణియగు లక్ష్మియనియు, నాధ్యాత్మికముగ రామకథను నుడువుచున్నది. ఇది పార్వతీ పరమేశ్వరుల సంవాదరూపముగనున్నది.

5. మూలరామాయణము:
6. ఆనందరామాయణము:
ఈ రెండును హనుమత్ప్రాధాన్యమును వచించుచు నుడువఁబడిన రామాయణములు. మధ్వమతస్థులచే విశేషముగ నాదరింపఁబడుచున్నవి.

7. వసిష్ఠోత్తరరామాయణము: దీనినే సీతావిజయ మని యందురు. అద్భుతరామాయణము నందువలె నిందును పంద్రెండవ యధ్యాయమున

సీత నూరుతలల రావణుని రూపుమాపి నట్లు వర్ణింపఁబడినది. ప్రకృతమిది లభించుట లేదు.

ఇట్లీ రామాయణవేం యిన్ని పేర్లతో నలతిమార్పులతో వెలయుచున్నది. ఈ రామాయణముయొక్క గొప్పతనమునకు దానికిగల వ్యాఖ్యానములే సాక్షి. రామాయణ వ్యాఖ్యానములు సుమారు పదికిపైన గలవు. అవి ఏవన–

1. భూషణమను వ్యాఖ్య: కౌశికగోత్రుఁడగు గోవిందరాజ రచితము. ఈ కవికి తిరుపతి వేంకటేశ్వరుఁడు కలలోఁగనఁబడి రామాయణమునకు వ్యాఖ్యానమువ్రాయఁ బ్రేరేచినట్లు తెలియుచున్నది. ఈ వ్యాఖ్యానము ప్రమాణముగా గ్రహింపఁబడుచున్నది. ఇందొక్కొకకాండ వ్యాఖ్యానమున కొక్కొకపేరు గలదు. అవి మణిమంజీరము. ముక్తాహారము, రత్నకిరీటము మొదలైనవి.

2. వాల్మీకిహృదయము: ఈ వ్యాఖ్య కాంచీపురవాసియగు అహోబల విరచితము. ఇతఁడా త్రేయగోత్రుఁడు. 16.వ శతాబ్దమధ్యవర్తియగు విజయనగర రాజగు రామరాజు సమకాలికుడగు పరాంకుశస్వామి శిష్యుఁడు. ఈ పరాంకుశస్వామి అహోబలమఠస్వాములలో నాఱవవాఁడు.

3. ధర్మాకూతము: ఈ వ్యాఖ్యానము రామాయణమునకు విమర్శన రూపముగనున్నది. రామాయణశ్లోకములు శ్రుతి స్మృతి సమ్మితములని, తత్తత్సందర్భములలో నాయాశ్లోకార్థములకు సనియగు శ్రుత్యర్థ. స్మృత్యర్థముల నుదాహరించుచు రామాయణ ధర్మబోధకత్వమును చాటుచున్నది. ఇది చాల ప్రశస్తవ్యాఖ్యానము. దీనిని వ్రాసినది త్ర్యంబకమఖి. తంజాపురాధీశుఁడగు ఏకోజీకి (1674–1687) మంత్రియగు గంగాధరుని

కుమారుఁడు. షహాజీమహారాజ కాలమున (1687–1711) నీత్ర్యంబకమఖి మంత్రిగా నుండెను. తుద కీతఁడు కుంభకోణమున పారమార్థికజీవనము గడపుచుండెను. ఈ ధర్మాకూత వ్యాఖ్యలో కొన్ని యధ్యాయములు మాత్రము ముద్రింపఁబడినవి.

4. రామాయణాన్వయి: ఇది రంగాచార్యవిరచితవ్యాఖ్య.

5. రామాయణభూషణమ్: దీనిని సింగయార్యుని పుత్రుఁడగు ప్రబల ముకుందసూరి రచించెను.

6. సుబోధినీవ్యాఖ్య: దీనిని అభినవరామభద్రాశ్రములు వ్రాసిరి. వీరు శ్రీ రఘూత్తమాశ్రముల శిష్యులు.

7. గురువాల్మీకి భావప్రకాశిక: ఇది హరిపండితునివ్యాఖ్య. ఇతఁడు ముదిగుండ వంశస్థుఁడగు లక్ష్మీనారాయణామాత్యుని పుత్రుఁడు. కౌండిన్యగోత్రుఁడు.

8. రామాయణతాత్పర్య నిర్ణయః
9. రామాయణసార సంగ్రహః
} ఈ రెండును అప్పయ్యదీక్షితుల వారిచే రచింపఁబడినవి.

10. రామాయణతత్త్వదీపిక: దీనినే తీర్థీయమని పరిచితముగ నందురు. ఇది మహేశతీర్థ విరచితము. వీరు తురీయాశ్రమమున నున్నవారు. నారాయణతీర్థులవారి శిష్యులు.

11. రామాయణదీపిక: ఇది విద్యానాథ దీక్షిత విరచితమగు వ్యాఖ్య.

12. సర్వార్థసారః: ఇది వేంకటేశ్వరకవి విరచితము.

13. చతురర్థి: ఇది నాలుగర్థములను కొన్ని ముఖ్య శ్లోకములకు వివరించు వ్యాఖ్య. దీని కర్త యెవరో తెలియరాదు.

14. అమృతకటక వ్యాఖ్య: దీని కర్త ఎవరో తెలియదు.

15. రామాయణసారదీపిక
16. గురుబాలచిత్తరంజనీ
17. విద్వన్మనోరంజనీ
} ఈ మూడును సంపూర్ణముగ లేవు. కర్తల పేరు తెలియరాదు.

ఇంకను నెన్నియో వ్యాఖ్యలు కొన్ని ముఖ్యశ్లోకములకు ముఖ్యఘట్టములకును పలువురచే వ్రాయఁబడినవి కలవు.

కవీశ్వరులు వారి వారి చిత్తవృత్తికిఁ దోఁచినరీతి శ్రవ్యకావ్యములుగను, దృశ్యకావ్యములుగను నీ రామకథను లిఖించి తరించిరి. రఘువంశము, జానకీ హరణము, సేతుబంధము, మున్నగుకావ్యములు శ్రవణయోగ్యములున్నను వీనికన్న దృశ్యకావ్యములే యెక్కుడు వెలసినవి. 'విన్నదానికన్న కన్నది మిన్న' యన్న మేరకును, గ్రహణవిషయమున చెవికన్న కన్ను మిన్నయని కాబోలును పెక్కురు కవులు రామకథను నాటకములుగా వ్రాసిరి. ఆంగ్లమున 'The eye is the quicker route to the brain' అని యందురు. కావుననే మానవ స్వభావము ననుసరించి చిత్తమునకు బాగుగా హత్తునని రామకథ నెక్కువగా నాటకములుగా రచించిరి. సుమారు 60 గ్రంథములకుపైగా నేడు రామకథా నాటకములు వెలయుచున్నవి. ఇంకను బయటపడకుండ నెక్కడెక్కడ నెన్నియున్నవో తెలియదు. లభ్యములగు గ్రంథములను బట్టిచూడ నీ క్రింది నాటకములు రామకథా నాటకములని చెప్పనగును.

గ్రంథనామము	కర్తపేరు	కాలము
1. అభిషేకనాటకము	భాసుడు	క్రీ.పూ. 1–వశతమునకు ముందు
2. ప్రతిమానాటకము	”	”

గ్రంథనామము	కర్తపేరు	కాలము
3. మహావీరచరితము	భవభూతి	7–వ, 8–వ శతాబ్దములు
4. ఉత్తరరామచరితము	”	”
5. కుందమాల	దిఙ్నాగుడు	?
6. రామాభ్యుదయము	యశోవర్మరాజు	9–వ
7. బాలరామాయణము	రాజశేఖరుఁడు	10
8. ఆశ్చర్యచూడామణి	శక్తిభద్రుఁడు	8–9
9. అనర్ఘరాఘవము	మురారి	9–వ
10. మహానాటకమ్	హనుమంతకవి	10–వ శతాబ్దము
11. రఘువిలాసమ్	రామచంద్ర	12–వ
12. రాఘవాభ్యుదయం	”	12–వ
13. ప్రసన్నరాఘవం	జయదేవ	1200 A.D
14. ఉన్మత్తరాఘవం	భాస్కర	14–వ శతాబ్దము
a ”	మహాదేవశాస్త్రి	?
15. రాఘవాభ్యుదయం	గంగాధర	13–వ శతాబ్దము
16. జానకీపరిణయమ్	రామభద్రదీక్షిత	17 ”
17. రాఘవానందం	వేంకటేశ్వర	18–వ శతాబ్దము
18. మైథిలీవిజయం	నారాయణశాస్త్రి	19–20–వ శతాబ్దము
19. పుష్కరరాఘవం	”	”
20. లవణలక్ష్మణం	”	”
21. సీతాహరణం	”	”
22. జానకీవిక్రమం	..... దాస	19
23. చండాలరామాయణం		
24. జానకీపరిణయం	నారాయణభట్ట	

గ్రంథనామము	కర్తపేరు	కాలము
25. జానకీపరిణయం	సీతారామ	
26. రఘువీరచరితం	చక్రవర్తి వేదాంతసూరి	
27. ఉదాత్తరాఘవం	మాయురాజు	
28. సీతారాఘవం		
29. కుశలవవిజయం	వేంకటకృష్ణ	
30. రామాయణనాటకం	సోమేశ్వరదేవ	
31. ముదితరాఘవం	సాలకృష్ణ	
32. సీతానందం	తాతాచార్య	
33. రామరాజ్యాభిషేకం	వీరరాఘవ	
34. కృత్యారావణమ్	జానకీరాఘవ	
35. రామాభినందం		
36. వాలివధం	మాయురాజ	
37. ఛలితరామం		
38. నిర్దోషదశరథం		
39. మారీచవంచితకం		
40. మాయాపుష్పకం		
41. అభిరామరాఘవం	అనపోతననాయక	
42. అమోఘరాఘవం		
43. అభినవరాఘవం	క్షీరస్వామి	
44. ప్రపన్న విభీషణం	లక్ష్మణసూరి	
45. పౌలస్త్యవధం	”	
46. అభిరామమణి	సుందరమిశ్ర	
47. హర్షావసానం	కౌహ్యాలాల్ పంచతీర్థ	

48. రఘువీరచరితం	సుకుమార	
49. ఆంజనేయవిజయం	భాష్యకార	
50. జనకజానందనం	నృసింహ	
51. ప్రౌఢాభిరామం	వేంకటనాథ	
52. అద్భుతదర్పణం	మహాదేవ	17-వ శతాబ్దము
53. కుశకుముదవతీయం	అతిరాత్రయజ్వ	17-వ శతాబ్దము
54. జామదగ్న్యవిజయం		
55. విక్రాంతరాఘవీయం	శ్రీకృష్ణ	
56. వీరరాఘవీయం	ప్రధాని వేంకటభూపతి	
57. సీతాకల్యాణం	”	
58. పాదుకాపట్టాభిషేకం	నారాయణకవి	
59. సీతాదివ్యచరితం	శ్రీనివాసాచార్య	
60.శ్రీరామవిజయవ్యాయోగం	భాష్యకాచార్య	
61. యజ్ఞఫలం	భాస?	
62. జానకీరాఘవం	వరదకవి	
63. జానకీపరిణయం	సీతారామ	

ఈ పైనాటకములలో ముఖ్యములుగ గణింపబడినవి. 1) అభిషేక నాటకమ్, 2) ప్రతిమానాటకమ్, 3) మహావీరచరితమ్, 4) ఉత్తరరామచరితమ్, 5) కుందమాల, 6) అనర్ఘరాఘవమ్, 7) బాలరామాయణమ్, 8) ఆశ్చర్యచూడామణి, 9) జానకీపరిణయమ్, 10) ప్రసన్నరాఘవమ్ అను పదినాటకములు మాత్రమిందు గ్రహింపఁబడినవి.

ఉత్తమోత్తమచరితుఁడగు శ్రీరామచంద్రుని చరిత్రము కథావస్తువుగా గ్రహించి భాసాది కవిశేఖరులు తమ గ్రంథములందు వారి వారి చిత్తవృత్తి ననుసరించి శ్రీరాముని శీలము నద్భుతముగఁ జిత్రించిరి. భాసుఁడు

అభిషేకనాటకమునఁ జాలవఱకు వాల్మీకినే యనుసరించివ్రాసె. వాలిసుగ్రీవ యుద్ధఘట్టమునను, అశోకవనికాఘట్టమునందును గొన్ని ఘట్టములం దలతిమార్పులు గావించి మూలానుగుణముగనే రసవంతముగ కథను సాగించి సీతారామలక్ష్మణుల పాత్రలఁ జక్కగఁ బోషించినాఁడు. ప్రతిమానాటకమున వల్కలకల్పనము, ప్రతిమాకల్పనము, శాద్ధకల్పనము, కైకశీలము మున్నగునవి నూతనముగఁ గల్పించి మొత్తముమీఁద నాటకమును హాయిగా సాగించినాఁడు. కైక నిందు నిష్కళంకగాఁ జత్రించినాఁడు. ఈ భాసుఁడు నాటకకళాదృష్టితో మూలాతి క్రమణము గావించినను నవి రసవంతములై కళాపోషకములై యతని ప్రతిభా సంపత్తిని వేనోళ్ళ కొనియాడఁజేయుచున్నవి.

భవభూతి తన రెండు రామనాటకములగు మహావీరచరిత, ఉత్తరరామ చరితలందు కథావస్తు విషయమున మూలాతిక్రమణ మాచరించెను. భవభూతి హృదయము విలక్షణమైనది. అతని సీతయు నట్టి లోకోత్తరనాయికామణి. 'ఇయంగేహే లక్ష్మీః' ఈ నాయికానాయకుల శీలము లోకమునకు ఒరవడిగాఁజేయ నెంచి వారి నద్భుతముగఁ జిత్రించెను. ఈతఁడును నిజకృతులందు వలసినన్ని మార్పులు గావించెను. మహావీరచరితము భవభూతి చిఱువయసున వ్రాసియుండనోపు. ఇందు శివధనుర్భంగము, సీతాకల్యాణము మున్నగునవి సిద్ధాశ్రమముననే నిర్వహింపఁబడినవి. పరశురామఘట్టము మిథిలయందే నూతనముగ సాగినది. పరశురాముని గర్వోక్తులు, వీరాలాపములును పరశురాముని సామర్థ్య ప్రచారకములుగా వర్ణింపఁబడినవి. వినయాది సద్గుణగరిష్ఠుఁ డును సచ్ఛీలుఁడునగు శ్రీరాముఁడా గర్విష్ఠునియెడ ప్రవర్తించినతీరు చాల ప్రశంసనీయము. భార్గవుఁడు శ్రీరామునెన్ని పర్యాయములు తిరస్కరించి

తూలనాడినను, సరకుగొనక భార్గవగుణములనే యెన్నజేసి శ్రీరామునిపాత్రమునకొక వింతసోయగముం గూర్చినాఁడు. సీతను రావణుఁ డభ్యర్థించుట యిందు పేర్కొనఁబడినది. మాల్యవంతుఁడు రావణునకు మంత్రిగానుండి రావణునకు సీతంగూర్చు విషయమున నెన్నియో యుపాయముల నాలోచించును. తుదకు వానిని ప్రయోగించినను శ్రీరామునియెడ నవి ఫలించినవి కావు. వాలిని రామునెదుర్కొనఁ బ్రేరేచును. వాలియు నందుల కొడంబడును. కాని శ్రీరాముని దర్శనము లభించినతోడనే వాలి హృదయము వెన్నవలె కరగినది. శ్రీరాముని జూచి వాలినుడువు శ్లోకము ప్రశంసార్హము,

శ్లో "ఆనందాయ చ విస్మయాయ చ న మే దృష్టోఽసి దుఃఖాయ వా
వైతృష్ణ్యం ను కుతోఽద్య సంప్రతి మమ త్వద్దర్శనే చక్షుషః।
త్వత్సాంగత్యసుఖస్య నాస్మి విషయః కింవా బహువ్యాహృతై
రస్మిన్విశ్రుత జామదగ్న్య విషయే పాణౌ ధనుర్జృంభతామ్॥"

శ్రీరామునితో సహవాసభాగ్యము లభింపమికి చాల విచారపడును. భవభూతి వాలి పెద్దమనిషి. మైత్రిలక్షణము నెఱింగినవాఁడు. ఇందు శ్రీరాముఁడు చెట్టుచాటున నుండి వాలిని జంపినట్లు మూలముననున్న విషయము చమత్కారముగా మార్చఁబడి యుదాత్తముగాఁ జిత్రింపఁబడినది. శ్రమణవృత్తాంతము, విభీషణుఁడు. సుగ్రీవుఁడు, హనుమంతుఁడును. వాలి శ్రీరాముని కలసికొనినపిదపనే గోచరించునట్లు పేర్కొనుట నూతన కల్పనములు. ఉత్తరరామచరితము నాటకములలో నెల్లనుత్తమకోటికి జెందినది. భవభూతి పేరు ప్రతిష్ఠ లీగ్రంథమువలననే సంపాదించెననుట సత్యము. భవభూతి ఉత్తరరామాయణ కథావిషయమునే గ్రహించి స్వతంత్ర కల్పనల నచ్చటచ్చట జొన్పి నాటకీయదృష్టితో నాయా ఘట్టములఁ జిత్రించి

నాటకమును మనోహరముగ రచించెను. ఇందుఁ జత్రపటకల్పనము నవ్యము. పూర్వోత్తర సందర్భముల సంధించుటకిది యెంతయు నుపయుక్తమగుచున్నది. జనస్థానదృశ్యముల వర్ణనము, సీతారాముల పూర్వానుభవవర్ణనములును హృదయరంజకములు. తృతీయాంకమున సీత యదృశ్యయై రామునోదార్చుట, అప్పట్టున సీతారాముల హృదయ సౌకుమార్యము. భావపుష్టియు లెస్సగఁజిత్రింపఁబడినవి. సీత నదృశ్యగాఁ జిత్రించుట యందే భవభూతి మహిమ వ్యక్తమగుచున్నది. పిదప వసిష్ఠ జనకాదులు వాల్మీక్యాశ్రమమునకుఁ జేరుట. అయ్యాశ్రమమున కౌసల్యాజనకులు రామునిబోలిన మునికుమారుని గాంచి సంశయించుట, అశ్వమేధాశ్వ మాశ్రమ ప్రాంతమున సంచరించుట, లవకుమారుఁడద్దానిని బట్టుట, రామపరాక్రమము లవకుమారుఁడు సైపఁజాలకుండుట, లవ చంద్రకేతులు పోరుట, రామసమాగమము. మొదలగు నంశములన్నియు కళాకోవిదుఁడగు భవభూతి ప్రతిభావిశేషములే. ఈ కల్పనలచే నాటకము రసపుష్టి నందుటయేకాక పాత్రల శీలపోషణమునకు నెంతో తోడ్పడుచున్నది. కుశలవులు శ్రీరాముని జూచినంత విధేయులౌటయు, రాముఁడును వారిని జూచినంత పేమార్ద్రుఁడగుటయు, నట్లు సంధిల్లచేయుట కవి నేర్పుగదా. అప్పట్టున తండ్రి కొడుకుల సంభాషణము చాల స్వాభావికము. తుదియంకమున నంతర్నాటికచే సీతావృత్తాంతము రాముని చిత్తమునకు హత్తునట్లు దృశ్యరూపమునఁ జూపించి సీతారామ పునస్సమాగమము నెంతోరమణీయముగ హైందవనాటక సంప్రదాయానుసారము మోదాంతముగఁ జూపి భవభూతి ధన్యుఁడాయెను. ఈతని దృష్టియంతయు మానవహృదయ సౌకుమార్యము, భావతీవ్రత, శీలపోషణము అను నంశములపైననే నడచి యింతటికృతిని వెలయింపఁజేసినది. సూక్ష్మ సూక్ష్మ తరభావముల నెల్ల వ్యక్తముగఁ జూపగల్గిన మేటికవి యీ భవభూతియే.

కుందమాల దిఙ్నాగ కవికృతము. ఈ నాటకవస్తువుకూడ నుత్తరరామ కథయే గాని యిందు భావతీవ్రత ఉత్తరరామచరితము నందున్నంత కానరాదు. భవభూతి దిఙ్నాగులలో నెవరెవరి ననుకరించిరని నిర్ణయించుట కష్టము. కుందమాలలోగూడ సీతారాముల హృదయములలోదూరి యీ కవి వారి భావముల గుర్తించెనాయనిపించునట్లు సూక్ష్మాతి సూక్ష్మభావముల నయ్యాసందర్భములలో వర్ణించినాఁడు. ఉత్తరరామచరితము నందువలె నిందు దీర్ఘవర్ణనలు, కల్పనలు లేవు. కాని కథాగమనము కుంటుపడకుండ వేగముగ సాగినది. ఇందు కుందమాల గోమతీతీరమున గనుపించి, సీతారామ సమాగమమున కభిజ్ఞానముగ వెలసి సీత యునికిని నిర్ణయింప వీలగుటచే నభిజ్ఞానశాకుంతలమున నుంగరమువలె నిందిది యెంతయు ప్రధానమై యొప్పుచుండుట నీ కృతి పేరు తగియున్నది.

ఇందు విదూషక కల్పనము, తిలోత్తమాపాత్రము, ఇక్ష్వాకుల సింహాసన కల్పనము నూతనములు. తక్కినకథ చాలవరకు మూలానుసరణముగనే సాగినవి. నైమిశాటవీ వర్ణనము, భూదేవీవర్ణనము మున్నగునవి చక్కని శైలిని సాగినవి. కొన్నిపట్ల నీ కవి భవభూతిని మించునట్లుగూడ గోచరించును. దిఙ్నాగుని సీత రామునంటదు. ఆమె వైపునుండి వీచుగాలియే రాముని కలఁచును. మొత్తముమీద నీ కుందమాల రసవంతమై, హృదయరంజకముగ నడచిన దనుట సత్యదూరము కానేరదు. ఇందుకూడ సీతారామ సమాగమము వర్ణింపఁబడినది. కుశునకుఁ బట్టాభిషేకము గావించి భరతవాక్యముతో మోదాంతముగా నిది ముగియుచున్నది.

అనర్ఘరాఘవము మురారి కవి విరచితము. ఈ మురారి కవియే గురుకుల క్లిష్టుఁడు. సారస్వతసారమును సమగ్రముగఁ గ్రోలిన వాఁడని యీ క్రింది శ్లోకము తెల్పుచున్నది.

శ్లో "దేవీం వాచముపాసతే హి బహవః సారం తు సారస్వతం
జానీతే నితరామసౌ గురుకులక్లిష్టో మురారిః కవిః।
అబ్ధిర్లంఘిత ఏవ వానరభటైః కిం తస్య గంభీరతా
మాపాతాళనిమగ్న పీవర తనుర్జానాతి మంథాచలః॥

ఈ యనర్ఘరాఘవమున బలుకు పలుకునను గురుభక్తి. సచ్ఛీలము. వినయ ముత్తమరీతిని ధ్వనితమగుచున్నవి. దశరథుఁడు, ముదుసలియైనను పసివానికి బోధించురీతి వసిష్ఠుడు తనకుపదేశించుచున్నాఁడనుటయు, శ్రీరాముఁడు వసిష్ఠ విశ్వామిత్రులవాక్యముల భక్తితో నాదరించుటయు, సాధుసమాగమము, తద్గోష్ఠి యుత్తమరీతిని జిత్రింపఁబడుటయు నిందులకు నిదర్శనములు. తాటకా సంహారము స్త్రీవధయని మనమున శంకిచుచు.

"జ్యోతిర్మయేణ వపుషా జగదంత సాక్షీ
లజ్జిష్యతే కులగురుర్భగవాన్ వసిష్ఠః॥"

అని నుడివివిన శ్రీరాముని పాత్రచిత్రణ సందర్భమున గురుభక్తుఁడగు మురారియే ప్రతిబింబించుచున్నాఁడు. పరశురామఘట్టము, మున్నగునవి కొన్ని భవభూతి ననుకరించి యిందు వ్రాయఁబడినవి. యుద్ధానంతరము విమానయానముకూడ మహావీరచరితానుకరణమే యైనను మురారి యిందు నిజపాండిత్యమును జాటెను. గ్రంథమునం దచ్చటచ్చట విసుగుపుట్టించు దీర్ఘవర్ణనములు చంద్రవర్ణనము, రాత్రివర్ణనము మున్నగునవి కలవు. కాని వీనియందెల్ల నాతని వివిధశాస్త్ర వైదుష్యము, లోకజ్ఞానము తెల్లమగుచున్నది. ఈతని సూక్తులు పరిమళయుతములు. గ్రంథము సంపూర్ణముగ చదివి సూక్తి పరిమళము గ్రహించవలయునుగాని మహాకవుల గంభీరవచన ములందు దోషాన్వేషణము తగదని యీతని భావము. రావణవిజయియగు

కార్తవీర్యార్జునుని సంహరించిన పరశురామ భంగముతోడనే రామకథ పూర్తియైనను శ్రీరామచరితమునందలి ప్రీతిచే మిగతకథ వ్రాయఁబడెనని శ్రీరామునియెడ తనకుగల భక్తివిశేషమును కొనియాడెను.

'యస్య దేవే పరాభక్తిః యథా దేవే తథా గురౌ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥'

అను శ్వేతాశ్వతరోపనిషద్వాక్యమున కీమురారియే లక్ష్యమనుట నిశ్చయము. ఈతని పాండిత్య మనన్యసామాన్యము. పాండిత్యస్వర్ణమున కీతనికృతి యనర్ఘరాఘవము ఒఱపురాయి. ఇతని కల్పనములు వర్ణనములు విచిత్రములు.

బాలరామాయణము. ఇది రాజశేఖరకవికృతము. ఇతఁడు భవభూతి మురారులపై విశేషభక్తి గలవాఁడు. తాను వాల్మీక్యవతారమే యని భావించినవాఁడు. పెక్కుసందర్భములలో భవభూతి మురారుల ననుకరించి నిజకృతిని నడపించినాఁడు. గ్రంథమునందుఁ బెక్కు నూతన కల్పనల గావించి హృద్యముగ నొనర్చినాఁడు. ఈతని నాటకమున రావణుఁడు సీతను బెండ్లాడ మిథిల కేతెంచెను, శివధనుర్భంగరూపణము తనంతటి వానికిఁ దగదని ధనువును దూలనాడి సీతను జేపట్టినవానిని వధింతునని ప్రతిజ్ఞచేయును. పరశురాముఁడు రావణునితో నిందు బోరుసల్పును. ఋచీక పులస్త్య భృంగిరిటులు వారిని శాంతపరతురు. అంతర్నాటికా రూపమున సీతాస్వయంవర విషయమను పేరఁ గడచినవృత్తాంతము చాలవరకుఁ దెలియఁ జేయును. రావణవిరహము భారతమునందలి కీచకవిరహమునుబోలె వర్ణింపఁబడినది. మాల్యవంతుఁడు సీతా ప్రతికృతిని గల్పించి రావణునోదార్పఁ బంపును. కైకేయీదశరథులు స్వర్గమున

కేగినపుడు రాక్షసులగు శూర్పణఖామాయామయులు కైకేయీ దశరథవేషములతో నయోధ్యయం దంతఃపురముఁ బ్రవేశించి మాయఁ బన్ని రామవనవాసమునకుఁ గారకు లగుదురు. పరశురామ పరాక్రమగాథలు రథచిత్రముల మూలమున దశరథునకు మాతలి తెల్పును. ఇట్టి వనేకములు నూతనముగఁ గల్పించి కథనెంతో మనోహరముగ సాగించినాఁడు, విమానయాన సందర్భమున మురారిని హెచ్చుగ ననుకరించెను. తనకృతి నాటకీయముగ ప్రేక్షకదృష్టి ననుసరించి రసవంతముగ వ్రాసినను రంగస్థలమునఁ బ్రదర్శింప వీలగునా యను జ్ఞానము తక్కువ యని తోచుచున్నది. నాడు రంగస్థలము లెట్లుండెడివోయని కూడ ననుమానింపఁదగియున్నది. మరియు విమానయాన సందర్భమున భూగోళశాస్త్రరీతిని స్థలనిర్ణయముగూడ చక్కగ నుడువఁబడలేదు. సప్తగోదావరము చూచి పిదప కావేరిని దర్శించినట్లు నుడువఁబడియున్నది, కాని యివి యంతగాఁ బాటింపఁదగినవి కావు. మొత్తముమీద నీతని గ్రంథము చమత్కార విశిష్టములును, అద్భుత విలసితములునగు సన్నివేశములతో నాటకమునకు వలయు ప్రేక్షకానందదృష్టితో వ్రాయఁ బడినట్లు తోచుచున్నది.

ఆశ్చర్యచూడామణి శక్తిభద్రకవి విరచితము. రామకథ లెంద రెంద రెన్నెన్నివిధముల మార్చి నూతనాంశముల నేరి కూర్చి రచించిన నారామకథ కొంగ్రొత్తగనే యనుభవింపఁబడి రమణీయముగ నుండును. ఈ శక్తిభద్రుఁడు నాటక నియమములగు వీరశృంగారములలో నొకటిగాక యద్భుతరసమును తననాటకమునఁ బ్రధానరసముగాఁ బోషించినాఁడు. ఇందు నూతనముగఁ బ్రవేశ పెట్టఁబడిన ఆశ్చర్యచూడామణియు,

అద్భుతాంగుళీయకమును, మాయాసీతారామ లక్ష్మణుల వంచనము గుర్తింపజేయు నద్భుతశక్తి గలిగినవై కథయంతయు వ్యాపించి సత్యసీతారామలక్ష్మణుల తెలిసికొన వీలగునట్లిందుఁ జమత్కారముగా వర్ణింపబడుటయే యద్భుతరసమునకు నిదర్శనము.

ఈ నాటకమున మహర్షులు సీతారాములకు ఆశ్చర్యచూడా మణ్యద్భుతాంగుళీయకముల లక్ష్మణునిద్వారా యొసగుదురు. ఇందు శూర్పణఖ రాముని పర్ణశాలకడకువచ్చుట. శూర్పణఖ లక్ష్మణునెత్తుకొని యాకసమున కెగయుట, లక్ష్మణుఁడామెను విరూపనుగావించుట, రావణుఁడు సీతనెత్తుకొనిపోవుట, మారీచుఁడు, మాయాలక్ష్మణుఁడుగరాగా రాముడంగుళీయక మహిమమున గుర్తించుట. హనుమంతుఁడు లంకలో సీతం గనుగొనుట, రాముఁడు రావణుని జయించుట, అగ్నిపరీక్షచే సీత పరిశుద్ధురా లగుట. నారదవాక్యమున ఆశ్చర్యచూడామణి ప్రభావము దెలియుట, మున్నగునంశములు చమత్కారముగా వర్ణింపఁబడినవి. షేక్స్పియరు వ్రాసిన 'Comedy of errors' లోని సన్నివేశములీనాటకమున 9–వ శతాబ్దముననే యీకవిసంఘటింపజేసి నాటకమునకొక క్రొత్తవింతను గూర్చినాఁడు.

జానకీపరిణయము. ఇది రామభద్రదీక్షితవిరచితము. ఈ పేరుతోనున్న నాటకములు నారాయణభట్టవిరచితము, సీతారామవిరచితమును మఱి రెండుగలవు. కాని రామభద్రదీక్షితవిరచితమే యిందు గ్రహింపఁబడినది. ఇందు మూలాతిక్రమణములు చాల గూర్పఁబడినవి. మొదటినుండి తుదవఱకును జంట పాత్రల నొకేరూపమున వెలయువారిని గల్పించి సత్యస్వరూపు లెవరని తెలియకుండునంతటి నేర్పుతోఁ గథనుసాగించి

నాఁడు. విద్యుజ్జిహ్వుఁడు, రావణుఁడు. సారణుఁడును కౌశిక రామలక్ష్మణుల వేషముల నూనుదురు. తాటక సీతవేషమూనును. సీతారామకల్యాణము మిథిలయందుకాక విశ్వామిత్రాశ్రమమున జరుగును, మహావీరచరితమునను న్న యంశము నీకవి పెంచి యద్భుత సంఘటనలతోఁ జమత్కారముగా రచించినాఁడు. రావణుని యాస్థానమున నొక యంతర్నాటికను గల్పించును. శూర్పణఖావిరాధులు సీతారాముల వేషములతో నన్యోన్యము వంచింపనెంచుట. ఈ యద్భుతముల సీతారామలక్ష్మణులు చూచుచుండునట్లు వర్ణించుట చాలమనోహరములు, ఇందన్నియు నూతనకల్పనములే. ప్రాత కథయే క్రొత్తకూర్పు భంగితో హాస్యరసవిలసితమగుచు వ్రాయఁబడినది. తుదకు శూర్పణఖ యిందు పర్ణాదినియను తాపసివేషమున భరతుని వంచింపనేగును. ఇట్లన్నియు కొత్తపోకడలమయముగ నీ నాటకమునుగూర్చి రామకథ కొకసొగసును దెచ్చినా డీకవి యనుట సత్యము. ప్రధానపాత్రల కేలాటి శీలభంగము లేకుండ ప్రేక్షకదృష్టి ననుసరించి యీ కవి కథాగమనము కుంటుపడకుండ నిర్వహించి కవికోటికీర్తి నందగల్గినాఁడు. మూలరామాయణ కథాంశముల నెల్ల. దేనిని వీడక యలతిమార్పులు గావించి చమత్కారముగా నడపించిన మేటికవి యితఁడే యనుట సత్యదూరము కాఁజాలదు.

ప్రసన్న రాఘవము. ఇది జయదేవకృతము, ఈ జయదేవుఁడు గీతగోవింద కర్తయగు జయదేవుని తర్వాతివాడు. శైలియందును, పదలాలిత్యమునందును నిరువురు నొక్కరే యనిపించు నట్లీగ్రంథమును వ్రాసినను వీరిరువురి తల్లిదండ్రులును వేర్వేరు వారగుట భిన్నులే. ఈ జయదేవునికాలము 12-వ శతాబ్దము.

ఈ నాటకమున సీతాస్వయంవరమునకు బాణాసురుఁడు. రావణాసురుఁడు కూడ వచ్చినట్లు తెలుపఁబడియున్నది. కౌశికుఁడు రామలక్ష్మణుల తనతోఁ బంపినందులకు దశరథునకు తాటంక యుగళము నిచ్చును. మిథిల ప్రాంతమున నా రామలక్ష్మణులు ససఖియగు సీతంగాంచుట, సీతారాములు చక్షూరాగ మనుభవించుట కూర్పబడినది, పరశురామఘట్టము సర్వసామాన్యముగనే వర్ణింపఁబడినది. చాలవరకు అరణ్యకాండ కథాభాగమంతయు సంగ్రహింపఁబడినది. సీతావియోగమున ఖిన్నుఁడైన రామునకు విద్యాధరులు ఇంద్రజాలమున సీతా వృత్తాంతము సాక్షాత్తుగాఁ దెలియఁజేసినట్లు వర్ణించుట విశేషము. తక్కిన కథయంతయు నితర నాటకము లందువలెనే నడచినది. ఇందు జయదేవుని పల్కులు తీయని తేనె సోనలు. ధారాశుద్ధి ప్రతిచోట గాననగును.

జగదేకవీరుఁడును, అభిరామగుణాకరుండు నగు శ్రీరామచంద్రుని లీలా విలాసము లీ నాటకములం దాయా కవీశ్వరులు భిన్న భిన్నములుగా బేర్కొన్నను, నవియెల్ల రామశీల పోషకములును, రాసుగుణాభివర్ణనములేయై యలరారుటవలన నా విశేషములఁ దిలకించు నాస నే నీ కృతి రచనకు గడంగితి. దీని రచనకు సంస్కృతనాటకములును, తద్వ్యాఖ్యానములేకాక, లభ్యములగు కొన్ని యాంగ్ల విమర్శనములును, తోడ్పడినవి. చాలభాగము నారచనయే. అగాధమగు రామచరితమును గురించి వ్రాయఁబూనిన, కించిజ్ఞుడనగు నేను వ్రాసిన విషయమందు గుణలవ మే మున్నను, న ద్దానిని నాటకకర్తలకును, తద్వ్యాఖ్యానకారులకు నంటగట్టి దోషముల నావిగాగణింప చదువరులను బ్రార్థించుచు. స్వచ్ఛమగు జలాశయమున నాచునుద్రోసి నీటిని గ్రోలురీతి దీన వెలయు దొసగుల నవలఁద్రోసి నెసగులనే గ్రహింప రసికులకు విన్నవించుచున్నాను.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యాపరిశోధనాలయమున నిట్టి కృతుల ప్రచురణకు రప్పించి, ప్రోత్సాహ మొసగు శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానాధికారులకు, వా రొసంగిన చేయూతకు నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

తిరుపతి,

పంగనామల బాలకృష్ణమూర్తి

12-3-59.

అభిషేకనాటకము-భాసుఁడు

సంస్కృత నాటక కర్తలలో మొదటివాఁడు బాసుఁడు. కాళిదాసాదులు నీతని తమ గ్రంథములందుఁ బేర్కొనియున్నారు. ఈ భాసుని కృతులందుఁ గానవచ్చు పాత్రలనుబట్టియు, ఇతివృత్తాదులనుబట్టియు, నీతనికాలమును నిర్ణయింప వీలగుచున్నది. ఇతని నాటకములకు మూలములు శ్రీమద్రామాయణము, మహాభారతము, నాటి చారిత్రవ్యావహారికగాథలునుగా నున్నవి. అందు శ్రీమద్రామాయణ మహాభారతములు క్రీస్తుశకము పూర్వము పది పండ్రెండు శతాబ్దములకు సంబంధించినవి. స్వప్నాది నాటకములందు గోచరించు ఉదయన, ధర్శక, ప్రద్యోతాది పాత్రలు చారిత్రకముగ క్రీ॥పూ॥ 6-వ శతాబ్దమునకు సంబంధించినవా రగుటవలనను, నాటి వ్యావహారికగాథలును గొంచె మించు మించు నా కాలమునకు సంబంధించినవియే యగుటవలన నీ భాసుఁడు క్రీ॥పూ॥ 6-వ శతాబ్దమునకుఁ బూర్వుఁడు కానేరఁడు. గ్రంథస్థములగు నిదర్శనములు నీతని క్రీ॥పూ॥ 5,4 శతాబ్దములమధ్య వానినిగాఁ దెల్పుచున్నవి. ఈతనివని యిప్పటికి వెలువడిన పదమూడు నాటకములలో రామాయణము నాధారముగఁ గలవి రెండు గానవచ్చుచున్నవి. అవి అభిషేకనాటకము; ప్రతిమానాటకము ననునవి. కాలానుసారముగా లెక్కించినచో భాసుని పై రెండు నాటకములే తొలుతటి రామనాటకము లనఁదగియున్నవి. యజ్ఞఫలనాటక మీతనిదికాదు.

అభిషేకనాటకము: ఇది ఆరంకముల నాటకము. మహోపాధ్యాయ విద్యాభూషణ శ్రీ వేంకట్రామశాస్త్రిగారిచే సంపాదితమగు ప్రతియందు షష్ఠాంకము కేవల విష్కంభము, దానినిగూడ నొక యంకముగాగణించి యా కృతి యేడంకముల గ్రంథమనిరి. భాసకృతనాటక చక్రమందన్నిటికంటెఁ

బ్రతిమానాటక ముత్తమమైనదని యొక ప్రవాదము గలదు. అభిషేకనాటకము గూడ ప్రతిమ కెందును దీసిపోదనియే జెప్పనగును. ఈ అభిషేకనాటకము వాలివధాఘట్టముతో నారంభింపఁబడి రావణవధానంతరము సీత యగ్నిని బ్రవేశించుటవరకు గల శ్రీమద్రామాయణకథ యాధారముగాగలదిగా నున్నది. ఇందు శ్రీరాముఁడు రావణవధానంతర మభిషేకమను భవించుటచేతను, సుగ్రీవ విభీషణులును వారి వారి రాజ్యముల నభిషిక్తు లగుటచేతను నీ నాటకమునకీ నామ మెంతయుఁ దగియున్నది. శ్రీమద్రామాయణమునఁ గిష్కింధాకాండము మొదలుకొని యుద్ధకాండమువరకుఁగల కథ యీ నాటకమునకు మూలము.

కథాసంగ్రహము–ప్రథమాంకము

సూత్రధారుఁడు నాందీముఖమున శ్రీరాముని స్తుతించుచు రామ సుగ్రీవులు పరస్పరము సాయమునకై బాసచేసికొనుటను సభ్యుల కెరుకపరచును. సుగ్రీవుఁడు రామలక్ష్మణ హనుమత్సమేతుఁడై కిష్కింధయందు వాలిని ద్వంద్వ యుద్ధమున కాహ్వానించును. వాలి తారప్రార్థనలఁ బెడచెవినిడి యొక్కపరువున వచ్చి సుగ్రీవుని బడఁద్రోయును. హనుమంతుఁడు శ్రీరామునకు బ్రతినసంగతి జ్ఞప్తిపరుప శ్రీరాముఁడు మాటుననుండి వాలినొక వాడికోలఁ గూలనేయును. వాలి తనకు గ్రుచ్చుకొన్న బాణముపైనున్న నామాక్షరములవలన రామునిబాణమని యెఱింగి తన్నట్లు మాటుననుండి యేయుట యధర్మమని రాముని నిందించును. అందులకు శ్రీరాముఁడు వాలి జంతు వగుటచే మృగముల వధించుట క్షత్రియధర్మ మగుటవలనను, వాలి సోదరభార్య నభిగమించిన నేరమున దండ్యుఁ డగుట వలనను, దానట్లు వంచనమైఁ జంపుట యధర్మము కాక ధర్మశాస్త్ర సమ్మతమే యను సమాధాన మొసఁగును.

అంత వాలి తృప్తిఁ జెంది రాముహస్తమున మరణించు భాగ్యమునకు మిగుల సంతసించి పరలోకగతుఁడగును. శ్రీరాముఁడు కిష్కింధారాజ్యమున సుగ్రీవున కభిషేకము గావించును.

ద్వితీయాంకమునఁ బ్రవేశకమందు సీతాన్వేషణమునకై వానరులు నల్దిశల బయలుదేరుదురు. హనుమంతుడు లంకఁజేరి వెదకి వెదకి తుద కామెయున్న యశోకవనముం జేరును. అట సీతారావణసంభాషణ మాలకించి రావణునిపై నలిగియు నాగ్రహమును నిగ్రహించికొని రావణుఁడు నిష్క్రమించినపిదప సీత చెంతకరిగి రామదూతనని నచ్చఁ జెప్పి రాముని విరహదశను, వాలివధను, లంకను జయించుయత్నము మున్నుగా గల విషయముల నామెకుఁ దెల్పును. ఆమెయు రామునకు దుఃఖము గలుగునియట్లు తన దీనావస్థను మనవిఁజేయఁగోరును. వల్లెయని హనుమంతుఁడు రామసమీపమున కరుగును. తనరాక రావణున కెఱింగించుటకై ప్రమదవనమును నాశనమొనర్పనెంచి యట్లుచేయును.

తృతీయాంకమున హనుమంతుఁ డశోకవనమును నాశనమొనర్చి నట్లును. అక్షకుమారుఁడాదిగాఁగల రాక్షససేనానాయకుల నైదుగుర ససైన్యముగ హతమొనర్చెననియు, రావణునకుఁ దెల్పుదురు. ఇంద్రజిత్తుచేఁ బట్టువడి హనుమంతుఁడు రావణుకడకుఁ గొంపోఁబడ నట రామసందేశము నాతనికి నుడువును. రావణుఁడు మండిపడ, విభీషణుఁడు దూతయగు హనుమంతుఁడు వధార్హుఁడు కాఁడనియు, సీతను విడువుమనియు, హితము నుడువును. రావణుఁడు వినక, విభీషణుని నిందించి హనుమానునితోఁకకు నిప్పంటించి విడువ నాజ్ఞాపించును. విభీషణుఁడు హితమును మరల బోధించును. రావణుఁడు కనలి విభీషణుని శత్రుపక్షావలంబియని వెడలిపొమ్మనును. అతఁడును రావణుని శాంతింపుమని రాముని శరణువేడ తత్సన్నిధికిఁ బయనమగును.

చతుర్థాంకమున హనుమంతుఁడు లంకలో వలసినంత ధ్వంసమొనర్చి రామసన్నిధికిఁ దిరిగివచ్చును. శ్రీరాముఁడు సుగ్రీవాదిసహితుఁడై ససైన్యముగ సముద్రముదరిఁ జేరును. అత్తరి విభీషణుఁడు రాగా హనుమంతుఁడాతని రామునకుఁ బరిచయపరచును. రాముఁడొక యస్త్రమును బ్రయోగింప వరుణుఁడు మానవాకృతిని బ్రత్యక్షమై సాగరమధ్యమున సైన్యము నడువఁ ద్రోవనొసఁగును. ససైన్యముగ శ్రీరాముఁడు సముద్రము దాఁటి సువేలయందు విడియును. వానరసేనా నాయకుఁడగు నీలుఁడిద్దరు చారుల గ్రహించును. విభీషణుఁడు వారల రావణామాత్యులని తెల్పును. వారిమూలమున రామసందేశమును రావణునకుఁ బంపుదురు. శ్రీరాముఁడు సైన్యము నొకపరి పర్యవేక్షణ మొనర్చును.

పంచమాంకమునఁ బ్రవేశకముననే రాక్షససైన్యములు నివృత్తము లగుచున్నట్లును, ప్రహస్త కుంభకర్ణాదులు మరణింప నింద్రజిత్తు రణరంగముఁ జేరెననియుఁ, దెలియుచున్నది. రావణుఁడింకను గామాతురుఁడై సీతను వంచింపఁ గృతిమములగు రామలక్ష్మణ శిరములఁ దెప్పించి, రామలక్ష్మణులు మృతులని యామె కాశిరములఁజూప నామె మూర్ఛిలి యా యసిలతకే తన్ను గూడ బలియొనర్పఁగోరును. అత్తఱినే యింద్రజిత్తు మరణించెననియు, రాక్షససైన్యము పలాయితమాయెననియు, వార్త రాగా రావణుఁడు మండిపడి రామునెదుర్కొనఁబోఁబోవ నింతలో సేవకుఁ డడ్డగింప, నింతటికి మూలము సీతయేయని యామెనే సంహరింప సిద్ధముగాఁగ నివారితుఁడై రథమెక్కి రణరంగమున కరుగును. సీత రామవిజయమునకై ప్రార్థించును.

షష్ఠాంకము: ఇది నిష్కంభాంకము. ఇందు ముప్వురు విద్యాధరులు రామ రావణయుద్ధమును వర్ణించుచు రావణుఁడు నిహతుఁడాయెనని

తెల్పుదురు. పర్యాయముగా రామ రావణ పరాక్రమములు వర్ణింపఁబడినవి. ఇంద్రుడు మాతలితో రథమును రామునకంపును. రాముఁడు నా రథమెక్కి రణము సల్పును.

సప్తమాంకము: శ్రీరాముఁడు సీతనోదార్ప లంకఁబ్రవేశించును. లక్ష్మణ విభీషణులు సీతరాకను దెల్పుదురు. శ్రీరాముఁడు సీత చాలకాలము రాక్షసావాసమున నుంట నామెను శంకించి, యామె కోరికమేర కగ్నిప్రవేశమున కనుమతించును. అగ్ని సీతశీలమునకును, బాతివ్రత్యమునకును బ్రమాణ మొసఁగి రాముసన్నిధి నప్పగించును. అగ్ని దేవుఁడు సీతారాములు సాక్షాల్లక్ష్మీనారాయణులని నుడివి వారల కభిషేకమొనర్చును. జయ జయ ధ్వనులు సెలగును. అభిషిక్తుఁడైన రాముఁడు తండ్రియగు దశరథుఁడే తనకుఁ బట్టాభిషేకము గావించెననును. మోదాంతముగ భరతవాక్యముతో నాటకము ముగియును.

గ్రంథవిషయము:

భాసుఁడు రామాయణ విషయమును జాలవఱకు నాటకమున యథాతథముగఁ బొందుపఱచి రసవంతముగఁ గథను సాగించినాఁడు. అచ్చటచ్చట ఈ నాటకమున నతిస్వల్పములగు మార్పులుమాత్రము గావించినాఁడు. ఇందుఁగథ కిష్కింధాకాండ విషయముతోఁ బ్రారంభింపఁ బడుచున్నది. పాఠకులకును, బ్రేక్షకులకును బూర్వ కథాపరిచయమునకై కాబోలు భాసుఁడు నాందీపద్యముననే కిష్కింధాకాండమునకుఁ బూర్వము కథను సంగ్రహముగ సగము శ్లోకమున వర్ణించినాఁడు.

"యో గాధిపుత్రమఖవిఘ్నకరాభిహంతా
యుద్ధే విరాధఖరదూషణవీర్యహంతా।

దర్పోద్యతోల్బణకబంధకపీంద్రహంతా
పాయాత్ స వో నిశిచరేంద్రకులాభిహంతా॥

(అంకము-1. శ్లోకము-1.)

'విశ్వామిత్ర యజ్ఞ విధ్వంసకుల నిర్మూలించినవాఁడును, యుద్ధమున విరాధఖరధూషణాదుల జక్కడంచినవాఁడును, దర్పోద్ధతుఁడగు కంబంధుని దునిమినవాఁడును, వాలి మదమడంచినవాఁడును, రావణ కులహంతకుఁడు నగు శ్రీరాముఁడు మనల రక్షించుగాక.' యని కొంచెము పూర్వకథను స్పృశించెను. నాందీశ్లోకముననే 'కపీంద్రహంత' యని వాలివధా విషయము ప్రకటముగ నుడువబడినది. నాటకమున రాబోవు వాలివధావిషయము నిట్లు జరిగినదానినిగా ముందే వర్ణించుట కొంచె మసందర్భమని తోచుచున్నది. కాని రామాయణ కథానాయకుడగు శ్రీరాముని గురించిన ప్రార్థనాశ్లోకమని యట్లు చెప్పియుండనోపు.

ఈ నాటకమున విషయ మంతయుఁ జాలవరకు వాల్మీకి రామాయణము ననుసరించియే యున్నది. ప్రథమాంకమున వాలివధా ఘట్టమున వాలి సుగ్రీవు లిరువురును దీవ్రముగఁ బోరుచుండ రాముఁడు వాలింజూచి,

సందష్టోష్ఠశ్చండసంరక్తనేత్రో
ముష్టిం కృత్వా గాఢముద్వృత్త దంష్ట్రః।
గర్జన్ భీమం వానరో భాతి యుద్ధే
సంవర్తాగ్నిః సందిధక్షుర్యథైవ॥

ప్రళయాగ్ని సదృశుఁడుగానున్నట్లు వర్ణించును. సుగ్రీవునిజూచి,

'వికసితశతపత్రర క్తనేత్రః
కనకమయాంగదనద్ధపీనబాహుః।

హరివరముపయాతి వానరత్వాత్
గురుమభిభూయ సతాం విహాయ వృత్తమ్॥

సాధ్వాచారము విడనాడి యవివేకమున జ్యేష్ఠభ్రాత నెదుర్కొనుచున్నాఁ డనును. రామునను జ్ఞమేరకే వాలితో యుద్ధమునకుఁ గడగిన సుగ్రీవుని నూతనపురుషుని విషయమున నుడివినట్లు నుడుపుచున్నాఁడు. అనపరాధుడగు సుగ్రీవుఁడు సాపరాధుడును, జ్యేష్ఠభ్రాతయునగు వాలి నెదుర్కొనుటలో దోషముగా భావించుట స్వోక్తివిరోధముగఁ దోచుచున్నది. సాధ్వాచారము రాముఁడే సుగ్రీవునకుఁ దెల్పి పోరు మాన్పియుండరాదా? ఇట్టి సాధ్వాచారదూరుఁడగు సుగ్రీవునకు మాత్రము పట్టముగట్ట రామునకు న్యాయ్యమా? యను ప్రశ్న లనేకములు పొడమును. కాని యిట నట్టి సాధ్వాచారోల్లంఘన ఫలితముగఁ జావుతప్పి కన్ను లొట్టపోవునంత పనిగా సుగ్రీవుఁడు వాలి పిడికిటిపోటు ననుభవించినాఁడు. 'వాలినా తాడితః పతితః సుగ్రీవః' యని రాముఁడే యతనిఁ బతితునిగాఁగనును. హనుమంతుఁడును జాలినొంది రాముని వాలివధకుఁ బ్రేరేపించును. 'హా ధిక్' (ససంభ్రమం రామ ముపగమ్య) జయతు దేవః। అస్యైషా అవస్థా।

'బలవాన్ వానరేంద్రస్తు దుర్బలశ్చ పతిర్మమ।
అవస్థా శపథశ్చైవ సర్వమార్యేణ చింత్యతామ్॥

(అంకము-1. శ్లోకము-15.)

వానరేంద్రుఁడగు వాలి బలవంతుఁడు. మా రాజు సుగ్రీవుఁడు దుర్బలుఁడు. ఆతని ప్రకృతావస్థయు, చేసిన శపథమును సర్వముఁ జింతింపుఁడు అని హనుమంతుఁడు శ్రీరాముని పురికొల్పును.

ఇట భాసుఁడు రామాయణ విషయమునకన్న భిన్నముగాగూర్చెను. రామాయణమున హీనసత్త్వుఁడై సుగ్రీవుఁడే రాముని పలుమారు భీత

భీతుఁడై చూచుచుండ తన్ను హెచ్చరించుచున్నట్లు గ్రహించి రాముఁడు వాలిని గూలనేయును.[1]

వాలి నేలంగూలి రాముని నిందించునపుడు, రాముఁడు వాలి దోషియగుట నాతఁడు దండ్యుఁడుకాఁగా దండించితిననియు అదండ్యుఁడు దండింపఁబడఁ డనియు,

'దండితస్త్వం హి దండ్యత్వాత్, అదండ్యో నైవ దండ్యతే'

అని నుడివెను. వెంటనే వాలి.

'సుగ్రీవేణాభిమృష్టాభూత్ ధర్మపత్నీ గురోర్మమ।
తస్య దారాభిమర్శేన కథం దండ్యోస్మి రాఘవ॥

(అంకము-1. శ్లోకము-21.)

యని జ్యేష్ఠుఁడగు తన భార్యను సుగ్రీవుఁడు అభిగమించెననియు, నద్దాన సుగ్రీవుఁడుఁగూడఁ దుల్యదోషుఁడగుట దండ్యుఁడగుననియు, మరియు నట్టి సుగ్రీవ భార్యాభిగమనము తనకును దోషముకాదు కావునఁదాను (వాలి) దండ్యుఁడు కాఁడని విన్నవించును. ఈ సందర్భము అనగా సుగ్రీవుఁడు వాలి భార్యాభి గమనము గావించెనను విషయము వాలి

1. సూర్యపుత్రో మహావీర్యః సుగ్రీవః పరిహీయతే।
వాలినా భగ్నదర్పస్తు సుగ్రీవో మంద విక్రమః॥ 27
వాలినంప్రతి సామర్షో దర్శయామాస రాఘవం। 27 1/2
.....
హీయమాన మథాపశ్యత్సుగ్రీవం వానరేశ్వరమ్। 30 1/2
ప్రేక్షమాణం దిశశ్చైవ రాఘవం చ ముహుర్ముహుః॥ 31
తతో రామో మహాతేజా ఆర్తం దృష్ట్వా హరీశ్వరమ్।
శరం చ వీక్షతే వీరో వాలినో వధ కారణాత్॥ 32
(కిష్కింధాకాండాం-16వ సర్గం.)

చెప్పినట్లు రామాయణమున లేదు. కాని అంగదుఁడు సుగ్రీవునిగూర్చి చెప్పునపుడు,

'స్థైర్యం సత్త్వం మనః శౌచమానృశంస్యమథార్జవమ్।
విక్రమశ్చైవ ధైర్యం చ సుగ్రీవే నోపపద్యతే॥ 2

భ్రాతుర్జ్యేష్ఠస్య యో భార్యాం జీవతో మహిషీం ప్రియామ్।
ధర్మేణ మాతరం యస్తు స్వీకరోతి జుగుప్సితః॥ 3

కథం స ధర్మం జానీతే యేన భ్రాతా మహాత్మనా।
యుద్ధాయాభినియుక్తేన బలస్య విహితం ముఖమ్॥ 4

సత్యాత్పాణిగృహీతశ్చ కృతకర్మో మహాయశాః।
విస్మృతో రాఘవో యేన స కస్య తు కృతం స్మరేత్॥ 5

(కిష్కింధాకాండం-55-వసర్గం)

పై జ్యేష్ఠ భ్రాతృదారాభిగమనమును గుర్తించెను. భాసుఁడీ భిన్నస్థలములనున్న విషయము నాటకమున నుచిత స్థలమునఁ బొందుపరచెను.

రెండు మూడు నాలుగంకముల విషయ మంతయు రామాయణకథ కనుగుణముగనే యున్నది.

ఐదవయంకమున రావణుఁడు రామలక్ష్మణ శిరములవంటి బొమ్మలఁ దెచ్చి సీతతో వారు నిహతులై రనియు, నికఁదన్ను బ్రేమించి లంకా సామ్రాజ్యము ననుభవింపుమనియు నుడువును. ఇది కవి కల్పితము.

రాక్షసః జయతు మహారాజః।

'ఏతే తయోర్మానుషయోః శిరసీ రాజపుత్రయోః।
యుధి హత్వా కుమారేణ గృహీతే త్వత్ప్రియార్థినా॥

(అంకము-5. శ్లోకము-8.)

రావణః సీతే పశ్య పశ్య తయోర్మానుషయోః శిరసీ।

అని యా రామలక్ష్మణశిరములఁ జూపును. రామాయణమున మహోదరుఁడను రాక్షసుఁడు సీతోపస్థానక విషయమున రావణునకు సలహానిచ్చును. అదియెట్లన, తానును ద్విజిహ్వుఁడు, సంహ్రాది, కుంభకర్ణుఁడు, వితర్దనుఁడును రామవధకై పంపఁబడవలయుననియు నా మేరకు నగరమున ఘోషింపఁజేయు మనియు, విజయముపొంది వచ్చినచో నుపాయము లనవసరములనియు, రాముఁడు సంహరింపఁబడనిచో వారు రుధిరాక్తాంగులై వచ్చి రామలక్ష్మణుల భక్షించినట్లు చెప్పుచు రావణ పాదములఁ బడునట్లును నద్దానినంతయు కనుచు వినుచుండు సీత సత్యమని నమ్మి యనాథయై వశమగుననియు రావణునితో నుడువును.

వాల్మీకి రామాయణమున పై విషయమే యీ క్రింది రీతిని వర్ణింపఁ బడియున్నది.

ఏవముక్త్వాతు సంరబ్ధం కుంభకర్ణం మహోదరః।
ఉవాచ రక్షసాం మధ్యే రావణం లోకరావణమ్॥ 19

లబ్ధ్వా పునస్త్వం వైదేహీం కిమర్థం సంప్రజల్పసి।
యదిచ్ఛసి తదా సీతా వశగా తే భవిష్యతి॥ 20

దృష్టః కశ్చిదుపాయో మే సీతోపస్థానకారకః।
రుచిరశ్చేత్త్వయా బుధ్వా రాక్షసేశ్వర తం శ్రుణు॥ 21

అహం ద్విజిహ్వః సంహ్రాదీ కుంభకర్ణో వితర్దనః।
పంచరామవధాయై తే నిర్యాంత్విత్యవఘోషయ॥ 22

తతో గత్వా వయం యుద్ధం దాస్యామస్తస్య యత్నతః।
జేష్యామో యది తే శత్రూన్నోపాయైః కృత్య మస్తి నః॥ 23

అథ జీవతి నశ్శత్రుర్వయం చ కృతసంయుగాః।
తతస్తదభిపత్స్యామో మనసా యత్సమీక్షితమ్॥ 24

వయం యుద్ధాదిహైష్యామో రుధిరేణ సముక్షితాః।
విదార్య స్వతనుం బాణై రామనామాంకితైశ్శితైః॥ 25

భక్షితో రాఘవోఽస్మాభిర్లక్ష్మణశ్చేతి వాదినః।
తవ పాదౌ గ్రహీష్యామస్త్వం నః కామం ప్రపూరయ॥ 26

తతోఽవఘోషయ పురే గజస్కంధేన పార్థివ।
హతో రామః సహ భ్రాత్రా ససైన్య ఇతి సర్వతః॥ 27

ప్రీతో నామ తతో భూత్వా భృత్యానాం త్వమరిందమ।
భోగాంశ్చ పరివారాం శ్చ కామాం శ్చ వసు దాపయ॥ 28

తతో మాల్యాని వాసాంసి వీరాణామనులేపనమ్।
పేయం చ బహుయోధేభ్యః స్వయంచ ముదితః పిబ॥ 29

తతోఽస్మిన్ బహులీభూతే కౌలీనే సర్వతో గతే।
భక్షితః ససుహృ ద్రామో రాక్షసై రితి విశ్రుతే॥ 30

ప్రవిశ్యాశ్వాస్య చాపి త్వం సీతాం రహసి సాంత్వయ।
ధనధాన్యైశ్చ కామైశ్చ రత్నైశ్చైనాం ప్రలోభయ॥ 31

అనయోపదయా రాజన్ భయశోకానుబంధయా।
అకామా త్వద్వశం సీతా నష్టనాథా గమిష్యతి॥ 32

రంజనీయం హి భర్తారం వినష్టమవగమ్య సా।
నైరాశ్యాత్ స్త్రీలఘుత్వాచ్చ త్వద్వశం ప్రతిపత్స్యతే॥ 33

సా పురా సుఖసంవృద్ధా సుఖార్హా దుఃఖకర్శితా।
త్వయ్యధీనం సుఖం జ్ఞాత్వా సర్వథోపగమిష్యతి॥ 34

(యుద్ధకాండము-64-వ అధ్యాయము.)

రామాయణమున రామలక్ష్మణులు భక్షింపఁబడిరని, తద్విషయమెంత చాటించినను నది కేవలము శ్రవణవిషయమే గనుక యంతగా విశ్వసింపఁ దగ దనియే కాబోలును భాసుఁడు విన్నదానికన్నఁ గన్నది మిన్నయని నాటకమున సీతను విశ్వసింపజేయుటకై రామలక్ష్మణుల శిరములఁ జూపును. ఇదియే నాటకీయముగ నొనరించు నైపుణ్యము.

షష్ఠాంకమున రాముఁడు పాదచారియై పోరు సల్పుచుండ, నింద్రుఁడు మాతలితో నిజరథము సంప రాముఁడద్దానినెక్కి యుద్ధము సల్పునట్లు రామాయణమునందు వలెనే యిందును వర్ణింపఁబడినది. (యుద్ధకాండమున త్ర్యుత్తర శతతమసర్గమున నుడువఁబడినది.) రావణ సంహార సందర్భమునఁ గూడ మూలానుగుణముగనే బ్రహ్మాస్త్రప్రయోగముచే రాముఁడు పౌలస్త్యునిఁ దునుమాడెనని వర్ణింపఁబడియున్నది. ఇట్లు రామాయణమున నేకాదశోత్తరశతతమసర్గమున పౌలస్త్యవధాఘట్టమునఁ దెల్పబడియున్నది.

సప్తమాంకమున నగ్నిప్రవేశవిషయముకూడ రాముఁడు సీతను నిరాకరించుట, యవల నామె ప్రత్యయమునకై యగ్నినిఁ బ్రవేశించుట, లక్ష్మణుఁడు చితిప్రయత్నముచేయుట చెప్పఁబడియున్నవి. సర్వము సిద్ధముచేసి లక్ష్మణుఁడు రామునితో సీత యగ్నిని బ్రవేశింపఁబోవ,

'వికసిత శతపత్రదామ కల్పా
జ్వలనమిహాశు విముక్తజీవితాశా।

శ్రమ మిహ తవ నిష్ఫలం చ కృత్వా
ప్రవిశతి పద్మవనం యథైవ హంసీ॥

(Act. VII-5)

'అరవిందమాలాసదృశకోమలయగు సీత, నీ పడిన శ్రమమునంతయు నిష్ఫల మొనర్చి యాడుహంస పద్మషండమును బ్రవేశించునట్లు, జీవితాశవీడి యగ్నిని బ్రవేశించుచున్నది.'

అని నుడివినపుడు రాముఁడు 'ఆశ్చర్యమాశ్చర్యం, లక్ష్మణ! నివారయ నివారయ' యని నుడువును. ఇంతలో నగ్నిదేవుఁడే సీతతో వచ్చును.

రామాయణమునఁ గూడ నిట్లే యున్నది కాని రాముఁడు నివారింపుమని లక్ష్మణునకుఁ జెప్పలేదు. భాసుఁడు రామపాత్రపోషణా తత్పరుఁడై సీతావిషయమున రామహృదయ మంత ప్రేమపూరితమని తెలియఁజేయుటకై యట్లు వ్రాసియుండనోవు. రామాయణమున సీత యగ్నిని బ్రవేశింపఁగా బ్రహ్మాదిదేవత లందరును లంకకు వచ్చినట్లును, బ్రహ్మ రాముని సాక్షాద్విష్ణువనియు, సీత లక్ష్మియనియు తెలియఁ జేసెననియుఁగలదు. ఇంతలో విభావసువే సీతంగైకొని, పరిశుద్ధయని సర్వులయెదుట రామున కర్పించును. ఆవల మహేశ్వరుఁడును రాముని బ్రశంసించి విమానస్థుఁడైయున్న దశరథునిఁజూపును. రామలక్ష్మణులు తండ్రినిఁజూచి నమస్కరించి ప్రీతిగ సల్లాపము సేయుదురు.

ఈ నాటకమున నగ్నిహోత్రుఁడే సీతం దెచ్చి యర్పించునట్లున్నది. మూలమునందలి బ్రహ్మకృతరామస్తవవిషయమంతయు సంగ్రహముగ నేపథ్యమునఁ బఠింపజేసెను.

'నమో భగవతే త్రైలోక్యకారణాయ నారాయణాయ:

'బ్రహ్మా తే హృదయం జగత్త్రయపతే రుద్రశ్చ కోపస్తవ
నేత్రే చంద్రదివాకరౌ సురపతే జిహ్వా చ తే భారతీ।
సబ్రహ్మేంద్రమరుద్గణం త్రిభువనం సృష్టం త్వయైవ ప్రభో
సీతేయం జలసంభవాలయరతా విష్ణుర్భవాన్ గృహ్యతామ్॥

(Act. VII-12)

రాముఁడు అభిషిక్తుఁడగునపుడు దశరథుఁడే స్వయముగ తన కభిషేకమొనర్చుచున్నట్లు భావించును.

'యేనాహం కృతమంగళప్రతిసరో భద్రాసనారోపితో
ప్యంబాయాః ప్రియ మిచ్ఛతా నృపతినా భిన్నాభిషేకః కృతః।
వ్యక్తం దైవగతిం గతేన గురుణా ప్రత్యక్షతః సాంప్రతం
తేనైవాద్య పునః ప్రహృష్టమనసా ప్రాప్తాభిషేకః కృతః॥

(Act. VII-16)

అని చదువును.

మూలముననున్న దశరథుని సంతోషమును నాటకీయముగ రాముని పితృభక్తి వెలువరించుటకు భాసుఁడిట్లు చమత్కారముగ రచించెను. అభిషేకము గూడ లంకయందే జరుగుట భాసుని మార్పు.

ఈ నాటకమున పాత్రపోషణము చక్కగా నిర్వహింపఁబడినది. తొలుత నాందీపద్యముననే శ్రీరాముఁడు విశ్వామిత్ర మఖధ్వంసకులను, విరాధ కబంధఖరధూషణ, వాలి, రావణుల జక్కడంచినవాఁడని పేర్కొనఁబడెను. ఇతఁడు మహాబాహుబలశాలి యనుట కీతఁడు వాలిని జయింపఁగల సామర్థ్యము తనకుఁగలదని నిరూపించుటకుఁ బ్రయోగించిన బాణము, సప్తసాలముల భేదించుకొని పోవుటయే చాలును. మఱియు నీతని యస్త్రప్రయోగమునకు వెఱచి, వరుణుఁడు ప్రత్యక్షమై సాగరతీరమునకుఁ

ద్రోవఁజూపెను. రాక్షసరాజగు రావణుని నిర్మూలింపఁ బ్రహ్మాస్త్రమును వదల నది యాతనిఁ దునిమి, మరల రామహస్తముఁ జేరెను.

శ్రీరాముఁడు మహాధర్మపరుఁడు. వాలిని మాటుననుండి బాణమున నేయ నతఁడు నిరపరాధియగు తన్నట్లు ధర్మవిరుద్ధముగఁ జంపుట యన్యాయమని శ్రీరాముని దూరినపుడు శ్రీరాముఁడు తగిన సమాధాన మొసఁగును. వాలి సోదరునిభార్యతో వ్యభిచరించుట యను నగమ్యాగమన మహాదోషమును గావించినందులకు దండనార్హుఁడయ్యెననియు, మరణశిక్ష యట్టి ఘోరాపరాధమునకుఁ దగుననియు, మరియు మృగముల వేఁటాడుట క్షత్రియులకు అధర్మము కానేరదనియు, మృగములు బోనులు, వలలు, మొదలగు సాధనముల చేతను వంచనమెయి సంహరింపఁబడుట ధర్మసమ్మతమనియు నుడివి, నిజధర్మపరాయణతను జాటును. ఈ నాటకముననే శ్రీరాముని శీలమును కొరతపరచు వాలి వధావిషయము ధర్మపరమని చాటబడుచున్నది. ఈ విషయమంతయు వాల్మీకి రామాయణమునందువలెనే చక్కగా ప్రతిపాదింపఁబడినది. నాటకోచిత సంభాషణ శైలినిడుటయే భాసుని నైపుణ్యము.

శ్రీరాముఁడు మిక్కిలి యుదారస్వభావము గలవాఁడు. శుకుఁడు సారణుఁడను నిరువురు రావణామాత్యులు కపివేషములతో రామసైన్యమున నుంట విభీషణుఁడు గుర్తించి శిక్షనొసఁగు మని శ్రీరామునిఁగోర, వారిని మర్యాదగా తన సైన్యము నంతటిని జూపించి వదలివేయుమనును, శ్రీరామునంతటి యుదారుఁడు గాక మరియొకఁ డట్టిమాయావుల నూరక విడచునా? 'మాయాచారే మాయయావర్తితవ్య' మ్మను వ్యాససూక్తియున్నను శ్రీరాముఁడౌదార్యమునట్లు ప్రకటించెను. ఇతఁడు ధర్మయుద్ధమునే గావించి ధర్మవిజయమును బడసెను. రాజ్యకాంక్ష యీతనికి లేదు. ధర్మసంస్థాపనార్థ

మవతరించిన మహాపురుషుఁడు గావుననే, దుష్టుల శిక్షించి శిష్టుల రక్షించు మహాకార్యమునే గావించెను. రావణవధానంతరము లంకకు విభీషణుని రాజుగాఁజేసెను.

శ్రీరాముఁడు గొప్ప అభిమాని, ప్రజారంజకుఁడు. రావణవధానంతరము సీతను గ్రహింప సందేహించును. తానుమాత్రము సీతావిషయమునఁ బరిపూర్ణమగు నమ్మిక గల్గియున్నను, ప్రజాపవాదమునకు వెరచి యామె నగ్ని ప్రవేశమున కనుమతించును. పుటపాకశోధితమగు బంగరువలె నగ్నిప్రవేశమున శుద్ధచారిత్రయగు సీత నిజపాతివ్రత్యమును లోకమునకు వెల్లఁడిజేసిన పిదపనే, శ్రీరాముఁడామెను గ్రహించెను. ఇతఁడు విశ్వాసపాత్రుఁడు. తన్ను పరిపూర్ణముగ నమ్మిన సుగ్రీవ విభీషణులకుఁ దాఁబాససేసినమేరకు నెరవేర్చి వారిని ప్రాణమిత్రులుగఁ భావించిన మహాపురుషుఁడు. తుద కగ్నిదేవుఁడే తనకభిషేకమొనర్చినను, తన తండ్రియగు దశరథుఁడే యారూపమున వచ్చి తనకామహోత్సవముఁ గావించెనని తలంచిన పితృభక్తిపరాయణుఁడు.

ఇట్టి సుగుణములపుంజమగు శ్రీరాముఁడు, ఈ అభిషేకనాటకమునఁ జక్కఁగా జిత్రింపఁబడినాఁడు. ఇందు సందర్భములన్నియు రామపాత్రచిత్రణ మునకుఁ దోహద మొసంగుచు నాతని మహోదారతాదిసద్గుణముల లోకమునకుఁ జాటుచున్నవి. లక్ష్మణుఁడు, వాలి, సుగ్రీవ, విభీషణాదులవిషయము లన్నియు రామపాత్రపోషణమునకే తోడ్పడుచున్నవి.

ఇతని శైలి:

శాకుంతలాది నాటకము లందీభాసకవికృత శ్లోకముల కనుకరణములు గానవచ్చుచున్నవి. ఈ అభిషేకనాటకమున నున్న శ్లోకముఛాయలు కొన్ని కాళిదాసీయనాటకములందు గోచరించుటచే కాళిదాసాదులు భాసు

ననుకరించిరని నిశ్శంకముగఁ దెలియుచున్నది. అభిషేకమున ద్వితీయాంకమున సీత హనుమంతునితో నిజసందేశమంపునపుడు. 'భద్ర! ఏతాం మే అవస్థాం శ్రుత్వా ఆర్యపుత్రో యథా శోకపరవశో న భవతి తథా మే వృత్తాంతంభణ' యని నుడువును. ఇట్టి వాక్యములందు సీతయొక్క కుసుమకోమలమగు స్త్రీహృదయము వ్యక్తమగుచున్నది. ఇట్టివాక్యములు పెక్కుస్థలముల శక్తిభద్రుని 'ఆశ్చర్యచూడామణి' యందును గానవచ్చుచున్నది. మందునకు, 'ఆశ్చర్యచూడామణి' యందు షష్ఠాంకము చివర సీత హనుమంతునితో:- 'ఆర్యపుత్రో యథా శోకపరవశో న భవతి తథా మే వృత్తాంతం తస్య భణ'.

(ఆశ్చర్య-పుట 204,)

అభిషేకనాటకమునఁ దృతీయాంకమున నశోకవనము భగ్నమయ్యెనని రావణున కెరింగించు సందర్భమున,

'యస్యాం న ప్రియమండనాఽపి మహిషీ దేవస్య మండోదరీ
స్నేహాల్లుంపతి పల్లవాన్నచ పునర్వీజంతి యస్యాం భయాత్।
వీజంతో మలయానిలా అపి కరై రస్పష్టబాలద్రుమా
సేయం శక్రరిపో రశోకవనికా భగ్నేతి విజ్ఞాప్యతామ్'॥

(అంక-3 శ్లో. 1.)

అని గలదు. శాకుంతలమందలి. 'పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం యుష్మా స్వపీతేషు యా' అను కాళిదాసునిశ్లోకము పై భాస శ్లోకానుకరణమని తెలియుచున్నది.

ప్రథమాంకమున వాలి శ్రీరాముల సంభాషణసందర్భము శ్రీమద్వాల్మీకి రామాయణము ననుసరించియే రచించెను. వాల్మీకిరామాయణం, కిష్కింధాకాండము-17-వ సర్గమునను, 18-వ సర్గమునను గల

వృత్తాంతమునే చమత్కారముగ నాటకీయముగ సంభాషణమున నిడి భాసుఁడు రాముని మహోదాత్తునిగఁ జిత్రించెను.

భవభూతిరచితమగు నుత్తరరామాయణమునందు షష్ఠాంకమున గాననగు విద్యాధరుల సంభాషణము భాసుని యభిషేకమునందలి షష్ఠాంకము ననుకరించుచున్నది. ఇట్లు ఆనేకులకుఁ దర్వాతివారి కాదర్శప్రాయుఁడై భాసుఁడు నాటక కర్తలలోఁ బేరుగాంచెననుట సత్యదూరము కానేరదు. రామకథను బ్రతిమానాటకమున శ్రీమద్రామాయణమునుండి యయోధ్యారణ్యకాండముల విషయమును అభిషేకనాటకమున కిష్కింధాసుందర యుద్ధకాండముల విషయమును నాటకములకై గ్రహించిన భాసుఁడు తొలికాండమగు బాలకాండమునుగూడ గ్రహించి యొక నాటకము రచించి యుండనోపు. ఇప్పటికిని భాసకవి రచితము లనఁదగు నాటకములు పదుమూఁడుమాత్రమే దొరికినవిగదా! ఇంకను మన కుపలభ్యములు కాకుండ నున్నవానిలో రామాయణ బాలకాండ విషయము గల నాటకమేదేని యుండి యుండనోపు. విశ్వనాథుని సాహిత్యదర్పణమున షష్ఠపరిచ్ఛేదమున, ముఖసంధ్యంగములలో విధానమనుదాని కుదాహరణముగఁ బేర్కొనఁబడిన, 'ఉత్సాహాతిశయం వత్స తవ బాల్యం చ పశ్యతః। మమ హర్షవిషాదాభ్యా మాక్రాంతం యుగపన్మనః॥' అను శ్లోకము బాలచరితమునుండి గ్రహింపఁబడినట్లు నుడువఁబడినది. ఇది శ్రీరామునిగురించి పరశురాముఁడు పల్కిన వచనమని కొన్ని ప్రతులును, కొన్ని జనకవచనమనియు నుడువుచున్నవి. దీనినిఁ బట్టి బాలచరిత మొందు శ్రీరామునిగురించి యుండియుండుననియే తోఁచుచున్నది. ఇప్పటికి లభించిన భాసుని బాలచరితము, కృష్ణవిజయము, శ్రీకృష్ణలీలలందు వర్ణితములు.

భాసుఁడు నాట్యశాస్త్రకర్తయగు భరతునకును పూర్వుఁడేమో యనిపించుచున్నది. భరతుఁడు మొదలుగాఁగల యాలంకారికులందరును రంగస్థలమునఁ జూపరాని-

'దూరాధ్వానం వధం యుద్ధం రాజ్యదేశాదివిప్లవమ్।
సంరోధం భోజనం స్నానం సురతం చానులేపనమ్।
అంబరగ్రహణాదీని ప్రత్యక్షాని న నిర్దిశేత్॥

మరణాదివిషయములను గొన్ని రంగముననే జూపెను. వాలిమరణము ప్రత్యక్షముగఁ జూపెను. ప్రతిమానాటకమున దశరథమృతియు, నాతనిపై నొకవస్త్రము గప్పుటయు, నందరు నేడ్చుటయుఁ జూపెను. ఇట్టివి నాటకమున నుండుటచే నీతఁడు భరతునకును బూర్వుఁడనిచెప్ప నవకాశము గల్గుచున్నది.

ఈ అభిషేకనాటకమున ముఖ్యరసము వీరము. ఇందు శ్రీరాముఁడు యుద్ధవీరముఁ జూపెను. కరుణాద్భుతభయానకాదులు తత్తత్స్థలముల నంగములుగ వర్ణింపఁబడి యంగిరసమగు వీరమునకే పోషకము లగుచున్నవి.

హనుమంతుఁడు రావణునితో సంభాషించునపుడు రావణుఁడు శ్రీరాముని మానవమాత్రుఁడనుచు, నతఁడు త్రిదశగణము నవలీలగా పెక్కుమార్లోడించిన తన్ను ఏమిచేయఁగలఁడని యహంకారోక్తులు వల్క నపుడు హనుమంతుఁడందులకు, వంచనమున సీతాపహరణమును దొంగవలె గావించు టెందులకని ప్రశ్నించును. ఇట దురహంకారోక్తులఁ బల్కు నతనికి వాని వంచన నెత్తిపొడిచినట్టు లెరింగించినపు డితరులకు హాస్యము రాక మానదు. ఇట హాస్యరస మంగమై వీరమును పోషించుచున్నది. మరల నశోకవనమున రావణుఁడు సీతకు రాముని

మాయాశిరమునుజూపి యామెనింక విడిపించువా రెవ రనుచుండనొక రాక్షసుఁడు వచ్చి, 'రాముఁ' డని తొలుత నుపశ్రుతిగఁ బల్కి, 'శ్రీరాముఁ డింద్రజిత్తును వధించె' నని నుడువును. ఇటఁగూడ హాస్యము గలదు.

శ్రీరామునకు వరుణుఁడు ప్రత్యక్షమై సముద్రమధ్యమున త్రోవనొసఁగుట యద్భుతము. మానవాకృతిఁ దాల్చిన మహావిష్ణ్వవతారమగు శ్రీరామునంతటి వాఁడుకూడ నీ విషయమున లక్ష్మణ, విభీషణ, సుగ్రీవ హనుమంతులతో సవిస్మయముగ 'అహోవిచిత్రతాసాగరస్య' అని యచ్చెరువొందును. సీత అగ్నిని ప్రవేశించుటయు నట్టిదే. ఇందు తారావిలాపనము, సీతావిలాపనమును కరుణరసమును వెల్లడించుచున్నవి.

అగ్నిప్రవేశానంతరము సీతంగూర్చి శ్రీరాముఁడు శాంతముగా తాను సీతయొక్క పతివ్రతాపాతివ్రత్యముల నెరుంగుదుననియు, లోకప్రత్యయమునకై యట్లు చేసితి ననియు నుడువును. ఇట శ్రీరాముని శాంతగుణము శాంతరసమును స్ఫురింపఁజేయుచున్నది. మరియు వాలి, శ్రీరాముని, తన్నధర్మమునఁ జంపుటతగ' దని నిందింప, శ్రీరాముని సమాధానములకు శాంతుఁడై, వాలి రామహస్తమున మృతినొందినందులకు ధన్యుఁ డనుకొనును. ఇప్పట్టునను శాంతరసము గోచరించుచున్నది.

ఇఁక శృంగారము, సీతారాములవిషయము లోకోత్తరము. విషయలంపటత్వములేని పవిత్రమగు ననురాగ మీ యిరువురయందును మిక్కుటము. దాంపత్యమున సీతారాములది యాదర్శప్రాయము. కష్టసుఖములం దన్నింట తుల్యానుభవము, వారిప్రేమ దివ్యము, నిష్కళంకము, ఒండొరుల హృదయములు పరస్పరాక్రాంతములు. స్వార్థమిర్వురయందు నిసుమంతయైనఁగానరాదు. కాన వీరియనురాగ మద్వితీయము. వీరివిషయమున కామశృంగారమునకుగాని, అర్థశృంగారమునకుగాని,

ముగ్ధశృంగారమునకుగాని, మూఢశృంగారమునకుగాని తావులేదు. ఈ సీతారాములశృంగార ముత్తమోత్తమము. ఇట నీ నాటకమున శృంగార మంగమయి ప్రధానమగు వీరమునే పోషించుచున్నది. ఇట్లు ఆయా స్థలముల నాయారసముల నంగములుగఁజూపి, కథను రసవంతముగఁజేసి, యీ నాటకమున నాయా పాత్రలఁ జిత్రించుటయందును, భాసుఁడు వారి మనములఁ దూరి చూచెనా యనున ట్లు చితరీతిని వర్ణించెను. కామాంధుఁ డగు రావణుఁడు సీతను దన్నువరింప వేడి వేడి వేసరి, తుదకు నిరాకృతుఁ డుకాగా తత్సమయముననే యింద్రజిత్తు మరణించెననియుఁ దెలిసి యింతకు మూలమగు నా సీతాదేవిని వేయిముక్కలుగ ఖండించి, యసికి బలియొనర్చి యామెహృదయమును జీల్చి, ప్రేవుల మాలలుగా తన మెడ వైచికొందునని బీభత్సముగా మాటాడును. ఇట్టి దుష్టకామాంధమనః ప్రవృత్తుల సునిశితముగ నెఱింగి భాసుఁడు చిత్రముగ వర్ణించెను. ఆయాపాత్రలఁ జిత్రించునపుడు తత్తదుచితభాషణములఁ గల్పించి భాసుఁడు నాటకమును మనోహరముగ రచించినాఁడు కావుననే తర్వాతి కాళిదాసాదులకు మాన్యుఁడై వెలసినాఁడు.

అభిషేకనాటకమున సూక్తులు

1. అదండ్యో నైవ దండ్యతే (P. 13.)
(అదండ్యుఁడు దండింపఁబడఁడు.)

2. అవశ్యం యుధి వీరాణాం వధో వా విజయోఽథవా (P. 38.)
(వీరులకు యుద్ధమున వధమో, విజయమో అవశ్యముగ కలుగును.)

3. అహో తు ఖల్వతులబలతా కుసుమధన్వనః (P. 60.)
(మన్మథుని బలము సాటిలేనిది కదా!)

4. దూతవధః ఖలు వచనీయః (P. 43.)
(దూతవధము నింద్యముకదా.)

5. నిర్వేద ఏవ ఖల్వనుక్త గ్రాహిణం స్వామిన ముపాశ్రితస్యభృత్యజనస్య, (P. 40.)
(అనుక్తగ్రాహియగు స్వామినాశ్రయించిన భృత్యునకు దుఃఖమేకదా!)

6. మజ్జమానేషు కార్యేషు పురుషం విషయేషు వై।
నివారయతి యో రాజన్ ! సమిత్రం రిపురన్యథా॥ (P. 76.)

(అకార్యములగు విషయములందు మునుఁగుచున్న పురుషుని ఎవఁడు వారించునో అతఁడు మిత్రుఁడగును. అట్లుచేయనివాఁడు శత్రువేయగును.)

7. వాగురాచ్ఛన్నమాశ్రిత్య మృగాణామిష్యతే వధః (P. 12.)
(పొదలమాటుననుండియే మృగములు వధింపఁబడుచున్నవి.)

8. సర్వాపరాధేష్వవధ్యాఃఖలు దూతాః (P. 41.)
(సర్వాపరాధములందును దూతలు వధింపఁదగరు.)

ప్రతిమానాటకము-భాసుఁడు

ఇది భాసకృత ప్రఖ్యాతనాటకము, ఏడంకముల గ్రంథము. భాసకృతులలో నత్యుత్తమమైనది. ఈ నాటకమున భరతునకు దశరథమరణము దశరథ ప్రతిమవలననే తెలియఁజేయబడుచున్నది. ఈ కారణముననే దీనికి ప్రతిమా నాటకమని పేరువచ్చెను. భాసకృతనాటకముల నన్నిట నీ ప్రతిమానాటక ముత్త మోత్తమమని కొందరు నుడువుదురు. ఇందు సీతారాములప్రణయ ముత్తమరీతిఁ జిత్రింపఁబడినది. రంగస్థలమునఁ జూపరాని మరణమును ప్రతిమారూపమునఁ దెలియఁజేయు నూతన పథముం జూపినవాఁడు భాసుఁడే. వాల్మీకిరామాయణమునందలి అయోధ్యా రణ్యకాండములందలి విషయమునే ముఖ్యముగా గ్రహించి కొన్ని స్వకపోలకల్పనలచే నచ్చటచ్చట కథలో మార్పులఁగల్గఁజేసి రామకథను నాటకీయముగా రచించునట్లొనరించెను. తక్కిన రామాయణగాథను సంగ్రహముగఁ గథోచితమగునట్లు గ్రహించి యీ ప్రతిమానాటకము నుత్తమరీతి రచించెను.

కథాసంగ్రహము

ప్రథమాంకము: నాందీమూలమున నాటకమున ముఖ్యపాత్రల నామప్రశంసచే ప్రేక్షకులకు పరిచయపరచును. పిదప విజయయను పరిచారిక బలాకియను కంచుకితో రామపట్టాభిషేకమునకు సిద్ధమొనర్పఁ ద్వరపడుమన నతండును సర్వము సిద్ధమయ్యెనని తెల్పును.

అవదాతిక యను సీత పరిచారిక పరిహాసమునకై రేవయను దానినుండి యొక వల్కలాంబరమును సంగ్రహించి తెచ్చుచుండును. సీత యవదాతిచేష్ట నెరింగి యా వల్కముల నిచ్చివేయుమనును. సీతయుఁ జాపలమున యా నారచీరలఁ ధరించును.

ఇంతలో రామపట్టాభిషేకవార్త నొకపరిచారిక నుడువును. మహోత్సవ సూచనార్థము భేరిమ్రోగి వెంటనే యాగును. శ్రీరాముఁడు నిశ్చింతుఁడై సీతకడ కరుదెంచి పట్టాభిషేకము నిలచినయుదంతమును నుడువును. సీత చాపలమున నారచీరల ధరించెనని తెలిసికొని తాను నొకదానిని గ్రహించి ధరించును. ఇంతలో నొక కంచుకి వచ్చి దశరథుఁడు మూర్ఛిల్లెనని తెలుపును. కైక యందులకు కారణమని యామెను దూర, శ్రీరాముఁ డాతని నూరకుండుమని, కైకేయి యిట్టిపని యెన్నఁడును జేయదని వాదించును. అంత లక్ష్మణుఁడు క్రుద్ధుఁడై, ధనువుందాల్చి లోకమును నిస్సైణమొనర్ప నేతెంచును. శ్రీరాముఁడాతని నోదార్చును. శ్రీరాముఁడు పదునాల్గువత్సరము లరణ్యమునకుఁ బోవ సిద్ధుఁడై వల్కములఁ దేఁగోరును. సీతాలక్ష్మణులును రామునను సరింతురు. ముప్వురును వల్కలాంబరముల ధరించి యడవికిఁ బయలుదేరుదురు. భగ్నహృదయుఁడై దశరథుఁడు వారి యరణ్యగమనమును వారింప నేతెంచుచున్నాఁడని కంచుకి తెల్పుచున్నను సరకుఁగొనక సీతా రామలక్ష్మణులు పయన మగుదురు.

ద్వితీయాంకము: సీతారామలక్ష్మణులు వెడలిన తర్వాత దశరథుఁ డు. నయోధ్యాపౌరులును మిక్కిలి దుఃఖింతురు. దశరథుఁడు కౌసల్య సుమిత్రా సేవితుఁడై, సీతారామలక్ష్మణ గమనమున కెంతయుఁ జింతించుచు, వారికై వాపోవుచు కౌసల్యచే నోదార్పఁబడుచుండును. చిత్తవిభ్రమముచేఁ దారుమారుగా మాటాడును ఖేదము నణచు కొనలేకుండును. అంత సుమంత్రుఁ డరుదెంచి దశరథునకు మ్రొక్కి, ముప్వురు నరణ్యమున కేఁగిరని నుడువ దశరథుఁడు దుర్భరమగు నా వార్తవిన్నంతఁ బిడుగుచే నడపఁబడిన విధమున నేలఁగూలి మూర్ఛిలును. కొంతసేపటికిఁ గొంచెము తెప్పరిలి కైకకుఁ గోరిక నెరవేర్చుకొనుమని సందేశమంపి తుదకు దిలీపాదితద్వంశులఁ గల మాదరిఁగనుచు,

సీతాలక్ష్మణులఁ దలంచుకొనుచు మరణించును. అంత రాజభవనమున నందరు రాజమృతికి విలపింతురు.

తృతీయాంకము: ప్రవేశమున ప్రతిమాగృహమునకు రాణులువత్తురని యేర్పాటులు గావించియుండుట తెలియుచున్నది. మేనమామయింట చాలకాలముండిన భరతుఁడు తండ్రియగు దశరథుఁడు స్వస్థముగనున్నట్లు తెలిసికొని యయోధ్యకు వచ్చును. త్రోవలోఁ దండ్రిస్థితినిగురించి సారథిని వివిధప్రశ్నలువేయ నతఁడును వానికన్నింటికిని తగినట్లుత్తరము లిచ్చుచు దశరథమరణమును మాత్రము తెల్పఁడాయె. అయోధ్యాపరిసర ప్రాంతములకురాగా వసిష్ఠుఁడు నగర ప్రవేశమునకొకింత తడవుండిరమ్మని సందేశమంప గుర్వాజ్ఞ యనుల్లంఘనీయమని యా పురబాహ్యసీమ నొకమందిరముం గని యది దేవతామందిరమేమోయని శంకించి యట విశ్రమింపనెంచి యందుఁ బ్రవేశించును. అంతట నటసుందరమగు ప్రతిమల నాల్గింటినిగని దేవతలని నమస్కరింపఁబోవ నటనున్న రక్షకుఁ డు వారించి యా ప్రతిమ లిక్ష్వాకువంశ్యులవని నుడివి, ప్రత్యేకముగ దిలీప, రఘు, అజుల నామముల నుడువును. నాల్గవప్రతిమ దశరథునిదిగా నెఱింగి తొలుత నడుగ వెరచి పిదప క్రమముగాఁ దెలిసికొని మూర్ఛిలును. ఆవల దశరథపత్ను లచటకు సుమంత్రునితో వత్తురు. కొంతసేపటికి భరతుఁడు తెలివొంది తల్లులఁగని కౌసల్యాసుమిత్రలకు నమస్కరించి కైకేయిని తల్లివి కావని దూరును. కైక తగినయదనున తగినస్థలమున యావత్ విషయము వివరించెద ననును. కాని భరతుఁ డుగ్రుఁడై తల్లిని జెడఁదిట్టును. ఇంతలో వసిష్ఠవామదేవాదులు భరతునకభిషేక మొనర్పవచ్చిరని భరతునకుఁ దెల్పుదురు. కాని భరతుఁడొల్లక రామలక్ష్మణులఁ గనుగొన నరణ్యమునకు బయలుదేర సంకల్పించును.

చతుర్థాంకము: భరతుఁడు రామతపోవనమునకు బయలుదేరును. సుమంత్రునితో రథారూఢుఁడై యరిగి రాముని దర్శించును. ఈ సన్నివేశము చాల జాలిని గలిగించును. సీతారామలక్ష్మణులు భరతు నాదరమునఁ గలసికొని ప్రియముగ సంభాషింతురు. భరతుఁడు శ్రీరామునితో నరణ్యముననే యుందునని వేడుకొన్నను శ్రీరాముఁడాతనకిఁ బిత్రాజ్ఞను, రాఘవకుల ప్రతిష్ఠను దెలిపి రాజ్యభారము తప్పక వహింపుమని హెచ్చరించును. భరతుఁడు రామునకుబదులు రాజ్యమేలుటకు శ్రీరామునిపాదుకల న్యాసముగ నొసంగఁ గోర శ్రీరాముఁడు నందుల కంగీకరింప, భరతుఁడు సుమంత్రునితో నయోధ్యకు మరలివచ్చును.

పంచమాంకము: సీత యీ యరణ్యమునఁ జిత్రకూటావాసమున దైనందినవిధులఁ జక్కగ నెరవేర్చుచుండెను. శ్రీరాముఁడు సీతతో మరునాడు దశరథుని సాంవత్సరీక శ్రాద్ధదివసమని తెల్పి తానెట్లు పితరుల సంతృప్తిపరతునని సంశయించుచుండును. ఇంతలో రావణుఁ డతిథివేషమున నటకువచ్చి తాను వేదవేదాంగపారంగతుఁడననియు, మనుధర్మశాస్త్రమును, మాహేశ్వరయోగశాస్త్రమును, బార్హస్పత్యార్థ శాస్త్రమును, మేధాతిథిన్యాయ శాస్త్రమును, ప్రాచేతసశ్రాద్ధకల్పమును లెస్సగ తెలిసినట్లు నుడువును. ప్రాచేతసశ్రాద్ధకల్పమను పేరు విన్నంత శ్రీరాముఁ డాదరమున నా యతిథిని పితరుల తృప్తులఁజేయు విశేషవిధినిఁ దెల్పఁ గోరును. అతఁడును హిమాలయభవములగు కాంచన పార్శ్వములును, వైదూర్యశ్యామపృష్ఠములగు మృగములు పితరులకు ముఖ్యముగ నొసఁ గదగినవని తెల్పును. నిజమాయాబలమున తత్క్షణమున పైఁజెప్పిన లక్షణములుగల జింక నట ప్రత్యక్షమగునట్లు చేయును. శ్రీరాముఁడద్దానిని వెంబడించి గ్రహింపనరుగును. లక్ష్మణుఁడంతకుమున్నే కులపతినిఁ దోడ్కొనిరా నంపఁబడియుంట, సీత యొంటరిగనుండును. అయ్యదనెరింగి

నిజరూపముం దాల్చి ప్రజ్ఞలుచెప్పికొని సీతనెత్తికొనిపోవుచు 'క్షాత్రముకల్గెనేని నన్ను గెలిచి ప్రతిక్రియ సేయుదురుగాక!' యని కేక లిడుచు నాకాశమార్గమున జనుచుండును. సీతయుఁ దన్నుఁ గాపాడ నార్యపుత్రుని వేడుకొనును. ఇంతలో జటాయువా వార్తవిని యట కరుదెంచును.

షష్ఠాంకము: విష్కంభమున నిరువురు తాపసులు రావణ జటాయువుల ఘోరయుద్ధము నభివర్ణించి తుదకు జటాయువు మరణించెనని తెల్పుదురు, భరతుఁడు సీతారామలక్ష్మణులవృత్తాంత మరసిరమ్మని సుమంత్రు నరణ్యమున కంపును. సుమంత్రుఁడు రాముని జవస్థానమునఁ గానక, సీతను రావణుఁడెత్తుకొనిపోయెననియు, రామలక్ష్మణులు ఋష్యమూకమున భ్రాతృనిర్వాసితుఁడగు సుగ్రీవుని వానరరాజ్యాభిషిక్తుఁజేసి యటనున్న వారనియు విచారకరమగు వార్త భరతునకుఁ దెల్పును.

సీతాపహరణవార్త వినగానే మిక్కిలి శోకించి భరతుఁడు తల్లియగు కైకకడ కరిగి యామెయే యింతకు మూలకారణమని మిగుల నిష్ఠురముగ దూరును. అంత కైక దశరథునకుఁ బుత్రశోకమున మరణింపవలసిన శాపవృత్తాంతముఁ దెల్పి పుత్రప్రవాసమున నాశాపమును సఫలమొనర్పనెంచి తానట్లు శ్రీరాము నరణ్యమున కంపినట్లు నుడువ, భరతుఁడు నిరుత్తరుఁడై, యామెనంతకుమున్ను నిందించినందులకు క్షమింపవేడును. అంత నాతఁడు రామసహాయార్థము రావణునెదుర్కొనఁ జననెంచును. సీతాపహరణవిషయము విన్నంత కౌసల్య మూర్ఛిల, భరతుఁడును, కైకేయియు నామె నోదార్ప నేఁగుదురు.

సప్తమాంకము: ఇంతలో శ్రీరాముఁ డనంతవానరసేనతో రావణునెదుర్కొని, యాతని యమపురికనిపి, విభీషణునకు లంకారాజ్యమునఁ బట్టముగట్టి, సీతతోడను, లక్ష్మణాదులతోడను మరలి

జనస్థానమునకు వచ్చును. భరతుఁడును గొప్పసేనతో నట కరుదెంచును. ఆ జనస్థానముననే దాశరథులు నల్వురును, వారి ముప్వురు తల్లులును గలసికొందురు. అప్పటికిఁ బదునాలుగేండ్ల యరణ్యవాసము పూర్తియగుట శ్రీరాముని రాజ్యభారము వహింప భరతుఁడు వేడుకొనును. వసిష్ఠ వామదేవాదులు రామున కభిషేకమొనర్ప నటకు వత్తురు. అచ్చటనే శ్రీరామునకు విశ్వప్రియముగ నభిషేకము జరుగును. విభీషణ సుగ్రీవాదు లభినందింతురు. శ్రీరాముఁడు వారిసాయము ప్రశంసించును. ఆవలఁ దలచినంతమాత్రమునఁ బుష్పకవిమానము రాగా నందరు నందధిరోహించి యయోధ్యకరుగుదురు. భరతవాక్యముతో సుఖాంతముగ ముగియును.

ప్రతిమానాటకమున విశేషములు:

మూలకథయగు శ్రీమద్రామాయణమునను సరించి యయోధ్యారణ్య కాండముల విషయమునే ఇతివృత్తముగ గ్రహించి ప్రతిమానాటకమును రచించినను, భాసుఁడు పెక్కుతావుల మూలకథనతిక్రమించి నాట కోచితముగఁ గొన్నిమార్పులు గావించెను. ప్రథమాంకమున వల్కలకల్పనము మూలకథకన్న నాటకీయముగ మార్చెను. వాల్మీకిరామాయణమున దశరథుఁడు కైకకు వరద్వయమొసఁగిన పిదప శ్రీరాముఁడరణ్యమునకుఁ బోవ సంసిద్ధుఁడైయుండు సమయమునఁ గైకేయియే స్వయముగ నారచీరలఁ దెచ్చి యిచ్చినట్లును, రామలక్ష్మణులు ధరించి పిదప సీత సిగ్గుచే సంశయించుచుండ శ్రీరాముఁడు స్వయముగ సీతకుఁ గౌశేయముపైన నారచీర జుట్టఁబెట్టినట్లున్నది. * ప్రతిమానాటకమున నీ నార చీరల

* అథ చీరాణి కైకేయీ స్వయమాహృత్య రాఘవమ్।
ఉవాచ పరిధత్స్వేతి జనౌఘే నిరపత్రపా॥ 6
సచీరే పురుషవ్యాఘ్రః కైకేయ్యాః ప్రతిగృహ్యతే।
సూక్ష్మవస్త్ర మవక్షిప్య మునివస్త్రాణ్యవస్తహ॥ 7

విషయము చమత్కారముగా ఆగామి వనవాసోచితవేషమును దెల్పుటకోయనునట్లు సీత పరిహాసములకై నారచీరను పరిచారికనుండి గ్రహించి ధరించుకొని తా నా వేషమున నెట్లుండునో యని యడుగుట మున్నగునవి యన్నియు కవికల్పనలు.

పట్టాభిషేకమహోత్సవ సందర్భమున సీతకు పరిహాసమునకై యట్టివేషమున నభిలాష జనించును. ఆ వేషమునఁ దానున్నతరి నొరులు చూడకముందే తానా నారచీరల విసర్జింపఁదలచినను రాముఁడు సీత నా నారచీరలతో నుండుటను జూచునట్లును, మరొక నారచీరఁ దెప్పించి తానును ధరించునట్లు కూర్చుటయు, మున్నగునవి యన్నియు నాటకోచితముగ రాబోవు నరణ్యావాసమును సూచించుటకుఁ గల్పింపఁ బడినవి. నాటకమున సీత కరణ్యావాసవిషయము తెలియకయేయట్టి యారణ్యకోచితవేషము దాల్చును. మూలకథలో నరణ్యావాసవిషయము తెలిసినపిదప నా వేషమునకుఁ దగిన నారచీరలు కైకేయియే వారల కొసంగును (Coming events cast their shadows before them) అను సామెత యిటసార్థకము. రాముఁడు సీతను నారచీరల ధరించినపుడు చూచి యామె యాభరణములఁగూడ దీసివైచినటుల గుర్తించి, యందులకుఁ

లక్ష్మణశ్చాఽపి తత్రైవ విహాయ వసనే సుభే।
తాపాసాచ్ఛాదనేనైవ జగ్రాహ పితురగ్రతః॥ 8

.....

కృత్వా కంఠేస్మసా చీరమేక మాదాయ పాణినా।
తస్థౌహ్యకుశలా తత్ర వ్రీడితా జనకాత్మజా॥ 13

తస్యాస్తత్క్షి ప్రమాగత్య రామో ధర్మభృతాంవరః।
చీరం బబంధ సీతాయాః కౌశేయస్యోపరి స్వయమ్॥ 14

(వాల్మీకిరామాయణము-అయోధ్యాకాండము-37-వ సర్గము.)

గారణమరయఁ బ్రశ్నింప, నామె యప్పటి కింకను నాభరణముల ధరింపలేదని నుడువ, రాముఁ డామెకు స్వయముగ నద్దముఁ జూపెదనని నగల ధరించుమనును. రాముని యీ చేష్ట భార్యాప్రీతికై మోహమునం జూపి తన బాలభావమును వెల్లడించినను నాయకుఁడగువాని కిట్టిచేష్టను వర్ణించుట, అందును నాటకమునఁ బ్రదర్శనయోగ్యముగఁ జేయుట రామునిశీలమునకుఁ గౌరత నాపాదించుచున్నది. అదియునుంగాక రాముఁడు సీత నారచీర ధరించియున్నట్లు నామెతో కొంతసేపు పట్టాభిషేక విషయమును ముచ్చటించినపిదపఁగాని గుర్తించినట్లులేదు. కొంత తడవామెతో సల్లాపములాడుచు ముఖాముఖినుండియు నప్పటి యామెవింత వేషమును పరిశీలింపకుండుటయు రామునకు లోపము నాపాదించుచున్నట్లు తోఁచును. కాని దీర్ఘముగ నాలోచించినచో నట్టి తీవ్రభావావేశమున కేవలము సీతవేషముకూడ నాతనికి గోచరించలేదేమో, సీతారాములు పట్టాభిషేకమునుగురించి ముచ్చటించు సందర్భమున వారిరువురకును తుల్యాభిప్రాయములుండుట రాముఁడు గుర్తించి 'అల్పం తుల్యశీలాని ద్వంద్వాని సృజ్యంతే' యని తమ దాంపత్యమునకు హర్షించును. నిజముగ సీతారాముల దాంపత్యమట్టిదియే. ఇప్పట్టున నభిషేకమహోత్సవము తప్పిపోయినను శ్రీరాముఁ డేలాటి వికారమునొందక భార్యతో సల్లాపములాడుచుండుట, యవల కంచుకి కైక యభిషేకమహోత్సవ విఘ్నకారకురాలని తెల్పినను, యామెపై నపవాదము విన నొల్లమియు, జనకుఁడు శోకమున మూర్ఛిలెనని కంచుకి చెప్పుచుండ, లక్ష్మణుండు ధనుష్పాణియై రాముని గూడ చేత విల్లందుకొమ్మన నాతని సమయోచిత న్యాయవాక్యములచే నోదార్చుట మున్నగు నంశము లన్నియు శ్రీరాముని పితృభక్తిని, శాంతోదాత్తాది గుణములను వ్యక్తపరచును. ఇంతియగాక శ్రీరాముఁడు సీతతో ముచ్చటించునపు డాతనికి భార్యయెడఁగల

ప్రేమాతిశయమును, ధీరతయు, లక్ష్మణునోదార్చునపుడు గావించు నుపదేశములం దాతని యుదారతయు, గురుభక్తియు, న్యాయప్రవర్తనమును జ్యేష్ఠుఁడగు నాతని కెంతయుం దగియున్నవి. తండ్రి శోకభరమున మూర్ఛిలెనన రాజునందట్టి శోకపరవశత తగదని గుర్తించిన వివేకశాలియై శ్రీరాముఁడు వనగమనమున కెంతయు వికృతినొందక నారచీరలఁదాల్చి, లక్ష్మణున కొసగునపుడు వల్కలముంగూర్చి తపమను సంగరమున కంగరక్షయనియు, నియమమను మదనాగమున కంకుశమనియు, నింద్రియములను నశ్వములకు గళ్ళెమనియు, ధర్మరథమునకు సారథియనియు, మహోదాత్తముగా నుడివినాఁడు. ఆవలఁ గంచుకి దశరథమహారాజు సీతాలక్ష్మణసమేతముగా శ్రీరాముఁడడవికి వెళ్ళుచున్నాఁడన్న వార్తవిని శ్రీరామునికొరకు వచ్చుచున్నాఁడని చెప్పినను విని లక్ష్మణునితో ఱేఁడు వచ్చి తమ యున్కిపట్లు దర్శింపఁగలఁడని యొక విధమగు ననాదర భావముఁజూపినట్లు తోచుచున్నది. కాని తండ్రికి తన యెడగల గాఢవాత్సల్యమును, తండ్రిగారి హృదయ మార్దవమును, నాతని సునిశిత భావములను గుర్తించినవాఁడగుట శ్రీరాముఁడాతని కట్టియవస్థలోఁ గన్పించుటయే మరింత శోకహేతువగునేమో యని గుర్తించియే తండ్రి వచ్చులోపల నడవుల కేఁగును.. అదియునుంగాక నీలో నేదేని యంతరాయము వచ్చినచో తండ్రికి సత్యసంధత తప్పునేమో యనికూడ భావించి తండ్రివాక్యము నిల్పుటకైకూడ శ్రీరాముఁడట్టి దిట్టతనము వహించియుండనోపు.

శ్రీరాముఁడు సీతానుగమనమును వారింపుమని లక్ష్మణునితో నుడివినను, నాతఁడండుల కుత్సహింపక ప్రకృతినుండి సహజములగు నుదాహరణములఁ గొన్నిటిఁ జూపి యామెను గమనింపవలసినదే యని నుడువును. అప్పట్టున–

"శ్లో॥ అనుచరతి శశాంకం రాహుదోషేఽపి తారా
పతతి చ వనవృక్షే యాతి భూమిం లతా చ।
త్యజతి న చ కరేణుః పంకలగ్నం గజేంద్రం
వ్రజతు చరతు ధర్మం భర్తృనాథా హి నార్యః॥"

(అంకము-1. శ్లో-25.)

తారక సుధాకరుని రాహువు మ్రింగినపుడును వెంబడించుననియుఁ జెట్టు నేలకొరగినను దానితోడఁ దీవయు నేల నానుననియు, గజేంద్రుఁడు రొంపిఁ గూరుకొన్నను కరేణు వతనిని వీడ దనియు నుడివి స్త్రీలు సదా భర్తృనాథలని సీత కూడ రాము ననుగమింపవలసినదే యనును. ఈ వాక్యము లెంతయు సహజములును, ప్రియములునై వెలయుచున్నవి. ఇట్టిహృదయంగమములగు వర్ణనలను తరువాతి కాళిదాసాదు లనుకరించిరి. కుమార సంభవమున కాళిదాసు రతివిలాపఘట్టమున 'శశినా సహయాతి కౌముదీ' ఇత్యాది శ్లోకమట్టి భావముకలదే. శాకుంతలమున శకుంతల భర్తృ నిరాకృతయగునపుడు కణ్వశిష్యు లామెను 'పతిగృహే తవ దాస్య మపి క్షమమ్' అనుటయు నిట్టి భావమేయని స్పష్టముగ బోధపడుచున్నది.

ద్వితీయాంకమున శ్రీరామ విప్రయోగమున దశరథుఁడు మిగుల వనటం గుందుట రామునెడ నాతనికి గల పుత్రవ్యామోహము వ్యక్తమగుచున్నది. మరియుఁ గౌసల్యాసుమిత్రలతోడి దశరథ సంభాషణము సహజముగా నున్నది. కంచుకి సుమంత్రునిరాకను దెల్పగా వట్టిరథముతోడనే తిరిగివచ్చెనని తెలిసికొని దశరథుఁడు శోకభరమున మూర్ఛిల్లును. అత్తరి కంచుకి 'ఈ దృగ్విధాః పురుష విశేషా ఈదృశీ మాపదం ప్రాప్నువంతీతి విధి రనతిక్రమణీయః' (ఇట్టి పురుష శ్రేష్ఠులు నిట్టి యాపద లనుభవింతు రనిన విధి యనతిక్రమణీయము కదా) యని వచించును. భాసుఁడు

కేవల మీశ్వరాజ్ఞ బలీయసి యని యీ కంచుకి వాక్యముల మూలమునఁ దెల్పుచు నిజప్రామాణికబుద్ధిని జాటుచున్నాఁడు.

మహాసత్త్వాతి గంభీరాది గుణగుణ విరాజితుఁడైయుండవలసిన మహారాజు దశరథుఁడు కేవల పుత్రవ్యామోహమున రామవిరహితముగ సుమంత్రుఁడేతెంచెనన్న వార్తవిన్నంత మూర్ఛిలుట యాతని మనోదౌర్బల్యమును దెల్పును, కాని యిట్టి విశేషసందర్భమున రాముని యుత్తమగుణాభిరామత మరింత వ్యక్తముచేయుటకై ముదుసలియైన దశరథునకు వార్ధకమున సుగుణాభిరాముఁడగు రామునెడగల్గిన యిట్టి దురంత వ్యామోహమును గల్పించి యట్టి యవస్థకు లోనగువానిగాఁ జిత్రించుటయు భాసుని నేర్పే. మూర్ఛదేరి సుమత్రునితోఁ దనమనోవేదనను వెల్లడించుకొనుచు నాతనినుండి సీతారామలక్ష్మణుల సందేశమువినఁ గుతూహలియై వారి నామోచ్చారణమాత్రపరవశుఁడై వారు తన యెదుటనున్నట్లే భావించి తనకేమియు సందేశము జెప్పకయే వనమున కేఁగిరని సుమంత్రుఁడు నుడువ రెట్టించిన మోహమున ఖిన్నుడై మూర్ఛిల్లును. సుమంత్రుఁడు సీతారామలక్ష్మణుల విషయము దెల్పుచు వారు శృంగిబేరపురమున రథము దిగి యయోధ్యాభిముఖులై మహారాజునకు శిరసా నమస్కరించి, బాష్పస్తంభిత కంఠు లగుచు పెదవులువడక నేమియో పలుకనెంచియు మాటాడ లేకుండుటయు, నేమియుఁబల్కకయ వనముల కేఁగిరని నుడువు నపుడు నాటకోచితముగ నభినయముం గూర్చి శ్రీమద్రామాయణము నందువలెనే కడుంగడు చిత్రముగఁ గవి నిరూపించినాఁడు. ఇష్టులగు వారియెడబాటున నిట్టి మనోభావములఁ జమత్కారముగా రచించి భాసుఁడు పాఠకహృదయములఁ జూరగొనినాడు. కాళిదాసుకూడ జగత్ప్రసిద్ధమగు నాటకరాజమున శాకుంతలమున

'కంఠస్తంభిత బాష్పవృత్తి కలుషం చింతా జడం దర్శనం' అని భాసు ననుకరించి తనకృతికి ఘనత నాపాదించినాఁడు. [1]

అవల మూర్ఛఁదేరి రాముఁ డడవి కేఁగెననియు, దాను మరణింపఁ బోవుచున్నట్లును, పుత్రుఁడగు భరతుని త్వరగ రప్పింపుమని కైకేయికి సందేశ మంపుటయు, సాంసారికోచితముగ లోకానుభవవిషయమునే చిత్రించి దశరథునెడ జాలిగొనునట్లు కడుంగడు రమణీయముగాఁ గరుణరసముం బోషించి భాసుఁడీ నాటకమునకు వన్నెఁదెచ్చెను. తుదకు దశరథుఁడు తా సంతతముఁ జింతించుచుండిన విషయముం దెల్పి 'రాజ్యే త్వామభిషిచ్య సన్నరపతేర్లాభాత్ కృతార్థః ప్రజాః' (రాజ్యమున నిన్నభిషేకించి, సన్నరపతి లాభమున ప్రజలు కృతార్థులగుదురు, (అంకము-2. శ్లో-19.) అని రామపట్టాభిషేకవార్తను స్మరించి యొక్కక్షణములోఁ దాఁదలచినది కైకచే వేరువిధముగఁ బరిణమింపఁ జేయబడెనని తలపోయును. ఈశ్వరేచ్ఛ బలవంతమైనదని బోధించుటకిట్టి సన్నివేశములఁ గల్పించి భాసుఁడు గొప్ప విజ్ఞానమును బోధించుచున్నాఁడు. అటుపిదప పితృదేవతలు తన్నోదార్పవచ్చుచున్నారని వారిని వరుసగా దిలీప, రఘు, అజమహారాజుల నామములతోఁ బేర్కొనుచున్నాడు. ఈ వరుస కాళిదాసు రఘువంశమునందు నిట్లేయున్నది. ఆసన్నమరణులగు వారికిఁ బితృదేవతలు లీలగాఁ గలవలె గోచరింతు రనుటయు లోకమున వాడుకగలదని భాసుఁడీ దశరథుని యనుభవమునఁ దెల్పుచున్నాఁడు. దశరథునకుఁ దన పితరులు గోచరించిన వరుస ప్రకారమే వారి నామములఁగూడఁ బేర్కొనియుండును. శ్రీమద్రామాయణమునను, విష్ణుపురాణమునను నీ యిక్ష్వాకుల పట్టిక

1. కమప్యర్థం చిరం ధ్యాత్వా వక్తుం ప్రస్ఫురితాధరాః।
బాష్పస్తంభిత కంఠత్వా దనుక్త్వైవ వనం గతాః॥
(అంకము-2. శ్లో-17.)

వేరువిధముననున్నది. ఆ పురాణములందు దిలీపునకును శ్రీరామునకును మధ్య పదునారుగురినుండి యిరువదిమంది చక్రవర్తులున్నారు. [1] ఇట నీ నాటకమునఁ బేర్కొనఁబడిన వరుస దిలీప, రఘు, అజ నామకులు గోచరించిరనుట రాబోవు తృతీయాంకమునందలి ప్రతిమాగృహమున భాసుఁడు దశరథుని నోట వచింపించినాఁడు, భావికథాభాగమును మనమున నిడికొనియే వస్తు విస్తరణమున కనుకూలముగ నిట్టి విచిత్ర సన్నివేశ కల్పనలుచేయుట భాసుని కళాకోవిదత్వమును వెల్లడిచేయుచున్నది.

-:వాల్మీకిరామాయణనందలి యిక్ష్వాకువంశక్రమము:-

1. దిలీపోఽంశుమతః పుత్రో దిలీపస్య భగీరథః।
భగీరథాత్కకుత్థ్సోఽభూత్ కకుత్థ్సస్య రఘుస్సుతః॥ 39

రఘోఽస్తు పుత్రస్తేజస్వీ ప్రబుద్ధః పురుషాదకః।
కల్మాషపాదో హ్యభవత్తస్మాజ్జాతశ్చ శంఖణః॥ 40

సుదర్శనః శంఖణస్య అగ్నివర్ణః సుదర్శనాత్।
శీఘ్రగస్త్వగ్నివర్ణస్య శీఘ్రగస్య మరుః సుతః॥ 41

మరోః పశుశ్రుకస్త్వాసీదంబరీషః పశుశ్రుకాత్।
అంబరీషస్య పుత్రోఽభూన్నహుషః పృథివీపతిః॥ 42
నహుషస్య యయాతిశ్చ నాభాగస్తు యయాతిజః।
నాభాగస్య బభూవాజః అజా ద్దశరథోఽభవత్॥ 43

(బాలకాండం. సర్గః-70.)

-:విష్ణుపురాణమందలి వంశానుక్రమణిక:-

అంశుమంతుడు-దిలీపుడు-భగీరథుఁడు-సుహోత్రుఁడు-నాభాగుఁడు-అంబరీషుఁడు-అయుతాయువు-ఋతుపర్ణుడు-సర్వకాముఁడు-సుదాసుఁడు-సౌదాసుఁడు (మిత్రసహుఁడు లేక కల్మాషపాదుఁడు)-అశ్మాకుఁడు-మూలకుఁడు-దశరథుఁడు-ఇలిబలి-విశ్వసహుడు-ఖట్వాంగుడు-దీర్ఘబాహుడు- రఘువు -అజుడు-దశరథుఁడు.

(విష్ణుపురాణము)

అంకాంతమున 'కాంచుకీయో యవనికాస్తరణం కరోతి' (కాంచుకీయుఁడు దుప్పటిఁగప్పుచున్నాడు) అనియు, 'హాహామహారాజ' యని విలపించుటయుఁ దెలుపఁబడియున్నది. 'యవనికాస్తరణం కరోతి' యనుటచే మరణించిన దశరథునిపై నొక దువ్వలువను గప్పుచున్నాడని యర్థమగును. ఇట్టివి నాటకలక్షణ విరుద్ధము లగుట నీ భాసుఁడు భరతునకుఁ బూర్వుఁడేమో యనికూడఁ కొంద రందురు. కాని యీ విషయమున నాటకోచితముగ సహజస్వరూపమును బ్రతిపాదింపనెంచి భాసుఁడు 'నిరంకుశాః కవయః' యను వాక్యమును సార్థకముఁజేయుచు నిజస్వాతంత్ర్యమును చాటుచున్నాఁడు.

తృతీయాంకమునఁ బ్రతిమాకల్పనము క్రొత్తమార్పు. తొలుతనే సుధాకరుఁడను సార్థకనాముఁడు ప్రవేశించును. ప్రతిమాగృహమును శుభ్రపరచి సుధాలేపనాదులు చేయుటచే యాతనిపని యని పేరువలననే తెలియుచున్నది. భటుఁడొకఁడు ప్రవేశించి దాస్యాఃపుత్ర (లంజకొడుకా) యని తిట్టి సుధాకరుని దన్నును. దీన నాకాలమున నధికారమున నున్నవారు సేవకుల నెట్లగౌరవపరచుచుండిరో యధికారమదముచే గర్వితులై యెట్లు చెలాయించుచుండిరో కొంతవరకుఁ దెలియుచున్నది. ఈ యంకారంభమందలి ప్రవేశకముచే దశరథప్రతిమాగృహము కౌసల్యాదులుజూడ నేఁగుదురని శుభ్రపరుపబడినట్లు, తెలుపఁబడినది. కౌసల్యాదులు నటకేఁగుదురు. ఇంతలో భరతుఁడు రథారూఢుఁడై దశరథుఁ డస్వస్థ శరీరుఁడై యున్నట్లు విని సూతు నా విషయముఁ బ్రశ్నించును. ఆ సంభాషణమున దశరథవిషయమై భరతుఁడు మిక్కిలి వ్యాకులుఁడై రథమును వేగముగఁ దోలుమనును. రథవేగ నిరూపణమున భాసుని వర్ణనము తర్వాతివారి కొరవడియయ్యెను. భాసుఁడు–

"శ్లో॥ ద్రుమా ధావంతీవ ద్రుతరథగతిక్షీణవిషయా
నదీవోద్వృత్తాంబుర్నిపతతి మహీనేమివివరే।
అరవ్యక్తిర్నష్టా స్థితమివ జవాచ్చక్రవలయం
రజశ్చాశ్వోద్ధూతం పతతి పురతో నానుపతతి॥"

(అంకము–3. శ్లో–2.)

అని సుందరమైన స్వభావోక్తిని వర్ణించెను. అనుభవవిషయముల నిట్లు మనోహరముగ వర్ణించుటలో నితఁ డగ్రగణ్యుఁడు. కాళిదాసుఁడును శాకుంతలనాటకమున ప్రథమాంకమున రథవేగమును నిరూపించు సందర్భమున నిట్లె వర్ణించెను. 'ఆత్మోత్థితైరపి రజోభిరలంఘనీయా'యను పంక్తిపై భాసుని శ్లోక చతుర్థపాదమున కుక్తి భేదముగాని వేరొండుకాదు. విక్రమోర్వశీయమునను 'క్షణవిషయాః' అని పై శ్లోకార్థమునే వర్ణించెను. భాసుని స్వభావోక్తి ఎంత సుందరముగ నున్నదో చూడుడు. చెట్లు పరుగిడుచున్నట్లును, వేగ గమనము వలన నా వృక్షములు సూక్ష్మముగాఁ గనుపడుచున్నట్లును, బ్రవాహము పొరలిపారు నదివలె భూమి, నేమి వివరమునఁ జొరబారునట్లును, బండియాకులు కనరాకుండునట్లును, జక్రములు కదలనట్లును, గుఱ్ఱపు గిట్టలచే నెగురఁగొట్టఁ బడిన ధూళి వెన్కకురాకుండునట్లును వేగముగ రథము పోవుచున్నదని యనుభవ సిద్ధమగు విషయమిట నెంతయో రమణీయముగ జిత్రింపఁబడినది.

భరతుఁడు స్వజనదర్శనోత్సుకతచే మిక్కిలి త్వరపడుచు నయోధ్యకుఁ దా నేఁగ నచట తనవారు ప్రీతివిశేషముచే నేమిచేయుదురో యవియన్నియు నూహించి మదినిఁ దలపోయును, ఇదియు స్వభావరమణీయము. ఇత్తరి సుమంత్రుఁడు తండ్రి మరణవార్తగాని, రాజ్యలాభము చేకురునన్నవార్తగాని, యన్న యడవులకేఁగెనన్నవార్తగాని యెద్దియుఁ దెల్పఁడాయె. అట్లు

తెల్పకుండుటయే నాటకరీతి. ప్రతిమారూపుఁడైన దశరథునిగని తండ్రిమరణమును మెల్లగాఁ దెలిసికొనునట్లు చేయవలయుననియే భాసుని యుద్దేశము. చావుకబురు చల్లగాఁ జెప్పుమనుట యిట్టిదే. కనుకనే కృత్తికవెళ్ళినతర్వాత రోహిణిలో నగరప్రవేశము చేయవచ్చుననియు నందాక నా ప్రతిమాగృహమున భరతుఁడు విడియునట్లును, ఆ సమయమున నయోధ్యలోఁగడచిన వృత్తాంతము భరతునకుఁ దెలియునట్లు చేయుటయే యీ యంకమందలి విషయము. కథావస్తు విట చమత్కారముగాఁబొందు పరుపఁబడినది. ఈ కల్పనమంతయు మూలరామాయణ కథకన్న భిన్నమైనను జమత్కారముగ నున్నది. ఈ ప్రతిమాగృహమునఁ దల్లులగు కౌసల్యా సుమిత్రా కైకేయిలతోడి భరతుని సంభాషణము ఉత్తమశీలుఁడగు పుత్రున కుచితమైనది. భరతుఁడును సచ్ఛీలుఁడనిపించుకొనెను. తల్లిని దూరుటయు నట్టి సందర్భమున నుచితమే. కాని కైకేయి, యుచితమగు దేశకాలములందుఁ దానట్లు వరద్వయము కోరుట యెందులకో తెల్పుదునని యంతటితోఁ బ్రసంగము ముగించెను. ఇంతదనుక కైకేయి సర్వజననింద్యయై దూరులకెల్ల గురియైనది. భాసుఁడు ఈ కైకనే నిర్దోషిణిగాఁ జేయనెంచియే యారవయంకమునఁ దానుదువఁబోవు విషయమును నాటకోచితముగ 'సముచిత దేశకాలములందుఁ దెల్పుదు' నని యామెచే నీ యంకముననే పల్కించెను. మున్ముందు కథాగమనమునం దభిరుచింగూర్చు రచనలు భాసునివంటి సిద్ధహస్తులకుఁగాని యన్యులకు సాధ్యము గాదు. భరతుఁడు అభిషేకాదుల నొల్లక రాముని గన్గొననేఁగఁ ద్వరపడును. ఈ యంకమున భరతుని శీలము వ్యక్తముచేయుటకై యాతని మనోవృత్తులనెల్ల నాతని మనమునదూరి పరిశీలించి చూచెనా యను నంతటి సూక్ష్మాతి సూక్ష్మతర భావములనెల్ల జక్కగాఁ జిత్రించినాఁడు భాసుఁడు. ఇట్టి మనోవృత్తి వివరణశక్తిని బ్రదర్శించుటయందు భాసుఁ డద్వితీయుడు.

నాల్గవ యంకమున భరతుఁడు శ్రీరాము నరణ్యమునఁ గలిసికొని యాతని పాదుకల న్యాసముగఁగోరును. ఈ సమావేశమున సుమంత్రుఁ డును బెద్దరికము వహించి యుచితరీతిని వారి కాయా సందర్భముల నాయా మర్యాదలఁబాటించి వారిని సంఘటింపఁజేయును. ఈ సందర్భమున వాల్మీకిరామాయణమున లక్ష్మణుఁడు దూరమునుండియే భరతునిజూచి భరతుఁడు ససైన్యుఁడై తమపై దండెత్తి వచ్చుచున్నట్లు అనుమానించి తాత్కాలికముగఁ గుపితుఁడై భరతుని తత్క్షణము చంపుట మంచిదని రామునకు సలహానిచ్చినట్లును, రాముఁడాతని కట్టి దుడుకుఁదనము తగదని యోదార్చినట్లు నున్నది.[1]

–:శ్రీ వాల్మీకి రామాయణమున లక్ష్మణ వచనములు :–

1. సంపన్నం రాజ్యమిచ్ఛంస్తు వ్యక్తం ప్రాప్యాభిషేచనమ్।
ఆవాం హంతుం సమభ్యేతి భరతః కైకయీసుతః॥ 17

* * * * *

సంప్రాప్తోయమరిర్వీరభరతో వధ్య ఏవ మే।
భరతస్య వధే దోషం నాహం పశ్యామి రాఘవ॥ 23
పూర్వాపకారిణం హత్వా నహ్యధర్మేణ యుజ్యతే॥
పూర్వాపకారీ భరతస్త్యక్తధర్మశ్చ రాఘవ॥ 24

* * * * *

ససైన్యం భరతం హత్వా భవిష్యామి న సంశయః॥ 31

(అయోధ్యాకాండం. సర్గ–96.)

–: శ్రీరామ వచములు:–

స్నేహేనాక్రాంతహృదయః శోకేనాకులితేఁద్రియః ।
ద్రష్టుమభ్యాగతో హ్యేషః భరతో నాన్యథా గతిః॥ 11

అంబాం చ కైకయీం రుష్య పరుషం చాప్రియం వదన్।
ప్రసాద్య పితరం శ్రీమాన్ రాజ్యం మే దాతుమాగతః॥ 12

కాని యిందు లక్ష్మణుఁడు తొలుత భరతునిగాంచి యేమియు ననుమానింపక పోలికచే రాముఁడా యని సంశయించి సుమంత్రునివలన భరతుఁడని యెరింగి శ్రీరామున కాతని రాకను దెల్పును. భరతుఁడు రామునిబోలి యున్నాఁడు కాబోలు! భరతుఁడును శ్రీరామునిజేరి సంభాషించుకొను ఘట్టము చాల జాలిపుట్టించును. శ్రీరామునంతటి వాఁడు భరతుని గడుంగడు మెచ్చుకొని యాతఁడు కోరినట్లు పాదుకలొసంగి పదునాల్గు వత్సరముల కాలానంతరము రాజ్యముఁ గైకొందునను వరముల నొసగును. ఇట సోదరులు వారి వారి సత్యసంధతఁ బాటించుచు నియమ బద్ధులైయుండుట విశ్వప్రపంచమునకు నొరవడియైయున్నది.

సుమంత్రునితో సంభాషించునెడఁ బితృతల్యుఁడగు నాతనియెడ శ్రీరామాదులకుఁ గల గౌరవాభిమానములు నిరుపమానములు. అరణ్యముననున్న శ్రీరామునకు దశరథమరణ మింతవరకెవ్వరును దెల్పలేదు. శ్రీరాముఁడే భరతునిరాకను జూచి భ్రాతృస్నేహ పుత్రస్నేహముల భేద మరయుచు తన యెడబాటువలన తండ్రియెట్టి యవస్థకుఁబాలాయెనో, యెట్టి దుష్కరకృత్యమొనర్చి దేహత్యాగమే గావించెనో యని సంశయించును. ప్రియసోదరుఁడగుటవలన భరతుఁడు లబ్ధమగు రాజ్యమును సయితము వదలి యన్నయగు తనకడ కరుదెంచగా నింక తనయస్నేహమెట్లుండునని వితర్కించుచు దేహమునే విడచియుండునను విషయము

ప్రాప్తకాలం యదేషోఽస్మాన్ భరతో ద్రష్టుమర్హతి।
అస్మాసు మనసాప్యేష నాహితం కించిదాచరేత్॥ 13

విప్రియం కృతపూర్వం తే భరతేన కదాను కిమ్।
ఈదృశం వా భయం తేఽద్య భరతం యద్విశంకసే॥ 14

సహి తే నిష్ఠురం వాచ్యో భరతో నాప్రియం వచః॥ 15

(అయోధ్యాకాండం. సర్గ-97.)

పుత్రస్నేహమెక్కుడగుట నద్దాన దశరథుఁడు దేహమునే వీడియుండునని తండ్రిమృతి ననుమానించును. అవల శ్రీరాముఁడు సుమంత్రుని బ్రశ్నించునపుడును 'దశరథమహారాజు స్వర్గమునఁ బితరులఁగూడి సుఖమున్నారా' యని ప్రశ్నించును: అందులకు సుమంత్రుఁడును దుఃఖముతోఁ దండ్రి పరలోకమున కేఁగెనని నుడువును. అంతవరకు శ్రీరామునకు దశరథ మరణవార్త తెలియదు. తెలిసిన పిదపఁగూడ నెక్కువగా విచారపడినట్లును గోచరింపలేదు. కాని సీత పలుకులలో 'రుదంత మార్యపుత్రం పునరపి రోదయతి తాతః' యనుటచే తండ్రి పుత్రస్నేహమున గతాసుఁడగునని శ్రీరాముఁడు సంశయించి వగచేఁ బొగులుచుండ మరల నేడిపించుచున్నాఁడనుటచే మహాగంభీరప్రకృతి యగుట శ్రీరాముఁడు నిజదుఃఖమును వెలిపుచ్చియుండడు. ఉదాత్తలక్షణములుగల శ్రీరాముఁడు మహాపురుషుఁడగుట నేడ్చుట తగదని యాతని కట్టి రోదనముల భాసుఁడు కల్పింపలేదు. మహాగంభీర ప్రకృతిగనే చిత్రించినాడు. యౌవరాజ్య పట్టాభిషేక విపర్యాసమునను నట్లే చలింపక మోదఖేదముల సమముగాఁ బరిగణించిన మహామహుఁడు శ్రీరాముఁడు. మహారాజ్యమంతయు స్వాధీనముకానున్న పట్టాభిషేక సమయమే భంగమైనపుడును, మరియు విపరీతముగఁ గాననములకేఁగి యట పదునాలుగుగేఁడు లుండవలయు ననినప్పుడును నేలాటి మనోవైక్లబ్యముంజెందని ధీరోత్తముఁడు. తనయందలి వ్యామోహమున నిజవిప్రవాసమునఁ దండ్రి మృతిఁ జెందియుండునని యూహించియే యెంతయు మనముననే దుఃఖించియున్నట్లు భాసుఁడు శ్రీరాముని జిత్రించెనేగాని రంగస్థలమున నట్టివి చూపి రామునకు గళంకమాపాదింప నిచ్చగించలేదు.

శ్రీరాముఁడు 'ఆపస్తావత్' అని జలముఁ గోరినపుడు లక్ష్మణుఁడు తేసిద్ధపడుచుండ భరతుఁడు తానే తే త్వరపడి లక్ష్మణునితో నట్లు సేయుట

తగదని క్రమప్రకారము వయోనుగుణముగఁ దానే శుశ్రూషగావింతునని నుడివి లక్ష్మణు నా ప్రయత్నమునుండి వారించి తానే జలమునకై యరిగి తెచ్చును. ఈ సందర్భమునఁ గ్రమప్రకారమనుటచేఁ దనకన్న లక్ష్మణుడు పెద్దవాఁడగుట, చిన్నయగు తానే శుశ్రూష గావించుట న్యాయ్యమని నుడువును. భాసుఁడు భరతుని లక్ష్మణునికన్నఁ జిన్నవానిగా జిత్రించినాడు. వాల్మీకిరామాయణమునందును బద్మపురాణమునందును లక్ష్మణునికన్న భరతుఁడే పూర్వజుఁడని స్పష్టముగాఁ జెప్పబడియున్నది.[1]

ఈ యంకమున భరతుని వినయసౌశీల్యాదులు వ్యక్తపరుపఁబడినవి, ఇందలి పాత్రలగు సీతా రామలక్ష్మణ భరత సుమంత్రుల మనోవృత్తులు వారి వారి భావోదాత్తత, యవ్యాజప్రేమ యివియన్నియు మనోహరముగాఁ జిత్రితములై గొప్ప నీతిని, భాతృప్రేమను బోధించుచున్నవి.

పంచమాంకమున శ్రాద్ధకల్పనము భాసుని క్రొత్తకూర్పు. ఈ మార్పు సీతనుండి రాము నెడఁబాయఁ జేయుటకై పన్నబడినది. సీత మొక్కలకు నీరుపోయగా పక్షులు సులభముగా, నా పాదులలో జలముఁ ద్రావుచున్నట్లు వర్ణింపఁబడినది. "తృషితపతితా నైతే క్లిష్టం పిబంతి జలం ఖగాః" (అం. 5-శ్లో. 21.) కాళిదాసుఁడు రఘువంశమున నీవిషయమునే యనుకరించి, "విశ్వాసాయ విహంగానా మాలవాలాంబుపాయినాం" (రఘువంశము సర్గ. 1-శ్లో. 51) అని నుడివియున్నాఁడు.

ఈ పక్షులు ఆలవాలజలముంద్రావుట, రానున్న రావణాతిథి సత్కారమును సూచించుచున్నది. అతిథివేషమున రావణుఁడు రాగా, సీతారాములు అతిథిసత్కారమునకై సిద్ధపడుచుండ, 'వాచానువృత్తిః ఖల్వ

1. అన్యేద్యుః పాంచజన్యాత్మా కైకేయ్యాం భరతోఽభవత్।
తదన్యేద్యుః సుమిత్రాయామనంతాత్మా చ లక్ష్మణః॥
(బాలకాండః అధ్యాయః)

తిథిసత్కారః। పూజితోఽస్మి' యనును. ఇటులే శాకుంతల నాటకమునను దుష్యంతుఁడు కణ్వాశ్రమమున, 'భవతీనాం సూనృతయైవ గిరా కృతమాతిథ్యం' అని పల్కును.

ఇట నీ ప్రతిమానాటకమున రావణుఁడు మాయవేషమున నుండుటచే సత్కారగ్రహణమున నామాయ నశించి, నిజరూపము బయలుపడు ననుభీతిచే నాతఁడట్లు మర్యాదగాఁ బల్కునట్లు భాసుఁడు వర్ణించినాఁడు. ఇట్లు అరణ్యమున రామరావణులు కలిసికొనుటయు నూతనకల్పనమే. లంకలో రణరంగమునఁ దప్ప, దత్పూర్వ మెన్నఁడును కలిసికొనినట్లు రామాయణమున లేదు. భాసుఁడు వీరి నీ దండకాటవిలోనే కలసికొనఁ జేసెను. కాని రావణుఁడు తనకెదురుగా నున్నను, రామున కతఁడు రావణుఁ డని తెలియదు. ఎవ్వరో అతిథియనియే గ్రహించెను. సత్యసంధుఁడును, ఋజుస్వభావుఁడునగుట నా యతిథిని సంశయింపనైన సంశయింపలేదు. 'అతిథిః కిల పూజార్హః' యనియే గౌరవించును. రావణుఁడిటకు వచ్చిన కార్యము, పన్నిన పన్నుగడ యంతయు రామాయణ విషయమే, రామాయణమున హేమ మృగమును జూచి సీత తన కద్దికావలయు ననఁగా, శ్రీరాముఁడు ఆమెకోర్కెను నెరవేర్ప భార్యయందలి ప్రేమచే నా బంగరులేడికై వెన్నంటి వెళ్ళినట్లును, 'లక్ష్మణా' యని మాయలేడి యరవ, సీత లక్ష్మణుని రామసహాయమునకుఁ బొమ్మని పలుమారు చెప్పియు, స్త్రీచాపలమున, ననరాని, వినరాని ముల్కులవంటి పల్కులాడిన పిదప నగతికముగ లక్ష్మణుఁడామె నొంటిగ విడచి యేఁగవలసివచ్చునట్లును, నదియ యదనని రావణుఁడు భిక్షురూపమున వచ్చి, సీతను వంచించి యెత్తికొనిపోయినట్లును నున్నది. ఈ నాటకమున సీతయందలి ప్రేమాతిశయమునఁ గాక తండ్రిగారి యనుసాంవత్సరీక శ్రాద్ధమును జక్కగా నెరవేర్ప నాలోచించుచుండ రావణుఁడు అతిథివేషమునవచ్చి

సర్వశాస్త్రవేత్తనని నాలుగైదు శాస్త్రములపేర్లు నుడివి రామచిత్తవృత్తి నెరిగి, ప్రాచేతస శ్రాద్ధకల్పమును తా లెస్సగఁ బఠించినట్లు తెల్పి, గోత్రప్రవరలు చెప్పినట్లును, శ్రీరాముఁడంతఁ బితరుల కెద్దాన పిండప్రదానకాలమునఁ దృప్తిగలుగునని ప్రశ్నింప, నతిథివేషముననున్న రావణుఁడు హేమాద్రి యందలి గంగోదకములఁ గ్రోలునవియు, వైడూర్యశ్యామపృష్ఠములును, కాంచనపార్శ్వములును నగు మృగము లుత్తమోత్తమము లనియు, మహర్షులు వానిని తలంచినంతమాత్రమున నవి యెదుటఁ బ్రత్యక్షములగుచుండుననియు, మానవమాత్రులకవి గోచరింపవనియు నుడువ, శ్రీరాముఁడు నిజప్రభావమును దలపోయుచుండ నింతలోఁ గాంచనపార్శ్వమృగ మాతనికి నయనగోచరముకాగా, నతఁడద్దానికై ధనురారోపణముచేసి బాణమువేయ నా మృగము శరవిషయము నతిక్రమించి యడవిని మాయమయ్యెననియు, రాముఁ డద్దానిని వెంబడించి వెన్కనే యేఁగెననియు, లక్ష్మణుఁ డంతకుమున్న తీర్థయాత్రనుండి తిరిగివచ్చుచున్న మునికులపతి నెదుర్కొనఁబంపఁ బడినట్లును, అయ్యదనుననే సీత యొంటరిగనుండ రావణుఁడు నిజరూపము దాల్చి సీతను నిజపరాక్రమము నుగ్గడించుకొనుచుఁ గైకొని యేఁగుచు మార్గమధ్యమున మదగర్వమున, 'నెవ్వరేని పరాక్రమవంతులున్నఁ దన్నెదుర్కొన రం' దని ఘోషించుచుండ, నింతలో నెటనుండియో జటాయువువచ్చి తీవ్రముగ నాతనితోఁ బోరినట్లునున్నది.

మహాపురుషుఁడైన శ్రీరాముఁడు, అతిథిమాటలను విచక్షణలేక విశ్వసించుటయు, హిమవంతుఁ డక్కడనే తన్నారాధించుచున్నట్లను కొనుటయు, హేమమృగముండునని నమ్ముటయు, సాధారణపురుషునివలె నాచరించుటయు రాముని శీలమునకుఁ గొంత లోటుతెచ్చునేమో యని తోఁచుచున్నది కాని, 'అసంభవం హేమ మృగస్యజన్మ, తథాఽపి రామో

లులుభే మృగాయ, ప్రాయస్సమాపన్న విపత్తికాలే, ధియోఽపి పుంసాం మలినా భవంతి॥' యన్నసూక్తియు నీ రామునే యుదహరించుటచే నెట్టివారికిని నావత్సమయములందు బుద్ధి మందగించుననుట, రాముఁ డు నద్దానికి గుఱియై మనకు గొప్పనీతిని బోధించుచున్నాఁడు. రామునకు నిజముగ హేమ మృగముండదని స్ఫురించినచో కథయే సాగియుండదు. సీతాపహరణమునకే ప్రసక్తిలేక రావణవధము జరుగుకుండును గదా! విషయమునిట్లు చమత్కారముగాఁ జిత్రించుటలో నవ్యతఁజూపి, నాటకమున కెంతయో వన్నెఁదెచ్చి భాసుఁడు విద్వత్ప్రశంసల నందినాఁడు.

ఈ మార్పుచే శ్రీరాముఁడు, సీతకోర్కెపైగాక తండ్రిప్రీతికై శ్రాద్ధమునఁ గాంచనపార్శ్వమృగము నర్పింప మాయామృగమును వెన్నంటి పోయినట్లు వర్ణింపఁబడుటచే శ్రీరామునకుఁ దండ్రియెడఁగల భక్తిగౌరవములు వ్యక్తమగుచున్నవి. సీత లక్ష్మణుని దూరుటయు నిందు లేదు. ఆమె యుత్తమసాధ్విగనే జిత్రింపఁబడినది. ఇందలి యతిథిసత్కారవిశేషము, ప్రజల కర్మఠత్వమునుఁ దెలుపుచున్నది.

ఆరవయంకమున, విష్కంభమున జటాయువు రావణునితోఁ బోరి యసువులఁ బాసెనని తెలియుచున్నది. మరియు రామునకు సీతాపహరణ వృత్తాంతమును, జటాయు వధము దెలుపఁబడును. ఆవల సుమంత్రుఁడు రామదర్శనార్థము జనస్థానమున కేఁగి యటఁ గానక, సీతాపహరణ వృత్తాంతము నెరింగి భరతుచెంతకు మెల్లఁగా జని రాముఁడు, తుల్యదుః ఖుఁడగు సుగ్రీవునికడ కిష్కింధయందున్నాఁడని తెలయఁజేయును. భరతుఁడు సీతాపహరణవిషయమును విన్నంత మూర్ఛిల్లి, కొంతతడవునకుఁ దెప్పరిల్లి, చాల విచారపడి, క్రూరచిత్తయగు కైకేయిని మరింత హేళనముఁ జేయ నామెకడకేఁగి, సీతాపహరణవిషయము దెల్పి, 'నీమనోరథ మీడేరినది.

ఇంక హర్షింపుము'–అని నుడువ, నామెయు కడుంగడు చింతిల్లి, యదియ తగిన యదనని మున్ను తృతీయాంకమునఁ బ్రతిమాగృహమున, నుచితదేశకాలములందు నివేదింతునన్న విషయమును, దశరథునకు సంభవించిన మునిశాపవృత్తాంతమును సుమంత్రుని మూలమున నెరింగించెను. దుస్తరమగు నా మునిశాపము దశరథుఁడు తప్పక యనుభవింపవలసియుండె. శ్రీరాముఁడు జగదభిరాముఁడై యుండె. కాన నట్టి సందర్భమున పుత్రశోకము దశరథునకెట్టులేని కలుగవలయునని యాలోచించియే తనకు శ్రీరామునెడఁగల ప్రేమాతిశయముననే తా నాతని నడవులకేఁగునట్లుచేసి తాత్కాలిక విప్రవాసముచే రాజునకుఁ బుత్రశోకముగల్గి, యద్దాన శాపఫల మవశ్యముగఁ దశరథుఁ డనుభవిం చినను శ్రీరామున కేలాటి హానియుఁ గలుగదుగదా! యను సద్భావముచేఁ దానట్లుచేసితిననియు, నా విషయము వసిష్ఠ–వామదేవాది మహర్షులకుఁ దెలియుననియుఁ దెల్పి, నిర్దోషిణియైనది. తాను మునిశాప నివృత్తికై వరద్వయమును గోరుట వసిష్ఠ–వామదేవాదు లెఱుంగుదు రనుటయుఁ గవికల్పితమే, భరతునకు మరింత విశ్వాసము కుదురుటకు భాసుఁడు కైకచేనట్లు చెప్పించెను.

కైక యిట్లుచేయుటలో స్వార్థరాహిత్యము శ్రీరామునందలి మిక్కుటమగు వాత్సల్యము వ్యక్తమగుచున్నవి. తాను రాణులలోఁ జిన్నదియైనను ముదుసలియగు దశరథుఁడు మరణించుటచేఁ దనకు వైధవ్యము సంప్రాప్తమైనను గణింపక, రాముని నెవ్విధినైన సంరక్షింపవలయునను సదభిప్రాయముచేతనే కైక యా వరద్వయమును గోరినది. దశరథుఁడు పుత్రశోకముచే ననివార్యముగ జావనుండె. పుత్రశోకము రెండుతెరంగులు. పుత్ర మరణమువలనఁ గలుగునదియు, పుత్రప్రవాసము వలనఁ గలుగునదియుఁగా నగును. వీనియందు నిజవైధవ్యదుఃఖమునుగూడ

గమనింపకరెండవదగు రామ ప్రవాసజమగుపుత్రశోకముఁ గల్గింపనెంచి, రామప్రవాసరూపవరమును గోరి యద్దానఁ గల్గు పుత్రశోకముచే ముదుసలియగు దశరథుని మృతుఁడగునట్లుచేసి, శ్రీరాముని సంరక్షించిన వాత్సల్యమూర్తియే కైకేయి యనఁదగును. మరియు భరతుఁడు కైకను పదునాలుగేఁడులని యేల యంత దీర్ఘకాలము వనవాసపరిమితి యని యడుగ, నా గందరగోళమునఁ బదునాలుగునాళ్ళనఁబోయి పదునాలు గేళ్ళంటి ననితెల్ప, నతఁడామెను దూరినందుల కెంతయు వగచును. కైక, సుగుణాభిరామునకు సంభవించిన కష్టపరంపరలకు చిరము దురపిల్లి, కౌసల్యాదుల నోదార్ప నేఁగి వారి నెల్ల నోదార్చి, కన్నతల్లి కన్న నెక్కుడుగా శ్రీరాముని ప్రేమించిన ప్రేమస్వరూపిణియే కైకయని యనిపించుకొన్నది. భాసుఁడు కైకేయీపాత్ర నీ రీతి స్వార్థరహితయగు సుత్తమసాధ్వీగఁ జిత్రించి, కైకేయీ పాత్రకొక నూతన తేజమును నింపెను. భరతుఁడును, సత్పుత్రునివలె తల్లిమనసు తెలియక దుర్భాషలాడినందులకు క్షమాపణవేడుకొని తల్లియుత్తమ శీలమునకుఁ గడుంగడు సంతసిల్లును. దశరథునికన్న శ్రీరాముఁడే రాజ్యపరిపాలనము నందు సమర్థుఁడనియు, నర్హుఁడనియు లెస్సగా గుర్తించి, యిప్పటి రాజకీయవ్యవహారములలో నౌచిత్యమును జింతించి, యట్లుచేయుటచే కైక గొప్ప రాజ్యాంగవేత్త్రియనియు నూహింప నవకాశము గలుగుచున్నది.

సప్తమాంకమున, శ్రీరాముఁడు రావణునిఁ బరిమార్చి సీతతోఁ దిరిగి వచ్చుచుఁ ద్రోవలోఁ బూర్వపు చెయ్దములు స్మృతికి రాగా వాని నెల్ల సీతకుఁ జూపుచు, సరసముగ ముచ్చటించుకొనుచు జనస్థానముకడ నిలుచును. ఇంతలో భరతుఁడు తల్లులతో నటకు వచ్చి రామునిఁ గలిసికొనును. అందరును హర్షింతురు. అచ్చటనే జనస్థానమున రామునకుఁ బట్టాభిషేకము జరుపఁబడినట్టు లీ ప్రతిమానాటకమునఁ గలదు.

అయోధ్యకందరును నంది గ్రామమునుండి విమానమునఁ బోయిరనియు, నట వసిష్ఠ–వామదేవాదులచే నిక్ష్వాకుసింహాసనమున రాముఁడభిషిక్తుఁ డైనట్లు వాల్మీకిరామాయణమునందున్నది. ఈ మార్పు కల్పించుట, బహుశః అయోధ్యలో మరల నేదేని యాటంకము సంభవించునని కాబోలు భాసుఁ డిటనే పట్టాభిషేకము నిర్వహింపఁజేసెను. అభిషేకానంతర మందరును నయోధ్యకేఁగుదురు. అంతటి విభవమునను శ్రీరాముఁడు మిత్రుల సహాయమును మరవలేదు. మిత్రులసహాయముననే తానంతటి విభవమును అనుభవించుచున్నట్లు నుడివి, తన మిత్రకృతజ్ఞతను వెల్లడించి మహామహుఁ డాయెను. ఈ యంకమునఁ గవి నూతనముగా నేమియుఁ గల్పింపలేదు. కథయంతయు రామాయణగథానుసారముగనే యున్నది. నాటకము శుభాంతముగనే మోదాంతముగా నిర్వహింపఁబడినది. జనస్థానముననే రామునకుఁ బట్టాభిషేకము జరిగినట్లు నుడువుటయే యిందులోని మార్పు.

మొత్తముమీఁద నీ ప్రతిమానాటకము గవికల్పితములగు కొన్ని క్రొత్త కూర్పులతోడను, మార్పులతోడను వెలసి, మనోరంజకముగాఁ గథాగమన మెచ్చటను కుంటువడక, ప్రేక్షకలోకమునకు విసువు పుట్టించక, హాయి హాయి యనిపించుచు నిర్వహింపఁబడినది.

ప్రతిమానాటకమున సూక్తులు

1. భర్తృనాథా హి నార్యః – (అంకము. 1–శ్లో. 25)
(సతీమణులు భర్తృసనాథలే కదా!)

2. అల్పం తుల్యశీలాని ద్వంద్వాని సృజ్యంతే– (అం. 1.)
(తుల్యశీలురగు దంపతులను బ్రహ్మ సకృత్తుగా సృజించును.)

3. అవిజ్ఞాతపురుషవిశేషాః ఖలు వానరాః – (అం. 6.)
(మానవుల తారతమ్యమర్యాదల నెరుంగనివారు గదా వానరులు.)

4. ఉపోపవిశ్య ప్రవేష్టవ్యాని నగరాణీతి సత్సముదాచారః – (అం. 3.)
(ఊరిబయటఁ గొంత విశ్రాంతిఁగొని నగరములలోఁబ్రవేశించుటపెద్దల యాచారము.)

5. కల్పవిశేషేణ నివపనమిచ్ఛంతి పితరః – (అం. 5.)
(కల్పవిశేషముచేత పితృదేవతలు పిండప్రదానము నపేక్షింతురు.)

6. కా నామ మాతా పుత్రస్య అపరాధం న మర్షిష్యతి – (అం. .)
(ఏ కన్నతల్లి కుమారునియపరాధమును మన్నింపకుండును.)

7. కిం బ్రహ్మఘ్నానామపి పరేణ నివేదనం క్రియతే – (అం. 3.)
(బ్రహ్మహత్యాపాతకులకుగూడ నితరునిచే నివేదనము లేదు కదా!)

8. కుతః కోపో వినీతానాం కుతో లజ్జా దృఢాత్మనామ్ – (అం. 3.)
(వినీతులకు కోపమేల? స్థిరచిత్తులకు సిగ్గదేల?)

9. గోపహీనా యథా గావో విలయం యాంత్యపాలితాః।
ఏవం నృపవిహీనా హి విలయం యాంతి వై ప్రజాః॥
(గోపాలరక్షణములేక గోవులు నాశమొందునట్లు ప్రజలు భూపాల రక్షణములేక నాశము నొందుదురు.)

10. తిర్యగ్యోనయోఽప్యుపకృతమవగచ్ఛంతి.
(జంతువులైనను క్రోతు లుపకార మెరిగి వర్తించుచుండును)

11. న న్యాయం పరదోష మభిధాతుం – (అం. 4.)
(ఇతరుల దోషము నుడువుట న్యాయముగాదు.)

12. న వ్యాఘ్రం మృగశిశవః ప్రధర్షయంతి – (అం. 5.)
(లేడిపిల్లలు పులిని బెదిరింపలేవు.)

13. నిమ్నస్థలోత్పాదకో హి కాలః – (అం. 7.)
(మిట్టపల్లములను సరిజేయునదిగదా కాలము!)

14. నిర్దోషదృశ్యా హి భవంతి నార్యో యజ్ఞే వివాహే వ్యసనే వనే చ – (అం. 1.)

(యజ్ఞమందును, వివాహమందును, ఆపదయందును, అడవియందును స్త్రీలు ఏ యభ్యంతరమును లేక చూడఁబడఁదగుదురు,)

15. పురుషాణాం మాతృదోషో న దోషః – (అం. 4–21.)
(తల్లి చేయు దోషము తనయులది కాదు.)

16. అథవా బహువృత్తాంతాని రాజకులాని నామ – (అం. 1.)
(రాజకులములు బహువృత్తాంతములు గలవిగా నుండును,)

17. భర్తృద్రోహాదస్తు మాతాఽప్యమాతా – (అం. 3–18.)
(భర్తకు ద్రోహముగావించుటవల్ల తల్లియైనను తల్లిగానేరదు.)

18. రాజ్యం నామ ముహూర్తమపి నోపేక్షణీయమ్ – (అం. 4.)
(రాజ్య మనఁగా, క్షణమైనను ఏమరియుండఁ దగనిది.)

19. వాచానువృత్తిః ఖల్వతిథిసత్కారః – (అం. 5.)
(మంచిమాటల మాటాడుటయే అతిథిసత్కారము గదా.)

20. విధిరనతిక్రమణీయః – (అం. 2.)
(దైవ మతిక్రమింపరానిది కదా!)

21. శరీరేఽరిః ప్రహరతి హృదయే స్వజనస్తథా (అం. 1.)

(శత్రువు శరీరముననే కొట్టును. స్వజనుఁడన్నచో హృదయము నదరగొట్టును.)

22. సర్వం శ్రద్ధయా దత్తం శ్రాద్ధమ్ (అం. 5.)
(శ్రద్ధతో నొసఁగిన దేదియైనను శ్రాద్ధమే యగును.)

23. సర్వశోభనీయం సురూపం నామ – (అం. 1.)
(సురూపమన సర్వవిధముల శోభనీయముగా నుండుటయే కదా.)

24. సులభాపరాధః పరిజనో నామ – (అం. 1.)
(సేవకుఁడు తరచు తప్పులు చేయుచుండును గదా.)

25. స్వపుత్రః కురుతే పితుర్యది వచః కస్తత్ర భో విస్మయః – (అం. 1.)
(కొడుకు తండ్రిమాట వినుటలో నాశ్చర్యమేమున్నది.)

మహావీరచరితము-భవభూతి

"చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్।
ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్॥

అను సూక్తి మేరకు శ్రీరామునికథ పలువురుకవుల నాకర్షించి చిత్ర విచిత్రములుగా శ్రవ్యకావ్యములుగను, దృశ్యకావ్యములుగను వెలయింపఁ జేసినది. వాఙ్మయరంగమున సిద్ధహస్తులగు కాళిదాస భవభూత్యాదులు తమ సర్వస్వమునట్టి కథా రచనములందే ధారవోసిరి. వారి హృదయసారమే యా యా మూల కథల నాధారము గావించికొని పొంగి పొరలి గ్రంథరూపముఁ దాల్చినది. అవతారపురుషుఁడగు శ్రీరాముని చరితమును గవులు వారి వారి మనఃపరిపాకానుసారము మూలమునందు లేనివికొన్ని చేర్చియు, కలవికొన్ని తీసివేసియు, వారికిఁ దోఁచినరీతి నత్యుత్తమ మగునట్లు చిత్రించిరి. భాసుని తర్వాత నాటకకర్తలలో రామకథనుడివిన కవివర్యుఁడు తొలుత భవభూతియే యనఁదగును. ఈ భవభూతి వశ్యవచనుఁడగు మహావిద్వాంసుఁడు. ఇతఁడు సంస్కృతమున నుత్తమములగు మూడు నాటకముల రచించెను, అవి మహావీరచరితము, మాలతీమాధవము, ఉత్తరరామచరితము ననునవి. అందు మహావీరచరితము శ్రీమద్రామాయణమునందలి రామపట్టాభిషేకాంతముగల కథాభాగము నాధారముగఁజేసికొని వ్రాయఁబడినది. ఉత్తరరామచరిత నామమాత్రముననే సీతా విప్రవాసాద్యుత్తరగాథ యని తెలియుచున్నది, ఇట్టి మహావీరచరితము, ఉత్తరరామచరితమను నీ రెండు రామకథా నాటకములలోఁ దొలుత మహావీరచరితమున రామకథ నీ మహాకవి యెట్లు సాగించెనో యేమేమి మార్పులు గావించెనో యద్దాన కథకెట్టి సొంపు ఘటిల్లెనో మున్నగు నంశముల నరయుదము.

కథాసంగ్రహము

ప్రథమాంకము: విశ్వామిత్రమహర్షి దశరథానుమతిని శ్రీరామ లక్ష్మణులతో నిజతపోవనమగు సిద్ధాశ్రమమునకువచ్చును. కౌశికుఁడు యజ్ఞదీక్షఁబూననెంచి జనకు నాహ్వానింప నాతఁడును సమారబ్ధ సప్తతంతుండగుట నిజసోదరుఁడగు కుశధ్వజు నంపును. కుశధ్వజుఁడును సీతోర్మిళలతో సిద్ధాశ్రమమునకు వచ్చి యట విశ్వామిత్రుచెంతనున్న దాశరథులఁజూచి పరమానందభరితుఁడగును. అట శ్రీరామతేజః స్పర్శచే షాషాణముగనున్న యహల్య స్త్రీ రూపముఁ దాల్చుట తిలకించి రామమాహాత్మ్యము కొనియాడుచుఁ గుశధ్వజుఁడు సీతను రామున కీయ సంకల్పించును. ఇంతలో రావణప్రేషితుఁడగు వృద్ధరాక్షసుఁడు సర్వమాయుఁడనువాఁడు రావణనిమిత్తము సీతను వరింప సిద్ధాశ్రమమునకు వచ్చును. ఆ సమయముననే తాటక యజ్ఞ విఘ్నమొనర్ప నేతెంచును. శ్రీరాముఁడు స్త్రీ యని సంశయించియు గురునాజ్ఞ నారక్కసిని జక్కడంచును. విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులకు జృంభకాస్త్రముల నుపదేశింపనవి వారికిఁ బ్రసన్నములగును. అంత విశ్వామిత్రుఁడు కుశధ్వజుని శివధనుస్సును ధ్యానమాత్రమున సన్నిధినుండ సంకల్పింప నా ధనువు నట సిద్ధముకాగా శ్రీరాముఁడద్దాని నెత్తి యెక్కుపెట్టనది భగ్నమగును. ఈ యద్భుత కృత్యములనెల్ల సర్వమాయుఁడు తిలకించుచు మనమున నీసుఁబూని రావణునకుఁదెల్ప సంకల్పించును.విశ్వామిత్రుఁడు శునశ్శేఫుఁడను శిష్యు నయోధ్యకంపి దశరథు నాహ్వానించును. దాశర థులకుఁ గ్రమముగా సీతోర్మిళామాండవీశ్రుతకీర్తుల నీయ సంకల్పింతురు. ఇంతలో సుబాహు మారీచులు గోచరింప సుబాహువును జంపి మారీచుని గడ్డిపరకవలె నెగురగొట్టును, ఈ కృత్యములనన్నింటిఁ బ్రత్యక్షముగఁ జూచిన సర్వమాయుఁడు రావణమంత్రియగు మాల్యవంతున కెరింగింప నేగును.

ద్వితీయాంకము: ప్రవేశకమున సర్వమాయుఁడు సిద్ధాశ్రమమునఁ దాఁజూచినదాది రామప్రభావమును, సీతాకల్యాణపర్యంతముగల వృత్తాంతమునెల్ల రావణామాత్యుఁడగు మాల్యవంతున కెరింగించును. శూర్పణఖా మాల్యవత్సంభాషణమున దాశరథుల వివాహములు జరిగెననియుఁ దెలియును. శూర్పణఖామాల్యవంతులు శివధనుర్భంగ విషయముఁదెల్పి పరశురాముని శ్రీరామునిపైకిఁ బంపఁ బన్నాగముపన్ని పరశురామునికొరకు మహేంద్రమున కరుగుదురు.

అంతఁ బరశురాముఁడు మిథిల కేతెంచి రాముఁగనుగొన నంతః పురమున కేఁగును. అట రామునకై బిగ్గరగాఁ గేకలువేయుచుండ రాముఁడు సీతచే నాపఁబడి కాలవిలంబనముచేయును. అంతఁ బరశురాముని గొనియాడుచు భయమావంతయులేక సీతనోదార్చి తానే పరశురామున కెదురుగాఁజని తా వచ్చినట్లు తెల్పును. పరశురాముఁడు నిజమహిమను జాటును. రాముఁడు నిర్భయముగా నాతనితో సంభాషించును. జనకశతానందులును నటకువచ్చి రాముని మన్నింపఁ గోరుదురు. ఇంతలో రామునకుఁ గంకణవిసర్జనముఁగావింపలోనికిఁబిలువ రాముఁడేగును. సుమంత్రుఁడు జనకాదుల వసిష్ఠవిశ్వామిత్రులు పిలుచుచున్నారన దశరథునికడ కంద రేగుదురు.

తృతీయాంకము: వసిష్ఠ విశ్వామిత్ర శతానంద జామదగ్న్యులు కూర్చుండియుందురు, వసిష్ఠ విశ్వామిత్రులు పరశురాముని ఘాతుకకృత్యమునుండి విరమింప నెన్నియో పర్యాయములు బతిమాలుకొందురు. జనకుఁడును వేడికొనును. ఎన్నిపర్యాయములు చెప్పినను భార్గవుఁడు వినఁడాయె. జనకునకంత కోప మెక్కువయి ధనుర్ధారియై భార్గవు నెదుర్కొన సిద్ధపడును. దశరథుఁడును

జనకపక్షావలంబియై భార్గవుని శాంతింప వేడికొనును. వసిష్ఠుఁడు మరల వారింప యత్నించినను విశ్వామిత్రుఁడెంత చెప్పినను జామదగ్న్యుఁడు పెడచెవిని బెట్టి విశ్వామిత్రునిగూడ ధిక్కరించును. అంత శ్రీరాముఁడు స్వయముగవచ్చి భార్గవునెదుర్కొన నిలిచి నమస్కరించును. పరశురాముఁడు శ్రీరాముంగని 'జామదగ్న్యుని గెలుతువా?' యని పరిహసించుచు నిజధనువును సజ్యముచేసి టంకారముచేయును. శ్రీరాముడు గెలుచును. అందరు నిష్క్రమింతురు.

చతుర్థాంకము: శూర్పణఖామాల్యవంతులు మిశ్రవిష్కంభమున సంభాషింతురు. రామునడవులపాలుసేయ మాల్యవంతుఁడు శూర్పణఖను మంథర శరీర మావేశించి తగుకార్యమును జేయఁగోరును. అడవుల దిజ్మూఢుఁడై తిరుగు సమయమున సీతాపహరణము రావణుఁడు సేయ ననువగుననియు. భార్యావిరహితుఁడై తిరుగుచుండ వాలిచే నా రాముని జంపింప వీలగుననియు, రావణక్షేమకాంక్షియై విభీషణాపసరణమునకును ఖరదూషణాదుల వేరుపరుపను గొప్ప పన్నుగడఁ బన్నును.

వసిష్ఠవిశ్వామిత్రదశరథజనకులుగూడి రాముగుణములను ఋషిప్రభావమును ముచ్చటింతురు. రాముఁడట్టి పరాక్రమవంతుఁడగుట నాతని పూర్వ పుణ్యపరిపాక మందురు. రాముఁడు జామదగ్న్యుఁదన యపరాధము మన్నింపవేడును. భార్గవుండును నపకారముగాక యుపకృతియేయని యెంచి రాముని ధీరోదాత్త గుణమును గొనియాడి వసిష్ఠ విశ్వామిత్రులకు నమస్కరించి వారియెడఁ దాఁగావించిన యపచారము మన్నింపఁగోరును. వసిష్ఠ విశ్వామిత్రులు నాతని నోదార్చి యాతని పవిత్రతను కొనియాడుదురు. ఆవల జనకదశరథులును జామదగ్న్యునితో సరసల్లాపములాడుదురు. పరశురాముఁడు వెడలిపోవుటకు

రామునను మతిఁగోరును. విశ్వామిత్రుఁడు వసిష్ఠుని నిజాశ్రమమున కాహ్వానింప వారిరువురును జానకీరాముల నాశీర్వదించి వెడలుదురు. పరశురాముడును నిజధనువును శ్రీరామునకు దండకాటవిని రాక్షసవధమున కనుకూలించునని యొసఁగి తా వెడలిపోవును.

శూర్పణఖ మంథరావేషధారిణియై శ్రీరాముకడకు కైక సందేశముగల యుత్తరమును దెచ్చియిచ్చును. కైక తా వరించిన రెండువరములను దెలియఁ జేయుచు రాముని నెరవేర్పఁగోరును. దశరథుఁడు రామపట్టాభిషేక మహోత్సవోద్యుక్తుఁడై యుండును. రాముఁడు కైక వరద్వయమును లక్ష్మణునిచేఁ జదివించి యాలస్యముచేయుట తగదని తండ్రి నోదార్చి పెద్దలకుఁ బ్రదక్షిణ మొనర్చి సీతాలక్ష్మణులతోఁ దరలిపోవును. భరతుఁడు వెంబడించి రామపాదుకల నర్థించి వానినిబొంది రామునానతి పితరులగొల్వ నటనే నిలుచును. యుధాజిత్తు వెన్నంటి రాగోరునుగాని రాముఁడాతని మర్యాదగా వెనుకకు బంపును. త్రోవలో నిషధాధిపతియగు గుహునివలన విరాధుని దుండగముల విని వానిని వధింప వారు చిత్రకూటము, దండకాటవి, జనస్థానముల కేఁగ సంకల్పించి తొలుత ప్రయాగ సమీపముననున్న చిత్రకూటమున కేఁగుదురు.

పంచమాంకము: శుద్ధవిష్కంభమున సంపాతి జటాయువులు, విరాధవధము, శూర్పణఖానాసాచ్ఛేదము, ఖరదూషణాదుల సంహారము, సీతాపహరణము మున్నగు నంశములఁ దెలియఁజేయుదురు.

రామలక్ష్మణులు జటాయుమృతికిఁ జాల విచారపడి రాక్షస సంహారార్థము దక్షిణాభిముఖులై జనస్థానభాగములఁ జేరుదురు. అట శ్రమణయను తాపసి రామాన్వేషిణియై వచ్చుచుండఁ గబంధునిచే బంధింపఁబడివానినుండి తన్ను రక్షింపశరణువేఁడుచు మొరపెట్టుచుండ

నా యార్తనాదము విని లక్ష్మణుఁ డాకబంధుని వధించి శ్రమణను విడిపించెను. ఆమెయు రావణ సోదరుఁడగు విభీషణుఁడు ఋశ్యమూకపర్వతమున సుగ్రీవమిత్రు నాశ్రయించియున్నాఁడనియుఁ దనతో ధర్మరక్షకుఁడగు శ్రీరాముఁడే శరణమని సందేశమంపెననియుఁ దెల్పును. శ్రీరాముఁ డందులకంగీకరించి సీతావిషయ మడుగ రావణానీతయై పోవుచుండ నామె యుత్తరీయమును బడవేయ దానిని ఋశ్యమూకవాసులగు హనుమదాదులు రామగుణపక్షపాతులు గ్రహించిరనియుఁ దెల్ప వారు ఋశ్యమూకమునకుఁ బయన మగుదురు. ఇంతలో లక్ష్మణుఁడు కబంధకళేబరమును జితింబేర్చి దహింప, నందుండి శాపవిముక్తుఁడగు నా కబంధుఁడు దివ్యపురుషుఁడై రాముని గొనియాడి 'మాల్యవత్ప్రయుక్తుఁడై వాలి మిమ్ముఁజంపనున్నాఁడు' అని తెల్పియంతర్హితుఁ డగును. శ్రమణ వాలి వృత్తాంతము నుడువుచు దుందుభికాయముంజూప రాముఁడద్దానిని పాదాంగుష్ఠంబున విక్షేపించి పరిసరకాంతారశోభం గాంచుచుండును. అంతలో వాలి స్వయముగ నిష్టము లేకున్నను మాల్యవద్బలాత్కారమున రాముని వధింప నెదురేఁగి రాముం గన్నులారఁ గాంచి రామునితోఁ బోరిమడిసి రాముహస్తమున మరణించుట కూరడిల్లును. ఇంతలో సుగ్రీవ విభీషణులు వత్తురు. వాలిసుగ్రీవుని రామున కర్పించి యగ్నిసాక్షికముగ మైత్రీధర్మము నెరపఁగోరును. రామసుగ్రీవు లట్ల చేయుదురు. వాలి విభీషణునిగూడ రామున కెరుక పరచును. రాముఁడు లక్ష్మణుని వారల కెరుకపరుప నందరు మిత్రు లగుదురు. వాలి కంఠగతప్రాణుడయ్యుఁ గపికుంజరుల రావించి వారినెల్ల రానున్న రామరావణయుద్ధమున వీరత్వముఁజూప నుత్సాహపరచును.

షష్ఠాంకము: మాల్యవత్త్రిజటా సంభాషణమున వానరులు సీతాన్వేషణార్థము నల్దిశల వెడలినారనియు, హనుమంతుఁడు సీతతో

మాటాడి యభిజ్ఞానము గ్రహించి లంకను దహించి యక్షకుమారుని వధించెననియు, రావణుని మరల్ప మండోదరి యత్నించుచున్నదనియు, రావణుఁడు తనబుద్ధిని మరల్చుకొనుట లేదనియుఁ దెలియుచున్నది.

అంత రావణుఁ డశోకవనమందలిసీతను జూచుచుండును, మండోదరి సమీపించి యాతనితో రాముఁడు సుగ్రీవునిగూడి కపిసైన్యములతో సముద్రమును సేతుమూలమున దాటి వచ్చియున్నట్లు తెల్పును. రావణుఁడు నమ్మక నిజప్రతాపమును జెప్పుకొనును. ప్రహస్తుఁడు సమీపించి రాముఁడు స్కంధావార నివేశనము సల్పి లంకను ముట్టడించుచున్నట్లు నుడువును. ఇంతలో అంగదుఁడను కపివరుఁడు రామదూతగా నరిగి రావణునితో సీతను రామున కర్పించి శరణువేడికొనుమని రామసందేశమును దెల్పి మరలిపోవును. రావణుఁడుగ్రుఁడై తనవారిని యుద్ధమునకుఁ దరలి వానరుల మర్దింప నాజ్ఞాపించును. కాని యింతలో రాక్షసులు పెక్కుమంది హతులైనట్లు విని రావణుఁడు సపుత్రపరివారుఁడై స్వయముగ రణరంగమునకు వచ్చును.

దేవేంద్రుడు, చిత్రరథుఁడు నాకసమునుండి యుద్ధమును దిలకించుచుందురు. యుద్ధమున కోట్లకొలది వీరులు హతులగుచుందురు. దేవేంద్రచిత్రరథు లారణరంగ బీభత్సమును గమనించు చుందురు. రావణుఁడు మేఘనాదుని గలసి దాశరథుల నెదుర్కొనును. సుగ్రీవాదులు కుంభకర్ణాదులతోఁ బోరుదురు. మేఘనాద రావణులతోబోరి లక్ష్మణుఁడు మూర్ఛిల్లును. రాముండును దమ్ముని జూచి మూర్ఛిల్లును. హనుమంతుఁడు జాంబవదాదేశమున సంజీవకపర్వతమును దెచ్చి వారల పురరుజ్జీవింప జేయును. మరల యుద్ధము తీవ్రమగుచు రాక్షస బలము క్రమ క్రమముగా క్షీణించుచుండును. రామలక్ష్మణులు క్రమముగా బ్రహ్మాస్త్ర నారాయణాస్త్రములఁ బ్రయోగించి రావణమేఘనాదుల సంహరింతురు.

దేవతలు పుష్పవృష్టి కురిపింతురు. ఇంద్ర చిత్రరథులు నిజస్థానముల కేగుదురు.

సప్తమాంకము: లంకా అలకా పట్టణములు మిశ్రవిష్కంభమున సంభాషించుచు రాక్షసకులనాశనమును, సీతాగ్ని శుద్ధిని, విభీషణపట్టాభిషేకమును దెల్పుదురు.

విభీషణుఁడు రామభద్రగమనమునకు విమానము సిద్ధపరచును, భరతునకు శుభసందేశముఁ దెలుప హనుమంతుడు ముందుగాఁ బోవును. అందరు విమానారూఢులై యయోధ్యకుఁ బయలుదేరుదురు. త్రోవలో వారు సాగరమును, కావేరీ తీరమును, అగస్త్యాశ్రమమును దండకారణ్య ప్రదేశములు దాటి సూర్యనక్షత్రమండలముల మీఁదుగాఁ గైలాసాంజన కాంచన గంధమాదన పర్వతములఁ దిలకించి క్రమముగా భూలోకమునకు దిగుచు సిద్ధాశ్రమ ప్రదేశములఁ గాంచుచుండ నింతలో హనుమంతుఁడు, భరతుఁడు సైన్యముతో రామునాహ్వానింప వచ్చుచున్న వార్తఁదెల్పగా విమానము దిగ నందరు నవతరింతురు. భరతశత్రుఘ్నులు పెద్దలకు నమస్కరింతురు. ఆవల రాముఁడు సుగ్రీవ విభీషణుల నెరుకపరచును. భరతుఁడు, రామపట్టాభిషేకమునకు సిద్ధపరచి వసిష్ఠుఁడు రామునకై యెదురుచూచుచున్నట్లు తెల్పును. రామలక్ష్మణులు వసిష్ఠునకును నరుంధతికిని తల్లుల కందరకును నమస్కరింతురు. సీతయు నందరకు నమస్కరింప వీరమాతవు కమ్మని యాశీర్వదింతురు. ఇంతలో విశ్వామిత్రుఁడు స్వయముగ వచ్చి రామున కభిషేక నిర్వహణముఁ గావించును. దేవతలు దుందుభినాదములతో కుసుమ వృష్టిఁగురిపింతురు. కృతాభిషేకుఁడైన రాముఁడు వసిష్ఠ విశ్వామిత్రుల కిరువురకు నమస్కరింప వారు నాశీర్వదింతురు. రాముడు విశ్వామిత్రానుమతి సుగ్రీవవిభీషణుల నిజరాజ్యములకనిపి విమానమును గుబేరున కంపును. భరతవాక్యముతో కథ ముగియును.

భవభూతి

భవభూతి తనకుఁ బూర్వులైన నాటకకర్తలవలెను, కవీశ్వరులవలెను గాక యపూర్వముగ తన వంశవృత్తాంతమును, తన వృత్తాంతమును గొంత తెల్పెను. అతని తొలినాటకమగు నీ మహావీరచరితమునఁ గ్రంథారంభముననే ప్రస్తావనయందు, 'అస్తి దక్షిణాపథే పద్మపుర నామ నగరం। తత్రకేచిత్తైత్తిరీయాః కాశ్యపాశ్చరణగురవః పంక్తిపావనాః పంచాగ్నయో ధృతవ్రతాః సోమపీథినః ఉదుంబరనామానో బ్రహ్మవాదినః ప్రతివసంతి! తదాముష్యాయణస్య తత్రభవతో వాజపేయయాజినో మహాకవేః పంచమః సుగృహీతనామ్నో భట్టగోపాలస్య పౌత్రః పవిత్రకీర్తేర్నీలకంఠస్యాత్మసంభవః శ్రీకంఠపదలాంఛనః పదవాక్యప్రమాణజ్ఞో భవభూతిర్నామ జతుకర్ణీపుత్రః అని తెల్పియున్నాఁడు.

'దక్షిణాపథమున పద్మపురమను నొక నగరముగలదు. అందు కొందరు బ్రాహ్మణులు తైత్తిరీయయజుశ్శాఖీయులు, కాశ్యపాన్వయులు, మహోపాధ్యాయులు, పంక్తిపావనులు, గార్హపత్యాహవనీయ దక్షిణాగ్ని సభ్య ఆవసథ్యములను పంచాగ్నులు గలవారును, ధృతవ్రతులు, సోమపీథులు, వేదాంతవేద్య పరబ్రహ్మ ప్రవచనశీలురును, ఔదుంబరులను నింటిపేరు గలవారు వసించుచున్నారు. వారిలో నొకరు వాజపేయయాజియు, పూజ్యుఁడునైన మహాకవియను నతని పౌత్రుని పౌత్రుఁడు కీర్తనీయుఁడగు భట్టగోపాలుఁడు. ఆ భట్టగోపాలుని పౌత్రుఁడును, పావనయశస్కుఁడగు నీలకంఠుని తనూజుఁడును, తర్కవ్యాకరణ మీమాంసాభిజ్ఞుఁడు నగు భవభూతియను పేరుగల కవి జతుకర్ణీ పుత్రుఁడు' అని స్వోదంతము నెరుకపరచెను.

ఇట్లు కవీశ్వరులు తమ వంశవృత్తాంతాదులఁ బేర్కొనుటచే, సభ్యుల కొకవిధమైన యాదరాభిమానములు నీ కృతియందు జనించును.

పై విధమున నీ భవభూతి పదవాక్యప్రమాణజ్ఞుఁడనియుఁ దన తాతముత్తాతలు సోమపీథులు, పంచాగ్నులు, వాజపేయయాజు లనియుఁ బేర్కొనుటచేఁ దనకుఁగల వైదికకర్మాసక్తిని వ్యక్తముచేయుచున్నాఁడు, తన గురువు పరమహంసశ్రేష్ఠుఁడగు జ్ఞాననిధియనియుఁ దెల్పియున్నాఁడు. ఒకానొక మాలతీమాధవగ్రంథపు వ్రాఁతప్రతియందు షష్ఠాంకము చివర, భవభూతి కుమారిలభట్టునకు శిష్యుఁడనని తెల్పియున్నాఁడట. [1] మహావీరచరితనాటకాదిని యథార్థనామకుఁడగు జ్ఞాననిధి తనగురువని తెల్పినవాఁడు, మాలతీమాధవమున పైవిధమున కుమారిలభట్టశిష్యుఁడనియుఁ బేర్కొనుట యెంతవరకు సమంజసమో విచారణీయము. తన పేరువిషయమునఁగూడ మొదట శ్రీకంఠుఁడనియుఁ దర్వాత భవభూతి యనియుఁ దెల్పుటచేఁ దొలుతటిపేరు శ్రీకంఠుఁడనియుఁ, దర్వాతఁ దన శివభక్తిపారమ్యమున శివప్రసాదానుభూతిచే భవభూతి (భవునిచే నొసఁగ బడిన భూతిగలవాఁడు) యని ప్రసిద్ధనామము వహించినట్లును దెలియుచున్నది.

దేశకాలాదులు

భవభూతి దక్షిణాపథమందలి పద్మపుర నాగవాసులసంతతికిఁ జెందినవాఁడగుట, నీతని జన్మస్థానము దక్షిణాపథముగనే యుండి యుండవలయును. ఈతని గ్రంథములకు వ్యాఖ్యానకారుఁడగు ఘనశ్యాముఁడు, భవభూతిశైలినిబట్టి ద్రావిడదేశీయుఁడని నుడివెను. దీని కనుగుణముగనే మహావీరచరితమున జనస్థానమధ్యమునను న్న ప్రస్రవణగిరినిఁజూచి జటాయువు, 'అయమవిరళానోకహనివహ నిరంతర

1. ఇతి శ్రీ భట్టకుమారిల శిష్య భట్టభవభూతికృతే మాలతీమాధవే షష్ఠాంకః- (Colophone of one manuscript of Malathi Madhavam, K.P.Kulkarni).

స్నిగ్ధ నీలపరిసరారణ్యపరిశుద్ధ గోదావరీ ముఖకందరః సతత మభిష్యందమాన మేఘమేదురితనీలిమా జనస్థానమధ్యగో గిరిః ప్రస్రవణోనామ! ఇయం చ పంచవటీ' యని వచించును. ఉత్తరరామచరిత మాలతీమాధవములందును, గోదావరీ పరిసరప్రాంతారణ్యప్రదేశ వర్ణనములును, వింధ్యాటవీపరిసర ప్రాంగణ వర్ణనములును, భవభూతిని దాక్షిణాత్యునిగనే తెల్పుచున్నవి. ఈతని వర్ణనముల కనుగుణములగు దృశ్యములు, కనూజీ పట్టణ పరిసరము లందును గానవచ్చుచున్నవి. డాక్టరు భండార్కరుగారు భవభూతిని, మధ్యపరగణాలలోని చాందా, లేక చంద్రపురమను పట్టణపరిసరవాసి యని తెల్పిరి.[1] కన్నింగ్‌హాము, భవభూతివర్ణించిన దృశ్యములుగలప్రదేశము లాతనిజన్మస్థలమునకు సంబంధించినవి కావనియు, నా వర్ణనావిషయములు కనూజాధిపతియగు యశోవర్ముని యాదరణమున వ్రాయఁబడినవనియుఁ దెల్పియున్నాఁడు.[2] వీనినిఁబట్టి చూడ భవభూతి దక్షిణాపథముననే జననమంది, రాజాశ్రయమున యశోవర్ముని యాస్థానముఁజేరి, యటనే యీ గ్రంథరాజముల వ్రాసియుండవచ్చునని తోఁచుచున్నది.

భవభూతి యశోవర్మునియాస్థానమున నున్నతఱి 'వాక్పతి' యని మరియొక కవి యీతనితో నుండినట్లు కాశ్మీరచరిత్రవిషయము తెలుపుచున్నది. రాజతరంగిణిలో,'కవి వాక్పతిరాజ శ్రీ భవభూత్యాది సేవితః। జితో యయౌ యశోవర్మా సద్గుణ స్తుతివందితాం॥' (రా.త. 4-145). పైవిషయమిట్లు పేర్కొనఁబడియున్నది. యశోవర్మ, కాశ్మీరవాసియగు

1. Dr. Bhandarkar makes him a native of some place near chandrekar or chanda in C.P. kulkarni. Page 154. Sanskrit Drama & Dramatists.

2. That the place of Bhavabhuthi's nativity was not the scene of his literary triumphs and that these were attained under the patronage of the Prince of Hindusthan.
"Hindu Theatre"- Wilson.

లలితాదిత్యునిచే జయింపఁబడెననియు, నా లలితాదిత్యుఁడు కాశ్మీరమును, (693-729 A.D) వరకు పాలించెననియు నుండుటచే, నీ భవభూతి యాకాలమునకుఁ జెందినవాఁడు కావలయును. వాక్పతిరాజు తన 'గౌడవధ' యను కృతియందు, 'భవభూతి జలనిధి నిర్గత కావ్యామృత రసకణా ఇవ స్ఫురంతి॥' అని భవభూతి కవనమొక సుధాబ్ధియని నుడువును. ఈ వాక్పతిప్రణీతమగు నీ ప్రాకృతగ్రంథమందే (గౌడవధ) యొక సూర్యగ్రహణము వర్ణింపఁబడియున్నది. జాకొబి (Jacobi) యీ గ్రహణమును (14th August 733 A.D.) కి సరిపోవునట్లు తెల్పియున్నాఁడు. కావున నీ భవభూతివాక్పతిరాజు లిర్వురును నాకాలమునకు సంబంధించినవారని తెల్లమగుచున్నది.

భవభూతి, కుమారిలభట్టుశిష్యుఁడని ఒకానొక మాలతీమాధవ వ్రాఁత ప్రతిలోఁ గానవచ్చుచున్నదని తెల్పితిమి కదా. ఈ కుమారిలభట్టు సుమారు 800 ఎ.డి కి నిర్ణయింపఁబడిన శంకరాచార్యులకుఁ గొంచెము పూర్వుఁడు. కాఁబట్టి పై గ్రహణసంబంధముచేతను, కుమారిలభట్టు శిష్యసంబంధముచేతను నీ భవభూతి యేడవశతాబ్దము చివరిభాగమునకును, నెనిమిదవశతాబ్ద పూర్వభాగమునకును జెందినవాఁడని తేలుచున్నది.

బాణుఁడు హర్షచరితమునఁ గవులపట్టిక నొసంగుచు నందు భవభూతినిఁ బేర్కొన లేదు. బాణుఁడు హర్షునికాలమువాఁడగుట నేడవశతాబ్దపు పూర్వభాగమునకుఁ జెందినవాఁడగుట, తర్వాతికాలము వాఁడగు భవభూతినిఁ బేర్కొనలేదు.

ఈ భవభూతిరచనలలోనివాని నుదాహరణములుగాఁ బేర్కొనినవారి కాలము గమనించినను, భవభూతికాలము పై కాలమునకు సరిపోవుచున్నది. లలితాదిత్యుని మనుమఁడగు జయాపీడుని గురువగు క్షీరస్వామి, భవభూతి

నుదహరించినాఁడు. ఈ క్షీరస్వామి, (751-785 A.D.) కాలమువాఁడని డాక్టరు భండార్కర్ నుడివియున్నాఁడు. భవభూతినిఁ బేర్కొనిన యితర కృతి కర్తలు క్షేమేంద్రుఁడు, రాజశేఖరుఁడు, ధనంజయ ధనపాలురు, వామనుఁడు, బల్లాలుఁడును. క్షేమేంద్రుఁడు కాశ్మీరదేశపు అనంతరాజునకు సమకాలికుఁడు (1028-1063). రాజశేఖరుఁడు కనూజాధిపతియగు మహేంద్రపాలుని గురువు. (903-967). ధనంజయ ధనపాలురు ముంజనృపతి నాశ్రయించినవారు (974-995). వామనుఁడు ఎనిమిదవశతాబ్దపు చివరిభాగమువాఁడు.

మరియు, కాళిదాసు భవభూతులు సమకాలికులనియు నొక ప్రవాదము కలదు. కాని యది చారిత్రకముగ నమ్మఁదగినది కాదు. బల్లాలుఁడు భోజ ప్రబంధమునందుఁ గాళిదాస, భవభూతి, బాణ, మయూరులనందర ధారానగర భోజాస్థానమున నుండినట్లు నుడివెను. కాని యా వరుస కాలానుగుణముగనో, లేక వారి కవితాసామర్థ్య తారతమ్యము ననుసరించియో వారి నవ్విధిఁ బేర్కొని యుండునని తోఁచుచున్నది. అంతియకాని పైవారందరు నొక్కకాలమువారనుట పొసఁగదు.

మరియు భవభూతి మాలతీమాధవమున వర్ణించిన యఘోరఘంటుఁడు, కపాలకుండలవంటి పాత్రలు, వారి ఘోరాద్భుత కృత్యములవంటి కృత్యములును నాకాలపుదేశీయులలోఁ దంత్రశాస్త్ర ప్రవృత్తితోఁ జేయు కృత్యములును గొంచె మించుమించు నాకాలమునకు సంబంధించిన దండిదశకుమారచరితమునందును, బాణుని కాదంబరి యందును గానవచ్చుచున్నవి. కొన్ని సాంఘికాచారములు వీరికృతులందు సమానముగా గోచరించుటచే నీ భవభూతి 700A.D.కి కొంచెము పూర్వుఁ డును, కొంచెము తర్వాతివాఁడునై 680-750 A.D. కాలమునకుఁ జెందినవాఁడని స్పష్టముగఁ జెప్పవచ్చును.

మహావీరచరితము-మార్పులు

వాల్మీకిరామాయణమునందలి కథకంటె నీ నాటకమున భవభూతి పెక్కు మార్పులు గావించినాఁడు. పురాణగాథకొక నవ్యత నాపాదింపనెంచి, రామమాహాత్మ్యము నెక్కుడుగా వర్ణింపనెంచి యిట్టిమార్పులు గావించి నాటకోచితముగ రసపుష్టినాపాదించి రాముని మహావీరునిగఁ జిత్రించెను. ఈ మహావీర చరితము భవభూతికృతులలో మొదటిది. వాఙ్మయము మానవజీవిత ప్రతిబింబ మనువిషయము లెస్సగఁ దెలిసినవాఁడగుటచే, భవభూతి, యాదర్శప్రాయుఁడగు రాముఁడు క్రూరాత్ముఁడగు రావణు నడంచి, ధర్మపాలనముఁ గావింప ననుకూలమగునట్లు రామ మాహాత్మ్యమును తొలుతనుండి వర్ణించుచు, దుండగీఁడగు రావణునడంప ననువగుసన్నివేశముల లోకవృత్తము ననుసరించి కల్పించెను. మాల్యవంతుని రాజ్యాంగవేత్తగను, రావణ క్షేమాభికాంక్షిగను, యుక్తికిఁ బ్రతియుక్తిగ దుదవరకుఁ బట్టువీఁడక యెన్నియో ప్రయత్నములు చేయునట్లును జిత్రించెను. వీనికిఁదోడు సత్సమాగమము, వారి మర్యాదలు, సామర్థ్యగర్వము, మైత్రీలక్షణము మున్నగు లోకవిషయములను జక్కగా మనోరంజకముగా వర్ణించెను.

భవభూతికాలమునకుఁ బూర్వము హర్షునికాలమున, రత్నావళి, ప్రియదర్శిక మొదలగు నాటకములవలనఁ బ్రజలలో నాటకమన, విషయోపభోగమును. నానందానుభూతి గల లోకవృత్తమను గాఢాభిప్రాయముండెడిదనితోఁచుచున్నది. కాళిదాసనాటకములందును, ప్రేమ, వలపుతోఁగూడి స్వార్థపరమైనట్లుండుటచే నట్టివిషయమే ప్రజలకు రంజకముగనుండి యుండనోపు. బహుభార్యాత్వము, వారిశృంగారవిలాసచేష్టలు వర్ణితములైనపుడు ప్రేక్షకుల కానందముగనుండెడిది. భవభూతి వలపులేని ప్రేమను దివ్యముగ, తుచ్ఛ

కామ శృంగార రహితముగ వర్ణించినపుడు ప్రజలకు నచ్చకపోవచ్చును. పైపెచ్చు భవభూతిని పరిహసించి హేళనముగూడఁ జేసియుందురని తోఁచుచున్నది. ఉత్తరరామచరితమున, "అద్వైతం సుఖదుఃఖయో రనుగుణం సర్వాస్వవస్థాసు య। ద్విశ్రామో హృదయస్య యత్ర జరసా యస్మిన్నహార్యోరసః। కాలే నావరణాత్యయాత్ పరిణతే యేత్స్నేహసారే స్థితం, భద్రం ప్రేమ సుమానుషస్య కథ మప్యేకం హి త త్ప్రాప్యతే॥" అని ప్రేమ స్వరూపము నుదాత్తముగా, నుత్తమముగా వర్ణించిన భవభూతియొక్క ప్రేమతత్త్వము జాంతవప్రేమాభిలాషులకు, పామరబహుళమగు ప్రజానీకమునకు నచ్చునా? కష్టసుఖములం దొక్కరీతిగను, సర్వావస్థల సమానముగనుండి, హృదయమునకుఁ దృప్తినొసఁగుచు పోనుపోను స్నేహసారముగఁ బరిణమించు హృదయాహ్లాదిభావమే ప్రేమయని భవభూతితత్త్వము. అట్టిప్రేమ యెవ్వనికిఁ బ్రాప్తించునో, వాఁడే లోకమున ధన్యుఁడని యతని భావము. ఇది ప్రజలకు నచ్చకపోవుటచేతనే కాఁబోలు భవభూతి తన రెండవ నాటకమున–

'యే నామ కేచి దిహ నః ప్రథయంత్యవజ్ఞాం
జానంతి తే కిమపి తాన్ ప్రతి నైష యత్నః।
ఉత్పత్స్యతే మమ తు కోపి సమానధర్మా
కాలో హ్యయం నిరవధిర్విపులా చ పృథ్వీ॥'

యని మాలతీమాధవమున నుడివియున్నాఁడు.

భవభూతిదృక్పథమే వేరు. మహావీరచరితమున, రాముని మహావీరునిగఁ జిత్రించు నుద్దేశముతోడనే నిజమనః పరిపాకోచితముగ మార్పులు కూర్పులు గావించినాఁడు. శృంగారమున కిందు తావు అత్యల్పము. కామవిషయకశృంగారమిందు లేనేలేదు. వీరరసమే ప్రధానముగ

నిందు రసమై, శత్రుకృతాపరాధ ప్రయుక్త మనఃప్రజ్వలనాత్మక క్రోధమే వసిష్ఠ విశ్వామిత్రాద్యాలంబన విశేషములందు సూక్ష్మముగను, రామునెడఁ గూఢముగను, జామదగ్న్యునెడ వ్యక్తముగను స్పష్టమగు భేదములచేఁ బోషింపఁబడుచుఁ బ్రేక్షకులచే నాస్వాదింపఁబడుచున్నది. కవియే నాటకారంభమున నీ గ్రంథమున,

'అప్రాకృతేషు పాత్రేషు యత్ర వీరః స్థితో రసః।
భేదైః సూక్ష్మైరభివ్యక్తైః ప్రత్యాధారం విభజ్యతే॥'

వీరరసమనియే నుడివినాఁడు. మరియు మహావీరచరితమని నామకరణముననే వీరరసప్రధాన నాటక మనియుఁ దెలియుచున్నది.

ప్రథమాంకమున సిద్ధాశ్రమమున విశ్వామిత్రుఁడు యజ్ఞము జేయుచు జనకునాహ్వానింప నా జనకుఁడును సమారబ్ధ సప్తతంతుండగుట తమ్ముడగు కుశధ్వజుని సీతోర్మిళలతో సిద్ధాశ్రమమునకు బంపును.

ఈ సన్నివేశము భవభూతికల్పితమే. వాల్మీకిరామాయణమున సీత, జనకునింటనే మిథిలయందుండును. కుశధ్వజుఁడును సిద్ధాశ్రమమునకు వచ్చినట్లు లేదు. కుశధ్వజుఁడు సాంకాశ్యపురమున నున్నట్లును, జనకునానతి నాతఁడు మిథిల కేతెంచి జనకునితోఁ గల్యాణోత్సవమున నుండినట్లు నున్నది.[1]

---

1. ఆజ్ఞయాఽథ నరేంద్రస్య ఆజగామ కుశధ్వజః॥ 8
స దదర్శ మహాత్మానం జనకం ధర్మవత్సలమ్॥
సోఽభివాద్య శతానందం జనకం చాఽపి ధార్మికః॥ 9

రాజార్హం పరమం దివ్యమాసనం సోఽధ్యరోహత।
ఉపవిష్టా వుభౌ తౌ తు భ్రాతరావమితౌజసౌ॥ 10
(బాలకాండే, సప్తతితమే సర్గే.)

ఈ నవ్యకల్పనముచే సీతారాములన్యోన్యము ప్రేమించుకొను నవకాశము కల్పించినట్లగుచున్నది. సిద్ధాశ్రమముననే యొకచో రామతేజస్స్పర్శచే నహల్య శాపవిముక్తయైనట్లున్నది. ఇది కూడఁ గవి కల్పించిన మార్పే. సీతకు రామునెడ ననురాగము జనింపఁజేయుటకై రామమాహాత్మ్యమును బ్రకటించుటకై, సీతయెదుటనే యిట్టి యద్భుతకృత్యమును గవి సంఘటింపఁ జేసెను. ఇట్టి వాని వలన సీతారామున మనముల ననురాగవిషయ ప్రథమబీజములు నాటినట్లగును. రావణుని వార్తాహరుఁడు సర్వమాయుఁడను రాక్షసుఁడు సీతను రావణున కీఁగోరుటయుఁ గ్రొత్తకల్పనమే. సీతయెదుట సర్వమాయుఁడు, రావణుఁడు సీతను బెండ్లాడఁ గోరినట్లు చెప్పుటచే, సీతకు రాక్షసుఁడైన రావణునెడ వైరస్యము కలుగుటకై కవి యిట్టిమార్పుఁ గావించియుండనోపు. కథానాయకుఁడైన రాముని సుగుణాభిరామునిగను, ప్రతినాయకుఁడైన రావణునికన్న మహావీరునిగను ప్రతిపాదించుట స్త్రీహృదయము నెరిఁగిన భవభూతికేఁ దగును. స్త్రీహృదయమును లెస్సగా నెరింగినవాఁడై భవభూతి, సీతకు రామునెడఁ గాఢానురాగము కుదురుట కీ సన్నివేశములఁ గల్పించెను. వాల్మీకిరామాయణమున, సీతాస్వయం వరసమయమున రావణాసురుఁడు వచ్చినట్లు లేదు. అప్పటికి సీతవిషయ మాతనికిఁ దెలియదేమో, ఈ యాశ్రమముననే కుశధ్వజుఁడు సీతను రామున కిచ్చి వివాహము సేసినఁ బాగుండునన, పణవిషయము జ్ఞప్తికిరాగా, విశ్వామిత్రుఁడు ధ్యానమాత్రమున నాముక్కంటివింటి సన్నిధినుండఁ జేయును. శ్రీరాముఁడద్దాని నెక్కుపెట్ట, నది భగ్నమగును. వాల్మీకిరామాయణమున జనకునింటనే శివధనుర్భంగము గావింపఁ బడినట్లున్నది. మరియు నా ధనుస్సు చాలకాలముగ నట నుండినట్లున్నది.

సర్వమాయుఁడు రావణునిగూర్చి నుడువ శ్రీరాముఁ డుదారముగ రావణుని శౌర్యాది గుణములఁ బ్రశంసించి లక్ష్మణునితో రావణుఁడు

సీతను గోరుట సాధారణమేయని మిగుల నుదాత్తముగా నుడువును. రావణునికన్న రామునం దీపరోత్కర్షా ప్రశంసన మనుగుణముగ నధికముగఁ గల్పించి నాటకమునఁ బ్రేక్షకులకు రామునెడ నభిమానము గలుగునట్లు చేయును.

ద్వితీయాంకమున సీత రామున కిచ్చి వివాహముగావింపఁబడెనని విని మాల్యవంతుఁడు. సర్వమాయుని వలనఁగూడ రాముగుణముల నాలకించి, రావణసందేశమునకుఁ దగిన మర్యాద నీయ లేదనియు, సీతారామకల్యాణము రావణున కవమానకరమనియు భావించి, తనయీసు వెడలఁబోసికొనుటకు రామునిపైకిఁ బరశురాముని బంపి యాతనిచే జంపింత మని యుక్తిపన్ని శివధనుర్భంగనిమిత్తముగ నాతని రామునిపైకిఁ బ్రేరేపించును. ఇది కవి కల్పించిన మార్పే. అమాత్యపదవియందున్న మాల్యవంతుఁడు తన రాజు క్షేమవిషయమై సర్వము విచారించు విశ్వాసపాత్రుఁడు గావున మాల్యవంతుఁడు రామమాహాత్మ్యమెరింగియు నిజపదవికిఁదగినట్లు యుక్తికిఁ బ్రతియుక్తిగ రాక్షసాంతకుఁడగు రామున కెన్నివిధముల నపకారముగావింప వీలగునో అన్నివిధముల నుపాయముల నన్వేషించి ప్రయత్నించెను. ఇది సన్మంత్రిలక్షణమే. రాజకీయముగ నీతని మేధావిత్వము గూడ నిందుఁదెల్లమగుచున్నది. వాల్మీకిరామయణమునఁ బరశురామునిరాక మాల్యవత్ప్రేరణమున నైనట్లు లేదు. అందుఁ బరశురాముఁడు నిజమహిమను జాటుకొనుచు అహంకారమున నెవ్వరిని లెక్కసేయకుండును. ఈ సందర్భమునఁ బరశురాముఁడు పల్కుశ్లోకములు ఓజోగుణభూయిష్ఠములై ఆరభటీవృత్తి విలసితములై ప్రేక్షకులకు వీరరసమును స్ఫురింపఁజేయుచు పరశురాముఁడుగ్రుఁడుగ నున్నాఁడని తెల్పును. దృశ్యకావ్యమందుకంటె నీ శ్లోకములు శ్రవ్యకావ్యమున వన్నెకెక్కునని తోచుచున్నది. ఇవి కవి కవితాపాటవముం దెల్పును. వాల్మీకి

రామాయణమునఁ బరశురాముఁడు వసిష్ఠాదులచే సర్ఘ్యముగొని శ్రీరాముని శివధనుర్భేదవృత్తాంతమును శ్రీరాముని యద్భుతపరాక్రమమును విని నిజధనుస్సు (వైష్ణవధనుస్సు) నిచ్చి శరమును బూరించి స్వబలమును జూపుమనియు, నవల నాతని బలముం జూచి తాను ద్వంద్వయుద్ధము గావింతుననియు నుడివినట్లును, దశరథుఁడు జామదగ్న్యునకుఁ బ్రాంజలియై దాశరథుల కభయమిమ్మనినట్లును శ్రీరాముఁడు క్రుద్ధుఁడై జామదగ్న్య ధనువున శరారోపణము గావించి ప్రార్థించినట్లును, పరశురాముఁడు నిర్వీర్యుఁడై, రాముని విష్ణునిగా భావించి శరమోక్షణముగూడఁ గోరినట్లును నంత శ్రీరాముఁడట్లు సేయ పరశురాముఁడు రాముని ప్రశంసించి మహేంద్రపర్వతమున కరిగినట్లును, పిదప నా వైష్ణవ ధనువును శ్రీరాముఁడు వరుణున కొసగినట్లును గలదు.[1]

ఈ యంకమున జామదగ్న్యాగమనము మాల్యవత్ప్రేరణము నను నూతన కల్పనముగావించినను నిప్పట్టునఁ బరశురాముని గర్వోక్తులు శ్రీరాముని వినయోక్తులును బాత్రోచితములుగ నున్నవి. తొలుతనే పరశురామునిరాక విన్న సీతయు నామె సఖులును భయపడుచుండ భార్గవుని మూర్తీభవించిన వీరరసమనియు,

---

1. ఏవముక్త్వార్ఘ్యమాదాయ భార్గవం భీమదర్శనమ్।
ఋషయో రామ రామేతి వచో మధురమబ్రువన్ ॥ 24

ప్రతిగృహ్య తు తాం పూజాం ఋషిదత్తాం ప్రతాపవాన్। 25
రామం దాశరథిం రామో జామదగ్న్యోఽభ్యభాషత॥

(బాలకాండ. 74-వ. అధ్యాయము.)

రామ దాశరథే వీర వీర్యం తేఽశ్రూయతే ద్భుతమ్।
ధనుషో భేదనం చైవ నిఖిలేన మయా శ్రుతమ్॥ 1

తదద్భుత మచింత్యం చ భేదనం ధనుషస్త్వయా।
తచ్ఛ్రుత్వాఽహమనుప్రాప్తో ధనుర్గృహ్యాపరం శుభమ్॥ 2

శ్లో॥ అయం స భృగునందనస్త్రిభువనైకవీరో ముని
ర్య ఏష నివహో మహానివ దురాసదస్తేజసామ్।
ప్రతాపతపసోరివ వ్యతికరస్ఫురన్మూర్తిమా
న్ప్రచండ ఇవ పిండతాముపాగతశ్చ వీరో రసః॥

(అంక-2. శ్లో-23.)

ఆకృతి దాల్చిన యథర్వణ వేదమనియు,

తదిదం ఘోరసంకాశం జామదగ్న్యం మహద్ధనుః।
పూరయస్వ శరేణైవ స్వబలం దర్శయస్వ మే॥ 3

తదహం తే బలం దృష్ట్వా ధనుషోఽస్య ప్రపూరణే।
ద్వంద్వయుద్ధం ప్రదాస్యామి వీర్యశ్లాఘ్యమహం తవ॥ 4

తస్య తద్వచనం శ్రుత్వా రాజా దశరథ స్తదా।
విషణ్ణవదనో దీనః ప్రాంజలిర్వాక్యమబ్రవీత్॥ 5

క్షత్రరోషాత్ప్రశాంతస్త్వం బ్రాహ్మణశ్చ మహాయశాః।
బాలానాం మమ పుత్రాణామభయం దాతుమర్హసి॥ 6

* * * * *

తదిదం వైష్ణవం రామ పితృపైతామహం మహత్।
క్షత్రధర్మం పురస్కృత్య గృహ్ణీష్వ ధనురుత్తమమ్॥ 27

యోజయస్వ ధనుశ్రేష్ఠే శరం పరపురంజయమ్।
యది శక్నోషి కాకుత్స్థ ద్వంద్వం దాస్యామి తే తతః॥ 28

(బాలకాండే. 75-వ, అధ్యాయము.)

శ్రుత్వా తజ్జామదగ్న్యస్య వాక్యం దాశరథిస్తదా।
గౌరవాద్యంత్రితకథః పితూ రామమథాబ్రవీత్॥ 1

* * * * *

వీర్యహీనమివాశక్తం క్షత్రధర్మేణ భార్గవ।
అవజానాసి మే తేజః పశ్య మేఽద్య పరాక్రమమ్॥ 2

శ్లో॥ పుణ్యోఽపి భీమకర్మా నిధిర్వ్రతానాం చకాస్త్యమితశక్తిః।
మూర్తిమభిరామఘోరాం బిభ్రదివాథర్వణో నిగమః॥

(అంక-2. శ్లో-24.)

నిఖిల భువనస్తోమనిర్మాథయోగ్యమగు సామర్థ్యరాశి యనియు,

ఇత్యుక్త్వా రాఘవః క్రుద్ధో భార్గవస్య శరాసనమ్।
శరం చ ప్రతిజగ్రాహ హస్తాల్లఘుపరాక్రమః॥ 3

ఆరోప్య సధనూ రామః శరం సజ్యం చకార హ।
జామదగ్న్యం తతో రామం రామః క్రుద్ధోఽబ్రవీద్వచః॥ 4

* * * * *

అక్షయం మధుహంతారం జానామి త్వాం సురోత్తమమ్।
ధనుషోఽస్య పరామర్శాత్ స్వస్తి తేఽస్తు పరంతప॥ 17

* * * * *

న చేయం మమ కాకుత్స్థ వ్రీడా భవితుమర్హతి।
త్వయా త్రైలోక్యనాథేన యదహం విముఖీ కృతః॥ 19

శరమప్రతిమం రామ మోక్తుమర్హసి సువ్రత।
శరమోక్షే గమిష్యామి మహేంద్రం పర్వతోత్తమమ్ 20

తథా బ్రువతి రామే తు జామదగ్న్యే ప్రతాపవాన్।
రామో దాశరథిః శ్రీమాన్ చిక్షేప శరముత్తమమ్॥ 21

సహతాన్ దృశ్య రామేణ స్వాన్ లోకాన్ తపసార్జితాన్ ।
జామదగ్న్యోజగామాశు మహేంద్రం పర్వతోత్తమమ్॥ 22

* * * * *

రామం దాశరథిం రామో జామదగ్న్యః ప్రశస్య చ।
తతః ప్రదక్షిణం కృత్వా జగామాత్మగతిం ప్రభుః॥ 24

(బాలకాండే. 76-వ. అధ్యాయము.)

గతే రామే ప్రశాంతాత్మా రామో దాశరథిర్ధనుః।
వరుణాయాప్రమేయాయ దదౌ హస్తే ససాయకమ్॥ 1

(బాలకాండ. 77-వ. అధ్యాయము)

శ్లో॥ కల్పాపాయప్రణయి విదధత్కాలరుద్రానలత్వం
సంరబ్ధస్య త్రిపురజయినో దేవదేవస్య తిగ్మః।
బ్రహ్మచ్ఛద్మా నిఖిలభువనస్తోమనిర్మాథయోగ్యో
రాశీభూతః పునరివ సముత్థాయ సామర్థ్యసారః॥

(అంక-2. శ్లో-25.)

యథార్థముగఁ గొనియాడును. పరశురామునితో నాతని పరశురామ నామాన్వర్థతఁ దెల్పి ప్రశంసించును. పరశురాముఁడును రాముని 'రామ రామ హృదయంగమోఽసి మే,' అని మెచ్చుకొనును. ఇందుఁ బరశురామ శ్రీరామ శీలతారతమ్యము చక్కగాఁ జెప్పఁబడియున్నది. పెద్దలయెడ నెటుల మెలఁగ వలయునో భవభూతి రామపాత్రమునఁ దెల్పియున్నాఁడు. జనకుఁడు పరశురాము నెదరుర్కొనఁబోవుటయుఁ గంకణమోచనమునకై రాముని శ్వశ్రూజనము పిలుచుట మున్నగునవి యన్నియు నిందు కవికల్పితములే.

తృతీయాంకమున వసిష్ఠవిశ్వామిత్రులును జనకదశరథులును మృదూక్తులఁ బరశురాముని శమింపఁగోరుదురు. కాని పెంకెతనముగ నాతఁడు వారల మాటల లెక్కసేయఁడు. జనకదశరథులు పరశురాముని బెదరింతురు. పరశురాముఁడు కించి త్తైనను బెదరక రాముని బరిహసించుచు నాతనితోఁ బోర నిచ్చగించును. ఈ యంకమునఁ బెద్దలమాటఁ బెడచెవిని బెట్టిన పరశురామునిగర్వము పరాకాష్ఠనందినది.

నాల్గవయంకమున శ్రీరాముఁడు పరశురాము నోడించును. ఈ రామ పరశురామ ఘట్టమును కొంచె మించుమించుగా మూడంకములకు వ్యాప్తముగాఁ జేసి, భవభూతి ప్రేక్షకులకు, శ్రోతలకు విసుగు బుట్టించుచున్నాఁడు. మాల్యవంతుఁ డాకసమున విమానారూఢుఁడై జామదగ్న్య గర్వభంగముఁ దిలకించి, మనమునఁ జాలఁ బొగిలి,

రామవంచనమునకు మరియొక యాలోచనముఁజేయును. శూర్పణఖను దశరథభవనమున కేగి మంథర నావేశించి కుటుంబమునఁ గలతలు కలుగఁ జేయుమనియు, రాము నెటులైన నడవికిఁ బంపు నుపాయముఁ జూడుమనియు నుడివి పంపును. ఇది యపరచాణక్యునివంటి మాల్యవంతుఁ డూహింపఁదగినట్టి యూహయే. రాజకీయముగ నిట్టి వెన్నియో స్వకార్యలాభమునకుఁ జేయవలసియుండును. ఈ సన్నివేశము భవభూతి చాల మెలకువతో నాటకోచితముగ నిర్వహించి ప్రేక్షకులమనమునుఁ జూరఁ గొనినాఁడు. మంథరవేషమున శూర్పణఖ నిజకృత్యము చక్కగ నిర్వర్తించి, కైకేయిపంపెనని మిథిలకు వచ్చి, ప్రేమపూర్వకముగ భరతునకు పట్టాభిషేకము గావింపవలయుననియు, రాముఁడు వెంటనే దండకారణ్యముల కేగి యచట పదునాలుగేండ్లుండవలయుననియు, రెండు వరములు గల లేఖ నొకదాని నందిచ్చును. లక్ష్మణుఁడా వరములఁ జదివి వినిపించును. దశరథుఁడు నంగీకరించును. భరతుఁడు శ్రీరాముని హేమపాదుకల సింహాసనమున నాతనికి బదులుంచుటకు బ్రార్థింప రాముఁ డొసఁగి సీతాలక్ష్మణులతో మిథిలనుండి యటులే యడవులకేగును.

వాల్మీకిరామాయణమున కైకేయి స్వయముగ యయోధ్యయందు మంథరా ప్రేరణమున దశరథుని వరద్వయము ప్రసాదింపఁగోరును. ఇట నీ నాటకమున భవభూతి, రాణియగు కైక కీయపవాదు రానీయకుండుటకై చమత్కారముగ నీరాక్షసకృత్యమును రాక్షసియగు శూర్పణఖమూలముననే నెరవేర్పఁజేసి కైకను దోషములేనిదానిఁ గావించెను.

రామాయణమున నీవరద్వయ ప్రార్థన సమయమున భరతుఁడు మాతులుఁ డగు యుధాజిత్తుకడ కరిగి యుండినట్లును, రాముఁడడవుల కేగినపిదప భరతుఁడీవృత్తాంతమంతయు నయోధ్యకువచ్చి తెలిసికొని

చిత్రకూటముననున్న రాముని సన్నిధికేగి పాదుకలఁ బ్రార్థించి తెచ్చినట్లున్నది. ఈ నాటకమున భవభూతి యీ వృత్తాంతమంతయు నీ మిథిలాప్రాంతముననే నెరవేర్చును. భరత యుధాజిత్తులు నిట సమక్షమున దశరథునొద్ద నున్నట్లు చెప్పఁబడియున్నది. ఈ మార్పులవలన పేర్కొనఁదగిన నాటకోచితవైచిత్రి యేమియు గోచరింపదు. మూలకథ సంగ్రహింపఁబడినది.

మరియు మాల్యవంతుఁడు విభీషణాపసరణమునకుఁ బ్రయత్నించును. ఈ యాలోచనగూడ మంత్రియగు మాల్యవంతుని మేధాశక్తిని స్ఫురింపఁ జేయుచున్నది. ఎంతటి యాలోచనాపరుఁడు! తన యూహలన్నింటి నొకటివెంట నొకటి యాచరణమునఁ బెట్టి రామున కెటులైన హానిఁగలిగింప యత్నించును. విభీషణుని వెడలనడువఁజేయు, నతఁడు రామపక్షావలంబియగును. వానరోత్తముఁడగు వాలినిఁగూడఁ బ్రోత్సహించి, రామునెదుర్కొనఁ బ్రేరేపించును. ఈ వాలిని రాము నెదుర్కొనఁ బ్రేరేచుట కవికల్పనము. ఇట్టి కల్పనము లన్నియు మాల్యవంతుని యుపాయశాలిత్వమును జాటుచు, రామగుణోత్కర్షనతిశయింపఁజేయుచు, నన్యాయముగ రాముఁడు వాలినిఁ జంపెనను నింద రామునకుఁ దొలఁగఁజేయును.

పంచమాంకమున, సంపాతి జటాయు సంభాషణమున మూలకథను సంగ్రహముగ రావణ సీతాపహరణముదనుకఁ దెలియఁజేసి, రామలక్ష్మణులు, సీతాన్వేషణార్థము విపినములఁ దిరుగుచుండఁ గబంధగృహీతయైన శ్రమణను లక్ష్మణుఁడు విడిపింప, నామె విభీషణ శరణాగతి, వాలి వృత్తాంతము, సుగ్రీవ విషయము దాశరథులకుఁ దెల్పునట్లిందుఁ జెప్పఁబడి యున్నది. వాల్మీకీయమునఁ గబంధుఁడే సుగ్రీవాదుల విషయమునుడివి, సీతాన్వేషణమున వానరులు తోడ్పడఁగల

రనియు, సుగ్రీవునితో సఖ్యము సల్పుమనియుఁ దెల్పినట్లున్నది. శ్రమణ, (శబరి) తన యాశ్రమముననే రాముని దర్శించి, యాతనిచే ననుగృహీతయై, లోకాంతరముఁ జెందినట్లున్నది. ఈ నాటకమునఁ గబంధుఁడు దివ్యరూపముఁ దాల్చి, వాలి మాల్యవత్ప్రేరితుఁడై రామునిఁ జంప రానున్నాఁడని తెలిపినట్లును, అవల శ్రమణ వాలివృత్తాంతాదివిషయములఁ దెలిపినట్లునున్నది.

కవి కథాగమనముపైఁ దృష్టితగ్గించి, తాఁజెప్పఁదలఁచిన విషయానుగుణములగు సన్నివేశములనే గూర్చును. జటాయువును రామలక్ష్మణులు చూచినట్లే యిందు లేదు. విష్కంభమందును, జటాయువు రావణు నెదుర్కొన నేఁగుచున్నట్లు మాత్రమున్నది. అవల రాముఁడు–'హా తాత కాశ్యప, శకుంతరాజ, క్వపున స్త్వాదృశస్య మహత స్తీర్థభూతస్య సాధోః సంభవః' అని జటాయువును తలఁచికొనినట్లును, వెంటనే లక్ష్మణుఁడు–'పశ్యామీవ తాం పశ్చిమావస్థాం తాతజటాయుషః' అని స్మరించినట్లునున్నది. జటాయుసంబంధము వీరి కెట్లు గలిగెనో యీ నాటకమునఁ జెప్పఁ బడలేదు.

వాల్మీకీయమున, సుగ్రీవసఖ్యానంతరము వాలివధ జరుగును. అప్పటికే విభీషణుఁడు రావణుని వీఁడి సుగ్రీవునికడఁ జేరియున్నట్లిందుఁ దెల్పఁబడెను. ఇదియుఁ గవిచేసిన మార్పే. రామాయణమున హనుమంతుఁడు లంకాదహనము గావించిన పిదప రావణునకు హితోపదేశము జేయ, నాహితము పథ్యమునగు వాక్కు నిచ్చగింపని రావణుచే విడనాడఁబడెనని యున్నది. ఇందు వాలివధకుఁ బూర్వమే విభీషణాపసరణము నుడువఁబడినది. ఇందు ముందుగానే వాలి శ్రీరాముని బరీక్షింపఁగోరి యాతనిచే మృతినొందును, వాలియే సుగ్రీవునిఁ బిలిపించి రామునితో మైత్రి నెరపఁ

జేయును. వాలి యిందు మాట నిలుకడఁగల వాఁడుగాఁ జిత్రింపఁబడినాఁడు. రామునిఁ జూచిన తోడనే యాంతరముగ నానందముఁగలిగి యుద్ధముఁ జేయ నొల్లకుండియు, మాల్యవంతునకు మాట యిచ్చిన కారణమునఁ దప్పఁజాలక, రామునితోఁ బోర నిశ్చయించును. రాముని సుందరాకృతిఁ జూచినంతనే వాలి పరవశుఁడై నుడువు శ్లోక మతని భావముల వెల్లడించును. ఇది భవభూతిరచితములగు నుత్తమోత్తమ శ్లోకములలో నొకటి–

శ్లో॥ ఆనందాయ చ విస్మయాయ చ మయా దృష్టోఽసి దుఃఖాయ వా
వైతృష్ణ్యం ను కుతోఽద్య సంప్రతి మమ త్వద్దర్శనే చక్షుషః।
త్వత్సాంగత్యసుఖస్య నాఽస్మి విషయః కిం వా బహు వ్యాహృతై
రస్మిన్విశ్రుత జామదగ్న్యవిజయే పాణౌ ధనుర్జృంభతామ్॥
(అంక–5. శ్లో–59.)

'రామ! (నీ యాకృతి సుందరముగ నుండుటచే) ఆనందమునకో, విస్మయమునకో, లేక, దుఃఖముననుభవించుటకో, నేను నిన్ను జూచితిని. ఇప్పుడు నిన్ను జూచుటచే నా కన్నులకుఁ దృప్తి యెట్లు తీరఁగలదు. ఎంత సేపు చూచినను దృప్తియుండదు గదా! నీ సమాగమగోష్ఠిసౌఖ్యము ననుభవింప ననర్హుఁడను. పెక్కుమాటలేల? ప్రయోజనము లేదు. జామదగ్న్యవిజయమున ప్రశస్తమగు నీ చేత ధను వూనుము' అనుచున్నాఁడు.

ఈ శ్లోకమున వాలికి మనమునఁ బొడమిన భావసంఘర్షణము వ్యక్తమగుచున్నది. ఒకవైపు సుందరాకృతిఁజూచి యానందమును, అపూర్వాకృతియగుట విస్మయమును జెందియుండ, నిటువంటివానితో సల్లాపసౌఖ్యముగూడ లేదేయనియు, మాల్యవంతునితోఁ దాను రామునెదుర్కొందునని బాసచేసిన విషయము జ్ఞప్తికిరాగా, నీ దర్శనము

దుఃఖ మనుభవించుటకో, 'దుఃఖాయ వా' అను మనః క్లేశ మనుభవించుచు నీ మూఁడు భావములు ముప్పిరిగొని యున్నట్లు తోఁచుచున్నది. ఇట్లు మనోభావముల సూక్ష్మములగువానినిఁ జిత్రించుటలో భవభూతి సిద్ధహస్తుఁడు. వాలి సుగ్రీవునిఁ దానే స్వయముగ రామున కర్పించి మైత్రీధర్మమసాధారణమహావ్రత మని శిష్టసంప్రదాయమును సుగ్రీవముఖమునఁ జెప్పించును. భవభూతిగూడ మిత్రత్వవిషయమున నిట్టి యభిప్రాయము గలవాఁడని యీ క్రింది శ్లోకమునఁ దెలియ నగును.

'ప్రాణైరపి హితా వృత్తిరద్రోహో వ్యాజవర్జనమ్।
ఆత్మనీవ ప్రియాధాన మేతన్మైత్రీ మహావ్రతమ్॥

(అంక-5. శ్లో-59.)

మిత్రవిషయమున, ప్రాణము లర్పించియైనను హితమగు వర్తనమున మెలఁగుట, మనసుననైన ననర్థముఁ దలఁపకుండుట, ఛలోక్తులనైనఁ బల్కకుండుట, పరమాత్మయందువలె ప్రీతి నుంచుట మైత్రీమహాలక్షణమని నుడివియున్నాఁడు.

ఇందు వాలి అగమ్యాగమనముఁ గావించినవాఁడని గాని, సుగ్రీవవిరోధియని గాని చెప్పఁబడలేదు. భవభూతి వాలి నొక గొప్పవీరునిగను, సత్యసంధునిగను, పరోపకారపరాయణునిగను జిత్రించెను. ఈ మార్పు నాటకమునఁ బ్రేక్షకుల మనముల బాగుగా నాకర్షించునను తలఁపుననే కవి యిట్లు గావించినాఁడు, ఇందు వాలివధాఘట్టముఁ జూచిన ప్రేక్షకులు వాలివిషయమై జాలినొందుదురు. రామాయణమునందు వాలి దోషిగ, శిక్షార్హుఁడుగ వర్ణింపఁబడినాఁడు. ఇట వాలిశీలము ప్రశంసార్హము. వాలియే రామునకు సహాయార్థము రాబోవు రామాయణ యుద్ధమున శక్తిసామర్థ్యములఁ జూపుఁడని వానరులనెల్ల హెచ్చరించును.

షష్ఠాంకమున రామ రావణయుద్ధము జరుగును. నాటకనియమముల ననుసరించి యుద్ధము రంగస్థలమునఁ జూపరాదని కాఁబోలు భవభూతి, ఇంద్ర చిత్రరథులు విమానారూఢులై రణరంగవిషయములఁ గమనించుచు, నప్పటికప్పుడు జరుగు విషయములఁ దెల్పుచున్నట్లు రచించినాఁడు. ఈ యుద్ధఘట్టమున నీ నాటకమున లక్ష్మణుఁడు మేఘనాదుఁడు నాగాస్త్రములఁ బ్రయోగించినట్లును, నవియు లక్ష్మణుప్రయుక్త గారుడాస్త్రములచేఁ బరిహృతములుకాగా రావణుఁడు క్రుద్ధుఁడై, లక్ష్మణు నొక శతఘ్నిచే గాఢముగాఁ గొట్టి హనుమంతునియొడిలో మూర్ఛిల్లఁ జేసినట్లును, రాముఁడు తమ్మునిస్థితిఁ జూచినంతనే తానును మూర్ఛిల్లినట్లు చెప్పఁ బడియున్నది.

శ్లో॥ యావన్మంత్రప్రభావాదనధిగతగతీర్మేఘనాద ప్రణున్నాన్
దుర్భేద్యాన్నాగపాశాన్ విహగపరివృఢాస్త్ర ప్రయోగాద్వ్యధూనోత్।
తావద్రక్షోవినేత్రా పునరతిరభసం మర్మణి క్రోధభూమ్నా
గాఢం విద్ధః శతఘ్న్యా హనుమతి సహసా మోహనిఘ్నోన్యపప్తత్॥

(అంక-6. శ్లో-48.)

వాల్మీకి రామాయణమున రావణి నాగాస్త్రము ప్రయోగించె ననియు, రామలక్ష్మణు లిరువురును వానిచే బద్ధులైనట్లును, గొంతసేపటికి గరుడుఁడే యచ్చోటికి వచ్చి రామలక్ష్మణుల సచేతనుల నొనరించి నట్లునున్నది. పిదప రాముఁడే యాగ్నేయాస్త్రమున కుంభకర్ణుని, నతని సేనను బూది యొనర్చెనని యీ నాటకమునఁ జెప్పఁబడియున్నది. రామాయణమునఁగూడ తుదకు రాముఁడే కుంభకర్ణుని బాహువులను, పాదములను నిజాస్త్రములతో ఛేదించినట్లున్నది.

రావణ మేఘనాదులు రామలక్ష్మణులతో యుద్ధము జేయుదురు. రామలక్ష్మణులు బ్రహ్మాస్త్ర వైష్ణవాస్త్రములఁ బ్రయోగింప రావణ మేఘనాదులు నేలఁగూలినట్లిందు వర్ణింపఁబడినది. శ్రీమద్రామాయణమున మేఘనాదవధానంతరము రావణవధ జరిగినట్లున్నది. ఈ సందర్భమున నాటకోచితముగ కథను సంగ్రహించు నుద్దేశముతోడనే ఇట్లు కావించియుండనోపు.

సప్తమాంకమున లంకా అలకలు సంభాషింతురు. భవభూతి పట్టణములకుఁగూడ వాక్కొనంగి ఇందు మాటాడఁజేసినాఁడు. వాల్మీకిరామాయణమున విమానారూఢులై యేగుచు ఋశ్యమూక ప్రాంతమునఁ దిగి వానరస్త్రీల నందరనెక్కించుకొని యయోధ్యకు వెడలినట్లున్నది, ఇందా విషయము లేదు. లంకా అలకల సంభాషణముననే సీత అగ్నిశుద్ధురాలగుట. విభీషణ పట్టాభిషేకముమున్నగు విషయములు సంగ్రహముగాఁ దెలియఁజేయఁబడుచున్నవి.

అయోధ్య కేఁగిన పిదప విశ్వామిత్రుఁడే రామున కభిషేకము గావించినట్లిందున్నది. రామాయణమున విశ్వామిత్రుఁడు రామపట్టాభిషేకసమయమునలేఁడు. వసిష్ఠుఁడే రాముని రత్నసింహాసనమున సీతాసమేతముగఁ గూర్చుండఁబెట్టి, వామదేవాది ఋషులతోఁ గలసి యభిషేకమొనర్చినట్లునద్రి.[1]

1. తతః స ప్రయతో వృద్ధో వసిష్ఠో బ్రాహ్మణై స్సహ।
రామం రత్నమయే పీఠే సహ సీతం న్యవేశయత్॥ 59

వసిష్ఠో వామదేవశ్చ జాబాలిరథ కాశ్యపః।
కాత్యాయనః సుయజ్ఞశ్చ గౌతమో విజయ స్తథా॥ 60

అభ్యషిఞ్చన్నరవ్యాఘ్రం ప్రసన్నేన సుగంధినా।
సలిలేన సహస్రాక్షం వసవో వాసవం యథా॥ 61

(యుద్ధకాండే.-131-వ అధ్యాయము)

భవభూతిశైలి తన కాలమందలి ప్రజాదరణము ననుసరించి ప్రేక్షకానందమునకైన నాటకమునఁగూడ నాయా ఘట్టములలోఁ దన్మయుఁడై యారభటీ వృత్తిని వ్రాసెనని తోఁచినను వీరరసనాటకమగుట నిందవి యుచితములే యని చెప్పనగును. పరశురామఘట్టమున కథాగమనము కుంటువడుచున్నది. వాలి ఘట్టము హృదయంగమముగాఁ జిత్రింపఁబడినది. ఈ ఘట్టమే యీ నాటకమునందంతట రసవత్తమమైనది, భవభూతి యిందు నిజతత్త్వమును ప్రతిబింబింపఁజేయుచున్నాఁడు.

'ఆనందాయ చ విస్మయాయ' యను శ్లోక మొక్కటియే భవభూతి మహత్త్వమును జాటుటకుఁ దగియున్నది.

మహావీరచరితమున సూక్తులు

1. ప్రసన్నానాం వాచః ఫల మపరిమేయం ప్రసువతే- (అం. 1-శ్లో. 12.)
(ప్రపన్నులగు మహాత్ముల పల్కులు అపరిమిత ఫలమునొసఁగును.)

2. దుగ్ధార్ణవాదృతే జన్మ చంద్రకౌస్తుభయోః కుతః- (అం. 1-శ్లో. 23.)
(క్షీరసాగరమునుండికాక మరి యెక్కడనుండి చంద్రకౌస్తుభములకు జన్మము సంభవించును.)

3. న వసంత్యేకత్ర సర్వే గుణాః- (అం. 1-శ్లో. 33.)
(సమస్తగుణములు నొక్కయెడ నుండవు.)

4. ఆంబుని మజ్జంత్యలాబూని గ్రావాణి ప్లవంతే- (అం. 1.)
(సొరకాయలు నీట మునుఁగుచున్నవి, రాళ్ళు తేలుచున్నవి.)

5. సర్వః ప్రాయో భజతి వికృతిం భిద్యమానే ప్రతాపే- (అం. 2-శ్లో. 4.)
(అధికారము లేక ప్రతాప ముడిగినపు డందరును తరచు మార్పు నొందుదురు.)

6. నోత్సవాః పరావధీరణావైరస్య మర్హంతి- (అం. 2.)
(ఉత్సవములు పరతిరస్కార వైరస్యమునకుఁ దగవు.)

7. నృశంసతా హి నామ పురుషదోషః- (అం. 2.)
(ఘాతుకత్వము పురుషునకు దోషము కదా.) 'ఆనృశంస్యం పరో ధర్మః' అని శాస్త్రము.

8. జనపదేషు న చిరమారణ్యకాస్తిష్ఠంతి- (అం. 2.)
(అరణ్యవాసులు పట్టణములం దెక్కువకాల ముండరు.)

9. కృతవితతి రకస్మాత్ ప్రాకృతైరుత్తమానాం
విరమతి న కథంచిత్ కశ్మలా కిం వదంతీ॥ (అం. 3-శ్లో. 4.)

(ఉత్తములవిషయమగు అపవాదజనశ్రుతి పామరులచే వ్యాప్తమైనపుడు అది సాధారణముగా నణఁగదు.)

10. ఉత్కర్షః సర్వతోవృత్తేః సర్వాకారం హి దృష్యతి- (అం. 3-శ్లో. 12.)
(సమస్తవృత్తులందు నతిశయము కలవాఁడు కావున సర్వాకారముల మానసత్వ వాచికత్వ కాయికత్వములందు గర్వము వహించుచున్నాడు.)

11. ప్రాకృతాని తేజాంస్యప్రాకృతే జ్యోతిషి శామ్యంతి- (అం. 4.)
(సామాన్యములగు తేజస్సులు మహాతేజస్సున శాంతించును.)

12. విరుద్ధక్రియం రాజా చేత్పురుషం న శాస్తి।
తదయం ప్రాప్తః ప్రజావిప్లవః॥ (అం. 3-శ్లో. 35.)
(లోకవిరుద్ధమగు ధర్మాచరణము సల్పు పురుషుని రాజు శిక్షింపనిచో ప్రజావిప్లవము ప్రాప్తమగును.)

13. ఉపజాపితాశ్చ ప్రత్యుపజాపంతి ప్రకృతయః (అం. 4.)
(రహస్యముఁ జెప్పినచోఁ బ్రజలు మరల నా రహస్యమునే అందరకుఁ జెప్పుదురు,)

14. లఘ్వపి వ్యసనపద మభియుక్తస్య కృచ్ఛ్రసాధ్యం భవతి- (అం. 4.)
(పగ కెదిరించిన వానికి వ్యసనపదము స్వల్పమైనను నతిక్రమింపకష్ట సాధ్యమే యగును.)

15. అసాధ్యమన్యథా దోషం పరిచ్ఛిద్య శరీరిణః।
యథా వైద్య స్తథా రాజా శస్త్రపాణిర్భవిష్యతి॥ (అం. 4-శ్లో. 23.)
(వేరువిధమున సాధ్యముగాదని ప్రాణిదోషమును నిశ్చయించి, శస్త్రపాణియగు వైద్యునివలె రాజుకూడ శస్త్రపాణి కానగును.)

16. తీర్థోదకం చ వహ్నిశ్చ నాన్యతః శుద్ధిమర్హతః- (అం. 4-శ్లో. 27.)

(సహజముగ పవిత్రమగు తీర్థోదకము, అగ్నియు మరియొకదాని వలన శుద్ధినిఁ బడయఁదగవు.)

17. సంకటా హ్యాహితాగ్నీనాం ప్రత్యవాయైర్గృహస్థతా-(అం. 4-శ్లో. 33.)
(ఆహితాగ్నులకు గార్హస్థ్యము ప్రత్యవాయములచేఁ జాల కష్టసాధ్యమైనది కదా.)

18. రమణీయః పావనో బ్రహ్మర్షిసంగమః (అం. 4.)
(బ్రహ్మర్షుల సాంగత్యము పావనమును రమణీయము నగును.)

19. గురవో అనుగంతవ్యాః నానుగంతారః (అం. 4.)
(గురువులు అనుసరింపఁదగినవారే కాని మరియొకరి ననుసరించు వారు కారు.)

20. శక్తిర్హి కాలస్య విభోర్జరాఖ్యా
శక్త్యంతరాణాం ప్రతిబంధహేతుః॥ (అం. 5-శ్లో. 4.)
(సర్వసమర్థమగు కాలముయొక్కగుణమగు (శక్తి), ముసలితనము ఇతరములగు ననేకశక్తులకు ప్రతిబంధహేతువు కదా.)

21. విషయబాహుళ్యం కాలవిప్రకర్షశ్చ స్మృతిం ప్రముష్ణాతి (అం. 5.)
(దేశబాహుళ్యము, కాలదూరమును స్మృతి నపహరించును.)

22. ఉత్తరోత్తర వీరభావశ్చిత్రీయతే వీరలోకః (అం. 5.)
(వీరులగువా రుత్తరోత్తరవీరకృత్యములఁ బ్రదర్శించి లోకమున కాశ్చర్యముం గూర్చుదురు.)

23. అచింతనీయార్థాస్తపసాం విశేషాః (అం. 5.)
(తపోవిశేషము లూహింపరాని ప్రయోజనములు గలవి కదా.)

24. నను మిత్రస్య యో గురుర్గురురేవ సః (అం. 5-శ్లో. 43.)
(మిత్రునిగురువు గూడ గురువే కదా.)

25. స్వజాతిసమయవ్యవస్థితా యుద్ధధర్మాః (అం. 5.)
(యుద్ధధర్మములు స్వజాతినిర్ణీతనియమానుసారముగా నుండును.)

26. అయుక్తమనురుధ్యమానాః పుమాంసో మహత్యయుక్తగహ్వరే నిపాత్యంతే (అం. 5.)
(అన్యాయ్యకార్యము లాచరింప నిచ్ఛగించు పురుషులు అన్యాయ్యకార్యమను బిలముననే పడుదురు.)

27. విషమః కృతాంతః (అం. 5-శ్లో. 56.)
(విధి విపరీతమైనది.)

28. కో హి పూజ్యస్య గురోర్వచనం న బహుమన్యతే (అం. 5.)
(పూజ్యులైన గురువులవచన మెవ్వఁడు మన్నింపకుండును.)

29. ప్రాణైరపి హితా వృత్తిరద్రోహో వ్యాజవర్జనమ్।
ఆత్మనీవ ప్రియాధానం ఏతన్మైత్రీ మహావ్రతమ్॥ (అం. 5-శ్లో. 59.)
(అసువుల నొడ్డియైనను ప్రియమగువర్తనముఁ గలిగియుండుట, ద్రోహచింతనము లేకుండుట, ఛలోక్తులు లేకుండుట, పరమాత్మ యందు వలెనే మిత్రులయందును ప్రీతిఁగల్గియుండుట మైత్రీ మహావ్రతలక్షణము.)

30. వృద్ధబుద్ధి రనాగతం పశ్యతి (అం. 6.)
(పెద్దలబుద్ధి ముందుచూపు గలది.)

31. సాచివ్యం నామ మహతే సంతాపాయ (అం. 6.)
(మంత్రిత్వము గొప్ప సంతాపముకొరకే యగును.)

32. దుష్కర్మణాం పరీపాకః స్వయమేవైష దీప్యతే- (అం. 6.-శ్లో. 6.)
(దుష్కర్మపరాణామము స్వయముగనే వెలుఁగును.)

33. జాతిసులభం చాపలం అప్రతీకార్యమ్ (అం. 6.)
(జాతిలక్షణమైన చపలత్వము మార్పరానిది.)

34. మానుషే లోకే వాత్సల్యం నామ కేవలం అఖిలేంద్రియ వశీకరణ చూర్ణముష్టిః (అం. 6.)
(ఈ మానవలోకమున వాత్సల్యమనునది సకలేంద్రియ వశీకరణమగు పిడికెడు సుగంధచూర్ణము.)

35. కి మపి గహనో వస్తుమహిమా (అం. 6-శ్లో. 52.)
(వస్తుమహిమము తెలియరానిది కదా.)

36 అథవా దుష్టప్రశాంతిః కస్య న మనఃప్రీత్యై (అం. 6.)
(దుష్టులు శాంతించుట ఎవ్వరికి మనఃప్రీతికరము కాదు.)

37. మహాత్మానో ఽపి వాత్సల్యపరతంత్రాః (అం. 7.)
(మహానుభావులును వాత్సల్యపరతంత్రులు గదా.)

ఉత్తరరామచరితము-భవభూతి

భవభూతి మహాకవికృతులలో నుత్తరరామచరితము కడపటిది. కవియొక్క పరిణతప్రజ్ఞ యిందుఁ బ్రతిబింబించుచున్నది. ఈతని దేశకాలాదుల విషయము మహావీరచరితవిషయమునఁ జూడనగును. (పుట. 61) ఉత్తరరామచరితమను నామముచేతనే శ్రీరాముఁడు రావణసంహారానంతరము పట్టాభిషిక్తుఁడైన కొంతకాలమునకుఁ దర్వాత రామజీవితమున నుత్తరభాగమునకు సంబంధించిన గాథయని తెలియుచున్నది. మహావీరచరితమున రాముని బాల్యమాది పట్టాభిషేకమువరకుఁ గల రామాయణగాథ వర్ణింపఁబడినది. రామాయణము నందలి కథాభాగమునంతయు రెండు గ్రంథములలో నిముడ్చ నెంచి తొలుత మహావీరచరితమును వ్రాసి, యవల మిగిలిన రామచరితోత్తర విషయముల నీయుత్తరరామచరితనాటకమున వ్రాసెను. ఈతని మూఁడు గ్రంథములందు నుత్తరరామచరితమే యుత్తమోత్తమ మని యందరు నొప్పుకొనిన విషయము.

భవభూతి వైశిష్ట్యం

భాస కాళిదాస బాణాది మహాకవులతోఁ దులఁదూగు ప్రతిభా విశేషముగల భవభూతి సంస్కృత వాఙ్మయమున పైవారితో సమానస్థానము నాక్రమించుచున్నాఁడు. పలువురు మహాకవులు తర్వాతివారు భవభూతి కవితను బ్రశంసించుచుఁ గొనియాడిరి. క్రీ॥శ॥900. ప్రాంతమువాఁడగు రాజశేఖరుఁడు తా రచించిన బాలరామాయణనాటకమున భవభూతిని బేర్కొనియున్నాఁడు. అందు,

'బభూవ వల్మీకభవః కవిః పురా
తతః ప్రపేదే భువి భర్తృమేంఠతామ్।

స్థితః పునర్యో భవభూతిరేఖయా
స వర్తతే సంప్రతి రాజశేఖరః॥'

(అంకన.I-శ్లో 16.)

భవభూతి వాల్మీక్యవతారమనియు, నా భవభూతియే తా ననియుఁ దెల్పుచున్నాఁడు. మరియు క్షేమేంద్రుఁడు. దశరూపకకర్తయగు ధనంజయుఁడు. వ్యక్తివివేక కారుఁడగు మహిమభట్టు, మున్నగు మహాకవులు పలువురు భవభూతిరచనల నుదహరించియున్నారు. క్షేమేంద్రుఁడు సువృత్త తిలకమందు భవభూతి విరచితములగు శిఖరిణీ వృత్తములు మాయూరనృత్యములే యని కొనియాడును,

'భవభూతేః శిఖరిణీ నిరర్గళతరంగిణీ।
రుచిరా ఘనసందర్భే యా మయూరీవ నృత్యతి॥'

(‹ ≠$ ₹ HOIII.-33.)

కవీశ్వరుఁడగు గోవర్ధనాచార్యుఁడు తన యార్యానప్తశతియందు,

'భవభూతేస్సంబంధాత్ భూధరభూరేవ భారతీ భాతి।
ఏతత్కృతకారుణ్యే కిమన్యథా రోదితి గ్రావా॥'

(ఆర్యాసప్తశతి.I.-36.)

భవభూతిసంబంధమువలన వాక్కు భూధరభవ మని తోఁచుచున్న దనియు, నట్లుకాకున్నచో నాతనిచే రచితమగు కరుణప్రధాననాటకమున రాలు గూడ నేట్లేడ్వగలవు? అని మిగులఁ బ్రశంసించెను.

తిలకమంజరియం దుపోద్ఘాతశ్లోకములలో ధనసాలుఁ డిట్లు నుడివియున్నాఁడు.

"స్పష్టభావరసా చిత్రైః పదన్యాసైః ప్రవర్తితా।
నాటకేషు నటస్త్రీవ భారతీ భవభూతినా॥"

విచిత్రపదవిన్యాసములతో భావరసముల వెలువరించు నటస్త్రీవలె భవభూతివాక్కు వెలయుచున్న దని భవభూతికవితానైపుణ్యముంగూర్చి తెల్పియున్నాఁడు. భవభూతి కరుణరస ప్రతిపాదనమున నద్వితీయుఁడని 'ఉత్తరే రామచరితే భవభూతి ర్విశిష్యతే' యను వాక్యము చాటుచున్నది. ఇది యథార్థము. భవభూతి మూర్తీభవించిన కరుణరసమని సీతను వర్ణించు సందర్భమున తృతీయాంకమున నాల్గవశ్లోకమున మూడవపాదమున 'కరుణస్యమూర్తి రథవా శరీరిణీ' యని నుడువును. ఈతనికైతయు నిట్టిదియే యని దీన స్ఫురించుచున్నది. భవభూతి ప్రకృత్యుపాసకుఁడై స్వభావ వర్ణనముల నదీపర్వతాదుల వర్ణించు సందర్భములఁ గడుంగడు సమర్థుఁడు. కాళిదాసుని స్వభావ వర్ణనలు సుకుమారములు, లలితములు, ఉద్యానములవంటి దృశ్యములునై వెలయుచున్నవి. భవభూతి వర్ణనములు నిజముగ స్వాభావికములే. దట్టములైన యరణ్యములు, పెద్ద పెద్ద జలపాతములు, గొప్ప పర్వతపంక్తులును నీతని కభిమతములు. ఆయా ఘట్టములు వర్ణించునపు డాభావములకుఁ దగిన శైలినే వర్ణించి సహృదయహృదయముఁ జూరగొనినాఁడు.

భవభూతి గొప్ప నీతిబోధకుఁడు. ఈతని నాయకు లందరు నేకపత్నీవ్రతులు. ప్రణయము కామోపభోగఫలమును స్వార్థమునగు వలపుకన్న భిన్నమనియుఁ జొక్కమగు ప్రణయమే క్రమముగా స్నేహముగ పరిణమించు ననియు నీతని యభిప్రాయము. ఈ మహాకవి లక్ష్యమే ప్రణయస్వరూప ప్రకటనమని తోఁచుచున్నది. స్వార్థరహితమగు ప్రేమయే యీతని యాదర్శము. ఈ విషయమును బ్రతిపాదించుటకే యనువగు వస్తువు నీయుత్తరరామగాథను గైకొని ప్రణయోపాసి తత్త్వమును గరతలామలకముగ లోకమునకుఁ జూపినాఁడు.

ఈతనికైత కాళిదాసునికవితవలెఁ బ్రసాదగుణముఁగల్గి కైశికీవృత్తిని గానరాదు. ఇతని ప్రయోగములలోఁ గఠినపదములును, దురవబోధకములగు నూహలును గలిగి కొన్నితావుల విసుగు పుట్టించును. కొన్నితావుల కథాగమనము కుంటువడుచుఁ బురోగమనమును శీఘ్రచలనమును లేకుండును. ఇవియే యీతని లోపములుగ గోచరించుచున్నవి. కాని ఈతని కవనమునఁగల యితర సుగుణములలో నివియొక లోపములుగ గణింపఁ పాడిగాదు. స్వచ్ఛమగు తటాకోదకమున నాచున్నట్టు లీదోషములున్నవి. రసగ్రాహులు తటాకమున శైవలమును ద్రోసి జలముం గ్రోలునట్లు, నాటకమున నీ కొద్ది లోపముల గణింపక రసముం గ్రోలుదురు గాక. భవభూతిని గురించిన విషయము మహావీరచరిత్రను గురించినవిషయమున నుడువఁబడినది.

కథాసంగ్రహము

ప్రథమాంకము: ప్రస్తావనానంతరము పట్టాభిషేకమునకై వచ్చిన ఋషులును వానరులును, బందుగులును వారి వారి తావుల కేగుదురు. సీతవిషయమైననింద నెంచి రాముఁడద్దాన సీతకుఁగష్టము సంభవించునని యూహించి చింతించును. జనకుఁడు నిజనగరమునకు వెడలగాఁ బితృవిరహమున దుర్మనాయమానముగా నున్న సీత నోదార్ప రాముడంతః పురమున కేగును. ఇంతలో ఋశ్యశృంగు నాశ్రమమునుండి దూత యొకఁడు వచ్చి గర్భిణిగ నున్న సీతకుఁ గోరిన కోర్కెలెల్లఁదీర్పవలయు నని యరుంధతీ వసిష్ఠులును, తల్లులును, రామున కెరింగించుచున్నట్లు తెల్పును. వసిష్ఠుఁడు రామునకు లోకారాధనతత్పరుఁడ వగుచుఁ గులప్రతిష్ఠను నిల్పబెట్టుమని హెచ్చరించును. ఈ సందేశము నంది శ్రీరాముఁడు 'లోకారాధనమునకై సర్వమును సీతనైనను విడుతు' నని

రాఁబోవు సీతాపరిత్యాగమును సూచించునట్లు నుడువును. లక్ష్మణుండు వచ్చి తాముందుగ వ్రాయించి యుంచిన చిత్రపటముల దర్శింప సీతారాములనాహ్వానించును. ఆ చిత్రములు పూర్వపు టరణ్యానుభవములఁ గలిగినవగుట నాదృశ్యములఁజూడ కొంత యానందమును గొంత మనః క్లేశమును గలిగించునవిగ నుండును. ఇంతలో చారుఁడు దుర్ముఖుఁడు సీతవిషయమై తా విన్న దుర్వార్తను రామున కెరింగించును. రాముఁడంత సీతావిషయక ప్రేమమున తా విన్న నిందను దలపోసి లోకులకై తా నాపెను విడువవలసెనని మనమునఁజాల దుఃఖించి తుద కామెను విపినములకుఁ బంపి యట విడువ నిశ్చయించుకొనును. లక్ష్మణుఁ డన్నగారి వాక్యము శిరసావహించి సీతతో నడవులకు బయలుదేరును.

ద్వితీయాంకము: ఆత్రేయీవనదేవత లిరువురును శుద్ధవిష్కంభమున సీత లక్ష్మణునిచే విడువఁబడిన పిదప నిద్దర శిశువుల నమడలఁ గన్నట్లును, వారు వాల్మీకిభగవానులకడ విద్యాభ్యాసమునకు వదలఁబడిసట్లును, వాల్మీకి సర్వకళల నా మేధావులకుఁ గరపుచున్నట్లును, వారికిఁ గుశలవు లని నామకరణముఁ గావించినట్లును, రాముఁడశ్వమేధయాగమును, హిరణ్మయసీతా ప్రతికృతి నిజభార్యగఁ గావించి యారంభించినట్లును, యాగాశ్వమును లక్ష్మణుపుత్రుఁడగు చంద్రకేతు రక్షణమున వదలఁబడి నట్లును, శంబూక వధార్థము రాముఁడును బయలుదేరినట్లునుఁ దెల్పుదురు. రాముఁ డుద్యత ఖడ్గుఁడై దండకారణ్యమునకేగి, శంబూకుని వధింప నతఁడు దివ్యపురుషుఁడై రాముని మెచ్చుకొని యాతనితో నా ప్రదేశములఁ దిలకించును.

దండకారణ్య దృశ్యములఁగాంచినంతఁ బూర్వానుభవములు జ్ఞాపకమునకు రాఁగా రాముఁడత్యంతము మనమున ఖేదపడును. తుదకు శంబూకునితోఁగూడి చేరువనున్న యగస్త్యుని సేవింపనేగును.

తృతీయాంకము: విష్కంభమున తమస, మురళయను నదీదేవతలు రాముఁడా దండకాటవిని బూర్వానుభవముల స్మరించి, యేమగునోయని శంకించి గోదావరీనదిని సన్నిధినుండి రాముని కాపాడఁగోరి లోపాముద్రసందేశ మంపినట్లును, అందులకు మరల నట్టి హెచ్చరిక యవసరములేదనియు, భగవతి భాగీరథి సీతతో గోదావరికడకు వచ్చియున్నదనియు, నొకవేళ నట్టిసంఘటన సంభవించి రాముఁడు మూర్ఛిలినను నిజహస్తమున స్పృశించి సచేతను నొనర్ప సీత కలదనియు, సీత యితరులకు గోచరింపకుండ నదృశ్యయై యుండునటుల భాగీరథి ప్రసాదించెననియు, నాకారణమున రాముఁడామెసాన్నిధ్యము నెరుగలేఁ డనియుఁ దెల్పుదురు. శ్రీరాముఁ డారణ్యకదృశ్యములఁ గాంచి సీతను స్మరించికొని మూర్ఛిల్లును. అదృశ్యయగు సీత, యమృతకల్పమగు తన కరస్పర్శచే నాతని మూర్ఛనుండి తేర్చును. అంత రాముఁ డచ్చెరువొంది జానకీకరస్పర్శ భాగ్యమెచటనుండి తన కచ్చోఁ గల్గెనని మరల జానకిని దలపోసి బహువిధముల విలపించుచుండును. సీతప్రియసఖియగు వాసంతి యను వనదేవత యటకేతెంచి రాము ననునయించుచుండును. అంత నా వాసంతియు రాముడును సంభాషించుచుండ, సీత తమసాద్వితీయయై యాలకించి, రామునియవస్థకుఁ గడుంగడుఁ బొగిలి తమసచే నోదార్పఁ బడి కుశలవుల కాయుర్వృద్ధిమంగళకార్యము నెరవేర్ప భాగీరథిచెంత కేగును. రాముఁడును సీతను దలఁచుకొని హిరణ్మయ ప్రతికృతినిఁ జూచియైన నూరడిల్లఁగోరుచు, నశ్వమేధము నేరవేర్ప నయోధ్యకేగును.

చతుర్థాంకము: ఇందు వాల్మీక్యాశ్రమము రంగము. దాండాయన, సౌధాతకులను నిర్వురు వాల్మీకిశిష్యులు, వసిష్ఠుఁడు, జనకుఁడు, రామమాతలు మున్నగు నతిథులు ఆశ్రమమునకు వచ్చుటచే శిష్టానధ్యాయము నాట పాటలతో గడప నెంతురు. జనకుఁడు జానకిని

దలఁచుకొని దుఃఖించుచుండ, వసిష్ఠానుమతి కౌసల్య జనకుని జూడ నా యిర్వురును శోకావిష్టులై మిగులఁ బొగులుచుందురు. ఇంతలో నాశ్రమమున వాల్మీకిశిష్యులనడుమ శ్రీరాము ననుకరించు నీలోత్పలశ్యాము నుజ్జ్వలదేహుని కుమారు నొకని దూరమునుండియే చూచియాతఁడెవ్వఁ డని తెలియఁగోరి, వాల్మీకి నడిగి తెలిసికొని రమ్మని కంచుకిని బంపుదురు. ఇంతలో నా బాలుని కౌసల్య పిలువ నతఁడు సమీపించి పెద్దలకుఁ బ్రణమిల్లి తనపేరు లవుఁడని తెల్పును. జనకుఁడును సీతాముఖసాదృశ్య మాతని మోమునఁగాంచి యతని తలిదండ్రు లెవరన, లవుఁడు తాను వాల్మీకిశిష్యుఁడ ననిచెప్పును గాని తలితండ్రు లెవరో తెలియదనును. అంత జనకాదులతో సంభాషించుచు. వాల్మీకి రామాయణమును సీతాపరిత్యాగము దనుక వ్రాసెనని నుడువును. లవుఁడు అరుంధతివలన వారల కౌసల్యా జనకులుగా తెలిసికొనును.

ఆశ్రమబాలురు చంద్రకేతురక్షితమై యశ్వమేధాశ్వము రాగా నా యద్భుత పదార్థమును జూడ, లవునకుఁ దెలుపుదురు. లవుఁడును వారితో నేగి యది యాగాశ్వమని గుర్తించి దానిని గట్టి యాశ్రమమునకుఁ దెమ్మనును. ఇంతలో జనకాదులు వాల్మీకి కడకేగ నా ఋషియు సర్వము నుచితకాలమున వెలిబుత్తునని చెప్పును. అశ్వముతోవచ్చిన సైనికులలో నొకఁడు లవు నామూర్ఖపుపట్టునుండి విరమింపఁగోరును. తోడిబాలురు భీతిల్లుదురు. లవుఁడుమాత్రము బెదరక ధనువు గ్రహించును.

పంచమాంకము: లవునిధాటికి నిల్వలేక చంద్రకేతు సైనికులెల్లరు పలాయితులగుదురు. అంత చంద్రకేతువు స్వయముగ వచ్చి, అదురు బెదురు లేక నొంటరివాఁడయ్యు నంతమంది యోధుల నెదుర్కొను లవుని జూచి యాతని పరాక్రమమును మెచ్చుకొని తనతోఁ బోరఁగోరును. ఇంతలోఁ

బ్రతిపక్షసైన్యము నంతయు లవుఁడు జృంభకాస్త్రప్రయోగమున మూర్ఛిలఁ జేయును. చంద్రకేతు వా విషయమున విస్మయముఁజెంది రథమునుండి దిగి లవుని సమీపింపవారు నభిముఖముగ నిలిచి వీరాలాపము లాడుదురు. ఆ సంభాషణమునఁ గ్రమముగా రాముని పరాక్రమగుణముల గురించిన ప్రసంగము వచ్చును, లవుఁడు రామ పరాక్రమము గొంచెము హేళనముగ నుడువఁ జంద్రకేతువునకుఁ గోపము రాగా నా యిరువురును రణరంగమునఁ దీవ్రముగఁ బోర నేగుదురు.

షష్ఠాంకము: విద్యాధరీ విద్యాధర సంభాషణరూప విష్కంభమున లవచంద్రకేతువుల యుద్ధ మతిఘోరముగ జరుగుచున్న దనియు, పరస్పరము ఆగ్నేయ, వారుణ, వాయవ్యాస్త్రములఁ బ్రయోగించి రనియు, నింతలో రామచంద్రుఁడు శంబూకవధానంతరము ప్రతినివృత్తుఁడగుచు నా రణరంగమున నవతరించె ననియుఁ దెలియుచున్నది. రాముని జూచి లవచంద్రకేతువులు యుద్ధము మానుదురు. రాముఁడు చంద్రకేతువు వాలింగన మొసఁగఁ గోర నాతఁడు కౌఁగిలించుకొని తన్నుజూచినట్లే లవునిఁ గూడఁజూడుఁడని రాము నభ్యర్థించును. శ్రీరాముఁడు వాత్సల్యమున లవుని గంభీర మధుర లావణ్యాకృతింగాంచి సంతసించును. రాముని గన్నంత లవుఁడును శాంతుఁడై, చంద్రకేతుమూలమున నాతని శ్రీరాముఁడని విని వినయమున నమస్కరించును. లవుఁడంతఁ దన బాలిశత్వమును క్షమింపఁ గోర రాముఁ డట్టిది క్షత్రియున కలంకారమని మెచ్చికొని లవుని జృంభకాస్త్రము నుపసంహరింపఁ గోర నాతఁడట్లు చేయును. అంత రాముఁడు లవుని యుదంత మడుగుచు నాతనితో సంభాషించుచుండ నింతలో కుశుఁడు లవుని గలసికొనును. లవునిమూలమున రాము నెరింగి ప్రణమిల్లును. రాముఁడు కుశునిగూడఁ గౌఁగిలించికొని పుత్రాలింగనసుఖ మనుభవించుచు నాయమళల రూపమున రఘుకుమారచ్ఛాయలగాంచును.

మరియు వారిని గమనించి చూచి సీతాముఖసాదృశ్యము వారిమోములఁ దిలకించి సీతందలపోసి కడుంగడు దుఃఖించును. కుశలవులును రామునియవస్థకు జాలినొందుదురు. అంత దూరమున నరుంధతీవసిష్ఠులను, జనకుని, కౌసల్యను గని వారిని జూడ, నందును జనకుని జూడ సిగ్గుపడి చాల మోమోటపడుచు వారిని గలసికొననేగును.

సప్తమాంకము: వాల్మీకినిదేశమున లక్ష్మణుఁడు గంగాతీరమున నొకరమ్యమగు రంగభూమిని సిద్ధముచేసి యుంచును. వాల్మీకివిరచితమగు లఘునాటకము నప్సరసలు ప్రయోగించుదానిని జూచుటకు రామాదు లందరును ఆహ్వానింపఁబడి యటఁజేరి యుందురు. ఆ నాటకమున సీతాపరిత్యాగానంతరము జరిగిన వృత్తాంత మంతయు సంక్షేపముగా వ్రాయఁబడి యుండును. రామునకు సీతాపారిశుద్ధ్యము మనమునకు బాగుగా నచ్చునట్లు తెల్పు నుద్దేశముతో వాల్మీకి ఈ పన్నుగడ పన్నును, అంత నాటక మారంభింపగనే సీతయేడ్పు వినఁబడగా సూత్రధారుఁడు సీత గంగలోఁ బడ నున్నదని సభ్యులకుఁ దెలియఁ జేయును. రాముఁ డామెను క్షణ ముండుమని వారింపఁ బోవును. లక్ష్మణుఁ డాతని నది నాటకమని హెచ్చరించును. పృథ్వీగంగాదేవతలు సీత నోదార్తురు. సీతాపృథ్వీగంగలు సంభాషించుచు సీత యమళల గనినట్లును, వాల్మీకిచే వారు పెంచబడుచున్నట్లును మొదలగు విషయములఁ దెలియఁ జేయుదురు. ప్రేక్షకులెల్లరును సీతాపారిశుద్ధ్యమును గూర్చి మెచ్చుకొందురు. రాముఁడును నిజప్రజల నా విషయముఁ బరీక్షింపగోరును. నిజకార్యమును దలంచికొని దుఃఖమున రాముఁడు మూర్ఛ నొందును. అరుంధతి సీతందోడ్కొని రాముని మూర్ఛనుండి మేల్కొలుప నటకు వచ్చును. అప్పుడరుంధతి సభ్యులకెల్ల దేవతలచేతను బాతివ్రత్య మూర్తియని మెప్పువడసిన సీతావిషయమున శంకించుట తగదని హెచ్చరింపఁ

బ్రజలందరును సీతకు నమస్కరింతురు. అంత నరుంధతి సీతను భార్యగా ధర్మానుసారము గైకొనుమని రామున కర్పింప మరల నతఁడు గ్రహించును. వాల్మీకియుఁ గుశలవుల నాతని కుమారులని నుడివి గైకొనుమని యొసఁగ వారందరును గలసి నిర్భరానందమున నుందురు.

భవభూతి సామర్థ్యము

ఈ ఉత్తరరామచరితము నాటకవాఙ్మయమున ప్రధానస్థాన మాక్రమించుచున్నది. ఇది భవభూతికృతులలో నెల్ల మేటిదై యాతని ప్రతిభను జాటుచున్నది. భవభూతి కవితాకళయందును సమర్థుడగుటచే మానవహృదయమును లెస్సగా నెరింగి, సూక్ష్మాతి సూక్ష్మములగు భావములను వెల్లడించుచు, నుత్తమ శీలముగల పాత్రలఁ జక్కగా నాదర్శప్రాయములుగ నుండునట్లు చిత్రింపఁగల నేర్పుగలవాఁడని తెలియుచున్నది. అతని యూహలు, నాదర్శములు నత్యుదాత్తములు నున్నతములునై వెలయుచున్నవి. లోకవృత్తమున దుఃఖితునితో సమముగ దుఃఖించి సుఖవంతునితోఁ దుల్యముగ సుఖింపగల భావసౌకుమార్యము గలవాఁడగుటచేతనే సీతారాములవంటి యుత్తమ పాత్రల లోకోత్తర చరితులుగను నద్వితీయ ప్రేమపాశబద్ధులుగను జిత్రింపఁగల్గెను.

భవభూతి తాఁ జిత్రింపఁ దలచిన పాత్రల లెస్సగాఁ బోషించుటయందే నిమగ్నుఁడై దేశకాలాదుల గణింపక కొంత యనుచిత కవిత్వము నల్లును. పాపమది యాతని నేరము కాదు. నాటకమునందు భావముల నంత యతిశయముగఁ జూపినఁగాని ప్రేక్షకుల హృదయమున నాటుకొనవని కాబోలు నాతని యభిప్రాయము. భాషయందతనికిఁగల పాటవ మనన్యసామాన్యము. తత్తద్రసానుగుణముగఁ జెవుల కింపగు పదజాలము స్వయముగనే యాతనికి పైపైఁ బడుచుండును. కరుణ మొక్కటియే

రసమనియు, మిగిలిన వన్నియు దాని వికారములే యనియు నాతని యభిప్రాయము నీయుత్తరరామచరితమే దృఢపరచుచున్నది. దైవదుర్విపాకముచే దుఃఖమనుభవించుచున్న సీతారాముల విషయమేకాక, జనకాదులయొక్క దుస్థితిగూడఁ దిలకించినపుడు ప్రతి ప్రేక్షకుఁడును గన్నుల నీరుఁ గార్చుచుఁ దన్మయుఁడై పై దుఃఖితులగు పాత్రలతో సానుభూతిఁ జూపుచు నాయాపాత్రల దుఃఖమెట్లు పరిణమించునా యని మున్ముందుఁ జూడ నభిలషించుచుండును. ఇట్లు ప్రేక్షకుల హృదయముల నాకర్షించు నేర్పుగల నాటక కర్తలలో భవభూతి యగ్రగణ్యుఁ డనుటలో సందియ ముండదు.

భావసంఘర్షణమును జూపుటయే కవులనేర్పు. మహానుభాఁవుడును లోకోత్తరుఁడునగు శ్రీరామునిహృదయవేదన మాలోచించియే భవభూతి,

"వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి।
లోకోత్తరాణాం చేతాంసి కోను విజ్ఞాతుమర్హతి॥"

(అంక-2. శ్లో-6.)

అని నుడివినాఁడు. చూడుఁడు. వెన్నవలె కరగిపోవు శ్రీరాముని హృదయమున సీతా విషయక ప్రేమ సంభాషణమున సౌకుమార్యమును జూపినట్టులే, నిజరాజకార్య నిర్వహణమున నైక్ష్వాకుల కులాచారము లోకారాధనమే యగుట నిజభార్యను బరమపతివ్రతను సీతనుగూడ, లోకము నిరంకుశమని యెరింగియు, తదారాధనకై విడుచునపుడు. ఆ రాముని హృదయ మెంత కాఠిన్యము వహించెనో చక్కగాఁ జూపగల్గెను, నిందుచూలాలిని, ఎవ్వఁడో సీత నుదహరించి పరగృహవాస దోషము నారోపించి నిందించె నని, స్వయము పావకునిచేఁ బరిశుద్ధ యగుట ప్రత్యక్షముగఁ జూచియు, మనమున నామె నేమాత్రమును సంశయింపని

వాఁడయ్యునట్టి దయనీయావస్థలో నడవులపాలు సేయ సంకల్పించిన దిట్టతనము లోకోత్తరుఁడగు రామునకే తగును. పురాణపూరుషు లెందరో యుండ భవభూతికి శ్రీరాముఁడే నచ్చిన ధీరుఁడు. అతని దృక్పథమునకు గురియైన యాదర్శపాత్రము రాముఁడే.

ఈ నాటకమున భవభూతి వాల్మీకిరామాయణగాథ నాధారముగాఁ గొనినను నచ్చటచ్చటఁ బెక్కుమార్పులు నాటకోచితముగ నుండుటకై కూర్చి, తీర్చిదిద్ది నాటకమును హృదయరంజకముగ సర్వజనాదరణీయముగ రచించినాఁడు. సంస్కృతనాటక నియమానుసారము మోదాంతముగ నుండవలసియుండుటచే రామాయణమున సీత భూగర్భమునకుఁ బోయినట్లును. బిదపఁగొంత కాలమునకు రాముఁడును వైకుంఠమున కేఁగినట్లును జెప్పబడినను, నీ కవి తద్విరుద్ధముగ సీతారాముల సమాగమమును జూపి కథను మోదాంతముగఁ జేసెను. పాశ్చాత్యులు ఖేదాంత నాటకములను మెచ్చుకొందురు. ఆ దేశవాసుల మనస్తత్త్వముల ననుసరించి, యవి వారికి బాగుండునేమో కాని మన భారతీయుల లక్ష్యము ఆనందమయమగు నాత్మపదార్థమే. కావుననే సర్వమును తన్మయముగ నుండవలయునను నియమముల నేర్పరచి నాటకమునఁగూడ ముగింపు మోదాంతముగ నుండవలయు ననిరి. అట్లని దుఃఖ సంఘటనలు వీరికిఁ దెలియక పోలేదు. ఆయా సందర్భములలో ఖేదఘట్టముల వర్ణించునపుడు పాశ్చాత్యులు మెచ్చుకొను ఖేదవిషయముకన్న నెన్నియో మడుంగులు మేలుగ వ్రాయఁ గలుగుదురు. అచ్చటచ్చట నట్టి సన్నివేశములు కల్పించి ప్రేక్షకుల హృదయముల నరికట్టి నాయికా నాయకు లవల నేమగుదురో పాపమను జాలిబుట్టించి యాదశ నుచ్చస్థానమునకుఁ దెచ్చి తుదకు మోదాంతముగనే చూపుదురు. కాని యెపుడును ఖేదాంతముగాఁ జూపరు. భారతీయనాటక తత్త్వమిట్టి ప్రదర్శనములందే పేరు గాంచినది.

నాటకమున మార్పులు

ప్రథమాంకమున నాటకారంభమున శ్రీరాముఁడు పట్టాభిషిక్తుఁడై సుఖముగ సీతాసమేతముగ నున్నట్లును బట్టాభిషేకమహోత్సవమునకు వచ్చిన వారందరును వారివారి స్థానముల కేగినట్లును, బెద్దలగు నరుంధతీ వసిష్ఠులును, గౌసల్యాదులును ఋశ్యశృంగాశ్రమమున సత్త్రయాగమున కేగినట్లును దెలియచున్నది. అష్టావక్రుడు వసిష్ఠసందేశము రామునితో,

"జామాతృయజ్ఞేన వయం నిరుద్ధా
స్త్వం బాల ఏవాసి నవం చ రాజ్యమ్।
యుక్తః ప్రజానామనురంజనే స్యా
స్తస్మాద్యశో యత్పరమం ధనం వః॥"

(అంక-1. శ్లో-11.)

అని లోకారాధన తత్పరుఁడవు కమ్మని తెల్ప వెంటనే తదనుసారము,

"స్నేహం దయాం తథా సౌఖ్యం యదివా జానకీమపి।
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా॥"

(అంక-1. శ్లో-12.)

అని నుడువును. చిత్రపటము లగ్నిశుద్ధివరకు నని చెప్పగా సీతను పరిశుద్ధనుగా భావించును. జీవితమునఁ బరమానంద మనుభవించు నుచ్చస్థానమున నున్నట్లు సీతారాములు చూపఁబడుచున్నారు. అనన్య సామాన్య దాంపత్యమున వారు సుఖ మనుభవించుచుందురు. సీత గర్భిణిగా నుండును. సీతవిషయమై రాముఁడు.

"ఉత్పత్తిపరిపూతాయాః కిమస్యాః పావనాంతరైః।
తీర్థోదకం చ వహ్నిశ్చ నాన్యతః శుద్ధిమర్హతః॥"

అని పరమ పరిశుద్ధ యనుభావమున నామెయెడ సబహుమానముగ నుండును. ఆమె వినోదార్థము రామకథనంతయుఁ జిత్రముల వ్రాయించి లక్ష్మణుఁడు వారికిఁ జూపును. ఈ చిత్రపట ప్రదర్శన కల్పనము కవికల్పితము. రామాయణమున లేదు. దీనిచే సీత వనవాసమున కాసపడుట రాఁబోవు ప్రవాసమును సూచించును. ఈ చిత్రపటములందు రాముఁడు విశ్వామిత్రునొద్ద పొందిన జృంభకాస్త్రములను పటమున జూచు సందర్భమున రాముఁడే సీతతో 'సర్వధేదానీం త్వత్ప్రసూతిముపస్థాస్యంతి' అననామెయు 'అనుగృహీతాస్మి' అనును, దీనిచే మున్ముందు షష్ఠాంకమున లవ చంద్రకేతు యుద్ధమున లవ ప్రయుక్తములగు నీజృంభకాస్త్రముల చేతనే లవుఁడు తన కుమారుఁడే యైయుండ నోపునని రాముఁడు సంశయింపఁ గారణమగు చున్నది. మరియు నీ చిత్రదర్శనముననే పంచవటియందు శూర్పణఖాచిత్రముం జూచినంత సీత 'హా ఆర్యపుత్ర! ఏతావత్తే దర్శనం' అన రాముఁడు 'అయి విప్రయోగత్రస్తే! చిత్రమేతత్' అని సమాధానమునను రాఁబోవు వియోగచ్ఛాయలు సూచింపఁబడుచున్నవి.

సీత యలసి శయనింప నామె బాహువుచేఁ గంఠమున నాలింగితుఁడై రాముఁడు పారవశ్యముఁజెంది.

'వినిశ్చేతుం శక్యో న సుఖమితివా దుఃఖమితి వా
ప్రమోహో నిద్రా వా కిము విషవిసర్పః కిము మదః।
తవ స్పర్శే స్పర్శే మమ హి పరిమూఢేంద్రియగణో
వికారశ్చైతన్యం భ్రమయతి చ సమ్మీలయతి చ॥'

(అంక-1. శ్లో-35.)

ఇది సుఖమో, దుఃఖమో, మోహమో, నిద్రయో, విషవేగవ్యాప్తియో, సమ్మోదమో నిశ్చయింప శక్యము గాకున్నది. నీ యొక్కొక్క స్పర్శమందును

నాకు సకలేంద్రియజ్ఞానము శూన్యమై మనఃక్షోభమును, నుల్లాసమును గలుగుచున్నది అనియు, నామె సరసవచనము లాలకించి.

'మ్లానస్య జీవకుసుమస్య వికాసనాని
సంతర్పణాని సకలేంద్రియమోహనాని।
ఏతాని తే సువచనాని సరోరుహాక్షి!
కర్ణామృతాని మనసశ్చ రసాయనాని॥'

(అంక-1. శ్లో-36.)

ఓ పద్మాక్షి! నీ మధురవచనములు వాడియున్న నా జీవకుసుమమును వికసింపఁజేయుచు సంతృప్తి నొసఁగుచున్నవి. సకలేంద్రియములను వ్యాపారాంతరము లేక మోహింపఁ జేయుచున్నవి. కర్ణములకు వినినంత నాప్యాయనము లగుచు నమృతమువలెను మనసునకు రసాయనముల వలెను నున్నవి'. యని సీతా విషయక భోగ్యతా ప్రకర్షనుగూర్చి మిక్కిలి యుదాత్తముగా వచించును. ఇంతకంటె వర్ణింప నలవికానట్లు భవభూతి వర్ణించినాఁడు. ఇట్టి సుఖము నుచ్చస్థితి ననుభవించుచున్న నాయికా నాయకులగు సీతారాముల నొక్కుమ్మడి విరుద్ధమగు దుఃఖాంబుధిఁ బడద్రోయునట్లు విధివిలాసము సమకూరును. నాటకీయముగ నీ యుచ్చదశలో సుఖమున వీరినిజూపి వెంటనే విపరీతమగు దుఃఖముంజూపుటచే ప్రేక్షకులహృదయములు సంచలింపఁబడి సీతారాములతో సానుభూతి నొందుచున్నవి. ఇప్పుడు చారుఁడు దుర్ముఖుఁడు పిడుగువంటి సీతావిషయక పౌరజనాపవాదమును రామునకుఁ దెల్పును, తొలుతనే సీతా పారిశుద్ధ్యమున 'ఉత్పత్తి పరిపూతాయాః' యని నుడివి యామె విషయమైన మహాభోగ్యతా ప్రకర్షను గొనియాడిన రామున కీవార్త విన్నంత నెటు లుండునో పాఠకులే యూహించుకొందురు గాక. ఇట్టి సందర్భమున రాముని

హృదయమున నగ్నిపర్వతములు పైకి పొర్లుచుండును. ఆ దుఃఖము భరింప రానిది. ఆతని పదవి మహారాజపదవి. తన ఐక్ష్వాకు కులప్రతిష్ఠ నిల్పుటకు లోకారాధనవిషయ మొకవైపు. తన సర్వస్వము, స్వార్థము నైన సీత విషయ మొకవైపు హృదయమున నాతని నాచికొనినవి. సత్యసంధుఁడును, నాడినమాట తప్పనివాఁడును గాన రాముఁడు తన సౌఖ్యమున కాలవాలమగు సీతకన్న లోకారాధనమే మిన్నయని భావించి సీతను విడనాడ నిశ్చయించుకొనును. ఇట్టి భావసంఘర్షణమును జూపుటయే కవినేర్పు. ఇది అంతఃకరణమునకు సంబంధించిన భావసంచలనము. భవభూతి యిట్టి భావఘర్షణమునుజూపి ప్రేక్షకుల నానందింపఁ జేయుచున్నాఁడు. మొత్తముమీఁద నీ యంకమునఁ జిత్రదర్శనమే ముఖ్యమగు మార్పు. ఇది నాటకోచితముగ భావికార్యముల సూచించుటకు కవి కల్పించిన నూతన సన్నివేశము. ఇది ప్రేక్షకులకు రామకథను పూర్వకథను దెలియపరచుచు ప్రకృత కథతో నన్వయించుకొనుట కనుకూలపడునట్లు సముచితముగ నిందుఁ బొందుపరుపఁబడినది. కావుననే యీ యంకమునకు 'చిత్రదర్శన' మని పేరు.

ద్వితీయాంకమున ఆత్రేయీ వాసంతికలు సంభాషించుచు సాధువృత్తిని గూర్చియు, సజ్జనలక్షణముంగూర్చియుఁ దెల్పుదురు. వాసంతిక యను వనదేవత ఆత్రేయి కాతిథ్య మొసఁగుచు.

"యథేచ్ఛం భోగ్యం వో వనమిదమయం మే సుదివసః
సతాం సద్భిస్సంగః కథమపి హి పుణ్యేన భవతి।
తరుచ్ఛాయం తోయం య దపి తపసో యోగ్యమశనం
ఫలం వా మూలం వా తదపి న పరాధీనమిహ నః॥"

(అంక-2. శ్లో-1.)

'ఈ వనమును యథేచ్ఛముగ ననుభవింపుఁడు మీ రాకచే నేఁడు నాకు సుదినము. సత్సాంగత్యము మిక్కిలి కష్టముచేతను బురాకృతపుణ్యముచేతనే లభించును. చెట్లనీడ, నీరు, తాపసయోగ్యమగు నాహారమెద్దియైనను నిట పరాధీనము కాదు. అనఁగా నీ యరణ్యమున సర్వము తాపసయోగ్యములగు నాహారాదులు మీవంటి తాపసులు యథేచ్ఛముగా సంకోచింపక యనుభవింపవచ్చును' అని నుడువ, నాత్రేయియుఁ దదుచితముగ, నాతిథేయత్వవిషయముం గూర్చి-

"ప్రియప్రాయా వృత్తిర్వినయమధురో వాచి నియమః
ప్రకృత్యా కల్యాణీ మతి రనవగీతః పరిచయః।
పురో వా పశ్చాద్వా తదిదమవిపర్యాసితరసం
రహస్యం సాధూనామనుపథి విశుద్ధం విజయతే॥"

(అంక-2. శ్లో-2.)

'ప్రీతిపూర్ణమైన వర్తనము, వినయమధురమగు నల్పభాషిత్వము, స్వభావముననే కల్యాణకృత్యప్రవణమగు బుద్ధి, అనిందితమగు పరిచయము, భూతభవిష్యత్కాలములందును, ప్రత్యక్షపరోక్షములందేనియు మార్పుఁజెందని యనురాగమును గల సాధుజీవితము విశుద్ధమై దుర్జనవిజ్ఞేయము గాక వెలయుచుండును' అని సత్పురుషలక్షణమును జక్కగా నుడివెను. భవభూతి నిజాదర్శమునే యీ పాత్రలమూలమున నిట్లు సత్స్వభావమును వెల్లడిఁ జేయుచున్నాఁడు. తాపసాశ్రమములం దిట్టి సద్వృత్తి సాధారణమని నుడివి, కుశలవు లట విద్యాభ్యాసముఁ గావించుటచే నట్టి సద్వృత్తియే వారి కలవడియుండునను భావము బోధించుటకై యీ వర్ణనము తోడ్పడుచున్నది. అంతియ కాక పూర్వము గురుకుల పద్ధతిని విద్యాభ్యాసము జరుగు చుండినకాలమున నాయా యాశ్రమముల శిక్షనొందిన శిష్యులు సత్పురుషులై లోకారాధ్య లగుచుండిరను విషయమును ధ్వనింపఁజేయుచున్నది.

ఈ విష్కంభముచేఁ గడచిన సీతాపరిత్యాగవృత్తాంతముగల ప్రథమాంకమునకును, రెండవయంకమున రాముఁడరణ్యమున శంబూకవధకై బయలుదేరు వరకును గడచిన కాలము తెలియుచున్నది. ఆత్రేయి వాల్మీక్యాశ్రమమునఁ గుశలవులను నిరువురు మేధావులు దివ్యప్రభావులు, ఆజన్మసిద్ధజృంభకాస్త్రులు కడు కుశాగ్రసూక్ష్మబుద్ధులై విద్య నేర్చుచున్నారనియుఁ, దనకు (ఆత్రేయి) వారితో సహాధ్యయనము సలుపు యోగ్యత లేమిచే నగస్త్యాశ్రమమున కేగఁదలఁచినట్లును, కుశలవులు పదునొకండవయేట నుపనీతులైరనియు, ఋశ్యశృంగమహర్షి సత్త్రయాగము గూడ సమాప్తమైనదనుటచేతను నీ రెండంకముల మధ్యకాలము పండ్రెండేండ్లని తెలియుచున్నది.

ఈ ఆత్రేయి, మరియు వాల్మీకి రామాయణమును రచించుచున్నాఁ డనియు, రాముఁడశ్వమేధయాగము నారంభించి శంబూకవధార్థము వచ్చుచున్నాఁడనియుఁ దెల్పును. దీన పూర్వాంక కథ పరిచితమగుచున్న దేకాని కథావేగమున చలనము లేదు. ఈ ఆత్రేయి వేదాధ్యయనమునకై వాల్మీక్యాశ్రమమునుండి వేరొకతావున కేగుటఁ జూడ, 'స్వప్న వాసవదత్త' నాటకమందు ప్రథమాంకమున వచ్చు బ్రహ్మచారి జ్ఞప్తికి వచ్చుచున్నాఁ డు. అక్కడఁగూడ బ్రహ్మచారి లావణకమునకు వేదాధ్యయనమునకుఁ బోవుచున్నట్లు తెల్పును. ఈ యిరువురి ప్రవేశమువలనఁ దెలియవలసిన కొన్నివిషయములు తెలియుచున్నవి. ఇట్టికూర్పులందు భవభూతి భాసు ననుకరించుచున్నాఁడు. ఈ ఆత్రేయివలన పూర్వకాలమున స్త్రీలు గూడ వేదాధ్యయన మాచరించుచుండిరని తెలియుచున్నది.

శంబూకవధానంతరము జనస్థానదృశ్యములఁ గాంచి, సీతాసహవాస పరిచయమున హాయిగాఁ గడపిన దినములు స్మరణమునకు రాఁగా, రాముఁ డు మిగుల దుఃఖించును. ఇప్పట్టున నా యారణ్యకదృశ్యముల

వర్ణించునపుడు భవభూతి, దండకారణ్యము మన కన్నులయెదుటనే గోచరించునట్లు చమత్కారముగను, జాలిఁగొలుపుచు కరుణరస భూయిష్ఠముగను వర్ణించెను.

తృతీయాంకమున శుద్ధవిష్కంభమున-తమస, మురళ యను నిద్దరు సంభాషించుచు నదృశ్యముగనున్న సీతావిషయమును, రాముని దయనీయావస్థను ప్రేక్షకుల కెరుకపరతురు. కుశలవులు సీతాకుమారులని యీ యంకమున కవి ప్రేక్షకుల కీ విష్కంభమునఁ దెలియఁజేయుచున్నాడు. ద్వితీయాంకమున కేవలము, కుశలవులను నిరువురు దివ్యప్రతిభావంతులు వాల్మీక్యాశ్రమముననున్నట్లు మాత్రము నుడివెను. నాటకోచితముగ భవభూతి వారివిషయ మిట నీయంకమున వారు సీతాపుత్రులనియు, వాల్మీకియొద్ద విద్యాభ్యాసమునకు విడువఁబడి రనియుఁ దెల్పి, ప్రేక్షకుల హృదయమునకుఁ గొంత శాంతినిఁ గూర్చినాఁడు. వాల్మీకి తపోవనప్రాంతమున విడువఁబడిన సీతవిషయముకూడఁ దెలిసికొనఁ గుతూహలపడు ప్రేక్షకహృదయమును లెస్సగ గుర్తించి భవభూతి యిట నద్దానిని దెల్పెను.

ఈ యంకారంభముననే మురళ, రామునివిచారముంగూర్చి, "అనిర్భిన్నోగభీరత్వా దంతర్గూఢ ఘన వ్యథః। పుటపాక ప్రతీకాశో రామస్య కరుణోరసః॥" అని శ్రీరాముఁడు చాల గంభీరప్రకృతిగలవాఁ డగుట నతని దుఃఖ మొరులతోఁ జెప్పికొనునది గాక లోలోన నధికమై, పుటపాకమువలె నుండుట తెల్పుచు నీ యంకమున కరుణరసమే ప్రధానముగ నుండునని రాముని విషయమును గూర్చియు, సీతావిషయమున, 'కరుణస్యమూర్తి రథవా శరీరిణీ విరహవ్యథేవ వనమేతి జానకీ' యని కరుణమే జానకీరూపము దాల్చెనా యనునంతటి దయనీయావస్థం గూర్చియు

సభ్యులకీ యంకమున నాయికానాయకులగు సీతారాముల మనోవేదనల నెరుకపరచుచున్నాఁడు. నిష్కళంకమైన ప్రేమస్వరూపము వీరి సంభాషణమునను, వీరిప్రవర్తనలవలనను బోధింపఁబడుచున్నది.

రాముని యొలుగు విన్నంత, సీత మేఘగర్జనమున నెమిలివోలె నుత్కంఠితయై నిజప్రేమరసమును వెలిబుచ్చుచున్నది. భవభూతి మానవహృదయమును లెస్సగా పరిశోధించినాఁడు. సీతారాముల హృదయము లందన్యోన్యము వారికిఁగల ప్రేమ, యన్యులకు దురూహమనియు, వారి శోకము దుర్భరమనియు, నిందుఁ జక్కగా వారిహృదయములఁ దూరి చూచెనా యనున ట్లుదాత్తముగ వారి భావములఁ జిత్రించినాఁడు. పూర్వపరిచయములఁ దలపోసికొని సహింపలేక మూర్ఛ నొందుదురు. వారి భావసౌకుమార్యమట్టిది. ఒకవైపు రాజ్యపరిపాలనమున కాఠిన్యముఁదాల్చు హృదయమే యిప్పట్టున కుసుమసుకుమార మగుచున్నది. ఇట్టి భావ వైపరీత్యమును, సునిశితములగు నా భావచ్ఛాయలను మృదువుగ, మధురముగఁ జిత్రించుటయందే కవిప్రతిభ వెలయుచున్నది. ఈ కళాపోషణమునందే భవభూతి అద్వితీయుఁడు.

రాముఁడు మూర్ఛిలియుండ, నదృశ్యయై సీత యటకువచ్చి నిజకరస్పర్శమున వల్లభుని మూర్ఛఁదేర్చును. సీతాకరస్పర్శము రామునకట్టిది. తొలుతనే ప్రథమాంకమున సీత రామునికంఠమును నిజకరమున నాలింగన మొనర్ప రాముఁడామె కరస్పర్శముంగూర్చి.

"వినిశ్చేతుం శక్యో న సుఖమితి వా దుఃఖమితి వా।
..... సమ్మీలయతి చ॥"

(1-35.)

అని పరమానందప్రదమని నుడివియున్నాఁడు.

ఇప్పుడును సీతాకరస్పర్శమున మేల్కొని, 'స్పర్శః పురా పరిచితో నియతం సఏవ' అని నిశ్చయముగా నా తాకుడు పండ్రెండు సంవత్సరములు గడచినను సీతాకరస్పర్శజసుఖమునే మరల గుర్తింపఁగలుగునంతటిది సీతారాముల దివ్యప్రేమ, అట్లు తన్ను అడవులపాలు సేసినను సీత యీ సన్నివేశమునఁ బరోక్షమున, (తానదృశ్యయైయుండి) రాముని హృదయనిర్వేదము తనవిషయమై యతఁడెంత దుఃఖించుచున్నాఁడో తెలిసికొన నవకాశమును గల్పించినాఁడు భవభూతి.

ఈ రీతి నాయికా నాయకులు వియోగమం దొండొరులమనసు తెలిసికొనుట కనువగు సందర్భముల తొలుత భాసుఁడే తన నాటకములందుఁ గల్పించెను. "స్వప్నవాసవదత్త" నాటకమున పద్మావతి తలనొప్పిచేఁ బాధపడుచుండ, నామె నోదార్చుటకును, వినోదపరచుటకును వాసవదత్త, యామెకడకుఁ బడకటింటికిఁ బోవును. ఉదయనుఁడు విలాసముగఁ బద్మావతీశయనమున గప్పుకొని పరుండియుండును. వాసవదత్త. పద్మావతీశయనమున నున్న వ్యక్తిని బద్మావతి యని నిజకరమున స్పృశించును. వెంటనే ఆ తాకుడు వాసవదత్తాకరస్పర్శజసుఖము నొసఁగెనని ఉదయనుఁడు మేల్కొని కలగన్నవానివోలె వాసవదత్తాపరిచయ వృత్తాంతములను, కొన్ని పూర్వవిషయములఁ దలఁచుకొని విలపించుచు నామెపై తనకుఁగల ప్రేమను వెల్లడించును. చాటుననుండి వాసవదత్త వినుచుండును. ఇట రాముఁడదృశ్యయైయున్న సీతకై మిగుల విలపించును. సీత గమనించుచుండును. ఈ సన్నివేశమునే భాసుననుకరించి భవభూతి యీ యంకమున సీతారాముల నట్లుచేసి యొండొరుల విరహమున నేడిపించుచు కొంత యానందింపఁ జేయును. మనస్సునకు ఊరటఁ గూర్చును. రాముఁడు నిజాశ్వమేధయాగమున హిరణ్మయ సీతాప్రతికృతిం జూచి, "తత్రాపి తావద్బాష్పదిగ్ధం చక్షుర్వినోదయామి" బాష్పదిగ్ధములగు

నిజనేత్రముల వినోదింతునని నుడివినపుడు, సీత, నిజముగఁ బరిత్యాగలజ్జా శల్యముఁ బెరకివేయఁబడినట్లు భావించెను. ప్రియులకు పరనారీ సంపర్కము లేదని భార్యలు మిగుల సంతసింతురను భావము బాగుగా గ్రహించి భవభూతి యిట్లు రసవంతముగఁ గూర్చినాఁడు.

ఈ యంకమున రసపోషణ ముచ్చస్థాన మందినది. ఇందు రసము, కరుణమన, కరుణ విప్రలంభమే యనియు నుత్తరత్ర ప్రతిపాదింపఁబడును. నాటకీయముగ నిది మనసున కానందము గూర్చుచున్నది. ప్రేక్షకులును సీతారాముల ప్రేమపురస్సరమగు కరుణామయావస్థలం గాంచి వారితోఁ దుల్యానుభవముం జూపుచు మైమరచి తన్మయులై కన్నుల నీరుఁ గార్చుచుందురు. నాటకీయముగనిది యద్భుత సంవిధానము. ఇట్టి సందర్భమునకై యెచటనో యున్న సీతను గోదావరీప్రాంతమునకు రప్పించుట, శంబూక వధానంతరము దండకాటవిని పూర్వానుభూత దృశ్యములును, పూర్వపరిచిత స్థలములను స్మరించుకొని రాముఁడు సీతావిషయక ప్రీతిచే విలపించుచున్నట్లును, మూర్ఛవోవునట్లును జిత్రించుట, సీతాకరస్పర్శమున రాముని పునరుజ్జీవితునిఁ జేయుట, మున్నగు సన్నివేశములఁ గల్పించుటయందే విశేషమున్నదని గ్రహించి, తమస 'అహోసంవిధానకం' అని తత్సందర్భమున నుడివినది. మరియు కవి యిట్టి కల్పనలచే శృంగారాది రసములనెల్ల వాని వాని సాత్త్వికవ్యభిచారిభావములతోఁ గరుణమున కంగములగునట్లు వర్ణించు నసామాన్యచాతురి గలవాఁడు సుమా యని తెల్పుటఁ గూడ నీవాక్యముచే (అహో సంవిధానకం) తెలియుచున్నది. కవి యీ విషయమునే యీ క్రింది శ్లోకమునఁ బ్రతిపాదించుచున్నాఁడు.

"ఏకో రసః కరుణ ఏవ నిమిత్తభేదాత్,
భిన్నః పృథ క్పృథగి వాశ్రయతే వివర్తాన్।

ఆవర్త బుద్బుద తరఙ్గమయాన్వికారాన్
అంభో యథా సలిలమేవ తు తత్సమస్తమ్॥"

సముద్రమందలి జలమే సుళ్ళుగను, బుడగలుగను, అలలుగను వేరు వేరుగాఁ బరిణమించినట్లు (ఆయా యవస్థాభేదముచే) కరుణమను నొక్కరసమే యాయా నిమిత్తభేదములవలన శృంగారమే. వీరము మున్నగు వేరు వేరు రసములుఁగా బరిణామముల నొందుచున్నదని భావము. ఇదియే కవియొక్క హృదయము. ఈ నాటకమునఁ గరుణమే ప్రధానరసమనియు నిద్దాననే దెల్పుచున్నాఁడు. ఇట నీ విషయము గమనింపఁదగినది.

1. నాటకలక్షణముల ననుసరించి యీ యుత్తరరామచరితమున కరుణమే ప్రధానరస మగుచో నిది నాటకము కానేర దందురు. సామాన్యముగా నాటకమున వీరమో, శృంగారమో ప్రధానముగ వర్ణింపఁ బడవలయును. లేనిచో నిది నాటకము కాకపోవలసివచ్చును. కావున ఈ నాటకమున రసము కరుణవిప్రలంభ శృంగారమే కాని కేవల కరుణము కాదు. ఇట సీతారాములు విలపించుటచే కరుణము తోఁచుచున్నది. ఈ కరుణమునకు నిమిత్తమేమి? సీతారాము లన్యోన్య మత్యంతప్రేమయుక్తు లగుటయే. వారి శోకమునకుఁ గారణము వారి యనురాగమే. వియోగవ్యథ యిరువుర కనువర్తించుచున్నది. అందువారి యనురాగాతిశయముచే నది బహుగుణితమై శోకముగాఁ బరిణమించినది. పై సందర్భమున గోదావరీతీరమున సీతారాముల విరహానుభూతియందుఁ గోపము. ఊరట. సంతోషము, సిగ్గు మున్నగు భావములు వివిధములు పొడమినవి. ఈ భావములన్నియు విప్రలంభ (శృంగార)మునకే యంగములనియు,

1. ఈ రసవిషయమున 'ఏకో రసః కరుణ ఏవ' అను శ్లోకమునకు ఉత్తరరామ చరిత యందు, శ్రీ కుమార తాతాచార్యుల వ్యాఖ్యానవిషయసారము గ్రహింపఁబడినది.

స్వతంత్రములు కావనియుఁ దెలియనగును. కుండ, మూఁకుడు మొదలగు మట్టిపాత్రలు భిన్ననామములతో వేరువేరుగా నున్నను నవి యన్నియు మృణ్మయములే యై కారక వ్యాపారభేదమున నామరూపభేదము నొందిన ట్లవి యన్నియు నేక వస్తుపరిణామములే యగును. ప్రకృతమున నాయికానాయకులగు సీతారాములయొక్క పరస్పరాలంబనమగు వియోగసమయావచ్ఛిన్న శృంగార మొక్కటియే హర్షాశ్వాసాద్యవాంతర భావములచే విలక్షణముగ గోచరించుచున్నది. అంతమాత్రమునఁ గరుణవిప్రలంభము కాకపోదు. కార్యకారణములు భిన్నములు కానేరవు కదా.

ఇట కొంత చర్చగలదు. ఇట కరుణమే రసమనియు, కొందరు కరుణమునకు స్థాయి, శోకమే యనియు నందురు. ఆ కరుణరసము వేరు. అందు శృంగార ప్రధానత లేదు. ప్రతీయమానమగు రతి (ప్రేమ), శోకము నుత్పాదించి పోషించుచు మాత్రమే యుండుటచే నది స్థాయి కానేరదు. ఆ రతిపోషితమగు శోకమే స్థాయిగా నుండుటచేఁ గరుణమే ప్రధానమగుచున్నది ఇది రత్యుత్పాదిత శోకస్థాయియగు కరుణరస మగుచున్నవి. శ్రీరాముఁడు 'ఏకాన్తవిస్రబ్ధాం సాధ్వీం, కఠోరగర్భాం, జీవితనిర్విశేషాం, దేవీమ్, అను పదములతో సీతా విషయమునఁ దనకుఁ గల ప్రేమను వెలిబుచ్చును. లక్ష్మణుఁడు చిత్రపటమునఁ జిత్తరువులు, 'సీత యగ్నినిఁ బ్రవేశించి శుద్ధురాలగుపర్యంతము వ్రాయఁబడిన పని నుడువఁగా,'

"ఉత్పత్తిపరిపూతాయాః కిమస్యాః పావనాంతరైః।
తీర్థోదకం చ వహ్నిశ్చ నాన్యతశ్శుద్ధిమర్హతః॥

(అంక-1. శ్లో-13)

పుట్టుకచేతనే పవిత్రురాలగు నీమెకుఁ బవిత్రీకరణవస్తువుల వలన నేమి ప్రయోజనము. తీర్థోదకమును, పావకుఁడును స్వయము పవిత్రపదార్థము లగుటచే నవి యితరపదార్థములవలనఁ శుద్ధినిఁబొంద నెట్లర్హములు కావో అట్లే సీతకూడఁ బావకునితోఁ దుల్యముగ పుట్టుకచేతనే పవిత్రురాలు గనుక నితరపదార్థముల వలనఁ బ్రయోజనము లేదనియు, మరియు సీతాసంపర్కమున నగ్నియే శుద్ధుఁడయ్యెననియు, సీతావిషయకోదాత్త భావములను వెలిఁబుచ్చి తన ప్రేమాతిశయమును వ్యక్తముఁ జేసెను. ఇట్టియుత్తమప్రీతిభావమున నుపలాలించుచు, నానందించుచున్న రాముఁ డపరాధ మేమియు లేకయే సీత నరణ్యమున విడిపించుటచే నాతని హృదయమున శోకమే స్థిరముగ నుండనోపుఁగాని యితర భావములకుఁ దావులేదు. ప్రేమపాత్రమగువ్యక్తి మరణించెనను నిశ్చయమున్నప్పుడే కరుణరస మగుననుట పొసఁగదు. భావికాలమున పునస్సమాగమము గలుగునను నిశ్చయ మున్నప్పుడు నిట్టి కరుణము సంభవించుచున్నది. కాదంబరియందు మహాశ్వేతావాక్యములు పుండరీకవిషయమునఁ గరుణవిప్రలంభమును వ్యక్తపరచుచున్నవి. అచ్చట పునస్సమాగమాశ కలదు. కేవలము మృతుఁడైనచో గలుఁగు శోకముకన్న నీ రత్యాపాదితశోకము భిన్నమని కొందరి యభిప్రాయము.

నాటకాంతమున నిర్వహణ సంధియందు సీతారామసమాగమమును గూర్చుటచే నవలఁగూడ ననువర్తించు రతియే ప్రధానమగుట నీ కవి యీ విరహదశయందే యిట్టి రత్యాపాదితశోకమును అంగముగఁ బ్రతిపాదింపవలయు నను తాత్పర్యముతోడనే యిట్టి సంఘటనఁ గల్పించెను. ప్రవాసాది విప్రలంభము లందువలె శోకమున కిందు అంగత్వమే యుచితము. ఆ శోకమువలన సంభవించిన నిర్వేదాది సంచారిభావములును ప్రధానరసమునకే యంగములుగా నగును. నిర్వేదాది సంచారిభావములు

పొడముటచేఁ గేవలము శుద్ధ శోకమే స్థాయియై, కరుణమే రసమగునన్నచో విప్రలంభసముదాయమునకే శృంగార వ్యవహార ముండదు. సర్వాలంకారిక సంప్రదాయవిరోధమును సంభవించును. ప్రవాసాది విప్రలంభముచేతనే నిది చరితార్థమగు ననెడిచోఁ గరుణమునకును, గరుణ విప్రలంభాదులకును భేదము గోచరింపక పోవలసివచ్చును. మరియు నీయుత్తరరామచరితముతోఁ దుల్యములగు నభిజ్ఞానశాకుంతలాదులు శృంగార ప్రధానము లని సర్వసమ్మతము లైనవానికిఁగూడ కరుణప్రాధాన్యము చెప్పక తప్పదు. కరుణ విప్రలంభమునకును. గరుణమునకును, దుఃఖము సమానమగుట నాయికా విషయకజీవిత్వాజీవిత్వవిషయముల వలననే భేదము తెలియుననుటయుఁ బొసఁగదు. ఇట నీ యుత్తరరామచరితమున నాయికయగు సీత జీవించియున్నదను నభిప్రాయము రామునకుఁ గలదనియే చెప్పనగును. 'యస్య భార్యా విదూరస్థా' మున్నగు శాస్త్రోక్తవిధులచే పత్నీ ప్రతికృతిస్థాపనము చేయుట జీవిత్వనిశ్చయ మున్నపుడే తగును. విధురునకు యాగాధికారము లేదు. 'దంపతీ సహ యజేయాతాం' అని విధి యుండుటచే భార్య లేనపుడు (మృతయైనపుడు) యాగము చేయరాదు. రాముఁడశ్వమేధయాగము చేయునపుడు సీతాప్రతికృతిని గావించి యాగ మారంభించెను. సీత మృతయను భావ మా రామున కుండి హిరణ్మయప్రతికృతిఁ గావించెననుటలో నాయకుఁడగు శ్రీరామునకు ధర్మశాస్త్ర విరుద్ధముగఁ గావించెనని శాస్త్రోల్లంఘనత్వదోషము సంభవించును. కేవలము ధర్మసంస్థాపనమున కవతరించిన భగవత్స్వరూపుఁడగు రాముఁడట్లు చేయుననుటయు సమ్మతము గాదు. జీవిత్వనిశ్చయమే లేనిచో నితరకారణములచేఁ బ్రాప్త్యాశకూడ లేకపోవుటచే నట్టి కరుణనిర్వహణము, గర్భసంధి యందే నిర్వహింపఁబడుటచే నందే గ్రంథము ముగియవలసి వచ్చును. గ్రంథమునకు అలక్షణత్వదోషము ఘటిల్లును. ప్రత్యక్షవిరోధము

నగును. కావున కాదంబరీ గ్రంథమునందలి విషయముకన్న నీ యుత్తరరామచరితవిషయ మీ కరుణ సందర్భమున విలక్షణమనుట హృదయంగమము కాదు. రెండును నొకటే. మృత విషయక కరుణమునకును, జీవిత్వనిశ్చయముగల కరుణమునకును భేద మేమి? యన మృతవిషయక కరుణమున శుద్ధశోకము స్థాయి. జీవిత్వనిశ్చయ విషయమున రత్యాపాదితశోకము స్థాయి.

ఇట కరుణ-శృంగారముల భేదమెట్లు ఆస్వాదింపఁబడుచున్నది? అని యడుఁగవచ్చును. ఇట కరుణ విప్రలంభ మగుటవలననే యని సమాధానము.

విప్రలంభాభిధానోయం శృంగారః స్యాచ్చతుర్విధః।
పూర్వానురాగమానాఖ్య ప్రవాస కరుణాత్మనా॥

యత్రైకస్మిన్విపన్నేఽన్యో మృతకల్పేఽపి తద్గతమ్।
నాయకః ప్రలపేత్ప్రేమ్ణా కరుణోఽసౌ స్మృతో యథా॥

గ్లానో ముక్తాశ్రురుద్విగ్నస్సస్తాంగో ముక్తచేతనః।
సచింతో దైన్యభాగస్మిన్నేవంప్రాయో జనో భవేత్॥

'శృంగారతిలకం'.....

ఇందు విప్రలంభపదసంబంధము లేకయే నాలుగువిధములలో 'కరుణోఽసౌ స్మృతో యథా' యని కేవల కరుణపదము ప్రయుక్తమైనది. కేవల కరుణ పదవాచ్యత్వ మిందుఁ గలదని ధ్వనింపఁజేయుటకే యట్లు ప్రయుక్తమైనది. కావున నీ తృతీయాంకారంభమున 'రామస్య కరుణో రసః' యనునపుడు కరుణమన కరుణవిప్రలంభమనియే యర్థము నిర్వివాదమగుచున్నది. పై శ్లోకములలో 'యత్రైకస్మిన్.....కరుణోఽ సౌ స్మృతో యథా' యనినపుడు నాయికానాయకులలో నొకరు

విపద్దశయందున్నను, మృత ప్రాయుఁడైనను, నట్టివారిని గురించి నాయకుఁడు ప్రేమచే ప్రలపించుట కరుణ మనఁబడునని భావము. ఇట నుత్తర రామచరితమున నాయికయగు సీత విపద్దశయందు మృతకల్పముగ నుండుటచేఁ దద్గత ప్రేమచే నాయకుఁడు రాముఁడు ప్రలపించుచున్నాఁడు గాన కరుణమనియే చెప్పఁదగి యున్నది.

సాహిత్యదర్పణమందును 'యూనోరేకతరస్మిన్ గతవతి లోకాన్తరం పునర్లభ్యే। విమనాయతే యదైకస్తదా భవేత్కరుణ విప్రలంభాఖ్యః॥' అని చెప్పఁబడి యున్నది. 'పునర్లభ్యే' యని యుండుటచే కేవల కరుణముకన్న వైలక్షణ్యము చెప్పఁబడియున్నది. కేవలకరుణమందు శృంగారస్పర్శయే లేదు. కరుణ విప్రలంభము శృంగారమే. అలంకారశేఖరమందు, 'స్యాదేకతరపఞ్చత్వే దంపత్యోరనురక్తయోః శృంగారః కరుణాఖ్యోఽయమజస్యేవ రతే రివ' యని నాయికానాయకులలో నొకరు మరణింప, నొకరు వారికై విలపించుటయుఁ గరుణ మనుపేరఁ బరగు శృంగార మనెను. అజమహారాజు, ఇందుమతికొరకై రఘువంశమున నాయకుఁడు విలపించుటయు, కుమారసంభవమున, నాయిక రతి, నాయకుఁడైన మన్మథునికై విలపించుటయు నుదాహరణములుగా నొసఁగఁబడినవి. కావున నీ యుత్తరరామచరితమునఁ గరుణమనఁ గరుణవిప్రలంభమే రసము. ఇది సర్వాలంకారికులును సమ్మతించిన విషయమే. నాయికానాయకుల విరహనమయమున ప్రవృత్తశృంగారవిషయవర్ణనాత్మకమును, సమాగమావసానమునగు కరుణవిప్రలంభ శృంగారమే యనియు విశదమగుచున్నది.

ఈ యంకమున, సీత యదృశ్యయై సన్నిధి లోనున్నది. సన్నిధియందును తిరోధానముగ నుండుటచే నీ యంకమునకు ఛాయాంక మను పేరుగూడఁ దగియున్నది.

నాల్గవయంకమునఁ, బూర్వాంక కరుణరసాస్వాదముచేఁ బరిప్లుతులైన ప్రేక్షకులకుఁ గొంత మనోవిశ్రాంతికై వాల్మీక్యాశ్రమావరణమును జూపును. ఆశ్రమములు సాధారణముగాఁ జిత్తవిశ్రాంతిప్రదములు గదా. ఇట మనశ్శాంతికై దుర్భరమగు సీతావిషయము వినిన జనకుఁడును, అరుంధతీ వసిష్ఠులును, కౌసల్యాదులును వాల్మీక్యాశ్రమమును జేరుదురు. సీత లేని యయోధ్యకేఁగ వారికి మనసు రాలేదు. సత్త్రయాగము ఋష్యశృంగుఁడు సమాప్తినొందించెను. ఇఁక కౌసల్యాదులును , అరుంధతీ వసిష్ఠులును వాల్మీక్యాశ్రమమునకే పోనేల; వేరు ఋష్యాశ్రమములు లేవా? యనవచ్చును. ఇది నాటకము. తొలుత లక్ష్మణుఁడు సీతను వాల్మీక్యాశ్రమముచెంతనే గదా వదలిపెట్టి వచ్చినది. బహుశః ఆ యాశ్రమమున నున్నవారికైన సీతావిషయము తెలిసియుండునేమో యని కాని, చిరంతన ప్రియ మిత్రుఁడగు వాల్మీకిమహాముని వారికిఁ గొంత చిత్తశాంతిఁ గూర్చుననికాని వారి యుద్దేశ్యమై యుండునోపు. భవభూతియు సందర్భోచితముగఁ గరుణరస ఘట్టమును బూర్వాంకమునఁ బరమోచ్చముగఁ జూపి, కొంత మార్పునకై యీ యంకమున సీతావిషయకసందేహముల కాస్పదములగు కుశలవులవృత్తాంతమును జూపి, యాశ్రమమున కతిథులుగ వచ్చిన జనకాదులకే కాక ప్రేక్షకులకును కొంత హాస్యము, గొంత యూరటఁ గల్పించి యానందింపఁ జేయుచున్నాఁడు.

అంకారంభముననే వాల్మీక్యాశ్రమమున నతిథినత్కార విశేషసూచకముగా కమ్మని పాకవిశేషామోదము ప్రసరింపఁ జేయఁబడినది.

నీవారౌదనమండముష్ణమధురం సద్యః ప్రసూతా ప్రియా
పీతాదప్యధికస్తపోవన మృగః పర్యాప్తమాచామతి।
గంధేన స్ఫురతా మనాగనుసృతో భక్తస్య సర్పిష్మతః
కర్కంధూఫలమిశ్రశాకపచనాఽమోదః పరిస్ఫీర్యతే॥

(అంక-4. శ్లో-1.)

'సద్యః ప్రసూతా ప్రియా పీతాదప్యధికం' అని యాశ్రమావరణమునకుఁ గొంపోవుచు, రాఁబోవు సీతారాముల పుత్రుఁడగు లవుని దర్శన మీ యంకమున సూచితమగుచున్నది. 'కర్కంధూఫల మిశ్రశాక పచనామోదః' యనుటచేఁ గొంత కష్టసుఖములతోఁ గూడిన యానందానుభవము అనఁగా లవునిఁజూచి సీతాతనయుఁడను సందేహమునఁ గల భావవిశేషము ధ్వనితమగుచున్నది.

ఇద్దరు బాలురు, దాండాయన సౌధాతకులు వాల్మీకిశిష్యులు ప్రవేశింతురు. వీరిలోఁ దాండాయనుఁడు సచ్ఛాత్రుఁడు. శాంతస్వభావుఁడు. సౌధాతకి హాస్య ప్రియుఁడగు కొంటెవాఁడు. వీరి భిన్నస్వభావములతోఁ గూడిన సంభాషణము ప్రేక్షకులకు నవ్వుఁ బుట్టించును. సౌధాతకి, వసిష్ఠజనకులనుగూర్చి జీర్ణకూర్చులని, వ్యాఘ్రవృకములని నుడువును. దాండాయనుఁడట్లు పెద్దలఁ బరిహసింప రాదని తెల్పుచు, వసిష్ఠుఁడు రాఁగానే సమాంసకమధుపర్కముతో సత్కారనిర్వహణము ధర్మశాస్త్రప్రోక్తమని యావుదూడఁ బలి యొసంగఁ బడినదని నుడువును. ఆ కాలమున మాంసభక్షణము శాస్త్రసమ్మతమై యుండినట్లు తెలియుచున్నది. మరియు జనకునకు దధిమధువులచే మధుపర్క మొసఁగబడుటచే, వైఖానస వృత్తి నవలంబించినవారు మాంసాహారము వర్జించుచుండినట్లును దెలియుచున్నది. సౌధాతకి బాల్యచాపలముచే నాఁడు పెద్దలు ఆశ్రమమునకు వచ్చుటచే శిష్టానధ్యాయమని యాటపాటలతోఁ గాలముఁ గడప నెంచును. బాలప్రకృతి స్వభావసిద్ధముగా నీ సౌధాతకిపాత్రమునఁ జిత్రింపఁబడినది.

జనకుఁడు, జానకీపరిస్థితినిఁ దలఁచుకొని మనమున రంపపుకోఁ తవలె శోకబాధ ననుభవించుచు సీతను దలఁచుకొని మిగులఁ బొగులుచుండును. ఇంతలో నరుంధతి కౌసల్యతో జనకునిఁ జూడ నేగును.

స్వజనదర్శనమున వారి దుఃఖము ద్విగుణమగును. వీరు ముప్పురును సీతాపరిత్యాగమును గురించి ముచ్చటింతురు. సీత జగద్వంద్యయని యరుంధతియే ప్రశంసించును. వ్యక్తికి గుణగణముచేతనే పూజ్యతగాని, వయసు మొదలైనవానిచేఁ గాదని సీతా గుణముల నిట్లు కొనియాడును.

శ్లో॥ శిశుర్వా శిష్యో వా యది భవసి తత్తిష్ఠతు తథా
విశుద్ధేరుత్కర్షస్త్వయి తు మమ భక్తిం జనయతి।
శిశుత్వం స్త్రైణం వా భవతు నను వంద్యాఽసి జగతాం
గుణాః పూజాస్థానం గుణిషు న చ లిఙ్గం న చ వయః॥

(అంక-4. శ్లో-11.)

భవభూతి స్త్రీహృదయమును కుసుమసుకుమారముగ వర్ణించెను. కౌసల్య సీతాప్రశంస విన్నంత దుఃఖ ముప్పొంగి మూర్ఛిలును. జనకుఁడు కమండలూదకము చల్లఁగా మూర్ఛఁ దేరి సీతకై విలపించి సీతావిషయకవాత్సల్యమును వెలిఁబుచ్చును. శిష్యసంభాషణమునఁ గొంత మనసుకు విశ్రాంతిఁ గూర్చి మరల అరుంధతీ కౌసల్యా జనకసంభాషణమునఁ గరుణమును గ్రమముగాఁ జిత్రించుచు నాటకీయముగ భవభూతి యీ సన్నివేశమును గూర్చెను. అరుంధతి దుఃఖితులగు కౌసల్యాజనకుల నుచితములగు మాటలచే నోదార్చుట యెంతయు హృదయంగమము. విధి యటుటున్నదనియు మున్ముందు శుభము గలుగు నని వసిష్ఠులు నుడివిరనియు నుడువును. వారిదుఃఖముఁ బాపును. పెద్దలమాటలు విశ్వసనీయము లనియు నవి వ్యర్థములు కానేర వనియు గురుసూక్తుల మహిమమును దెలుపును. భవభూతికిఁ గల గురుభక్తియు, వారిసూక్తులందుఁ గల ప్రామాణ్యమును దీన వ్యక్తమగుచున్నది.

ఆవిర్భూతజ్యోతిషాం బ్రాహ్మణానాం
యే వ్యాహారాస్తేషు మా సంశయోఽభూత్।
భద్రాహ్యేషాం వాచి లక్ష్మీర్నిషక్తా
నైతే వాచం విప్లుతార్థాం వదంతి॥

(అంక-4. శ్లో-18.)

"పరోక్షములగు బ్రాహ్మణవచనములను సందేహింప వలదు. వారి వచనములు లక్ష్మీప్రదములు. వారు నిరర్థకకములగు మాటలఁ బల్కరు." అని గురులవిషయ ముదాత్తముగా నుడివెను.

భవభూతి ఇంతవరకు మరల నేడ్పించి జనకాదులకు లవదర్శనమునఁ గొంత యూరటఁ గూర్చుచున్నాఁడు. ఇట్టి భావభేదముల కనువగు సంవిధానముల కల్పనము నాటకోచితమై, గ్రంథమున కెంతయు మెరుగిడుచున్నది. శిష్యకోలాహలమును గల్పించి యా శిష్యులమధ్య సీతారాములపోలికలు గలవాని నుజ్జ్వలదేహుని క్షత్రియబ్రహ్మచారిని లవుని కౌసల్యకంటఁ బడునట్లు సంఘటించెను.

సీతారాముల ఛాయలు వానియందు గుర్తించి స్త్రీస్వభావమున వాని మోమెత్తి చుబుకము పుణికి జనకునకును సంవాదమునకై చూపును. జనకుఁడును గుర్తించి నిశ్చయముగ సీతారాములకుమారుఁడే యనుకొనును. కాని యొకవైపు మనసున సందేహము కూడ, సీతావిషయము గోచరింపకపోవుటచే బాధించుచున్నది. లవుఁడు వారికిఁ దాను వాల్మీకిశిష్యుఁడ నని మాత్రము తెల్పును. తల్లిదండ్రులఁ దెలియదనును. కౌసల్యాజనకులకు కౌతుకము మరింత హెచ్చును. తొలుతనే వృద్ధు లెవరో నిన్నుఁ జూడ గుతూహలపడుచున్నా రని లవునకుఁ జెప్పుమని కంచుకినిఁ బంప వినయసంపన్నుఁడగు లవుఁడును సచ్ఛాత్రునిరీతి, బాల్యచాపలమగు

కోలాహలమునుండి తోడిబాలుర వీఁడి పెద్దలవాక్యములను గౌరవించుచు, వారినిఁ జూడ వచ్చును. వచ్చిన వారెవరో తెలియమి, నమస్కరింపఁగొంత సంశయించి. నావోచ్చారణపూర్వకముగ నమస్కరించును. వాల్మీక్యాశ్రమమున శిక్షణము నొందిన ప్రతిభాశాలి కిట్టి యాచారధర్మ మెంతయుఁ దగియున్నది. అరుంధతికి లవుఁడు సీతాకుమారుఁడని తెలియును. పూర్వాంకమువలనఁ బ్రేక్షకులకును తెలియును. కాని కౌసల్యా జనకులకు మాత్రము తెలియదు. వారు అనుమానముననే మునిఁ గియుందురు. ఇంతలో యాగాశ్వము వెంట చంద్రకేతువు రక్షకుఁడుగ నాశ్రమప్రాంతమునకు వచ్చును. అరుంధతీ జనకులు చంద్రకేతువును దర్శింపఁ గుతూహలపడుచుండ నీ లవుఁడు జనకునితో 'క ఏష చంద్రకేతుర్నామ' (ఎవ్వఁడా చంద్రకేతువు!) అని మొదలిడి చాల సంభాషించి వాల్మీకి రామగాథను సీతాపరిత్యాగమువరకు రచించెనని నుడువును. కౌసల్యాజనకులు సీతావిషయము విన్నంత మిగుల విలపింతురు. లవుఁడును వారు కౌసల్యా జనకులని యరుంధతి వలనఁ దెలిసికొని వారితో సానుభూతి వహించును. ఈ సన్నివేశము లోకవృత్తవిలసితమై మనోజ్ఞముగనున్నది. ఈ సంఘటనమున లవునిశీల మెంతయు నుదాత్తమై యొప్పుచున్నది. సచ్ఛాత్రప్రవర్తన మీతనియందు వ్యక్తముగాఁ గోచరించుచున్నది. ఇప్పటికి లవదర్శనమునఁ గొంత మనశ్శాంతి చేకూరినది. శోకము కొంత చల్లారినది. ఈ విషయముల రంగమునఁ జూచు ప్రేక్షకుల హృదయము రసపరిప్లుతమై వృద్ధగోష్ఠిని, లవుని శీలమును బరికించి తన్మయులై వారితో సానుభూతి వహించి సీతావియోగమున వారును కన్నీరు గార్చక మానరు.

ఇంతలో నాశ్రమశిష్యులు యాగాశ్వము వింతగా వచ్చెనని తెల్పి లవునిఁ దోడ్కొనిపో వత్తురు. లవుఁడు ఆ వింతపశువును జూడ మిక్కిలి

కుతుకమున నుండును. కాని వెంటనే పోనొల్లఁడు. సాధారణముగాఁ బెద్దలతో సంభాషించుచు నందును నూతనాగతులగు నతిథులయొద్దసెలవుఁ గైకొనియే వెడలును. బాల్యకౌతుకమున వారిని వదలి పోవుటకు లవునట్టివానికి తగునా? కావున లవుఁడు జనకాదుల సెలవుఁ గైకొని తోడిబాలురతోఁ బోయి యశ్వమేధాశ్వమును గాంచి వీరఘోషణ విని, 'కిమక్షత్రియా పృథివీ' (క్షత్రియులకు గొడ్డుపోయెనా పుడమి) యని యశ్వపతాకమును హరించి యశ్వము నాశ్రమమునకుఁ దోలించెను. అశ్వరక్షకులు బెదిరించినను అదురు బెదురు లేక ధనుష్పాణియై ధైర్యమునఁ గరికి లంఘించు సింహశాబకమురీతి క్రుద్ధుఁడై యుండును. పూవునకుఁ దావి మొగ్గయపుడే యబ్బునట్లు రామకుమారున కట్టి గుణముండుట సహజము గదా. ఇంతవరకు వినయ విధేయతలఁ జూపిన లవుఁడే, వీరఘోషణ విన్నంత నుప్పొంగి క్షాత్రధర్మోచితముగ నెదుర్కొన సిద్ధపడును. ఇట్టి లవుని శీలమంతయు, నాతఁడు సీతాతనయుఁడే యని ధ్రువపరచుట కనుకూలించుటకై యిట్టి విక్రమము క్రమముగా సంఘటింపఁజేసి భవభూతి ప్రేక్షకుల నానందింపఁ జేయుచున్నాఁడు.

ఆశ్రమశిష్యులు యాగాశ్వమును జూచి యచ్చెరువొంది లవున కా విషయమును దెల్ప వచ్చి 'కుమార, కుమార, అశ్వోఽశ్వ ఇతి కోఽపి భూతవిశేషో జనపదేషు శ్రూయతే సోయమధునాఽస్మాభిః ప్రత్యక్షీకృతః। (కుమార, కుమార, గుర్రము, గుర్రము' అని గ్రామములందు పిలువఁబడు వింతపశువును, నేఁడు మనము ప్రత్యక్షముగఁ జూచితిమి.) అని నుడివి దానిని ప్రకృతిసిద్ధముగ వర్ణింతురు.

'పశ్చాత్పుచ్ఛం వహతి విపులం తచ్చ ధూనోత్యజస్రం
దీర్ఘగ్రీవః స భవతి ఖురాస్తస్య చత్వార ఏవ।

శష్పాణ్యత్తి ప్రకిరతి శకృత్పిండకానామ్రమాత్రాన్
కిం వా ఖ్యాతైర్వ్రజతి స పునర్దూరమేహ్యేహి యామః॥

(అంక-4. శ్లో-26.)

ఇందు స్వభావోక్త్యలంకారము ప్రత్యక్షముగ గుర్రమును జూచినట్టి భావనఁ గలిగించుచు హృదయంగమముగా నున్నది. కాని యా కాలమున నాశ్రమవాసులకు బాహ్యప్రపంచసంపర్కము లేకుండుటచే గుర్రమునుగూడ వింతపశువనుకొను లోకజ్ఞానహీనతయు నీయశ్వవర్ణనముచే నూహింపఁ దగియున్నది. కాని యిట నీయశ్వవర్ణనము కొంత హాస్యరస పోషకము గనున్నది.

లవుఁడు అశ్వశబ్దము విన్నంత, 'పశుసమామ్నాయే సాంగ్రామికే చ శ్రూయతే' యని నుడువుటచే నా కాలమున విద్యాశిక్షణమున అశ్వాది పశువిషయములఁ దెల్పు పశుశాస్త్రము,(Zoology) (పశుద్రవ్యక యాగప్రతిపాదక వేదభాగమున) పశుజాతివర్గవిషయమును దెల్పు మీమాంసాశాస్త్రము, యుద్ధతంత్రము మున్నగు విషయములును బోధింపఁ బడుచుండినట్లు తెలియుచున్నది.

ఈ యంకమునకుఁ గౌసల్యాజనకయోగమని పేరు. వృద్ధులును లవునకు సన్నిహితబంధువులు నగు కౌసల్యాజనకులు మనశ్శాంతికై యీ వాల్మీక్యాశ్రమమునఁ జేరి పరస్పర సల్లాపయోగము ననుభవించుటచే నీ పేరు తగియున్నది. మరియు యోగమన. 'అలబ్ధస్యలాభః' (పూర్వము లభించని వస్తులాభము) కావున నిందు సీతావిషయ స్మరణ ఖిన్నులగు కౌసల్యాజనకులకు లవదర్శనమున సీతా తనయ విషయక పరామర్శజ్ఞానముచే లవదర్శనభాగ్యమే యోగము. ఈ యోగము వీరికిఁ గల్గుటచే నీ యంకమున కీ నామము తగియున్నది.

ఈ యంకవృత్తాంత మంతయు కవి కల్పితమే. కౌసల్యాజనకాదులు వాల్మీక్యాశ్రమమునకు వచ్చుట, చంద్రకేతువు యాగాశ్వమువెంట రక్షకుఁడుగా వచ్చుటయు వాల్మీకిరామాయణమున లేవు. ఇవి కవి చేసిన మార్పులు.

వాల్మీకిరామాయణమున నశ్వమేధాశ్వమును రక్షించుటకు లక్ష్మణుని బంపినట్లున్నది.

"తత్సర్వమఖిలేనాశు సంస్థాప్య భరతాగ్రజః
హయం లక్షణసంపన్నం కృష్ణసారం ముమోచ హ॥ 1
ఋత్విగ్భిర్లక్ష్మణం సార్థం అశ్వతంత్రే నియోజ్య చ।
తతోభిగచ్ఛత్ కాకుత్స్థః సహ సైన్యేన నైమిశమ్॥" 2
(ఉత్తరకాండః- అధ్యాయము 92.)

అశ్వమును లవుఁడు బంధించుటగానిఁ దానికై పోరుగాని వర్ణింపఁబడలేదు. చంద్రకేతువు నశ్వరక్షకునిగాఁ బంపుట లవునితో యుద్ధము చేయుట మున్నగునవి యన్నియుఁ గవికల్పితములే. యజ్ఞవాటికలయందు రామాయణగానముచేయుటకై కుశలవులను వాల్మీకి పంపఁగా, వారు నట్ల చేయ, నద్దాన వారిని సీతాతనయులుగా నెరింగినట్లు రామాయణమున నున్నది. కుశలవులతో నశ్వసంబంధముగఁ బోరు సంభవించినట్లు పద్మపురాణమునఁ గొంత కానవచ్చుచున్నది. [1]పద్మపురాణమున

1. పద్మపురాణం-పాతాలఖండం

అశ్వరక్షణార్థం రామస్య శత్రుఘ్నం ప్రతి గమనాయాజ్ఞా :-

శత్రుఘ్నమాదిదేశాథ రామః శస్త్రభృతాం వరః।
యాహి వాహస్య రక్షార్థం పృష్ఠతః స్వేచ్ఛయా గతేః॥ (54-వ అధ్యాయ)

శత్రుఘ్న గచ్ఛ వాహస్య మార్గం భద్రం భవేత్తవ।
భవేతాం శత్రువిజయౌ రిపుకర్షణ తే భుజౌ॥ (55-వ అధ్యాయ)

నశ్వరక్షణార్థము శత్రుఘ్నునిఁ బంపినట్లున్నది. ఆ పురాణముననే నా యశ్వము వాల్మీక్యాశ్రమముచెంతఁ దిరుగాడుచుండ లవుఁడద్దానిని బంధింప నశ్వమునకై శత్రుఘ్నుసైనికులను, లవునకును యుద్ధము జరిగినట్లును, గ్రమముగా శత్రుఘ్నుసైన్యమునఁ గాలజిన్మరణము, లవ పుష్కలుల యుద్ధము, హనుమల్లవ సంగ్రామము, శత్రుఘ్న లవ సంగ్రామము, లవ మూర్ఛనము, శత్రుఘ్న కుశల యుద్ధము, శత్రుఘ్నమూర్ఛనము, హనుమత్సుగ్రీవులతోఁ గుశుని యుద్ధము, హనుమత్సుగ్రీవ బంధనము, కుశలవులు సీతకు యుద్ధవృత్తాంతము నివేదించుట, బద్ధకపిప్రదర్శనము, సీత రామసైన్యమును సంజీవింపఁజేయుట, సీతాదేశమున యజ్ఞాశ్వము శత్రుఘ్నునియెదుట విడువఁబడుట మున్నగు విషయములు గలవు. రాముఁడు రంగమున కిందువచ్చుట లేదు. భవభూతి యీ పద్మపురాణమునుండి తన నాటక

శత్రుఘ్న సేనానినః కాలజిదాఖ్యస్య లవస్య చ యుద్ధవర్ణనమ్
కాలజిత్సేనానినో మరణనిరూపణమ్॥ (60-వ అధ్యాయ)

లవపుష్కలయోర్యుద్ధవర్ణనమ్; హనుమల్లవయోస్సంగ్రామ॥(61-వఅధ్యాయ)
శత్రుఘ్న లవయో స్తుములసంగ్రామవర్ణనం; లవ మూర్ఛనమ్॥
(62-వ అధ్యాయ)

శత్రుఘ్నకుశయోస్సంగ్రామః; శత్రుఘ్న మూర్ఛనావృత్తనిరూపణమ్॥
(63-వ అ॥)

కుశస్య హనుమత్సుగ్రీవాభ్యాంసహ సంగ్రామవర్ణనమ్; తయోర్బంధనం చ;
కుశలవాభ్యాం సీతాయై యుద్ధవృత్త నివేదనం; బద్ధ కపిప్రదర్శనం;
సీతాకృతమృత రామసైన్య సంజీవనం;
సీతాదేశాత్కుశలవాభ్యాం శత్రుఘ్న పురతో హయ త్యాగః॥ (64-వఅధ్యాయ)

రామాయ సంజాతవృత్తనిరూపణమ్॥ (65-వ అధ్యాయ)

రామ వాల్మీకిసంవాదః, సీతానయనాయ లక్ష్మణప్రేషణం;
రామ సీతాస్మరణమ్; లక్ష్మణేన సహ సీతాగమనం-
రామ సీతా సమాగమః॥ (67-వ అధ్యాయ)

కథావస్తువును గ్రహించెననుటయుఁ గుదురదు. ఆనందరామాయణమున భరతాదులును దుదకు లక్ష్మణుఁడును లవకుశుల కోడి రనియు, శ్రీరాముఁడే కుశునితో యుద్ధముచేయ వచ్చినట్లును నపుడు జనకపుత్రుల యుద్ధమున కుశుఁడు రామునిపై వేయు బాణములు కుశుని శిరముమీఁ దుగాఁ బోవుచుండినట్లును, తుదకు వాల్మీకి వారల సమాగమము నేర్పరచినట్లును గలదు. ఈ కథయు, బద్మపురాణకథయు మన భవభూతికథకుఁ గొంత దగ్గరగా నున్నవి. భవభూతికన్నఁ దర్వాత వచ్చిన పద్మపురాణవిషయము (14-వ శతాబ్దము) భవభూతి గ్రహించెననుట కుదురదు. అట్లే ఆనందరామాయణము కూడ తర్వాతిది యగుట వీనినుండి గ్రహించెననుట కుదురదు. కాని యేదో యొక రామకథలో నీ విషయము లుండియుండ నగును. వానిని గ్రహించి భవభూతి నాటకోచితముగ మార్చి నవ్యతను గూర్చినాఁడు. కుర్రవాఁడగు లవునితో శత్రుఘ్నాదులు పోరుసల్పుట భవభూతి కిష్టములేదు. మరియు లవునిచే వారల కోటమి గల్పించుటయు నాతని కిష్టము లేదు. తన కథానాయకుఁడగు శ్రీరామునకట్టి భంగపాటు కల్పింపఁ దగునా-యనియే యతని యభిప్రాయము. కావుననే తన కా నాటికి లభించిన యేదేని రామకథనుండికాని, లోకమునఁ గర్ణాకర్ణికగ సాఁగివచ్చిన గాథ నేదేని విని యద్దానినుండికాని, యీ యుద్ధవర్ణనము కల్పించియుండనోపు. కాని భవభూతి లవునితో నవయస్కుఁడును, సమానస్థితియందు నున్న చంద్రకేతువుతోడనే పోరు కల్పించి, యౌచిత్యమును బోషించెను. లవుని శీలమునకును భంగము రాకుండ పినతండ్రులగు శత్రుఘ్నభరతాదులతోడ యుద్ధము లేకుండఁజేసి యీ ఘట్టమును వీర రసభరితముగ వర్ణించెను.

మరియు నిట్టి పితృపుత్రుల యుద్ధ మొకటి మహాభారతమున నశ్వమేధ పర్వమునఁ గానవచ్చుచున్నది. అచ్చట అర్జునుఁడు నిజసుతుఁడగు

బభ్రువాహనునితోఁ బోరి రణమున మడియఁగా, నర్జునుని భార్యయగు నులూపి, సంజీవినియగు తన చూడామణిచే నర్జును బ్రతికించును. ఈ యుద్ధవిషయము ఈ మహాభారతాశ్వమేధపర్వము ననుసరించి పద్మపురాణ, ఆనందరామాయణాదులందు రామకథకు గూర్చి యుండనోపు. ఇట్టి వానిని లెస్సగాఁ బరికించి భవభూతి తన నాటకమునకు వలసినంతమాత్రము గ్రహించి చమత్కారముగాఁ బొందుపరచెను. ఇదియే కవి నేర్పు.

పంచమాంకమున లవ చంద్రకేతులకు యుద్ధ మారంభమై పరస్పర సామర్థ్యములఁ జూపి వీరసల్లాపములును, వీరోచితచేష్టలును దుల్యముగఁ జూపుదురు. భవభూతి నాటకనియమముల నుల్లంఘించి రంగస్థలమున వీరి యుద్ధముఁ జూపును. 'నిరంకుశాః కవయః' యనుట నిప్పట్టున నొప్పును. ప్రేక్షక హృదయ మెరింగి నాటకకర్తలట్లు నియమోల్లంఘనము గావించినను ప్రేక్షక రంజనముకూడ వారి లక్ష్యమగుటచే నిట్టి మార్పులు గావించుట సమర్థులగు కవుల కాచారము. పాశ్చాత్యనాటక కర్తయగు షేక్స్పియరు తారచించిన కొన్ని నాటకములలో నాటికాలపు ప్రేక్షకహృదయ మరసి వారి ప్రీతికై కొన్ని మార్పులు నాటకమునఁ జేసెను. ద్వంద్వయుద్ధములు, కవచముల రాపిడి శబ్దములు, శతఘ్నుల మ్రోఁతలు మున్నగునవి ఆ కాలపుప్రజల కభిమానపాత్రములుగ నుండినవి. కావున వానిని తన నాటకమునఁ జేర్చి యందర మెప్పించెను. మన భవభూతియు నట్టి యభిప్రాయముచేతనే యిట్టి సంఘటనలఁ గల్పించి యుండనోపు.

ఈ లవచంద్రకేతు యుద్ధవర్ణమున భవభూతి నిజసామర్థ్యమును జక్కగాఁ జూపెను. తన కభిమానపాత్రమగు కరుణరసము నెంత పుష్టిగఁ జూపగలఁడో యట్టి సామర్థ్యముననే వీరరసముఁ గూడఁ దా వర్ణింపఁ గలఁడను విషయము తెల్పుటకుఁగాఁబోలు నీ పట్టున నేర్పుతో వీరరసోచితముగ నిర్వహించెను. ఈ యంకమున లవ చంద్రకేతు

లిరువురును ధర్మవీరమును జూపుదురు. చంద్రకేతువు సైన్యముతో రథస్థుఁడై యున్నాఁడు. లవుఁ డొంటరివాఁడు– ఉదార గుణుఁడు. కావున చంద్రకేతువు పెక్కండ్రు సైనికు లొంటరివాఁడగు లవునితోఁ బోరుట తగదని వారిని వారించి తానే యొంటరిగ లవునితోఁ బోర దొరకొనును. మరియు లవుఁడు పాదచారియై నిలిచియుండ చంద్రకేతువు రథస్థుఁడై యాతనితోఁ బోర నుత్సహింపక, తానును క్రిందికి దిగును. సుమంత్రుఁడును చంద్రకేతుప్రవర్తనము న్యాయ్యమని మెచ్చుకొనును, లక్ష్మణునకుఁ బుత్రుఁ డగుచు నిట్టి వీరధర్మమును జూపుటచే దశరథకులమునకుఁ బ్రతిష్ఠకలిగెనని సంతసించుచుండఁ జిన్నవాఁడైనను జంద్రకేతువు.

'అప్రతిష్ఠే రఘుజ్యేష్ఠే కా ప్రతిష్ఠా కులస్య నః।
ఇతి దుఃఖేన తప్యంతే త్రయో నః పితరోఽపరే॥'

(అంక–5. శ్లో–25.)

కులజ్యేష్ఠుఁడగు రాముఁ డనపత్యుఁడై యుండ మా కులమున నేటి ప్రతిష్ఠ యని లక్ష్మణ భరతశత్రుఘ్నులు పరితపించుచున్నారని నుడివి తనకు రామునెడఁ గల భక్తిగౌరవాదుల వెల్లడించును. నిజసైనికు లందరును లవునిచే మూర్ఛితులు కాగా జృంభకాస్త్రప్రయోగముచేతనే లవుఁడట్టి సైనికసంస్థంభనము గావించి యుండునని సుమంత్రుఁడు తెల్పఁ జంద్రకేతువు కూడ నట్లే యనుకొని సుమంత్రుఁడు రామభద్రునందే పరంపరాసంప్రదాయమున నిలిచియున్నవని రూఢిగఁ జెప్పినను, లక్ష్మణకుమారుఁడు "అపరేఽపి ప్రచీయమానసత్త్వప్రకాశాః స్వయం సర్వం మంత్రదృశః పశ్యంతి," యని మంత్రదృశులగు వాల్మీక్యాదులును సంప్రదాయము లేకయే వాని నెరుంగుదు రని యార్షప్రభావముపైఁ దనకుఁ గల యుదాత్తాభిప్రాయమును వెలిబుచ్చును. ఇట్టి గొప్ప గుణములు భవభూతివే యని తెలియనగును. కవులు నిజాశయములను

పాత్రలమూలమున వెలువరింతురు గదా. జృంభకాస్త్రప్రయోగము లవునకుఁ దెలియునను విషయము గ్రహింపఁజేసి సుమంత్రునికి లవుఁ డొకవేళ రాముని కుమారుఁడేవో యని లవుని రూపరేఖావిలాస స్వభావోదారగుణములఁ బట్టి సంశయింప నవకాశ మొకవైపున రూఢిగఁ గలుగఁ జేయుదు మహర్షులప్రభావ మెంతయైనఁ జేయునను నుదాత్తాశయముచే గోపనముఁ జేయును. భవభూతి యిప్పట్టున నాటకీయముగఁ జిత్రించినాఁడు. లవ చంద్రకేతు లిరువురు నన్యోన్య మొకవిధమగు స్నేహభావమునఁ బరిచితులైనట్లు భావించి జన్మాంతరసంబంధ మేమైన యుండునా యని సంశయించుచు వీరధర్మప్రకారము కయ్యమునకుఁ గడంగుదురు. వీరి పరస్పర సంవాద స్నేహభావములఁ దిలకించి సమంత్రుఁడు (లవం నిర్వర్ణ్య సాస్రమాత్మగతం) హృదయ! కిమన్యథా పరికల్పసే!

"మనోరథస్య యద్బీజం యద్దేవేనాదితో హృతమ్।
లతాయాం పూర్వలూనాయాం ప్రసవస్యోద్గమః కుతః॥"

(అంక–5. శ్లో–20.)

యని తొలుత లవుఁడు రామకుమారుఁడే యై యుండునని తలంచి యవల లతయే తొలుత ఛేదింపఁబడగా బుష్పము పుట్ట నవకాశ మొట్లుండునని సీతయే లేనపుడు శిశు వెట్లుండునని శంకించును. భవభూతి మరల మరగుచేయుచు నాటకోచితముగ కథను సాగించినాఁడు. ప్రేక్షకులును క్రమక్రమముగా కుశలవులు రామకుమారులని తెలిసికొన నవకాశము గలుగఁ జేయుచు నాటక కళను లెస్సగాఁ బోషించినాఁడు.

లవుని పరాక్రమము అద్వితీయము. సుమంత్ర చంద్రకేతుల నుచిరరీతి మెలగునట్లు లవుని వీరధర్మము వారలను బురికొల్పినది. చంద్రకేతువు లవుఁడు పాదచారియై యుండ మరొక రథము నారోహింపఁ గోర

లవుఁడు ఎంత గంభీరముగ నుడుపుచున్నాఁడో చూడుఁడు. సుమంత్రునితో 'ఆర్య! ప్రత్యారోపయ రథోపరి రాజపుత్రం' అని రాకొమరుఁడగు చంద్రకేతువునకు రథము నధిరోహించుటయే తగునని మర్యాదగా నుడువును. అంతియకాదు. లవునిగూడ రథము నారోహింపుమననతఁడు తానారణ్యకుఁడనియు రథచర్యాభ్యాసము తెలియదనియు వారి వారికిఁ దగినసాధనము లుపయోగించుటకు సంశయింప వలదనియు నెంతో యుదారముగఁ బల్కును. సుమంత్రుఁడు ఇక్ష్వాకురాజగు రామభద్రుఁడు లవునిఁ జూచినచో నాతని హృదయము ద్రవించునని నుడివినపుడు లవుఁడా రాముని గొప్పతనము కొనియాడుచు తురంగరక్షకుల వచనములు మాత్రము సైపరాని వనియు నట్టివాక్యములు రాక్షసములనియు నవియే వైరకారణ మనియుఁ దెల్పును. మరియు నార్షసంస్కారమును సత్యవచనలక్షణము నిట్లు తెల్పుచున్నాఁడు.

'కామాన్ దుగ్ధే విప్రకర్షత్యలక్ష్మీం
కీర్తిం సూతే దుష్కృతం యా హినస్తి।
తాం చాప్యేతాం మాతరం మంగళానాం
ధేనుం ధీరాః సూనృతాం వాచమాహుః ॥

(అంక-5. శ్లో-30.)

(ధీమంతులు హితమగు నూనృతవాక్కులు సమస్తకామముల నొసఁగుచు అమంగళములుఁ దొలగించి, కీర్తి నొసఁగి పాపములఁ బరిహరించు కామధేనువనియు, సమస్తశుభముల నొసఁగు తల్లివంటిదనియు నుడువుదురు). భవభూతి యవసరము దొడకినపు డెల్ల పెద్దల సుద్దులఁ బాఠకులకు దెల్పుచునే యుండును.

అంతట నూరకుండక రామపరాక్రమమున విశేషము లేదని బ్రాహ్మణుఁడగు పరశురాముని జయించుట గొప్ప కాదనియు నుడువును. లవునకు

శ్రీరాముని మహిమము తెలియక యట్లు నుడువుచున్నాఁడని చంద్రకేతువు చెప్పినపుడు లవుఁడు కొంత హేళనముగా 'కోహి రఘుపతేశ్చరితం మహిమానం చ న జానాతి! యది నామ కించిదపి వక్తవ్యమస్తి'. (రఘుపతిచరితము, మహిమమును ఎవ రెరుంగరు. చెప్పఁదగిన దేమేని కలదా!) యని పలికి రాముని చర్యలఁ గొన్నింటి మాహాత్మ్యాపకర్షకములగు వానినిఁ బేర్కొనును.

వృద్ధాస్తే న విచారణీయచరితా స్తిష్ఠంతు కిం వర్ణ్యతే
సుందస్త్రీ మథనేఽప్యకుంఠయశసో లోకే మహాంతో హి తే।
యాని త్రీణ్యపరాఙ్ముఖాన్యపి పదాన్యాస న్ఖరాయోధనే
యద్వా కౌశల మింద్రసూనునిధనే తత్రాప్యభిజ్ఞో జనః॥

(అంక-5. శ్లో-35.)

(వారు పెద్దలు, వారి చరితములు విచారింపఁ దగినవి కావు. వారి సేఁతల విమర్శించనేల. అటులుండనిండు. సుందస్త్రీయగు తాటకను సంహరించినను నాతనికీర్తి యకుంఠితముగా నున్నది. ఖరాసురునితో యుద్ధము సేయునపుడు వెనుకకు మరలకయే మూఁడడుగులు వెనుకకుఁ బోయిన విషయమును, వాలి వధ సందర్భమునఁ దాఁ జూపిన కౌశలమును లోకమంతయు నెరుగును.)

ఈ శ్లోకమున లవుఁడు శ్రీరాముని నిందించుచున్నాఁడు. రామునిసేఁతయగు తాటకవధము, స్త్రీవధయగుటచే శాస్త్రనిషిద్ధమగు కృత్యము చేసెననియు, నట్టి యకృత్యము చేసినను నాతనిని మెచ్చుకొని మహావీరుఁడని యనుచున్నారు. ఖరుఁడు తటాలున నెదుర్కొనినపుడు శ్రీరాముఁడు విల్లెక్కువెట్టు నవకాశమునకై మూఁడడుగులు వెనుకకు వేయవలసివచ్చెను,

విహ్వలః స కృతోబాణైః ఖరో రామేణ సంయుగే।
మత్తో రుధిరగంధేన తమేవాభ్యద్రవద్ద్రుతమ్॥ 22

తమాపతంతం సంరంబ్ధం కృతాస్త్రో రుధిరాప్లుతమ్।
అపాసర్పద్ద్విత్రిపదం కించిత్త్వరిత విక్రమః॥

(వాల్మీకిరామాయణే అరణ్యకాండే-30- సర్గః.)

వాలిని జంపునపుడును, చెట్టుమాటున నుండి చంపెను. ఇట్టి కార్యము లన్నియు వీరునకుఁ దగవని లవుని యభిప్రాయము. కావుననే రాముని నిందించుచు నీ శ్లోకము నుడువగనే చంద్రకేతువు కుపితుఁడై లవుని పొగరణఁప భ్రుకుటీ భంగము దాల్చి పోర నుంకించును.

ఈ వృద్ధాస్తే యను శ్లోకమున కథానాయకుఁడగు శ్రీరాముని లోపము లన్నియు గుర్తింపఁబడి నిందింపఁబడుటచే నీ విషయము ఔచిత్యదూకమని క్షేమేంద్రుఁడు తన యౌచిత్యవిచారచర్చయందు నుడివియున్నాఁడు.

కథయందు రామకుమారుఁడగు లవుఁడు ప్రధానుఁడు కాఁడు. పరోత్కర్షాఽ సహిష్ణుఁడుగు నాతని వీరరసోద్దీపనమునకై స్త్రీయగు తాటకావధము, ఖరరణాపసరణము, అన్యరణసంసక్త వాలివ్యాపాదనము, మున్నగు జనవిహితాపవాద ప్రతిపాదనమున కవి స్వవచనముచే సకల ప్రబంధజీవిత సర్వస్వభూతుఁడును, ప్రధాననాయకుఁడునగు శ్రీరాముని వీరరసమునకు నాశము వాటిల్లఁ జేసె ననెను.

సాహిత్యదర్పణమున విశ్వనాథుఁడును,

'యత్స్యాదనుచితం వస్తు నాయకస్య రసస్య వా।
విరుద్ధం తత్పరిత్యాజ్య మన్యథా వా ప్రకల్పయేత్॥'

(నాయకునకుఁ గాని, రసమునకుఁ గాని సంబంధించినవిషయ మనుచితముగను, విరుద్ధముగ నున్నచోఁ దానిని వదలివేయవలెను. లేదా వేరువిధముగ మార్చవలయును.)

'అనుచిత మితివృత్తం యథా రామస్య ఛద్మనా వాలివధః తచ్ఛోదాత్త రాఘవే నోక్తమేవ। వీరచరితే తు వాలీ రామవధార్థమాగతో రామేణ హత ఇతి అన్యథా కృతః'.

(అనుచితమగు ఇతివృత్తమునకు రాముఁడు ఛద్మమున వాలిని వధించుటయని పేర్కొనినాఁడు. మాయురాజకృతమగు నుదాత్తరాఘవ నాటకమున వాలివధము వదలివేయఁబడినది. మహావీరచరితమున వాలి రామవధార్థము రాఁగా రామునిచేఁ జంపఁబడెనని వేరువిధముగా మార్చఁ బడినది)- అని యనౌచిత్యమునకు ఛద్మమున వాలివధ గావించుటను బేర్కొనెను).

ఈ పట్టున ననౌచిత్యముగా క్షేమేంద్రాదులు భావించినను భవభూతివిషయమున నట్లు భావింపఁదగదు. అతఁడు కావలయుననియే యట్టి యనౌచిత్యములు చూపి తన నాయకున కట్టి దోషములు నుండరాదను నుత్తమాశయముల బోధించుటకును, కుమారలవుని వీరాదర్శములను పొంగి వచ్చు శూరాలాపములను బ్రకటించుటకును, కుమార లవునిముఖమున నుడువఁ జేసెను. ఉత్తమవీరున కీలాఁటి దోషములుకూడ నుండరాదనియే కవిహృదయము. నిష్కల్మషశీలమే భవభూతి కాదర్శము. ఈ సన్నివేశముకూడ, తండ్రికొడుకులు పరస్పరము వారి బాంధవ్యము నెరుఁగని సమయమున, తుల్యరూపవయశ్శీలురగు లవ చంద్రకేతు సంభాషణమున వీరరససంధుక్షణముగ బాలురకు సంవాదము కల్పించి యెంతో చమత్కారముగ నిర్వర్తించినాఁడు. శ్రీరాముఁడు తండ్రియని తెలిసినపుడు లవుఁ డవ్విధమున స్తుతినిందాపరముగఁ బల్కినచో నది యనౌచిత్య మనఁ

దగును. ఒండొరుల నెరుంగని దశయందు నుడుకురక్తము పొంగుచుండ కౌమారభావమున లవుఁడు అట్టి పల్కులు పల్కుట యెంతయు నాటకీయముగ రసవంతముగ నున్నది.

ఈ యంకమునకు కుమారవిక్రమ మను నామము గూడ కుమారులగు లవ చంద్రకేతువుల విక్రమములు ఆదర్శప్రాయముగఁ జిత్రింపఁబడుటచే నెంతయుఁదగియున్నది.

షష్ఠాంకమున విద్యాధరీవిద్యాధరు లిర్వురు సంభాషించుచు విష్కంభమున లవచంద్రకేతువులయుద్ధమును వర్ణింతురు. ఈ విద్యాధరీవిద్యాధరులఁ బ్రవేశింపఁ జేసి యాకసమునుండి యుద్ధము జూచుచున్నట్లు వర్ణించుట భాసానుకరణము, అభిషేకనాటకమున షష్ఠాంకమున రామరావణయుద్ధమును ముప్వురు విద్యాధరులచే వర్ణింపఁ జేయును. నాటకలక్షణముల ననుసరించి రంగస్థలమున యుద్ధము జూపరాదు. అయినను ప్రేక్షకహృదయము నరసి నియమోల్లంఘనము గావించెను. శ్రీరాముని రాకచే వారి యుద్ధము నిలిచినది. ఈ యంకమున ముఖ్యాంశము శ్రీరాముఁడు లవకుశులను గలిసికొనుటయే. శ్రీరాముఁడు లవకుశసంభాషణముచే వారు నిజతనయులని యూహించుచుండ జనకాదులు శిశుకలహము (లవచంద్రకేతుల యుద్ధము) విని సభయులై వచ్చుచున్నారని తెలిసి వారిని సంభావింప నేగుటతో నంకము ముగియుచున్నది. ఈ యంకవిషయము కూడ వాల్మీక్యాశ్రమ పరిసరముననే నిర్వృత్తమగుచున్నది.

లవచంద్రకేతులయుద్ధము పావకాస్త్ర, వారుణాస్త్ర, వాయవ్యాస్త్ర ప్రయోగములచేఁ బ్రచండముగనుండ నింతలో శ్రీరాముఁడు శంబూకవధానంతరము తిరిగి యయోధ్యకేగుచు త్రోవలో వీరి పోరు గుర్తించి

యా రంగమున నవతరించును. వీరును నా మహానుభావసందర్శనమునఁ బోరు చాలింతురు. ఈ విష్కంభమున విద్యాధరుఁడు చివరకు 'కల్యాణమస్తు సుతసంగమనేన రాజ్ఞః' యని రామున కీ యంకమున రానున్న పుత్రసమాగమప్రాప్తిని సూచించుచున్నాఁడు.

భవభూతి గుణగ్రాహి తన పాత్రలకును నట్టి గుణమే కల్పించి తన నాటకమును జూచువారికి మంచి నీతిని. శీలము నలవడఁజేయును. రాముచే నాలింగితుఁడై చంద్రకేతువు 'కుశలమా' యని యడుగఁబడగ, నతఁ డేమనుచున్నాఁడు-"కుశలమత్యద్భుతక్రియస్య ప్రియదర్శనస్య లవస్య లాభాభ్యుదయేన। తద్విజ్ఞాపయామి మామివ విశేషేణ వా మత్తః స్నిగ్ధేన చక్షుషా పశ్యత్వముం మహావీరప్రకాండం తాతః" యని లవునిగురించి విశేషముగఁ జెప్పి తనకంటె విశేషముగ ప్రీతిని జూపఁగోరును. లవునందలి గుణాతిశయమును లెస్సగా చంద్రకేతువు గ్రహించెను. రాముఁడును లవుని నిరూపించి యాతని యతి గంభీరమధుర కల్యాణాకృతినిఁ గాంచి,

శ్లో॥ త్రాతుం లోకా నివ పరిణతః కాయవా నస్త్రవేదః
క్షాత్రో ధర్మశ్శ్రిత ఇవ తనుం బ్రహ్మకోశస్య గుప్త్యై।
సామర్థ్యానా మివ సముదయ స్సంచయో వా గుణానా
మావిర్భూయ స్థిత ఇవ జగత్పుణ్యనిర్మాణరాశిః॥

(అంకము 6-శ్లోకము 9.)

అని మిగుల ప్రశంసించును. మహావీరచరితమున పరశురాముని వర్ణించు సందర్భమున శ్రీరాముఁడే యీ శ్లోకమును పఠించును. ఋష్యాశ్రమమునఁ బ్రాహ్మణడింభకులతోఁ బెరిగినకతమున నాశ్రమవాసియగుట లవుని క్షాత్రతేజమును బ్రాహ్మముగా నెంచి పరశురామునివోలె నున్నాఁడని పరశురాముఁడు జ్ఞాపకమునకు వచ్చియుండును. భవభూతి

సరియగుఘట్టమున నీ శ్లోకమును గూర్చెను. లవుఁడును శ్రీరాముని దర్శించినంత పుణ్యానుభావదర్శనుఁడని, మహాపురుషుఁడని గ్రహించి, యాతనియందలి సుగుణముల నాశ్వాసస్నేహ భక్తుల గుర్తించి యాతని మూర్తీభవించిన ధర్మమని తనలో భావించి యొక విధమగు పారవశ్యము నొందును. రాముఁడు లవునిఁ జూచినంత నేదో యొక విధమగు దుఃఖవిశ్రామస్నేహముచేఁ బరవశుఁడగును. చంద్రకేతువు లవుని రామునకుఁ బరిచయపరచుట, లవుఁడు రామునెడ ప్రవర్తించిన విధము, సంభాషించిన మాటలతీరు, యివి యన్నియుఁ జాల మనోహరములును, నీతి బోధకములునై నాటకమునకు మెరుఁగిడుచున్నవి.

లవుఁడు శ్రీరామునిచేఁ బరిష్వక్తుఁడై రాముని వాత్సల్యమును గుర్తించి తాను అజ్ఞానమునఁ ద్రోహము గావించినట్లు గుర్తించి 'మృష్యంత్విదానీం లవస్య బాలిశతాం తాతపాదాః' యిని తన తప్పును మన్నింపఁగోరును. పాత్రపోషణమున భవభూతి సిద్ధహస్తుఁడు. మహావీరచరితమునను పరశురాముఁడు వసిష్ఠ విశ్వామిత్రాదుల హితవచనములఁ బెడచెవినిడి తుదకు వారలను తన యవినీతిని క్షమింపఁగోరును. తన తప్పు తా నెరిగి క్షమాపణ వేడికొనుట సత్పురుష లక్షణము. భవభూతి సందర్భము లభించినపుడెల్ల సల్లక్షణముల బోధించుచునేయుండును. లవునిపాత్రమాత్రమే కాదు, శ్రీరామపాత్రమే కాదు, అందరి పాత్రలయందును సమానాదరమును జూపి యౌచితిమేరకు వారలకు గుణగణములఁ గల్పించుచుండును.

ఈ రామ లవ సమాగమఘట్టము పితృపుత్రసమాగమమును వర్ణించుచు వారు మన కన్నులయెదుట నున్నటులే భావింపఁజేయునంతటి రసవంతముగఁ జిత్రింపఁబడినది. సాధారణముగ లోకమునఁ బితృపుత్రుల యెడబాటు ముగిసి, చివరకు కలిసికొనునపు డెట్టి మనోభావములుండునో వానిని లెస్సఁగా గమనించి తన కవితాచాతుర్యమునను నాటకకళా

కౌశలమునను నగిషీచేసి యాభావముల నుదాత్తములుగాఁ బొందుపరచెను. ఇట్టి లోకవృత్తము నుత్తమపాత్రలకుఁ గల్పించి రసవంతముగఁ గూర్చుటయే కవిచాతుర్యము.

కుశుఁడు లవునకన్నఁ బెద్దవాఁడు గదా. శ్రీరాముని రఘుపతి యనియు, తనసంబంధముఁ గోరుచున్నాఁడనియు లవుఁడు తెల్పినను, రాముచెంతకేగ కొంత సంశయించును. రాముని మహాత్ముఁడని, ఆశంసనీయ పుణ్యదర్శనుఁ డని ప్రశంసించును. పిదప రామునిఁ బ్రత్యక్షముగఁ జూచి యభివంద్యుఁ డని నమస్కరించును, రాముఁడును సోత్కంఠుఁడై కుశాలింగనమున నమృత సేచనము ననుభవించినట్లు తలఁచును. కుశలవుల నిరువుర నిపుణముగఁ జూచి రఘుకులచ్ఛాయలఁగనును. తన యంగసంవాదమగు నాకృతినే గాక యభినవశతపత్ర శ్రీమదాస్యమగు సీతాముఖమును బోలియుండు టయుఁ దిలకించి, వాల్మీక్యాశ్రమముచెంత దేవిని విడచిపెట్టుటయుఁ జిత్రదర్శనప్రసంగమున, జృంభకాస్త్రప్రశంసనమున నవి కుశలవులకు స్వతః ప్రకాశములై యుండుననియుఁ దలపోసి, వారు నిజతనయులనియే భావించి వారి నడుగ సందేహించును. ఇట్టి మనోభావముచే శ్రీరాముఁడు కన్నుల నీరుపెట్టుకొనఁ గుశుఁడు సీతావియోగము రామునకు దుర్భరమనియు, ప్రియానాశమున జగమంతయు నరణ్యప్రాయమనియు, నుడివి రామునకు సీతావిషయమున స్మృతిఁ దెచ్చి మరింత యేడిపించును. భవభూతి ప్రేమరసపు ముద్ద. తన నాయికానాయకుల ప్రేమ యద్వితీయముగఁ జూపును. మరల రామాయణశ్లోకములు రాముఁడు వినఁగోరి నపుడును నితరఘట్టము లేవియుఁ దడవక,

శ్లో॥ "ప్రకృత్యైవ ప్రియా సీతా రామస్యాసీన్మహాత్మనః।
ప్రియాభావస్స తు తయా స్వగుణైరేవ వర్ధితః॥

తథైవ రామః సీతాయాః ప్రాణేభ్యోఽపి ప్రియోఽభవత్।
హృదయం త్వేవ జానాతి ప్రీతియోగం పరస్పరమ్॥"
(అంకము 6-శ్లోకము 31,32.)

అని సీతారాముల ప్రేమాతిశయమునే మరల పేర్కొందురు. రాముఁడును, పూర్వానుభూతవిషయముల స్మరించికొని మిగులఁ బొగులుచుండును. ఇప్పట్టున కవి రామచిత్తము శోకాక్రాంత మగుటచే నద్దాని మరల్ప యత్నించి, వసిష్ఠ జనకాదులు లవ చంద్రకేతు యుద్ధవిషయము విని చకితులై యటకు వచ్చుచున్నట్లు తెలిపి యెంతో మనోహరముగ నిర్వహించి నాఁడు. రాముఁడును, జనకాదులఁ జూడ మోమోటవడును. మనమున లజ్జించును. ఎంతయో కష్టపడును. ఇంతలో జనకుఁడును, కౌసల్యాదులును నట్టి యవస్థలోనున్న రాము నీక్షించి యుత్కంఠాభముగ మూర్ఛిల్లుదురు. రాముఁడు సీతాపరిత్యాగరూప ఘోరపాపమొనరించిన తనయందు జనకాదులు కరుణజూపుటచే మిగుల సిగ్గిలి వారి సంభావింప నేగును. ఇట మహాపురుషలక్షణము రామునం దెంతయుఁ బ్రతిబింబించుచున్నది. అతని మనోభావములు గుణములు ఆదర్శములు లోకోత్తరములు. ఇట్టికరుణమున నందరును ముంచి, భవభూతి యీ యంకమున నందర నొక్కెడ వాల్మీక్యాశ్రమమునఁ గలిసికొనఁజేసెను. ముఖ్యముగ నిందు శ్రీరాముఁడు కుమారులగు కుశలవులను వారి రూప స్వభావచేష్టా భాషాదులచే గుర్తించి యౌరసులుగా భావింపఁగల్గుటచే నీ యంకమునకు కుమార ప్రత్యభిజ్ఞానమను పేరుగూడ నెంతయుఁ దగియున్నది.

సప్తమాంకమున నొక విశేషము గలదు. ఈ యంకమున నొక యంతర్నాటికను వాల్మీకిరచితమని కవి కల్పించును. ముల్లోకప్రధానులు, అయోధ్యాపౌరులు, రామలక్ష్మణాదులును ప్రేక్షకులై యుండ

గంగాతీరరంగమున నా నాటకము నప్సరస్త్రీలచే బ్రదర్శింపఁబడున ట్లొనర్చెను. శ్రావ్యముగఁ జెప్పుట కంటె ప్రత్యక్షముగఁ గన్నులతోఁ జూచిన నెక్కువ దృఢపడునని, విన్నదాని కన్న కన్నది మిన్నయౌట సీతావిషయ మింతదనుక నెట్లు గడచెనా యను విషయము నీయంతర్నాటి కామూలమునఁ బ్రేక్షకులకుఁ దెలియఁజేయుచున్నాఁడు. సీతా శీలవిషయమును సందేహించుచున్న పౌరులకు వారి దోషమును వారికిఁ దెలియఁ జేయుటకును, సీత పరమపతివ్రతయని తెలియఁజేయుటకును గవి యీ కల్పనమునకు దొరకొనెను. ఈ యంతర్నాటికకుఁ గూడ రంగము వాల్మీక్యాశ్రమ పరిసరప్రదేశమే.

సీత యమాయిక యని రూఢిగఁ దెల్పుటకై యుద్దేశించిన యీ కల్పన మెంతయు రమణీయముగఁ గూర్పఁబడి రామునకు భార్యాపుత్రులతో సమాగమమును జమత్కారముగఁ గూర్చెను. కాళిదాస శాకుంతలమునందలి తుదియంకము గూడ నీ యంకవిషయమును బోలియున్నది. అందును గర్భిణియైన శకుంతలను విడనాడిన దుష్యంతుఁడు కొంతకాలమునకు తుదకు మారీచాశ్రమమున భార్యాపుత్రులఁ గలసికొనును.

ఈ యంతర్నాటిక లోకవృత్తనిబద్ధమై యున్నది. భర్తచే విడువబడిన యిల్లాలి నాపెతల్లిదండ్రులు బుజ్జగించుటయు, భర్తృపరిత్యక్తయౌట నామెయు ననాథనైతి ననుకొనుటయు, తల్లి యోదార్చి యల్లునికడ కనుపుటయు, నొక్కొక సమయమున నల్లునిపైఁ గోపమూని దూరుటయు లోకమున సాంసారికవిషయముగా నున్నది. ఈ విషయమునే యుత్తమపాత్రలగు సీతారాములవిషయముగఁ గ్రహించి లోకవృత్తమును మనోరంజకముగ నిందు బొందుపరచి భవభూతి కృతకృత్యుఁడైనాఁడు.

వాల్మీకిరామాయణము నందువలె సీత యీ యంతర్నాటికయందు రసాతలమున కేగును. రాముఁడు శోకము భరింపలేక మూర్ఛిల్లును. ఇట్టి

ఖేదాంత పరిస్థితిలో నాటకమును విడువ నొల్లక భవభూతి సీతను గంగాసలిలములనుండి యుద్భవింపఁజేసి యామెకరస్పర్శమున మూర్ఛిలిన రాము నుజ్జీవింపఁ జేయుచున్నాఁడు. సీతాకరస్పర్శము రామునకు సంజీవిని. రాముఁడును సీతాదర్శనమున మిగుల సంతోషించును. తాను మహాపరాధము గావించినట్లు భావించి, గంగాపృథ్వులకుఁ బ్రణమిల్లును. అరుంధతి పౌరజానపదుల నెల్లర హెచ్చరించి సీతను రామున కర్పించి, కృతోపనీతులగు కుశలవులను రామునిపుత్రులని తెల్పును. అంత వాల్మీకి ప్రవేశించి కుశలవులకు రాముని వారి తండ్రి యని సంబంధము నెరింగించి సీతారామసంసారము నొక్కెడ సమకూర్చును. రాముఁడు భరత వాక్యమున లోకకల్యాణము నాశించుటతో నాటకము మోదాంతముగా సమాప్త మగుచున్నది. ఈ సీతాసమాగమవిషయముగూడ పద్మపురాణాంతర్గత విషయచ్ఛాయయే కానగును.

ఇందు సీతాపారిశుద్ధ్యము మరల తెలుపఁబడి పౌరజానపదుల విశ్వసింపఁజేసి, సీతారామసమాగమము గూర్పఁబడినది. భార్యాపుత్రులతో రాముఁడు సుఖముగనుండును.

ఉత్తరరామచరితమున సూక్తులు

1. యథా స్త్రీణాం తథా వాచాం సాధుత్వే దుర్జనో జనః। – (అం. 1–శ్లో 5.)
   (స్త్రీజనులయెడలను కవివాక్కులందును లోక మెప్పుడును తప్పు లెన్నుచుండును)

2. కింతు సంతాపకారిణో భవంతి గురుబంధు విప్రయోగాః। (అం. 1)
   (పెద్దలయొక్కయు బందుగులయొక్కయు నెడబాటు సంతాపమును కలిగించునవి కదా.)

3. లౌకికానాం హి సాధూనామర్థం వాగనువర్తతే।
   ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽను ధావతి॥ (అం. 1–శ్లో. 10)
   (లౌకికులగు సాధుజనులవాక్కులు అర్థపరిపాటి ననుసరించును. ఆర్యులగు ఋషిపుంగవులవాక్కులనే అర్థము అనుసరించుచుండును.)

4. దుర్జనోఽసుఖ ముత్పాదయతి। (అం. 1)
   (దుర్జనుఁడు కష్టమును గలిగించును.)

5. అద్వైతం సుఖదుఃఖయో రనుగతం సర్వాస్వవస్థాసు య
   ద్విశ్రామో హృదయస్య యత్ర జరసా యస్మిన్నహార్యో రసః।
   కాలేనావరణాత్యయాత్పరిణతే యత్స్నేహసారే స్థితం
   భద్రం తస్య సుమానుషస్య కథమప్యేకం హి తత్ప్రార్థ్యతే॥
   (అం. 1–శ్లో. 39.)
   (సర్వావస్థలందును సుఖదుఃఖముల నేకరీతిగ నుండునదియు, అంతరంగమునకు విశ్రాంతిజనకమును, ముసలితనముననునే మాత్రమును తరుగనిదియు, కాలము గడచుకొలది త్రపారూపావరణనాశమున స్నేహసారమను బ్రణయముగఁ

బరిణమించునదియు (ప్రకృష్టప్రేమయే ప్రణయమని భావము.) భద్రమునగుప్రేమ సుకృతముజేసిన సుజనున కెవ్వనికోగాని సులభముగ లభింపదు.)

6. సతాం కేనాపి కార్యేణ లోకస్యారాధనం వ్రతం। (అం.1-శ్లో, 41)
(సత్పురుషుల కే కార్యముచేతనైన లోకారాధనమే వ్రతము.)

7. సతాం సద్భిస్సంగః కథమపి హి పుణ్యేన భవతి। (అం.2-శ్లో)
(సత్పురుషులకు సాధుసమాగమము పుణ్యవిశేషమునఁ గలుగును)

8. ప్రభవతి శుచిర్బింబ గ్రాహే మణి ర్న మృదాం చయః। (అం.2-శ్లో.4)
(శుద్ధమైన రత్నమువలె మృత్పిండము బింబమును గ్రహింపనేరదు)

9. వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి।
లోకోత్తరాణాం చేతాంసి కో ను విజ్ఞాతు మర్హతి॥ (అం.2-శ్లో.6)
(మహాత్ముల చిత్తములు వజ్రముకంటె కఠినములును, పూవులకన్న మృదువులునై యుండును. అట్టి మహాత్ములమనసుల నెవ్వరెరుఁగఁ గలరు?)

10. సత్సంగజాని నిధనాన్యపి తారయంతి। (అం.2-శ్లో.10)
(సత్సాంగత్యమువలనఁ గలిగిన యనర్థములును దుఃఖార్ణవమును దరింపఁజేయును.)

11. అకించిదపి కుర్వాణః సౌఖ్యైర్దుఃఖాన్యపోహతి।
తత్తస్య కిమపి ద్రవ్యం యో హి తస్య ప్రియో జనః॥ (అం.2-శ్లో.19)
(ఏమియు చేయకపోయినను, నిజసాన్నిధ్యమాత్ర నియతములగు నానందములచేఁ దన మిత్రుని దుఃఖమును పోకార్చఁగల మిత్రుడు ప్రధానతమమైన వస్తువుగదా.)

12. ఉచితమేవ దాక్షిణ్యం స్నేహస్య। (అం.3)
(స్నేహమునకు దాక్షిణ్య ముచితమే.)

13. ప్రసవః ఖలు ప్రకర్షపర్యంతః స్నేహస్య। (అం.3)
(సంతతి ప్రేమాతిశయమునకుఁ బరమావధి.)

14. తిర్యంచోపి పరిచయమనురుధ్యంతే। (అం.3)
(జంతువులుగూడ పరిచయమును మరవవుగదా.)

15. స్థానే వాక్యనివృత్తిర్మోహశ్చ। (అం.3)
(మాట లుడుఁగుట మూర్ఛయందు సహజమే.)

16. శోకక్షోభే చ హృదయం ప్రలాపైరేవ ధార్యతే (అం.3-శ్లో.29)
(శోకము చిత్తమును కలతబెట్టునపుడు బిగ్గరగా నేడ్చుటచే శాంతి గలుగును.)

17. కియచ్చిరం వా మేఘాంతరేణ పూర్ణచంద్రస్య దర్శనమ్। (అం.3)
(మేఘాంతరితుఁడైన నిండుచందురుని దర్శన మెప్పటికో కదా.)

18. గుణాః పూజాస్థానం గుణిషు న చ లింగం న చ వయః। (అం.4-శ్లో.11)
(గుణవంతులందు గుణములే పూజకు గణనీయములు. వయో లింగములు కావు.)

19. పురంధ్రీణాం చేతః కుసుమసుకుమారం హి భవతి। (అం.4-శ్లో.12)
(స్త్రీలచిత్తము పూవువలె సుకుమారమైనది కదా.)

20. సులభసౌఖ్య మిదానీం బాలత్వం భవతి। (అం.4)
(బాల్యమున సౌఖ్యము సులభము గదా.)

21. అహేతుః పక్షపాతోయ స్తస్య నాస్తి ప్రతిక్రియా।
సహి స్నేహాత్మక స్తంతు రంతర్భూతాని సీవ్యతి॥ (అం. 5-శ్లో. 17)
(అహేతుకమైన పక్షపాతమునకు ప్రతిక్రియ లేదు. భూతజాలముల యంతరంగములను స్నేహమను దారము చేరఁగొట్టును.)

22. కామాన్ దుగ్ధే విప్రకర్షత్యలక్ష్మీం
కీర్తిం సూతే దుష్కృతం యా నిహంతి।
తాం చాప్యేతాం మాతరం మంగళానాం
ధేనుం ధీరాః సూనృతాం వాచ మాహుః॥ (అం. 5-శ్లో. 30)
(సత్యవచనము సమస్తములైనకోరికల నొసగును. పీడను తొలగించును. కీర్తిని గూర్చును. చెట్టల రూపుమాపును. శుభములఁ గలిగించును- అని పెద్ద లందురు.)

23. మహార్ఘ స్తీర్థానామివ హి మహతాం కోఽప్యతిశయః। (అం. 6-శ్లో. 11)
(మహాత్ములందు తీర్థములందు వలె నతిశయ మెద్దియో మహార్ఘమైనది గలదు సుమా.)

24. స్నేహశ్చ నిమిత్త సవ్యపేక్షశ్చేతి విప్రతిషిద్ధమేతత్। (అం. 6)
(స్నేహము సకారణ మనుట తగదు.)

25. న తేజస్తేజస్వీ ప్రసృత మపరేషాం విషహతే। (అం. 6-శ్లో. 14)
(తేజస్వియగునతఁ డితరులతేజమును సహింపకుండును.)

26. ప్రియానాశే కృత్స్నం కిల జగదరణ్యం హి భవతి। (అం. 6-శ్లో. 30)
(ప్రియురాలు నశించుటచే జగమంతయు నరణ్యమగుచున్నది.)

27. కో నామ పాకాభిముఖస్య జంతుర్ద్వారాణి దైవస్య పిధాతుమీష్టే।
(అం. 7-శ్లో. 4)

(పూర్వ కర్మము పరిపాకోన్ముఖముగనున్న జీవికి రానున్న అనుభవమును దప్పింప నెవరితరము.)

28. అవ్యాహతాంతః ప్రకాశా హి దేవతాస్తత్త్వేషు। (అం. 7)
(పరమార్థవిషయమున దేవతలు రాగద్వేషాదిశూన్యులు గదా.)

29. సకరుణా హి గురవో గర్భరూపేషు।
(పెద్దలు పిల్లలయెడఁ దయగలవారే గదా.) (అం. 7)

కుందమాల-దిఙ్నాగుఁడు

ఇదియు నుత్తరరామాయణకథాభాగ మితివృత్తముగాఁ గల నాటకము. ఇది తొట్టతొలుత దక్షిణభారతీగ్రంథమాలవారిచే నుద్ధృతసంస్కృత గ్రంథజాలము నుండి 1923 వ సంవత్సరమునఁ బ్రకటింపఁబడిన ద్వితీయకుసుమము. ఇది ఆరంకముల నాటకము. ఏతద్గ్రంథకర్త అరారాళపురవాస్తవ్యుఁడగు దిఙ్నాగుఁడని కొన్ని ప్రతులందును, అనూపరాధపురవాస్తవ్యుఁడగు ధీరనాగుఁడని కొన్ని ప్రతులందును గానవచ్చుటచే నా యారారాళపురముగాని, యానూపరాధపురముగాని యెచ్చటను గానరాకుండుటచేతను పై గ్రంథకర్త యెవ్వరని నిర్ణయింప నలవికాకున్నది. కాని నామసామ్యముచే నా యానూపరాధపురము సింహళమందలి ప్రసిద్ధముఖ్యపట్టణమగు అనూరాధపురమని చెప్ప వీలగుటచే నీ కృతికర్త ధీరనాగుఁడే యని కొందరు విమర్శకులు నుడివియున్నారు. కాని యాతనివిషయమింకెందును తెలియవచ్చుటలేదు. దిఙ్నాగుఁడను శబ్ద మొక బౌద్ధనామము. ఈ నామకుఁడు 5-వ శతాబ్దమున నొకఁ డున్నట్లు తెలియుచున్నది. మరియు కాళిదాస మేఘసందేశమున నుదాహృతమగు దిఙ్నాగశబ్ద మొక కవిని గూర్చిన వ్యంగ్యనిర్దేశమని వ్యాఖ్యానకారులు వ్రాసియుండుటచే నీ యుత్తమగ్రంథమగు కుందమాల నా కాళిదాస సమకాలికుఁడగు దిఙ్నాగుఁడే రచించినట్లు కొంద రనుచున్నారు.

పాశ్చత్యవిద్వాంసుల వలె మన భారతీయవిద్వాంసులు కవుల దేశకాలాదులను, వారి జీవితములు మున్నగువాని నంత విశేషముగా వ్రాసియుంచ లేదు. మనవారు పారమార్థికలక్ష్యమును గొని యట్టి కవిదేశకాలాదులఁ దెల్పువిషయమం దాదరమీయరైరి. కాని

పండితప్రకాండుల విద్వత్తు, వ్యాఖ్యానవిశేషములును కర్ణాకర్ణికగ నవిచ్ఛిన్నపరంపరగా మనవరకు వచ్చుచునేయున్నది. ప్రకృతకాలమునగూడ కొన్ని ప్రాంతముల నిట్లే సాగుచున్నదని చెప్పనగును. అందుచేఁ గాళిదాస మేఘసందేశమున 'దిఙ్నాగానాం స్థూలహస్తావలేపా' యను పంక్తులకు దిఙ్నాగుఁడనుపేర నొక మహాకవి యా కాళిదాసకాలముననే యుండి తా కాళిదాసు రచించిన కృతులను గూర్చి సభామధ్యమున నిజ (దిఙ్నాగ) స్థూలహస్తచాలనాదులచేఁ బ్రచండముగ 'ఇచట దుష్టము', ఇట రసభంగము ఇట ననౌచిత్యము- ఇత్యాది వచనంబుల నభినయములతో సల్పియండనోపు. కావుననే కాళిదాసు సరసనిచుళ యనుచోట నిచుళనామక కవిని సరసుఁడనియు, నీ దిఙ్నాగుని గర్వియనియు నుడివియుండవచ్చు ననియే తోచుచున్నది. పరంపరాగతమగు నీగాథను బట్టి దిఙ్నాగుఁడను కవి కాళిదాససమకాలికుఁడు మహావిద్వాంసుఁడై, కాళిదాసున కెందును దీసిపోని పాండిత్యప్రకర్ష గల్గినవాఁడుగా నుండియుండును. గ్రంథస్థశైలినిఁ బట్టియు, రసపుష్టినిబట్టియు నిది యొక సిద్ధహస్తునిదేయనక తప్పదు.

దిఙ్నాగనామకుఁ డొకఁడు బౌద్ధుఁడు 5-వ శతాబ్దిలో నుండియుండె నని తెలియుచున్నది. ఆ బౌద్ధదిఙ్నాగుఁడు బౌద్ధమతావలంబియో, బౌద్ధాభిమానియోయై యుండుటచేతను నీ కుందమాలలో నిష్టదేవతాస్తుతిరూపమైన నాందీపద్యములందు శైవదైవతములగు గణపతి శంకరుల స్తుతించుటచే నా బౌద్ధదిఙ్నాగుఁడు కుందమాలకర్త కాఁజాలఁ డవి తెలియుచున్నది.

మరియు భారతము నాంధ్రీకరించునపుడు నన్నయానంతరము ఎఱ్ఱన అరణ్యపర్వమును వ్రాయుచుఁ బాండవులు పడ్డ, పడరానిపాట్లు వర్ణించుటచే నట్టికష్టములు తనకును సంభవించునేమో యను భీతిని తా వ్రాసినదే

యైనను నా భాగమును తా వ్రాసినట్లు చెప్పుకొనక 'తద్రచనయకా' యని యా నన్నయ రచనయే యని తెల్పినట్టు లే మహాకవియైనను దీనిని (కుందమాలను) రచించి రామునకు భార్యావియోగమును వర్ణించుటచే దనకుఁగూడ నట్టి దేమైనఁ గల్గునేమో యను భీతిని మున్నెన్నఁడో దివంగతుఁ డైన సమర్థవిద్వాంసుఁడగు దిఙ్నాగనామాంకితముగఁ జేసి యుండనోపు నని కూడఁ దోఁచుచున్నది. ఇట్టియాచారము మన కవుల కనేకులకుఁ బరిపాటి. భాసచక్రమునందలి నాటకములన్నియు భాసకృతములు కావనియు, నెవ్వరెవ్వరో తత్సదృశశైలిని రచించి భాసున కాకర్తృత్వ మంటగట్టియుందురని విమర్శకులలో నొక వాదముండుట సర్వవిదితము. లభ్యములగు నంశములనుబట్టి ఈ కృతిని దిఙ్నాగుఁడే రచించెనని కొందరును, ధీరనాగుఁడని కొందరును వచించుచుండ నాట్యదర్పణమున నీ కుందమాలకర్త వీరనాగుఁడని యున్నది. ఇట్లు దిఙ్నాగ, ధీరనాగ, వీరనాగ నామములలో, కొంతమంది ధీరనాగుఁడే కుందమాలకర్తయని యనుచున్నారు. పై ముగ్గురిలో నెవ్వరైనను, నా కవి ఏ దేశమువాఁడు, ఏ కాలమువాఁ డను నంశము మాత్రము నిర్ణయింప వీలులేకున్నది. తుదకు కుందమాల దిఙ్నాగ ప్రణీత మనియే పలువుర యభిప్రాయము; వ్యవహారముకూడనట్లేయున్నది.

ఈ కుందమాల యను నామము రామునకు గోమతీతీరమున కుందమాల యొకటి కనఁబడి యది సీతారచితమని సీతావిషయకస్మరణము గల్గ నతఁ డామె పదాంకముల ననుసరించి వాల్మీక్యాశ్రమమున సీతను, జేరఁ గల్గుటచే నీ గ్రంథమునకీ పేరు నుడువఁబడినది. ఇందలి యితివృత్తము వాల్మీకివిరచితమగు శ్రీమద్రామాయణోత్తరకాండమున లక్ష్మణుఁడు సీత నరణ్యమున దిగవిడువ నేఁగుట నారంభించి. కుశలవ పట్టాభిషేకాంతము

గల ప్రఖ్యాత సీతా రామచరితము. రామాయణోత్తరఖండభాగమును జాలవర కనుకరించి, యుచితములైన మార్పులతో నాటకమును రమ్యముగ రసవంతముగ నొనరించెను. భవభూతి ఉత్తరరామ చరితము నందువలె విసుగుపుట్టించు పెద్ద పెద్ద శ్లోకములు కథాగమనమున కడ్డు తగులు నట్టి విందు లేవు. నాటకము మనోరంజకముగ నున్నది. కవి భాసనాటకచ్ఛాయలతో నీ నాటకమును నడపినట్లు తోఁచుచున్నది.

కథాసంగ్రహము

ప్రథమాంకము కథ సీతాలక్ష్మణులు గంగాతీరమునఁ జేరినట్లు గోచరించుటతో నారంభమగుచున్నది. మార్గము మిట్టపల్లములుగా నుండుటచే రథమునుండి దిగుదురు. ఆ తీరముననే లక్ష్మణుఁడు మార్గముఁ జూపుచుఁ గొంతదూరము సీతను దోడ్కొని పోవును. సీత యలసి విశ్రమింపఁగోరును. లక్ష్మణుఁ డదియ యదనని రాజాజ్ఞ నివేదించి సీతతో నామె శ్రీరామునిచే లోకప్రవాదనిమిత్తముగ విడువఁబడెనని తెల్పును. సీతయు దీనాతిదీనముగ సందేశమంపి లక్ష్మణుని బంపును. లక్ష్మణుఁడు ప్రకృతిని వనదేవతల నామెను సంరక్షింప వేడికొని వెడలిపోవును. అంత వాల్మీకి శిష్యులమూలమున నామెను గనుకొని నిజాశ్రమమునకుఁ గొనిపోవును.

ద్వితీయాంకము: ఇరువురు మునికన్యలు సీత యమళలఁ గనెననియు వారు వాల్మీకులయొద్ద రామాయణము నేర్చుకొనుచున్నారనియు, నైమిశారణ్యమున గొప్ప యజ్ఞ మారంభింపఁబడె ననియుఁ దెలుపుదురు. మరియు సీత, యేకాంతమున నిజదుఃఖమును వెళ్ళఁబోసికొనుచు తన యోర్పును గూర్చియు, తనకు శ్రీరామదర్శనప్రాప్తి లభించునను నాశ పొడముటయు వేదవతితో సంభాషించుచు నెరింగించును.

తృతీయాంకము: ఆశ్రమవాసి యొకఁడు నైమిశారణ్యమునకుఁ బోవుచుండును. అంతలో రామలక్ష్మణులు ప్రవేశించి రాముఁడు సీతావియోగ దుఃఖ మనుభవించును. గోమతీతీరమునఁ జేరి యా తీరముననే యరుఁగుచుండ నొక కుందమాల యా నదీజలమునఁ గొట్టుకొని వచ్చి రామపాదముల కుపహారముగ వచ్చుట తిలకింతురు. ఆ కుందమాలను గొని తద్రచనాకౌశలము సీతదియ యని నిశ్చయించి వారు సీతాపాదచ్ఛాయల ననుసరించి యాశ్రమముచెంతఁ జేరుదురు. సీత యొక పొదరింట నిలచి యామెను గూర్చి రామలక్ష్మణులు సంభాషించుట వినును. కొంతసేపటి కామె యాశ్రమమున కేగును. రాముని రాక తెలిసి వాల్మీకి మునినంపి రాము నాహ్వానించును.

చతుర్థాంకము: వేదవతి యజ్ఞవతి యను నిరువురు పొలతులు స్వర్వేశ్యయగు తిలోత్తమ శ్రీరాముని మనోభావములఁ బరీక్షింప సీతావేషమూని యాశ్రమమునకు వచ్చెనని మన కెరింగింతురు. రాజపరివార మంతయు నాశ్రమముచెంత విడియును. విదూషకుఁ డా స్త్రీలసంభాషణము వినును. రాజపరివారము చెంతనే యుండుటవలన నచ్చటి దీర్ఘికా తీరముననుండు స్త్రీలు పురుషులకుఁ గానరాకుండునట్లు అదృశ్య లగుదురని వాల్మీకిమహర్షి యనుగ్రహించినట్లును వారి సంభాషణమువలనఁ దెలియును. అప్పటినుండి సీత యా దినమంతయు నా దీర్ఘికాతీరముననే ప్రొద్దుపుచ్చును. సీత తనకుఁ జిత్రకూటమున మాయావతి యను వనదేవత యొసంగిన 'చంద్రధవళప్రావారకము'ను ధరించి, యా దీర్ఘికయందు విహరించు నొక 'హంస మిథున' సహవాసమునుజూచి తన దీనావస్థనుఁ దలపోసికొని మిగులఁ బొగులుచుండును.

శ్రీరాముఁడు కణ్వమహర్షియుఁ బ్రవేశించి కొంతతడవు సంభాషించుదురు. అంత శ్రీరాముఁ డొంటరిగనుండుతరి నట దీర్ఘికయందు

సీతయదృశ్యయై యున్నను నామె ప్రతిబింబమును మాత్రము చూచును. సీతాప్రతికృతియే యని యచ్చెరువొంది సత్యాకృతినిఁ గనలేక శ్రీరాముఁడు మూర్ఛిల్లును, సీత జాలి నొంది రాముచెంత కేగి యుపచరించును. మూర్ఛఁదేరి శ్రీరాముఁ డదృశ్యయగు సీతతో సంభాషించుచు, మరల మూర్ఛ నొందును. మరల సీత యదృశ్యయై తన చేల చెరంగుతో విసరుచు నుపచరించును. శ్రీరాముఁడా చేల మూని సీతదియని గ్రహించి కప్పుకొనును. సీతయు సంతసించును. అంత శ్రీరాముఁడు నిజో త్తరీయమును దీసివేయును. సీత దానిని గైకొని మాయ మగును. రాముఁడీ యద్భుతకృత్యమున కచ్చెరువొందుచుండ విదూషకుఁడు, తిలోత్తమ తన (రాముని) మనోభావముఁ గనుఁగొన సీతావేషమున నాశ్రమమునకువచ్చెనను వృత్తాంతముఁ దెల్పును. రాముఁడు వంచింపఁబడి నట్లనుకొనును.

పంచమాంకము: శ్రీరాముఁ డిట్టి యద్భుతవిషయముల కచ్చెరు వొందుచు విదూషకునితో సీతవిషయము ముచ్చటించును. ఇంతలో నెవ్వరో యాశ్రమవాసులగు బాలకు లిర్వురు రాజదర్శనమునకై వచ్చి రని విని వాల్మీకి శిష్యులని యెరిఁగి రామునకు వారిని గూర్చి వర్ణింప రాముఁడు వారిని లోనికి రప్పించును. ఆ బాలకులు కుశలవనామకులు రాముచెంత కేగుదురు. వారి యాకృతులఁ గాంచినంత శ్రీరాముఁ డాంతరమగు నెద్దియో హేతువున నాకృష్టుఁడై వారి వృత్తాంత మడిగి వారు నిజతనయులై యుండురేమో యనికూడ సందేహించును. బాలకులు వాల్మీకిరచితగాథను శ్రావ్యముగ వినిపింతు మన, రాముఁడును. గూతూహలుఁడై వినఁ గోరును.

షష్ఠాంకము: ఆస్థానమున నందరు చేరి యుందురు. రాజమాతలు తెరచాటునఁ జేరి యుందురు. రామకథ నంతయుఁ బదిశ్లోకములలోఁ జదివి సీత నడవికిఁ బంపుటతో నదియ ముగింపని ముగింతురు. అంతఁ

గణ్వుఁడు మరి మూఁడు శ్లోకములు నుడివి కుశలవులు సీతాతనయులని యెరింగించి ముగించును. రామలక్ష్మణులు కుశలవుల నాలింగనముఁ గావించికొని యందరును మూర్ఛ నొందుదురు. అంత వాల్మీకి సీతను దోడ్కొని వచ్చి యా నల్వుర మూర్ఛఁ దేర్చును. వాల్మీకి శ్రీరాముని సీతాబహిష్కరణమునకై దూరుచు సీతను నిజపాతివ్రత్యమున నిర్దోషతను నిరూపింప నాజ్ఞాపించును, సీతయు నందరలోకపాలురఁ బ్రార్థించి పృథ్వీమాతను నిజనిర్దుష్టతను బ్రకటింప వేడికొనును. ఆశ్చర్యకరములగు దృశ్యములతో భూదేవి ప్రత్యక్షమై సీత దోషరహిత యని నిరూపింప రాముఁ డామెను పరిగ్రహించును. పృథ్వియు నదృశ్యయగును. అంత శ్రీరాముఁడు లక్ష్మణవాక్యానుసారము కుశునకుఁ బట్టాభిషేక మొనరించును. అందరును బరమానంద మొందుదురు. కృతియు మోదాంతముగ శుభాశీర్వాదములతో ముగియును.

ఈ నాటకమున సీతశీలము ప్రధానవిషయము. ఇందు సీత విరహమున నందును బహిష్కృతసమయమున తన నేర మేమియు లేనపుడు, తన్నట్లు వెడల నడచిన భర్తృవిషయమునఁ దనకుఁ గల యుత్తమభావముల వెలువరించుచు నత్యుత్తమభారతనారీహృదయము నావిష్కరించుచు నాదర్శకురాలగుచున్నది. ఈ నాటకమందు వాల్మీక్యాశ్రమమున సీతారాముల సంభాషణము భాసుని స్వప్న, వాసవదత్తమందలి రాజు కలవరించు స్వప్నవృత్తాంతమును స్మరింపఁజేయుచున్నది. అటులే ఇందు సీత అదృశ్యయగుట అవిమారకమందలి యైంద్రజాలికప్రభావముగల యుంగరమువిషయము తలపఁ జేయుచున్నది. ఉత్తరరామచరితమున ఛాయాంకముగూడ నిట్టిదియే. ఇతివృత్తము ఉత్తరరామాయణకథయగుట భవభూతి విరచితమగు నుత్తరరామచరితమువంటిదే యీ గ్రంథము నగును. వీని పౌర్వాపర్యము నిర్ణయింప వీలగుట లేదు. ఈ కవి భవభూతికిఁ

దర్వాతివాఁడే యని కొందరందురు. ఇందలి ప్రాకృతవాక్యము లార్షములుగ నున్నవి. కొన్ని తావుల సుగమములుగ లేవు.

ఈ కుందమాలయందు విసుగు బుట్టించు దీర్ఘఘట్టము లేవియు లేక కథాగమనము తీవ్రముగా సాగినది. తొలుతనే సూత్రధారవచనములందు 'తద్యావదస్య సందర్భస్య ప్రయోగసాచివ్యవిధాయినీ మార్యామాహూయ రంగభూమి మవతరామి' యని నుడువగనే 'అవతరామి' యను సూత్రధారవచనము నాధారముగఁ గొని కవి సీతాలక్ష్మణప్రవేశమును గల్పించి లక్ష్మణునిచే ఇత ఇతో అవతరత్వార్యా యని కథలోనికి శీఘ్రముగఁ గొనిపోవుచున్నాఁడు. గ్రంథ కర్తృవంశాదికమును ప్రజ్ఞాదికమును గూడ స్పృశింప లేదు. చాల లఘువుగ ప్రస్తావనయందు 'అరారాళవురవాస్తవ్యస్య కవే ర్దిఙ్నాగస్య కృతిః కుందమాలా' యని మాత్రము పేర్కొని సూత్రధారుడు నాట్యప్రయోగమునకై భార్యను బిలువఁగోరి 'ఇత ఇతో అవతరత్వార్యా' యను పలుకులు విని,

'లంకేశ్వరస్య భవనే సుచిరం స్థితేతి
రామేణ లోకపరివాదభయాకులేన।
నిర్వాసితాం జనపదాదపి గర్భగుర్వీం
సీతాం వనాయ పరికర్షతి లక్ష్మణోఽయమ్॥'

(అంకము 1. శ్లో. 3.)

యని సీతాలక్ష్మణులప్రవేశమును సూచించుచున్నాఁడు. ఇట్టి సూత్రధారవాక్యము ననుసరించి కథాప్రవేశమును సూచించుటలో సూత్రధారప్రయోగము నుద్దేశించి మరొక ప్రయోగము అతిశయముగఁ జూపబడుటచే నిది ప్రయోగాతిశయమను నాటకలక్షణమున కుదాహరణముగ సాహిత్యదర్పణమున నుడువఁబడి యున్నది.

ఈ నాటకమునఁ బ్రథమాంకమున రామునిచే నిరస్తయైన సీతను లక్ష్మణుఁడు తోడ్కొని వచ్చుటతో కథ ప్రారంభించుచున్నది. నేల రథగతి కనుకూలముగ లేకుండుటచే వారు దిగి మెల్లగా నడుచుచుందురు. అంతియ కాని యిందు నదిని దాటుట మున్నగునవి వర్ణింపఁబడ లేదు. వాల్మీకి రామాయణమున నుత్తరకాండమున శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనును.

శ్వస్త్వం ప్రభాతే సౌమిత్రే సుమంత్రాధిష్ఠితం రథమ్॥ 6
ఆరుహ్య సీతామారోప్య విషయాంతే సముత్సృజ।
గంగాయాస్తు పరే పారే వాల్మీకేస్తు మహాత్మనః॥ 7

ఆశ్రమో దివ్యసంకాశః తమసాతీరమాశ్రితః।
తత్రైనాం విజనే దేశే విసృజ్య రఘునందన॥ 8

(సర్గము 45. ఉత్తరకాండము.)

రామాయణమున రాముఁడు తుదకు కుశలవులఁ జూచి వారు సీతాతనయులని గుర్తించుటకు సీత వాల్మీక్యాశ్రమ ప్రాంతముల విడువఁబడె నని స్పష్టముగాఁ దెలియును. ఇందు నాటకోచితముగ సీత యొంటరిగ దిక్కుతెలియని నిర్జనాట విని విడువఁబడినట్లును వనదేవతాది ప్రకృతిదేవత లామెను రక్షింపగోరి లక్ష్మణుఁడు వేడుకొనునట్లును వర్ణించుట సీతను మిక్కిలి దయనీయావస్థలోఁ జూపుటకై కవి యట్లు వాల్మీక్యాశ్రమ ప్రాంతమని తొలుతఁ జెప్పలేదు. వాల్మీకి ఆకస్మికముగ శిష్యముఖమున నీమెను దెలిసికొని యామెను నిజాశ్రమమునకుఁ గొనివచ్చునట్లే నాటకోచితముగఁ జిత్రించినాఁడు. ఈ కవి సాక్షాత్ప్రసక్తములగు విషయములనే అతి సంగ్రహముగ కథావిషయముల కేలోటును లేకుండ సాగించెను. ప్రథమాంక కథాగమనము జూడుడు. లక్ష్మణుఁడు సీతను దోడ్కొని వచ్చి నిర్జనాటవిని విడిపించుట, సీతాలక్ష్మణులు సంభాషించుట.

ఆ సంభాషణమున సీత యుదారబుద్ధి. పతివ్రతాధర్మము, యుదాత్తాశయము. గాఢానురాగము మున్నగు సుగుణములు వ్యక్తపడుట; ఒంటిగా సీతను విడువలేక విడువలేక చాల దుఃఖించి వనదేవతాదుల నామెను రక్షింపఁ బ్రార్థించి లక్ష్మణుఁడు తా నెటులోయేగుట, సీత భీతభీతయై యుండుట. ఆకస్మికముగ వాల్మీకి శిష్యముఖమున నీమెను తెలిసికొని నిజాశ్రమమునకుఁ దోడ్కొనిపోవుట. మున్నగువిషయము లన్నియు కథను చాల శీఘ్రముగ నడపించుచు మనసునకు హాయిని గూర్చుచున్నవి. అనవసరములగు దీర్ఘవర్ణనము లిందు లేవు.

లక్ష్మణుఁడు సీతతో రాముఁడు సీతను లోకాపవాదభీతుఁడై వదలిపెట్టెనను వార్త యామెకుఁ దెల్పకమున్నే వారొక చెట్టునీడయందుఁ గూర్చుండి విశ్రాంతి ననుభవించుచుండ, లక్ష్మణుఁడే యీమె విషయమై 'అహో అసంహార్య పరిచ్ఛదాః సుకృతినః తథా హి,

'తరంగా వీజంతే సజలకణికాన్ శీతమరుతః
తథైతే సంగీతం దధతి కలహంసాః కలగిరః।
సఖీవచ్చామేయం రమయతి పరిష్వజ్య హృదయం
వనే శూన్యేఽప్యస్మిన్ పరిజనవతీ వాత్రభవతీ॥'

(అంకము 1. శ్లోకము 7.)

యని యామె కడవియందును సకలోపవారములు ప్రకృతియే నెరవేర్చుట తిలకించి యామె సుకృతిత్వము నెన్నును. ఈ శ్లోకము వినినపుడు శ్రీహర్షుని నైషధకావ్యమున,

'వనేఽపి తౌర్యత్రిక మారరాధ తం।
క్వ భోగమాప్నోతి న భాగ్యభాగ్జనః॥

యను శ్లోకము స్మరణకు వచ్చుచున్నది. ఇద్దాన కవి మహానుభావలక్షణము గూడ కొంతవ్యంగ్యముగఁ దెలియఁ జేయుచున్నాఁడు. లక్ష్మణుఁడు సీతతో

రామాదేశము తెలుపఁ జాల బాధపడును. మనస్తత్త్వపరిశీలమున భవభూతియే మేటి యని పలువు రందురు. అది వాస్తవమే. ఈ కుందమాలకర్త కూడ నీ నాటకమున సీతారామలక్ష్మణమనోభావములఁ గడుంగడు సూక్ష్మములగు వానిని గూడ నెంతో రసవంతముగఁ జిత్రించి నాఁడు. రామునిహృదయము సీత యెరుఁగనిది కాదు. అయినను సీతతో రామనిదేశము నుడువునపుడు లక్ష్మణుని శాలీనత, దాక్షిణ్యము, భ్రాతృభక్తిమున్నగు సుగుణములను, లెస్సగా వర్ణించి నాటకము నెంతో మనోరంజకముగ నుడివెను. లక్ష్మణశీల మిందు చక్కగా చిత్రింపబడినది. అన్నగారినిగూర్చి సీతతో 'తవ ప్రవాసే వనవాస ఏవ' యని సీత లేని రామునకు నగరవాసముకూడ వనవాసమే యనును. మెల్లమెల్లగా వనవాసప్రసక్తిఁ దెచ్చును. చెప్పవలసినవిషయము హృదయదారకమని తెలిసియే క్రమక్రమముగా సీతకుఁ దెల్పును. ఇప్పట్టున నగ్నిశుద్ధివిషయమును,

'ఋషీణాం లోకపాలానా మార్యస్య మమ చాగ్రతః।
అగ్నౌ శుద్ధిం గతా దేవీ కిం తు.....॥'

(అంకము 1. శ్లోకము 13.)

యని నిలుపును, సీత యవలఁ దెల్పుమన,

'.....లోకో నిరంకుశః'

(అంకము 1. శ్లోకము 13.)

యని చెప్పలేక చెప్పినట్లు శ్లోకమును విరచి చెప్పును. ఇది లక్ష్మణహృదయమును తెల్పుచున్నది. లక్ష్మణుఁడే స్వయముగా,

'ఆర్యస్యాదేశ ఇత్యేవ వక్తుమిచ్ఛామి యత్నతః।
తథాపి హృదయం గత్వా గ్రంథిం బధ్నాతి భారతీ॥

(అంకము 1. శ్లోకము 8.)

యని తనమనోవేదనను వెడలబోసికొన్నాఁడు. రామునియాజ్ఞ యిది యని చెప్పగనే యామె మూర్ఛిల్లును. కొంతతడవునకు మేల్కొని యాతని సందేశమేదేని కలదా యని యడుగగా లక్ష్మణుఁడు,

'తుల్యాన్వయే త్యనుగుణేతి గుణోన్నతేతి
దుఃఖే సుఖే చ సుచిరం సహవాసినీతి।
జానామి కేవల మహం జనవాదభీత్యా
సీతే త్యజామి భవతీం న తు భావదోషాత్॥'

(అంకము1. శ్లోకము 13.)

అను శ్లోకముచే సీతపై రామునకుఁ గల యనురాగాతిశయమును దెలుపుచు కేవలజనాపవాదభీతి నట్లు చేసినట్లు నుడువును. అంతియకాక రాముఁ డేకపత్నీ వ్రతముననే యుండునట్లు నామెకుఁ దెలుపును. రామసందేశమును.

'త్వం దేవి చిత్తనిహితా గృహదేవతా మే
స్వప్నాగతా శయనమధ్యసఖీ త్వమేవ।
దారాంతరాహరణ నిఃస్పృహమానసస్య
యాగే తవ ప్రతికృతిర్మమ ధర్మపత్నీ॥'

(అంకము 1. శ్లోకము 12.)

అను శ్లోకము నుడివి దారాంతరాహరణనిఃస్పృహునిగా నుడువును. సీతయు నీ విషయము విశ్వసించి చాల సంతోషించి 'ఏవం సందిశతా ఉ ఉ ర్యపుత్రేణ' పరిత్యాగదుఃఖం మయి నిరవశేషమపనీతం' అని నిజపరిత్యాగదుఃఖము పూర్ణముగ పోయినట్లు భావించుచు. 'న హి తథా అన్యాసక్తా పత్యుః, స్త్రీజనస్య దుఃఖముత్పాదయతి యథాన్యాసక్తః' అని స్త్రీ

హృదయమును వెలిబుచ్చుచున్నది. కవియు నీ సందర్భమున లౌకికవిషయమగు స్త్రీప్రేమ నెంతో యుదాత్తముగ నుడువుచున్నాఁడు. ఆడుది పరపురుషునియం దాసక్తురాలైనచో పురుషున కంత కష్టము గలుగదట. స్త్రీ జనమునకుమాత్రము పురుషుఁ డన్యకాంతాసక్తుఁ డైనచో భరింపరాని వేదనయట! స్త్రీ యనుభవవించునంతటి దుఃఖము పురుషునకుండదట! ఇప్పట్టున లక్ష్మణుఁడు సీతకు రామకార్యము నింద్యము కాదని నచ్చ చెప్పును. కవ్యుద్దేశ మదియే. సీతకూడ తన దురదృష్టఫలముగఁ దా నట్టి యనుభవమునకుఁ బాత్రురాలైనట్లు భావించి రామునకుఁ బ్రతిసందేశ మంపునపుడెంతగొప్పగా నుదాత్తాశయములతోఁ బంపుచున్నదో చూడుఁడు. సీతయవస్థ చూడ నొంటరిగ శ్వాపదాకీర్ణమగు నరణ్యమున నీరక్షగా విడువఁబడినది. ప్రతి సందేశముచూడ 'మందభాగినీమనుశోచన్ వర్ణాశ్రమపరిపాలనమభిఘ్నన్నాత్మానం న బాధయ, సద్ధర్మే స్వశరీరే సావధానో భవేతి' తన్నుగూర్చి చింతింపక నిజధర్మమగు వర్ణాశ్రమపరిపాలనమును జక్కగా నిర్వర్తింపుమని ప్రబోధించినది. తనభర్త కెట్టి కళంకమును సహింపని సహధర్మచారిణి సీత. కష్టదశయందును నామె గుణము వ్యక్తమగుచున్నది. విపద్దశలందే ప్రతివ్యక్తికిని నైజగుణము వ్యక్త మగుచుండును. సీతగాక యన్యకాంత లెవ్వరైన నట్లు వచింతురా; సీతారాములప్రేమ యద్వితీయము. మరియు నామె రామునకు విన్నవింపుమని లక్ష్మణునితో నిట్లనుచున్నది. 'సా తపోవనవాసినీ సర్వథా సీమంత విహితేనాంజలినా విజ్ఞాపయతి, యద్యహం నిర్గుణా చిరపరిచితేతివా, అనాథేతివా, సీతేతివా స్మరణమాత్రకేనానుగృహీతవ్యేతి'– అని ఎంత వినయముగా విన్నవించు చున్నదో! ఇంతటితో విడువలేదు. తనకు సంబంధించినవారి కందరకును సందేశ మంపుచున్నది. 'వత్స లక్ష్మణ ప్రణమితవ్యా మమవచనాత్

రాఘవకులరాజధానీ భగవత్యయోధ్యా,.....సమాశ్వాసయితవ్యా ప్రియం వదా మమ ప్రియసఖ్యః స్మర్తవ్యా సర్వకాలం మందభాగినీ' యని మిత్రులకుఁ గూడ సందేశ మంపుచున్నది. లక్ష్మణుఁడు నామె దయనీయావస్థను గాంచి, లంకాసమరమున నింద్రజిత్తుచే హతుఁడైన తన్ను హనుమంతుఁడు వైరమూని యిట్లు సీత నొంటరిగ కాననముల విడుచుటకును, నామెపరిదేవనముల నాలకించుటకును మరల బ్రతికించెనని తలంచును. మానవులకన్నఁ దిర్యక్కులే వరములని యచ్చటి తిర్యక్సమూహము సీతవిషయమున జాలినొంది స్వస్వకర్మలఁ బరిత్యజించెననియు నుడువుచున్నాఁడు. ఇవి యన్నియు సీతావిషయకదయ నీయావస్థను మరింత జాలిగొల్పునట్లు చేయుటకై వర్ణింపఁబడినవి. లక్ష్మణుఁడు నల్దిక్కులఁ గలయఁ జూచి లోకపాలురతో,

'ఏషా వధూర్దశరథస్య మహారథస్య
రామాహ్వయస్య గృహిణీ మధుసూదనస్య।'

(అంకము 1–శ్లోకము 21.)

యని సీతనుగూర్చి యెంతో యుదాత్తముగా నుడువుచున్నాఁడు. మహారథుఁ డగు దశరథుని కోడలనియు, రామాఖ్యతో భువివెలసిన మధుసూదనుని భార్య యనియు గొప్పగా నుడివి యాపెను రక్షింపఁగోరును.

లక్ష్మణుఁడు వెడలిపోయిన పిదప తన్నుదాను దూరుకొనును. 'తొలిజన్మమున నేపాప మొనరించి యిపుడిట్టి విరహ మనుభవించుచున్నానో కదా' యని విలపించి విలపించి 'కథం వసిష్ఠవాల్మీకిప్రముఖాః మహాప్రభావాః మహర్షయః ఇదానీం మాం పరిత్యజ్య.....' యని మూర్ఛిల్లును. ఇంతలో వాల్మీకి సమీపించి తాను జనకమహారాజునకుఁ జిరంతసఖుఁడనియు, దశరథునకు బాలమిత్రుఁడనియు, నామెకుఁ దెలియఁజెప్పి యన్యజనశంక

వీడుమని హెచ్చరించి నిజాశ్రమమునకుఁ గొనిపోయి యట సుతానిర్విశేషముగఁ బెంచుచుండును.

ఉత్తరరామచరితమందువలె సీత నొంటరిగ నడవిలో దిగవిడచి, గంగా పృథ్వీదేవతలచే సంరక్షింపబడుచుండినట్లు తెల్పుట యీ కవి కిష్టము లేదని తెలియుచున్నది. అతిమానుషకల్పన లీతని కంతగా నచ్చునట్లు లేదు. లోకాతీతలక్షణముల నిందుఁ జొప్పింపఁడు. మానవత్వము అంతట ప్రతిబింబించుచునే యుండును. ఈ గ్రంథమందు సీత యుత్తమ గృహిణిగనే గోచరించుచున్నది.

అన్యజనశంకచే సీత వాల్మీకి ననుమానించుచుండ వాల్మీకి తగినరీతి నామెతో సంభాషించి యామెవృత్తాంత మరసి యోగచక్షువునఁ జూచి 'వత్సే! జనాపవాదభీరుణా రామేణ కేవలం పరిత్యక్తా,, నతుహృదయేన, నిరపరాధాత్వమస్మాభి రపరిత్యాజ్యైవ, ఏహ్యాశ్రమపదం గచ్ఛావః' యని యాపె నిరపరాధతయు, రామునిజనాపవాదభీరుతయు నుడివి యామె నోదార్చి నిజాశ్రమమునకుఁ గొనిపోవును. ఇట సీతావాల్మీకులసంభాషణము హృద్యము. ఈ కవి ఊహ్యములగు నంశము లేవియు లేకుండ నాటకమును సరసముగా సాగించినాఁడు. వాల్మీకిరామాయణమున కనుగుణముగనే చాలవరకు నడపించినాఁడు.

ద్వితీయాంకమునఁ బ్రవేశకమున వేదవతియు మరియొక మునికన్యయు సంభాషించుచు కుశలవులు జనించిరనియు, శైశవము వీడి రామాయణమును జదువుచున్నారనియు, రాముఁడు నైమిశమున యజ్ఞ మారంభించి తపోధనుల నందర నాహ్వానించినట్లును, రామదూత వాల్మీకి తపోవనమునకు వచ్చినట్లును తెలియఁ జేయును. సీత యొంటిగ నిజావస్థను, దలపోసికొనుచు చింతాకులయైయుండును. పురుషులు

అవిశ్వసనీయులనును, శిలాక్షరములతో భూలోకమున సీతారాముల దాంపత్యము స్వర్గమున నుమామహేశ్వరులదాంపత్యమువలె నాదర్శమని నుడువఁబడియు తా నట్టి వచనీయావస్థకు లోనగుటకుఁ జాల విచారపడును. స్త్రీహృదయచాంచల్యమును సాధారణస్త్రీవలెఁ దెల్పును. రామునితోఁ దన పరిచితిని దలపోసి మరింత కుములుచుండును. వేదవతితో సంభాషించుచు రామునిపై తనగాఢానురాగమును దెల్పును. అతఁ డన్యకాంతావిముఖుఁడనియు తా నతనిహృదయముననే యున్నట్లును నుడువును. మరియుఁ దాను రామదర్శనమున నిజజన్మము సఫలము జేసికొనఁ దలంచి యందులకై యాశించుచు నైమిశమునకుఁ బయన మగును.

ఈ ద్వితీయాంకమున సీతావేదవతుల సంభాషణమున సీతాహృదయము వ్యక్త మగుచున్నది. సీత తానెన్ని యిక్కట్టులలో నున్నను పల్లెత్తుమాటనైన భర్తపైననక, యాతనిపైఁ దనకుఁగల గాఢానురాగమునే వెలిబుచ్చుచు నుత్తమకుల స్త్రీలక్షణముల బోధించుచున్నది. ఇందుఁ గథాగమనము తక్కువ. కాని సీతాహృదయము తెలియుటకై యిట్టి సంభాషణము కవి కల్పించినాఁడు. దీనఁగాలముగూడ పదిపండ్రెండు సంవత్సరములు గడచినట్లు తెలియుచున్నది. కుశలవులజననము శైశవము బాల్యము రామాయణపఠనము మున్నగు విషయములు పదిసంవత్సరములకాలమున జరిగినవానిని కవి తెలియఁజేయుచున్నాడు.

తృతీయాంకమున మార్గపరిశ్రాంతుఁడగు తాపసుఁడు ప్రవేశించి తాను నైమిశమునకుఁ బోవుచున్నట్లును, అది గ్రీష్మకాలమగుట నడుగులు బొబ్బలుపోవ, తా నడువలేనట్లును, సీత కుశలవులతో నైమిశమును జేరినట్లును, లక్ష్మణసహితుఁడై రాముఁడును నైమిశమునకే

యరుగుచున్నట్లును దెలియజేయుచున్నాఁడు. ఇందు కవి గ్రీష్మకాల మని నుడువుటచే యజ్ఞములు సలుపుట కనుకూలమగుకాలము గ్రీష్మమని తెలియఁజేయుచున్నాఁడు.

అంతట రాముఁడు శోకసంతాపమున లక్ష్మణసహాయుఁడై వచ్చుచుండును. లక్ష్మణుఁడు రాముని శోకావస్థను గాంచి శోక మెంత ధీరునైన విక్లబుని జేయునని,

'ప్రమాదః సంపదం హంతి ప్రశ్రయం హంతి విస్మయః।
వ్యసనం హంతి వినయం హంతి శోకశ్చ ధీరతామ్॥'

(అంకము 3-శ్లోకము 2.)

అనియొక చక్కని శ్లోకము నుడువును. మందరమహీధరసమానధైర్యుఁ డగు రాముఁడు సీతాపరిత్యాగమునకును నవల నామె పడుదురవస్థను దలపోసి మిగులఁ బొగలుచు తనసేతను మిగుల నిందించుకొనును. 'కిం కిం మోహా దహమకరవం జానకీం తాం నిరస్య' యని యనును. ద్వితీయాంకమున రామునిగూర్చి యాతఁ డేకపత్నీవ్రతుఁడనియు, సీతయందు గాఢానురాగముగలవాఁడనియు సీతకుఁగల భావములు వర్ణింపఁబడినవి. ఇట నీ తృతీయాంకమున రామునకు సీతావిషయకానురాగము ఎట్టిదో కవి వర్ణించుచున్నాఁడు. ఇట్లు పర్యాయముగా నాయికానాయకుల గాఢానురాగ ముత్తమరీతి నాదర్శముగ వర్ణించి కవి చమత్కారముగా కథను సాగించుచున్నాఁడు. భవభూతిరచనవలె రామవిలాపము నెక్కువగా వర్ణింపక యిందు కవి రెండు శ్లోకములతోడనే నిర్వహించినాఁడు. ఇంతలో రాముని శోకమును మరల్చుటకై లక్ష్మణుఁడు గోమతీతీరమును జూపనట నా తీరవాయుస్పర్శచే నానంద మనుభవించి సీత యా ప్రాంతమున నెచటనో యుండి యుండునని

భావించును. ఆహా! ఎంతటి యనుభూతి. సీతారాముల దాంపత్యమే యనన్యలభ్యము. అద్వితీయము. ఎన్నడో పది లేక పండ్రెండు సంవత్సరములకుఁ బూర్వము విడువఁబడిన సీతపై రామున కెంతటి యనురాగము! గోమతీతీరమునఁ దన కా తీరవాయుస్పర్శచేఁ గల్గిన యానందమున నిజముగ సీత యా దిక్కుననే యుండి యుండునని నిశ్చయించును. రాముఁడెంతటి సూక్ష్మగ్రాహి!

'ముక్తాహారా మలయమరుత శ్చందనం చంద్రపాదాః
సీతాత్యాగాత్ప్రభృతి నితరాం తాపమేవావహంతి।
అద్యాకస్మా ద్రమయతి మనో గోమతీతీరవాయు
ర్నూనం తస్యాం దిశి నివసతి ప్రోషితా సా వరాకీ॥'

(అంకము 3. శ్లోకము 6.)

ముత్యాలహారములు, మలయమారుతములు, వెన్నెలలును, సీతను వీడినదాది మిక్కిలి తాపమునే కలిగించుచుండినవట. గోమతీతీరమున నపుడు మాత్రము అకస్మాత్తుగా నా నదీతీరవాయువు మనసున కానందము గలిగించుచున్నదని యా కారణమున నిజప్రేయసి యాప్రాంతముననే యుండి యుండునని నిశ్చయించును. ఇద్దాన రామునిశీలము వ్యక్తమగుచున్నది. అతఁడెంతటి పరకాంతావిముఖుఁడు! గాలితాకుడుచేతనే. అందును బహుకాలానంతరము తాననుభవించు గాలి సీత నాని తనకు సోకుట గుర్తింపఁ గలిగినాఁడు. ఈ సందర్భమున భవభూతికన్న నీ కవి యొక మెట్టెక్కువ యని చెప్పనగును. సీతాకరస్పర్శచేతనే ఉత్తరరామచరితమున సీతాస్పర్శ మని రాముఁడు గుర్తించును. ఇట నావెవైపునుండి వచ్చుగాలితాకుడుచేతనే యావెయునికిని దృఢపరచుచున్నాఁడు. ఈ కవిభావములు భవభూతిభావములకన్న సున్నితములు.

ఈ కవి వాల్మీకిరామాయణమునకు సన్నిహితముగానే కథారచనము నిర్వర్తించినాఁడు. రామాయణమునఁ గూడ రాముఁ డశ్వమేధమును గోమతీ తీరమున నైమిశారణ్యముననే గావింప నాజ్ఞాపించినట్లున్నది.[1]

మరియు గోమతీతీరమున నడచుచు రామలక్ష్మణులు తత్తీరవృక్షములు విరళచ్ఛాయలుగను. తత్తీరలతలు, వృంతమాత్రావశిష్టలుగను, సైకతము అవిరళపదన్యాసలాంఛితముగను గుర్తించి సమీపమున మనుజులు వసించు చుందు రని గమనింపఁ గల్గుదురు.

ఇంతలో నా గోమతి నొక కుందమాల మెల్లగా రామునిపాదముల కుపహారమువలె నీటఁ గొట్టుకొని వచ్చును. దానిఁ గైకొని యాకూర్పునేర్పును సీతాదేవిదిగా రాముఁడు వెంటనే గుర్తించి యది దేవతోపహారము కదా యని దాని ననుభవింపక విడచివేయును. ఇయ్యెడ రాముని యనన్యసామాన్య దైవభక్తి వ్యక్త మగుచున్నది. ఈ కుందమాలా ప్రభావమును గుర్తించి యందెందైన సీత కనుపించునను నాసతో రామలక్ష్మణు లానదీతీరమున నడుగుజాడల గుర్తించి క్రమముగా పోయి వాల్మీక్యాశ్రమసమీపమును జేరుదురు. ఈ కుందమాల యొక యభిజ్ఞానమువంటిది. ఈ కుందమాలకూర్పునేర్పునుబట్టియే సీతాదేవి యిట

1. యజ్ఞవాటశ్చ సుమహాన్ గోమత్యా నైమిశే వనే॥ 15

ఆజ్ఞాప్యతాం మహాబాహో తద్ధిపుణ్య మనుత్తమమ్।
శాంతయశ్చ మహాబాహో ప్రవర్త్యంతాం సమంతతః॥ 16

శతశశ్చాపి ధర్మజ్ఞాః క్రతుముఖ్యమనుత్తమమ్।
అనుభూయ మహాయజ్ఞం నైమిశే రఘునందన॥ 17

తుష్టః పుష్టశ్చ సర్వోసౌ మానితశ్చ యథావిధి।
ప్రీతిం యాస్యతి ధర్మజ్ఞ! శీఘ్రమామంత్రయతాం జనః॥ 18

(ఉత్తరకాండము-సర్గము 91.)

నెందైన నుండఁ గలదను నాసచే రామలక్ష్మణులు క్రమముగా వచ్చి వాల్మీక్యాశ్రమమును గనుంగొని యవల సీతాదేవిని, తనయులఁ బడయుట సంభవించినది. ఈ సన్నివేశమున కంతయు నీ కుందమాలయే ప్రధానకీలకమై యుండుటచే నీ నాటకమున కీ నామము వచ్చినది.

అట వాల్మీక్యాశ్రమసమీపమున లక్ష్మణునకు కాళ్ళు సాగలేదు. కారణము; ఆ ప్రదేశము గురుజనసమాక్రాంతమగుటయే. గురువులన్న నా కాలమున నట్టి భక్తివిశ్వాసము లుండెడివి, పెద్దలు తిరుగాడు స్థలములుకూడ పూజనీయములుగ నుండెడివి. అట్టి స్థలమున స్త్రీ పదాంకములఁ జూచి యెవ్వతెవో యని లక్ష్మణుఁ డనుచుండ. 'వత్స, కిముచ్యతే కస్యాశ్చిదితి। నను వక్తవ్యం సీతాయాః పదాని ఇతి' (వత్స, ఎవ్వతెవో యనెదవేల. సీతయడుగు లనియే చెప్పు మనును.) ఇప్పట్టున గూడ రామునకు సీతాపరిచయ మెట్టిదో, వారి యనురాగ మెంత గాఢమైనదో చూడుడు. సైకతమున నడుగుజాడలఁబట్టియేయవి సీతవి యని దృఢముగఁ జెప్పగల్గుచున్నాఁడు. రాముఁడు నిజముగ సీతనుడివినట్లు సీత రామునిహృదయముననే యున్నది. లేనిచో రాముఁడెట్టు లామె పదాంకముల గుర్తింపఁ గలడు! వారిప్రేమ యత్యద్భుతము. అనన్యలభ్యము. ఆ యడుగుజాడలఁబట్టి రామలక్ష్మణులు వాల్మీక్యాశ్రమప్రాంతమును జేరి యట నొక ప్రచ్ఛాయశీతలప్రదేశమున గూర్చుండి శ్రమ తీర్చుకొనుచుందురు. ఆ సమయమున సీతయు నా చెంగటనే లతాంతరితయై పూలు గోయుచుండును. ఇంతలో రామలక్ష్మణసంభాషణము విని యందు రామునిస్వరము గుర్తించి యాతఁడే యని నిశ్చయించి యట్లు పరాఙ్ముఖుఁ డైనవానిఁ దా నెట్లభిముఖియై చూచుట యని లజ్జించి యూరకుండును. పాపము! ఆమెయనురాగము బలవంతము. ఆమెవశము గాక దృష్టి యాతనిపైననే పడును. అప్పుడామెమనమున వివిధభావములు పొడమును.

ఇక కవి నిజముగ మనస్తత్త్వపరిశీల నాధురీణుఁడై వ్యక్తముగా సూక్ష్మములగు భావములను వెల్లడించెను. సీత మనసులో దూరి చూచెనా యనునంతటి నేర్పుతో వర్ణించి యున్నాఁడు. ఒక వైపు భర్త కనఁబడెనని సంతోషము. చిరప్రవాసమని కోపము, రాముఁడు చిక్కి వెలవెలబారియుంటచే నుద్వేగము. నిరనుక్రోశుఁడని యభిమానము, చిరపరిచితుఁడే యని యనురాగము, ఆదర్శనీయుఁడని యుత్కంఠ, స్వామి యని బహుమానము, కుశలవులతండ్రియని కుటుంబినీసద్భావము. మున్నగు వివిధ భావము లామెయందుఁ బెనగొని యార్యపుత్రుని జూడనిచ్చినవి కావు. ఈ యంకమున సీతారాము లొండొరులు సంభాషించుకొనుచున్నట్లే కథ యుత్తర రామచరితమున ఛాయాంకమువలె నడచినది. ఉత్తరరామాయణమున సీతరాక రాముఁడెరుఁగఁడు. ఇట సీతయు నాప్రాంతమున నుండునను నొక యాశ రామునకుఁ గలదు. ఇందు వాల్మీక్యాశ్రమప్రాంతారణ్యము రామునకు దండకారణ్యమును జ్ఞప్తిపరచినది. రామునిశోకమునకు మేర లేదు. లక్ష్మణుఁడెంత హెచ్చరించినను నాపుకొనలేక యేమనుచున్నాఁడో చూడుఁడు.

'పూర్వం వనప్రవాసః పశ్చాల్లంకా తతః ప్రవాసోఽయం।
ఆసాద్య మామధన్యం దుఃఖాద్దుఃఖం గతా సీతా॥'

(అంకము 3. శ్లోకము 13.)

మందభాగ్యుఁడైన తనను (రాముని) పొందుటచే సీత దుఃఖము వెంట దుఃఖము ననుభవింపవలసెనని యేడ్చుచున్నాఁడు. తొలుతనే కైకవరముమేర కేగిన వనవాసము, ఆవల లంకావాసము, మరల నిపు డీ ప్రవాసము కలిగెనని తనసేతల నెంతయో నిందించుకొనుచు నామెసచ్ఛీలతను గొనియాడును. భర్త యిట్లు చింతించుటకుఁ దగినభార్య యెట్లుండవలయును అనునది పాఠకులే యూహించి కొందురు గాక. ఇప్పటున సీతారాముల

సంభాషణము మిక్కిలి జాలిని గొల్పుచున్నది. భవభూతియు నీ దిఙ్నాగుఁ డును నీ పట్టున సీతారాముల యన్యోన్య ప్రేమాలాపముల వర్ణించుటలోఁ దుల్యు లనియే నుడువవచ్చును. కాని సూక్ష్మముగా పరికించినచో దిఙ్నాగుఁ డును మిన్న యనిపించునట్లుండును. కవి యిటఁ గూడ భవభూతివలెనే రామునిశోకాలాపములలో తానును బాల్గొనుచు మాటకు మాట గలుపుచు ప్రేక్షకులకు సీతారాము లిరువురు సంభాషించుచున్నట్లు సందర్భపరచి వారిభావముల వెలువరించుచున్నాఁడు. రాముఁడు విలపించుచుండ లక్ష్మణుఁడు 'అలం శోకేన' యని యేడ్వ వలదని హెచ్చరించుచుండ రాముఁడు 'కథం న శోచామి శోచనీయాం వైదేహీం' (శోచనీయయగు సీతనుగూర్చి యేడ్వకుండ నెట్లుండఁగలను) అన సీత యామాట నందుకొని యేమనుచున్నది! 'ఆర్యపుత్ర! మైవం భణ-శోచనీయా వైదేహీతి। న ఖలు స జనః శోచనీయః య ఏవం వల్లభేన శోచ్యతే' (ఆర్యపుత్ర! అట్లనవలదు-సీత శోచనీయ యని. వల్లభునిచే నిట్లు విలపింప బడుచున్నవ్యక్తి శోచనీయ గాదు), అని యనుచున్నది. ఈ ఘట్టము వ్రాయుపపుడు కవికి భారతమందలి కపోతోపాఖ్యానము జ్ఞాపకమునకు వచ్చియుండును. రాముఁ డంత లక్ష్మణుని 'సీత ఎచట నున్నదో తెలియనగునా, యని యడిగి, తెలియ లే' దని యాతఁడు తెల్ప చిరకీలావిచ్ఛిన్నమగు రఘుకులము నశించినదని తెలియ లే' దని యాతఁడు తెల్ప చిరకాలావిచ్ఛిన్నమగు రఘుకులము నశించినదని మిక్కిలి యేడ్చును. అత్తరి సీత సమీపించి కన్నీరు తుడువ నెంచును గాని మర్యాదగా తన స్థితిని దలఁచి రామునియవస్థకు జాలిఁజెంది యాశ్రమమునకు పోవును. ఈ కవి యెంతయుచితజ్ఞుఁడు!

మహానుభావలక్షణములఁ జెప్పకయే సీతారాముల నడవళ్ళ మూలమునఁ దెలుపుచున్నాఁడు. భవభూతి నాటకమున సీత రాముఁడున్న

దండకాటవికిఁ గొంపోఁబడినది. రాముఁడును శంబూకవధమును నిమిత్తముగాఁ జేసికొని యట కేగవలసివచ్చె. యథార్థముగా పూర్వానుభూతమగు దండకను జూచినఁ గాని రామునకు సీతపై యంతటిశోకము కలుగలేదు. ఈ దిఙ్నాగునిరచనలో సీతారాములభావము లట్లే రసభరితములుగ వర్ణింపబడినను దండకావనప్రసక్తియే లేదు. రాముఁ డే. కుందమాల నాధారముగాఁ గొని సీత నన్వేషించుచు యామెకై జాలినొంది తనసేతల నిందించికొనుచు నామెపైఁ దనకుఁగల గాఢానురాగమును వెల్లడించును. సీతపూమాలకట్టునేర్పు, ఆమెయడుగుజాడలు, వీనిని గుర్తించి యామె యాప్రాంతముననే యుండి యుండు ననును. ఇంత యేల; ఆ గోమతీవాయుస్పర్శచేతనే రాముఁడు సీతయున్కిని నిశ్చయింపఁ గల్గినాఁడు. ఈ వృత్తాంతచిత్రణమున భవభూతికన్నను నీ దిఙ్నాగుఁడే మిన్న యని చెప్పనగును. భవభూతిరచనయందు రాముఁడేడ్చినంతకాల మిందేడ్వకున్నను దిఙ్నాగునిరచనలో రామునిశోక మెక్కుడనియే చెప్పనగును.

ఇట్టి శోకమయఘట్టమున సీతారాముల విడువనొల్లక వారిభావముల మార్చుటకై యిందు నాటకోచితముగ రామునకు వాల్మీకిసందేశమును దెల్పవాల్మీకిశిష్యుఁ డొక ఋషి బాదరాయణుఁ డనుముని రాముని వెదకుచు వచ్చి, యా లతాగుల్మప్రదేశమున నతిక్రాంత మానుషప్రభావమునను, ఆకారమునను రాముని గుర్తించి వాల్మీకి రామాగమనమును నిరీక్షించుచున్నట్లు తెల్పును. ఇంతలో మధ్యాహ్న మగును.

ఈ యంకమందలివిషయ మంతయుఁ గవికల్పితము, సీతారాముల దివ్య ప్రేమను వెల్లడిచేయుటకై యిట్టి సన్నివేశమును గల్పించి వారిభావముల వ్యక్తపరచెను. ఈ సందర్భముల నీ కవు లిరువురును భవభూతిదిఙ్నాగు

లెవ రెవరి ననుకరించి రని నిర్ణయించుట శక్యము గా కున్నది. ఒకవిధముగ నాలోచించి చూడ విపులీకరమణము తర్వాతివారిదే యగును కాన భవభూతికన్న నీ దిఙ్నాగుఁడు పూర్వుఁడే యని తోఁచుచున్నది. ఈ నాటకము ఇంతకాలము బయటికి రాకపోవుటచేతఁ గాబోలు ఉత్తరరామచరితము ప్రఖ్యాత మైనదని నే ననుకొందును. కాని యుత్తరరామచరిత్రమందలి రసానుభూతి వేరు. అట్టి యనుభూతి దానికన్న దీనియందు తక్కువయే యనుట నిర్వివాదాంశము.

నాల్గవయంకారంభమునఁ బ్రవేశకమున వేదవతి, యజ్ఞవేది యను నిర్వురు తాపసులు ప్రవేశించి తిలోత్తమ రామునియనురాగమును బరీక్షింప నట కేతెంచినట్లును, వాల్మీకి ఆశ్రమదీర్ఘికాతీరమున స్త్రీ జనము అదృశ్యలై యుందురని వర వొనఁగె ననియుఁ దెల్పుదురు. ఈ యంకమునందలివిషయము కూడ కవికల్పితమే. కవి నాటకోచితముగ నిట్టి సన్నివేశమును గల్పించినాఁడు. ఈ కవి సీతారాముల యనురాగమును వివిధగతుల నుడువుచున్నాఁడు. పూర్వాంకమున రాముఁడు కుందమాలారచన, పదాంకములను, గుర్తించి సీతవి యని స్మరించికొని యేడ్చెను. ఇట నీయంకమున సీత యొకప్రావరణమును గప్పుకొని యది పూర్వము చిత్రకూటమున మాయావతి యను వనదేవత స్మరణ నిమిత్త మొసఁగిన దనియు, నది యార్యపుత్రునిహస్తమునఁ జిరము మెలఁగినదని చిరదుఃఖసహాయమని దానిని ధరించి పూర్వవిషయములఁ దలఁచికొని యేడ్చును. ఈ ప్రావరణము వీ రొండొరులయెరుక కెంతయుఁ దోడ్పడును. అభిజ్ఞానశాకుంతలమున నుంగరమువలె నిది యీ నాటకమున నొక యభిజ్ఞానముగ వెలయుచున్నది. అవల సీత యా దీర్ఘికాతీరమున నొక రాజహంస మిథునమును సమాగమసుఖ మనుభవింపుచున్నదానిని జూచి మిగులఁ బొగులుచు వాని యన్యోన్యహృదయగ్రహణసమర్థ లలిత

మధురచాటూక్తి ప్రయోగమును వెచ్చుకొనును. కవి యీ హంసమిథునమును రాబోవు సీతారామసమాగమ సూచకముగా నిట నాటకోచితముగ సరసముగ వర్ణించినాఁడు. ఈ నాటకమున సీతారాముల భావములు పర్యాయముగా వర్ణింపఁబడినవి.

కణ్వుఁడు రామునకు నైమిశారణ్యరామణీయకమునుజూప నేతెంచినపుడు రాముఁడు చింతాపరాధీనుఁడై యుండును. కణ్వుఁడు రాముని 'భో రాజన్' అని సంబోధింప రాముఁడు ధీరోదాత్తముగా నిజవినయమును 'యూయమార్యావయం చాద్య రాజానో వయసా కృతాః' (వయసుచేత మీరార్యులును మేము రాజులు నైతిమి) యని వెల్లడించును. నైమిశారణ్యమాహాత్మ్యమును దెల్పుచుండ రాముఁడు సమయజ్ఞుఁడై మునివృత్తిని గొనియాడును. కణ్వుఁడును రాముని గొనియాడుచు నైమిశమునుగూర్చి.

'ఆనాకమేకధనుషా భువనం విజిత్య
పుణ్యైర్దివః క్రతుశతై ర్విరచయ్య మార్గమ్।
ఇక్ష్వాకవః సుతనివేశితరాజ్యభారా
నిశ్శ్రేయసాయ వనమేతదుపాశ్రయంతే॥'

(అంకము 4. శ్లోకము 5.)

అని నుడువును. ఇందలిభావము కాళిదాస రఘువంశమున ప్రథమసర్గమున 5, 6, 7 శ్లోకముల భావముతో సంవదించునట్లున్నది. (ఆనాకరథవర్త్మనాం, యథావిధిహుతాగ్నీనాం, వార్థకేమునివృత్తీనాం.) ఆకారగోపనమున నిజవైక్లబ్యము తెలియనీక ధూమావరుద్ధనేత్రుఁడైనట్లు నుడివి కన్నులు కడిగికొన దీర్ఘికాతీరమును జేరును. అట దీర్ఘికాజలమున సీతా ప్రతిబింబమును జూచి సంభ్రాంతుఁడగును. ఉత్తరరామచరితమందలి

ఛాయాంకమువలె నీ నాటకమున సీతారాములు కలియుదురు, వాల్మీకిప్రసాదమున స్త్రీ జనము పురుషగోచరము కాకుండ నుందురు గదా. ఇట సీత దీర్ఘికాతీరమునఁ గూర్చుండి యుండును. రాముఁ డకస్మాత్తుగా నటకు వచ్చి నీట సీతాప్రతిబింబమును జూచి సీతదియే యని నిశ్చయించి యట సీత యుండవలయునని నిశ్చయించును. సీతమాత్రము మునిప్రసాదమువలన ప్రతిబింబముగూడ కనబడకుండిన బాగుండెడి దనుకొనును. తన యునికి రామునిచే ననుమానింపఁబడెనని లజ్జించి ప్రతిబింబముకూడ కానరాకుండునట్లు తొలఁగిపోవును. రాముఁడు ప్రతిబింబముసైతము కానరామి సైపలేక మూర్ఛిలి యవల మేల్కొనును. అకారణముగ రోమాంచితుఁడగును. సీతాసాన్నిధ్యము రామున కట్టి వికారములఁ గల్గించును. వారిప్రేమ యట్టిది. లోకోత్తరప్రేమ లక్షణము లట్టివే యగును. సీతారాము లిరువురును సంభాషించునట్లు ఛాయాంకము వలెనే యిటను కథ వర్ణింపఁబడినది. మాటకు మాట అందుకొని సంభాషించుచున్నట్లు మాటాడుదురు. ఇట్టి సన్నివేశము నాటకీయముగ నెంతో మనోరంజకముగఁ గూర్పఁబడినది. దిఙ్నాగుఁడు ప్రకృత్యుపాసి. సీతారాములవాంఛలు కేవల సామాన్యములు. రాముఁడు వియోగమున నెట్టిభోగము కోరుచున్నాఁడో చూడుఁడు.

'కదా బాహూపధానేన పటాంతశయనే పునః।
గమయేయం త్వయా సార్ధం పూర్ణచంద్రాం విభావరీమ్॥'

(అంకము 4. శ్లోకము 17.)

చేయి దిండు గాగ, చీరచెరగు పడక గాగ పున్నమరేయిని సీతతో నెపుడు గడుపుదునా యని కోరుకొనును. రాముఁడు విరహము భరింపలేక మరల మూర్ఛిలును. సీత పటాంతమున వీచును. రాముఁడు వెంటనే మేల్కొని యాపటాంతమును గ్రహించును. సీతయు నా పటమును వదల

రాముఁడు గ్రహించి యది చిత్రకూటవనదేవతయగు మాయావతి యొసగినదని గుర్తింపఁగల్గును. ఆ యుత్తరీయమును గప్పుకొని తనది విసరివేయును. సీత రామునియుత్తరీయము గ్రహించి తాఁ గప్పికొని రోమాంచిత యగును. ఇట్లుత్తరీయము గోచరింపకుండుట నీటఁ ప్రతిబింబము బింబములేకయే గోచరించుట మున్నగునవి ముని ప్రభావ మనును. ఇటనే నిజమనోరథము సఫలము కాగలదని కొంత యూరటఁ జెందును. ఇంతలోఁ గౌశికుఁడను రామవయస్యుఁడు రాగా సీతయు నటనుండి తొలఁగి పోవును.

ఈ ఘట్టమున సీత, రాముని స్పృశింప లేదు. ఆమె పటాంతవాయువే రాముని ప్రబుద్ధుని గావించినది. ఎంత భావసౌకుమార్యము! నిజముగ నీ కవి భవభూతిని మించినవాఁడే. సీతారాముల నీ విధముగ పరస్పరము సన్నిహితులఁ జేసి వారి మనోభావముల సంభాషణశైలిని వెలువరించియు నిందు సీతారాములట్లేకాంతమునఁ గలసి భాషించినట్లు నాటకరంగమునఁ బ్రేక్షకులకును, పాఠకులకును గూడ గోచరించుటచే నట్టిది యా యవస్థయందు వారికి తగదని కాబోలు, నీ కవి చమత్కారముగా తిలోత్తమావిషయమును బ్రవేశపెట్టి రసవంతముగాఁ గప్పిపుచ్చుచున్నాఁడు కథానాయకుఁడగు రామునకును సీత యట్టి యవస్థలో తనకు గోచరించుట తగదని కాబోలు నామెశీలపోషణమునకై తిలోత్తమ యను నచ్చరయే నామెరూపముఁ దాల్చి రామునిమనముఁ బరీక్షింపఁ గోరి యటకు వచ్చియున్నట్లు నుడివినాఁడు. ఈ కల్పన మెంతయు రమణీయమై నాటకోచితమై కవిప్రతిభను జాటుచున్నది. ఈ తిలోత్తమావిషయము రామునితోఁ గౌశికుఁడు (విదూషకుడు) నుడువునపుడు వృత్తాంతము పూర్తిగ నుడువక తొలుత 'తత్రభవతీ' యని నిలిపినంత శ్రీరాముఁడు చెవులు మూసికొని యా రహస్యము స్త్రీ సంబద్ధమని యనంతరవిషయము విన

నొల్లఁడు. పరకాంతావిముఖత్వ గుణము రాము నెంతశీలవంతునిఁ జేయుచున్నది! ఆవల విదూషకుఁడు దేవగణిక యనినంత దోషముండదని యామె యూర్వశియా తిలోత్తమయా యని యడుగును. ఈ కవి రామునిశీల మెంత చక్కగా బోషించును! విదూషకుఁడు తిలోత్తమయో శిలోత్తమయో యని నుడువఁ దాను ఆపెచే నిజముగ వంచింపఁ బడినట్లు భావించి తా దీర్ఘికాజలమునఁ గనినప్రతిబింబము సీతావేషధారిణియగు నా తిలోత్తమదని యెంచి, దేవతలు కామరూపులుగా నట్లు తిలోత్తమ చేసి యుండునని విశ్వసించును. ఇట సీతశీలము నీ తిలోత్తమావృతాంతముచే గొప్పగా వర్ణింపఁబడినది. సీత కేలాటి దోషమును సోకనట్లు గావింపఁబడినది.

ఈ యంకమున విదూషకకల్పనముకూడ నొక నూతనాంశము. కరుణ రసప్రధానమగు నాటకములలో హాస్యమునకుఁ దావు చాలస్వల్పము, లేదనియే చెప్పనగును. ఇట నీతనిఁ గల్పించి రాముఁడు సీతను నిజముగ నట నున్న దానిగా భావించి శోకవిక్లబుఁడగు నవస్థయందుండగా, నీ విదూషకుఁడు రామునకుఁ దా (రాముడు) గన్నది నిజమగు సీత గాక స్వర్వేశ్యయగు తిలోత్తమయని నుడివి యా శోకభారమును కొంత తొలఁ గించును. విదూషకుఁడనినందుకు దగినట్టు లితఁడును సందర్భోచితముగ రామునితో సంభాషించునపుడు 'రామ ప్రియవయస్య; రామేతి క్షణే క్షణే అళీకకమధురై ర్వచనై రాకులయసి' యని హాస్యముగా గూడ రామేతియనుతావున రామా (సుందరీ లేక ప్రేయసీ) యని శ్లేషార్థమువచ్చు మాటలతో రామున కూరట గల్పించుచు నిజకృత్యమును జక్కగా నెరవేర్చును. మరియు రాముఁడు 'కిం తిలోత్తమా;' యని యడిగినపుడును హాస్యముట్టిపడునట్లు 'తిలోత్తమో, శిలోత్తమో నాకుఁ దెలియ' దనును. అభిజ్ఞానశాకుంతలమున నంగుళీయకదర్శనానంతరము ఖిన్నుఁడగు దుష్యంతుని మరల్ప విదూషకవృత్తాంతమును కాళిదాసు కల్పించినట్లు,

ఇందును సీతావిషయకమోహమున శోకావిష్టుఁడగు రామునిభావము మరల్చుటకై దిఙ్నాగుఁడిట్టి ఘట్టమును గల్పించి కవి కోటికీర్తిని గైకొనఁ గల్గెను.

అంకాంతమునఁ గాలసూచకమగు శ్లోకమున సూర్యాస్తమయమును సాభిప్రాయముగ రాముఁడు నుడువుచున్నాఁడు.

'ప్రియజనరహితానామంగుళీభిర్వధూనా
మవధిదివససంఖ్యావ్యాపృతాభిస్సహైవ।
వ్రజతి కిరణమాలిన్యస్తమేకైకశోఽస్మిన్
సరసకమలపత్రశ్రేణయః సంకుచంతి॥'

(అంకము 4. శ్లోకము 24.)

ప్రోషితభర్తృకలు ప్రియాగమనమునకు దినములను వ్రేళ్ళముడుచుచు నొకటి, రెండు అని లెక్కించునట్లు కమలముల రేకులు వరుసగా నొక్కొక్కటిగా ముడుచుకొనుచున్నవని చమత్కారముగా నుడువును. ఈ శ్లోకముచే సీతారామ సమాగమముకూడ త్వరలో లెక్కింపదగినన్ని దినములలోనే కలుగఁ గలదని కూడ ధ్వనిత మగుచున్నది.

పంచమాంకమున మరల రామవిదూషకులు ప్రవేశింతురు. ఈ యంక విషయముకూడ నూతనకల్పనమే. ఇందు కుశలవసమాగమము రామునకు సంఘటిల్లును. విదూషకకార్య మీయంకమునఁ జాల ముఖ్యమైనది. ఈ వాల్మీక్యాశ్రమప్రాంతముననే రామునియాస్థానము జరుగును. సీతాచ్ఛాయను జూచినదాది విచారగ్రస్తుఁడై రాముఁడుండును. విదూషకునితోడను నా సంగతినే నుడువును. తిలోత్తమావిషయమునుగూడ శంకించును. సింహాసనమునఁ గూర్చుండికూడ నా చింతతోడనే యుండును. అత్తరి విదూషకుఁడు రామునిచిత్తమును మరల్ప హాస్యయుక్తముగా, 'బాహు

యుగళేన పృథివీం హృదయేన పృథివీదుహితర ముద్వహన్నతీవగురుతరః సంవృత్త ఇతి' అనును, (బాహుయుగళమునఁ బుడమిని హృదయమున సీతను వహించుటచే మిగుల భారముగలవాఁడ వైతివి). రాముఁడు విదూషకుఁడును సీతావిషయము ముచ్చటింతురు. సీతారాములప్రేమ కారణానురోధి కాదని రాముఁడే నుడువును. వారి దాంపత్యమే భిన్నము. లోకాతీతము. రాముఁడు తాను కర్కశుఁడని తన యనురాగభావములు సూక్ష్మములై పద్మనాళమందలితంతువులవలె తనహృదయమున లీనమై యున్నవని తెల్పును.

ఈ కుందమాలలోని విదూషకుఁడు చాల తెలివిగలవాఁడు. అతనికిని రామునకునకు వయస్యభావ మున్నను తనకును రామునకును గల యంతరము నెరిఁగి మెలఁగును. రాముఁడు సీతావియోగముచే శుష్కించుటను బడబానలమున గంభీరుఁడగు సాగరము శోషించుటను బోలియున్నదనియుఁ దాను దేవీగతిని స్మరించికొని దావానలమునఁ దుషారబిందువువలె నిరవశేషముగ శుష్కించినట్లును నుడువును. మహారాజగు రాముని గాంభీర్యద్యోతకముగ సముద్రునికిఁ బోల్చును. తన్నల్పునిగా తుషారకణమునకుఁ బోల్చికొనును. ఈ యుపమానమున దిఙ్నాగునియౌచిత్యపోషణ మెంతయు నందగించుచున్నది.

రాముఁడు విదూషకునితో సీతాపరిత్యాగసమయమున నెందులకు తనను (రాముని) ప్రతిషేధింపలేదని యడుగ నాతఁడు 'ప్రసాదసు ముఖోఽపి రాజా దుర్విజ్ఞాప్యః సేవకైః; కిం పునః కోపభీషణః' (ప్రసాదసుముఖుఁడుగా నున్నపుడే రాజు సేవకులచే విన్నవింపఁదగఁడు. ఇక కోపభీషణుఁడుగా నున్నతరి సెప్పవలయునా?) అని నుడువును. అత్తరి రాముఁ డెంతవినయముగాఁ జెప్పుచున్నాఁడో చూడుఁడు. 'వయస్య! న

హి మాదృశాస్తాదృశీం కోపావస్థాం అవగాహంతే, యస్యాం వర్తమానాయాం సుహృదామనాశ్రవాభవంతి'c మిత్రమా, మాబోంట్లట్టి కోపావస్థను జొరరు. అట్టిది యున్నను సుహృదుల పల్కులc బెడచెవిని బెట్టరు.) అనుచున్నాడు. మరియు రాజు గుణవంతులగు మంత్రులచే వారింపc దగినవాcడనియు నుడివి నిజసచ్ఛీలమును జాటుచున్నాcడు.

అంత తాపసులు దర్శనార్థము వచ్చు సమయము కాగా వారికై సిద్ధముగా నుండcగోరును. తపోధనులన్న రామున కతిగౌరవము. వారు జ్ఞాననిధులని భావించును. ఇంతలో విదూషకుcడు ద్వారముకడ సుందరాకారులc గుశలవులc గని వారు వాల్మీకినిదేశమున నొక మహాపురుషచరిత్రను గానము సేయ వచ్చినట్లు రామునికి నుడువును. ఇప్పట్టునc గవి గేయము రామాయణవిషయమని నుడువ లేదు. ఇట్లు నుడువకుండుటయే నాటకోచితము. అప్పుడే శ్రోతలకుc బ్రేక్షకులకు నది యేదియా? యని కౌతూహలము పొడమును. మరియు విదూషకసంభాషణమున నా మునిబాలకుల దాశరథశైశవానుకారిణులనుగా నెరింగి రాముcడు మిగులc గుతుకముc జెందును. రాజదర్శనార్థ మరుగు కుశలవులు రాజుకడ నెట్లు ప్రవర్తింపవలయునను విషయమును ముచ్చటించుకొందురు. ఆ ఘట్టమున సీతయొక్కవాత్సల్యము, బాలకుల రాచఠీవి వ్యక్తమగుచున్నవి. రామునకు నమస్కరించుటకుc గూడ వారు సందేహింతురు. కాని తల్లియాజ్ఞచే వారు నమస్కరింతురు. ఈ సందర్భమున లవుcడు 'ప్రణామమపి సైవోప దేష్టవతీ, న చ గురునియోగా విచార మర్హంతి' అని యుదాత్తముగా నుడివి గురుభక్తిని వెల్లడించును. రఘుకుల ప్రసూతులవిషయమునc గాళిదాసుకూడ రఘువంశమున నీ యర్థము వచ్చునట్లే 'ఆజ్ఞా గురూణాం హ్యవిచారణీయా' యని నుడివియున్నాcడు.

కుశలవులు రాముసన్నిధికి రాగా వారిని గాంచి రాముcడు సాధ్వసప్రహర్షశోకానుక్రోశసమ్మోదచిత్రమగు నవస్థను జెంది యేలొకో చంద్రునిగన్న చంద్రకాంతముపగిది కన్నుల నీరుగార్చుచు వారి మనోహరాకృతులc దిలకించి వారిని కులీనులుగా భావించును. భవభూతికూడ నిట్టి సంబంధవర్ణనములందు 'వ్యతిషజతి పదార్థా ఆంతరః కోఽపి హేతుః' ఇత్యాదిశ్లోకముల విశేషముగ రచించి యున్నాcడు. దిఙ్నాగుcడు భావపూర్ణములగు రచనల క్లుప్తముగా వ్రాయును. భావము మిక్కుటమయినపుడు మాటలు తక్కువ యగును గదా. దిఙ్నాగుని పట్ల నీ న్యాయ మెంతయు నొప్పియున్నది.

కుశలవులను రాముcడు బ్రాహ్మణులనియే భావించును. వారు రామునిc జూచినంత మ్రొక్కుదురు. రాముcడు బ్రాహ్మణనమస్కార మొల్లక వారి ప్రణతుల వారిగురువులకే చరణోపహారమగుగాక యనును. ఎంత యుదారము; ఎంత బ్రాహ్మణభక్తి. దిఙ్నాగుని రాముcడు సకలసద్గుణరాశి. ఉచితజ్ఞుcడు– కుశలవులc గని వారిని పరిష్వజించి హృదయగ్రాహమగు స్పర్శము ననుభవించి పుత్రాలింగనతుల్యసుఖము ననుభవించితి ననుకొనును. కవి యెంత చమత్కారముగా యథార్థమును తెలుపక యూహ్యముగనే నిర్వహించుచున్నాcడో! రాముcడంతc దనియక నిజాంకమునc గూర్చుండc బెట్టుకొని సీతాతనయులేయై యుందురేమో యని కూడ తలంచును. ఇంతలో విదూషకుcడు సంభ్రమముతో 'ముంచ, సర్పః, ముంచ, జీవతు తపస్వితనయః అవతరతు సింహాసనతః' యనినంత రాముcడు కుమారుల డించును. కవి యిట చమత్కారముగా కుశలవు లైక్ష్వాకులని వ్యంగ్యముగాc తెల్పుట కిట్టిది పన్నినాcడు. ఇక్ష్వాకుల సింహాసనమును రఘుకులుcడు కానివాc డెవ్వcడేని యధిరోహించినచో వానిశిరము శతధా భిన్నమగునట. ఇట కుశలవులు సింహాసమున

రామునంకమున నుండియు నేలాటి వికారమును లేక స్వస్థులుగానే యుండిరి. శాకుంతలనాటకమున దుష్యంతుఁడు నిజపుత్రుని మారీచాశ్రమమునఁ గనుగొనునపుడు ఆ బాలకుని కంకణములు దుష్యంతుఁడు వానిని స్పృశించినపుడు వికారముఁ జెందకుండ నా బాలకునకును దుష్యంతునకును పితృపుత్రసంబంధనిర్ణాయకము లయినట్లు దీనియందు నీ సింహాసనారోహణము కవిచేఁ గల్పింపబడి పితృపుత్ర సంబంధనిర్ణాయక మగుచున్నది. రాముఁడు తపస్సంపన్నుల శరీరములు స్వస్త్వయనపరిగృహీతములనును. ఈ కవి సమయము దొరకినపు డెల్ల తాపసులప్రభావము నుడువక మానఁడు. కుశలవు లేవికారమును జెందకుండుటఁ గని రాముఁడు.

'అపి నామ శరా మోఘాస్తపస్సన్నద్ధమూర్తిషు।
వాసవస్యాపి సువ్యక్తం కుంఠాః కులిశకోటయః॥

(అంకము 5. శ్లోకము 14.)

దేవేంద్రుని వజ్రాయుధధారలును తపస్సంపన్నులయెడ వ్యర్థములగు ననుచున్నాఁడు.

అవలఁ గుశలవులతోడ రామునిసంభాషణము మిగుల రమణీయము, మనోహరము, ఉదాత్తశీలబోధకమునై యలరారుచున్నది. ఈ సంభాషణమునఁ గుశలవులవృత్తాంతము తెలిసికొని రామునికుటుంబ వృత్తాంతముతో సరిపోవుచున్నదని తెలిసి వారిని సీతాగర్భజనితులనుగా నెంచును. మరలఁ దాపసులను నిజకుమారులనుగా నూహించుట దోషమని తన్ను నిందించుకొనును. అడుగడుగునకును రామునిశీల ముత్తమోత్తముగా వర్ణింపఁబడుచున్నది. కవి యింకను రాముని ననుమానావస్థలోనే యుంచి నాఁడు. ఒకవైపు నిజతనయులేయై యుందురను తలంపు. కారేమో యని

మరొకవైపు అనుమానము బాధింప, రాముఁడు చింతాశోకమగ్నుఁడై యుండును. ఇంతలో వాల్మీకిదూత వచ్చి కుశలవులను హెచ్చరింప రాముఁ డును మునివియోగము చెల్లింపఁ గుశలవులను గానము సల్ప ననుజ్ఞ యొసఁగి సభాసదుల సమావేశపరుపఁ గోరును. అప్పటికి మధ్యాహ్న మగును. 'కాలశ్చ మధ్యసవనస్య న లంఘనీయః' అని యందరు నిష్క్రమింతురు.

షష్ఠాంకమున సిద్ధముగనున్న యాస్థానమండపమునకుఁ గుశలవాను గమ్యమానులై రామలక్ష్మణులు వత్తురు. పౌరజానపదవాసులందరు వచ్చియుందురు. రామామాతలును, దశరథునికోదండ్లును వచ్చియుందురు (సీత తప్ప). కుశలవులు గానమునారంభించి లక్ష్మణుడు సీతను నిర్జనారణ్యమున నొంటిగ విడచువరకును గల రామాయణకథను మనోహరముగాఁ బాడుదురు. రామలక్ష్మణులు వికృతిని జెంది కష్టపడుట గాంచి లవుఁడు లక్ష్మణునితో 'రామాయణకథానాయకులగు రామలక్ష్మణులు మీరేనా' యని యడుగును. రాజును నేరుగా ప్రశ్నింపఁ గూడదని లవుఁడు లక్ష్మణునే యడుగుట గురుకుల శిక్షితుఁడగు లవునిశీలమున కెంతయు మెరుగిడుచున్నది. కుశలవులు రామలక్ష్మణుల నెరుంగుదురు కాని. పితృభావమునఁ గాదు. సీతాకథచే మిగులఁ బొగులుచుండుట గమనింతురు. అవ్వలికథ కణ్వుఁడు నుడువును. దిఙ్నాగుఁడు కుశలవులు సీతాతనయులని క్రమక్రమముగానే తెలియఁ జేయును. కణ్వుఁడు పఠించు శ్లోకమున 'సీతాపి జనయామాస సా యమౌ తనయా వుభౌ' యని నుడువ కుశలవులును సంతసించి 'జయతు మహారాజః పుత్రజన్మనా అని మహారాజపుత్రజన్మమునకు హర్షింతురు. అవ్వలిశ్లోకమున 'స చకార తయోర్నామ మునిః కుశలవావితి' అని నుడువ నింతదనుక రహస్యముగ నున్న విషయము వ్యక్తమై పితృపుత్రులు

పరస్పరాలింగనాదుల మోహపరవశులై మూర్ఛిల్లుదురు. అవల వాల్మీకి రామలక్ష్మణులను సీత కుశలవులను మేల్కొల్పుదురు. సీత రాము నంటదు. ఉత్తరామచరితమున సీతాకరస్పర్శమునఁ గాని రెండుపర్యాయములును రాముఁడు ప్రబుద్ధుఁడు కాఁడు. ఇందు సీత బెట్టుగా నౌదాసీన్య మూని కుశలవులు రాముని జూచుచుండ సీత 'క ఏషః, యోయువాభ్యామేవం ప్రేక్షితః?' యనును. వాల్మీకి రాముని సీతాపరిత్యాగవిషయమున దూరును. సీతను దోడ్కొని పో సిద్ధపడును. పృథ్వీ ప్రత్యక్షమై సీతాపాతి వ్రత్యము నిరూపించును. అందరు ఆశ్చర్యపడుదురు. వాల్మీకియాజ్ఞమేరకు రాముఁడు సీతను పరిగ్రహించును. పితృపుత్రులకలయిక యిందు కవి చాల రమణీయముగా నాటకోచితముగ నిర్వహించినాఁడు. కాళిదాసు శాకుంతలనాటకమున తుదియంకమున దుష్యంతునకు భార్యాపుత్ర సమాగమముఁ గూర్చి నట్లిందును రామునకు భార్యాపుత్ర సమాగమమును ఈ కవి గూర్చినాఁడు. ఉత్తరరామాయణము నందలి యంతర్నాటికా వృత్తాంతముకన్న నీ కల్పనము మనోరంజకమై యద్భుతముగా వెలయుచున్నది.

దిఙ్నాగుఁడు కుశలవులకుఁ గూడ తమతల్లిపేరు సీత యని తెలియనట్లు చిత్రించినాఁడు. సీత యను నక్షరములు గీతనిబంధనములని వారు తలంచునట్లు చేసెను. వస్తువిస్తరణమున నిట్లన్యోన్యము సీతారామకుశలవులవృత్తాంతము కొంత కొంత మరుగుపరుచుచు తుదకు రహస్యభేదము గావించి సమాగమముఁ గూర్చి రసవంతముగా నిర్వహించెను.

ఈ నాటకమున వాల్మీకి రామునితో సీతను ప్రతిగ్రహింపఁ గోరుసందర్భమున సీతను శుద్ధివిషయమున సాక్ష్యము చెప్పఁ గోరి

'తత్పరిశోధ్యతామాత్మా' యని తానే (వాల్మీకి) నుడువును. రామాయణమున రాముఁడే సీతాపారిశుద్ధ్య విషయమున సీతనే శపథము సేయఁ గోరినట్లున్నది.[1] వాల్మీకి సీతాసహాయముగ వచ్చి సభామధ్యమున నిల్చి సీతయేపరిశుద్ధివిషయమున రామునానతిమేరకు ప్రత్యయ మొసగుచున్నదని తానును నమ్మకము గుదుర సీత పరిశుద్ధురాలని నుడువును.[1] అవల సీత భూదేవినిఁ బ్రార్థింప నామె సింహాసనముతో వచ్చి సీతను గూర్చుండఁ బెట్టుకొని పాతాళమునకుఁ గొనిపోవును. అందరు నాశ్చర్యమగ్ను లగుదురు. ఇట్లు రామాయణకథ సీత పాతాళమును బ్రవేశించుటతో ఖేదాంతముగా

---

1. యది శుద్ధసమాచారా యది వా వీతకల్మషా।
కరోత్విహాత్మనః శుద్ధిమనుమాన్య మహామునిమ్॥ 4

ఛందం మునేశ్చ విజ్ఞాయ సీతాయాశ్చ మనోగతమ్।
ప్రత్యయం దాతుకామాయస్తతః శంసత మే లఘు॥ 5

శ్వఃప్రభా తే తు శపథం మైథిలీ జనకాత్మజా।
కరోతు పరిషన్మధ్యే శోధనార్థం మమైవ చ॥ 6

శ్రుత్వాతు రాఘవస్యైతద్వచః పరమమద్భుతమ్।
దూతాః సంప్రయయుర్వాటం యత్రాస్తే మునిపుంగవః॥ 7

(ఉ.రా.సర్గము 95. శ్లోకము 7.)

1. తతోమధ్యే జనౌఘస్య ప్రవిశ్య మునిపుంగవః।
సీతాసహాయో వాల్మీకిరితిహోవాచ రాఘవమ్॥ 15

ఇయం దాశరథే సీతా సువ్రతా ధర్మచారిణీ।
అపవాదాత్ పరిత్యక్తా మమాశ్రమసమీపతః॥ 16

లోకాపవాదభీతస్య తవ రామ మహావ్రత।
ప్రత్యయం దాస్యతే సీతా తదనుజ్ఞాతు మర్హసి॥ 17

ఇమౌ తు జానకీపుత్రావుభే చ యమజాతకౌ।
సుతౌ తవైవ దుర్ధర్షౌ సత్యమేద్బ్రవీమి తే॥ 18

నుడువఁబడినది. నాటకీయముగ మోదాంతముగనే యుండవలసి యుండుటచే దిఙ్నాగుఁ డిట రామాయణవిషయమునే భంగ్యంతరమున నలఁతి మార్పుచేఁ బృథ్వీదేవి ప్రత్యక్షమగుట, సమస్తలోకపాలాదులు సమావేశమై యుండుట మున్నగు నంశములఁ గూర్చి సీతారామ సమాగమముతో మోదాంతముగా మార్చెను.

కవికాలమునాటికి దేవతలే ప్రత్యక్షప్రమాణ మొసగుదురని ప్రజలు నమ్ముచుండునాచార ముండియుండవచ్చును. కావుననే అట్లు పృథ్వీదేవిని ప్రత్యక్షము గావించి కొన్నియపూర్వలక్షణములఁ గలుగఁజేసి లోకుల నమ్మింపఁజేసెను. వాల్మీకిగూడ మరల రాముని సీతను గ్రహింపగోరును. గుర్వాజ్ఞ రాఘవులకు శిరోధార్య మగుట సీతను కేల గ్రహించి ప్రతిగ్రహించును. పృథ్వీదేవియు నంతర్ధాన మగును. ఇట్లు లోకోచితముగ నాటకమున మూలకథను వలసినంత మాత్రము మార్చి చమత్కారముగ సీతారాములఁ గలియఁ జేసెను.

ప్రచేతసోహం దశమః పుత్రో రాఘవనందన।
స స్మరామ్యనృతం వాక్యమిమౌ తు తవ పుత్రకౌ॥ 19

బహువర్ష సహస్రాణి తపశ్చర్యా మయా కృతా।
నోపాశ్నీయాం ఫలం తస్యా దుష్టేయం యది మైథిలీ॥ 20

మనసా కర్మణా వాచా భూతపూర్వం న కిల్బిషమ్।
తస్యాహం పలమశ్నామి అపాపా యది మైథిలీ॥ 21

అహం పంచసు భూతేషు మనష్షష్ఠేషు రాఘవ।
qz O` ¢¼ ÕŒ¤%Ñ ÍÕe[ãQê ì=# x¥ÕÕ॥ 22

ఇయం శుద్ధసమాచారా అపాపా పతిదేవతా।
లోకాపవాదభీతస్య ప్రత్యయం తవ దాస్యతి॥ 23

(ఉ.రా. సర్గము 96.)

అవల రాముఁడు లక్ష్మణునకు పట్టాభిషేకము సేయగోరును. లక్ష్మణుఁడు కుశునకు గావింపుమని ప్రార్థింప రాముఁడు లక్ష్మణుప్రార్థన మనతిక్రమణీయమని పెద్దలసన్నిధి వాల్మీకిచేఁ గుశునకుఁ పట్టాభిషేకముఁ గావించును. రాముఁడే లవుని యౌవరాజ్యమున నభిషేక మొనర్చును. అవల వాల్మీకియే భరతవాక్యము నుడువును.

వాల్మీకిరామాయణమున సీత పాతాళముఁ బ్రవేశింప పిదప కొంతకాలమునకు లక్ష్మణుఁడును దుర్వాసశాపఫల మనుభవింప, సరయూనది నసువుల దొరఁగును. ఆవల రాముఁడు భరతునకు పట్టాభిషేకముఁ గావింపఁ గోర నాతఁడు రాజ్యమును విగర్హించి కోసలమునఁ గుశునకును ఉత్తరదేశముల లవునకుఁ బట్టముఁగట్టఁగోరినట్లున్నది. [1] కవి యిట మార్చి కథానుగుణముగ క్లుప్తపరచి రచించినాఁడు. ఇందు భరతాదులప్రసక్తియే లేదు.

ఈ తీరున నుత్తరరామాయణకథను జాలవరకు మూలానుగుణముగనే సాగించి దిఙ్నాగుఁడు రామకథ కొక క్రొత్తసోయగముం దెచ్చినాఁడు. పలువురు విమర్శకులు భవభూతివిరచితమగు నుత్తరరామచరితము

---

1. అథ రాజ్యేఽభిషేక్ష్యామి భరతం ధర్మవత్సలమ్।
అయోధ్యాయాః పతిం వీరం తతో యాస్యామ్యహం వనమ్॥ 2

* * * * *

భరతశ్చ విసంజ్ఞోఽభూత్ శ్రుత్వా రామస్య భాషితమ్।
రాజ్యం విగర్హయామాస రాఘవం చేదమబ్రవీత్॥ 6

* * * * *

ఇమౌ కుశలవౌ రాజన్నభిషించ న్నరాధిప।
కోసలేషు కుశం వీర ముత్తరేషు తథా లవమ్॥ 7

(ఉత్తరకాండం-సర్గము 107.)

ఉత్తమోత్తమ మని యనుచున్నారు. కాని యీ కుందమాలకూడ రసపోషణముననైనను, వస్తువిస్తరముననైనను, పాత్రపోషణముననైనను నెందును నాయుత్తరరామచరితమునకుఁ దీసిపోదని నా యభిప్రాయము. ఇందు సున్నితములగు భావములు కడుంగడు చమత్కారముగా లోకసహజముగ వర్ణింపఁబడినవి. ఈ నాటకమందుఁ జాలభాగము, అనగా తిలోత్తమావృత్తాంతము, పృథ్వీవృత్తాంతము తప్ప తక్కిన విషయ మంతయు సాధారణలోకవృత్తమునే బోధించుచు హృదయంగమముగా కథాభాగము నడచినది. అతిమానుషప్రభావము విశేషముగా నిందు వర్ణింపఁబడలేదు. వియుక్తులగువారు పునస్సమాగమసందర్భమున నొందు భావపూర్ణతయే యిందు రసవంతముగ లలితమగుశైలిని రచింపఁబడి సర్వజనాకర్షకముగ నొనరింపఁబడినది. ప్రసిద్ధప్రభావముగల ఇక్ష్వాకుసింహాసనమును కల్పించి పితృపుత్రసంబంధబోధకమగు నభిజ్ఞానముగానుఁ దెల్పి కాళిదాససచ్ఛాయల వర్ణించుటచేతను, విదూషకకల్పనచేతను నీ కవి కాళిదాససమకాలికుడగు దిఙ్నాగుఁడేనేమో యని యనిపించుచున్నది. కవి యెవరైనను గ్రంథముమాత్ర మాపాతరమణీయముగా మనోరంజకముగా నొప్పుచున్నది.

కుందమాల సూక్తులు

1. లోకో నిరంకుశ: (అం. 1–శ్లో 13.)
(లోకము నిరంకుశము.)

2. న హి తథాఽన్యాసక్తా పత్యుః, స్త్రీ జనస్య దుఃఖ ముత్పాదయతి యథాఽన్యాసక్తః॥: (అం. 1)
(అన్యాసక్తుఁడైన పురుషుఁడు స్త్రీకి దుఃఖమును గలిగించినంత అన్యాసక్తయైన స్త్రీ పతికి గలిగింపదు.)

3. తిర్యగ్గతా వరమమీ న పరం మనుష్యాః (అం. 17.–శ్లో 17.)
(జంతువులు మానవులకన్న మేలు.)

4. ప్రమాదః సంపదం హంతి ప్రశ్రయం హంతి విస్మయః।
వ్యసనం హంతి వినయం హంతి శోకశ్చ ధీరతామ్॥ (అం 3.–శ్లో 2.)
(ప్రమాదము సంపద నడఁచును, ఆశ్చర్యము ప్రశ్రయమును రూపు మాపును, వ్యసనము వినయమును నాశ మొనర్చును, శోకము ధీరతను జంపును.)

5. కో జానాతి దుర్విదగ్ధః ప్రజాపతిః కథం కథం క్రీడతీతి: (అం 3.)
(అతిసమర్థుడగు విధి ఎట్లెట్లు క్రీడించునో ఎవ్వ డెరుఁగును.)

6. సులభసాదృశ్యో లోకసన్నివేశః: (అం 13)
(లోకసన్నివేశమున సాదృశ్యము సులభము.)

7. జనప్రవాదో రక్షితవ్యః: (అం 3.)
(జనప్రవాదము రక్షింపదగినది.)

8. ప్రసాదసుముఖోఽపి రాజా దుర్విజ్ఞాప్యః సేవకైః కింపునః కోపభీషణః (అం 5.)
(రాజు ప్రసన్నుడుగా నున్నపుడే సేవకులచే విన్నవింపదగడు. ఇక కోపభీషణుడుగా నున్నపుడు చెప్పనేల?)

9. న చ గురునియోగా విచారమర్హంతి (అం 5.)
(గుర్వాజ్ఞలు విచారింపఁదగవు.)

10. ఆపాతమాత్రేణ కయాపి యుక్త్యా
సంబంధినః సంనమయంతి చేతః।
విమృశ్య కిం దోషగుణానభిజ్ఞ
శ్చంద్రోదయే శ్యోతతి చంద్రకాంతః॥ (అం 5.-శ్లో 10.)
(ఏదో యుక్తిచే దర్శనమాత్రముననే సంబంధులు మనసు నాకర్షింతురు. గుణదోష విజ్ఞానములేని చంద్రకాంతపురాయి గుణదోషముల విచారించియా చంద్రోదయమున స్రవించును?)

11. భవతి శిశుజనో వయోనురోధా
ద్గుణమహతామపి లాలనీయ ఏవ।
ప్రజతి హిమకరోఽపి బాలభావా
త్పశుపతిమ స్తక కేతకచ్ఛదత్వమ్॥ (అం 5.-శ్లో 12.)
(బాలుఁడు వయసుకారణమునఁ బెద్దలకును లాలనీయుఁడగును. చంద్రుఁడును బాలభావముననే శివునితలపై మొగలిపూవువలె నున్నాఁడు.)

12. అపి నామ శరా మోఘా స్తపస్సన్నద్ధమూర్తిషు।
వాసవస్యాపి సువ్యక్తం కుంఠాః కులిశకోటయః॥ (అం 5.-శ్లో 14.)
(తపశ్శాలురయెడ బాణములును వ్యర్థములే. దేవేంద్రుని వజ్రాయుధ ధారలును మొక్కపోవును.)

13. మహార్థసంవిధాయీ మునినియోగః: (అం 5.)
(మునీశ్వరులయాజ్ఞ గొప్పఫలమును గూర్చును.)

14. అనతిదీర్ఘసన్నిధానా హి దేవతాః: (అం 6.)
(దేవతలు ఎక్కువకాలము సన్నిధి నీయరు గదా.)

అనర్ఘరాఘవము-మురారి

సంస్కృతవాఙ్మయమున మురారి ప్రసిద్ధుఁడు. సారస్వతమున నిరువురు ప్రసిద్ధ మురారినామకులు గలరు. ఈ అనర్ఘరాఘవకర్త మొదటివాఁడు. ఇతఁడు 9-వ శతాబ్దమునకుఁ జెందినవాఁడు. రెండవవాఁడు మురారిమిశ్రుఁడను మీమాంసకుఁడు. ఇతఁడు 12, 13 శతాబ్దముల వాఁడు (1150-1220). సారస్వతలోకమునఁ జాలకాలమువరకు 'మురారేస్తృతీయః పంథాః' అనువాక్యమునకుఁ జెందిన మురారి, అనర్ఘరాఘవనాటకకర్తయే యని పండితులనుకొనుచుండిరి. ఆ మురారి మీమాంసకుఁడు 'త్రిపాదీనీతినయన' మను మీమాంసాగ్రంథమును వ్రాసెను. అందు ప్రాభాకరమిశ్ర, కుమారిలభట్టుల మతములకన్న నీ మురారి మిశ్రుఁడు విలక్షణమార్గము చూపినందున నీతనిది 'తృతీయః పంథా' యనుచుండిరి. ఈ మీమాంసకులవి ముగ్గురివియు మతములు. మననాటకకర్త సాహిత్యచక్రవర్తి. ఇతనిది మతము కాదు. కొందరు ఈ నాటకకర్త మురారిది కూడ 'తృతీయః పంథాః' అని అన్వయించుచున్నారు. ఇట కాళిదాస భవభూతుల నాటకచిత్రణ విధానములకన్న భిన్నముగ నీ మురారి వ్రాసినాఁడని యితనిది తృతీయపథ మనుచున్నారు. కాబట్టి యిరువురు మురారినామకులును భిన్నకాలికులు, భిన్నప్రజ్ఞులు.

ఈ నాటకకర్త మురారి నిజకృతియగు ననర్ఘరాఘవమున 8-వ శతాబ్దమునకుఁ జెందిన కలాదురులవశముననున్న మాహిష్మతిని గురించి ప్రశంసించి యుండుటచే నీ కాలాదురుల కాలమునకుఁ గొంచె మించుమించుగ నెనిమిదవ శతాబ్దముచివరను, తొమ్మిదవ శతాబ్దముప్రారంభమందును నీ కవి వెలసియుండునని యూహింపఁ బడుచున్నది. ఈతఁడు అనర్ఘరాఘవమున నుడివిన ప్రస్తావననుబట్టి యీతనితండ్రి పూజ్యుఁడగు వర్ధమానుఁ డనియు, తల్లి తంతుమతి యనియు,

నీతనిగోత్రము మౌద్గల్యగోత్ర మనియుఁ దెలియుచున్నది. మరియు 'అస్య హి హౌద్గల్యానాం బ్రహ్మర్షిణా మన్వయమూర్ధన్యస్య మురారి నామధేయస్య బాలవాల్మీకే ర్వాఙ్మయమమృతబిందునిష్యంది కందళయతి కౌతుకం మే' అను నటునివాక్యములవలన నీతఁడు నిజవంశమున శ్రేష్ఠుఁడనియు బాల వాల్మీకి బిరుదాంచితుఁడనియుఁ దెలియుచున్నది. భవభూతివలెనే యీతఁ డును వాల్మీకియెడ భక్తిప్రపత్తులు గల్గినవాఁడై తనను 'బాలవాల్మీకి' యనెను.

ఈతనిపాండిత్యము సర్వతోదిక్కము. ఈతనిప్రశంసను దెల్పుశ్లోకముల వలనఁగూడ నీతనిఘనత తెలిసికొననగును,

'దేవీం వాచముపాసతే హి బహవః సారం తు సారస్వతం
జానీతే నితరామసౌ గురుకులక్లిష్టో మురారిః కవిః।
అబ్ధిర్లంఘిత ఏవ వానరభటైః కిం తస్య గంభీరతా
మాపాతాళనిమగ్నపీవరతనుర్జానాతి మంథాచలః॥'

అనుశ్లోకము మురారి గురుభక్తుఁడనియు, గురుశుశ్రూషావిధానమున సారస్వత సారముం గ్రోలెననియుఁ దెలుపుచున్నది, పైశ్లోకభావము:-

పలువురు సరస్వతిని గొల్చుచున్నారు. (అనగా పలువురు విద్య నభ్యసించుచున్నారు.) కాని సారస్వతసారమును గురుకులక్లిష్టుఁడైన మురారి యొక్కఁడే మిక్కిలి దెలిసికొనుచున్నాఁడు. ఎట్లన, సముద్రమును వానరభటులందరును దాటిరికాని యాసముద్రములోఁతు తెలిసికొనఁ జాలరుఁ గదా. ఆపాతళము మునిగిన పెద్దశరీరముగల మంథాచలమే లోతును తెలిసికొనఁగలుగుచున్నది.

గురుకులమున విద్యాభ్యాసము సల్పుటవలన మురారి యిట్టి ఘనత నొందఁగలిగెను. ఈ విషయమే తన యనర్ఘరాఘవమున నవకాశము లభించినపు డెల్ల గురుదేవబ్రాహ్మణప్రాశస్త్యము, వారిఘనత, ప్రభావము మున్నగువానిని తరచు నుడువుచునే యుండును. ఈతనిఁగూర్చి

యితరచాటువులును మిక్కిలి ప్రశంసించుచున్నవి. ఇవివైష్ణవ, శైవ, పరముగ నున్నను నిందలిసారము గ్రాహ్యము,

'మురారిపదచింతా చే త్తదా మాఘే మతిం కురు।
మురారిపదచింతాచే త్తదా మాఘే మతిం కురు॥'

(మురారికవిపదముల నరయఁ దలచినచో తొలుత మాఘకావ్యమును బఠింపుము, మురాంతకునిపాదముల ధ్యానింపఁ దలచినచో పాపము సేయఁ దలబెట్టకుము),

'నవసర్గగతే మాఘే నవశబ్దో న విద్యతే।'

(మాఘకావ్యమునఁ దొమ్మిది సర్గలు చదివినచో క్రొత్తశబ్దమే యుండదు). యని ఘనత నొందిన మాఘకావ్యము జదివినపిమ్మట మురారినాటకము చదువవలయు ననుటలో మాఘకావ్యముకన్న మురారినాటకము మిన్న యని బోధపడుచున్నది. మరియు,

'మురారిపదచింతాయాం భవభూతేస్తు కా కథా।
భవభూతిం పరిత్యజ్య మురారిమురరీకురు॥'

మురారి (విష్ణువు) పదముల ధ్యానించునెడ భవభూతి (శివైశ్వర్యము) యేమి లెక్క? భవభూతిని వీడి విష్ణువును గొల్వుము. అని పైకి వైష్ణవముగను శైవముగను నుడివినను, అంతరార్థము మురారికవి భవభూతికన్న మిన్న యని వ్యంగ్యముగఁ దెలియుచున్నది.

'భవభూతిం పరిత్యజ్య నిర్వాణమతినా మయా।
మురారిపదచింతాయా మిదమాధీయతే మనః॥'

'సంసారసంపదను బరిత్యజించి మోక్షార్థినై నేను మురారి (విష్ణు) పదచింతనముననే మనస్సును లగ్నముచేయుచున్నాను. అని బాహ్యార్థమును, మోక్షార్థినై భవభూతినామకకవిని వీడి మురారినామక కవిరచనమున నాసక్తిఁ

గొనుచున్నాను' అని అంతరార్థమును దెలియుచున్నవి. ఈ ప్రశంస లన్నియు మురారిఘనతను పేర్కొనుచున్నవి.

ఈ మురారి పలువురు గురువులకడ పెక్కు శాస్త్రము లభ్యసించి విశేషమైన జ్ఞానము నార్జించి యుండనోవు. ఈతని కవితాధార గంగాప్రవాహమువలె నడ్డు లేక ప్రవహించుచుండును. ఈ ధార క్లేశలబ్ధ మని కొంద రందురు. గాని, యాతనిశైలిని దిలకించినచో నది స్వభావసిద్ధ మనియే తోఁచును. ఇది యనన్య లభ్య మని కూడఁ జెప్పనగును. ఇతఁడు గంభీరశైలిని నిజప్రతిభను జాటుచు నత్యుత్తమరీతి నీ నాటకమును రచించెను. ఈతనియుపమలు విలక్షణములు. ఊహ కందరాని వర్ణనముల వర్ణించును. ఈతనికృతి యొక లక్ష్యగ్రంథముగఁ బేర్కొనఁబడుచున్నది. సిద్ధాంతకౌముదియందు భట్టోజీదీక్షితు లీతనిప్రయోగముల నుదహరించియున్నాఁడు. 'ఫలేగ్రహిరాత్మంభరిశ్చ' అను సూత్రము ప్రకారము మురారి ప్రయోగమగు 'జ్యోత్స్నాకరంభ ముదరంభరయశ్చకోరా' అనుచోట 'ఉదరంభర' అనుదాని విషయము కథంతర్హియని 'చాంద్రాస్తు ఆత్మోదరుకుక్షిషు' అని చాంద్రవ్యాకరణముప్రకారము సాధువని నుడివెను. ఇంకను పెక్కుతావులను నితిని బేర్కొనెను. ఇతనిప్రయోగములు లక్ష్యములుగ నుదహరించి పండితులు చాలమంది మురారిగ్రంథమును శిరసావహింతురు. ఇతఁడు శాంతమును గూడ నొక రసముగాఁ బరిగ్రహించినాఁడు.

'జటాం ధత్తే మూర్ధా పరశుధనుషీ బాహుశిఖరం
ప్రకోష్ఠో రౌద్రాక్షం వలయమిషుదండానపి కరః।
ప్రరూఢప్రౌఢాస్త్రవ్రణవికటరౌద్రాద్భుతమిదం
ప్రశాంతామైణేయీం త్వచమపి చ వక్షః కలయతి॥'

(అంకము 4. శ్లోకము 27.)

ఇది భార్గవుని వర్ణనము.

(శిరమున జటను అంసమున పరశుధనువుల ధరించుచున్నాఁడు. ముంజేత రుద్రాక్షజపమాలికను, చేత బాణదండములను వహించియున్నాఁడు. యుద్ధవీరుల మేటియస్త్రవ్రణములచేఁ గాయలు గాచి నిమ్నోన్నతమై యుండుట రౌద్రాద్భుతమగు నీ వక్షఃస్థలము ప్రశాంతమగు కృష్ణాజినమును దాల్చియున్నది.)

పైశ్లోకమునకుఁ బూర్వము 'అహో సంకీర్యమాణానేకరసానుభావగంభీరమధురోయమస్యాభోగః' అని భార్గవుని యాకృతి నానారసానుభావగంభీర మధుర మని చెప్పఁబడి యీ శ్లోకమున గుర్తింపఁబడుచున్నది. ఇందు తృతీయ చరణమున రౌద్రాద్భుత మని నుడివి చతుర్థమున 'ప్రశాంతాం' అని నుడువుటచే శాంతరసమును రసములలో నొకటిగా నీ మురారి గ్రహించె నని తెలియుచున్నది. అనేకశాస్త్రవిషయముల నీ గ్రంథమునందే యా యాస్థలములలో నవసరమైనపు డెల్లఁ జొప్పించి నిజసర్వతోదిక్క పాండిత్యమును వెల్లడిఁజేయుచున్నాఁడు.

రామచరితమును పలువురు కాళిదాసాదులు రచించినను మరల పిష్టపేషణముగ దానినే తాను వ్రాయఁబూనుటలో రామునెడగల గౌరవముఁ దెల్పుచు,

'యది క్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్య చరితం
గుణై రేతావద్భి ర్జగతి పునరన్యో జయతి కః।
స్వమాత్మానం తత్తద్గుణగరిమగంభీరమధుర
స్ఫురద్వాగ్బ్రహ్మణః కథముపకరిష్యంతి కవయః॥'

(అంకము 1. శ్లోకము 9.)

అని రామునివంటి సుగుణాభిరాముఁడు వేరొకఁడు నాయకుఁడు లేఁడని నుడువును.

ఈతఁడు గొప్ప గురుభక్తుడు. ఈ నాటకమున దశరథుఁడు. శ్రీరాముఁడు మున్నగువారి శీలచిత్రణమున నీతని యాదర్శభావములే వారియందు గోచరింపఁజేసెను. పెద్దల సుద్దులు విని వారిపోకడల నెరిఁగిన కతముననే యట్లు వ్రాయఁగల్గినాఁడు ఈ నాటకమున నీతఁడు 567 శ్లోకముల నింపి దీనిని శ్రవ్యకావ్యమా యనిపించునట్లు రచించి నాఁడు.

కథాసంగ్రహము

ప్రథమాంకము: నాంద్యాదినాటకీయావశ్యకములు నిర్వహింపఁబడిన పిదప దశరథవామదేవులు ప్రవేశించి యిక్ష్వాకుల కులగురువగు వసిష్ఠుని సుగుణమాహాత్మ్యముల నుగ్గడించుచు సంభాషించుదురు. ఇంతలో విశ్వామిత్రుఁడు ప్రవేశింప వామదేవుఁ డాతని నాహ్వానించి శిష్టాచారమున నాతిథ్య మొసఁగి ప్రీతిగ సంభాషించును. విశ్వామిత్రదశరథులును హృదయంగమముగ మాటాడుదురు. సంభాషణమున దశరథుఁడు శ్రీరాముని తనతోఁ గొన్ని దినములు పంపఁగోరు విశ్వామిత్రునికోరిక నెరింగి రామలక్ష్మణుల విశ్వామిత్రునితోఁ బంపును. వారును సహర్ష మాతనివెంట నేగుదురు. ఇది మునీంద్రసంవాదమను ప్రథమాంకము.

ద్వితీయాంకము: విష్కంభమున శునశ్శేపుఁడు పశుమేధ్రుఁ డను నిరువురు విశ్వామిత్రశిష్యులు ప్రవేశించి సంభాషింతురు. శునశ్శేపుఁడు రామమాహాత్మ్యమున నహల్య శిలారూపము వీడి స్వీయరూపముఁ దాల్చె ననియు, జాంబవంతుఁడు వాలికి హితము గరపినను వినకపోవుటచే నాతని వీడి సుగ్రీవ హనుమంతులఁ జేరెననియు, రావణుఁడు ఖరదూషణత్రిశిరసుల గొప్పసేనతో వాలి సహాయార్థము పంపినట్లును, తాటక సిద్ధాశ్రమమున యజ్ఞములకు విఘ్న మొనర్ప నేతెంచియున్నట్లును, విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులకు దివ్యాస్త్రముల బలాతి బలల

నుపదేశించినట్లును, తన సమాధిమయచక్షువుచే వాలివృత్తాంతమునెరింగి యయోధ్యాయాత్రాసమయమునఁ దనకు నుడివె ననియు, మరియు రామలక్ష్మణులు ఆశ్రమమునకు వచ్చి తత్ప్రాంతమున నాడుకొను చున్నారనియుఁ దెల్పును.

రామలక్ష్మణులు ప్రవేశించి యాశ్రమమును వర్ణించుచుఁ బావనమైన మునివృత్తిని గొనియాడుదురు. మధ్యాహ్నమున నొక మఱ్ఱిచెట్టునీడను గూర్చుండి సరసముగ భాషించుచుందురు. సాయంకాలము కాఁగానే యజ్ఞ రక్షణార్థము రాముఁడు ధనుష్పాణియై రక్కసుల కొరకువేచి యుండును. అంత విశ్వామిత్రుఁడు రాఁగా వారు నమస్కరింతురు. రాత్రి కాఁగా తాటకమారీచ సుబాహులును బ్రవేశించి రక్తధారలఁ గురిపింతురు. విశ్వామిత్రుఁడు వారల రూపుమాప రాముని గోరును. గుర్వాజ్ఞమేరకు తాటకను సంహరించి సుబాహువు నెగురఁగొట్టి మారీచునిఁ బారఁదోలును. స్త్రీవధ గావించినందుకు రాముఁడు చాల నొచ్చుకొనును. ఆవల రామలక్ష్మణులు రాత్రిని వర్ణించుచు చంద్రుని పెక్కురీతుల వర్ణింతురు. విశ్వామిత్రుఁడు జనకునివార్తఁ దెలిపి శేషించిన యజ్ఞభాగము నెరవేర్ప వారు మిథిల కేగ సిద్ధమగుదురు. రాముఁడును జనకునెడఁ గల యాశ్చర్యద్వయమగు శివధనువును నయోనిజయగు జానకిని జూడఁ గుతూహలపడును. ఇది కౌమారవిక్రమమను ద్వితీయాంకము.

తృతీయాంకము: కంచుకి, కలహంసికలు ప్రవేశించి విష్కంభమున సంభాషించుచు పినాకారోపణము పణముగాఁ బెట్టఁబడినదనియు, రావణుఁడు సీతను జేపట్టఁ గోరి నిజపురోహితుఁడగు శౌష్కలుఁ డనువానిని జనకునాస్థానమునకుఁ బంప నతఁడు నట్లే సీతను రావణున కిమ్మని ప్రార్థింప మిథిల కేతెంచెననియు, నద్దాన సీత దుర్మనాయమాన యైనట్లును,

రామలక్ష్మణులు విశ్వామిత్రశతానందులతో వేదికయం దున్నారనియు, సీత యుత్కంఠితయై యున్నదనియుఁ దెలియఁ జేయుదురు.

రామలక్ష్మణులు విశ్వామిత్రునితో మిథిల కేతెంచి జనకునాస్థానమున వేదికపై నుందురు. జనకాదులు సీతావివాహవిషయమున శివధనుర్భంగము పణముగా నిడుదురు. రావణపురోహితుఁడు శౌష్కలుఁ డనువాఁడు సీతను రావణున కీఁ గోరును. జనకాదులు పణమును గూర్చి నుడువుదురు. కాని విశ్వామిత్రునానతి శ్రీరాముఁడు ధనురారోపణము గావించి ధనువును భగ్నమొనర్చును. సీతను రామున కీయ నిశ్చయింతురు. ఊర్మిళను లక్ష్మణునకును, కుశధ్వజునికూతులను భరతశత్రుఘ్నుల కీయ సంకల్పింతురు. శతానందుఁడు దశరథాదుల నాహ్వానింప నయోధ్య కేఁగును. శౌష్కలుఁడు రోషముతో రావణుని బ్రశంసించి, రాముని బెదరించి సీతను వివాహమాడ వలదని హెచ్చరించి మాల్యవంతునితో జరిగిన వృత్తాంతము నుడువ నరుగును. ఇది పినాక భంగమను తృతీయాంకము.

చతుర్థాంకము: విష్కంభమున శూర్పణఖామాల్యవంతులు సంభాషించుచు సీతాకల్యాణము జరిగెనని తెలుపుదురు. మాల్యవంతుఁడు శూర్పణఖతో జాంబవంతునియాలోచనప్రకారము వాలినిగ్రహమునకు సుగ్రీవసహాయార్థము రాముని దండకకు రప్పింప నెంచి శ్రమణను మంథరాశరీరమునఁ బ్రవేశించి రామవనప్రేషణ, భరతపట్టాభిషేకరూప వరములు గల లేఖ నందిచ్చి రాము నడవులపాలుసేయు ననియు నపుడు రాముఁడు వైదేశికుఁడై కార్యగౌరవమున వాలివధ గావింతునని సుగ్రీవునితో సంధి గావించికొను ననియు, అట్లయినచో విరాధ ప్రభృతు లధిష్ఠించియున్న వింధ్యగిరిగహ్వరముల రాముఁడు సంచరించుచుండ సీతను సుకరముగ నపహరింపవచ్చు ననియు నుడువును. శూర్పణఖయుఁ దా మిథిలనుండి తిరిగివచ్చునపుడు శివధనుర్భంగ మొనర్చె

నని రామునెడ మచ్చరముఁ గొని పరశురాముఁడు మిథిల కేతెంచె ననియు దెల్పుదురు.

పిదప పరశురాముఁడు రాముని గని యతికోపమున రాముఁ డెన్నివిధముల నెంత వినయముగ, గౌరవముగ బతిమాలినను వినక యస్త్రములఁ దొడుగుమన రాముఁడు మరల పూజ్యులని నుడువ రామునకు వైష్ణవధనువు నిచ్చి యెక్కిడు మన రాముఁ డద్దాని నవలీల నెక్కుపెట్టి పరశురాముని క్షమింప వేడును. భార్గవుఁడు రాముని మెచ్చుకొని రాము నాలింగనము గావించికొని జనకునింట నాతిథ్యముఁ గొన నెంత వేడినను నొల్లక వెడలిపోయెను. దశరథుఁడును రామునకు బట్టముఁ గట్టి తాను తపోవనమున కేఁగఁదలఁచి త్వరపడుచుండ మంథర యొక లేఖను దెచ్చును. అందుఁ గైక రెండువరములు రామునకు వనవాసము. భరతున కభిషేకము అను వానిని కోరినట్లుండును. ఆ వార్త విన్నంత జనక దశరథులు మూర్ఛిల్లుదురు. రాముఁడు జనక దశరథుల నోదార్చుచు దశరథునిఁ జూచుకొను మని జనకునకు నుడివి సీతాలక్ష్మణులతోఁ బయనమై పోవును. అందరు నిష్క్రమింతురు. ఇది దశరథవిప్రలంభ మను చతుర్థాంకము.

పంచమాంకము: విష్కంభమున శ్రమణాజాంబవంతులు సంభాషింతురు. శ్రమణ జాంబవత్ప్రేరణమున మంథరకాయముఁ బ్రవేశించి మిథిలలోని శ్రీరామవృత్తాంత మెరింగి తిరుగ జాంబవంతుని గలిసి రామవృత్తాంతము నుడువును. వారిసంభాషణమున గుహునిమైత్రి, చిత్రకూటనివాసము, దశరథమరణము, రామపాదుకలను భరతుఁడు గ్రహించుట, రాముఁడు పంచవటి కేగుట, కాకాసురుని గ్రుడ్డిచేయుట, రాముఁడు జనస్థానమునకు వచ్చుట, ఖరదూషణాదులు మడియుట, గుహుని ద్వారా రామసహాయము కోరుటకు శ్రమణయేగుట మున్నగునవి తెలియును. ఇంతలో రావణుఁడు భిక్షుకవేషమున రాము నన్వేషించుట,

జటాయువు జాంబవంతుని గలిసికొని రామభద్రునకు రావణుని వలన నపాయము శంకించి తత్సహాయార్థము వెడలఁ ద్రోవలో సీత యేడ్పు విని రావణునితో పోరుట మున్నగునవి తెలియుచున్నవి. ఇట్లు సీతాపహరణము వరకుఁ గల రామాయణవృత్తాంతము నీ విష్కంభము తెలియఁజేయుచున్నది.

రామలక్ష్మణులు సీతను వెదకుచు గ్రుమ్మరుచుందురు. త్రోవలో జటాయుధైర్యమునకు మెచ్చి క్రమముగా నడచి మాల్యవత్పర్వతముఁ జేరుదురు. సీతావిరహమున రాముఁడు మూర్ఛ నొందును. లక్ష్మణుఁ డుపచరింప మేల్కొని గుహుఁడు కబంధునితోఁ గలహించుచున్నట్లు తెలిసి గుహునకు సహాయముగ లక్ష్మణు నంపును. లక్ష్మణుఁడు కబంధునిఁ జంపి గుహుని రాముకడకుఁ దోడ్కొని వచ్చును. గుహుఁడు రామునకు దుందుభికాయమును జూపి వాలి పరాక్రమమునుగూర్చి నుడువును. అంతట నతఁడు సుగ్రీవుఁడు పంపెనని సీతయుత్తరీయము రామున కొసఁగును. రాముఁడు సుగ్రీవహనుమంతులఁ గలసికొన త్వరపడుచు గుహుని ఋశ్యమూకమునకుఁ ద్రోవఁ జూపు మని యట కేగుదురు. త్రోవలో మతంగాశ్రమముద్వారా నేగుచు వాలినిఁ బ్రశంసించును. రాముఁడు సుగ్రీవసఖ్యమునకై త్వరపడి యగ్నిసాక్షికముగ మైత్రిజేయును, రాముఁడు దుందుభికాయము నెగజిమ్మినవార్త దెలిపి వాలి రావణసందేశమును స్మరించి రాముని యుద్ధమున కాహ్వానించును. రాముఁడు ప్రశంసాముఖమున వాలిని నిందించును. వాలి కుపితుఁడై రామునితోఁ బోరఁ గడంగును. రాముఁడు సప్తతాళముల భేదించి వాలినిగూడఁ గూల నేయును. వాలి రాముని స్తుతించును. సుగ్రీవున కభిషేకము గావించి కిష్కింధకు రాజుగాఁ జేయ, నతఁడు వానరాధిపుల రావించి సీతాన్వేషణమునకై యాంజనేయుని బంప నెంచును, అంగదునకు యువరాజపట్టాభిషేకము సేయుదురు. ఇది సుగ్రీవాభిషేక మను పంచమాంకము.

షష్ఠాంకము: విష్కంభమునఁ దొలుత మాల్యవంతుఁడు ప్రవేశించి కష్టదశను దలపోయుచుండ శుకసారణులు ప్రవేశింతురు. రామవృత్తాంత మరయఁ బంపఁబడిన వీరు రాముఁడు ప్రహస్త, ధూమ్రాక్ష, మహోదరాదుల వధించి వానరులతో వచ్చి లంకను ముట్టడించుచున్నట్లు తెల్పుదురు. కుంభకర్ణమేఘనాదులు మడిసి రని విని రావణుఁడు రాము నెదుర్కొనఁ జనుచున్నాఁడనియుఁ దెల్పుదురు.

రత్నచూడుఁడు హేమాంగదుఁ డను నిరువురు గంధర్వు లాకాశయానము సల్పుచు రణరంగచర్యలఁ బరిశీలింతురు. వారు రామరావణయుద్ధము, రావణ విజృంభణము, కపిపరాక్రమమును వర్ణింతురు. సుగ్రీవుఁడు రావణుఁడును ఘోరముగాఁ బోరుచుండ రాముఁడు ప్రవేశించి రావణుని శివపారమ్యమును వెచ్చికొని సావహేళనముగ జగచ్ఛిల్పియగు బ్రహ్మకు పౌత్రుఁడగుట శిరములు సులభముగ, ఛేదింపఁబడినవనును. రామరావణులు వీరోక్తులు పల్కుదురు. రావణుఁడు అనరణ్యుఁ డను రామునిపూర్వపురుషు నొకని జంపితినని యట్లే రామునిగూడఁ జంపుదు ననును. రాముఁడును గార్తవీర్యార్జునిచే రావణుఁడు కారాగారబద్ధుఁ డగుట మున్నగు గతవిషయముల నొడువును. రావణుఁ డలిగి రామునిపై శరవర్షము గురిపించును. పోరు ఘోరముగ సాగును. రావణుఁడు ద్వంద్వయుద్ధమర్యాదను విడచి యిర్వదిచేతులతో శరలాఘవము చూపుచుండ రాముఁడు భుజద్వయముననే నిర్వహించి రత్నచూడుని ప్రశంసకుఁ బాత్రుఁడగును. రామచాతుర్యమునకు రావణుఁడు మెచ్చుకొనును. శరపంజరమధ్యవర్తియగు క్రీడాశకుంతమువలె రాముని బంధించి రావణుఁడు సంతసింపనెంచును. ఇరువురును పరస్పరము అస్త్రప్రయోగములఁ జేయుదురు. భూమి కంపించును. రాముఁడు రావణుని జయింపవలయు ననియు రావణుఁడు రాముని జంపవలయుననియు

నిర్ణయములతో నస్త్రముల విడిచెదరు. రామునిపై రావణప్రయుక్త బాణములు విష్ణ్వంశసంభూతుఁ డని స్నేహమున దరిచేరును. రామప్రయుక్తములు రావణునెడ భీతిచే మెల్లగ సమీపించును. తుదకు రాముఁడు రావణుని శిరములను బాహువులను ఖండించి కబంధముఁగూల నేయును. రావణకబంధ భారముచే నేల క్రుంగగా పర్వతముల కున్నతి గలిగె ననును. మండోదరి రావణకబంధమును జూచి విలపించును.

అవల రాముఁడు లంకలో విభీషణు నభిషిక్తుని గావించి సుగ్రీవవిభీషణాదులతో గూడి విజయశ్రీకాంతుఁడై వెలుగొందు చున్నాఁ డని విద్యాధరు లిరువురును రాముని బ్రశంసించి వెడలుదురు. రావణుఁడు నిగ్రహింపఁబడుటచే నిది దశగ్రీవనిగ్రహ మనఁబడు షష్ఠాంకము.

సప్తమాంకము: రావణగృహవాసదోషకారణమున సీత యగ్నిప్రవేశ మొనర్చి శుద్ధురా లగును. అంత శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతో సుగ్రీవవిభీషణులు వెంబడి రా పుష్పకవిమానము నధిరోహించి ప్రయాణము చేయును. సీతారాములు గతయుద్ధవిషయముల నాగపాశబంధాదుల ముచ్చటింతురు. సముద్రుని గాంచి రాముఁడు ప్రశంసించుచు సీతను నమస్కరింపు మన నామెయు వందన మాచరించును. త్రోవలో నగస్త్యమహామునిమహిమను గొనియాడి సేతువునుగూర్చి ప్రసంగింతురు. విమానమునఁ బోవుచు సముద్రవేష్టిత ధరాచక్రము చిత్రకుట్టిమమువలె నున్న దనును. అంత హిమవంతుని జూచి యట గౌరీశంకరులవృత్తాంతము స్మరింతురు. లక్ష్మినిగూర్చి లక్ష్మణుఁడు సావహేళనముగ వర్ణించును. అవల వారు కైలాసాద్రిం గాంచి యట శివునిగూర్చి రామవిభీషణలక్ష్మణులు స్తుతింతురు. అంత రాముఁడు విమానమును గొంచెము పైకి పొమ్మని సీతకు సుమేరుశిఖరములఁ జూపును. అవల వారు చంద్రలోక సమీపమును

జెంది చంద్రుని 'శృంగారాద్వైతవాది' యని స్తుతించి, సీతారాములు చంద్రకళను శివుఁడు ధరించువిషయమునుగూర్చి ముచ్చటించుచుండ నేపథ్యమున నాంజనేయుఁడు పట్టాభిషేకముహూర్త మాసన్న మగుచున్న దని హెచ్చరించువార్త వినఁబడును. అవల వారు విమానముతో క్రిందికి దిగి దక్షిణమున లంకను, తామ్రపర్ణిని, అగస్త్యాశ్రమమును, నతని మాహాత్మ్యమును గొనియాడుదురు. క్రమముగా దండకారణ్యమున, పంచవటి, గోదావరి, మాల్యవంతము మున్నగువానిని దాటి కుండినము, సప్తగోదావరము, కాంచి, ఉజ్జయిని, మాహిష్మతి మొదలగువానిని దాటి గంగాయమునలను, కాశిని, మిథిలను, చంపను, తిలకించి మోక్షద్వారమగు ప్రయాగను దర్శించి సరయూనదిని యయోధ్యను జూచి యందరు నమస్కరించి యిక్ష్వాకులరాజమందిరమున విమానముతో నవతరింతురు. వసిష్ఠాదు లభిషేకసంభారములతో సిద్ధముగ నుందురు. సీతారాములు వసిష్ఠునకుఁ బాదాభివందన మాచరింప నతఁడు సూర్య చంద్రమసులవంటి పుత్రుల నిరువురఁగనుమని యాశీర్వదించును. లక్ష్మణాదులును నమస్కరింప నిద్ద రిద్దరుపుత్రులఁ గందు రని యాశీర్వదించును. భరతశత్రుఘ్నులును సీతారామలక్ష్మణులును గలసి యానందింతురు. రాముఁడు విభీషణ సుగ్రీవుల లంకాకిష్కింధాధిపతు లని వసిష్ఠునకుఁ బరిచయపరచి భరతశత్రుఘ్నులను విభీషణసుగ్రీవులకు బ్రణమిల్లఁ జేయును. విభీషణసుగ్రీవులు వసిష్ఠునకు నమస్కరింప వసిష్ఠుఁడు వారి నాశీర్వదించును. ఇట్లందరును గూడి సంతసింతురు. అవల వసిష్ఠుఁడు మంత్రపూర్వకముగ నభిషేకముఁ గావింప రఘుసింహాసనమున రాముఁడు మిక్కిలి శోభిల్లును. విభీషణుఁడు రామాజ్ఞచేఁ బుష్పకమును గుబేరున కంపును. భరతవాక్యముచే కథ మోదాంతముగా ముగియును. ఇది నాయకానంద మను సప్తమాంకము.

నాటకవిశేషములు: ఒక కవియొక్క శీలమును గుణగణములును నాతని కృతియందు గొంతవరకైనను తప్పక ప్రతిబింబించుట సహజ మనుట విమర్శక నిర్ణయము. ఈ మురారి కింత గొప్పతనమును దెచ్చినది యీతని కృతియగు నీ 'అనర్ఘరాఘవమే' యనుటలో సందియము లేదు. పెద్దలయెడ మెలఁగిన వాఁడు కావుననే యీతఁడు నిజకృతియగు నీ నాటకమందు నిజాశయములను రామాదిపాత్రలముఖమునఁ గొంత వెలువరించినాఁడు. పెద్దలగు విశ్వామిత్ర, వామదేవ వసిష్ఠాదులు పరస్పరము సంభాషించు తీరు, ఔచితిప్రకారము మర్యాదఁ బాటించుచు మనోల్లాసముగ మాటాడునట్టియు, వ్యవహరించునట్టియు పద్ధతులను గడుంగడు రసవంతముగ నీ నాటకమునఁ బొందుపరచి పాఠకులు వారి శీలము నొరవడిగా గ్రహించునట్లు చిత్రించెను. శ్రీరాముని వర్ణించుతరి మురారి తన్మయతచేఁ దన (ఆదర్శ) శీలమునే రామపాత్రమునఁ జిత్రించినట్లు గోచరించుచున్నది. విశ్వామిత్రాశ్రమమున, నందును సహజకోపనుఁడగు నా ఋషికడ, నాతనిచే మెచ్చులు వడయునంతటి శుశ్రూష గావించి, గురునిదేశానుసారము తాటక యను రక్కసిని జక్కడంచి లోకోపకారకృత్య మొనరించియు,

'దీర్ఘం ప్రజాభిరతికౌతుకినీభిరాభి
రస్మిన్నకీర్తిపటహే మమ తాడ్యమానే।
జ్యోతిర్మయేణ వపుషా జగదంతసాక్షీ
లజ్జిష్యతే కులగురుర్భగవాన్ వసిష్ఠః॥'

(అంకము 2. శ్లోకము 60.)

స్త్రీవధ గావించినందులకుఁ జ్యోతిస్స్వరూపుఁడును (బ్రహ్మ స్వరూపమున) జగదంతస్సాక్షియు నగు కులగురుఁడు వసిష్ఠుఁడు సిగ్గుపడు నని భావించునంతటి గురుభక్తిపరాయణుఁడు. ఇట రామునిశీలము మురారిగురుభక్తినిష్ఠను ప్రతిబింబింపఁజేయుచున్నది.

ఇతఁడు నాటకమునఁ దన స్వాతంత్ర్యమునుఁజూపి యాశ్రమవర్ణనము, చంద్రవర్ణనము, విమానయానవర్ణనము మున్నగుతావుల నాటక మని కాలపరిమితి గల దని యే మాత్రము చింతించినట్లు కనపడదు. నిజసాహిత్యజ్ఞానము నంతయు నిందు తత్తత్స్థలముల నప్రసక్తములైనను జొప్పించెను. కావ్యాంతమున నీ కవి.

'జేతారం దశకంధరస్య జితవానేవార్జునం భార్గవ
స్తం రామో యది కాకపక్షకధర స్తత్పూరితేయం కథా।
ఊర్ధ్వం కల్పయతస్తు బాలచరితా త్తత్ప్రక్రియాగౌరవా
దన్యేయం కవితా తథాపి జగతస్తోషాయ వర్తిష్యతే॥'

(అంకము 6. శ్లోకము 146.)

యను శ్లోకమున రామాయణకథయంతయు భార్గవుని శ్రీరాముఁడు బాల్యముననే జయించె ననుటతోడనే ముగిసినదనియుఁ బైకథ యంతయు వాలివధ, సేతుబంధాది రామకార్యములయందలి యాదరప్రసక్తమయిన కవిత్వమే యనియు, నట్లైనను విషయగౌరవముచే నది జగదానందమునకే యగుననియు నుడివి తనకు రామునెడఁ గలభక్తిని దెలియఁబరచెను. 'అన్యేయం కవితా' యనుటలో నీతనికవనమే విలక్షణ మైనదనియుఁ దెలియుచున్నది.

మరియు నీతఁ డాత్మవిశ్వాసము కలవాఁడు, తుదియంకమున కథాంతమున, రామవాక్యముగా,

"సమున్మీలత్సూక్తస్తబకమకరందైః శ్రవణయో
రవిశ్రమ్యద్ధారాసవన ముపచిన్వంతు కవయః।
నశబ్దబ్రహ్మోత్థం పరిమళమనాఘ్రాయ చ జనః
కవీనాం గంభీరే వచసి గుణదోషౌ రచయతు॥"

(అంకము 7. శ్లోకము 151.)

అనియు,

"దేవస్యాత్మభువః కమండలుజలస్రోతాంసి మందాకినీ
గంగాభోగవతీమయాని పునతే యావత్త్రిలోకీ మిమామ్।
తావద్వీరయశోరసాయనమధుస్యందః కవీనా మయం
జాగర్తు శ్రుతిశష్కులీవలయితవ్యోమావగాహీ గుణః॥"

(అంకము 7. శ్లోకము 152.)

అనియు నుడువును. కవులు సూక్తిసమనికరమధువుచే శ్రవణపేయముగఁ గృతుల రచింతురు గాక. అనగా కవీశ్వరులు చెవుల కింపగునట్లు రసవంతములగు సూక్తులఁ దమగ్రంథముల వ్రాయుదురుగాక యని భావము. శబ్దములకు పరిమళము గలదనియు జనులు దాని నెరుగకయే కేవలము మహాకవిప్రయుక్త తత్తచ్ఛబ్దార్థములయెడ గుణదోషవిచార మూనకుందురు గాక యనియు నిజకృతియందలి శబ్దార్థగౌరవమును వ్యంగ్యముగఁ దెలుపుచున్నాఁడు. మరియు, కావ్యోపసంహారశ్లోకమగు 'దేవస్యాత్మభువః' యను దానియందుఁ గూడ బ్రహ్మకమండలూదకములును, స్వర్గమర్త్యపాతాళగంగాజలములును నీ ముల్లోకముల నెంతదనుక పునీతములుగ నొనర్చునో యంతదనుక కవీశ్వరులు తమవాఙ్మధుపూరములచే శ్రోతృశ్రవణవివరాకాశముల నింపుదురు గాక యని కవులను హెచ్చరించుటయందును, తనకావ్య మట్టి వాఙ్మాధుర్యవిలసిత మనియు, మున్నగు విషయముల వ్యంగ్యమర్యాదచే సూచించుచున్నాఁడు. కావ్యారంభముననే యీతఁడు.

"అస్య హి మౌద్గల్యానాం.....బాలవాల్మీకేర్వాఙ్మయ
మమృతబిందునిష్యంది కందళయతి కౌతుకం మే"

యని తనకవిత వాఙ్మయమగు నమృతబిందునిష్యంది యనును.

ఇతఁడు గొప్ప ఆస్తికుఁడు, నైష్కర్మ్యసిద్ధి నుపాసించిన జ్ఞాని, గురుభక్తావతంసుఁడు. సర్వతోదిక్కపాండిత్యవిలసితుఁడు, మహాకవి యని నాటకీయాంశములఁబట్టి తెలియవచ్చుచున్నది. ఇట్టి మహావిద్వాంసుని నాటకమున నే సుగుణములున్నవో పరిశీలింతము.

ప్రథమాంకమున నాందీశ్లోకముననే యితరకవులవలె నమస్కరింతు, మనల రక్షించుగాక, మంగళము లొనగూర్చుగాక. యిత్యాది వాంఛలతో, నాశీరాదిశోభితమగునట్లు కాక విలక్షణముగ 'నిష్ప్రత్యూహ ముపాస్మహే' యని యారంభించుటచే నీ కవి నిష్కామకర్మాచరణనిరతుఁ డని యీతని మహానుభావవత్త గోచరించుచున్నది. నాటకసంప్రదాయానుసారము ప్రస్తావనయందు నిజవంశాదివృత్తాంతమును తాను మౌద్గల్యగోత్రుఁ డనియుఁ బూజ్యులగు తంతు మతీ వర్ధమానతనూజాతుఁ డనియు, దెల్పి, 'బాలవాల్మీకి' యని తానే చెప్పికొనును. అంతియ కాక.

'వాల్మీకివాగమృతకూపనిపానలక్ష్మీ
మేతాని బిభ్రతి మురారికవే ర్వచాంసి'

(అంకము 1. శ్లోకము 12.)

అని వాల్మీకివాక్కు అనెడి యమృతంపుబావిచెంత నుండు తొట్టివంటివి మురారి వాక్కులని, బావికన్న తొట్టి తక్కువది, చిన్నదియు నైనట్లు వాల్మీకి వాక్యములు గొప్ప వనియు, తనవి యల్పము లనియు నుడివికొనుచు నందే వ్యంగ్యముగ బావిలోనియమృతము తొట్టిలోనికి రాగా తద్ద్వారా యుపభోగార్హత్వము నందినట్లు వాల్మీకివాగమృతకూపమైనను మురారికవివాఙ్నిపానద్వారా కవుల కనుభవమున కందుననియు నద్దాన రామాయణమునకన్న నీ నాటకము రసోత్కర్షమున విశేషమని వ్యంగ్యముగఁ దెలియఁజేయుచున్నాఁడు. సూర్యోదయమును వర్ణించుచు.

[1]దిణఅరకిరణుక్కేరో పిఅఅరో కోవి జీఅ లోఅస్స।
కమలమఉలంకవాలీకిఅమహుఅరకడ్డణవిఅడ్ఢోం॥'

(అంకము 1. శ్లోకము 13.)

సూర్యతేజస్సమూహము జీవలోకమునకుఁ బ్రియాకారకమై కమలకుట్మలమధ్య వర్తియగు భ్రమరమును బయటకు లాగుచున్నది. యని నుడివి విశ్వామిత్ర ప్రవేశమును సూచించుచుఁ గథోత్థాతమును జమత్కారముగా నిర్వహించినాఁడు. దశరథవామదేవులు గూర్చుండి యుందురు. వామదేవుఁడు వసిష్ఠానుశాసనముఁ దెల్ప, దశరథుఁడు 'భగవతో వసిష్ఠస్యానుశాసనం నవం నవమివ ప్రమోదయతి మాం' యని గురుసూక్తియం దాదరముం జూపును,

'తస్యాజ్ఞయైవ పరిపాలయతః ప్రజాం మే
కర్ణోపకంఠపతితంకరణీ జరేయమ్।
యద్గర్భరూపమివ మా మనుశాస్తి సర్వ
మద్యాపి తన్మయి గురుర్గురుపక్షపాతః॥'

(అంకము 1. శ్లోకము 15.)

అను శ్లోకమున దశరథుఁడు తాను వసిష్ఠునియాజ్ఞానుసారముగనే ప్రజలఁ బాలన సేయుచుండి వృద్ధుఁడైనను బాలకునికి హితము గరపుచాడ్పున వసిష్ఠుఁడు తన్ననుశాసించుట తనయందు గురువునకుఁ గల యనుగ్రహవిశేషమే యని మిక్కిలి గురుభక్తిని చాటును. ధనమదమున గురుతిరస్కారము లోకసామాన్యమై యుండ, నిట దశరథశీలము ప్రశంసాపాత్రము. ఆదర్శమునునై వెలయుచున్నది. ఇంతకు గుర్వాజ్ఞ యవశ్యము కర్తవ్య మని దశరథుఁడు భావించును. ఈ నాటకమున

1. ఛాయా॥ దినకరకిరణోత్కరః ప్రియాకరః కోఽపి జీవలోకస్య।
కమలముకుళాంకపాళీకృతమధుకరకర్షణవిదగ్ధః॥

వసిష్ఠుఁడు తుదియంకమునఁ జివరఁ గాని రాడు. వామదేవముఖమున నిక్ష్వాకుకులధర్మమును జెప్పి రాజునకు హెచ్చరికఁ జేయఁ గోరును. మురారి యిట తననాటకమున నవకాశము దొరకినపుడెల్ల గురుభక్తినిగూర్చిన యంశముల నన్నింటి తత్తదుచితపాత్రలకుఁ గల్పించి యుదాత్తముగా వీరి శీలములఁ జిత్రించుచున్నాఁడు దశరథుఁడు పరోక్షమున నున్న వసిష్ఠగురుసందేశమును శిరసా వహించి, నిజముగ తన కా గురునియెడలఁ గల భక్తివిశేషమును నిష్కపటహృదయమున వెలిబుచ్చుచున్నాఁడు. ఎదుట ప్రశంసించుటకన్న పరోక్షమున నొకనిగూర్చినయభిప్రాయమే చొక్కమైనది కదా. వామదేవుఁడును వసిష్ఠమాహాత్మ్యమును గొనియాడును. వసిష్ఠుఁడు దశరథునకుఁ బంపిన సందేశములో 'గృహాత్ప్రతినివర్తంతే పూర్ణకామాయదర్థిన' యను వాక్యమే యిట ముఖ్యము. వచ్చిన యాచకులు పూర్ణకాములై తిరిగిపోవుచుందు రని యట్లు వచ్చినవారికోర్కెల నెల్ల తీర్చుటయే యిక్ష్వాకుకుల ధర్మమని చెప్పి పంపుట నాటకీయముగా చాల యుపయోగపడుచున్నది. ముందు రాబోవు విశ్వామిత్రుఁడు శ్రీరామలక్ష్మణులఁ దనవెంటఁబంపఁ బ్రార్థించు ప్రార్థనను వ్యర్థముచేయక పూరింపుమని హెచ్చరించునట్లయినది. ఇక్ష్వాకుల ధర్మము కాళిదాసునుడులలోఁ గూడ 'ఆజ్ఞాం గురుణాం హ్యవిచారణీయా' యని రఘువంశకావ్యమున నుడువబడినది. వెంటనే ప్రతీహారి విశ్వామిత్రాగమనముఁ దెలుప దశరథవామదేవులు మిక్కిలి హర్షింతురు. వామదేవుఁ డెదుర్కొని తగినసత్కారముతోఁ దోడ్కొని వచ్చును. విశ్వామిత్రవామదేవుల సంభాషణము పరస్పరకుశలప్రశ్న మయినను హృద్యము. వారు దశరథునిగూర్చి యెంతయో యుదారముగ నుడువుదురు. విశ్వామిత్రుని జూడగనే దశరథుఁడు నభివాదన మొనర్చి మునిరాకకుఁ గారణ మడుగుటయు, విశ్వామిత్రుఁడును దశరథుని బ్రశంసింప, నా రాజు వినయమున మహాప్రపత్తితో 'నాసీరపూరకేణ పదాతిపరమాణునా మయా'

అని తనయల్పత్వమునే పెద్దలయెడఁ దెల్పుకొనును. ఇట దశరథుని నిరహంకృతి యవికత్థనము తెలియుచున్నది. విశ్వామిత్రుఁడు యజ్ఞదీక్షనున్న తనసన్నిధిని రాముఁడు సాయుధుఁడై కొన్నిదినములుండ దశరథుని గోరును. దశరథుఁడు సుంత విచారమంద విశ్వామిత్రుఁడు రాజునకు మమకారము వలదనియు, కుండలముల మోయుట, అందుకై వేధ నొందుట చెవులకును, అలంకారమగుట కపోలమునకునైనట్లు రాముని కని పెంచుట మాత్రమే దశరథునకును తక్కినప్రయోజనము లన్నియు తమవంటివారికే ననియు జమత్కారముగ నీశ్లోకరూపమున నుడువును.

'కష్టా వేధవ్యథా కష్టో నిత్యముద్వహనక్లమః।
శ్రవణానామలంకారః కపోలస్య తు కుండలమ్॥'

(అంకము 1. శ్లోకము 40.)

దశరథుఁడు రాముని బంపువిషయమున చెంతనున్నవామదేవునితో విన్నవింప నాతఁడును వసిష్ఠుఁడు సమాధియం దీవిషయమునే యెరింగి అర్థికామములఁ బూరింప సందేశ మంపియుండునని తెల్పి యనుమతించును. దశరథుఁడును విశ్వామిత్రునికోర్కెఁ దీర్ప రామలక్ష్మణులఁ బిల్వ నంపును. రామలక్ష్మణులు విశ్వామిత్రుని జూచి యాతని మహిమను గొనియాడి పిత్రాజ్ఞచే విశ్వామిత్రునకుఁ బ్రణమిల్లుదురు. విశ్వామిత్రుఁడు సాక్షాద్విష్ణువే నాల్గు కళాంశములతో దశరథునింట రామాదులుగ నవతరించెనని నుడువును. వామదేవుఁడు రామలక్ష్మణులతో విశ్వామిత్రుఁడు వారిని గొంపోవచ్చియున్నాఁ డన రామలక్ష్మణులు 'యదభిరుచి తం భవతే, తాతాయ చ' యని పెద్దలయనుమతిని గోరుటయు నా ప్రకారము చేయుటయు నను సచ్ఛీలమును జూపుదురు. వామదేవుఁడును వారిని విశ్వామిత్రున కప్పగించును. అత్తరి నేపథ్యమున శంఖధ్వని వినవచ్చును. మురారికి శకున

శాస్త్రజ్ఞానముగూడ గలదు కాబోలు. శుభకరమగు శంఖధ్వని రామలక్ష్మణులకు శుభము గలుగఁ గలదని సూచించుట కిట నద్దానిని నాటకమునఁ జొప్పించెను.

దశరథుఁడు రామలక్ష్మణులఁ జూచుచు కంఠస్తంభితబాష్పవృత్తి కలుషుఁడై విశ్వామిత్రునితో నేమో చెప్పఁబోయి 'భగవ ' అని యర్ధోక్తినే నిలువును. ఇట దశరథునిమనోభావము చాల రసవంతముగ నాటకోచితముగ నిర్వహింపఁబడినది. వామదేవుఁడు విశ్వామిత్రుని బయలుదేరు మని 'శివాస్సంతుపంథానః' అని వారికి మార్గము క్షేమంకరముగ నుండు గాక యని యాశంసించును, అభిజ్ఞానశాకుంతలమున కాళిదాసుడు కూడ నీ వాక్యమునే నుడివియున్నాడు. పెద్దలయాచార మిది. ఇప్పటికిని శిష్టాచారమున నిలువీడి బయలుదేరునపుడు వెడలువారిని గూర్చి 'శివాస్సంతు పంథానః' అని చెప్పుట వాడుకలోఁ గలదు. రామలక్ష్మణులు విశ్వామిత్రునితో వెడలుదురు. దశరథవామదేవులు రాముఁడు కౌశికునెడ నెంతమాత్రము క్రొత్త లేక చనవున మెలఁగుట నెద్దియో యకారణ బాంధవ్యము వారికిఁ గల దనుకొందురు. రత్నాకరమున జనించియు సహజాతములైన అమృతాదులున్నను చంద్రుఁడు కుముదబంధు వని పిలువబడుటలో నా సంబంధము నిర్వ్యాజము, అట్లే దశరథకుమారుఁడై వసిష్ఠవామదేవాది శిక్షితుఁడైనను రాముఁడు విశ్వామిత్రునెడ నిర్వ్యాజసంబంధమును గలిగియున్నాఁ డనుకొందురు. అవల దశరథుఁ డును కౌసల్య నోదార్ప నేగును. అందరు నిష్క్రమింతురు.

ఈ దశరథవామదేవవిశ్వామిత్రసల్లాపమున పెద్దలగోష్ఠి, సదాచారము, వినయోక్తులు మున్నగువానిని తెలుపుచు పాఠకుల కనుసరణీయములగు నంశములగూర్చి యాదర్శశీలముల నిట మురారి చిత్రించినాఁడు.

ఈ యంకమున వసిష్ఠుఁడు దశరథాస్థానమున లేనట్లు మూలమునకన్న భిన్నముగ నుడువఁబడినది. మూలరామాయణమున,

'అథ రాజా దశరథస్తేషాం దారక్రియాం ప్రతి।
చింతయామాస ధర్మాత్మా సోపాధ్యాయః సబాంధవః॥ 36

తస్య చింతయమానస్య మంత్రిమధ్యే మహాత్మనః।
అభ్యాగచ్ఛన్మహాతేజా విశ్వామిత్రో మహామునిః॥ 36

....

వసిష్ఠం చ సమాగమ్య కుశలం మునిపుంగవః।
ఋషీంశ్చాన్యాన్ యథా న్యాయం మహాభాగానువాచ హ॥ 46

(బాలకాండ-అధ్యాయము 18.)'

అని దశరథుఁడు సోపాధ్యాయుఁడై కుమారులకు దారక్రియావిషయము విచారించుచుండ విశ్వామిత్రుఁడు వచ్చినట్లు, రాజును కుశల మడిగి వసిష్ఠుని నితర మునులనుగూడ కుశల మడిగినట్లు పైశ్లోకములవలనఁ దెలియుచున్నది. మురారి ఇట్టి మార్పు దశరథునికి గురువగువసిష్ఠుఁడు పరోక్షమున నున్నను. నాతనియెడఁ గల భక్తివిశేషమును వెల్లడిచేయుటకై కల్పన చేసియుండవచ్చును.

ద్వితీయాంకమున విశ్వామిత్రాశ్రమమున జరిగినవృత్తాంత మంతయు వర్ణింపఁబడినది. అంకారంభమున విశ్వామిత్రశిష్యుఁడు శునశ్శేఫుఁడను వాఁడు ప్రవేశించి పున్నమరేయి ప్రభాతకాలమును వర్ణించును. ప్రాభాతికవర్ణనము స్వభావోక్త్యలంకారవిలసితముగ ప్రకృతివర్ణనమై యలరారుచున్నది. విష్కంభమున నీ శునశ్శేఫుఁడు సమిదాహరణమునకు బయలుదేరి పశుమేధ్రుఁ డను మరొకసతీర్థ్యునితో సంభాషించుచు రామలక్ష్మణులు సిద్ధాశ్రమమునకు వచ్చిరనియు, విశ్వామిత్రుఁడు దివ్యాస్త్రమంత్రముల బలాతిబలలను రామున కుపదేశించినట్లును, రామప్రభావమున నహల్య శాపవిముక్తయై నిజరూపముఁ దాల్చెననియు,

వాలి యింద్రవైరియగు రావణాసురునితో మైత్రి నెరపుటచే నది క్షేమంకరము కాదని చంద్రశేఖరు నుదాహరణముగ నుడివి, వృద్ధమంత్రియగు జాంబవంతుఁడు హితము గరపినను వాలి యాహితోక్తులు జరాప్రలపితములని పెడచెవిని బెట్టుటచే హనుమదాదులు సుగ్రీవునితో ఋశ్యమూకమున నున్నారనియు, వాలి సహాయార్థము ఖరధూషణాదులను రావణుఁ డంపెననియు నా సైన్యమునుండి తాటకయను రక్కసి యా యాశ్రమమునకు వచ్చియున్నదనియు నీ వృత్తాంతమును సర్వమును గురువగు విశ్వామిత్రుఁడు సమాధిమయచక్షువుచేఁ దిలకించి తన కయోధ్యాయాత్రాసమయమున సుడివెనని వృత్తవర్తిష్యమాణకథాంశములఁ దెలియఁజేయును. ఇందు జాంబవంతుఁడు వాలికి హితము గరపుట, ఆ హితము వినకపోవుటచే హనుమదాదులు సుగ్రీవునితో ఋశ్యమూకమున కేగ ననుజ్ఞ యిచ్చుట మున్నగునవి కవికల్పితములు. ఇట రావణునెడ ప్రీతిగొనుట సర్వథా అసర్థప్రద మని జాంబవంతుఁడు వాలికి బోధించు సందర్భమున నుడివినశ్లోకమెంతయుఁ జమత్కారముగాఁ గూర్పబడినది.

'ఉక్షా రథో భూషణమస్థిమాలా,
భస్మాంగరాగో గజచర్మ వాసః।
ఏకాలయస్థేఽపి ధనాధినాథే
సఖ్యౌ, దశేయం త్రిపురాంతకస్య॥' (అంకము 2. శ్లోకము 7.)

అని శివుని దారిద్ర్యము నుదహరించియున్నాఁడు. వాహనమా ఎద్దు, అలంకారమా అస్థిమాల, మైపూతయా భస్మము, వస్త్రమా గజచర్మము-మిత్రుఁడైన కుబేరుఁడు నొకేయింట నున్నను త్రిపురాంతకునిదశ యిట్టి దనును. మూలరామాయణమున సుగ్రీవుఁడు ఋశ్యమూకమున కేగుటకు కారణ మన్యథా నుడువఁబడినది. వాలిసఖ్యము రావణుఁ డపేక్షించుట, ఆ కారణమున వాలి రాము నెదరుర్కొన సమ్మతించుట మహావీరచరితమున

భవభూతి కల్పించెను. ఈ విషయ మా మహావీరచరితమునుండియే గ్రహించియుండ నోపు. రాబోవు వాలిసుగ్రీవృత్తాంతమును, విశ్వామిత్రుఁడు సమాధిమయచక్షువుచేఁ దిలకించెనని నుడువుటచే ఋషీశ్వరు లా నా డట్టి దివ్యమహిమాసమన్వితులై యుండి రని గురుమహిమల నీ రూపమున మురారి యప్పు డప్పుడు తెల్పుచునే యుండును. ఈ పాత్రల నామకరణమున శునశ్శేఫుఁడనియు, పశుమేఢ్రుఁ డనియు, నశ్లీల శబ్దములఁ బేర్కొనుటలో మురారియభిప్రాయ మేమైయుండునో తెలియరాకున్నది. వీరిలో శునశ్శేఫుఁడు మేధావి, సచ్ఛాత్రుఁడు. పశుమేఢ్రుఁడు మందబుద్ధి.

రామలక్ష్మణులు సిద్ధాశ్రమమును విచిత్రముగా తిలకింతురు. ఆశ్రమ వాసులు శ్రౌతస్మార్తకర్మపరాయణులుగా నుండుట తిలకించి యా ఋషిసముదాయమును జూడ మిక్కిలి కుతూహలపడుచు నాశ్రమప్రాంత మంతయు దిరుగుదురు. వనములందు మున్యాశ్రమములందు శాంతము తాండవించుచున్నట్లు గుర్తింతురు. లక్ష్మణుఁ డొక జింక తన్ను బెదరింప మునిపత్నులచే పైకెత్తఁబడ్డదండమును నిశ్శంకముగ నిక్షుదండ మని వాసనచూచుచుండ మును లందరు నవ్వుటఁ గాంచి యచ్చటిమృగముల విశ్వాసాతిశయమున నాశ్రమప్రశాంతిని గుర్తించును. మనబోటివారికి కోపముగాక యత్తరి శాంతియుండునా! మరియు నాశ్రమమున నాలవాలములందు పిల్లకాల్వలలో నీరు ప్రవహించుట కేరళకామినీచికురములవలె వంకరవంకరగా నున్నదని రాముఁడనును. ఇట మురారి లోకజ్ఞానము వెల్లడి యగుచున్నది. ఈ విధముగ పదునాల్గు శ్లోకములలో రామలక్ష్మణులు సిద్ధాశ్రమమును వర్ణింతురు. తెరలో రాముని యజ్ఞవిధియందు సన్నిధి నుండఁ గోరినట్లు విని, రామలక్ష్మణులు విశ్వామిత్రసన్నిధి కేగుచు మధ్యాహ్నకాలమును వర్ణించుచు మునిచర్యలను

దిలకించి వానప్రస్థుల నుద్దేశించి వారి జీవనపద్ధతిని రాముఁడు సకుతుకమున నిట్లు వర్ణించును,

'వారాంస్త్రీనభిషుణ్వతే విదధతే వన్యాశ్శరీరస్థితీ
రైణేయ్యాం త్వచి సంవిశంతి వసతే చాఽపి త్వచం తారవీమ్।
తత్పశ్యంతి చ ధామ నాభిపతతో యచ్చార్మణే చక్షుషీ
ధన్యా వీతరజస్తమా భగవతీ చర్యేయమామోదతే॥'

(అంకము 2. శ్లోకము 29.)

మును లా యాశ్రమమున త్రికాలము స్నానము చేయుదు రనియు, కందమూలాదులగు వన్యములచేతనే జీవింతురనియు, వల్కలముల వసనములుగను, కృష్ణాజినముల నాసనములుగ నుపయోగింతు రనియు, చర్మచక్షువులకు గోచరింపని బ్రహ్మపదమును జూతురనియు నట్టివారిచర్య పూజనీయ మనియు నుడువును. మురారి కిట్టి జీవనము అభిమతమని తెలియుచున్నది. సాయంకాలమగును. విశ్వామిత్రప్రభావమును కొనియాడుచుఁ గ్రమముగ సన్నిధిఁ జేరి యభివాదన మొనరింతురు. అత్తరి విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులఁ గొంచెము ప్రశంసించుచు.

'యువాభ్యామభినిర్వృత్తయోగక్షేమస్య వజ్రిణః।
ఐశ్వర్యప్రక్రియామాత్రకృతార్థాః సంతు హేతయః॥'

(అంకము 2. శ్లోకము 41.)

మీ యిరువురిచేతను ఇంద్రునకు యోగక్షేమములు నిర్వర్తింపఁ బడుచుండ నాతని వజ్రాయుధాద్యాయుధము లైశ్వర్యద్యోతకములు మాత్రమగుఁ గాక యని నుడివి నపుడు క్షీరకంఠులైనను నాత్మస్తుతి సైపఁ జాలక యధోముఖులై మిన్నకుందురు. ఇందు రాముని మహానుభావలక్షణము తెలియుచున్నది.

రామలక్ష్మణులు సాయంకాలమును సూర్యాస్తమయమును వర్ణింతురు. లక్ష్మణనాక్యములు,

"తేజోమయం తమోమయమన్యతరస్యాం తదేవ దిక్చక్రమ్।
కిమపి విచిత్రా ధాతుస్సృష్టిరియం భువనకోశస్య॥"

(అంకము 2. శ్లోకము 50.)

ఒకసమయమున ప్రకాశస్వరూపముగనున్న యీ దిఙ్మండలమే మరొకసమయమున నంధకారస్వరూముగ నగుచున్నది. బ్రహ్మయొక్క యీ జగత్సృష్టి కడుంగడు విచిత్రము. అని నుడువును. ఈ శ్లోకము కాళిదాసుని శాకుంతలమందలి.

"యాత్యేకతోఽస్తశిఖరం పతిరోషధీనా
మావిష్కృతోఽరుణపురస్సర ఏకతోఽర్కః।
తేజోద్వయస్య యుగపద్వ్యసనోదయాభ్యాం
లోకో నియమ్యత ఇవాత్మదశాంతరేషు॥"

(అంకము 4. శ్లోకము 2.)

అను శ్లోకమును స్మరణమునకుఁ దెచ్చుచున్నది. ప్రకృతివర్ణనములన్నియు మురారి స్వభావసిద్ధముగ నుండునట్లు వ్రాసెను. ఇవి యిట నాటకమునకన్న శ్రవ్యకావ్యమున నెంతో మనోహరముగ నుండునని తోచెడి. భవభూతివలెనే యీతఁడును అనవసరముగ నాటకకథాగమనమును లెక్కింపక దీర్ఘకాలము విసుగు పుట్టించు వర్ణనములు చేయును. అవి కథావిషయమున కనుకూలించునట్లును తోఁపదు. కేవలపాండిత్యప్రకటనార్థమే యిట్టి రచనల సాగించియుండు నని తోఁచుచున్నది. ఈతనియూహ చాల గొప్పది. రాత్రివర్ణనమున నీతని పోకడలు నూతనములు. ఈతని భావములు అనన్యవర్ణితములు.

తాటక, సుబాహుమారీచులు భయంకరముగ వచ్చి హోమస్థలముల రక్తవర్షము కురిపించుచున్నారని మునులు మొరపెట్టుకొందురు. విశ్వామిత్రుఁడు రాముని ధనువు గ్రహించి తాటకను నిగ్రహింపు మని నుడివినను రాముఁడు స్త్రీయని కొంత శంకించుచుండ విశ్వామిత్రుఁడు మరల హెచ్చరిక చేయును. లక్ష్మణుఁడు రాముఁ దూరకుండుటకు మనమున కొంచెము నొచ్చుకొని తనలో నిట్లనుకొనుచున్నాఁడు

'మీమాంసతే కిమార్యోఽయం కౌశికేఽప్యనుశాసతి।
వాచమేషాం ఋషీణాం హి శాస్త్రమేవానువర్తతే॥'

(అంకము 2. శ్లోకము 58.)

ఈ యార్యుఁడు (రాముఁడు) కౌశికుఁ డాజ్ఞాపించినను ఏలొకో మిన్నక విచారణము సేయుచున్నాఁడు. ఈ ఋషీశ్వరుల వాక్కును శాస్త్రమే అనువర్తించును గదా! యనును. ఈ శ్లోకమునందలి ద్వితీయార్థము భవభూతినుండి గ్రహించినదే. భవభూతి ఉత్తరరామచరితమున 'ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోఽనుధావతి' యన్న వాక్యభావమునే మురారి ఉక్తిభేదమున నుడివినాఁడు. అత్తరి రాముఁడును యోచించును. ఇప్పట్టున మురారి గురుభక్తిని పరిపూర్ణముగ జూపినాఁడు. రామునిమనమున తాటకాసంహారము గుర్వాజ్ఞయే యైనను స్త్రీవధ యని తొలుత శంకించి యవల గురువాక్యములే ధర్మప్రమాణము లని నిశ్చయించి తాటకను వధించును, రాముఁ డేమనుచున్నాఁడో చూడుఁడు,

'గుర్వాదేశాదేవ నిర్మీయమాణో నాధర్మాయ స్త్రీవధోఽపి స్థితోఽయమ్।
అద్య స్థిత్వా శ్వో గమిష్యద్భిరల్పైర్లజ్జాస్మాభిర్మీలితాక్షైర్జితైవ॥'

(అంకము 2. శ్లోకము 59.)

గుర్వాదేశమువలన కర్తవ్యముగా నీ స్త్రీవధము సంప్రాప్తమైనను నేడిటనుండి రేపు వెడలిపోవు నల్పులమగు మనము కన్నులు మూసికొని

యీ కార్య మిట చేయుటచే నిర్లజ్జుల మగుచున్నా మని మనమున నెంతయో చింతించును, శూరులగు మహారాజు లిట్లు స్త్రీవధ గావించిన తన్ను జూచి యేమందురో యని సిగ్గుపడుచు మిన్నకుండును. అధర్మాచరణమునకు రామునిమన మెన్నడును పోదు. గుర్వాదేశమైనను రాముని మనస్సు కృత్యా కృత్యవిచారణము సల్పి యొక నిర్ణయమునకు వచ్చును. ఇటువంటి యకృత్యములవలె గోచరించు కృత్యములఁ జేయ నియమించియే గురువులు శిష్యహృదయమును బరీక్షింతురు. రాముఁడెట్టి నిర్ణయమునకు వచ్చెనో చూతము. మరియు,

"దీర్ఘం ప్రజాభిరతికౌతుకినీభిరాభి
రస్మిన్నకీర్తిపటహే మమ తాడ్యమానే।
జ్యోతిర్మయేన వపుషా జగదంతసాక్షీ
లజ్జిష్యతే కులగురుర్భగవాన్ వసిష్ఠః॥"

(అంకము 2. శ్లోకము 60.)

యని వితర్కించును. నిజముగ గురుభక్తుఁడగు రాముఁడు నుడువదగినశ్లోకమే.

బహుజల్పకౌతుకమగు ప్రజానీకము తాటకాహననరూపమగు నపకీర్తి ఢక్కను సుదీర్ఘము వాయించు ననియు నంతియుకాక కల్పాంతస్థాయియు నక్షత్ర రూపశరీరమున జగదంతసాక్షియు కులగురువు నగు వసిష్ఠభగవానుఁడు రాముఁడిట్టి స్త్రీవధ గావించి యకీర్తిభాజనుఁ డాయెనే యని సిగ్గుపడునని తలంచి తా నపకీర్తిపాలగుట తగదనియుఁ జింతించి తుదకు మునులు నిరాశులై ఖడ్గధారకు బలియై స్వర్గము సులభముగ నంద సిద్ధులగుచుండ రోష మూని పుణ్యపాపములకు గురువాక్యములే ప్రమాణము లని తాటకను సంహరించును. ఇప్పట్టున మురారి గురుకులక్లిష్టత శైష్యోపాధ్యాయిక వృత్తియు స్పష్టముగ వ్యక్తమగుచున్నది. గురుకులమున నెట్టి శిక్షణము

నొందెనో యీ ఘట్టమే ప్రమాణము, లోకోపకారకమైన కృత్యమైనను, ధర్మవిరుద్ధమగు కార్య మాచరించుపట్ల మనసు చింతించుచున్నది. ఒకవైపు గురువాక్యగౌరవము. మరొకవైపు ధర్మచింత. రాముఁ డరణ్యమున సిద్ధాశ్రమమున నెటనో అయోధ్య కెంతో దూరమున స్త్రీవధ గావించునపుడును జ్యోతిస్స్వరూపుఁడగు నిజకులగురువు వసిష్ఠుఁడు తన సేతల జగదంతసాక్షియై తిలకించి సిగ్గిలు నని తా నా కార్యముఁ జేయ జంకును. పరోక్షమందైనను అకృత్యాచరణము సల్పునపుడు గురుస్మరణము గలిగి విచక్షణతో ప్రవర్తించుట గొప్పశిక్షణము కదా. రాముఁడు లోకకంటక యగు తాటకను సంహరించె నని నుడివినను కథ సాగిపోవును కాని మురారి గురుకుల క్లిష్టుని మన సెట్లు ప్రవర్తించునో యను నంశము ప్రతిపాదింపఁ గోరియే యీ సందర్భమున నింత గురుభక్త్యతిశయమున రామునిశీలమును చిత్రించినాఁడు. ఇప్పట్టున,

'యస్య దేవే పరా భక్తిర్యథా దేవే తథా గురౌ।
తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥'

అను శ్వేతాశ్వతరోపనిషద్వాక్యము స్మరణీయము. దేవునియందువలె గురువు నందు నెవ్వనికి భక్తివిశేష ముండునో అట్టి మహాత్మునకు సకలార్థములును గోచరించు నను తత్త్వ మీ రామునిపట్ల యథార్థము. వసిష్ఠుని 'భగవాన్ వసిష్ఠః' యని దైవముగనే భావించెను. కావుననే సకల రాజేంద్ర మౌళిమకుటాయమానుఁడై నిర్నిద్రమగు కీర్తి నాచంద్రతారార్కముగ నీ రాముఁడు గుర్వనుగ్రహమునఁ నొందఁ గలిగెను. గురుశిక్ష కట్టి ప్రభావము గలదు, జగన్నాథపండిత రాయలు.

'గీర్భిర్గురూణాం పరుషాక్షరాభిస్తిరస్కృతా యాంతి నరా మహత్త్వమ్।
అలబ్ధశాణోత్కషణా నృపాణాం న జాతు మౌళౌ మణయో భవంతి॥'

యని భామినీవిలాసమున గురుశిక్షితుఁడైనవాఁడే మహత్త్వము నందు నని సానపెట్టబడినమణులే నరేంద్రమౌళి నధిరోహింపగలవను నుదాహరణమునఁ దెల్పియున్నాఁడు. గురుశిక్షణప్రభావ మిట్టిదని తెలియజేయు నుద్దేశముతోడనే మురారి యిట్లు రామపాత్రమును, నాతని మనస్తత్త్వమును జక్కగ నిరూపించుచుఁ జిత్రించినాఁడు.

తాటకను జంపినతర్వాత కూడ విశ్వామిత్రుఁడు రాముని బ్రశంసించినపుడు సవ్యైలక్ష్యముగ,

'పూషా వసిష్ఠః కుశికాత్మజోఽయం
త్రయస్త యేతే గురవో రఘూణామ్।
మహామునేరస్య గిరా కృతోపి
స్త్రైణో వధోఽయం న సుఖాకరోతి॥'

(అంకము 2. శ్లోకము 67.)

సూర్యభగవానుఁడు, వసిష్ఠుఁడు, విశ్వామిత్రుఁ డను నీ ముప్వురే రఘుకులమునకు గురువులు. మహామునియగు నీ కౌశికునివాక్యానుసార మాచరింపఁ బడినను నీ స్త్రీవధము సుఖదముగ లేదనును. సుఖదుః ఖాత్మకముగ నున్నదని భావము. ఇట గుర్వాజ్ఞానిర్వహణమున సుఖము, స్త్రీవధమని దుఃఖము. రాముని హృదయపరిపాక మట్టిది. ఇది యంతయు గురుకులక్లిష్టుఁడగు సచ్ఛాత్రుని హృదయావేదనము. ఇట్టి శిక్షణము నిరూపించుటలో మురారి యద్వితీయుఁడనుట నిస్సంశయము. రాముఁ డాశ్రమమును జూచి హర్షించుచు 'ప్రత్యాసన్న తుషారదీధితికర' యను శ్లోకమున కేవలము మురారి వైదికదృష్టియే గోచరించుచున్నది. అవల రామచంద్రుఁడు పదునారుశ్లోకములతోఁ జంద్రుని చమత్కారముగా క్రొత్తయూహలతో వర్ణించును. ఈ చంద్రవర్ణన మిట ననవసరము. నాటకమునకు వలసిన గమనము కుంటువడుచు నీ చంద్రవర్ణనము

అనుచితముగ గాన్పించుచున్నది. మొత్తముమీఁద నీ మురారి రంగస్థలమున ప్రధానకథకన్న నితరాంశములకే యీ యంకమునఁ బ్రాధాన్య మొసఁగి నాటకీయతత్త్వమునకు దూరమైనాఁడు. ఈ యంకమున కొంత యాశ్రమవర్ణనము, ప్రకృతివర్ణనము, చంద్రవర్ణనము మున్నగువానితోడనే యెక్కువగా నిండి చలనము తక్కువయై కథ సాగినది. శైష్యోపాధ్యాయికవృత్తి. సచ్ఛాత్రమనస్తత్త్వము మున్నగు నుత్తమవిషయములు వర్ణింపఁబడినను నాటకదృష్టిని జూడ నీ యంకమున కథాగమనము మందముగనే నిర్వహింపఁబడినది. అవల విశ్వామిత్రుఁడు జనకుని బ్రశంసించుచు నతడు మిథిలయందుఁ గలఁ డన, రాముఁడును గుతూహలమున మిథిలయం దాశ్చర్యద్వయమగు, శివధనువును, అయోనిజయగు సీతను గూర్చి యడుగును. విశ్వామిత్రుఁడును రామునికౌతుకమునకు సీతనుగూర్చి తెలియఁ గోరుచున్నాఁడని గ్రహించి నవ్వి కార్య శేషమును ముగించుకొని మిథిల కేగుద మని యట్ల చేయుదురు. కుమారదశయందే రాముఁడు తాటాకావధరూప విక్రమమును జూపుటచే నీయంకమునకు కౌమారవిక్రమ మని పేరిడఁబడెను.

తృతీయాంకమునఁ గలహంసికాకంచుకులు ప్రవేశించి రామలక్ష్మణులు విశ్వామిత్రశతానందులఁ గొల్చుచు వేదికపై నున్నా రనియు, శౌష్కలుఁడు సీతను రావణున కిమ్మని జనకుని గోరినట్లును నద్దాన సీత దుర్మనాయమానయై యున్న దనియు, బొమ్మపెండ్లిండ్లు సేయుట కూడ మానిన దనియుఁ దెలియఁజేయుదురు. కంచుకి 'సర్వం భద్రం భవిష్యతి దేవబ్రాహ్మణానుగ్రహాత్' అని కలహంసికతో రామలక్ష్మణులఁ జూచుభాగ్యము తమకుఁ గలుగునా యనినపుడు నుడివినవాక్యములు మురారికిఁగల దేవబ్రాహ్మణభక్తిని వ్యక్తముఁజేయుచున్నవి. ఆ కాలమునఁ బ్రజలకుఁగూడ దేవబ్రాహ్మణానుగ్రహము శ్రేయోదాయక మను సదభిప్రాయ

ముందెడి దని తెలియుచున్నది. ఆ కాలమున దేవబ్రాహ్మణులును నట్టి శక్తిమంతులుగనే యుండెడివారు కాబోలు. మరియు రావణుఁడు సీతను బెండ్లాడఁ గోరెనని కలహంసిక నుడివినపుడు కంచుకి శివధనుర్భంగ మెంతటి బలశాలికి నంతరాయముగ నున్నదనియు, నొకవేళ దశకంధరుఁడు బలాత్కారము చేసినను జనకుఁడు లొంగి సీతాపరిణయవిషయమున, 'సః దశకంధరానురోధేన స్వయం ప్రతిజ్ఞామన్యథా కరిష్యతి మహాక్షత్రియో విదేహరాజః' అని రావణ బలాత్కారమునఁ గూడ జనకుఁడు నిజప్రతిజ్ఞకు భంగము కలుగనీయఁ డనియు తనమాటనిలఁబెట్టుకొనుననియు నుడువును. ఆ కాలమున ప్రజలు రెండు నాల్కలు గలవారు కారనియు నెంతటి క్లిష్టపరిస్థితులలో నైనను నాడినమాట తప్పరనియు నాటిసాంఘికాచారము గోచరించుచున్నది.

జనకవిశ్వామిత్రులు పరస్పరము సల్లాపము లాడుచు శిష్టాచారరీతిని మధురముగ ప్రీతివ్యంజకముగ నెన్నియో విషయములఁ దెలుపుదురు. వీరు పరస్పరము ప్రశంసించుకొనుటయు రమణీయముగా నున్నది. రామునిగూర్చి నుడువునపుడెల్ల నాతఁడు విష్ణ్వంశసంభూతుఁ డనియే యుదాత్తముగ నుడువును. రామునిఁ జూచినంతనే జనకుఁడు కృతార్థుడైనట్లు భావించును. మురారి రామునంతటి రూపలావణ్యశౌర్యధైర్యాద్యుత్తమ గుణవంతునిగాఁ జిత్రించెను. జనకుఁడు జానకిని రామభద్రున కీయ నిచ్చగించియు ధనురారోపణరూపపణ మంతరాయముగ భావింప విశ్వామిత్రుఁడు రామపక్షపాతమున రామునకు 'నకించిదేత' త్తని యంతరాయమే కాదనియు, రామునకు సుగమమే యనియు వ్యంగ్యముగఁ దెల్పును. అవల శతానందుఁడు తాటకారియైన రాముఁ డవలీలగ నారోపింపఁగలఁ డనును. ఇంతలో రావణపురోహితుఁడు శౌష్కలుఁడు వచ్చును. ఈ రావణపురోహితాగమనము మహావీరచరితమున

మాయామయాగమనమును బోలియున్నది. శౌష్కలుఁడు జనకునితో సంభాషించుచు రావణుని బ్రశంసించును. లక్ష్మణుఁడు 'ఆర్య, కథమసౌ సహస్రార్జునవాలిభ్యామవలీఢశౌర్యసారో దురాత్మా రావణః ప్రస్తూయతే' (ఆర్యా! కార్తవీర్యార్జునునిచేతను, వాలిచేతను తిరస్కృతమైన శౌర్యబలముగల యీ దురాత్ముఁడైన రావణుఁడు స్తుతింపబడుచున్నాఁడే! ఎందులకు!) యని రామునితో ననును. రాముఁడు మహాపురుషుఁడు గాన నట్లు రావణుని దూర రా దనియు నాతఁడు మహాత్ముఁడనియు, కపీంద్ర హైహయపతులచేఁ బరాజితుఁడైనను నాతనిస్కంధప్రతిష్ఠ గొప్ప దనియు మిగులఁ గొనియాడి నిజోదారగుణమును జాటును. శౌష్కలుఁడు రావణుని శ్లాఘించుచు జనకునితో మైథిలిని లంకాధిపతి కిమ్మనును గాని శతానందుఁడు పణమును దెల్పి నిర్వహించినవానికే సీతను జనకుఁ డిచ్చు నని రూఢిగఁ దెల్ప రావణున కది యల్పమని సీతను బెదరించును. ఇంతలో శతానందానుమతిని రాముఁడు ధనువు నెక్కుపెట్ట నదియు భగ్నమగును, జనకాదులు హర్షించి సీతను రామునకు ఊర్మిళాదుల లక్ష్మణాదుల కీయ నిశ్చయింతురు. ఈ ఘట్టమున శౌష్కలాగమనము, రావణునికై సీత నతఁడు యాచించుట, రాముఁడు రావణుని గొనియాడుట మున్నగువిషయము లన్నియు మహావీరచరితానుకరణములే. మూలమున నీ రావణపురోహితాగమనకథయే లేదు. మహావీరచరితమున రావణపురోహితా గమనము, శివధనుర్భంగము మున్నగునవి యన్నియు సిద్ధాశ్రమముననే నిర్వహింపబడినవి. ఇందు మిథిలయందే యివి యన్నియు జరుగును. విషయము మాత్రము చాలవరకుఁ బోలియున్నది. రామశీలపోషణమునకై కవి యీ మార్పుఁ గైకొనియుండ నోపు. మరల ధనుర్భంగానంతరము దశరథాహ్వానము మూలానుసరణమే. కాని శతానందుఁ డా కార్యమునకై వెడలుట యిందలి మార్పు. జనకుఁడు కొందర దూతల నంపినట్లు మూలరామాయణమున

నున్నది. శౌష్కలుఁడు కోపమున నందర బెదరించుచు రామునిగూడ సీతను బెండ్లాడవలదని నుడువుచు నీ మిథిలావృత్తాంత మంతయు రావణమంత్రియగు మాల్యవంతున కెరిఁగింప నేగును. చాలవర కీ యంకగాథ మహావీరచరితానుకరణమే యననగును. ఈ యంకమున శివధనుర్భంగము ప్రధానాంశము గావున దీనికి పినాకభంగ మను నామ మెంతయు నొప్పుచున్నది.

చతుర్థాంకమున కథాభాగము చాలవరకు మహావీరచరితమందలి చతుర్థాంకమును బోలియున్నది. రావణపురోహితుఁడు మంత్రియగు మాల్యవంతునితో సంభాషించుట, ఇంతలో శూర్పణఖ సీతావివాహ నిర్వహణముఁ దెలియఁ జేయుట. మాల్యవంతుఁడు శూర్పణఖను మంథరాశరీరమునఁ బ్రవేశించి వరద్వయము కైకచే నడిగింపఁ బ్రేరేచుట, రాము నరణ్యములపాలు గావించి. సీత నపహరింపఁ దలంచుట మున్నగు నుపాయాన్వేషణము రెంటను దుల్యమే. కాని యిట శూర్పణఖ మంథరశరీరము నావేశించుట లేదు. జాంబవదాదేశమున శ్రమణ మంథరకాయప్రవేశ మొనర్చి మంథరాకార్యనిర్వహణము నల్పునట్లు మాల్యవంతుఁడు శూర్పణఖతో నుడువును. తాఁ దలచినయుక్తి జాంబవదా దేశమున నిర్వహింపబడుచుండ నద్దానిని తనయుపయోగార్థ మనుకూలింపఁ జేసికొనుట యందలి విశేషము. పరశురాముని శ్రీరామునిపైకి ప్రేరేచినట్లు మహావీరచరితమున నున్నది. కాని యిందు శూర్పణఖ, రాముఁడు శివధనుర్భంము గావించె నని భార్గవుఁడు విని రామునెడ మచ్చరముఁ గొని మిథిల కేతెంచి యున్నాఁ డని మాల్యవంతునితో విషయముమాత్రము తెల్పును.

ఈ యంకారంభమున మాల్యవంతుఁడు ప్రాతఃకాలమును వర్ణించుచు రాముని మహత్త్వమును రావణుని దౌష్ట్యమును దలపోసి రావణుఁడు

మనుష్యులను ధిక్కరించి యితరులనుండి భయము లేకుండునట్లు బ్రహ్మను వరము గోరుటఁ దలఁచి రామునివలన భయము శంకించును. 'అతిస్నేహః పాపశంకీ' యనునట్లు రావణక్షేమకాంక్షియైన యీ మాల్యవంతున కెందులకో పైయాలోచన గలిగినది. రావణుఁడు దుష్టుఁడైనను మాల్యవంతుఁ డు తనమంత్రి పదవికిఁ దగినట్లు గొప్ప యూహలతో నుత్తమశీలవంతుఁ డుగానే చిత్రింపఁబడుచున్నాఁడు. తనరాజగు రావణున కన్నివిధముల శ్రేయముఁ గూర్చు ప్రయత్నములు సేయుట యాతని ధర్మము. కావున నాతని నట్లు వర్ణించుటయే యుచితము. అందును సీతావిషయమున బలాత్కారమునఁ గాని సీతను రావణునకుఁ గూర్ప వలనుపడ దని శూర్పణఖ నుడివినపుడు మాల్యవంతుఁడు ప్రసహ్యాపహారము మహాదోషమని నుడువును. రావణపక్షపాతియైనంత నీతఁడును దౌష్ట్యమునకుఁ గడంగడు. కాని రాజ్యాంగవిషయధురీణుఁడౌట నుపాయాంతరముల నన్వేషించుటలో నీతని తెలివిఁ జూపుచు జాంబవంతునియుక్తిని తా నుపయోగ పరచుకొనఁ దలఁచి శూర్పణఖతో శ్రమణ మంథరాకాయము ప్రవేశించి మంథరాకృత్యము నిర్వహించు ననియు, తద్ద్వారా రాముఁ డరణ్యములఁ గ్రుమ్మరుచుండ సీతాపహరణము సుకర మనియుఁ దెల్పును. ఈ పన్నాగము మహావీరచరితమునందును, ఈ నాటకమునందును నివ్విధినున్నను కైక నిర్దోషిణి యని తెలియజేయుటకై యీ కవులిట్టి పన్నుగడల పన్నజేసి యా పాత్రలఁ జిత్రించి రనుకొననగును. మాల్యవంతుఁడు విశ్వామిత్రుని బరిహసించుచు త్రిజన్మయనుటయు మాల్యవంతునితెలివిని దెల్పుచున్నది. మురారి తనకుఁగల వ్యాకరణాభిమానమును తత్తత్పారిభాషికపదప్రయోగములచే వ్యక్తముచేయుచున్నాఁడు. ఇట 'స్థానివద్భావేన క్షత్రకార్యం న జహాతి' యని

విశ్వామిత్రుఁడు తొలుత క్షత్రియుఁడై తపోమహిమచే బ్రాహ్మణత్వము సిద్ధించినను స్థానియగు క్షత్రియత్వముపోలే దని యాతనికి హింసాదికక్షాత్రగుణము పోలే దనియు, క్షత్రియజాతికే పుట్టుకచేతను, ఉపనయనముచేతను ద్విజత్వముగలుగుచుండ మరల బ్రాహ్మణత్వమున త్రిజన్మత్వము కలిగె నని విశ్వామిత్రుని బరిహసించుచు నుడివిన మాటలు చమత్కారముగా నున్నవి. మరియు,

'అవినయభువామజ్ఞానానాం శమాయ భవన్నపి
ప్రకృతికుటిలాద్విద్యాభ్యాసః ఖలత్వవివృద్ధయే।
ఫణిభయభృతామస్తూచ్ఛేదక్షమ స్తమసామసౌ
విషధరఫణారత్నాలోకో భయం తు భృశాయతే॥'

(అంకము 4. శ్లోకము 12.)

విద్యాభ్యాసము అవినయప్రభవములగు నజ్ఞానములఁ బ్రశమింపజేయున దైనను బ్రకృతికుటిలుఁడగు నుపాధ్యాయునినుండి విద్యఁ బడయుట కేవలము ఖలత్వ వృద్ధికొరకే కాఁగలదు. లోకమున రత్నమువెలుఁగు నిబిడమగు నంధకారమును బోకార్ప నేర్పుగల దయ్యును నా రత్నము, పాముపడగనుండి పడయుట యన్న మిక్కిలి భయజనక మగును గదా, యని దృష్టాంతపూర్వకముగా మాల్యవంతుఁడు విశ్వామిత్రుని బరిహసించుచున్నాఁడు. అట్లయ్యును నిందలి లోకవృత్తము గ్రహింపఁ దగినది. సద్గురువునొద్దనే విద్యాభ్యాసము బడయవలయునను సత్సందేశము మురారి మనకుఁ దెలియజేయుచున్నాఁడు. ఇప్పట్టున మాల్యవంతుని తెలివి యెట్టిదో కాని మురారి మాత్రము సునిశితప్రజ్ఞుఁ డని చెప్పక తప్పదు. మాల్యవంతునకు రాజభక్తియు మెండు. సీతావిషయకప్రసహ్యోపహారమువలన రావణున కాతతాయిత్వము గల్గుట సైపఁ డాయె. 'ఆతతాయిన మాయాంతం

హన్యాదేవావిచారయ' న్నని రావణునకు నిరన్వయనాశము కల్గు[1]నని శంకించియే యందుల కొల్లఁడు.

మాల్యవంతుఁడు జాంబవంతుని దూరాలోచనమునుగూర్చి శూర్పణఖకుఁ దెల్పుచు శ్రమణను మంథరాశరీరమునఁ బరకాయప్రవేశమునఁ బ్రవేశించి రామవనవాసభరతపట్టాభిషేక రూపవరద్వయమును కైక లేఖమూలమునఁ బంపినట్లు మిథిలయందే రామునకా లేఖ నందించి మిథిలావృత్తాంత మరసి రమ్మనియు, నద్దాన రాముఁ డరణ్యములపాలై క్రమముగా సుగ్రీవసఖ్య మందఁ గలఁడనియుఁ, దద్వారా వాలిని నిగ్రహింపవచ్చు ననియు జేసిన యుపాయమును తా ననుకూల పరచుకొనఁ దలఁచి సీతాపహరణ మప్పుడు మాయచేఁ జేయఁ దలంచెను. మంత్రిపదవినున్న మాల్యవంతుని రాజనీతిజ్ఞత యిందుఁ దెల్లమగుచున్నది. జాంబవంతుఁడు పై పన్నుగడ పన్ని శ్రమణను మిథిలకుఁ బంపుట మంథరా శరీరమునఁ బ్రవేశించి రాము నరణ్యములపాలుసేయుట మున్నగు నీ విషయములు కవికల్పితములు. మూలరామాయణమున వరద్వయము కోరుట యయోధ్యయందే యని తెలియుచున్నది. అందులకు మాల్యవంతుని సంభాషణమున దశరథునిసన్నిధిని రాక్షసమాయలు సాగ వని కారణముఁ దెలుపును. శ్రమణను బంపుటలో జాంబవంతునియుక్తి కొనియాడఁదగినది. ఆదుదికావున శీఘ్రముగ నిట్టిదౌత్యమున సంశయింపఁ బడదనియు రామసఖ్య మపేక్షించి యిట్లాచరించినఁగాని రాముఁ డరణ్యమునకు రాఁడనియు, నాతని సంచారమును గమనించుచుండునట్లు శ్రమణను నియోగించుట ప్రశంసార్హము. కాని యిప్పట్టున శ్రమణకు కైకలేఖ యెట్లు లభించె ననికాని, మంథర వరద్వయలేఖను గొని వచ్చునట్లు

1. 'అగ్నిదో గరదశ్చైవ శస్త్రోన్మత్తో ధనాపహః
క్షేత్రదారహరశ్చైతాః షడ్విద్యాదాతతాయినః॥'

కాని తెలుపకపోవుటచే కొంత కథాభాగము గజిబిజిగ నున్నది. అనుక్తమగునది గ్రహించుకొనవలయునని కాబోలు మురారియూహ. ఇట్టి మార్పుచే కైకను లోకాపవాదమునుండి దూర మొనర్చుటయే కాక మంథరకూడ నిరపరాధిని యగుచున్నది. మహావీరచరితమున శూర్పణఖయే మంథరాశరీరమున నావేశించి కృత్యము నడుపునట్లున్నది. ఇందు శ్రమణ యా కృత్యము నిర్వహించుచున్నది. మిథిలయందే వరద్వయలేఖ నిచ్చుట, మిథిలనుండియే రాముఁడు సీతాలక్ష్మణులతోఁ బయనమగుట రెంటను దుల్యమే. ఈ మార్పులన్నియు మూలాతిక్రమణములు. శూర్పణఖ రాముఁ డట్లరణ్యవాస మొనర్చునాయని యడిగినపుడు మాల్యవంతుఁడు. 'లోకోత్తరం కిమపి రూపమున్మీలయంతో జగతి రాజ్యోపభోగేభ్యో జుగుప్సంతే మహానుభావాః' లోకాతీతమైన చర్యలఁ గావించుటకై మహానుభావులు రాజభోగముల నేవగింతురని రాముని గొప్పతనమును గొనియాడును. రామమహత్త్వమును దెలుపుటకు మురారికి విసుగులేదు. అందును ప్రత్యర్థిపక్షమువారుకూడఁ గొనియాడఁదగిన లోకోత్తర గుణశాలి యని తెలియఁజేయుటయే మురారిపరమోద్దేశ మని తెలియుచున్నది. శివధనుర్భంగముననే రాముఁడు త్రిలోకవిజయ మందిన ట్లని కూడ బ్రశంసించును.

పరశురాముఁడు రాముని వెదకికొనుచు రౌద్రాకారమునఁ గ్రుద్ధుఁడై మిథిల కేతెంచును. ఈ పరశురామఘట్ట మంతయు మహావీరచరితానుకరణమే. ఇప్పట్టున రౌద్రరసవ్యంజకముగ శ్లోకములు ఆరభటీవృత్తిని వ్రాయఁబడినవి. భార్గవుఁడు రాముని సంహరింప వచ్చుచున్నను శ్రీరాముఁ డాతనిమహిమముఁ గొనియాడి 'దిష్ట్యాఽత్ర దర్శిష్యతే' భాగ్యవశమున దర్శన మిచ్చుచున్నాఁ డని యుదారముగా నుడువును. పరశురామునిగొప్పతనమును లెస్సగా గుర్తించి శ్రీరాముఁ

డాతనిని గొనియాడుచున్నాఁడు. భార్గవుఁడు రాముని 'రే కాకుత్స్థ!' 'రే రాజన్యపోత!,' 'అరే క్షత్రియడింభ.' 'క్షుద్రక్షత్రియడింభ, అనాత్మజ్ఞ,' యని హీనముగ సంబోధించి తూలనాడుచు మాటాడినను రాముఁడు మాత్రము మర్యాదగా 'భగవన్' 'ప్రసీద భగవన్, జాత్యైవ పూజ్యోఽసి నః' యని పూజ్యభావమునే నెరపుచు సవినయముగఁ బ్రవర్తించెను. పెద్దలయెడ మెలఁ గువిధము శ్రీరామునుండి ప్రతివారును గ్రహింపవలయు నను సందేశ మిట్లు మురారి రామశీలచిత్రణమునఁ దెలుపుచున్నాఁడు. అంతటి ప్రచండ కోపమునఁ బరశురాముఁడు శ్రీరాముఁ డిందుశేఖరధనుర్భంగ మొనర్చుటచే నిజకోపానలమున కింధన మాయెనని పల్క, శ్రీరాముఁడు బాల్యచాపలమున ధనువును లాగగ నది భగ్న మాయె ననియు, భార్గవు నవిమృశ్యకారితచే గణింపలేదు కాని మదమునఁ గాదనియు నెంతో వినయమధురముగ సమాధానము నుడివి తుదకు భార్గవుని వైష్ణవధనువు నెక్కుపెట్టి భార్గవుని క్షమింప వేడి యాతనిప్రసాదమునకుఁ బాత్రుఁ డాయెను. దశరథజనకాదులను గూడ లెక్కపెట్టక పరశురాముఁడు తూలనాడుట, తుద కాతిథ్యము నొసగ నిల్వమన్నను సిగ్గుచే వెడలిపోవుట మున్నగు నంశము లన్నియు మహావీరచరితవృత్తాంతమే. అంత కోపముననున్న వాఁడు కూడ రాముఁ డావైష్ణవధనువు నెక్కిడగా నాతని యందు వైష్ణవతేజమును గాంచి శాంతముగా నాతని గౌగిలించికొని యాతని యనుమతి నారణ్యకవృత్తికేఁ జనును. ఆ సందర్భమున రాముని వచనములు,

'శివాస్తే పంథానో వ్రజ నిజగృహేభ్యో నిజగృహా
న్కిమన్యత్సర్వేషాం గుణమయశిరోమాల్యమసి నః।
త్రిలోకీనిర్మాణస్థితినిధనబంధోర్మధుభిదో
భవాన్ షష్ఠీమూర్తిర్భృగుకులమధిష్ఠాయ రమతే॥'

(అంకము 4. శ్లోకము 63.)

ఓ గుణమయ! నీకు మార్గములు మంగళప్రదము లగుఁగాక (త్రోవలో కీడు కలుగకుండ, శుభమే కలుగు గాక) ఇది మీగృహమే కదా, మీ రెక్కడ నున్న, నదియే మీ గృహము. మా కందరకును మీరు పూజ్యులు. ముల్లోకముల సృష్టిస్థితిలయకారకుఁడగు నా మహావిష్ణ్వవతారములలో భార్గవరూపమున నారవ యవతారపురుషుఁడవై వెలయుచున్నావు.

అని నుడివినశ్లోక మెంతయు నుదాత్తముగ నున్నది. శిష్టలోకమున నీ 'శివాస్తే పంథానః' యని ప్రస్థానసమయముల నుడువు నాచార మింకను మన దేశమున నభ్యాసమున నున్నది.

పరశురాముఁడు వెడలిపోగా శ్రీరాముని గాంచి దశరథజనకులు నంతసింతురు. దశరథుఁడు రామునకుఁ బట్టముఁ గట్టి దిలీపకులోచితముగఁ దపోవృత్తి నూనఁ గోరి త్వరపడుచుండ నింతలో మంథరానీతమగు మధ్యమాంబా లేఖను లక్ష్మణుఁ డందుకొని తేగా జనకుఁడు దానిని గ్రహించి చదువుచు, 'మహారాజం దశరథం కైకేయీ విజ్ఞాపయతి' యథా–

'తన్మే వరద్వయమురీకృతపూర్వమేవ
యాచే బిభర్తు భరతస్తవ రాజ్యలక్ష్మీమ్।
వర్షాణి తిష్ఠతు చతుర్దశ దండకాయాం
సౌమిత్రిమైథిలసుతాసహితశ్చ రామః॥'

(అంకము 4. శ్లోకము 66.)

మహారాజగు దశరథునకు గైకేయి విన్నవించుచున్నది. మున్నే నాకు రెండు వరము లొసంగితిరి. వాని నిపుడు యాచించుచున్నాను. రాజ్యలక్ష్మిని భరతుఁడు వహించుగాక, రాముఁడు సీతాలక్ష్మణసహితుఁడై పదునాలగేండ్లు దండకయందుండు గాక.

అను విషయమును చదువుచు మూర్ఛిల్లును, దశరథుఁడును మూర్ఛిల్లును. రాముఁడు పటాంచలమున వీవ వారు లేవగా నూరడిల్లుఁ డని నుడివి దశరథుని క్షేమము జూచుకొనుచుండ జనకుని గోరి సీతాలక్ష్మణసహితుఁడై వనగమనమునకు బయలుదేరును. రామునకు భార్గవజయసందర్భమునఁ బట్టముఁ గట్టవలయు నని తండ్రి యువ్విళ్ళూరుచుండుసమయమున నీ వరద్వయప్రశంసఁదెచ్చి రామునకుఁ బరీక్షాసమయముగాఁ బరిణమింపఁ జేసి యాతనిమనసు రాజ్య వైభవమునకన్న కులప్రతిష్ఠ కాలవాలమగు సత్యసంధతయే ముఖ్యముగ గ్రహింపఁజేసి వనగమనోద్యుక్తునిగాఁ జేసి మురారి రాము నుత్తమోత్తమనాయకునిగాఁ జిత్రించినాఁడు. పెద్దలవాక్యముల వినుటయందును విచక్షణ యావశ్యకమని యట్టి విచక్షణ గురుకుల క్లేశమునఁగాని యభ్యాసపడ దని యిందుమూలమునఁ దెలియుచున్నది.

ఇట మిథిలనుండియే వనగమనప్రస్థానము. మహావీరచరితము ననుకరించినమార్పు మూలమున సీతావివాహానంతర మయోధ్యనుండి వనగమనము నుడువఁబడినది. వరద్వయవనగమనవిషయ మంతయు మిథిలయందే నిర్వహింపఁబడుటలో సీతావిషయమున మరింత జాలిఁ గూర్ప ననువగు కల్పనముగా కవి యెంచియుండ నోపు. కల్యాణము అయి కాక మునుపే యిట్టి కష్టము లనుభవింపవలసినట్లు కవి కల్పించుటలో నామెపాతివ్రత్యమును రాముని ధీర, శాంతగుణములను దెల్పదలఁచుటయే యని తోఁచుచున్నది. మహావీరచరితమున భరతుఁడు నచట నుండి రాముని కొంతదూర మనుగమించి పాదుకల గ్రహించి యుధాజిత్తుతో వెనుకకు వెడలినట్లున్నది. ఇందు భరతయుధాజిత్తులవిషయమే యీ సందర్భమున లేదు.

ఈ యంకమున పరశురామదశరథరామసంవాదమే విశేషముగ నడచినది. అంకనామము దశరథవిప్రలంభ మని యున్నను బ్రధానముగాఁ పరశురామ విషయమే నడచినది. తుదకు రామవిప్రవాసముచే దశరథునకుఁ గల్గిన విప్రలంభముచే దీని కీ నామకరణము గల్గినది. ఈ నాటకమునను నీ రామద్వయ సంవాదము కొంచెము మితిమించి నాటకీయ మగుటకు దూర మగుచున్నది. పరశురామవృత్తాంతమున రౌద్రము నుచ్చస్థితికిఁ దెచ్చి రామ వైష్ణవధనురారోపణమున నొక్కపెట్టున నా యుచ్చస్థాయినుండి పడద్రోసి శాంతముగ మార్చుట, అవల వరద్వయవృత్తాంత రామవనగమన విషయమున దశరథునకు విప్రలంభముఁ గూర్చుట మున్నగు రసాంతరముల నొకటివెనుక నొకటి కల్పించి మురారి ప్రేక్షకహృదయమును కలచివైచినాఁడు. ఈ నాటకమున నీ కవి వస్తువిస్తరణక్రమమున దృష్టి నంతగా నిడినట్లు గోచరింపదు. ఈతనిదృష్టి యంతయు రామమాహాత్మ్యమునందే లగ్నమై యుండుటచేతనే కాబోలు నీ యంకమునఁ గళ్యాణవేదికబోలెను. కాంతారగమనమునకును నుత్సుకుఁడగునట్లు చూపెను. పరశురామఘట్టముతోడనే చాలకాలము గడచుటచే వ్యవధి లేక రామవనగమనఘట్టము క్లుప్తముగా నిర్వహింపవలసివచ్చినది కాబోలును.

పంచమాంకారంభమున రామవనగమనాది సీతాపహరణమువరకుఁ గల రామాయణకథాభాగమును విష్కంభమున ముగించెను. శ్రమణాజాంబవంతులు సంభాషించుచు మూలరామాయణకథాను గుణముగ జరిగినప్రధానాంశములఁ దెలియఁ జేయుదురు. సీతావియోగమున రాముఁడు విషమదశకు గురియగుచుండ లక్ష్మణుఁడు ధైర్య మూన హెచ్చరించుచుఁ బోవుచుందురు. త్రోవలో భగ్నరావణరథమును గాంచి జటాయువును బ్రశంసించి క్రమముగా నడచి

మాల్యవత్పర్వతమును జేరుదురు. మూలరామాయణమున జటాయుమూలముననే సీతను రావణుఁ డపహరించె నని రామలక్ష్మణులు తెలియుదురు. రామలక్ష్మణులు చూచునప్పటికిఁ గొనయూపిరితో జీవించియుండిన జటాయువు వారికి సీతోదంతముఁ దెల్పి యసువుల దొరంగ వారును నిజపితృసఖుండగు నా జటాయువునకు తండ్రికింబలె సంస్కారము లొనర్చి పయనమైనట్టు లున్నది. ఈ నాటకమున జటాయువును రామలక్ష్మణులు చూచుట లేదు. భగ్నరావణరథమును గాంచి సీత జటాయుదర్శనమున ధన్యురా లని తలంతురు. రామలక్ష్మణులకు జటాయుజ్ఞాన మెట్లు కలిగెనో కవి తెల్పలేదు.

విరహభరమున రాముఁడు వివశుఁడగుచుండ నప్పుడప్పుడు లక్ష్మణుఁ డాతని మరలించుటకుఁ జూపు ప్రకృతిదృశ్యములు రమణీయములే యయ్యు నవి యాతనికి మరింత క్లేశకరములు కాగా మిక్కిలి కుములుచు నిమీలితాక్షుఁ డగును. లక్ష్మణుఁడు నట్టియవస్థనుండి రాముని మరల్ప నుపాయ మాలోచించుచుండ నింతలో కబంధగృహీతుఁ డైన గుహునిస్వరము వినఁబడ మేల్కొని లక్ష్మణుని తత్సహాయార్థ మంపును. ఇప్పట్టున కాళిదాసు, శాకుంతలమున శకుంతలా వియోగభరమున ఖిన్నుఁ డైన దుష్యంతునిభావము మరల్చుటకు విదూషకుఁడు మాతలిచే గృహీతుఁ డైనట్లు కల్పించినరీతి నిందు మురారి రామవైక్లబ్యము మాన్ప కబంధగృహీతునిగా లక్ష్మణమిత్రుని గుహుని జిత్రించెను. మూలరామాయణమున నీ విషయము లేదు. గుహుఁడు శృంగిబేరపురముననే రామునితో సఖ్య మంది గంగాతరణమున సాయముజేసినట్లు తప్ప యవ్వలికథలో నెచటను గోచరింపఁడు. మహావీరచరితమున శ్రమణయే కబంధగృహీతయై లక్ష్మణవిముక్తురాలు కాగా వారికి సుగ్రీవాదివిషయములఁ దెల్పునట్లున్నది. మూలరామా

యణమునఁ గబంధుఁడే రామలక్ష్మణులకు వానరులు సీతాన్వేషణమునఁ దోడ్పడఁ గలరని తెల్పినట్లున్నది. ఇందు గుహుఁడే దుందుభికాయము, వాలి వృత్తాంతము, దుందుభికంకాళకూటమును లక్ష్మణుఁడు దన్నుట, మున్నగు నంశముల రామునకుఁ దెల్పును. మరల గుహుఁడే సుగ్రీవుఁడు పంపెనని సీతయుత్తరీయమును రామున కొసగ రాముఁడు మిగుల ఖిన్నుఁడై సుగ్రీవహనుమద్దర్శనోత్సుకుఁడై గుహుని ఋశ్యమూకమునకు మార్గమును జూపు మనును. ఇంతవరకిట్లు రాముఁడు ఋశ్యమూకమునకు వచ్చునట్లు చేయుటయే జాంబవంతునిమంత్రాలోచనము. అది యట్టులే సిద్ధించినది. గుహుఁడు మతంగాశ్రమమును జూపి యట నాటవికప్రకృతిని దిలకింపఁ గోర రాముఁడు మరల ప్రియాన్మరణమునవైక్లబ్య మొందుచుండ నింతలో వాలికేకలు విని గుహుఁడు వాలిరాక నెరిఁగింపఁ దాను ముందు సుగ్రీవుకడ కరుదెంచును. రాముఁడు లక్ష్మణునితో సుగ్రీవుని వాలిస్థానమున నభిషిక్తుని గావించి వానితో సంధిగావింతు నన లక్ష్మణుఁడును కబంధుఁడు దివి కేగుచు గుహునిమాటల నాలకింపుఁ డని హెచ్చరించె నని నుడువ గుహునితో సుగ్రీవు నగ్నిసాక్షికముగ మిత్రునిగా గ్రహించితి ననును. రామునిశీలము నిట గుహుఁడు కొనియాడుచు, 'ఇయమేవ మహతాం శైలీ' పెద్దలవ్యవహారమిట్టిదే యని యీ క్రిందిశ్లోకము నుడువును.

'సంతో మనసి కృత్యైవ ప్రవృత్తాః కృత్యవస్తుని।
కస్య ప్రతిశృణోతి స్మ కమలేభ్యః శ్రియం రవిః॥'

(అంకము 5. శ్లోకము 35.)

సత్పురుషులు కృత్యవిషయములందు మనసునఁ దలఁచియే ప్రవర్తింతురు. కమలములకు కాంతి నొసగు రవి యెవరితో నుడువు చున్నాఁడు? ఎవరితో నుడువకయే కేవలము క్రియ గావించుచున్నాఁడు.

ఈ సందర్భమున జగన్నాథపండిత రాయల సత్పురుషునిగురించినశ్లోకము స్మరణీయము,

'గర్జతి శరది న వర్షతి వర్షాసు నిస్స్వనో మేఘః।
నీచో వదతి న కురుతే న వదతి సుజనః కరోత్యేవ॥'

శరత్కాలమున మేఘుఁడు గర్జించును గాని వర్షింపఁడు. వర్షాకాలమున నిశ్శబ్దముగ వర్షించును. నీచుఁడు వదరును కాని క్రియఁ జేయఁడు. సజ్జనుఁడు పలుకకయే క్రియ గావించును.

ఇచ్చట రాముఁడు సుగ్రీవునితో సఖ్యము గావించుట క్రియారూపముననే నిర్వహించెను గాని మాటలచేఁ గాదని గుహుఁ డట్లు మహానుభావుల యాచారము నుడివెను.

వాలి, రావణసందేశము స్మరించికొని రామలక్ష్మణుల నెరింగి రామునితోఁ బోర సంసిద్ధుఁడై రణరంగముఁ జేర రాముఁ డొక్క కోల సప్తతాళముల భేదించి వాలిని గూల్చెను. ఇంతలో సుగ్రీవహనుమంతులు వత్తురు. సుగ్రీవునభిషేకింతురు. రాముఁడు స్వయముగ కార్తస్వర పుండరీకమాలతో సుగ్రీవకంఠము నలంకరించును. సుగ్రీవుఁడును సీతాదేవివృత్తాంతము కనుగొన హనుమంతుని బంపి యంగదునకు యౌవరాజ్యపట్టాభిషేకము గావింప నెంచును. ఇందును సుగ్రీవాదులఁ గలియకముందే రాముఁడు వాలిని సంహరించినట్లు మహావీర చరితమునుబోలి కల్పింపఁబడినది. సత్పురుషస్నేహలక్షణము క్రియా రూపముననే కాని వాగ్రూపమునఁ గాదను నభిప్రాయమును స్పష్టపరచుటకే రామునిట్లు మూలరామాయణము నందుకన్న భిన్నముగాఁ జిత్రించెను. అట్లే సుగ్రీవుఁడును తోడ్తో సీతోదంతమునకై హనుమంతుని బంపును. గుహుఁడీయంకమున కబంధునికడనుండి తుదవరకు రామలక్ష్మణులతో

నుండి సుగ్రీవసఖ్యమునకు ఁదోడ్పడుచున్నాఁడు. ఇది మురారి కల్పనము. రాముఁడు, సుగ్రీవుఁడును పరస్పర మొక మాటయైన మాటాడినట్లు లేదు. ఇది యొకలోటు. వారిపరిచితినే చూప లేదు. కేవల మభిషేకసమయమున స్వర్ణకమలమాలను సుగ్రీవుని కంఠమున వైదును. ఇది యసందర్భముగ గోచరించుచున్నది.

ఈ యంకమున వాలి కేవలము రావణపక్షావలంబియై దోః కండూమదమున రాము నెదుర్కొనును. ఇట విషయము చాలవరకు మహావీరచరితమునే యనుకరించెను. మహావీరచరితమున వాలి యుదారుఁడు, గొప్పవాఁడు. రాముని రావణప్రేరితుఁడై యెదుర్కొనినను రామగుణముల గ్రహించి 'ఆనందాయ చ విస్మయాయ చ, మయాదృష్టోఽసి దుఃఖాయ వా' యను శ్లోకము నుడివి మిగుల ఖేద మొంది సంతోషముగ రాముహస్తమున ననువుల దొరంగును. ఈ నాటకమున వాలి కేవలము రావణపక్షావలంబిగా తప్ప విశాలహృదయుఁడుగాఁ జిత్రింపఁబడ లేదు. ఇందు కథాగమనము పూర్వాంకమునందుకన్న మిన్న, సంవిధానము కూడ నాటకోచితముగనే యున్నది. సుగ్రీవహనుమంతులు రామపరచితిని బడయుట చూపక పోయినను నేవిధమునను తెలుపలేదు. మహావీరచరితమున విభీషణుఁడు కూడ సుగ్రీవునితో వచ్చును. ఇందుమాత్ర మది లేదు. సుగ్రీవాభిషేకముతోడను సంగదయౌవరాజపట్టాభిషేకమహోత్సవ సంభాకప్రయత్నములు తోడను నీ యంకము ముగియుచున్నది. దీనికి సుగ్రీవాభిషేక మను పేరు కూడ నీ యంశమునుబట్టియే కలిగెను.

షష్ఠాంకమునఁ గూడ రామరావణయుద్ధమును గూర్చిన యంకము మహావీరచరితానుకరణమే. మహావీరచరితమున దేవేంద్రుఁడును చిత్రాంగదుఁడును విమానారూఢులై యుద్ధము తిలకింతురు. ఉత్తరరామచరితమున లవచంద్రకేతుల యుద్ధమును విద్యాధరీవిద్యాధరులు

చూచుచుందురు. అట్లే ఈ నాటకమున రత్నచూడుఁడు హేమాంగదుఁ డను నిర్వురు విద్యాధరులు యుద్ధమును వీక్షింతురు.

అంకారంభమున మాల్యవంతుఁడు, రామసైన్యమునుండి తిరిగి వచ్చిన శుకసారణులతో సంభాషణరూపవిష్కంభమువలన పలువురు రాక్షసనాయకులు ప్రహస్తధూమ్రాక్ష మహోదరాదుల వధించి రాముఁడు కపిసైన్యముతో లంకఁ బ్రవేశించి కుంభకర్ణమేఘనాదులఁ జక్కడంచె ననియు, రావణుఁడు రామవిజయమునకై చనుచున్నాఁ డనియు తెలియుచున్నది. యుద్ధమును వర్ణించు సందర్భమునఁ బ్రేక్షకులుగ నుండిన వారు వర్ణించుటలో నిష్పక్షపాతముగ నుడువుదురని కాబోలు భాసుఁడు తొలుత తన యభిషేకనాటకమున విద్యాధరుల నిర్వురఁ బ్రేక్షకులుగఁ జూపి వారిచే యుద్ధమును వర్ణింపఁజేసెను. భవభూతి యట్టి ప్రేక్షకులఁ జిత్రించుటలో భాసు ననుకరించెను. ఈ మురారి భాసునివలె విద్యా ధరద్వయమును గైకొని కొంత భవభూతి ననుకరించుచు యుద్ధవర్ణనము గావించెను. ఈ యుద్ధఘట్టమును నిందు ప్రహస్త ధూమ్రాక్ష, కుంభకర్ణ, మేఘనాదాదులు మడిసిన పిదప రావణసుగ్రీవులు పోరు సల్పునట్లు చెప్పఁ బడినది. వాల్మీకిరామాయణమున లంకఁ బ్రవేశింపగనే సుగ్రీవుఁడు రావణునితోఁ బోరినట్లు యుద్ధకాండచత్వారింశసర్గమునఁ గలదు. రామాయణమున నీ రావణసుగ్రీవులు పోరినఘట్టమునే చమత్కారముగ సూక్తివైచిత్ర్యముతో నీమురారిసొంపుగనే రచించియున్నాఁడు. ఈ ఘట్టము నాటకోచితముగనే రసవంతముగనున్నది. సంభాషణము గూడ వీరరసోచితముగ నున్నది.

రామరావణయుద్ధము గూడ రసవంతముగ నిర్వహింపఁబడినది. రామరావణవీరోక్తులును సముచితముగ నున్నవి. రాముఁడు రావణుని

గూర్చి పల్కిన సావహేళనోక్తులు హాస్యస్ఫోరకములై చమత్కారముగ నున్నవి. ఈ యుద్ధమున రావణుఁడు వింశతిబాహువులతోడ ప్రయోగించు శరలాఘవముకన్న భుజద్వయముతోడనే ప్రయోగించురాముని శరలాఘవమే మిన్న యని నిజనాయకుని బ్రశంసించుచు రావణుఁడు ద్వంద్వయుద్ధమర్యాద నతిక్రమించె ననును. రామశరములు రావణునివక్షమున నాటుకొని నొంప రావణుఁడు రామునివిక్రమమును గొనియాడి మెచ్చుకొనునట్లు చేసెను. రావణుఁడు శరప్రయోగము సేయునపుడు భూమి యిటు నటు నొరగుచుండ తద్వాహియగు శేషునిశిరమందలిమణులచే పాతాళమునం దంధకారము తొలగె ననియు, శేషునిపై భూభారమంతయుఁ బడగా వామనుఁడై పీవరదేహముతో ఘణామండలమును సంకోచించుకొను నను వర్ణనములు హృదయంగమములు.

యుద్ధ మతిఘోరము కాగా పరస్పర మస్త్రములఁ బ్రయోగింతురు. మూల రామాయణమున నిన్ని యస్త్రములు ప్రయోగింపఁబడినట్లు లేదు. ఇందు, 'తామిస్రం భానవీయేన, భానవీయం రాహవీయేణ,' రాహవీయం వైష్ణవీయేన, వైష్ణవీయం పౌష్పకేతవేన, పౌష్పకేతవం పాశుపతేన' అని ఆరు విధములగు నస్త్రములఁ దెల్పి యిట్టులస్త్రప్రత్యస్త్రములతోఁ బోరాడు పులస్త్య కకుత్స్థకులైక వీరుల యుద్ధ మతిభయంకర మాయె ననును. ఈ యస్త్రము లెల్ల మురారి కల్పితములే. వాల్మీకిరామాయణమునఁ దుదకు రాముఁడు బ్రహ్మాస్త్రమును బ్రయోగించినట్లున్నది. అట్లే యిందును రాముని పైతామహాస్త్రమున రావణుఁడు నేలగూలుచున్నాఁడనియే తెల్పెను.

'.... ....
....

కాకుత్స్థేనావకీర్ణో నిజవిశిఖశిఖాయోగపీఠోపహూత
బ్రహ్మాస్త్రేణాధిశేతే రజనిచరపతేర్వీరశయ్యాం కబంధః॥'

(అంకము6. శ్లోకము 77.)

రాముఁడు బ్రహ్మాస్త్రమునభిమంత్రించి నిజబాణములతో రావణకబంధము నెగురగొట్టె నని మురారి వ్రాసెను.

ఇట్టి భయంకరాయోధనమునఁ గూడ రామరావణసంకల్పములు భిన్నములు. 'కృతిప్రతికృతీనామవిశేషేఽపి జేతవ్యమితి రామస్య, మర్తవ్యమితి రావణస్య నిర్ణయనిర్భరోఽయం సర్వాస్త్రమోక్షః' అనుటచే జయింపవలయునని రామునకును. మరణింపవలయు నని రావణునకును నస్త్రమోక్షణసంకల్పములని తెలియుచున్నది. ఇట నొక విశేషము గలదు. రామాయణతత్త్వము నిట మురారి సున్నితముగఁ దెలుపుచున్నాఁడు. అస్త్రప్రయోగములు కృతికి ప్రతికృతిగా నుపయోగించినను రాముఁడు తాను జయింపవలయుననెడి సంకల్పము తోడనే యనగా రావణుఁడు చావవలయునని కాక యాతని నోడించి వశపరచుకొని సత్ప్రవర్తనము బోధించి సన్మార్గప్రవర్తకునిగాఁ జేయవలయు ననెడి దృఢసంకల్పముతోడనే యస్త్రములఁ బ్రయోగించె నని తెలియుచున్నది. రావణుఁడు మాత్రము నిజవైరియగు శ్రీరాముఁడు చావవలయు ననెడి స్థిరసంకల్పముతోడనే యస్త్రమోక్షణము గావించె నని తెలియుచున్నది. 'కోపమార్యేణ యో హంతి స వీరః పురుషోత్తమః' (కిష్కింధాకాండం-ఏకవింశస్సర్గః శ్లోకము 6.) అని శ్రీరాముఁడు లక్ష్మణునకు సుగ్రీవుని శిక్షింపఁబోవునపుడు గరపిన హితము ప్రకారము ఆర్యప్రవృత్తిచే ననగా సత్ప్రవర్తనముచేఁ గోపము నణచువాఁడే పురుషోత్తముఁడని నుడివెను. అట్టి యుత్తమార్యాదర్శము కలవాఁడు కావుననే రాముఁడు జయింపవలెననియే కాని చంపవలయు

నను నుద్దేశము లేక పోరాడుచుండెననియు రావణుఁడు మూర్ఖముగా రాముఁడు చావవలయుననియే పోరుచుండెననియు నిట ఆర్యానార్యప్రవృత్తులను రామారావణసంకల్పములం దిమిడ్చెను. ఇట్టి విశేషములే వాల్మీకికన్న మిన్నగా నిందుఁ దెల్పఁబడియున్న వని కవ్యభిప్రాయమై యుండనోవు. ఇందు మురారి రామవర్ణనముకన్న రావణవర్ణనమే మిన్నగాఁ గావించి యట్టి మేటియగు ప్రతినాయకజయమున శ్రీరామునకు ఆధిక్యమును గూర్చినాఁడు. మండోదరీవిలపనము రసవంతముగ నున్నది. దశగ్రీవ నిగ్రహమునఁ బరిస్థితులు మారగ 'న కించిదనీషత్కరంనామ కృతాంతస్య' యని విధిచేష్టితములు విచిత్రము లని మురారి సద్భావమున నుడువుట యెంతయు నుచితము. మండోదరీవిలాపమును గూర్చి 'ప్రతికృతానాం విద్విషామపి వ్యసనం అతిమాత్రం హృదయమర్మాణి భినత్తి' శత్రువులకు సంబంధించినదైనను మితిమించిన వ్యసనము హృదయమర్మముల భేదించు నని, మురారి నిజమనో మార్దవమును దెల్పుచున్నాఁడు. విభీషణపట్టాభిషేకముతో అంకము ముగియుచున్నది. యుద్ధ మారంభమునుండియుఁ బర్యవేక్షించుచున్న విద్యాధరులిర్వురును రాముని బ్రశంసించుచు వెడలిపోదురు.

ఈ యంకమున కథాచలనము చక్కగా నున్నది. సంభాషణములును, వీరాలాపములును రసవంతముగా నాటకోచితముగానే యున్నవి. రావణుఁ డీయంకమున నిగ్రహింపఁబడుటచే దీనికి దశగ్రీవనిగ్రహ మను పేరు వచ్చెను.

సప్తమాంకమున రావణనిగ్రహానంతరము రావణగృహవాసదోషమున సీత యగ్నిప్రవేశించి శుద్ధురా లగును. అందరును హర్షింతురు. అవల

విమానారూఢులై సీతారామలక్ష్మణులు. సుగ్రీవవిభీషణులును నభోమార్గమున వేడుకఁ జూడ నేగుదురు. ఈ విమానయానఘట్టము కూడ భవభూతి మహావీరచరితమునుండి యనుకరించుచుఁ గొంత తన స్వంతకల్పనలతో నీ యంకమును సాగించెను. ఈ విమానయానము ఈ నాటకమున తొలుత సూటిగా తలమీఁదుగానే చంద్రలోకపర్యంత మేగును. అవల హనుమంతునివాక్యము లటవిని దిగి వచ్చి లంకనుండి మరల నయోధ్యకుఁ బయన మగుదురు.

విమానయానమునఁ బోవుచు రాముఁడు సీతకు గతవిషయములఁ గూర్చి తెల్పును. సాగరమును బ్రశంసించి సీతను మ్రొక్కు మనును. ఇందు రాముని శీల ముదాత్తము. రాముఁడు అగస్త్యునిగూర్చి నుడువుచు' దురవగాహగంభీర స్వభావాని మహతాం చరితాని' యని పెద్దలచరితములు దెలియ శక్యముకాని స్వభావము గలవి యని తెల్పును. విమానమునుండి క్రిందికిఁ జూడగా సముద్ర పరివేష్టితమగు భూమి చిత్రకుట్టిమమువలె నున్నదనుచు సుగ్రీవుఁడు సముద్రుఁడను సర్పము. చుట్టుకొని భూమండలమను ఫణామండలమున ననర్ఘమగు రాముఁడును రత్నము నొంది గర్వించుచున్నదని చమత్కారముగా నుడువును. రాముఁ డనర్ఘరత్న మని నుడువఁ బడుటచే నీ గ్రంథ మాతనిగూర్చినది కాన దీని కనర్ఘరాఘవనామముకూడ పొసగి యున్నది. లంకనుండి విమానమునఁ బోయి హిమవంతుని జూచి యట త్రినేత్రకోపాగ్నికి మన్మథుఁ డింధన మగుటను గుర్తించి గౌరీశంకరుల వృత్తాంతము స్మరించి, క్రమముగ లక్ష్మిని గూర్చి ముచ్చటింతురు. ఇట లక్ష్మిని వర్ణించిన వర్ణనము బాణభట్టు కాదంబరిలోని శుకనాసోపదేశమున లక్ష్మీవర్ణనమును బోలి యున్నది. అంత విస్తారముగా లేదు కాని యట్లే చమత్కారముగా నిందింపఁబడుచున్నది. ఈ విషయము లక్ష్మణవాక్యములు.

'హంత, సురాసురమల్లభటీతూర్యతాలనర్తకీ, సకలరాజకులఖలీకార ఖర్జూలా, సాహసికజనసహస్రశస్త్రాంధకారఖేలనఖద్యోతీ, మధుమథనజీమూత విలాసవిద్యుల్లతా, కిమేవముపాలభ్యతే. ఇయంహి' (అవుర, దేవాసురవీర సమర తూర్యతాళనర్తకి, సకలరాజకుల పరిభవ కండూదాయిని, సాహసికజన సహస్రశస్త్రాంధకార క్రీడనఖద్యోతీ, ఖడ్గాదిప్రహరణము లక్ష్మీనిమిత్తమని భావము, మధుసూదన ఘనవిలాసవిద్యుల్లత, ఎందులకిట్లు నిందింపబడుచున్నది.)

"గుణవద్భిః సహసంగమముచ్చైః పదమాప్తు ముత్సుకా లక్ష్మీః।
వీరకరవాలవసతిర్ధ్రువమసిధారావ్రతం చరతి॥"

(అంకము 7. శ్లోకము 44.)

(ఉన్నతపదమంద గుణవంతుల సాంగత్యముగోరి యీ లక్ష్మి వీరకరవాలని వాసినియై యసిధారావ్రతము నాచరించుచున్నది.) ఈ వాక్యము లెంతయుఁ బ్రశంసార్హములు. అవల వారు కైలాసమును గాంచి రావణభుజప్రశస్తిని బ్రశంసించి, శివుని నుతించి చంద్రలోకమున కేగుదురు. అట చంద్రునిగూర్చి నుడివిన శ్లోకములు రసవంతములు-(శ్లో. 62,63.) 'ప్రాణాయామోపదేష్టా' యను శ్లోకము చంద్రునిగూర్చిన యుల్లేఖము. చంద్రుఁడు శృంగారాద్వైతవాదియని బోజరాజసిద్ధాంతము నిట మురారి చమత్కారముగా నిమిడ్చినాఁడు.

'ప్రాణాయామోపదేష్టా నరసిరుహవనే యౌవనోన్మాదలీలా
గోష్ఠీనాం పీఠమర్దస్త్రిభువన వనితానేత్రయోః ప్రాతరాశః।
కామాయుష్టోమయజ్వా శమిత కుముదినీ మౌనముద్రానురాగః
శృంగారాద్వైతవాదీ విభవతి భగవానేష పీయూషభానుః॥'

(అంకము 7. శ్లోకము 62.)

(పద్మవన నిమీలన కథకుడును, యౌవనోన్మాదవిలాసగోష్ఠికి పీఠమర్దుడును నాయకుండును, త్రిభువనవనితానేత్ర ప్రాతర్భోజనమును, కామాయుర్వర్ధక హోమసోమయాజియు, శమితకుముదినీమౌనముద్రానురాగుఁడును, శృంగారాద్వైత వాదియునైన చంద్రభగవానుఁడితఁడే,) ఇట చంద్రమండలవర్ణనానిమగ్నులై యుండగ భూమండలమున హనుమంతుఁడు పట్టాభిషేకముహూర్త మాసన్నమగుచున్న దని నుడివినవార్త రాముఁడు విని వారందరు విమానముతో క్రిందికి వత్తురు. ఈ భూలోకవార్త నభోవీధినున్న రామున కెట్లు వినఁబడెను. నేటికాలమున దూరశ్రవణమున కనుకూలములగు యంత్రపరికరములున్నవి కాని యానాడు లేవుకదా! ఐనను యోగాభ్యాసపటిష్ఠులకు దూరదర్శన. దూరశ్రవణాది విద్య లన్నియుఁ గరతలామలకములే యని మనయార్షవిజ్ఞానము నుడువుచున్నది. మహామహిమవంతులగు వసిష్ఠవిశ్వామిత్రాదిమునీంద్రశుశ్రూషా సమాసాదితయోగాభ్యాసపటిష్ఠుఁ డగు రాముఁడు హనుమద్వాక్య మిట విమానమునుండి వినుట సాధ్యమే యగును. మురారిరాముఁ డట్టి ప్రతిభావంతుఁడే. కావుననే యాతని యనర్ఘరాఘవుఁ డనెను.

ఈ విమానయానమున లంకనుండి సూటిగాఁ జంద్రమండల పర్యంతము పోయినపుడు హిమవంత మెటులు గోచరించెనో తెలియరాదు. నేటి భూగోళ శాస్త్రప్రకార మది విరుద్ధ మగును. అవల వారు దిగి వచ్చి యయోధ్య కేగునపుడు లంకనుండి క్రమముగా నప్తగోదావరమున కేగి యవల కాంచీనగరమును జూపుటయు భూగోళశాస్త్రసమ్మతము కాదు. కాని యిందు కవియొక్కయూహమెచ్చుకొనఁ దగినది. లంకనుండి యయోధ్యవరకుఁ గల దేశములను నగరములను వర్ణించుచు నందలి స్త్రీచేష్టలనుగూర్చి రాముఁడు సీతకుదెలుపుచుండుట రామునిశీలమునకుఁ గొంత లోటగునేమో యని తోచుచున్నది. విదర్భదేశమును గూర్చి నుడువుచు

నా దేశపురీతిని కవు లాదరింతు రని వైదర్భీరీతిని బ్రశంసించును. రామున కట్లు పరస్త్రీచేష్టావర్ణనము చేయుట కళంకముగ గోచరించుచున్నను లోకజ్ఞానమును సీతకు తాను దెల్పుటలో నది యొక దోషము కాదనియే భావింప నగు నని తోచుచున్నది. ఈ దేశనగరవర్ణనము సీతకు రాముఁడు విమానమునుండి వర్ణించుట మూలకథకన్న భిన్నముగా నున్నది. మూలరామాయణమున సీతారాములకుఁ బరిచితస్థలములనే మరల రాముఁడు సీత కిది యిదియని పూర్వపరిచితస్థలములనే చూపినట్లున్నది. ఇందు పూర్వపరిచితస్థలములే కాక యితర నూతన స్థలములును చూపఁ బడియున్నవి, ఇవి యంతయు మురారిదేశాటనవిజ్ఞానమును దెల్పుచున్నవి. మూలమునందు విమానమును నందిగ్రామమున భరతుని గలిసికొని ధనదాలయమున కంపివేసినట్లున్నది. ఇందు విమానము అయోధ్యకు వచ్చి చేరును. భరతలక్ష్మణసమాగమ మయోధ్యయందే చూపఁబడినది. మూలానుగుణముగ వసిష్ఠుఁడే రామునకుఁబట్టాభిషేకము మంత్రపూర్వకముగఁ గావించును. రామలక్ష్మణులు వసిష్ఠునకు నమస్కరింప నిర్వురు నిద్దరిద్దరఁ బుత్రులఁ బడయుదు రని యాశీర్వదించును. అభిషేకానంతరము పుష్పకము పంపివేయఁబడుచున్నది. అంకాంతమున వసిష్ఠవాక్యము,

"జేతారం దశకంధరస్య జితవానేవార్జునం భార్గవ
స్తం రామో యది కాకపక్షకధరస్తత్పూరితేయం కథా।
ఊర్ధ్వం కల్పయతస్తు బాలచరితాత్తత్ప్రక్రియాగౌరవా
దన్యేయం కవితా తథాఽపి జగతస్తోషాయ వర్తిష్యతే॥"

(అంకము 7. శ్లోకము 146.)

అని భార్గవజయముననే రామాయణకథ పూర్తియయినట్టులే యనియు, నవ్వలి కథ యంతయుఁ బ్రక్రియాగౌరవమున కవన మల్లబడెనని

నుడువుచు మురారి వైయాకరణవిరళరూపసాధనమును వెల్లడించి తానే స్వయముగ 'అన్యేయం కవితా' యని తన కవనమే విలక్షణమైన దనియు, ప్రక్రియాగౌరవము కలదే కవిత యనియు నుద్ఘోషించుచున్నాఁడు. మరియు, 'సమున్మీలత్సూక్తస్తబకమకరందైః శ్రవణయోః' అను శ్లోకముమూలమున కవీశ్వరులు సూక్తిసమనికరములమధువును శ్రవణముల నింపుదురు గాక, శ్రోతలు తత్తచ్ఛబ్దప్రతిపాద్యమగు నర్థవిశేషము నెరింగి గుణదోషపరిగణనము చేయుదురు గాక యని హెచ్చరించుచు దీని నొక శ్రవ్యకావ్యముగనే భావించి రచించినట్లును దెల్పెను. ఇందుమూలమున నిజకృతి శ్రవణాంజలిపుట పేయమగు కవితామాధుర్యవిలసిత మనియు వ్యంగ్యముగఁ దెల్పుచున్నాఁడు. ఈ విషయమునే బలపరచుచు,

'తావద్వీరయశోరసాయనమధుస్యందః కవీనామయమ్।
జాగర్తు శ్రుతిశష్కలీవలయితవ్యోమావగాహీ గుణః॥'

యని కవీశ్వరు లందరును తమ వీరయశోరసాయన వాఙ్మాధురీపూరముల శ్రోతృశ్రవణవివరాకాశముల నింపుదురు గాక యని హెచ్చరించుచు శుభాంతముగా ముగించెను.

అనర్ఘరాఘవమున సూక్తులు

1. యాంతి న్యాయప్రవృత్తస్య తిర్యంచోఽపి సహాయతామ్।
అపంథానం తు గచ్ఛంతం సోదరోఽపి విముంచతి॥ (అం. 1–శ్లో4.)
(న్యాయమార్గమూనువానికి జంతువులును సాయము చేయును. అన్యాయమార్గవర్తనుని సోదరుఁడును విడుచును.)

2. సకలకవిసార్థసాధారణీ ఖల్వియం వాల్మీకీయా సుభాషితనీవీ (అం. 1.)
(వాల్మీకీయ మగు నీ రామకథ యను మూలధనము సకలకవి సమూహమునకు సమానము గదా.)

3. సమానవృత్తేరపి క్వచిదేవ కస్యచిత్తారామైత్రీకమ్: (అం. 1.)
(సరితలంపుగలవాని కొకానొకని కొక్కొక్కనియందే చక్షూరాగముండును.)

4. ఉత్తరోత్తరేషాం మహోత్సవానాం కదాచిదపి న తృప్యంతి పుంసాం హృదయాని: (అం. 1.)
(మానవుల హృదయములు పైపై మహోత్సవముల కెన్నడును తనియవు.)

5. మమకారో హి రాజపుత్రేషు రాజ్ఞాముపలాలన। క్లేశాయ కేవలం ఉపయోగస్తు ప్రజానాం॥ (అం. 1.)
(రాజులకు కుమారులపై మమకార ముపలాలనక్లేశముకొరకే. ఉపయోగముమాత్రము ప్రజలకు.)

6. కష్టా వేధవ్యథా కష్టో నిత్యముద్వహనక్లమః।
శ్రవణానామలంకారః కపోలస్య తు కుండలమ్॥ (అం. 1–శ్లో 40.)
(కుట్టుబాధ మోతబరువు చెవుల కగును గాని కుండలము నిజముగ కపోలముల కలంకార మగును.)

7. దివస్పృథివ్యోస్తిమిరతిరస్కరిణీం తరణిరణుతరోఽపి తేజసా తిరస్కరోతి: (అం. 1.)
(సూర్యుఁడు చిన్నయయ్యు తన తేజమున మిన్నుమన్నుల చీకటితెరందెరల్చును.)

8. ధ్యానమయదృష్టిపాతప్రముషితకాలాధ్వవిప్రకర్షేషు।
విషయేషు నైష్ఠికానాం సర్వపథీనా మతిఃక్రమతే॥ (అం. 1.–శ్లో44.)
(నైష్ఠికులైన యోగీశ్వరులు యోగజ్ఞానరూపచక్షువుతో సర్వము నెరుగగలరు.)

9. న ఖలు ప్రకాశమంతర్వేణ తుహినభానురుజ్జిహీతే: (అం. 1.)
(ప్రకాశము లేక చంద్రుఁ డుదయింపఁడు గదా.)

10. .....మృదుమనోజ్ఞతుషారతమా।
స్తమసి సతి జ్వలంతి సహసైవ మహౌషధయః॥ (అం. 1.–శ్లో 48.)
(ఇంపు సొంపు చల్వలు గల మహౌషధులు చీకటి పడగనే ప్రకాశించును గదా.)

11. చక్షుః ప్రీతిముద్భవంతీమనూద్భవంతి చాపరాణి కుసుమచాపచాపలాని (అం. 2.)
(కనువలపు పొడముచుండగనే దాని ననుసరించి యితరములగు కామవికారములు పొడముచుండును.)

12. స్వయం ప్రయోగాంతేవాసిభిర్విహితః ప్రయోగో
మహిమానమాచార్యాణాముపచినోతి: (అం. 2.)
(తా మాచరించుటకంటె దమశిష్యు లాచరించుట గురువులకు గొప్పను హెచ్చించును.)

13. స్థానేషు శిష్యనివహైర్వినియుజ్యమానా
విద్యా గురుం హి గుణవత్తరమాతనోతి।
ఆదాయ శుక్తిషు వలాహకవిప్రకీర్ణై
రత్నాకరో భవతి వారిభిరంబురాశిః॥ (అం. 2.-శ్లో 9.)
(శిష్యవర్గముచే యోగ్యులయందు వినియుక్తమైన విద్య గురువునకు ప్రశస్తి నొనగూర్చును. మేఘములు ముత్యపుచిప్పలలో రాల్చు నీళ్ళచే సముద్రుడు రత్నాకరుఁడని ప్రథ నొందుచున్నాఁడు.)

14. క్వచిత్సాంక్రామికోపి విశేషో నైసర్గికమతిశేతే: (అం. 2.)
(ఒకప్పుడు ఆగంతుకమైన విశేషము స్వాభావికమైనదాని నతిశయించును.)

15. ధన్యానాం విరజస్తమా భగవతీ చర్యేయమాహ్లాదతే:(అం2.-శ్లో29.)
(మహాత్ముల సాత్వికచర్య పూజ్యమై సుఖమును గలుగఁ జేయును.)

16. వాచమేషామృషీణాం హి శాస్త్రమేవానువర్తతే: (అం 2.-శ్లో 58.)
(శాస్త్ర మీ ఋషుల వాక్కునే అనుసరించును,)

17. సర్వం భవిష్యతి దేవబ్రాహ్మణానుగ్రహాత్: (అం 3.)
(దేవబ్రాహ్మణుల యనుగ్రహమున నమస్తము శుభము కాగలదు.)

18. అషడక్షీణషాడ్గుణ్యమంత్రీ మకరకేతనః: (అం 3.-శ్లో 6.)
(కాముఁడు మూఁడవవానికి గోచరింపని యాలోచనమునకు మంత్రి)

19. లోకోత్తరం హి కిమప్యున్మీలయంతో జగతి రాజ్యోపభోగేభ్యోపి
బీభత్సంతే మహానుభావాః: (అం 4.)
(లోకోత్తరమైన పనిని ప్రకాశింపఁజేయుచు మహానుభావులు రాజ్యోపభోగముల నైనను నిందింతురు.)

20. అతిపాతికే హి కార్యే రాజ్ఞాం సద్యః శుద్ధిః: (అం 4.)
(తత్క్షణోపజాతమైన కార్యమందు రాజులకు అప్పటికప్పుడే శుద్ధి.)

21. పతితే వ్యసనే దైవాద్దారుణే దారుణాత్మని।
సంవర్మయతి వజ్రేణ ధైర్యం హి మహతాం మనః॥(అం 5.-శ్లో15.)
(భీకరమును దారుణమునగు దుఃఖము సంభవించినపుడు మహాత్ముల మనస్సు ధైర్యమను వజ్రకవచము దాల్చును.)

22. సంతో మనసి కృత్యైవ ప్రవృత్తాః కృత్యవస్తుని।
కస్య ప్రతిశ్రుణోతిస్మ కమలేభ్యః శ్రియం రవిః॥(అం 5.-శ్లో 35.)
(సత్పురుషులు పరులకొరకు కాక తమంతట తామే చేయవలసిన పనులు సల్పుదురు. సూర్యుఁ డెవరికొరకు కమలములకుఁ గాంతి నొసగుచున్నాడు.)

23. ఆకారవిశేషా ఏవ గమయంతి జాతివిశేషాన్ : (అం 5.)
(ఆకారవిశేషములే జాతివిశేషములను బోధించును.)

24. నిత్యోపనతస్వాంగశస్త్రైవ తైరశ్చీ జాతిః: (అం 5.)
(మృగజాతి నిత్యసిద్ధస్వాంగములే ఆయుధములుగా గలది గదా.)

25. అనర్థశంకీని బంధుహృదయాని భవంతి: (అం 6.)
(బాంధవహృదయములు కీడును శంకించునవిగా నుండును.)

26. విజిగీషోరదీర్ఘసూత్రతా హి కార్యసిద్ధేరవశ్యంభావః: (అం 6.)
(విజిగీషునకు దీర్ఘాలోచనపరత లేకుండుటయే కార్యసిద్ధికి ఆవశ్యకము.)

27. అతిదుఃఖో నిర్దుఖః: (అం 6.)
(మిక్కిలి దుఃఖముగలవాడు దుఃఖమే లేని వాఁడు.)

28. క్షుద్రైరపి సంభూయ భూయోభిరేకో మహాన్ సుకరః పీడయితుం: (అం 6.)
(అనేకమంది నీచులతోఁ గూడి పీడింపచేయుట ఒక్కనికి చాల సుకరము.)

29. యచ్ఛీలః స్వామీ తచ్ఛీలాస్తస్య ప్రకృతయః: (అం 6.)
(యజమాని యెట్టిశీలము గలవాఁడో అతని ప్రజలును నట్టి శీలము గలవారే.)

30. ప్రతికృతీనాం విద్విషామపి వ్యసనమితిమాత్రం హృదయమర్మాణిభినత్తి (అం 6.)
(ఉన్మూలితులైన శత్రువుల వ్యసనము కూడ హృదయమర్మములను మిక్కిలి భేదించును.)

31. న కించదనీషత్కరత్వం నామ కృతాంతస్య: (అం 7.)
(విధిసేతకు దుష్కర మనునది లేదు.)

32. యత్సత్యముత్సర్పిణీ ధర్మోత్తరాణాం సిద్ధిః: (అం 7.)
(తపోధనులకు సిద్ధి హెచ్చు ననుట సత్యము.)

33. దురవగాహగంభీరస్వభావాని మహతాం చరితాని: (అం 7.)
(మహాత్ములచరితములు ఊహింపరాని గంభీరస్వభావము గలవి.)

34. శ్రద్ధాళుర్భ్రాతురంగాని చందనేష్వప్యరోచకీ: (అం 7.-శ్లో 142.)
(సోదరునియంగాలింగనము బడసినయతడు చందనాదుల నొల్లడు.)

బాలరామాయణము-రాజశేఖరుఁడు

బాలరామాయణ మనునది పదియంకముల పెద్ద రామాయణనాటకము. దీనిని రచించినది రాజశేఖరమహాకవి. బాలురప్రీతికొరకు వ్రాయఁబడిన నాటకమని కాబోలు దీనికి బాలరామాయణ మని పేరిడెను. ఈ నాటకమునఁ గల ప్రస్తావన ననుసరించి యీ కవిని గూర్చిన విషయములంబట్టి యీతఁడు మహారాష్ట్రసమీపము నందున్న చేదిమండలమున పండితబ్రాహ్మణ యాయవరవంశము వాఁ డని తెలియుచున్నది [1]. ఇతరాధారములఁ బట్టి యీతఁడు చౌహానక్షత్రియ కుటుంబమునకుఁ జెందిన అవంతిసుందరిని బెండ్లాడినకారణమున నీతఁ డును క్షత్రియుఁడే యై యుండుననికొంద రందురు. కనూజాధీశ్వరుఁ డగు మహేంద్రపాలు నాస్థానమందును. నాతనికుమారుఁడగు మహీదేవపాలుని యాస్థానమందును నీతఁ డాస్థానవిద్వాంసుఁడుగ నుండినట్లు తెలియుచున్నది. ఈ మహేంద్రపాల మహీదేవపాలదేవు లిర్వురును 903 వరకును, A.D 917 వరకును క్రమముగాఁ బాలించుచున్నట్లు తెలియుచున్నది. కాబట్టి యీ కవియు 870 A.D, ప్రాంతమున జన్మించి యుండనోపు. రాజశేఖరుఁడు తనకృతులందు వాక్పతిరాజ, ఉద్భట, ఆనందవర్ధనులను తన కావ్యమీమాంసలోఁ బేర్కొని యున్నాఁడు. వాక్పతిరాజు ఉద్భటుఁడును కాశ్మీరాధీశ్వరుఁడగు జయాపీడుని సమకాలికులుగా నున్నట్లు తెలియుచున్నది. ఈ జయాపీడుఁ డు కాశ్మీరమును 779-813 A.D. వరకు బాలించెను. కావున ఉద్భట

1. సమూర్తో యత్రాసీద్గుణగణ ఇవాకాలజలదః
సురానందః సోఽపి శ్రవణపుటపేయేన వచసా।
న చాన్యే గణ్యంతే తరలకవిరాజప్రభృతయో
మహాభాగస్తస్మిన్నయమజని యాయావరకులే॥

వాక్పతుల కాల మా 8-వ శతాబ్దపుచివరను, 9-వ శతాబ్దారంభమును కాఁగలదు. ఆనందవర్ధనుఁడు కాశ్మీరము నవంతివర్మ యేలుచుండినపు డుండెను. (857-884 A.D.) కావున రాజశేఖరుఁడు ఆనందవర్ధనునికన్న తర్వాతి వాఁడే కావలసివచ్చును 9-వ శతాబ్దముచివరభాగమునకుఁ జెందినవాఁడు కాఁగలఁడు. తర్వాతివారలలో సోమదేవుఁడు యశస్తిలకచంపువునందు 920 A.D. పేర్కొనఁబడియుండుటచే 880-927 కి లోపలివాఁడై యుండును. ఈతఁడు బాలరామాయణము బాలభారతము, విద్ధసాలభంజిక, కర్పూరమంజరి, కావ్యమీమాంస యను కృతుల రచించెను. హరివంశ మను గ్రంథమునుగూడ రచించినట్లు తెలియుచున్నది. ఈతఁడు మహారాష్ట్రదేశోద్భవుఁడో చేదిదేశోద్భవుఁడో నిర్ణయము సేయ వీలుగాకున్నది. అటులే యీతఁడు బ్రాహ్మణుఁడో క్షత్రియుఁడో కూడ నిర్ణయింప వీలు గాకున్నది. పై యంశములఁ బట్టి యీతఁడు 880-959 A.D, కాలమున నుండియుండునని చెప్పవచ్చును.

ఈతనికృతులలో బాలభారతము ప్రచండపాండవ మను నామాంతరమున రెండంకముల గ్రంథముమాత్రము లభ్యమగుచున్నదట. ఈ బాలభారత గ్రంథ ప్రస్తావనయందు నిర్భయనరేంద్రసూనుఁడగు మహీపాలదేవునివర్ణనము గలదు. నిర్భయరాజు రాజశేఖరునకు శిష్యుఁ డని తెలియుచున్నది. 'బాలకవిః కవిరాజో నిర్భయరాజస్య తథోపాధ్యాయః' అని కర్పూరమంజరీప్రస్తావనయందుండుటచే నీ నిర్భయరాజనామము మహేంద్రపాలునికే నామాంతర మని కొందరు నుడువుచున్నారు. బాలరామాయణమునను 'నిర్భయగురుర్వ్యధత్త వాల్మీకికథాం కిమను సృత్య' యనియు,'దేవో యస్య మహేంద్రపాలనృపతిః శిష్యో రఘుగ్రామణీః' (అంకము 1. శ్లోకము 18.) అనియు నుండుటచే పైవాక్యము సంగతముగనున్నది.

ఈతనిగ్రంథములలో శైలినిబట్టియు వస్తువిస్తరణవిషయములంబట్టియు బాలరామాయణ, బాలభారత, విద్ధసాలభంజిక లితని తొలికృతు లనియుఁ గర్పూర మంజర్యాదులు తర్వాతివనియుఁ జెప్ప నగును. కావ్యమీమాంసయం దీతని సర్వతోదిక్కపాండిత్యము తెలియుచున్నది. ఇం దీతఁడు పెక్కు గ్రంథకర్తలను వారి గ్రంథములను బేర్కొనుటచే నీతఁ డాగ్రంథములపరిచితి కలవాఁడనియు సంస్కృతప్రాకృతభాషలయందుఁ బ్రసిద్ధపండితుఁ డనియుఁ దెలియుచున్నది. సంస్కృతమునకన్నఁ బ్రాకృతమే యీతని కభిమతభాష యని యీ క్రింది శ్లోకమువలనఁ దెలియుచున్నది.

"పరుషాః సంస్కృతబంధాః ప్రాకృతబంధో భవతి సుకుమారః।
పురుషమహిళానాం యావదంతరం తావదితి మానమ్॥ "
(కర్పూరమంజరీ)

సంస్కృతబంధములు పరుషములు, ప్రాకృతబంధము సుకుమారముగా నుండును. ఈ రెంటికిని పురుషమహిళల కెంతభేద ముండునో యంత భేద మున్నదని తెల్పెను.

ఈతఁడు తన పాండిత్యమును తానే ప్రశంసించుకొనెను. తాను వాల్మీక్యవతారమే యని భావించును,

"బభూవ వల్మీకభవః కవిః పురా తత ప్రపేదే భువి భర్తృమేంఠతామ్।
స్థితః పునర్యో భవభూతిరేఖయా స వర్తతే సంప్రతి రాజశేఖరః॥ "
(అంకము 1. శ్లో 16.)

తొలుత వాల్మీకిగా నుండి యవల మేంఠకవిరూపమునను, నటుపిదప భవభూతి నామమునను, ప్రకృతము రాజశేఖరుఁడుగాను జన్మించె నని తనకు వాల్మీకిత్వమును జెప్పికొనెను. తా రచించిన బాలరామాయణమునసే 'అదృష్టచరమశ్రుత పూర్వం వస్తు ఉపస్థాపయతా అనేన' అని

నుడివియున్నాడు. సంస్కృత కవీశ్వరులలో నీతఁడును బేరెన్నికగల కవియే. ఈతనిపేర కొన్నిసూక్తిశ్లోకములు పలువురు భోజదేవ, క్షేమేంద్ర, శౌర్జరవాదు లుదాహరించి యున్నారు. వానినిబట్టి యీతఁడు పైనుదహరించిన బాలరామాయణాదులే కాక యింకను పెక్కుగ్రంథముల వ్రాసియుండు నని తోచుచున్నది. ఈతనికి శ్లోకరచనమున శార్దూలవిక్రీడిత మన చాలప్రీతి. కావుననే యీతని శార్దూలవిక్రీడితములు నిజముగ శార్దూలవిక్రీడితములట్ల గంభీరముగా నుండుటచే 'శార్దూలవిక్రీడితైరేవ ప్రఖ్యాతో రాజశేఖరః' యని యీతనిఁగూర్చి కవీశ్వరు లనుకొందురు.

ఈ బాలరామాయణము అలంకారసంగ్రహమున నాటకమునకుఁ బది యంకములు గూడ నుండునను లక్షణమునకు లక్ష్యముగాఁ బేర్కొనఁ బడినది, 'బాలరామాయణం నామ దశాంకం నాటకం స్మృతం'. ఇందు వస్తువిస్తరణము చాల చమత్కారముగా సాగినది. ఎక్కువభాగము కథయంతయు విష్కంభాదులమూలముననే నడచినది. మొత్తముమీద నీ నాటకము రసవంతముగ వివిధవిషయములఁ దెల్పుచు ప్రశంసార్హమై యలరారుచున్నది.

కథాసంగ్రహము

ప్రథమాంకమున విష్కంభముననే విశ్వామిత్రశిష్యుఁడు శునళ్శే పుఁ డును, తాపసవేషమున రావణప్రణిధియు వారి సంభాషణమున శివధనురారోపణరూప పణమును నెరవేర్చి రావణుఁడు సీతను బరిణయమాడ నున్నాఁడని తెలియఁ జేయుదురు.

రావణుఁడు ప్రహస్తసమేతుఁడై మిథిలానగరమునకు వచ్చును. జనక శతానందులు వారలకు స్వాగత మొసగుదురు. రావణుఁడు తొందరపడుచు

పణవిషయమగు శివధనువును దేఁగోరును. సీతయుఁ దనచెలులతో నటకు వచ్చును. రావణుఁడు సీతను జూచి యామెసౌందర్యమును గొనియాడుచు పణమును దలంచి శతానందునిపైఁ గోప మొందును. సీతావ్యామోహమున రావణుఁడు ధనువు నెత్తఁబోవ జనకుఁడు తనకు రావణుఁడు అల్లుఁడు కాకుండుగాక యని దైవమును బ్రార్థించును. రావణుఁడు ధనువును గ్రహించి నిరుత్సాహమున నీసున క్రిందఁ బడవేయును. జనకుఁ డందులకుఁ గోప మూని ధనుష్పాణియై తన్ను నిందించురావణుని యుద్ధముఁ జేయఁ జీరును. తెరచాటునుండి వల దను కేక విని జనకుఁడు మిన్నకుండును. అంత శతానందుఁడు రావణునితో గర్వము మాను మనుచు నట్లు గర్వించుట ధనురారోపణము సేసిన వానికే తగుననియు నుడువును. రావణుఁ డందులకుఁ గోపోద్దీపితుఁడై పణ నిర్వహణమున సీతను జేపట్టినవాఁ డెట్టి జెట్టియైనను తానతనిని గ్రూరముగా వధింతు నని ప్రతినఁ బట్టును. అవల నతఁడు సీతావిరహోద్దీపనమున శాంతికై చెంతనున్న యొక యుద్యానవనమును జేరును. ఇది ప్రతిజ్ఞాపౌలస్త్యమను ప్రథమాంకము.

ద్వితీయాంకమున శివభక్తుఁడగు భృంగిరిటుఁడును నారదుఁడును శుద్ధవిష్కంభమున సంభాషించుదురు. భృంగి శివలీలను, శివమాహాత్మ్యమును గొనియాడును. నారదుఁడు నిజవినోదమునకై యేదేని కలహముఁ గల్పింప నెంచుచు, రావణపరశురాముల క్రోధముల రెట్టించి యానందింపఁ గోరును. భృంగినారదులు రావణపరశురాముల యోగ్యతలఁ జర్చింతురు. భృంగి శివాజ్ఞచేఁ దాను రావణపరశురాముల కలహమును వారింపఁ బోవుచున్నట్లు నుడువ నారదుఁడును శివునియందలిగౌరవముచేఁ దన ప్రయత్నమునుండి విరమించి, రామ పరశురాములకుఁ గలహమును గల్పింప నయోధ్య కేగును.

రావణుఁడు ప్రహస్తునితో బ్రవేశించి సీతావ్యామోహమున మిగుల విరహోత్కంఠుఁడై యుండును. ప్రహస్తుఁ డాతని యవస్థనుండి మరల్పఁ బరశురామవృత్తాంతమును దలపెట్టి. భార్గవపరశువు నడుగఁ బంపఁబడిన మాయామయుఁడు నిరాకృతుఁడై వచ్చెనని తెల్ప, రావణుఁడు క్రోధోద్దీపితుఁడై పరశురాముఁ డెచ్చో నున్నాఁ డని విచారించి మిథిల కేతెంచె నని గ్రహించును. ఇంతలోఁ బరశురాముఁడు గౌరీశంకరులు తన్నెట్లు లాలించినదియుఁ దలపోసి శివధనువు నవమానించిన రావణు నెదుర్కొన నిశ్చయించి యుండును. రావణుఁ డాతని నిశ్చయము నెరింగి పరశురామునితోఁ బోర సిద్ధమగును. ఇరువురు నన్యోన్యము దూషించుచు, హేళనములు సల్పుచు వారి వారి యాయుధముల మెచ్చికొనుచుందురు. ఇరువురును బూర్వవిషయముల స్పృశించి యొకరి నొకరు నిందింతురు. ఇరువురు నుద్దీప్తులై యుద్ధమునకుఁ గడంగుదురు. క్రమముగా వారు ఆగ్నేయ, వారుణ, వారణ, పంచాననాస్త్రములఁ బ్రయోగింతురు. అవల భృంగిరిటాదులు సమరాంగణమునకు వచ్చి వారి నిర్వురయుద్ధమునుండి విరమింపఁ గోరుదురు. వారు నట్ల చేయుదురు. అందరు నిష్క్రమింతురు. ఇది పరశురామరావణీయ మను ద్వితీయాంకము.

తృతీయాంకమున సువేగాచిత్రశిఖండు లను రెండు గృధ్రములు మిశ్రవిష్కంభమున సంభాషించుచు విశ్వామిత్రుఁడు రామలక్ష్మణుల నిజాశ్రమమునకుం దోడ్కొని వచ్చె ననియు, నచట రాముఁడు తాటకామారీచులఁ జెండాడి సుబాహుని బారదోలె ననియు, రావణుఁడు సీతావిరహోత్కంఠుఁడై శతమఖు నేదేని తాపశమనమునకు బంపుమని యాజ్ఞాపించె ననియు. నటులే యింద్రుఁడును రావణవినోదార్థము భరతరచితమగు సీతాస్వయంవర మనునాటకమును బ్రదర్శింప భరతపుత్రుల

నూర్వురను, నప్పరసలతో లంకకుఁ బంపె ననియుఁ దెలియఁ జేయుదురు. అవల రావణప్రహస్తులు ప్రవేశించి నాటకమును జూడనువ్విళ్ళూరు చుందురు. మన్మథుఁడు నాందిని బఠింపఁ గోహలుఁడు సీతాస్వయంవర మను నాటకమును బ్రదర్శింప నారంభించును. రామలక్ష్మణులు విశ్వామిత్రునితో మిథిలానగరమును బ్రవేశింతురు. విశ్వామిత్రుఁడు రామలక్ష్మణుల జనకునకుఁ బరిచయపరచును. రాముఁ డచ్చో సీతను గాంచి యామెసౌందర్యమును మెచ్చుకొనును. రావణుఁడును సీతను జూచి యామెరూపరేఖాకమనీయ వైఖరుల భళీ భళీ యని ప్రశంసించును. ధనురారోపణ మను పణనిర్వహణ మారంభింతురు. స్వయంవరమునకు విచ్చేసిన భూపాలు రెల్లరును వరుసగా వచ్చి ధనువు నెత్త యత్నింతురు. నరకుఁడు, పాండ్యుఁడు, శత్రుంతపుఁడు, చైద్యుఁడు, సింహళేంద్రుఁడు, మధురానాథుఁడు, అవంతిదేశపు సత్యవ్రతుఁడు, కుంతలేశ్వరుఁడు, కాంచీపతి, లాటాధిపతి. కుశస్థలిరాజు మొదలగువా రనేకులు ధనువును పైకి నెత్తలేక పోయిరి. రాముఁడు మాత్రము మిగిలియుండును. రావణుఁడు తా నా ధనువు నెక్కిడుదు నని ప్రగల్భములు గొట్టుచు లేవఁ బోవ ప్రహస్తుఁ డది నాటకమని ప్రబోధించును. అవల రాముఁడు ధనువు నవలీలగా నెత్తి యెక్కిడఁ బోవ నది భగ్న మగును, జనకుఁ డానంద మంది సీతనిచ్చి కల్యాణముఁ జేయును. రావణుఁ డాగ్రహించి రాముని దూరును. ప్రహస్తుఁడు మరల రావణున కది నిజమగు స్వయంవరము కాదనియు, నాటకమే యనియు, హెచ్చరించును. రావణుఁడు మరలఁ దొలుతటి నిజప్రతిజ్ఞను దలపోసి యటుల నిర్వహింప నిశ్చయించును. ఆ నాటక మంతయు బూటక మని తెలిసికొని లజ్జించి, రాముఁడు మాత్రము తన కోపమునకు గురి యయ్యె నని గ్రహించును. నాటకమున నటించిన నటకు లందరును రావణునొద్ద సెలవుగైకొని వెడలిపోదురు. ఇందు

రావణుఁడు నాటకమును సత్యముగ గ్రహించి తాఁజేసిన చేష్టలకు సిగ్గిలుటచే నిది విలక్షలంకేశ్వర మను తృతీయాంకము.

చతుర్థాంకమున భవభూతినామకవటుఁ డుపాధ్యాయునితోఁ బ్రవేశించి మిశ్రవిష్కంభమున సంభాషించుచు పరశురాముఁడు క్షీరకంఠుఁ డగు రాముని గలసికొన బయలుదేరె ననియు, శివధనువును భంగము గావించె ననుకారణమున నాతనితోఁ బోర నేగుచున్నాఁ డనియుఁ దెలుపుదురు. దశరథుఁడు రథారూఢుఁడై మాతలితో స్వర్గలోకమునుండి దిగి వచ్చుచుండును. త్రోవలో మాతలి పరశురామవృత్తాంత మంతయు తొలినుండి నుడువుచుండును. పరశురాముఁడు పరమశివునొద్ద శుశ్రూష గావించి, వారికిఁ బ్రీతిపాత్రుఁ డగుటయుఁ బరశువు ప్రసాదముగ గ్రహించుటయుఁ, దల్లియగు రేణుకను దండ్రియాజ్ఞచే సంహరించి మరల పునరుజ్జీవితనుగాఁ జేయుటయు, హైహయులు భార్గవుని జంపి రేణుకను నిరువదియొక్కమారు కొట్టుట చేక్ష త్రియులపై దండెత్తి యిర్వది యొక్కమారు క్షత్రియసంహారము గావించుట మున్నగు పరశురామమాహాత్మ్యముల నెల్ల మెల్లగాఁ దెలిపి తుద కాతఁ డెచటనో తపము గావించుచున్నాఁ డని విన్నవించును. క్రమముగా వారు మిథిలఁ జేరగనే దశరథుఁడు మాతలి నంపివేసి సీతారాములఁ జూడ నుత్కంఠుఁడై జనకమందిరముఁ బ్రవేశించును.

అత్తవారింటి కేగ సిద్ధముగనున్న సీతకు జనకశతానందులు హితబోధలు గావించుచుందురు. దశరథుని జూడగనే జనకాదులు స్వాగత మొసఁగి యెంతో ప్రియముగ సల్లపింతురు. అంత పరశురాముఁడు క్రోధోద్దీపితుఁడై ప్రవేశించును. రాముఁడు నమస్కరింపఁ బోవును. శివధనుర్భంగమునకుఁ గ్రుద్ధుఁడై పరశురాముఁడు రాముని సంహరింతు ననియు నచ్చోఁ జేరియున్న క్షత్రియులలో నెవ్వరేని బలశాలు లున్నచో

రాముని రక్షింపుఁడనియుఁ బల్కును. రాముఁడు వినయమునఁ దనచేష్టకుఁ దన్ను మన్నింప వేడును. కాని పరశురాముఁడు మూర్ఖముగ సంహరింతు ననియే నుడువును. శ్రీరాముఁ డంత మరింతవినయమున నంజలి బంధముతోడ నెంత వేడినను పరశురాముఁ డట్లే మూర్ఖముగనుండును. విశ్వామిత్రుఁడు ప్రవేశించి పరశురాముని విరమింపఁ గోరును. ఆ వాక్యములఁ గూడఁ బెడచెవినిడి పరశురాముఁడు మరింత మూర్ఖమున నుండ శ్రీరాముఁడు మరల వినయాతిశయమున నమస్కరించి కఠినోక్తులఁ జాలింప వేడినను వినక పోవుటచేఁ పరశురాము నెదుర్కొందు నన నాతఁడు (పరశురాముడు) నిజవైష్ణవధనువు నెక్కిడనొసఁగ దానిని లక్ష్మణుఁడు గ్రహించి యెక్కిడును, జనకుఁడు సంతసించి యూర్మిళను లక్ష్మణున కిచ్చి వివాహముఁ జేయ నిశ్చయించును. అవల విశ్వామిత్రానుమతిని మాండవీశ్రుతకీర్తులఁ గూడ భరతశత్రుఘ్నుల కీయ నిచ్చగింతురు. పరశురాముఁ డంత భంగపాటునకు సిగ్గిలి రోషవచనములతో నేమియుఁ జేయలేక మరల పోరవత్తునని పట్టణము వెలుపలికి వెడలిపోవును. ఇందు భార్గవుఁడు భంగపడుటచే నిది భార్గవభంగమను చతుర్థాంకము.

పంచమాంకమున మాల్యవన్మాయామయులు ప్రవేశించి విష్కంభమున సంభాషింతురు. రావణుఁడు రామున కొక సందేశము నందఁజేయు మని మాయామయుని బంప, నాతఁడు రాముచెంత కరుగుటకు భయ మొందుచు మాల్యవంతుని సలహానుగోర వచ్చును. ఇంతలో మిథిలనుండి యొక చారుఁడు వచ్చి శ్రీరాముఁడు పరశురాము నోడించె నను విషయముగల లేఖ నొకదాని నందించును. రావణునివిరహతాప మడంప మాల్యవంతుఁ డొక సీతను బోలిన యంత్రపుబొమ్మ నొకదానిని జేయించి మాటాడ నేర్చిన యొక శారిక నా యంత్రమున నిడి చెప్పినట్లు మాటాడ నేర్పి సిద్ధముఁజేసి

యుండును. సీతచెలికత్తె సిందూరికవలె మరొక యంత్రపుబొమ్మను గూడఁ జేయించి యుంచును, రావణునివినోదార్థము ఈ వన్నుగడ మాల్యవంతుఁడు పన్నెను. మాల్యవన్మాయామయు లిర్వురు నీమాయాసీత, మాయాసిందూరికల రావణునిచెంతకుఁ బంప నెంతురు. మాయాసిందూరిక రావణుని స్తోత్రము సేయుచు సీత యతనిని మిక్కిలి ప్రేమించుచున్నట్లు పల్కును. మోహాంధుఁడగు రావణుఁడు నిక్కముగ నామాయాసీతను సీతగా నెంచి యనురాగభాషణములతో సమీపించి యామెను గౌఁగిలించికొనును. అంత నా తాకుడు స్త్రీస్పర్శ గాకుండుట నెరింగి, బొమ్మయని తెలిసికొని మాయామయునితో దానిని తన పడకటింట నుంచు మనుచుఁ దాను సమీపమున నున్న యుద్యానమును బ్రవేశించి నిజతాపశాంతికై వలయు వివిధోపచారములఁ బడసి, సర్వర్తుసంసేవనము గావించి యెంత చేసినను నవి యెల్ల నాతనితాపమును మరింత హెచ్చింపఁ జేయ నతఁడున్మత్తుఁడై తిరుగుచు కన్నపశువును పక్షిని గూడ సంబోధించుచు తుదకు మూర్ఛిలును, ఇంతలో శూర్పణఖ వచ్చి తన భంగపాటును, తనకు ముక్కు చెవులఁ గోసి రని రామునిపై నేరము సెప్ప రావణుఁడు కుపితుఁ డై రాముని జంపుదు నని యామెతో నుడువును. ఇది యున్మత్తదశానన మను పంచమాంకము.

షష్ఠాంకమున మిశ్రవిష్కంభమున శూర్పణఖామాయామయులు ప్రవేశించి మాల్యవంతుని సామర్థ్యమును గొనియాడుచు నాతనిసన్నిధిఁ జేరుదురు. రావణుఁడు సీతావంచనోక్తుల నమ్మి నిజముగ సీతప్రత్యక్ష మగు ననియుఁ దా నామెను గౌఁగిలించుకొనవచ్చు ననియు నువ్విశ్శూరుచుండ, మాల్యవంతుఁడు రావణు నోదార్చు నుపాయ మేమియుఁ గానక యెటులా యని యాలోచించుచుండును. అంత శూర్పణఖామాయామయులు తాము మాయాకైకేయీ దశరథ వేషములతో,

సత్యకైకేయీ సత్యదశరథు లిరువురును దేవేంద్రునికి సహాయముఁ జేయ నమరావతి కేగియున్నతరి నయోధ్యలోఁ బ్రవేశించి పౌరులచే స్వాగతముఁ బడసి యంతఃపురముఁ జేరి యుండినట్లును, నత్తరి, మాయాకైక తన రెండువరములను వెంటనే కొనసాగించవలయునని మంథరమూలమున కోరినట్లును, నందుల కామాయాదశరథుఁడు కైకవరముల కంగీకరించి రామునిపై నిజముగఁ బ్రేమయున్నట్లు కడుంగడునశ్రులు రాల నేడ్చి మిగుల విలపించినట్లును, రాము నడవుల కేగ నాజ్ఞాపించినట్లును, రాముఁడును వెంటనే వినయమున సీతాలక్ష్మణులతో బయలుదేరె ననియు నంత వారిరువురును (మాయాకైకేయీదశరథులు) నంతఃపురము వీడి యా రూపముల విడచి పౌరులలోఁ గలసియుండినట్లును, ఎవ్వరో రాక్షసులు మాయచేసి రాముని ట్లడవులపాలు సేసి రనుకొనుచుండ తాము లంకకు విచ్చేసినట్లును దెల్పి, యవ్వలికార్యభారమాతనిపై నున్నదని మాల్యవంతునితో నుడువుదురు.

ఇంతలో సత్యదశరథుఁడును, సత్యకైకేయియుఁ బ్రవేశించి వామదేవుని వలన జరిగినవృత్తాంత మంతయు విని చాల విచారపడుదురు. అంత సుమంత్రుఁడు సీతాలక్ష్మణులు నర్మదఁ జేరువరకు జరిగినవృత్తాంతమును వారలకుఁ దెల్పును. అడవులలో సీతాలక్ష్మణుల యవస్థ లన్నియు సుమంత్రుఁడు పూసగ్రుచ్చినట్లు నుడువ నందరు నేడ్తురు. ఇట్లు సీతారామాదులఁ దలపోయుచుండ నింతలో రత్నఖండుఁ డను గృధ్రము జటాయువుపనుపున వచ్చితి నని దశరథునకు సీత రావణునిచే నపహరింపఁ బడినదనియుఁ, ద్రోవలో జటాయు వెదుర్కొని రావణునితోఁ బోరి మడిసె ననియు సుమత్రుఁడు నుడివినవృత్తాంతమున కవ్వలి వృత్తాంతమును దెలిపి నిజనివాసమునకు జనును. ఇందు దశరథుఁడు నిర్దోషిగాఁ జూపఁబడుటచే నిది నిర్దోషదశరథ మను షష్ఠాంకమని పేరువడసినది.

సప్తమాంకమున వంది యగు కర్పూరచండుఁ డను వాఁడు చందన చండునితో సంభాషించుచు విష్కంభమున, శివధనుర్భంగము మొదలుకొని, సీతాపహరణాది రామాయణ వృత్తాంతము రాముఁడు సముద్రతీరముఁ జేరి లంకకుఁ బోవ సముద్రమును శాంతింపఁజేయు ప్రయత్నమువరకును సంగ్రహముగఁ దెలుపును.

అవల సముద్రుఁడు ప్రత్యక్షమై సేతుబంధనమున కనుమతి నిచ్చును. నలుఁడు మొదలగు కపికుంజరుల సేతుబంధన యత్నము మూడుపాళ్ళపూర్తి కాగా రావణసేనలు కపిసైన్యముతోఁ బోరును. రావణుఁడు దివ్యరథా రూఢుఁడై సీతాసమేతముగ రామలక్ష్మణుల యెదట గోచరించును. రాముని నిజశక్తిని జూప పంతమాడి రావణుఁడు సీతకంఠము రామునెదుట నతఁడు చూచుచుండ ఖండించును. సీతశిరము తెగి పడుచుండ రాముఁడు తనచేతులతో దానిని గ్రహించును. రావణుఁడు మాయ మగును. రామలక్ష్మణులు నిజముగ సీతయే ఖండింపఁబడె నని మిగుల వగతురు. లక్ష్మణుఁడు రావణునిఁ జావ నడప శపథ మూనును. అవల సీతాశిరము మాటాడుచుండుట గుర్తించి చెంత కేగ నది రావణాంతఃపురమందలి దారుమయసీతాశిరమై యందుండిన శారిక రామలక్ష్మణులు యుద్ధమునుండి మరలిపోవుటకు రావణునిచేఁ గావింపబడిన యుక్తియని తెల్పును. ఈ శారిక నుడివిన వృత్తాంతమువలన రామాదులు చాల సంతసించి రావణుని బరిమార్ప నిశ్చయింతురు. రావణపక్షమున సింహనాదుఁడనువాఁడు మేఘనాదుని సోదరుఁడు క్రోధోద్దీపితుఁడై రంగమునకు వచ్చి రామునితో వాగ్ఘర్షణ మొనర్చి పోర నారంభించును. ఇది అసమపరాక్రమంబను సప్తమాంకము.

అష్టమాంకమున మిశ్రవిష్కంభమున నిద్దరు రాక్షసులు సుముఖదుర్ముఖులు సంభాషించుచు సింహనాదుఁడు మరణించె ననియుఁ

దులాద్యూతమున రామునిపక్షము గెల్చిన, సీతయు, లంకయు రామునివశ మగునట్లును రావణ పక్షము గెల్చిన సీతయు నయోధ్యయు రావణుని వశమగునట్లును పందెము నిర్ణయించుకొని రామపక్షమున నంగదుని రావణపక్షమున నరాంతకుని నంకకారులగా నియమించుకొని పోర నరాంతకుఁడు మడిసినట్లును. త్రిజట యీ వృత్తాంతము నంతయు సీతకు విన్నవించినట్లును. రావణుఁడుమాత్రము సిగ్గు విడచి పందెముప్రకారము రామునివశము జేయక నిజసేనలను కపిసైన్యములతోఁ బోరఁ బురికొల్పుచున్నట్లును దెలియఁ జేయుదురు.

అవల రావణుఁడు ప్రవేశించి కరంకకంకాళుల నిర్వుర కుంభకర్ణుని మేల్కొలుపఁ బంపును. మరియు సుముఖదుర్ముఖులను లక్ష్మణ మేఘనాద యుద్ధవార్తలఁ దెలియఁ జేయఁ గోరి వారల రణరంగమున కంపును. మేఘనాదుఁడు నిజమాయాజాలము నంతయుఁ బ్రయోగించి లక్ష్మణునితోఁ దీవ్రముగాఁ బోరును. పరస్పరము వారు దుర్భాష లాడుచు నిందించుకొందురు. ఇంతలోఁ గుంభకర్ణుఁడు మేల్కొని యుద్ధమునకుఁ బోవును. సుముఖదుర్ముఖులు లక్ష్మణమేఘనాదులపోరు వర్ణింపుచు ప్రపంచవ్యాప్తమగు నాగ్నేయాస్త్రమును మేఘనాదుఁడు ప్రయోగించెనని నుడువును. కుంభకర్ణుఁడు రణరంగమునకు రాగా రాముఁ డతనితోఁ బోర కపిసైన్యముతో వచ్చును. కపులు వృక్షశాఖల నాయుధములుగాఁ గొని వత్తురు. సుగ్రీవుఁడు కపులలో ముందుకు వచ్చి కుంభకర్ణు నెదుర్కొనును. లక్ష్మణమేఘనాదయుద్ధమున మేఘనాదుని యాగ్నేయాస్త్రమును లక్ష్మణుఁడు వారుణాస్త్రమున శమింపఁ జేయును. అవల వారు పరస్పరము తామిస్ర, చంద్ర, రాహు, నారాయణాస్త్రములను మరియు, వైష్ణవ మన్మథాస్త్రములఁ బ్రయోగింతురు. తుదకు లక్ష్మణుఁడు శత్రువు ప్రయోగించిన మన్మథాస్త్రమునకుఁ బాశుపతాస్త్రమును

బ్రయోగించును. లక్ష్మణమేఘనాదయుద్ధమును, సుగ్రీవకుంభకర్ణ యుద్ధమును పర్యాయముగా వర్ణింపఁబడును. తుదకు రాముఁడే కుంభకర్ణు నెదుర్కొని సంహరించును. రావణుఁడు దుఃఖించును. మరియు మేఘనాదుఁడు గూడ మడిసె నని విని యనర్థపరంపరలు గుమిగూడి సంభవించుచున్న వని మిగుల వగచి మండోదరీభవనమున కేగును. ఇది వీరవిలాప మను అష్టమాంకము.

నవమాంకమున విష్కంభమున యమభటుఁ డొకఁడు నాల్గు దినములలో జరిగిన యుద్ధసందర్భమున మరణించిన రాక్షసనాయకుల జాబితా చిత్రగుప్తునకుఁ జదివి వినిపించుచు పలువురు చచ్చి రని తెల్పును. ఇంద్రదశరథులు, నొక చారణమిథునంబును నాకసమునఁ బ్రవేశించి రామరావణయుద్ధము జూచుచుందురు. చారణమిథునము యుద్ధమును వర్ణించుచుండ నింద్రుఁడు రాముని ద్రిపురాంతకునితోఁ బోల్చును. రామరావణయుద్ధ మతిభయంకర మగును. వారి యస్త్రప్రయోగములచే లోకము లన్నియు గాసిచెందుచుండును. ఆగ్నేయాస్త్ర వాయవ్యాస్త్రములును, జలధర, ఉదన్వదస్త్రములును, అగస్త్యాస్త్రంబును ప్రయుక్తము లగును. రాముఁడు రావణశిరముల వరుసగా ఖండింప నతఁడు క్రమముగా నవాననాది నిరాననుం డగుచుండును. మరల నా శిరములు మొలచుచుండును. రాముఁడా శిరములు మాయాశిరము లని తెలిసికొనును. పైనుండి చూచుచుండిన దశరథుఁడు మాయావి యగు రావణునితో రాముఁ డెట్లుపోరుచున్నాఁడా యని యచ్చెరువొందుచుండును. అవల రాముఁడు మాయాహరాస్త్రమును బ్రయోగింప రావణునిమాయ యదృశ్యమై రావణుఁడు ఏకాననుఁడే యగును. రావణుఁడు రాముని రథంబుతో సందిటఁ బట్టి గిరగిర త్రిప్పును. దశరథుఁ డది గాంచి విహ్వలుఁ

డగును. ఇంతలో రాముఁడు రావణుని నొక్క బ్రహ్మాస్త్రముచే నేలఁ గూల్చును. దేవతలు పుష్పవృష్టిఁ గురిపింతురు. ఇది రావణవధం బను నవమాంకము.

దశమాంకమున మిశ్రవిష్కంభమున లంక, అలక యను నిరువురును లంకానగరదౌర్భాగ్యమును గురించి విచారించుచు సీత యగ్నిప్రవేశ మొనరించుటను దిలకింతురు. సీత పరిశుద్ధురా లాయె ననియు, రాముఁడు సీతాసమేతముగను, బరివారయుతముగను నయోధ్యకు మరలి పోనున్నాఁ డనియుఁ దెలియఁ జేయుదురు.

అంత రామలక్ష్మణులును, సుగ్రీవవిభీషణులును, సీతాత్రిజటలును, దివ్య విమానారూఢు లగుదురు. విభీషణుఁడు లంకాధిపతి యని రాముఁడు సీతకు నుడువును. రామసుగ్రీవులు విమానమునుండి సీతకు యుద్ధభీభత్సదృశ్యములఁ జూపుదురు. వారు హిమవంతముఁ జూచుచుండ రత్నశేఖరుఁడను విద్యాధరుఁడు వారలఁ స్తుతించి, హిమవంతునిగొప్ప తనముంగూర్చి నుడువును. అవల వారు కైలాసము, అలక, మానస సరోవరము మున్నగువానిని జూచి క్రమముగా మేరుమందరపర్వతములఁ దిలకించి చంద్రమండలము దాటి బ్రహ్మలోకముదాక పోదురు. రత్నశేఖరుఁడు రామునొద్ద సెలవు గైకొని వెడలిపోవును.

పిదప వారు మరల సేతువున కేగి యటనుండిబయలుదేరుచుఁ ద్రోవలో మతంగాశ్రమముం జూచుచు తామ్రపర్ణిజన్మస్థాన మగు మలయపర్వతము మీఁదుగాఁ బోయి యగస్త్యాశ్రమము నాతని తపోవనముం గాంచి విమానము దిగి యయ్యగస్త్యాశ్రమముం దర్శింతురు. రాముఁ డగస్త్యునకుఁ బ్రణమిల్ల నందరును నమస్కరింతురు. అగస్త్యుఁడును సీతవలన నిరువురుపుత్రులంబడయుదు వని రాము నాశీర్వదించును. పట్టాభిషేకముహూర్త మాసన్నమగుటచే నగస్త్యుఁడు శ్రీరాముని

వీడ్కొలుపును. అంత వారందరును మరల విమానారూఢులై ద్రవిడదేశము దాటి సప్తగోదావరమున భీమేశ్వరునకు నంజలు లర్పించి వరుసగా కావేరిని, కర్ణాటదేశమును, మహారాష్ట్రమును జూతురు. అవల విదర్భ కుంతలదేశముల దర్శించుచు నర్మదానదిని లాటదేశమునుఁ దిలకింతురు. రాముఁ డా యాదేశవిశేషముల సీతకుం దెల్పుచు తత్తద్దేశస్త్రీస్వభావముల వర్ణించుచుఁ గ్రమముగా ఉజ్జయిని, మాళవ, పాంచాల దేశముల దాటి ప్రయాగ, కాశీ నగరములను గూడ దాటి పోవుదురు. అత్తరి సీత రామునిఁ బరశురామవిజయప్రశంసచేఁ గొనియాడ రాముఁడు సిగ్గుపడును. అవల వారందరును నయోధ్యలో దిగుదురు. రాముఁడు భరతాదుల నాలింగన ప్రియభాషణాదులతో సంతసపరచును. సుగ్రీవవిభీషణాదులు భరతశత్రుఘ్నులు నన్యోన్యము గౌఁగిలించికొని యానందింతురు. అంత వసిష్ఠానుమతిని రాముఁడు పిత్ర్యంబగు సింహాసనము నలంకరించును. పిదప కుబేరుఁడు కోరగా విమాన రాజమును బంపివేయును. ఆనందముగా నందరు గూడ కథమోదాంతముగా ముగియుచున్నది. ఇది రాఘవానంద మను దశమాంకము.

నాటకవిశేషములు

రాజశేఖరుఁడు రామభక్తుఁడు. తన బాలరామాయణ ముత్తమోత్తమమని పేరుగడింప నెంచి యద్భుతముగ నుండునట్టు లెన్నేని నూతనాంశములను ననందర్భముగఁ బొదివి రచించెను. నాటకారంభముననే యీ నాటకము వీరాద్భుతరసప్రాచుర్యము గలది యని నాట్యాచార్యునినోటనే 'వీరాద్భుత ప్రాయరసే ప్రబంధే లోకోత్తరం కౌశలమస్తియస్య' యని తెలుపుచున్నాఁడు. ప్రస్తావనయందే నాట్యాచార్యధూర్తిలసుతాపరిణయవిషయముం దెచ్చి,

'అహమేవ హరిష్యామి పరిణేతుః పురోపి తాం'

అనియు,

"అపి ద్వీపాంతరాదేష హృతాం ప్రత్యాహరామి తామ్।
కళత్రహరణే పుంసాం కియదర్ణవలంఘనమ్॥"

అనియు నుడివి కథావస్తువగు సీతాపహరణ, సీతాప్రత్యానయనరూప విషయమును స్ఫురింపఁ జేయుచున్నాఁడు. స్వవిషయమును గూడ నుడువుకొను నాచారప్రకారము రాజశేఖరుఁడు,

'నిర్భయగురుర్వ్యదత్త స వాల్మీకికథాం కిమనుసృత్య'

అని తాను నిర్భయాపరనామకుఁ డగు మహేంద్రపాలునకు గురు వని తెల్పికొనెను. వాల్మీకికన్న నీ కవి రామచంద్రకథారచనమున నేమేని విశేషముఁ జూపెనా యని శంకింపఁ జేసి నిజచాతుర్యమును సూత్రధారముఖముననే వెల్లడించుచున్నాఁడు, తొలుత నీ కవి,

'సతాం ప్రజ్ఞోన్మేషః పునరయమసీమా విజయతే; హే సంతః।
శృణుతావధత్త విధృతో యుష్మాసు సేవాంజలిః॥'

అని వినయముగ సత్పురుషులకు వందన మాచరించి మరల నిజవిషయమును,

'గిరః శ్రవ్యా దివ్యాః ప్రకృతిమధురాః ప్రాకృతధురాః
స భవ్యోపభ్రంశః సరసరచనం భూతవచనమ్।
విభిన్నాః పంథానః కిమపి కమనీయాశ్చ త ఇమే
నిబద్ధా యస్త్వేషాం స ఖలు నిఖిలేఽస్మిన్ కవివృషా॥'

అని మనోజ్ఞములును, స్వభావసుందరములును ప్రాకృతభాషాగుంఫితములు నగు తనవాక్కులు శ్రవ్యము లనియు, అపభ్రంశాది ప్రాకృతభాషాపదముల

లలితముగఁ బ్రయోగించి యథార్థవచనముల భిన్నమార్గముల నీ కృతిలోఁ జూపుచున్నట్లును దెల్పియున్నాఁడు. మరియు,

'బ్రూతే యః కోపి దోషం మహదితి సుమతిర్బాలరామాయణేస్మిన్।
ప్రష్టవ్యోఽసౌ పటీయానిహ భణితిగుణో విద్యతే వా న వేతి॥'
(అంకము 1. శ్లోకము 12.)

అని తన బాలరామాయణము బృహద్గ్రంథమైనను నందు వచనమాధుర్యము గలదనియు నద్దాన పఠనరుచిగలిగించుననియు, తానే నిజపాండిత్యమునఁ బ్రామాణ్యము గల్గి చెప్పికొనినాఁడు. తన జన్మాదివృత్తాంతమును,

'సమూర్తో యత్రాసీద్గుణమయ ఇవాకాలజలదః
సురానందః సోఽపి శ్రవణపుటపేయేన వచసా।
న చాన్యే గణ్యంతే తరలకవిరాజప్రభృతయో
మహాభాగస్తస్మిన్నయమజని యాయావరకులే॥'
(అంకము 1. శ్లోకము 13.)

అని తనది గొప్పపండితవంశ మని, అకాలజలదుఁ డను గొప్పకవివంశమునకుఁ డాఁ జెందినవాఁ డని తెల్పికొనెను. మరియుఁ దాను వాల్మీక్యవతారమే యని నుడివి, శంకరవర్మవర్ణన మని,

"పాతుం శ్రోత్రరసాయనం రచయితుం వాచః సతాం సమ్మతాః
వ్యుత్పత్తిం పరమామవాప్తుమవధిం లబ్ధుం రసస్రోతసః।
భోక్తుం స్వాదు ఫలం చ జీవితతరోర్యద్యస్తి తే కౌతుకం
తద్భ్రాతః శ్రుణు రాజశేఖరకవేః సూక్తీ రసస్యందినీః॥"
(అంకము 1. శ్లోకము 17.)

శ్రోత్రములచే నమృతమయదివ్యరసాయనమును గ్రోలుటకును, సాధుసమ్మతమగు చక్కని రచన రచించుటకును, రసప్రవాహపారమ్యమును

గనుగొనుటకును, జీవితరూపవృక్షముయొక్క స్వాదుఫలమును భుజించుటకును గౌతుకమున్నచో నమృతము లొలుకు రాజశేఖరకవిసూక్తుల నాలకింపుఁ డని మిక్కిలి యుదాత్తముగాఁ జెప్పికొనెను. జయదేవమహాకవియుఁ దన గీతగోవిందమున నిటులే తనసూక్తి మాహాత్మ్యమును ప్రశంసించుచు,

'యది హరిస్మరణే సరసం మనో, యదివిలాసకలాసు కుతూహలమ్।
మధురకోమలకాంతపదావళీం శ్రుణు తదా జయదేవసరస్వతీమ్॥'

అని నుడివియున్నాఁడు. వశ్యవాక్కులగు మహావిద్వాంసులకు అట్టి పలుకు లుచితములే యగును.

ఈ రాజశేఖరుఁడు తనకుఁ బూర్వులైన రామనాటకకర్తల గ్రంథముల నుండియుఁ గథాంశముల గ్రహించినట్లు తెలియుచున్నది. విశేషముగా భవభూతిమురారికవుల ననుకరించినాఁడు. ప్రస్తావనలోనే శునశ్శేఫప్రవేశము అనర్ఘరాఘవనాటకమునందువలెఁ గల్పించెను గాని యందువలెఁ గాలవర్ణనము సుదీర్ఘముగాఁ జేయలేదు. కథాగమనము వేగముగనే సాగినది. రాక్షసచారుని తాపసవేషమునఁ బ్రవేశపెట్టి శునశ్శేఫునితో వానిని సంభాషింపఁ జేసి విష్కంభమున రావణుఁడు మిథిలలో ధనురారోపణపణము నిర్వహించి సీతం బెండ్లాడు ననియు విశ్వామిత్రుఁడు రామభద్రునిఁ దీసికొని వచ్చుట కయోధ్య కేగె ననియు మిథిలలో జనకుఁడు జన్న మాచరించె ననియు మొదలగు విషయములఁ దెల్పి రాబోవు పాత్రల నందర నెరుకపరచుచున్నాఁడు. మరియు నా విష్కంభముననే విశ్వామిత్రునియొక్కయు అగస్త్యునియొక్కయు మహామహిమలఁ గొనియాడఁ జేసి రాజశేఖరుఁడు తనకు మునులయెడగల గౌరవమును

దెల్పుచున్నాఁడు. ఈ కవి చాల గంభీరుఁడు. శునశ్శేపుఁడు రాక్షసచారు నివిషయము,

'లఘుచిత్తవృత్తి నిర్భిన్నహృదయార్థో రాక్షస ఇవైషః'

(చులుకదనంబుగల మనంబున నింగితంబు వెలువరించు నితఁడు రక్కసుఁడై యుండునా) యని తలంచును. అద్దాన నీ కవి గంభీరస్వభావుఁ డనియు, ఆకారగోపనము, ఇంగితగోపనము ధీరప్రకృతి కవసరము లనియు బోధించుచున్నాఁడు.

ప్రథమాంకమున రావణప్రహస్తులు మిథిలను బ్రవేశింతురు. ప్రహస్తుఁడు జనకునకు రావణవిషయ మెరింగించి సీతాపాణిగ్రహణార్థము వచ్చినట్లు తెల్పును. జనకుఁడును శతానందుఁడును రావణునివంటి వరుఁడు లభించుట దర్లభ మని రావణుని మిగుల గౌరవింతురు. శతానందుఁడు రావణునిగూర్చి,

'ఆజ్ఞా శక్రశిఖామణిప్రణయినీ శాస్త్రాణి చక్షుర్నవం
భక్తిర్భూతపతౌ పినాకిని పదం లంకేతి దివ్యా పురీ।
ఉత్పత్తిర్ద్రుహిణాన్వయే చ తదహో! నేదృగ్వరో లభ్యతే
స్యాచ్చేదేష న రావణ! క్వను పునః సర్వత్ర సర్వే గుణాః॥'

(అంకము 1. శ్లోకము 36.)

రావణునాజ్ఞ శక్రుఁడు శిరసావహించు ననియు, శాస్త్రజ్ఞుఁ డనియు, శివభక్తుఁ డనియు, లంకేశుఁ డనియు, బ్రహ్మవంశసంభూతుఁ డనియు నిట్లెన్నియో సుగుణములు నుడివి లోకములఁ బీడించుదోష మీతనియందున్న దని మరల నెందును సర్వగుణము లుండ వని ప్రశంసించును. మరియు జనకునితో సంభాషించుచు, 'ఇదం తు ప్రతిజానీమహే యదుత న

ప్రచండదోఃఖండోఽపి దశకంఠః శ్రీకంఠమనీషితమపరథా ప్రస్థాపయిష్యతి' (మహేశ్వరు నభిమతమున కన్యథా దశకంధరుఁ డెన్నడు సేయఁడు) అని నుడివి నిజప్రామాణ్య బుద్ధిని జాటుచున్నాఁడు. రావణుఁడు జనకునింటికి స్వయముగ వచ్చినను జనకునింట నాతనికి జరిగిన యాతిథ్యవిశేషము నాటి యాచారములఁ దెల్పుచు రాజశేఖరుని ధర్మశాస్త్రపాండిత్యమును సూచించుచున్నది.

రావణుఁడు యథావిధి సత్కృతుఁడై ధనువును సీతను జూచి, సీతాసౌందర్యమును మెచ్చుకొని ధనుర్భంగము నిజదోఃపరీక్షయా? యని తొలుత చులుకనగా మాటలాడి నిజదోస్సారముం గూర్చి ప్రగల్భములఁ గొట్టి విల్లెక్కుపెట్టి నారిని లాగలేక తనలో సిగ్గిలి పణము నిర్వహించుట తనంతటివానికి నీచ మని తిరస్కారభావమునఁ గ్రిందఁ బడవేయును. జనకుఁడు కోపగించి రావణుని మద మడఁప విల్లందుకొనును. ఇట తపశ్శాలియై విరక్తుఁడైన జనకుఁడు జగజెట్టియైన రావణునితోఁ బోరఁ గలఁడా యను సంశయమును వారింప తపః ప్రభావ మా జనకునకుఁ దోడుగాగ ముదుసలియైనను రావణు నెదుర్కొనుటకు సమర్థుఁడాయెను. ఇట తపశ్శక్తినిగురించి సుంత నుడువుచు శతానందముఖమున రాజశేఖరుఁడు.

'అహో మహాప్రభావో మే యాజ్యః।' అస్య హి–

'శ్లో॥ వాంఛానుగౌ న జరసా జనకస్య పాణీ
సత్యం స ఏష తపసస్తు పరః ప్రకర్షః।
మౌర్వీ స్వయం యదధిరోహతి చాపకోటిం
సంధానకర్మణి శరాశ్చ యదుత్సహంతే॥'

(అంకము 1. శ్లోకము 54.)

అని జనకునితపశ్శక్తివలననే ముదుసలియై చేతులు చెప్పినట్లు రానిసమయమున వింటికి నారి యదియే తగుల్కొనె ననియు శరము లా మధ్యనే చేరుచున్న వనియు నాశ్చర్యముగఁ జెప్పెను. జనకుఁడు క్రుద్ధుఁడై పోరునకుఁ బిల్చుచుండ రావణుఁడు పరిహాసముగా ధిక్కరించును. ఇప్పట్టున రావణునిమదము, అహంకారము వ్యక్తమగుచున్నవి. ధనువును త్రుప్పుపట్టిన ప్రాతధను వనియు, తనంతటివానికిఁ దగ దని దోర్మదమున విడచినట్లును నుడువ జనకుఁడు బాణ మేయ సిద్ధుఁడు కాగా శునశ్శేఫశతానందాదులచేఁ బ్రబోధితుఁడై విరక్తుఁడగుట శాంతించి శస్త్రమును విడచి శాపోదకములఁ గూడ నుపసంహరించెను. ఇట గురువుల వాక్యముల జవదాట రాదను విషయము వృద్ధుఁడగు జనకుని యనుభవమునఁ జూపి మనకును బోధించుచు, నిజగురుభక్తిపరాయణతను జాటుచున్నాఁడు రాజశేఖరుఁడు, శునశ్శేఫుఁడు చిన్నవాఁడైనను నాతనియెడను, శతానందునియెడలను జనకుఁ డే మనుచున్నాఁడో చూడుఁడు.

'కృతే రాక్షసరాజేన పినాకస్య పరాభవే।
జానంతి యుక్తం గురవో భవద్భిః పరవానయమ్॥'

(అంకము 1. శ్లోకము 58.)

(రాక్షసరాజు శివధనువును బరాభవించినను యుక్తమని గురువు లెరుంగుదురు. వారిమాటల కడుగుదాటను.) అని తన కిష్టము లేకున్నను గురులమాటపై జనకున కంతగౌరవము గల దని జూపెను. గురుకులక్లిష్టుఁ డైన మురారివలెనే యీ కవియు నిట్టి సందర్భముల వర్ణించి నిజగురుభక్తిని జాటుచున్నాఁడు.

శతానందుఁడు రావణునితోఁ బ్రగల్భము లాడి ప్రయోజనము లేదనియు, శంకరధనురారోపణము గావించినవానికే యా పొగడ్త తగును

గాని యన్యునకు గాదని హెచ్చరించుట యెంతయు సముచితము. అద్దాన రావణుఁడు మరింత కుపితుఁడై తాను సీతయందు బద్ధానురాగుఁ డైనట్లు నుడివి నిజభుజబలదృప్యద్వీరవర్యసమాజమునుండి తాను సీతను బలాత్కారముగా నపహరింతు ననియు నెవ్వఁడేని ధనురారోపణము గావించి సీతను బెండ్లాడినచో వానిని సంహరింతు ననియు ప్రతినఁ బట్టెను. ఇట్టి వాక్యములు రావణునంతటి వానికి నిజముగఁ దగినట్టు లున్నవి. ఔచిత్యముం గమనించియే రాజశేఖరుఁడు రావణునివంటి యుద్ధత ప్రతినాయకున కిట్టి మాటల నుచితమగు నారభటీవృత్తిని,

"కుర్వన్ మౌర్వీవివేశక్రమనమదటనిస్పష్టటంకారశబ్దం
శంభోః కోదండదండం బధిరితభువనం భూర్భువస్స్వస్త్రయేపి।
యస్తామేతాం వరీతా రసయతి తదసృక్చంద్రహాసో మమాసిః
కంఠాస్థిగ్రంథిశుక్లీకరణభవరణత్కారవాచాలధారః॥"

అని భీకరముగ నుడివినాఁడు. అవల మధ్యాహ్న మౌట నందరు నిష్క్రమింతురు. ఇందు మధ్యాహ్నకాలవర్ణనము చాల స్వభావమనోహరముగా నున్నది. రావణుఁడు మిథిలాపరిసరోద్యానముల విశ్రాంతి కేగును.

ఈ యంకమున రావణుఁడు మిథిల కేతెంచి సీతం జూచుట, ధనురారోపణయత్నము, చేయుట జనకునితోఁ గలహించుట, అవల ప్రతిన బట్టుట మున్నగువిషయము లన్నియుఁ గవికల్పితములే. వాల్మీకిరామాయణమున నీ సన్నివేశమే లేదు. సీతావివాహవిషయమున జనకుఁడు సీత వీర్యశుల్క యని తెల్పినట్లును, పలువురు రాజన్యులు వీర్యజిజ్ఞాసులై మిథిల కేతెంచి యీ శివధనువును జూచి యెత్తలేకయు కదలింపలేకయు భగ్నమనోరథులై కోపమున జనకు నెదుర్కొనినట్లును జనకుఁ డంత దేవగణమును దపముచే సంతుష్టులఁ జేయ వారనుగ్రహించి

యొక చతురంగబలము నంపినట్లును, నద్దానఁ దా నా రాజుల భంగపరచినట్లును వాల్మీకిరామాయణమున నుడువబడి యున్నది.[1]

ద్వితీయాంకమున భృంగిరిటి ప్రవేశించి శివస్తుతిఁ జేయును, రాజశేఖరుఁడు భృంగిరిటిముఖమున నిజకులదైవమగు శంకరుని లెస్సగా స్తుతించుచున్నాఁడు. నారదుని బ్రవేశపెట్టి నారదచరిత్రమునకు సంబంధించిన గాథల నెన్నింటినో సంగ్రహముగఁ దెలుపుచున్నాఁడు,

1. వరయామాసురాగమ్య రాజానో మునిపుంగవ।
తేషాం వరయతాం కన్యాం సర్వేషాం పృథివీక్షితామ్॥ 16

వీర్యశుల్కేతి భగవన్న దదామి సుతామహమ్।
తతః సర్వే నృపతయః సమేత్య మునిపుంగవ॥ 17

మిథిలామభ్యుపాగమ్య వీర్యజిజ్ఞాసవస్తదా।
తేషాం జిజ్ఞాసమానానామైశం ధనురుపాహృతమ్॥ 18

న శేకుర్గ్రహణే తస్య ధనుషస్తోలనేఽపి వా।
తేషాం వీర్యవతాం వీర్యమల్పం జ్ఞాత్వా మహామునే॥ 19

ప్రత్యాఖ్యాతా నృపతయస్తన్నిబోధ తపోధన।
తతః పరమకోపేన రాజానో మునిపుంగవ॥ 20

న్యరుంధన్ మిథిలాం సర్వే వీర్యసందేహమాగతాః।
ఆత్మానమవధూతం తే విజ్ఞాయ నృపపుంగవాః॥ 21

రోషేణ మహతావిష్టాః పీడయన్ మిథిలాం పురీమ్।
తత స్సంవత్సరే పూర్ణే క్షయం యాతాని సర్వశః॥ 22

సాధనాని మునిశ్రేష్ఠ తతోఽహం భృశదుఃఖితః
తతో దేవగణాన్ సర్వాంస్తపసాఽహం ప్రసాదయమ్॥ 23

దదుశ్చ పరమప్రీతాశ్చతురంగబలం సురాః।
తతో భగ్నా నృపతయో హన్యమానా దిశో యయుః॥ 24

(బాలకాండ–అధ్యాయము 66.)

'యన్నారీతనురచ్యుతస్య భగవాన్ కందర్పదర్పాపహో
యచ్చాభూద్గిరిశః పతిశ్చ మరుతాం యత్ఫేనపుంజాయుధః।
సౌమ్యం యచ్చ విముచ్య రూపమభవచ్చండీ హిమాద్రేస్సుతా
తత్సర్వం మమ నారదస్య లలితం యుద్ధైకలీలారుచేః॥'

అచ్యుతుఁ డాడురూపము దాల్చుట, మహేశ్వరుఁడు మన్మథునిమద మడచుట, దేవేంద్రుఁడు నురుగును శస్త్రముగాఁ గొనుట, నిజసుందరమగు రూపము వీడి పార్వతి దారుణరూపముఁ దాల్చి చండి యగుట, మున్నగునవి నారదుని చెయ్దములని నడువుచున్నాఁడు. దీనిచే నీకవికిఁ గల బహుగ్రంథావలోకనవిజ్ఞానము తెల్ల మగుచున్నది.

నారదుఁడు పరశురామరావణులకు యుద్ధము గల్పించి కడుపార భుజింప నెంచుచుండ భృంగి శివునియాజ్ఞ యని యాయిరువురియుద్ధమును మాన్ప నేగుచున్నట్లు నారదునితో నుడువగనే నారదుఁడు శివునాజ్ఞ శిరోధార్య మని యాప్రయత్నమునుండి మాని పరశురామశ్రీరాములకుఁ బోరు కల్పింప మిథిల కేగును. ఇట నారదునంతటివాఁడు శివునాజ్ఞను గౌరవించుటచే రాజశేఖరుఁడు శివపారమ్యమును లలితముగ వ్యంగ్యముగాఁ దెలియఁ జేయుచున్నాఁడు.

ప్రథమాంకకథాంతమున రావణుఁడు మిథిలాప్రాంతోద్యానముల వినోదించుచున్నట్లు నుడివియుంటివి. ఇప్పు డాతఁడు మాయామయునిమూలమున, పరశురాముఁడు గండ్రగొడ్డలిని దన కీయ నిరాకరించె ననియు, మహేశ్వర చాపతిరస్కారము గావించినందులకు రావణుని కీ టణగింప రానున్నట్లును ముజ్జగములఁ దనంతటి వీరుఁడు లేఁడని పొగరుకొనియున్నాఁడనియుఁ బరశురాముని గూర్చి తెలిసికొని భార్గవుని మిథిలయందే కన్గొని యాతనితోఁ బోరసిద్ధపడును. ఈ

పరశురామరావణయుద్ధము కవికల్పితము. పరశురామరావణులిర్వురును సతీర్థ్యులు. వీరిరువురకుఁ బోరు కల్పించి వీరు పరస్పరము తూలనాడుకొనునట్లు వర్ణించి వారి వారి చరిత్రల సంగ్రహముగ మనకుఁ గవి తెలియఁ జేయుచున్నాఁడు. పరశురాముఁడు తన చిన్నవయసున విద్యాభ్యాసకాలమునఁ బార్వతీపరమేశ్వరులు, తమకు శుశ్రూషసేయు సమయమున తన్నెట్లు మక్కువతో నాదరించినదియు స్మరించికొని నిజగురుభక్తిని వెల్లడించును. ఇట్లవసరము దొరకినపుడెల్ల రాజ శేఖరుఁడు పెద్దలయెడఁ దనకుఁగల విశ్వాసమును, నిజగురు భక్తిని గూడ వ్యంగ్యముగఁ బేర్కొనుచుండును. భార్గవుఁడు రావణకంఠ కృంతనము ఆత్మహత్యావిషయ మని యట్టిది మహాపాతక మనియు నట్లాత్మహత్యాకారులకు అంధతమసావృతములగు నసూర్యలోకములు ప్రాప్తించుననియు ధర్మశాస్త్రవిషయమును నుడివి ధర్మమును బోధించుచున్నాఁడు. మరియు జాతినిర్ణయవిషయప్రశంసాసందర్భమున,

"సకలస్యాస్య లోకస్య జాతిర్భవతి మాతృతః।
ఋషీణాం తు శ్రుతిదృశాం పితృతో ధర్మనిర్ణయః॥"

(అంకము 2. శ్లోకము 33.)

అని ధర్మశాస్త్రసారాంశమును సందర్భోచితముగ నుడివెను. ఈ ఘట్టమున రాజశేఖరుఁడే పరశురామపాత్రమున నెక్కువగఁ బ్రతిబింబించు చున్నాఁడు. ఆతని శీల మిందు పరశురామముఖమున వ్యక్తము కాగలదు. పరశురాముఁడు రావణుఁడు ప్రతిపక్షి యైనను నట్టివానిచెయిదముల వ్యాజస్తుతిగఁ బేర్కొనినందుకు మనసునఁ గొంచెము విచార మూని యసత్కీర్తనమునఁ బాపము గల్గునని తత్పరిహారార్థము రుద్రుని స్మరించును, 'దోషస్తథాపి స్మృత ఏష రుద్రః' అని రుద్రస్మరణము పాపధ్వంసక మను ప్రమాణబుద్ధికలవాఁడు ఈ కవి. ఈ సందర్భమున,

"అసత్కీర్తనకాంతారపరివర్తనపాంసులామ్।
వాచం శౌరికథాలాపగంగయైవ పునీమహే॥"

అనుశ్లోకము శిష్టాచారముననున్నది స్మరణీయము, పిమ్మట నీ యిర్వురి వాగ్వివాదము క్రమముగా నస్త్రయుద్ధముగా మారును. పరస్పరమెన్నియో యస్త్రములఁ బ్రయోగింతురు. ఇప్పట్టున నీ కవి వీరిని, వారణాస్త్ర పంచాననాస్త్రములఁ బ్రయోగించినట్లు వర్ణించుట నూతనము. బాలపామర జనాకర్షణమున కిట్టివర్ణనము చేసియుండ నోపు. ఇట్టి సందర్భములలో నీ కవి తన్మయుఁడై నాటకరచనకు వలసిన స్థలకాలనియమముల గుర్తించినట్లు గోచరింపదు, ఏ రంగస్థలమున నిట్టివి ప్రదర్శనార్హములు కాగల వను నూహకూడ దట్టియుండక కేవలము శ్రవ్యకావ్యముగనే యిట నీ కవి కథను సాగించినాఁడు. వీరి పోరు తీవ్రము కాగా ఋచీక పులస్త్యులును భృంగిరిటుఁ డును వచ్చి శివునాజ్ఞ యని వారి నిర్వుర పోరు విరమింపఁ గోరుదురు. వారును శివునాజ్ఞ శిరసావహించి విరమింతురు.

ఈ యంకమున నీ పరశురామరావణఘట్టము కేవలప్రతినాయకులగు (ప్రధాననాయకుఁడగు శ్రీరామునకు ప్రతినాయకులు) నీ యిర్వుర వీరుల గుణగణములను బరాక్రమమును వీరు పరస్పరము దూషించుకొను సందర్భమునఁ దెలియఁ జేయుచుఁ, దుదకు శ్రీరాముఁడు వారిని జయించె నని రామగుణోత్కర్ష తెల్పుటకై యిట్లు వీరినే యింత జగదేకమల్లులుగా వర్ణించెను. అట్లు పరశురామ రావణవర్ణనములందు వారివారికి సంబంధించిన కథాంశముల పూర్వగాథల నెల్లఁ దెలియఁ జేయుచు నహంకారపరాక్రమములం దిర్వురును దుల్యులే యైనను రాజశేఖరుఁడు రావణునికన్న పరశురామునే సుగుణవంతునిగ నెన్నినట్టు లా వర్ణనాంశములఁ బట్టి తెలియుచున్నది. సత్యముగ పరశురాముఁడు రావణుని

కన్న నెన్నియో మడుంగులు మిన్నయే కాగలఁడు. రావణునిదోర్మదమున శివునంత వానిని నిజగురువును సహితము లెక్కింపనట్లు వర్ణించెను. తుదకు శివునాజ్ఞ యని విరమింపఁ గోరినను రావణుఁడు నిజకీర్తిప్రతిష్ఠకు అంతరాయముగ భావించెను. పరశురాముఁడు గుర్వాజ్ఞ అనుల్లంఘ్య మని తోడ్తో విరమించెను. వీరిరువుర శీలతారతమ్య మిందు లెస్సగాఁ జిత్రించబడినది. ఈ యంకవిషయమంతయుఁ గవికల్పితమే.

తృతీయాంకము మిశ్రవిష్కంభమున సువేగాచిత్రశిఖండులను రెండు గృధ్రములు ప్రవేశించి వృత్తవర్తిష్యమాణకథాంశములఁ దెలియఁ జేయుదురు. దీన విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను దోడ్కొని సిద్ధాశ్రమమునకు వచ్చె ననియు, నట తాటకను జంపె ననియు, విశ్వామిత్రుఁడు జృంభకాస్త్రముల రామలక్ష్మణుల కొసఁగి ధనుర్వేద ముపదేశించె ననియు, మిథిలకుఁ దోడ్కొనిపోయి యట శివధనుర్భంగము గావించి సీతాకల్యాణము నెరవేర్ప నెంచి, యందులకై వారు మిథిల కేగుచుండ మధ్యేమార్గమున మారీచసుబాహులు తాటకేయు లడ్డుపడ వారిలో సుబాహును సంహరించి మారీచుని దోలివేసె ననియు మిథిలానగర గమనమువరకును గల రామాయణగాథ సంగ్రహముగఁ దెలియుచున్నది. ఇందు మారీచ సుబాహులు మిథిలామార్గమున రామలక్ష్మణుల నెదుర్కొనినట్లు నుడువఁ బడినది. శ్రీమద్రామాయణమున సిద్ధాశ్రమముననే వారిని జక్కడించినట్లున్నది. ఇట్లు మిథిలామార్గమధ్యమున నని కథావిషయమును కొంత మార్చుట రామపరాక్రమకార్యముల వరుసగా నొకటి వెనుక నొకటిగాఁ దెలుపుటకై చేసియుండ నోపు. మరియు నీ విష్కంభముననే రావణుఁడు సీతావిరహముచే మిగుల బొగులుచుఁ దేవేంద్రు నేదేని వినోదార్థ మంపఁగోర నా దివస్పతి భరతపుత్రుల నూర్వుర నచ్చరలతో, సీతాస్వయంవర మను నాటకమును బ్రదర్శింపఁ బంపె ననియుఁ దెలియుచున్నది. ఇట నీ

బాలరామాయణనాటకమున మరొక సీతాస్వయంవర మను నాటకమును గర్భాంకముగఁ గల్పించుట భవభూత్యుత్తరరామచరితమునుండియే గ్రహించియుండును. భవభూతి తన (రాజశేఖరుని) పూర్వావతార మని కదా కవి చెప్పికొనియున్నాఁడు. నాటకీయముగ నీ యంతర్నాటికాకల్పనము లేక గర్భాంకకల్పనము చాల ప్రయోజనకారి. విరహపీడితుఁడగు రావణుఁ డీ నాటకమునఁ బ్రదర్శింపఁబడిన సీతాస్వయంవరము యథార్థ మని తలఁచి రాముఁడు సీతను జేపట్టుట సైపోపక తన యాసనము నుండిలేచి పోయత్నింపఁ బ్రహస్తుఁడు వారించి యది నాటక మని నుడివి యోదార్చును. రావణుఁడు చాల సిగ్గిలును. ఇట నీ యంతర్నాటకమున శివధనుర్భంగసందర్భపణనిర్వహణమునకై పలువురు రాజన్యులు స్వయంవరమునకు వచ్చిరనియు వారివారింగూర్చిన గుణగణప్రశంసా రూపవర్ణములును జాల చమత్కారముగా వర్ణింపఁబడినవి. శ్రీహర్షుని నైషధకావ్యమున దమయంతికి స్వయంవరరంగమునకు వచ్చి యున్న రాజన్యుల గుణగణముల నెల్ల సరస్వతి చమత్కారముగా వర్ణించినట్లున్నది. దాని నీ రాజశేఖరుఁ డనుకరించె ననుట కీనైషధకర్త రాజశేఖరునకుఁ దరువాతివాఁడు. మహాభారతమున ద్రౌపదీ స్వయంవరమున పలువురు రాజన్యులు వచ్చి రనియు వారి నెల్ల ద్రౌపదికి ధృష్టద్యుమ్నుఁడే యెరుకపరచె ననియుఁ గలదు. ఈ బాలరామాయణమున నీ సీతాస్వయంవరము కూడ దానిని మనమున నుంచుకొనియే వ్రాసియుండును. భారతమున గూడ చాల మంది ధనుఃపూరణమున నశక్తు లగుదురు. ఇట గూడ నట్టి ప్రసక్తియే కావున భారతమున ద్రౌపదీస్వయంవరవర్ణనమును పోలియున్నట్లు నుడువదగు నచి తోచుచున్నది.

ఇందు సీతాసఖి హేమప్రభ, కడుజాణతనమున రాజన్యుల వర్ణించి నుడివినది. నాటకీయముగ నీ వర్ణనము ప్రేక్షకహృదయముల

కానందజనకముగ నుండును. ఇంతమంది శూరులును, వీరాగ్రగణ్యులును జేయ లేని ధనురారోపణకార్యము శ్రీరామచంద్రుఁడు గావించె నని తెల్పుటకై యిందరిని గూర్చి వారి నట్లు వర్ణించెను. వరుసగా వీరి ప్రయత్నములఁ దెల్పి తుదకు శ్రీరాముఁడు కృతకృత్యుఁడై సీతను బెండ్లాడును. ఇది యంతయు నంతర్నాటక మను తలంపు లేక రావణుఁడు సీతను జేపట్టిన శ్రీరాముని వధింప విల్లెక్కుపెట్టిలేచి, రామునిపై పండ్లు పటపట గీటుచు నురుక పోగాఁ బ్రహస్తుఁడు నాటక మని హెచ్చరించి వారించును. ఇవి యన్నియు నాటకోచితాభినయాన్వితములై ప్రేక్షకహృదయము నాకర్షించుచు రమణీయముగా నున్నవి. రావణుఁడు తనచేష్టలకు సిగ్గిలుటచే నీ యంకమునకు విలక్షలంకేశ్వర మను నామకరణము తగి యున్నది. మొత్తముమీఁద నీ యంతర్నాటకముచే నీ యంక మెంతయు మనోజ్ఞమై రసవంతముగా సాగినది.

చతుర్థాంకము ఈ యంకారంభమిశ్రవిష్కంభమున గురుశిష్యుల నిరువురఁ బ్రవేశపెట్టి వారి మూలమునఁ బరశురాముఁడు శ్రీరామునితోఁ బోర నేగుచున్నాఁ డని తెలియఁ జేయుచున్నాఁడు. ఈ విష్కంభమున శిష్యుఁడు భవభూతినామకుఁడు. రాజశేఖరుఁ డీ పాత్రకల్పనములో కవియుఁ దనకుఁ బూర్వుఁడు నైన భవభూతినే మనమున నిడికొని తా నాతనికన్న మిన్న యను నహంకారముతోడనే ఉపాధ్యాయు యాయవీరీయకులమునకుఁ జెందిన తాను ఉపాధ్యాయుఁడును, భవభూతి శిష్యుఁడును ననునట్లును జిత్రించి తన యాధిక్యమును ధ్వనింపఁ జేయుచున్నాఁడు. పరశురామరావణయుద్ధముకన్న శ్రీరామపరశురాముల యుద్ధము విచిత్రముగా నుండు నని గాని వీరి కలయికయం దెన్నియో గ్రాహ్యాంశము లుండునని గాని, సాక్షాద్భగవదంశాపతారములగు వీరిరువుం

యుద్ధముతీరు చూడఁ దగిన దని కాని సదభిప్రాయముతోడనే కవి నా నా మునిగణదేవతాగణముల నాహ్వానించుచున్నాఁడు.

శ్రీరాముఁడు శివధనుర్భంగము గావించుటయుఁ బరశురాముఁ డందుల కలిగి రామునితోఁ బోరనేగుచున్నాఁ డనియు విషయము నింద్రునివలన నెరింగి దశరథుఁడు మాతలితో రథముపై బయలుదేరి మిథిలకు వచ్చును. త్రోవలో మాతలి దశరథసంభాషణమున శచీంద్రులకు రైణుకేయునిపైఁ గల గౌరవమున నా మహనీయునిచరితము నెల్ల ప్రొద్దుల నెల్ల చోట్ల వ్రాయించి చదువుచుండునట్లు తెల్పుచున్నాఁడు. దశరథుఁడు ఎక్కివచ్చుచున్న రథమునందును భార్గవ చరితము వ్రాయఁబడి యున్నట్లు చూపును. ఆ చిత్రములు పరశురాముని శివ శుశ్రూష, శివునొద్ద పరశురాముని విద్యాభ్యాసము, శివుఁ డతనిని నిజపుత్రులకన్న మిన్నగా నెన్నుట. శివుఁడ తా నేర్పిన ధనుర్విద్యోపనిషద్విశేషమును జక్కగాఁ బ్రదర్శించు భార్గవుని చాకచక్యమును దిలకించి మెచ్చికొనుట, పరశురామగణనాథుల యుద్ధము తీవ్రము కాగా పార్వతియే యడ్డుపడ, భార్గవుఁడు వినయాతిరేకమున నమ్ములు పారవైచి ముకుళితహస్తుఁడై శిర మంటునట్లు పాదాభివందన మాచరించుట మున్నగు చిత్రము లన్నియు నా రథమునందే వ్రాయఁబడి యుండెను. దీనివలన నా రాజశేఖరునికాలమున శిల్పవిద్య యంత యుచ్ఛస్థితియం దుండె ననియు మహాత్ములచరితములు చిత్రములమూలమున నిట్లు ప్రచారముచేయబడు చుండె ననియుఁ దెలియుచున్నది. మరియుఁ బరశురాముని చరిత్ర మంతయు, నతఁడు పిత్రాజ్ఞచే జననిని వధించుట, మరల బ్రతికింపఁ జేయుట. కార్తవీర్యార్జునితోఁ బోరుట, క్షత్రకులాంతముగా నిరువదిమారులు దండెత్తుట, మున్నగు నద్భుతపరాక్రమవిషయములెల్లఁ జిత్రింపఁ

బడియుండునట్లు కల్పించి రాజశేఖరుఁడు పరశురామచరిత్రము నొకరీతి సమగ్రముగాఁ దెలియఁజేసెను.

పరశురాముఁడు కూడ ప్రతినాయకుఁ డగుటచే అతనినింతగా వర్ణించియట్టి పరాక్రమశాలిని జయించినవాఁడు శ్రీరాముఁ డనుటచే శ్రీరాముని గుణగణము లతిశయితము లగుననియే కవి యిట్లు వర్ణించెను. ఈ పరశురాముని చరిత మిట్లు వర్ణించునపుడును గవి శైష్యోపాధ్యాయికవృత్తిని యథార్థముగాఁ గొంతవరకుఁ జూపినాఁడు. అవకాశము దొరకినపు డెల్ల నీతఁడును నట్టి గురుశిష్యధర్మముల మురారివలెనే లోకమునకు బోధించి యాశైష్యోపాధ్యాయిక రహస్యములఁ దెలియఁ జేయ యత్నించును. గుర్వనుగ్రహమునుగూర్చి,

"దత్తేచ విద్యాస్థానాని దేవస్తస్మై చతుర్దశ।
శతభంగీభవద్భద్రా మహతాం హి ప్రసత్తయః॥"

(అంకము 4. శ్లోకము 28.)

మహేశ్వరుఁడు పరశురామునకుఁ జతుర్దశవిద్యలు సాంగములుగా బోధించె ననియుఁ, పెద్దలయనుగ్రహములు సహస్రముఖముల మేలు సేయు ననియు నుడువుచున్నాఁడు. పెద్ద లన్న భవభూతికివలెనే రాజశేఖరునకును మహా గౌరవము. ఉత్తరరామచరితమున 'వృద్ధాస్తే న విచారణీయచరితాః' అని సోపాలంభముగా నున్నను నొక పక్షమున పెద్దలచరితములు చర్చింపఁ దగినవి కావని సద్భావము గూడఁ దోఁ చుచున్నది కదా. ఇట గౌరవముగనే 'యద్వా తే గురువోఽవిచింత్య చరితాస్తేభ్యోయమస్త్వంజలిః' యని దశరథుఁడు నడువునట్లున్నది.

"యచ్ఛిన్నం జననీశిరః పితృవరాద్భ్రాతోఽపి యత్ సంహితం
తచ్ఛిష్యస్య పినాకినో మహదభూచ్చిత్రం చరిత్రం కిల।

తేనైతేన కథాద్భుతేన తు నయం వాచాఽపి లజ్జామహే
యద్వా తే గురవోఽవిచింత్యచరితాస్తేభ్యోఽయమస్త్వంజలిః॥"

(అంకము 4. శ్లోకము 33.)

బాలుఁడగు లవుఁడు శ్రీరామునిగూర్చి ఉత్తరరామచరితమున నుడివినదానికన్న నిట వృద్ధుడును అనుభవశాలియు నగు దశరథుఁడు పరశురామునిగూర్చి యనుట యెంతయు సముచితమై యుదాత్తముగ నున్నది. ఇటఁ బరశురాముని విషయమున నుపాలంభ మేమియు లేక పరశురాముని యద్భుతచరితమున కచ్చెరువొంది యట్లు నుడివెను.

ఇట్లు పరశురామచరితము నంతయు రథగమనసమయమునఁ దెలిపి సౌదామినీ మాతలులు దశరథుని మిథిలయందు జనకమందిరమున వదలుదురు. అత్తరి జానకీపరిణయము ముగిసి యందరు నయోధ్య కేగ సిద్ధముగ నుందురు, సీత యత్తవారింటి కేగుచున్న దని శతానందుఁడు, జనకుఁడును నామెకు హితబోధ గావించుదురు. ఆ హితము కణ్వుఁడు శకుంతలకు నుడివినరీతినే కొంచెము విశేషముగ నున్నది. అభిజ్ఞానశాకుంతలమున కాళిదాసు శకుంతలనత్తవారింటి కంపునపుడు సందర్భపరచినట్లే యిటఁ గూడ రాజశేఖరుఁడు కొంచెము కరుణ రసము నిందుఁజమత్కారముగా ససందర్భముగఁ గూర్చెను. ఇప్పట్టున ప్రశంసార్థములైన శ్లోకము లివి,

"యస్యాస్తే జననీ స్వయం క్షితిరియం యోగీశ్వరోఽయం పితా
మాతర్మైథిలి! శిక్ష్యతే కథయ కిం తస్యాః సుజాతేస్తవ।
స్నేహాత్ కేవలముచ్యతే పునరిదం స్త్రీణాం పతిర్దైవతం
తద్భార్యాస్త్వమపాస్య ధర్మమపరం ఛాయేవ రామానుగా॥"

(అంకము 4. శ్లోకము 42.)

"అభ్యుత్థానముపాగతే గృహపతౌ తద్భాషణే నమ్రతా
తత్పాదార్పితదృష్టిరాసనవిధి స్తస్యోపచర్యా స్వయమ్।
సుప్తే తత్ర శయీత తత్ప్రథమతో జహ్యాచ్చ శయ్యామితి
ప్రాచ్యైః పుత్రి! నివేదితాః కులవధూసిద్ధాంతధర్మా అమీ॥"

(అంకము 4. శ్లోకము 43.)

"నిర్వ్యాజా దయితే ననాంధృషు నతా శ్వశ్రూషు భక్తా భవ
స్నిగ్ధా బంధుషు వత్సలా పరిజనే స్మేరా సపత్నీష్వపి।
పత్యుర్మిత్రజనే సనర్మవచనా ఖిన్నా చ తద్ద్వేషిషు
స్త్రీణాం సంవననం నతభ్రు! తదిదం శ్రేష్ఠౌషధం భర్తృషు।"

(అంకము 4. శ్లోకము 44.)

ఈ మూఁడుశ్లోకములకును తిరుపతివేంకటకవుల తెనుగు సేత మనోహరముగా నుండుటచే నిట నుదహరించుచున్నాను. 'యస్యాస్తే' అనుదానికి,

ఉ॥ పెంచినవాఁడు రాజఋషి విశ్వధురంధరశీల నేల నిన్
గాంచినతల్లి నీకుఁ బెరకన్నెలకుం బలెఁ జెప్ప నేల సే
వించుము సాధుధర్మములు పెన్మిటియే కులదైవ మంచు భా
వించుము నీడవోలె రఘువీరుని బాయకు మమ్మ జానకీ॥

'అభ్యుత్థానముపాగతే' అనుదానికి,

చ॥ పతి చనుదెంచెనేని భయభక్తులతో నెదు రేగి పిల్చినన్
ధృతి వినయంబుఁ జూపి శయనించినఁ బాదములొత్తి యాసన
స్థితుఁడగు వేళఁ బాదములచేరువ దృష్టి నిగిడ్చి భర్తయే
గతి యని నమ్ము సాధ్వి కులకామిని యంద్రు బుధుల్ కుమారికా॥

'నిర్వ్యాజాదయితే' అనువాదానికి

సీ॥ప్రాణేశుపట్లఁ గాపట్య మూనకు మమ్మ
యాడుబిడ్డలఁ గూడిమాడు మమ్మ
గురుజనంబుల చిత్త మరసి వర్తిలు మమ్మ
చుట్టాలపైఁ బేర్మిఁ జూపు మమ్మ
దాసీజనంబుపై దయను దప్పకు మమ్మ
సవతాంద్ర కనుకువ సలుపు మమ్మ
పతిమిత్రులను గౌరవమ్ముతోఁ గను మమ్మ
పతిశత్రువుల కంటఁబడకు మమ్మ

గీ॥ నగరివారికిఁ దలలోని నాల్కవోలె
దయకుఁ బాత్రమవై మంచితనము గల్గి
సాధ్వు లందరి కేలికసాని వగుచు
రవ్వయును రట్టు లేకుండ బ్రతుకు మమ్మ॥

ఈ వధూసిద్ధాంతధర్మములు ధర్మశాస్త్రసారములు. హైందవజాతీ యౌన్నత్యమున కియ్యవియే మూలాధారములు.

ఈ నాటకమందును గణ్వునివోలె జనకుఁడు కంఠస్తంభితబాష్పవృత్తి కలుషుడై యేడ్చును. దశరథుని జనకాదు లాహ్వానించి సత్కరింతురు.

ఇంతలో పరశురాముఁడు వీరశాంతరసము లొక్కయాకృతిఁ దాల్చినవాయను నాకారముతోఁ బ్రవేశించును. శివధనుర్భంగము గావించిన కారణమున శ్రీరాముని వధింతు ననియు నెవ్వరైన రాముని గాచువా రున్నచో రండనియు వీరాలాపము లాడుచు గర్వించి యనరాని మాటల నాడి రాముని దూలనాడును. రాముఁడును వినయమున నెంత వేడినను వినక పరశు రాముఁడు తుదకు తన వైష్ణవధనువు నెక్కుపెట్ట నీయ లక్ష్మణుఁ డద్దాని గ్రహించి ధనుర్భంగము గావించును. భార్గవరాముఁ డంతఁ గ్రుద్ధుఁడై

యేమియుఁ జేయ లేక పరాజితుఁడై వెడలిపోవును. ఈ పరశురామఘట్టము మహావీరచరిత, అనర్ఘరాఘవముల యనుకరణము. ఆ రెంటియందును పరశురాముడు పరాజితుఁడై రాముని వైష్ణవాంశమును దిలకించి మెచ్చుకొనునట్లును. జనకాదు లాతిథ్యము స్వీకరింప నిలువుమన్నను నిల్వక వెడలిపోయినట్లు నున్నది. ఈ బాలరామాయణమున నాతిథ్యప్రశంసయే లేదు. పరశురామశ్రీరామశీలముల పైనాటకములందు వలెనే యిందును నిర్వర్తింపఁ బడినవి. పరశురాముఁ డుద్ధతవచనములతో శ్రీరాముని దూషించుచుఁ బల్కును. శ్రీరాముఁడు భగవన్, అని సగౌరవముగ తుదివరకును బల్కును. పరశురామునిరాక మిథిలయందే చూపుటకూడ పైనాటకమున యనుకరణమే. మూలరామాణమున మిథిలనుండి యయోధ్యకేగుత్రోవలో పరశురాముఁడు సంధించినట్లు నుడువఁబడి యున్నది.

కథాగమనము చెడకుండ నీ యంకముననే భార్గవభంగము నిర్వహించి వైష్ణవధనుర్భంగమున లక్ష్మణపరాక్రమముఁ జూపి యూర్మిళను లక్ష్మణున కిచ్చునట్లు వర్ణించుట కవికల్పనము. ఇది యెంతయు నుదాత్తముగా నున్నది. లక్ష్మణుని పరాక్రమము నెచ్చటనో యుద్ధఘట్టమున దప్ప నంతకు మున్నెచ్చటను సాధారణముగా నుడువఁబడ లేదు. ఇందుమాత్రము ముందే యీవైష్ణవధనుర్భంగముచే నెరుకపరచుచున్నాఁడు. ఈ నాటకమున శ్రీరాముఁడు తుదకు పరశురాముని దుర్భాషల సైప లేక కొంచెము ధిక్కరించి భంగపరచినాఁడు. భార్గవుఁడిందు పరాభవింపఁబడుటచే నీ యంకమునకు భార్గవభంగ మను పేరు తగియున్నది.

పంచమాంకము శుద్ధవిష్కంభమున మాయామయమాల్యవంతులు సంభాషించుచు రావణుఁడు సీతను జేపట్ట నెంచి రాముకడకే సందేశ మంపుటయు, మాయామయుఁడు రావణవినోదార్థము మయశిష్యుఁడగు

విశారదునిచే సీతాప్రతికృతిని, ఆమె చెలికత్తెయగు సింధూరిక ప్రతికృతినిం గూడ జేయించి, యా బొమ్మలయందు శారికల నుంచి వలసినపు డుచితరీతి పలుకునట్లు శిక్షణ మొసఁగి రావణునికడ కంపును. మాయామయుఁ డీ మాయాసీతాప్రతికృతితో రావణు కడకు రాగా నట ననుకొన్నరీతి సంభాషణ మంతయుఁ జక్కగా సాగినను రావణుఁడు లేచి సీతను నిక్కముగ సీతయే యని గౌఁగిలింపఁ బోయి మోసపోవును. మోహమున నున్న రావణు డది యంతయు జనకుఁడే యట్లు మోసము గావించె నని తలంచి మాయామయుని మోసపోతి వనును. ఈ సందర్భమున రావణు నంతవానికిని మోసముచేయఁ దలంచిన మాల్యవంతమాయామయుల నాతఁడూరక విడచునా? నిక్క మెరిఁగిన పిదపనైన వారల నేమియుఁ జేయ లేదు. మోసము జనకుని దని యెంచెను. ఈ మాయాసీతాదిప్రతికృతి రచనలవలన నా కాలమున (రాజశేఖరుకాలమున) ప్రతిమారచన యంత యద్భుతముగా నుండె నని తెలియుచున్నది.

రావణుఁ డా సీతాప్రతికృతిం గౌఁగిలింపఁ బోయి యది యాఁడుదాని తాఁకుడువలె లేదని యెరింగి శాంతుఁడై యున్నట్లు వర్ణించుట చిత్రము. రావణునిశీలమున కిది యొక లోపమనఁ జెల్లు. కాని యిట నా దోషము జనకునిపై నిడి సమర్థించె, సీతావిషయమోహము మరింత హెచ్చునట్లు చేసెను. వినోదార్థము ఆ సీతబొమ్మను తన శయనాగారమున నిడుమని మాయామయు నాజ్ఞాపించెను.

అంత రావణుఁడు విరహవినోదనార్థము ప్రహస్తునితో లీలోద్యానమున శిశిరపదార్థసంచయమును సేవింప బోవును. అట నారు ఋతువుల ననుభవించును. తత్సందర్భమున నా యా ఋతువును వర్ణించుచు గ్రీష్మకాలోచిత వేష మని స్త్రీలకు వేసఁగియం దుచితమగు వేషము నిట్లు నుడువుచున్నాఁడు,

"కర్ణే స్మేరం శిరీషం శిరసి విచికలస్రగ్లతాః పాటలిన్యః
కంఠే మాలా విశాలా వపుషి చ నళినీమూలకాండాః కలాపాః।
సామోదం చందనాంభః స్తనభువి నయనే మ్లానమాంజిష్ఠపృష్ఠే
గాత్రం లోలజ్జలార్ద్రం జయతి మృగదృశాం గ్రైష్మికో వేష ఏషః॥"

(అంకము 5. శ్లోకము 26.)

కర్ణములందు శిరీషపుష్పములును, శిరమున పాటలీకుసుమములతో గూర్పఁ బడిన పూమాలలును. కంఠమున దీర్ఘమగు ముత్యాలహారమును, నడుమున తామర తూడులును, స్తనములందు జందనంపు పూతయు, నేత్రములందు రక్తిమ దొరఁగి యుండుటయు, శరీరము చెమర్చుటచే తడిగా నుండుటయు స్త్రీలకు గ్రైష్మికవేషముగా నొప్పుచుండును. కవి యిట షడృతువులను జక్కగా వర్ణించి తన ప్రకృతివర్ణనానైపుణ్యమును జాటెను.

సర్వర్తుసేవన మా రావణుని తాపమును మరింత రెచ్చకొట్టినది. తాపహారకపదార్థము లన్నియు గ్రమముగా నాతనిసేవకై సిద్ధపరుపఁ బడినవి. చలిమల, మొదలగు నవియు, రంభాది దేవకాంతలును, వరుణపత్నులగు నదులును శైత్యోపచారములు గావించినను రావణునకు శాంతి గలుగ లేదు. క్రమముగా నాతనివిరహ మున్మాదముగాఁ బరిణమించినది. తనకుఁ దాపము గలిగించుచున్నా రని సురభిగంధమును దన్ను మనియు, మలయమారుతమును జావగొట్టి కాళ్ళకు సంకెలలు వేయు మనియు, రాగరాజ మగు పంచమస్వరమును బందిగాఁ జేయు మనియు, చంద్రుని బిండిజేయు మనియు బంట్లను శాసించును. నిజముగ నిట యలంకారశాస్త్రానుసారము విరహోద్దీపనవిషయముల నిట్లు వర్ణించి రావణుని గేవలము మోహాంధమున ముంచినాఁడు. దేవతాస్త్రీలు వారుణి లక్ష్మీసరస్వతులు నాతని నోదార్ప లేకపోయిరి. చంద్రమన్మథాదులఁ

దిరస్కరించుచు వనమునఁ దిరుగాడుచు చిత్తవిభ్రమమున సీతావయవసామ్యమున నన్నింటిని మన్నించుచుఁ గ్రమముగా నన్నిటిని సీతామయముగఁ గాంచును. పిదప నతఁడా వన్యములగు సారంగ, పిక, నలిన, గంధగజముల సీతావృత్తాంత మడుగును. ఇదంతయు సీతావిషయక నిరంతరధ్యానము రావణు నట్లు గావించుచున్నది. చంద్రోపాలంభనము గావించుచుఁ జకోరముల నొక్కమారు చంద్రికాపానమున జంద్రుని నిస్తేజునిగాఁ జేయు మనును. ఇప్పటికి విరహావస్థ పరమోచ్చస్థితి నందినది. ఇక చరమావస్థ మిగిలి యున్నది. కవి యిట నేర్పుతో నాతనిచిత్తవృత్తి మరల్చుటకై శూర్పణఖను భిన్ననాసనుగా సమీపింపఁ జేసి యాతనికిఁ గ్రోధము గల్గునట్లు చేసినాఁడు. కాళిదాసు అభిజ్ఞానశాకుంతలమున విషణ్ణుఁ డగు దుష్యంతునిచిత్తవృత్తి మరల్చుటకై ప్రియవయస్యుఁడగు మాధవ్యుని మాతలిగ్రస్తునిగాఁ జేసి విచారమునుండి క్రోధమునకు మరల్చినాఁడు. అట్లే ఇక్కడఁ గూడ కవి విరహోన్మాదమున నున్న రావణుని శూర్పణఖా వృత్తాంతముచేఁ గ్రోధోద్దీప్తునిగాఁ జేసి నాటకమున కెంతయో శోభ నాపాదించినాఁడు. రావణునివిరహము, ఉద్యానవిహారము, తిర్యక్కులనుగూడ సీతావిషయమడుగుట మున్నగునవి యన్నియు విక్రమోర్వశీయమున విక్రముఁ డూర్వశికై వెదకులాడుచు వర్ణించినట్లు వర్ణింపఁ బడినవి. ఈ విరహవినోదఘట్టము అతిమాత్రమై నాటకమునకుఁ గొంత కొరంత నాపాదించుచున్నది. ప్రేక్షకులకీ వర్ణనములు విసుగుపుట్టించునవియై కథాగమనమున కడ్డుపడుచున్నవి. ఈ యంకము చాలవరకు తగ్గించియుండిన బాగుండెడిదేమో. ఈ విషయమున నీ రాజశేఖరుఁ డు త్తరరామచరితమున దండకాటవికి సీతావియోగదుఃఖమును శ్రీరాముఁ డనుభవించుటను విపరీతముగాఁ జూపినట్టు లిందు రావణుని విరహోన్మాదములఁ జూపినాఁడు. ఈ ఘట్టము నాటకీయముగ నుండుటకు

కొంచెము సంగ్రహించిన బాగుండెడిది. విక్రమోర్వశీయోత్తరరామ చరితాదులందు నాయికా నాయకులు పరస్పరము ప్రేమాస్పదులు. వారి వియోగము దుర్భరమగుట నట్లు వర్ణితమైనది. కాని యిందు రసాభాసమే ఏకత్రానురాగమే కానవచ్చుచున్నది. రావణుఁడే సీతావిషయమున నింతగా మోహమునఁ బ్రాకులాడుచున్నాడు. సీతకు రావణునిపై నే మాత్రమును ప్రేమ లేదు. ఇట్టి పరిస్థితియందును రావణుఁడు విరహావస్థకు లోనై యున్మాదావస్థ నందునట్లు ప్రతినాయకుఁ డగు రావణు నంతగా మోహాంధునిగా వర్ణించుట కవినేర్పు. భారతమున విరాటపర్వమున ద్రౌపదీకీచకుల ప్రేమయు నిట్టిదే. ద్రౌపది యా కీచకుని ప్రేమింప లేదు. కీచకుఁడుమాత్ర మాపెను మోహించి రావణునివలెనే విరహావస్థ నంది తుదకు భీమునిచే మడియును. కవులు నాయకుల నెక్కువగా వర్ణించుటకే యిట్లు ప్రతినాయకులను వర్ణించుచుందురు.

రావణుఁ డీయంకమున విరహాతిశయమున నున్మత్తునివలెఁ ప్రజ్ఞదప్పితిర్యగ్జాతులను గూడ సంబోధించుటచే నీ యంకమున కున్మత్తదశానన మను నామ మెంతయుఁ దగియున్నది.

ఇట చివర శూర్పణఖ భిన్ననాసయై రావణునిచెంత కరుదెంచి యయోధ్యా పరిసరమున రామలక్ష్మణుల నభిసరించి వారిని బలాత్కరింప వారు తన్నాయవస్థపాలు జేసి రని నుడివి మరల సీత భువనైకసుందరి యనియు లంకేశ్వరునకుఁ దగిన దనియు నెంచి యామె నపహరింపఁ బోవ రామలక్ష్మణులట్లొనరించి రని నుడువఁబడియున్నది. ఇది మూలాతిక్రమణము. మూలరామాయణమున దండకాటవిని పదుమూడు వర్షములు గడపిన పిదప పంచవటిలో నుండగా శూర్పణఖకు నాసాచ్ఛేదము జరిగినట్లున్నది. ఇందు శూర్పణఖ రావణునకు తెల్పినపిదప మాయామయుఁడు శూర్పణఖయు మాయాకైకేయీదశరథవేషములతో

పోయి రాము నరణ్యమునకు బంపునట్లు తెలియుచున్నది. ఇది కవికల్పితమైనమార్పు.

షష్ఠాంకమున మిశ్రవిష్కంభమున శూర్పణఖామాయామయులు మాల్యవంతుఁడు సంభాషించుచు తమ ప్రయత్నము అనగా శ్రీరాము నడవిపాలు సేయుటకై మాయాకైక, మాయాదశరథవేషములతో నయోధ్యలో రాముని వంచించు యత్నముసాగినట్లు తెల్పుదురు. కైకేయీదశరథులు స్వర్గమున కేగిన సమయము గుర్తించి శూర్పణఖామాయామయులు కైకేయీదశరథుల వేషములతో నయోధ్యకు వత్తురు. సత్యకైకేయీదశరథు లనుకొని వందిమాగధులు స్తుతింప వారు యథోచితస్థానము లాక్రమించి మాయాకైకవేషముననున్న శూర్పణఖ మంథరమూలమున దశరథుని, తనకు మున్నొసంగిన వరద్వయమును భరతపట్టాభిషేకము. రామవనవాసము నను వానిని వెంటనే చెల్లింపఁగోర నీమాయాదశరథుడును నిక్కముగ విచారపడుచున్నవానివోలె గొంత తడవు కన్నీరు కార్చి తుదకు వరద్వయ మొసఁగితి నన శ్రీరాముఁడును సీతాలక్ష్మణసహితుఁడై వనమున కేగె ననియుఁ గొంత సేపటికి వీ రెవరో రాక్షసులు మాయలఁ బన్ని కైకేయీదశరథవేషములతో వచ్చి వంచించి రని తెల్ప నీ రక్కసు లిర్వురును మాయ మగుదురు. రామున కీ విషయము తెల్పి తిరిగి పట్టణమునకు రమ్మని యెంత బ్రతిమాలినను రాఁడాయె.

అవల సత్యకైకేయీదశరథులు వత్తురు. వామదేవాదులవలన జరిగిన విషయ మంతయుఁ దెలిసికొందురు. సుమంత్రుఁడు సీతారామలక్ష్మణుల విషయము వారు నర్మద దాటువరకును దెల్పెను. రామమాతలు కౌసల్యాకైకేయీ సుమిత్రలు మువ్వురును విలపింతురు. అవల రత్నఖండుఁడు వచ్చి రామాదుల వృత్తాంతము దండకలో సీతాపహరణము, రావణునితో జటాయువు పోరి మడియుట మున్నగువిషయములు దెల్పును.

ఈ యంకమున రామాయణకథ జటాయువధవరకుఁ దెల్పఁబడినది. విష్కంభమునఁ గొంత సుమంత్రముఖమున గొంత, రత్నఖండు నిమూలమునఁ గొంతయు, నుడువఁబడినది. అంకస్థవిషయము మాయాకైకేయీమాయా దశరథవృత్తాంతము కవికల్పితము. ప్రతిమానాటకమున భాసుఁడు కైక లోకాపవాదమునకు గురి కాకుండునట్లు చిత్రించుట నాధారముగా గైకొనియే రాజశేఖరుఁడు బాలరామాయణమున దశరథునకుఁ గూడ నాలోపము లేకుండఁ జేయుటకై వారినిరువుర స్వర్గమున కనిపి రక్కసులచే మాయావేషములు వేయించి కార్యము వంచనముగా సాగింపఁ జేసి కైకెయీదశరథులకు నిర్దోషత్వమును సంఘటింపఁ జేసినాఁడు. ఈ విషయము మూలరామాయణమునకన్న భిన్నము. ఈ సన్నివేశము నాటకీయముగాఁ జాల మనోహరముగా నున్నది. ఎవఁడో రక్కసుఁడు దశరథవేషమున వచ్చి వంచించె నని రామునకు సత్యము తెలిపి యయోధ్యకుఁ మరల రమ్మనినను రాముఁడు మాత్రము పోలేదు. జనకుఁ డని తలంచి యాతని యానతిమేరకు వచ్చితిఁ గాన తప్పక యాజ్ఞ చెల్లించియే తీరవలయును. వాఁడు రాక్షసుఁడైనను యక్షుఁడైనను సరియే, శాసనముప్రకారము పదునాలుగేడులును గడపియే వచ్చెద ననును.

"మయా మూర్ధ్ని ప్రహ్వే పితురితి ధృతం శాసనమిదం
స యక్షో రక్షో వా భవతు భగవాన్ వా రఘుపతిః।
నివర్తిష్యే సోఽహం భరతకృతరక్షాం నిజపురీం
సమాః సమ్యఙ్నీత్వా వనభువి చతస్రశ్చ దశ చ॥

(అంకము 6. శ్లోకము 16.)

ఇందు శ్రీరాముని శీలము మిక్కిలి యుదాత్తము. రామునిశీలమున కుదాత్తత నాపాదించుటకే కవి యీ నూతనకల్పనలుగూర్చి యీ యంకమును సరసముగా సాగించినాఁడు. సీతారాములు

పయనమగునపుడు వారేమేమి చేసి రని దశరథుఁ డడుగగ వామదేవుఁడు విన్నవించు విధ మెంతయు హృదయంగమము. సీతారాముల గుణశీలముల కొక నూత్నశోభ నొనగూర్చుచున్నాఁడు. సీత బయలుదేరునపుడు క్రీడాశకుంతముల నోదార్చుట వెంబడించి వచ్చు కేళీహంసప్రమద హరిణాదుల వారించి బుజ్జగించి మరలించుట చూపర కెల్లరకు జాలిగొల్పునట్లున్నది. ఇది నాటకీయముగా చాల మనోరంజకము. అరణ్యమున సీతారామలక్ష్మణు లెట్లు వర్తిల్లుచుండినదియు సుమంత్రుఁ డు కన్నులకుఁ గట్టిన ట్లతిచమత్కారముగా వారి వారి శీలముల నెంతో చక్కగాఁ బోషించుచు కడునేర్పునఁ జిత్రించుచు నుడివినాఁడు. ఈ సుమంత్రసంభాషణమున రామాదివృత్తాంతము మూలరామాయణాను సారముగనే యున్నది.

రత్నఖండుఁడు నుడువు సందర్భమునఁ గూడ బంగరులేడివిషయము, రాముఁ డద్దానిని తేనరుగుట, లక్ష్మణుఁడును రామునికొర కేగగ నా సమయమున రావణుఁడు సీత నెత్తికొని పోవుట మున్నగు విషయములు దండకారణ్యవాసపక్షులు జటాయువునకు విన్నవించెననియు, నా జటాయువు రావణునితోఁ బోరి కృత్తకంఠుఁడై యీషన్మితాయువగుచుఁ దనతో దశరథున కావృత్తాంతమింత దెలియఁజేయఁ గోరఁ దానట్లు వచ్చినట్లును రత్నఖండుఁడు దశరథునితో నుడువుచున్నాఁడు. ఈ ఘట్టమునఁ గూడ కథాంశములు మూలరామాయణాను సారముగనే సాగినవి. లక్ష్మణుఁడు రాముని కొరకేగునపుడు తాపసస్త్రీలకు సీత నప్పగించి యేగినట్లుమాత్ర మున్నది. మూలరామాయణమున సీతయే లక్ష్మణుని తొందరపెట్టి యనరానిమాట లని రామసహాయార్థ మంపినట్లున్నది. ఇందు రాజశేఖరుఁ డా యసభ్యవిషయమును స్పృశింపక కథనెంతో మనోహరముగా నడిపించినాఁడు. సీతారాముల కష్టముల వర్ణించి యీ

యంకమున ప్రేక్షకుల హృదయములఁగూడ దశరథాదులతో దుఃఖమున ముంచినాఁడు దశరథుఁడిందు నిర్దోషిగా వర్ణింపబడుటచే నిది నిర్దోషదశరథ మనిపించుకొనియె.

సప్తమాంకమునఁ గర్పూరచండుఁడును జందనచండుఁడు నను నిరువురు స్తుతిపాఠకులు సంభాషించుచు రాముని స్తుతించు నెపమున రామచరితమును నింతకు మున్ను రత్నచూడుఁడు నుడివిన జటాయువధాంతముగా గల కథ కవ్వలికథను గ్రమముగా కబంధవధ, సప్తతాళభేదనము, వాలివధ, సీతాన్వేషణమునకై హనుమంతుఁడు లంక కేఁగి సీతను జూచి మరల రాముచెంతకు వచ్చుట, కపిసైన్యముతో రాముఁడు సముద్రతీరముఁ జేరి సముద్రుని ధ్యానించుట, తుదకు సముద్రునిపై తప్పనిసరిగ బాణము ప్రయోగించుట, వరకుఁ గల రామకథను సంగ్రహముగఁ దెలియఁ జేయుదురు.

అవల సముద్రుఁడు ప్రత్యక్షమై రామునిఁగొనియాడ రాముఁడును తన దప్పును క్షమింప వేడికొనును. సముద్రుఁడును సేతువుఁ గట్ట ననువగు స్థలమును దెల్పి నలునకు చేతఁ దాకినమాత్రాన రాళ్ళును నీటఁ దేలు నను మునులవరము నెరుకపరచి నిష్క్రమించును. వానరులును త్వరితముగ సేతువుగట్టుదురు. ఈ విషయము లన్నియు యథామూలముగనే నడపింపఁ బడినవి. సేతువు పూర్తి కాకముందే విఘ్న మాచరింప నెంచి రావణుఁడు రాక్షసబలము నంపును. కపిరాక్షసబలము లొండొరులు కలసి పెద్దకోలాహలముతోఁ బోర నారంభింతురు. కపిత్థదధిత్థులను నిర్వురు సేతుబంధవిషయమును కపిరాక్షసయుద్ధమును అప్పటి కప్పుడు జరిగిన విషయముల నివేదించుచుందురు. రాక్షసబలములు లంకాభిముఖములై పోవుచుండె నని విని హనుమంతుడు రామునితోఁ దాము గెల్చితిమని నుడువగా శ్రీరాముఁడు.

"ప్రవృత్తే రణకర్మణి సేనయోః మారణాపసరణాని।
గణశో భవంతి కస్తత్ర జయః పరాజయో వా॥

యుద్ధము జరుగుచుండు సమయమున నిరుపక్షసేనలకును మరణాప సరణములు మొత్తముమీఁద జరుగుచుండును. అట్టిచో జయాప జయంబులు నిర్ణయింపవీలు కాదని నిజగంభీరప్రకృతిని బ్రకటించెను.

ఇంతలో నాకసమునుండి రావణుఁడు విమానమున సీతాసమేతుఁడై రామలక్ష్మణుల యెదుట గోచరించి వారు చూచుచుండగనే నిజచంద్రహాసమున సీతతలను ఖండించి జార విడచును. రాముఁ దద్దానిని గ్రిందఁ బడనీక చేతుల గ్రహించి సకరుణముగ విలపించును. ఇంతలో నా సీతశిరము నుండి యొక శారిక రావణునిచెయిదము నంతయు స్పష్టముగ విన్నవించును, ఈ శారిక మున్ను రావణవినోదార్థము మాయాసీతా ప్రతిమయం దమర్పఁబడియుండినది. రామలక్ష్మణుల యుద్ధవిముఖులఁ జేయుటకై రావణుఁడు పన్నినమాయ యనియు నది దారుమయసీతయ కాని నిజముగ సీత కాదనియు నుడువును. ఈ విషయము కవి కల్పితమే. కావుననే మూలకథలో వలెనే యీ సీతాశిరః ఖండమును మాయగాఁ గల్పించి, మున్ను వినోదార్థము దాచి యుంచిన సీతబొమ్మ కిపుడు ప్రయోజనము గలుగునట్లు నాటకీయ వస్తువిస్తరణదృష్టితో కథను జమత్కారముగా నడపించినాడు. శ్రీమద్రామాయణమున మాయాసీతావధా ధ్యాయమున నింద్రజిత్తు మాయాసీతను రథమున గొనిపోయి ప్రతిపక్షులయెదుట ఖండించి నట్లున్నది. ఇందు రావణుఁడే యట్లు గావించినట్లు కవి చిత్రించినాఁడు.

శారికపల్కు లాలించి రామాదు లుత్సాహపూరితులై రక్కసులబలంబు జక్కాడి రావణుని విగతజీవుని జేయ నిశ్చయించి సువేలాచలమున సైన్యముల నిల్పుదురు. ఇంతలో సింహనాదుఁడను నొక రక్కసుఁడు

రావణుని రెండవ కుమారుఁడు పంచకంఠ దశహస్తుడు అహంకరించుచు రాము నెదుర్కొని రామశౌర్యమును గూర్చి స్త్రీవధ మృగవధ వాలివధల దడవగా లక్ష్మణుఁడు తొలుతటి రెంటికి సమాధానమును గుర్వాజ్ఞ మొదటిదానికిని రెండవదానికి క్షాత్రధర్మమును కారణము లని నుడువుచుండ రాముఁ డందుకాని వాలివధను గూర్చి వాలి సామాన్యుఁడు కాఁడనియు, నతని (సింహనాదుని) తండ్రియగు రావణుని తన చంకలో నొక్కిపట్టి పంజరశుకముగఁ జేసెనని నుడువ నా సింహనాదుఁ డా గ్రహించి రాముతోఁ బోర సన్నద్ధుఁ డగును. ఇరువురు నవ్వలి కేగి సమరసంరంభ మారంభింతురు.

ఇందు సింహనాదుఁ డను వానిని రావణపుత్రునిగా కవి కల్పించినాఁడు. మూలరామాయణమున వీని ప్రసక్తియే లేదు. అందును వీనిని అయిదు తలలు పది చేతులు గల వానినిగా రావణునియాకృతి యం దర్ధాంశము గల వానినిగా వర్ణించుట యీ కవినేర్పు. ఈ యంకమునందు కపిత్థ దధిత్థాదుల మూలమున రామాయణకథను సేతుబంధాదివిషయమును యుద్ధారంభముదనుక తెలియఁ జేసినాఁడు. మేఘనాదుఁ డొకఁడు రావణునికొడు కుండగా సింహనాదుఁ డని యీ కవి మరియొకనిని రెండవవానినిగా గల్పించుట కితరరామాయణము లేమైన యాధారములై యుండునోపు.

ఈ యంకమున సముద్రునిపట్ల రాముఁడు తాఁ జూపిన పరాక్రమము యుద్ధసంరంభము సాటి లేకుండుటచే దీనికి అసమపరాక్రమ మను పేరు తగియున్నది.

అష్టమాంకమున మిశ్రవిష్కంభమందు సుముఖదుర్ముఖులను నిరువురు రాక్షసులు ప్రవేశించి కడచిన యంకాంతమునఁ బ్రసక్తుఁడైన సింహనాదుఁడు మరణించె ననియు, తులాద్యూతము నిర్ణయించుకొని

యందుఁ బరాజితుఁడాయె ననియు, నప్పటికిని నిర్ణీతప్రకారము సీతను గాని లంకాధిపత్యమును గాని రావణుఁడు విడుచుట లేదనియు రామరావణపక్షములఁ గ్రమముగా అంగద నరాంతకులు ద్వంద్వయుద్ధము సల్పిరనియు, నరాంతకుఁడు కూలె ననియు నీ వృత్తాంతమంతయుఁ ద్రిజట సీతకు విన్నవించె ననియుఁ దెలియఁ జేయుదురు.

ఇందుఁ దులాద్యూత మని యొడంబడిక చేసికొని యంగద నరాంతకులుపై రామరావణపక్షభార మంతయు నిలిపి ద్వంద్వయుద్ధము చేయించుట రాజశేఖరుని కల్పనము. శ్రీమద్రామాయణమున ద్వంద్వయుద్ధ మని యొక యధ్యాయమున యుద్ధము వర్ణిత మయినను నందు రాక్షస వానర నాయకులు జంటలు జంటలుగా అంగదుఁడు ఇంద్రజిత్తు. ప్రజంఘుఁడు, సంపాతి, జంబుమాలి హనుమంతుఁడు, సుగ్రీవుఁడు ప్రఘసుఁడు, ఇత్యాదులు ద్వంద్వయుద్ధము సలిపినట్లున్నది.[1]

శ్రీమద్రామాయణమున రావణున కనేకపుత్రులు మహాశూరు లుండినట్లును నందు నరాంతకుఁ డొకఁ డనియుఁ గలదు.[2] శ్రీమద్రామాయణమున నంగద నరాంతకులు ఘోరముగాఁ పోరినట్లున్న విషయమే యిందు నాటకీయముగా కుస్తీపట్లు పట్టుకొనుట మున్నగు చేష్టలు సంగ్రహముగా వర్ణితమై వారి ద్వంద్వయుద్ధము మనకన్నుల యెదుట గోచరించునట్లు చమత్కారముగనే వర్ణింపఁబడినది.

1. యుద్ధకాండం. ద్వంద్వయుద్ధం నామ
(43-వ అధ్యాయము)

2. శ్రుత్వా త్రిశిరసో వాక్యం దేవాంతక నరాంతకౌ।
అతికాయశ్చ తేజస్వీ బభూవుర్యుద్ధహర్షితాః॥ 9
తతోఽహమహమిత్యేవ గర్జంతో నైరృతర్షభాః।
రావణస్య సుతా వీరాః శక్రతుల్యపరాక్రమాః॥ 10
(యుద్ధకాండ-70-వ అధ్యాయము.)

రావణుఁడు మేఘనాద కుంభకర్ణులను యుద్ధమునకుఁ బంపి తాను సుముఖ దుర్ముఖులమూలమున యుద్ధవార్తల నప్పటి కప్పుడరయు చుండును. శ్రీమద్రామాయణమున కుంభకర్ణుఁడు మరణించిన పిదప నింద్రజిత్తు లక్ష్మణునితో మాయాయుద్ధము చేసి తుదకు మడియునట్లున్నది. ఈ నాటకమున నీ మేఘనాదకుంభకర్ణులతోటి యుద్ధము ప్రక్కప్రక్కననే జరుగుచున్నట్లు వర్ణింపఁబడినది. నేపథ్యభాషణమున గతవృత్తాంతము పర్యాయముగాఁ తెలుపఁబడుచుఁగథ సాగింపఁబడినది. కుంభకర్ణుని మేల్కొల్పుటకు రావణుఁడు సూపిన యుపాయములు పదునెన్మిదికొలముల పాములచే గరపించుట, పర్వతములను మీఁదఁ బడవేయించుట దిగ్గజములచేఁ ద్రొక్కించుట మొదలగునవి నాటకీయముగా ప్రేక్షకదృష్టి నాకర్షించి లెస్సగా వర్ణింపఁబడినవి.

లక్ష్మణమేఘనాదుల యుద్ధము, కుంభకర్ణసుగ్రీవుల యుద్ధము వాల్మీకీ యముగనే సాగినది. ఇందింకను జమత్కారముగా దృశ్యకావ్యమునకుఁ దగినట్లు రసవంతముగా వర్ణింపఁబడినది. లక్ష్మణమేఘనాదయుద్ధమున వారు ప్రయోగించునస్త్రములు విచిత్రములుగా నున్నవి. రాజశేఖరుని యూహ చాల గొప్పది. అస్త్రప్రత్యస్త్రముల నూహించి చాల నేర్పు చూపినాఁడు. ఆగ్నేయ, వారుణములు, పర్జన్య వాయవ్యములు, అను నస్త్రములు సాధారణముగాఁ బ్రయోగింపఁబడుచున్నవి. ఇందతఁడు తామిస్ర చంద్రాస్త్రములు; రాహు నారాయణాస్త్రములు; మన్మథ పాశుపతాస్త్రములు నని వర్ణించెను. ఈ యస్త్రపరంపరలన్నియు ననర్ఘరాఘవానుకరణము. రాజశేఖరుని వర్ణనానైపుణ్యము కడు శ్లాఘనీయము, యుద్ధరంగము కన్నులఁ గట్టినట్లే రసవంతముగ తత్తదుచితభాషణముల లెస్సగాఁ బోషించినాఁడు యుద్ధము సాక్షాత్తుగాఁ జూపరాదు గావుననే తన్నియమానుసారము సుముఖదుర్ముఖులనోట నప్పటి కప్పుడు యుద్ధవార్తలఁ దెలియఁజేసెను.

సుగ్రీవకుంభకర్ణయుద్ధము తీవ్రము కాగా రాముఁడే స్వయము కుంభకర్ణు నెదుర్కొని హత మొనర్చును. వార్తాహరులు క్రమముగా రావణునకు కుంభకర్ణమేఘనాదులు మరణించిరని తెల్పుదురు. రావణుఁడు మిగులఁ జింతిల్లును కష్టపరంపరలు తన్నావరించుటకు మిగుల విచారపడి రావణుఁడు మండోదరీ గృహంబునకుఁ బోవును.

ఈ యంకమందు యుద్ధము చాలవరకుఁ గవి వాల్మీకి రామాయణానుసారముగనే వర్ణించుచు సూక్తివైచిత్ర్యమునను కల్పనాచాతుర్యమునను నొక వింత సోయగముం గూర్చి యుద్ధఘట్టమునకు మెరుఁగిడినాఁడు.

ఇందు పలువురు వీరశిఖామణులు తమ యుత్సాహాతిశయమున రణరంగములం దసువులపై నాస లేక స్వామి కార్యసాఫల్యమునకై ప్రతిపక్షులతోఁ బోరి వీరవిలాసముల నెరవుటచే నీ యంకమునకు వీరవిలాస మని పేరు వచ్చినది.

నవమాంకము విష్కంభమందు యుద్ధరంగమున నాల్గు దినములుగా జరిగిన పోరునందే యేపక్షమువా రెంద రెందరు మరణించిరో తెలుపుటకై యమభటుఁ డొకఁడు ప్రవేశించి చిత్రగుప్తునకు రాక్షసనాయకులలో నెవ్వ రెవ్వరు గతించిరో లెక్క చదువును. అవల నింద్రదశరథులును చారణదంపతులును నభోమార్గమున నిలిచి యుద్ధరంగమున రామరావణయుద్ధము విలోకింతురు, ఇట్లాకాశమార్గమున నుండి భూలోకయుద్ధమును దిలకించు చున్నట్లును, వారి మూలమున యుద్ధవిషయము నెరుకపరచుటయు పూర్వానుకరణమే. భాసుఁ డభిషేకనాటకమున ముగ్గురు విద్యాధరులు రామరావణయుద్ధమును దిలకించినట్లు తెల్పెను. భవభూతియుఁ దన మహావీరచరితమున

నింద్రచిత్రరథులు విమానారూఢులై రామరావణయుద్ధమును గమనించి యుండినట్లు పేర్కొనెను. అటులే యుత్తరరామాయణమునను లవచంద్రకేతుల యుద్ధమును విద్యాధరమిథునము వర్ణింతురు. రాజశేఖరుఁడును తనపూర్వుల ననుసరించి యటులే యొక చారణ మిథునము నింద్రచిత్రగుప్తులే గాక దశరథునిగూడ యుద్ధదిదృక్షచే రప్పించెను.

రామరావణ యుద్ధవర్ణనసందర్భమున వారు పరస్పరము తూలనాడుచు మాటలాడుకొనునపుడును వారి వారికి దగినట్లు ఔచిత్యమును బోషించుచు సంభాషణములఁ గూర్చెను. అంతటి తీవ్రరణరంగమునను తన నాయకుఁ డగు రామునిచే గొప్పమాటలు శాంతముగా పల్కించినాఁడు. ఎట్లన రావణు నెదుర్కొనుచు రావణునితో నాడినపల్కులు చూడుఁడు.

శ్లో॥ భో లంకేశ్వర! దీయతాం జనకజా రామః స్వయం యాచతే
కోఽయం తే మతివిభ్రమః స్మర నయం నాద్యాపి కించిద్గతమ్।
నైవం చేత్ ఖరదూషణత్రిశిరసాం కంఠాసృజా పంకిలః
పత్త్రీ నైష సహిష్యతే మమ ధనుర్జ్యాబంధబంధూకృతః॥
(అంకము 9. శ్లోకము 19.)

లంకాధీశ్వర యని సగౌరవముగాఁ బల్కి సీతను తన కిమ్మని తానే యాచించుచున్నా ననియు నెంతో వినయముగాఁ బల్కెను. రామునకు యుద్ధమునం దాసక్తి లేదు. సామమున కార్యము నెరవేరినఁ జాలును. అద్దానఁ గాకుండిన దండోపాయము గల దని తెల్పెను. కాని రావణునంతటి దుర్మతి కీరాముని సాంత్వనవచనములును శాంతవచనములును నచ్చునా? రామునిపల్కు లెంత నయభయ సూచకములో రావణునిపల్కు లంత దుర్నయహీనవచనములు. రావణుఁ డే మనుచున్నాఁడో చూడుఁడు. రే రే

రామ! దోర్దండచండిమాహృతరామ! త్వత్పూర్వపురుషస్యాపి ప్రహరేణైర్న్ని సోఢమాసీత్ తథా హి స మయా-

శ్లో॥ భృంగః స్తంబేరమేణేవ మదలంపటచేష్టితః।
అనరణ్యో వరేణ్యశ్రీశ్చపేటీ చిపటీకృతః॥
(అంకము 9. శ్లోకము 20.)

ఓరీ రాముఁడా! నీ పూర్వపురుషుఁడే నా ప్రహరణముల నహింప లేక పోయె. అతఁడు నాచే నేన్గుచెవులకడ మదజలమును ద్రావ మూఁగు తేటి యెట్టు లా యేన్గుచెవులదెబ్బలు తినునో అట్లే పూర్వుఁడు అనరణ్యుఁడు చేతగాక నాచే చెంపదెబ్బలు తినెను అని సావహేళవముగఁ బల్కెను.

ఈ అనరణ్యుని రామకులమున నొక పూర్వుని రావణుఁడు ప్రశంసించుట అనర్ఘరాఘవానుకరణము అనరణ్యుని ప్రశంస శ్రీమద్రామాయణమునను గలదు.[1] ఒకప్పుడు రావణునకు ననరణ్యునితోఁ బోరు సంభవించినపుడా యనరణ్యుఁడు రాక్షసేంద్రునిచేఁ బరాజితుఁడై రావణునకు "ఇక్ష్వాకువంశజుఁడగు రామునిచే నిహతుఁడ వగుదు" వని శాప మొసఁగినట్లున్నది. రావణుఁ డా యనరణ్య ప్రశంసచేయుట తన కవసానకాల మాసన్నమైన దని తెలిసియే యట్లు రామునితోఁ బోరుచున్నట్లును, రావణున కాయనరణ్యశాపము స్మృతికి వచ్చి రామునిచే మృతి నిశ్చయ మనియే గ్రహించి రాము నంతగా ధిక్కరించి పోరునట్లు వర్ణించుటయు రాజశేఖరుఁడు వ్యంగ్యముగా రావణనిధనము నిక్కమని తెలుపుటకేయై యుండవచ్చును.

రామరావణయుద్ధము తీవ్రముగా జరుగును. రాముఁడు త్రిపురాసుర సంహారమున మహేశ్వరుని బోలి యున్నాఁ డని దేవేంద్రుఁడు నుడువును. ఆ యుద్ధము నిజముగ నాలంకారికులు ఉపమేయోపమాలంకారమున

1. ఉత్తరకాండం-(19-వ అధ్యాయము అనరణ్యశాపః)

కుదాహరణముగ నుడువునట్లే యీ రామరావణయుద్ధము ద్వితీయసదృశవ్యవచ్ఛేదకముగ వర్ణింపఁబడినది. ఈ యుద్ధమున విశేష మేమన అస్త్రములకుఁ బ్రత్యస్త్రములఁ బ్రయోగించు నాచారము తప్పించి యిందు రావణుఁడు రామప్రయుక్తములగు నస్త్రముల కెల్ల తదస్త్రసంధుక్షణశీలంబులగు సస్త్రములఁ బ్రయోగించినట్లు వర్ణింపఁబడినది. రాముఁడాగ్నేయాస్త్రమును బ్రయోగింప రావణుఁ డది తనకుఁ జాలని దని సమీరణాస్త్రమును బ్రయోగింపఁ దత్ప్రశమనమునకై రామభద్రుఁడు జలధరాస్త్రమును బ్రయోగించె ననియు, రావణుఁ డందులకు "జలం జలసం పృక్తం మహాజలాయ కల్పతే" యని వారిదాస్త్రోద్దీపనార్థము ఉదన్వదస్త్రమును బ్రయోగించె ననియు, తచ్ఛమనార్థము రాముఁ డగస్త్యాస్త్రమును బ్రయోగించినట్లును చమత్కారముగా నద్భుతమును గొల్పు కల్పనా నైపుణ్యము రాజశేఖరునకే చెల్లు. వీరాలాపములు పల్కునపుడు వీరరసస్ఫోరకభాషనే చక్కగాఁ బోషించెను.

ఈ రామరావణయుద్ధమున కవి పై యస్త్రకల్పనమే కాక మరియొం డద్భుతకృత్యమును జూపెను. రావణశిరములు రామాస్త్రకృత్తములై క్రమముగా నవానన నిరాననము లగును. రావణుఁడు బహుమూర్తిత దాల్చును. ఈ బహుమూర్తిధరణము మాయావిత్వమని రాముఁడు విశ్వామిత్రునొద్ద నేర్చిన మాయాహరాస్త్రమును బ్రయోగించి రావణమాయను మొదలంట సంహరించెను. ఇదంతయు ప్రేక్షకా నందమునకై కవి కల్పించిన విషయమే. తుదకు రావణుఁడు రామునిరథముతోడ బొంగరమువలె గిరగిర త్రిప్పుట కూడ 'వ్యోమ్ని భ్రమరక భ్రామం భ్రామ్యతేఽనేన హా రథః' మున్నగునవి రావణపరాక్రమ మసమానమని వచించి యట్టి వానిని జయించినవాఁడు రాముఁడు మరింత పరాక్రమవంతుఁడుగా నుండవలయును గదా యని స్ఫురింపఁజేయుటకై

రావణు నంతగా వర్ణించినాఁడు. అట్టి భ్రమరకభ్రామముగ రథము తిరుగుచున్నను నందుండియే శ్రీరాముఁడు శబ్దవేధివిదుఁడై బ్రహ్మాస్త్రమున రావణునిశిరము ఖండించె నని వర్ణించుటయు నద్భుతములలో నెల్ల నత్యద్భుతకృత్యము.

ఇట్లు క్రమముగా రావణునిశిరములు నవాననములుగను నిరాననములుగను గావించి బ్రహ్మాస్త్రప్రయోగమునఁ బరిమార్చి దేవతలకును, దశరథునకును నెల్ల లోకంబులకును శుభ మొనగూర్చి స్తుతిపాత్రుఁడయ్యెను. ఇందు రామరావణయుద్ధము రావణవధతో ముగియుటచే నిది రావణవధ మను పేరు బడసెను.

దశమాంకారంభమున లంక అలక అను నిద్దరు పట్టాణాధిదేవతలు సంభాషింతురు. మహావీరచరితమున భవభూతి లంకాలకలను సంభాషించినట్లు చేసెను. దాని ననుకరించి రాజశేఖరుఁడు నిట లంకాపట్టణదుఃస్థితిని వీరిసంభాషణమునఁ దెలియఁజేయుచున్నాఁడు. మరియు, విభీషణుఁడు లంక నేలువాఁడనియు, శుద్ధికై సీత యగ్నిప్రవేశ మొనర్చి పరిశుద్ధురాలై వెలుపలికి వచ్చియందరిచేఁ బ్రశంసింపఁబడెననియు, విభీషణాదిపరివారంబుతోడను సీతతోడను రాముఁడు విమానంబున నయోధ్య కేగు ననియు, హనుమంతుఁడు ముందుగా భరతాదులకు శుభవర్తమానముఁ దెలియఁజేయ బంపఁబడె ననియు నందరుఁ దత్ప్రయాణసన్నాహమున నుండి రనియు విష్కంభమునఁ దెలియుచున్నది. ఈ ఘట్ట మంతయు వాల్మీకిరామాయణానుసారమే నడచినది.

విమానయానము మురారికవి ననుసరించి వ్రాసినట్లు గోచరించుచున్నది. లంకనుండి వారు సూటిగా హిమవత్పర్వతములు, కైలాసము, అలకానగరము, మానససరోవరము, మందరపర్వతము,

మేరుపర్వతములఁ దిలకించి చంద్రమండలమును నవలబ్రహ్మలోక ముండు నని విని సర్వముఁ దిలకింతురు. రత్నశేఖరుఁడను నొక విద్యాధరుఁడు సీతారాముల ఘనతను మెచ్చుకొని వారికీ వింత లన్నియుఁ జూపును. ఈ ప్రదేశములు వర్ణించునపుడు నిజముగ ప్రకృతి రమణీయతాలోలుఁ డగువాఁడు కనుకనే రాజశేఖరుఁడు రసవంతముగ వర్ణింపఁ గలిగినాఁడు. బ్రహ్మలోకమున బ్రహ్మతపమొనర్చుటకుఁ గారణమును గవి చమత్కారముగా రామునిమూలమున నుడువుచున్నాఁడు. రాముఁ డేమనుచున్నాఁడో చూడుఁడు–

శ్లో॥లక్ష్మీం వక్షసి కౌస్తుభస్తవకిని ప్రేమ్ణా కరోత్యచ్యుతో
దేహార్ధే వహతి త్రివిష్టపగురుర్గౌరీం స్వయం శంకరః।
శంకే పంకజసంభవస్తు భగవానద్యాపి బాల్యావధేః
సర్వాంగప్రణయాం ప్రియాం కలయితుం దీర్ఘం తపస్తప్యతే॥

(అంకము 10. శ్లోకము 41.)

అని హరిహరులయెడ. వారిభార్యలవలె తనయందును సర్వాంగప్రణయినిగా తన ప్రియురాలిని జేయుటకే తప మొనరించుచున్నాఁడని చమత్కారముగా వర్ణించుచున్నాఁడు, రాజశేఖరునిరాముఁడు రసికుఁడు, సహృదయుఁడును నగును, రాముని బ్రహ్మతపోవర్ణనము తన పరివారమువారి కందరకు నవ్వు పుట్టించును.

అవల మరల సముద్రముమీఁదుగా సింహళదేశమును, మాల్యవంతము, మలయపర్వతముల దాటి యగస్త్యాశ్రమమును జేరి యట విమానము దిగి యగస్త్యునికి రాముఁడు పాదాభివందన మాచరింప, తక్కినవా రందరును బ్రణమిల్లుదురు. సీతయు మునులప్రభావము లెస్సగాఁ దెలిసినదై మున్యాశ్రమములందు జరుగు కార్యకలాపములఁ దలపోసి వారిదర్శనముననే

సంసారులు ముక్తు లగుదురని నుడువును. ఋషులపై సీత కంతటి యుదాత్తగౌరవము.

అట లోపాముద్రాగస్త్యులవలన భగీరథాదుల మరపించునట్లు రాజ్యపాలనగావించు మనియు నిరువుర పుత్రులఁ బడయు మనియు నాశీర్వాదములంది మరల విమానారూఢులై వారందరును బయలుదేరుదురు. ఇట అగస్త్యాశ్రమమున త్రోవలో విడియుట శ్రీమద్రామాయణమున లేదు. మాల్యవంతమున మాత్రము దిగి వానరస్త్రీల నెల్ల విమానమున నెక్కించుకొని యయోధ్య కేగినట్లుమాత్ర మున్నది. ఇట సీతారాములకుఁ బెద్ద లన్న గౌరవము మెండని వారి గుణగుణముల కొకపరిమళము నాపాదింప వారి కంత వినయము సూపుటకై రాజశేఖరుఁడు వారి విమానమును ద్రోవలో నిల్పి యగస్త్యదంపతులకుఁ బ్రణమిల్లఁ జేసెను. ఇప్పట్టున రాజశేఖరునిహృదయము గూడ గురుభక్తి ప్రవణ మని వ్యంగ్యముగాఁ దెలియుచున్నది. గురుదేవతాభక్తి యాతనికి మెండు. మరల సప్తగోదావరముమీఁదుగాఁ బోవుచు భీమేశ్వరునకుఁ గేల్మోడ్చి నమస్కరించును. ఆగస్త్యునియెడ దిగి ప్రణమిల్లినట్లిచ్చట విమానమునుండి దిగలేదు. 'దైవేరుష్టే గురుస్త్రాతా గురౌ రుష్టే న కశ్చన' యను నార్యోక్తిపై ప్రమాణబుద్ధి గలవాఁ డగుటే రాజశేఖరుఁడు తన నాయకు నట్లగస్త్యుని యెడల నెక్కుడు భక్తిఁ జూపఁజేసెను.

అవల వారు ద్రవిడదేశము దాటి సప్తగోదావరమున భీమేశ్వరుని జూతురట, ఇది నేటి భూగోళశాస్త్రవిరుద్ధము. కావేరికి పైభాగముననే గోదావరి గలదు. పైకి పోయి గోదావరిని జూచి మరల క్రిందికి కావేరికి వచ్చుట నయోధ్య కేగుత్రోవలో పొసగదు. కావేరిని జూచి యవలనే గోదావరి కేగుటయే మార్గము. ఇందిట్లు గోదావరిని జూచినపిదప కావేరిని దిలకించుట భూగోళజ్ఞానవిషయమునకు దూర మగుచున్నది. అప్పటి కీ భూగోళశాస్త్రము

ప్రజల కంతపరిచితము కాదు కాబోలు. పిమ్మట త్రోవలోని దేశములలో మహారాష్ట్రము, (విదర్భదేశము), కుంతలము, లాటము మున్నగుదేశములను నర్మదానదిని జూతురు. అత్తరి రాముఁడు ఆయా దేశముస్త్రీల కామవ్యాపారముల గురించి సీతకుఁ దెలియఁ జేయును. ఈ విదర్భలాటదేశముల వర్ణించుచు నా దేశములందలి భాషావిషయముగూడఁ దెల్పును. వైదర్భీ లాటీ రీతులందు రాజశేఖరునకుఁ గల యభిమానము దీన వ్యక్తమగుచున్నది. విదర్భదేశమునుగూర్చి తనజన్మస్థానమగుటఁజేసి కాబోలు రాజశేఖరుఁడు ఎట్లు వర్ణించెనో జూడుఁడు,

శ్లో॥" యత్తేమం త్రిదివాయ వర్త్మనిగమస్యాంగం చ యత్సప్తమం
స్వాదిష్టం చ యదైక్షవాదపి రసాచ్చక్షుశ్చ యద్వాజ్మయమ్।
తద్యస్మిన్ మధురం ప్రసాదిరసవత్కాండం చ కావ్యామృతః
సోఽయం సుభ్రు పురో విదర్భవిషయః సారస్వతీ జన్మభూః॥"

(అంకము 10. శ్లోకము 74.)

విదర్భదేశము 'సారస్వతీ జన్మభూః' అని విద్యోత్పత్తిస్థాన మనియు, వేదార్థ ప్రచారణకుశలబ్రాహ్మణాధిష్ఠాన మనియు, నచ్చటివారు సతతశాస్త్రార్థపర్యాలోచనాసక్తు లనియు, ప్రసాదగుణమాధుర్యగుణ విలసితసత్కావ్యప్రణేత లగు కవుల కాశ్రయ మనియు నెంతో యుదాత్తముగా వర్ణించియున్నాఁడు. లాటదేశము నెట్లు వర్ణించెనో చూడుఁడు.

"యద్యోనిః కిల సంస్కృతస్య సుదృశాం జిహ్వాసు యన్మోదతే
యత్ర శ్రోత్రపథావతారిణి కటుర్భాషాక్షరాణాం రసః।
గద్యం చూర్ణపదం రతిపతేస్తత్రాకృతం యద్వచ
స్తాం లాటాం లలితాంగి! పశ్య నుదతీ దృష్టేర్నిమేషవ్రతమ్॥"

(అంకము 10. శ్లోకము 78.)

లాటదేశము సంస్కృతమున కుత్పత్తిస్థాన మనియు, నందు స్త్రీలును విద్యావతులనియు, భాష పరుషవర్ణప్రాయమై యుండు ననియు, చిన్నమాటల నొప్పు ప్రాకృతము గద్యకుఁ బ్రసిద్ధ మనియు గొప్పగనే వర్ణించెను. ఉజ్జయినిని వర్ణించునపు డచ్చటి స్త్రీలకామతంత్రచేష్టలు చూడ వింతగాఁ దెల్పును. అట్లే మాలవాదిదేశముల వర్ణించును. క్రమముగా నిట్లు పెక్కుదేశములు దాటి, త్రివేణీ సంగమము, కాశి మున్నగువానిని దాటి యయోధ్యఁ జేరుదురు. ఈ దేశవర్ణనము, అచ్చటి స్త్రీలకామచేష్టావర్ణనము మురారికూడ తన యనర్ఘరాఘవమునందు గావించి యున్నాఁడు. రాజశేఖరుఁ డీవిషయ మంతయు నాతనినుండియే గ్రహించి యనుకరించె నని చెప్పఁదగును.

తుదకుఁ మిథిలానగరముచెంతకు రాగా విభీషణసుగ్రీవులు పరశురాముని జయించిన విషయము 'ఇచటనే కదా' అని ప్రశంసించినపుడు రాముఁడు సిగ్గిలును. ధీరోదాత్తనాయకుఁ డగుటఁజేసి స్వోత్కర్షవర్ణనము సైపఁడు. కాశిని వర్ణించునపుడు కవియెంత యుదాత్తముగా నుడివెనో చూడుఁడు. అతనికి విశ్వనాథునిపైఁ గల భక్తియు నద్దాన వ్యక్తము కాగలదు,

శ్లో॥"యద్వాచంయమవృత్తయః కిమపరం నీవారముష్టింపచాః
సత్యం జ్యోతిరుపాసతే సుకృతినో ద్రాక్సంవదంతే చ న।
నిత్యాసన్నతయాత్రఖండపరశోర్వారాణసీవాసినః
సంభోగైరపి సుభ్రువాం తదజరం విందంతి నందంతి చ॥"

మౌనులును నీవారముష్టింపచులు నే పరంజ్యోతి నుపాసించి శీఘ్రముగా సిద్ధిని పొందఁజాలరో ఆ పరంజ్యోతియైన విశ్వనాథునిసాన్నిధ్యమున వారాణసీవాసులు భోగమోక్షముల నవలీలగ నందగల రని ప్రశంసించుచున్నాఁడు.

పిదప వీరు అయోధ్యఁజేరి యట పరస్పరముకలిసికొనుట మున్నగు విషయములు మహావీరచరిత అనర్ఘరాఘవములనుండి గ్రహించి చక్కనిరీతిఁ గూర్చి యెంతో సొంపుగ రచింపబడినవి. వసిష్ఠుఁడు కూడ రాముఁడు నమస్కరించి నపుడు అగస్త్యునివలె,

'ఆశాస్మహే నను తథాపి సహస్వ వీరైః
భూకాశ్యపోపమసుతద్వితయా వధూః స్యాత్॥'

(అంకము 10. శ్లోకము 64.)

అని పుత్రద్వయము కలుగు గాక యని దీవించె ననుట మురారి ననుకరించుటే, అయోధ్యయందు భరతాదులతోఁ గలియుట, విభీషణాదులకు వసిష్ఠ భరతాదులకు పరిచయపరచుట, మున్నగునవి యన్నియు భవభూతిరచనానుకరణమే కాని సూక్తివైచిత్ర్యముచే దేని కది యెంతో రసవంతముగా నున్నట్లు వెలయుచున్నది. ఈ యయోధ్యలో గురుమిత్రబాంధవసన్నిధి రాముఁడు మెలగినతీరు, పల్కిన తీయనిపల్కుల వైనము మొదలగునవి యన్నియు రసవంతములై మనోహరముగా వెలయుచున్నవి. మహాకవులు పెద్దలచరితము లిట్లు వర్ణించుట తర్వాతి వారికి శీలపోషణమునకును అదర్శమార్గబోధమునకును నుపయోగపడవలయు ననియే రాజశేఖరుఁడు నుత్తమాదర్శములఁ గలవాఁడు కావుననే తననాయకునిగ లోకోత్తరుఁడగు శ్రీరామునే గ్రహించి రామచరితాభివర్ణనమున శాశ్వతమగు కీర్తినందగల్గినాఁడు. భరతవాక్యవిషయమునఁ గూడ నీ రాజశేఖరుఁడు మురారినే యనుకరించెను. చూడుఁడు.

శ్లో॥ సమ్యక్సంసారవిద్యావిపదముపనిషద్భూతమర్థాద్భుతానాం
గ్రథ్నంతు గ్రంథిబంధం వచనమనుపతత్సూక్తిముక్తాః సుయుక్తాః॥

సంతః సంతర్పితాంతఃకరణమనుగుణం బ్రహ్మణః కావ్యమూర్తే
స్తత్తత్వం సాత్త్వికైశ్చ ప్రథమపిశునితం భావయంతోఽర్చయంతు॥

(అంకము 10. శ్లోకము 105.)

'పండితు లెల్లరు సంసారబంధమోచకంబగు నుపనిషద్రహస్యములఁ దెల్పు గ్రంథముల రచింత్రు గాక. సాత్త్వికులగు కవులు పరతత్త్వము నెన్నుచు కావ్యములు విరచింతురు గాక. ఇతరరచనలనైన భావించి యర్చింతురు గాక' యని తత్త్వబోధకగ్రంథముల రచింతురుగాక యనుచు తనరచన యట్టిదని వ్యంగ్యముగాఁ జేయుచున్నాఁడు.

ఈ యంకమున రాఘవుఁడు సీతను గ్రహించి యయోధ్య కేతెంచి గురుమిత్రబంధుమధ్యమునఁ పట్టాభిషిక్తుఁడై యానందమున నలరారుటచే నిది రాఘవానంద మనిపించుకొనెను.

మొత్తము మీఁద నీ నాటకమునఁ దొలుత కవి చెప్పికొనినటులే (భవభూతి మురారులు తనపూర్వజన్మములని) వారిని కొన్నితావుల ననుకరించి గ్రంథము నెంతో చమత్కారముగా వీరాద్భుతరసవిలసితముగ నొనర్చి తన వచనరచనా నైపుణికిని కల్పనాచాతుర్యమునకును మెచ్చులుబడసి కవికోటికీర్తి నందఁ గల్గెను. ఈ రాజశేఖరుఁడు సామాన్యుఁడు కాఁడు. ఉత్తమతరగతికవులలోఁ జేర్పఁదగినవాఁడనుటలో సందియము లేదు.

బాలరామాయణమున సూక్తులు

1. అనిర్వేదః సిద్ధేర్మూలం: (అం. 1-పుట 4.)
(అవమానము లేకుండుటయే సిద్ధికి మూలము.)

2. న హి సర్వః సర్వం జానాతి: (అం. 1-పుట 7.)
(అందరు అన్నిటి నెరుగరు.)

3. వస్త్వంతరం అతిశయానో హి ప్రజ్ఞాప్రకర్షః: (అం. 1-పుట 8.)
(ఉత్కృష్టబుద్ధి అన్నిటి నతిక్రమించినది కదా.)

4. సతాం ప్రజ్ఞోన్మేషః పునరయమసమసీమా విజయతే:(అం. 1-శ్లో 8.)
(కవీశ్వరుల ప్రజ్ఞాస్ఫురణము ఆవధిలేనిదిగా నుండును.)

5. దురారాధా లక్ష్మీరనవహితచిత్తం చలయతి: (అం. 1-శ్లో 24.)
(సిరి కష్టమున నారాధింపఁ దగినది. స్థిరచిత్తములేని వానిని చలింపఁ జేయును.)

6. దుఃఖం జీవంతి మంత్రిణః. (అం. 1-పుట 25.)
(మంత్రుల జీవనము దుఃఖజీవనము)

7. సుప్తమత్తకుపితానాం హి భావజ్ఞానం ద్రష్టవ్యమ్: (అం. 1-పుట 22.)
(నిద్రించినవారియొక్కయు, మత్తులైనవారియొక్కయు, కోపము చెందినవారి యొక్కయు మనోభావము సులభముగఁ దెలియ నగును.)

8. న సర్వదా సర్వస్య సదృశో దశాపాకః: (అం. 1-పుట 42.)
(అందరికిని కాల మొక్కరీతిని జరుగదు గదా.)

9. అవిమృశ్యకారితా హి పుంసః పరం పరిభవస్థానమ్: (అం. 1-పుట 44.)
(విచారింపక పనిచేయువానికి పరాభవము గల్గును.)

10. దుస్త్యజా ప్రకృతిః (అం. 2-పుట 58.)
(సహజమైన గుణము విడువ శక్యము కాదు.)

11. యో యత్రానురక్తః స తదన్యతిరస్కారేణ తదేవ బహుమన్యతే: (అం. 2-పుట 95.)
(ఎవఁడు దేనియం దనురక్తుఁడో వాఁడు దానినే ప్రశంసించుచు తదన్యమును తిరస్కరించును.)

12. యేన కేనచిద్వ్యసనినో జనస్య తదసన్నిధానే తత్ప్రతినిధిరపి వినోదాయ (అం. 2-పుట 59.)
(ఏదేని వ్యసనము గల మనుజున కది లభింపనపుడు తత్ప్రతినిధియైనను వినోదకరం బగును.)

13. భూర్భువస్స్వస్తితయవాసిభిరప్యనుల్లంఘనీయో దేవాదేశః: (అం. 2-పుట 65.)
(భూలోక భువర్లోక స్వర్లోకముల వసించువారి కైనను శివునియాజ్ఞదాట రానిది.)

14. న ప్రాణనిర్యాణేప్యనుచితవాచో భవంతి భృత్యాః: (అం. 2-పుట 71.)
(ప్రాణము పోవునపుడైనను సేవకులు అనుచితముగ మాటలాడరాదు.)

15. అతిక్రాంతే వస్తుని సాక్షిప్రత్యయపరతంత్రా వ్యవహారాః: (అం. 2-పుట 77.)
(జరిగిపోయిన వ్యవహారములు సాక్షుల కధీనములు గదా.)

16. సకలస్యాస్య లోకస్య జాతిర్భవతి మాతృతః।
ఋషీణాం తు శ్రుతిదృశాం పితృతో ధర్మనిర్ణయః॥ (అం. 2-శ్లో 33.)
(లోకమునం దెల్లరకును తల్లివలన జాతి సంభవించుచున్నది. వేద

విదులైన తాపసులకుఁ దండ్రివలనఁ గలుగుచున్నది.)

17. కింపునరైరమ్మదే మహసి దారవీయం జ్యోతిరస్తమయతే
(అం. 2-పుట 79.)
(మెరుపుతీగెవెలుగునందు కాష్ఠానలమువెలుగు అస్తమించుట చోద్యమా?)

18. ఆధారనిబంధనో యదాధేయస్య గుణాధ్యారోపః। (అం. 2-పుట 81.)
(ఆధారము ననుసరించి యాధేయమునకు గుణాధిక్యము లభించును.)

19. ఆయుధనిషేవ్యా రిపవో న సామసాధ్యాః: (అం. 2-పుట 84.)
(శత్రువు లాయుధములచే దండింపఁ దగినవారు కాని సామముచే సాధింపఁ దగినవారు కారు.)

20. ఆధేయవిక్రమకర్మాణః యేన కేనచిదపవదంతే: (అం. 2-పుట 87.)
(ఇతరులవిక్రమకర్మల విన సహింప లేని వా రేదియో అపవాదముల నెన్నుచుందురు.)

21. కిమభేద్యమంభసాం కిమదూష్యం దుర్జనవచసాం: (అం. 2-పుట 87.)
(నీటికి దుర్భేద మేదియు లేదు, దుర్జనులు దూషింపని దెద్దియులేదు.)

22. కస్య పునః ప్రత్యక్షపరాఙ్ముఖస్య మతిమత సతోఽనుమానే బహుమానః
(అం. 2-పుట 88.)
(ప్రత్యక్షపరాఙ్ముఖుఁడగు మతిమంతున కెవ్వనికి అనుమాన ప్రమాణమున గౌరవము.)

23. మందబుద్ధయో హి యథాశ్రుతస్య గ్రహీతారో న పునర్వివేక్తారః:
(అం. 2-పుట 91.)
(మందమతులు విన్నదానినే గ్రహింపఁ గలరు గాని యుక్తాయుక్త వివేచనము చేయఁ జాలరు.)

24. లోకోత్తరం చరితమర్పయతి ప్రతిష్ఠాం
పుంసాం కులం న హి నిమిత్తముదాత్తతాయాః।
వాతాపితాపనమునేః కలశాత్ప్రసూతి
ర్లోలాయితం పునరముద్రసముద్రపానమ్॥ (అం. 2-శ్లో 51.)
(లోకోత్తరమైన చరితమే పురుషునకు కీర్తికరముకాని కులము కాదు. అగస్త్యునికి, కుంభమున సంభూతి కాని సాగరపానము కీర్తిప్రదము.)

25. నిరంకుశాః కవివాచః: (అం. 3-పుట 118.)
(కవివచనములు నిర్బాధములు గదా.)

26. వనం వా గేహం వా సదృశముపశాంతస్య మనసః. (అం. 3-పుట 17.)
(నిస్పృహుఁడైనవానికి అడవియైనను ఇల్లైనను నొక్కటే.)

27. స్త్రైణః పుంసాం నవపరిగమః కామమున్మాదహేతుః॥ (అం. 3-శ్లో 26.)
(స్త్రీసంబంధమైన నూతనసంబంధము పురుషులకు మిక్కిలి యున్మాద హేతువు.)

28. అభిమానినామారంభస్య అనిర్వహణమమందో దుర్యశః కందః:
(అం. 3-పుట 132.)
(అభిమానవంతుల కారంభించిన పనిని పూర్తిచేయకుండుట అపకీర్తికరము గదా.)

29. న చ సందేహదేహో వీరవ్రతనిర్వాహః: (అం. 3-పుట 141.)
(వీరు లెన్నడును సందేహింపరు.)

30. మహదంతరం ప్రజ్ఞాప్రకర్షస్య: (అం. 4-పుట 156.)
(ప్రజ్ఞాప్రకర్షకుఁ జాల హెచ్చుతగ్గులు గలవు.)

31. శతభంగీ భవద్భద్రా మహతాం హి ప్రసత్తయః॥ (అం. 4-శ్లో 28.)
(మహాత్ముల యనుగ్రహములు శతముఖముల మే లొనరించును.)

32. గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః।
ఉత్పథప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే॥ (అం. 1-శ్లో 31.)
(ఉద్ధతుఁడును, కార్యాకార్యముల నెరుగనివాఁడును, కుమార్గ గామియైనవాఁడు నగు తండ్రిని సహితము విడచుట ధర్మము.)

33. మధురస్య హి మానుషస్య ప్రకృతిరేషా యద్యథా కథమపి రమయతి (అం. 4-పుట 210.)
(మనోహరాకృతు లెట్టి సమయములం దైనను సంతసింపఁజేయుట సహజము.)

34. డింభస్య దుర్విలసితాని ముదే గురూణాం॥ (అం. 4-శ్లో 61.)
(బాలుర దుశ్చేష్టితములు గురువులకు సంతోషమును గలిగించును.)

35. న శస్త్రగ్రహణాధికారః సంబంధమనురుధ్యతే (అం. 4-పుట 225.)
(శస్త్రగ్రహణాధికారము సంబంధము ననుసరింపదు.)

36. స్త్రీణాం ప్రేమ యదుత్తరోత్తరగుణగ్రామస్పృహాచంచలమ్॥ (అం. 5-శ్లో 2.)
(ఉత్తరోత్తరంబుగ గుణవంతులందు పువుబోడులచిత్తము లెక్కుచుండును.)

37. న కాలహరణక్షమాః ప్రియజనసమాగమమహోత్సవాః: (అం. 5-పుట 242.)
(ప్రియజనసమాగమమహోత్సవములు కాలహరణము నుపేక్షింపవు.)

38. కేతకసంపర్కి సిచయమపి కిమప్యామోదాయ (అం. 5-పుట245.)
(మొగలిపూవుసంపర్కముగల ప్రాంతదేశముకూడ పరిమళించును.)

39. ఈర్ష్యాయితం హి స్త్రీణాం ప్రకాశకం ప్రేమభరస్య (అం. 5-శ్లో 246.)

(సవతులయెడ నీర్ష్యాచరణమే స్త్రీల ప్రేమాధిక్యమును ప్రకాశింపఁ జేయును.)

40. సమప్రేమరసం సమరూపయౌవనం సమవిలాసవిశిష్టమ్।
సమనుఖదుఃఖం చ జనం సమపుణ్యైర్జనో లభతే॥ (అం. 5-శ్లో 17.)
(అనుగుణమైన ప్రేమ, రూపము, యౌవనము, విలాసము, సుఖ దుఃఖములు మున్నగువానిని గలవ్యక్తిని పూర్వపుణ్యఫలమున నరుఁడు పొందును.)

41. విరహమవిరహం వా నానురుంధంతి మేఘాః।
సుఖినమసుఖినం వా సర్వముత్కంఠయంతి॥ (అం. 5-శ్లో 30.)
(మేఘములు వియోగము గాని అవియోగము గాని, సుఖి గాని దుఃఖిగాని యెవ్వరిని గణింపక వ్యాకులపరచును.)

42. నీతితంత్రే ద్వయం దృష్టం సిద్ధయే కృత్యవస్తునః।
సమానః కార్యయోగశ్చ ప్రభుశక్తిశ్చ నిశ్చలా॥ (అం. 6-శ్లో 1.)
(చేయవలసిన కార్యసిద్ధికి సమానకార్యయోగము, నిశ్చలమగు ప్రభుశక్తియను రెండును కారణము లని నీతిశాస్త్రమున నుడువఁ బడినవి.)

43. న్యక్కృత్యాన్యజ్జృంభతే మన్మథాజ్ఞా: (అం. 6-శ్లో 4.)
(మన్మథుఁ డన్నింటిని మరపింపఁ జేయును.)

44. కిం దుష్కరం స్వామిభక్తేః కిమసాధ్యం వైదగ్ధ్యస్య: (అం. 6-పుట343.)
(స్వామిభక్తి కలవాని కెద్దియు దుష్కరము కాదు. చాతుర్యము కలవాని కెద్దియు నసాధ్యముకాదు.)

45. కిమపి ద్విషతాముదాత్తజనచరితమావర్జకమ్ (అం. 6-పుట 344.)

(శత్రులకైనను మహాత్ములచరితము ఆర్ద్రీకరముగా నుండును.)

46. క్వ పునః సుధాదీధితిః ఆతపస్యందీ (అం. 6-పుట 346.)
(చంద్రుఁ డెండకాయుట యెచ్చటనైనఁ గలదా.)

47. నిష్కరుణో విధిః: (అం. 6-పుట 366.)
(దైవము దయలేని వాఁడు.)

48. ఉచితకారిత్వే అశ్రుతశిక్షితాని మహాభాగజనచరిత్రాణి: (అం. 6-పుట 374.)
(మంచిపనులు చేయుట మహాభాగులు నేర్చుకొన నక్కర లేదు. సహజముగనే వారి కలవడు నని భావము.)

49. అమంత్రశీలీ మహీపతిః, అపరప్రబంధదర్శీ కవిః, అపాఠరుచిశ్చ వందీ న చిరం నందతి: (అం. 7-పుట 399.)
(మంత్రశక్తి లేని ప్రభువు, ఇతరకావ్యములఁ జూడని కవియు, స్తోత్రముచేయని వందియు రాణింపరు.)

50. వహంతి శోకశంకుం చ కుర్వంతి చ యథోచితమ్।
కోఽప్యేష మహతాం హంత గాంభీర్యానుగుణో గుణః॥ (అం. 7-శ్లో 16.)
(శోకము ననుభవించుచుఁ గూడ కర్తవ్యకార్యములఁ జేయుచుండు మహాత్ముల గాంభీర్యసుగుణమైన ప్రభావము మెచ్చుకొనఁదగినది.)

51. మహతాం నిస్సీమానశ్చరిత్రవిభూతయః: (అం. 7-శ్లో 40.)
(పెద్దల మాహాత్మ్యమునకు హద్దు లేదు.)

52. ప్రముఖవిముఖం బలం ద్వాదశవర్షాణి న సమ్ముఖీభవతీతి ప్రాయోవాదః: (అం. 7-పుట 456.)

(ఎదుర్కొని విముఖమైన బలము పండ్రెండేడ్లు మరల నెదుర్కొనదని వాడుక)

53. కః శక్తిమానపి మృగాంకమూర్తిం శిలాపట్టకే పినష్టి: (అం. 7-పుట 461.)
(శక్తిమంతుఁడైనను ఎవ్వఁడు చంద్రబింబమును శిలపై నూరును.)

54. క్షాత్రం హి మృగయారసమ్: (అం. 7-శ్లో 86.)
(వేటయం దాసక్తిఁ గొనుట క్షత్రియధర్మము.)

55. కో నామ ధర్మవిజయిని జనే న స్పృహ్యతి: (అం. 8-పుట 486.)
(ధర్మవిజయము గలవానియం దెవ్వరు ప్రేమ చూపరు గనుక.)

56. మృగాంకమండలేన సమం జాతస్య తతో న పరిహీయంతే గుణాః పీయూషస్య: (అం. 8-పుట 498.)
(చంద్రునితో సమముగాఁ బుట్టిన యమృతమునకును చంద్రునికంటె తక్కువ గుణము లుండవు)

57. మతిః పరిణమంతీ పురుషముదాత్తయతి న వయః:(అం. 9-పుట 576.)
(బుద్ధిమత్తచే పురుషునకు గౌరవము గాని వయసుచేఁ గాదు.)

58. కామినామనురాగపరిగ్రహో గుణలవలాభలోభేనదోషప్రమోషమా వహతి: (అం. 9-పుట 589.)
(కాముకుల యనురాగిత స్వల్పగుణలాభమున దోషమును గణింపనీయదు. అనగా కాముకులు తమ కనురాగపాత్రులైనవారి వస్తువులు సదోషము లైనను గొప్పగా తలంతురు.)

59. సర్వః గుణేషు రజ్యతే న శరీరేషు: (అం. 10-పుట 635.)
(అందరును గుణములం దాసక్తులగుదురు కాని శరీరములందు కారు.)

ఆశ్చర్యచూడామణి-శక్తిభద్రుఁడు

ఆశ్చర్యచూడామణిని వ్రాసినది శక్తిభద్రుఁ డను మహాకవి. ఈ నాటకమందలి నటీసూత్రధార సంభాషణమువలన నీతఁడు దాక్షిణాత్యుఁ డనియు, ఉన్మాదవాసవదత్తాది గ్రంథములు వ్రాసిన మహాకవి యనియుఁ దెలియుచున్నది. ఈతఁడు శ్రీశంకరాచార్యులకుఁ బ్రియశిష్యుఁడై, వేదవాశాస్త్రాగమపురాణవేత్తయై బ్రాహ్మణుల కాదర్శముగ వెలసినవాఁడు. సరస్వతీకటాక్షమున సత్కవితావిభూతిని గాళిదాసాదులఁ బోలినవాఁడు. "రసోవై సః" యన్న శ్రుతివాక్యమునకుఁ దగినవాఁడై నిర్మలభావములఁ జక్కని కల్పనాశిల్పమున నమర్చి పేరు గన్న మహామహుఁడు. మలయాళదేశమున నీతని కెక్కుడు ప్రసిద్ధి. ఆ దేశమున వ్యవహారమున నున్న సంప్రదాయగాథలలో నీశక్తిభద్రుఁడొక నంబూద్రి బ్రాహ్మణుఁ డనియు శ్రీశంకరాచార్యుల శిష్యుఁ డనియుఁ దెలియుచున్నది. ఆ కారణమున నీ కవి శంకరాచార్యులకాలమగు (788-820 క్రీ.వె.) నెని మిదవశతాబ్దపుచివరభాగమునకో తొమ్మిదవశతాబ్దపుమొదటిభాగమునకో చెందినవాఁడు కావలయును. ఇంతకన్న నీ కవికాలము నిర్ణయించు నాధారము లితరము లేవియుఁ గాన రావు. భాసనాటకములఁ గూర్చిన విమర్శనల సందర్భముననే యీశక్తిభద్రునిపేరు కొంత బయటికి వచ్చినది. కేరళదేశమునఁ గులశేఖర విరచితములగు తపతీసంవరణము, సుభద్రా ధనంజయము అనుగ్రంథములతో హర్షరచితమగు నాగానందము శక్తిభద్రరచితమగు నాశ్చర్యచూడామణి నీలకంఠవిరచితమగు కల్యాణసౌగంధికము, కర్తృనామము లేని శ్రీకృష్ణచరితము ననునవియు నాట్యవిషయమున భాసనాటకము లెనిమిదింటితోఁ జేర్పఁబడియున్నవి. ఆట్టప్రకారమను నాట్యవిషయమున నా భాసనాటకచ్ఛాయలఁ

గల్గియుండుటచేఁ గాబోలు నీ పట్టిక నిట్లు కేరళులు నిర్ణయించుకొనిరి. తపతీసంవరణము, సుభద్రాధనంజయ మను గ్రంథముల రచించిన కులశేఖరవర్మ వైష్ణవుఁడగు కులశేఖరాళ్వారులకంటె భిన్నుఁడని యిటీవలి పరిశోధకులు A.S. రామనాథ అయ్యర్ గారు స్థిరపరచి కులశేఖరవర్మకాలము 935-955 క్రీ.వె. యని నుడివెను. కావున నాశ్చర్యచూడామణికర్త పదియవశతాబ్దారంభమునకుఁ బూర్వుఁడేయై యుండవలయును, మరియును, నటీసూత్రధారసంభాషణమున, నటి "ఆర్య, ఆత్యాహితం ఖల్వేతత్, ఆకాశం ప్రసూతే పుష్పం సికతాస్తైలముత్పాదయంతి, యది దక్షిణస్యాదిశః ఆగతం నాటకనిబంధనమ్' అనగా సూత్రధారుఁడు 'ఆర్యేదక్షిణావధా దాగతం ఆశ్చర్యచూడామణిం నామ నాటకమభినయాప్రేడిత సౌభాగ్య మభిలషామ ఇత్యార్యమిశ్రాణాం శాసనమ్' అన్న వాక్యమునకు బదులు చెప్పుచున్నది.

ఈ నటీవాక్యములలో దక్షిణదేశమునుండి నాటకము వచ్చిన దనిన నది యసంభవ మనియు, నాకసము పుష్పించు ననియు, నిసుము తైల మొసఁగుననియు నసంభవకార్యముగ నుడువఁబడినది. ఆ కాలమునకు దక్షిణదేశమున నీ నాటకమే క్రొత్తదిగ నుండి యుండవలయును. కానిచో 10-వ శతాబ్దివాఁడగు కులశేఖరవర్మ గ్రంథము లప్పటి కుండి యుండినచో నటీవాక్యము లసత్యములు కావలసి వచ్చును. ఈ కారణములచే నీ శక్తిభద్రుఁడు 10-వ శతాబ్దికి ముందు వాఁడే యని పై శంకరులకాలముగా నుడువఁబడిన కాలమునకే చెందినవాఁడు కాఁగలఁడు.

ఈతని కైత మధురము. కాళిదాసభట్టనారాయణాదులఁ కైతఁబోలి రసవంతముగ నుండును. శక్తిభద్రుని ఆశ్చర్యచూడామణిలోని యీ క్రింది శ్లోకము తిలకింపుడు.

గుణాః ప్రమాణం న దిశాం విభాగః
నిదర్శనం నన్విదమేవ తత్ర।
స్తనద్వయే తే హరిచందనం చ
హారశ్చ నీహారమరీచిగౌరః॥

(అంకము 1. శ్లోకము 3.)

గుణమే ప్రధానము గాని జన్మస్థానము గా దనియు, నందులకు స్తనద్వయ మందున్న చందనముక్తాహారములే వాని గుణమువలన గ్రాహ్యము లగుట నిదర్శనముగఁ జూపెను. ఇట్టిదే మాళవికాగ్నిమిత్రమున కాళిదాసమహా కవివర్ణనము గూడఁ గలదు.

పురాణమిత్యేవ న సాధు సర్వం
న చాపి సర్వం నవమిత్యవద్యమ్।
సంతః పరీక్ష్యాన్యతరద్భజంతే
మూఢః పరప్రత్యయనేయబుద్ధిః॥

(మాళవికాగ్నిమిత్రమ్)

అంగుళీయాంక మను నామము గల షష్ఠాంకమునఁ జివర హనుమంతుఁడు సీతతో నుడువుసందర్భమున నిట్లు నుడివెను.

రక్షోవధాద్విరతకర్మ విసృజ్య చాపం
గోధాంగుళిత్రపదవీషు ధృతవ్రణేన।
రేఖాతపత్రకలశాంకితలేన రామో
వేణీం కరేణ తవ మోక్ష్యతి దేవి దేవః॥

(అంకము 6. శ్లోకము 21.)

ఓ దేవీ! రాముఁడు, చేతఁగొన్న ధనువును రక్షోవధ మాచరించి డించి, గోధాంగుళిత్రాణస్థానములందు వ్రణకిణాంకితమును, కల్యాణకరము లగు

కలశాతపత్ర రేఖలచే నలంకృతమునగు కరముచే నీ జడముడి చిక్కు విడదీయును.

భట్టనారాయణుఁడు వేణీసంహారమందు ద్రౌపదీకేశములను ముడివేయుదునని భీముఁడు నుడివినవాక్యముల నెట్లు వ్రాసెనో చూడుఁడు.

చంచద్భుజభ్రమితచండగదాభిమాత
సంచూర్ణితోరుయుగళస్య సుయోధనస్య।
స్యానాపవిద్ధఘనశోణితశోణపాణి
రుత్తంసయిష్యతి కచాంస్తవ దేవి భీమః॥

(వేణీసంహారము అంకము 1. శ్లోకము 21)

ఆలంకారికులు భామహునిమొదలు పండితరాజ జగన్నాథునివరకునుగల వారెవరు నీ యాశ్చర్యచూడామణిని గాని, యీ కవివాక్యముల మరి వేనిని గాని లక్ష్యములుగా గ్రహింప లేదు, అందులకుఁ గారణము ఈ గ్రంథము మరుగున నుండుటయే కాఁగలదు. ప్రదర్శనయోగ్యము లగు రామనాటకము లన్నింటిలో నీ యాశ్చర్యచూడామణియే యగ్రస్థాన మలంకరించు చున్నదని పలువు రందురు. కేరళదేశమున నాట్యోపజీవులగు సెక్కియార్లు అను వారిచే నిది మిక్కిలి రసవంతమై యగ్రస్థానమునాక్రమించుచున్న దని గ్రహింపఁబడుచున్నది.

ఈ 'యాశ్చర్యచూడామణి' యను నామమే యీ గ్రంథమునందు రసము అద్భుతమని సూచించుచున్నది. ఈ నాటకవ్యాఖ్యానకారుఁడు కూడ తన రచన యందు "వీరకార్యాద్భుతరసభూయిష్ఠత్వేన ఆశ్చర్యకరాణాం చూడామణిరిత్యాశ్చర్యచూడామణిరితి సంజ్ఞా" అని వ్రాసి యున్నాఁడు. ఇందు వీరకార్యములచే నద్భుతరసమధికముగ నుండుటచే నాశ్చర్యకరము

లగు నంశముల కన్నింటికి చూడామణివలె నున్నందున నీ నాటకమున కీ యాశ్చర్యచూడామణి యను పేరు తగి యున్న దనెను.

సాధారణముగా నాటకములలో వీరశృంగారరసములలో నేదియో యొకటి ప్రధానముగా నుండవలయు నని యాలంకారికనియమము. ఈ యాశ్చర్యచూడామణియందు రసము అద్భుతము, రసతరంగిణియందు భాసుదత్తుఁడు 'సర్వేరసాః ఆనందరూపాః అద్భుతాఖ్యాః పరనిష్ఠా ఏవ' అని యద్భుతమునకు బ్రాధాన్య మొసఁగెను. ఈ యాశ్చర్యచూడామణి యద్భుతరసప్రధాన మగు నాటకములలోఁ బ్రాచీనమైనది. ఇటీవల పదునేడవశతాబ్దాంతమున నద్భుతప్రధానమగు నాటకము 'అద్భుతదర్పణ' మని మహాదేవకవి వ్రాసి యున్నాఁడు. వీర శృంగారములలో నొకటే ప్రధానరసముగ నుండవలయు నని నాటకసామాన్య లక్షణమైనను నీ యాశ్చర్యచూడామణియందు అద్భుతరస మంగిగ నుండుట విచిత్రమే. ఈ కవి యీ రసమును జక్కగాఁ బోషించి యీ నాటకమున కొక క్రొత్త సోయగమును గూర్చినాఁడు.

ప్రథమాంక మగు పర్ణశాలాంకమున నట్టడవిని దివ్యసుందరాకృతితో శూర్పణఖ గోచరించుటతో నీ యద్భుతరస మంకురించుచున్నది. లక్ష్మణుఁ డామెను జూచినంతనే 'అరణ్యవిరుద్ధేయమాకృతిః'.

"అస్యాతిమాత్రాయతలోచనస్య
నతభ్రుణః కమ్రపయోధరస్య।
ఆశ్చర్యరత్నస్య విలాసయోనేః
కిమాకరో ద్యౌర్ను వసుంధరా ను॥" (అంకము 1. శ్లోకము 6.)

మిక్కిలి నిడుదలగు కన్నులు, వంగిన కనుబొమలు, మనోహరము లగు పయోధరములు, విలాసములు గల నీమె యాశ్చర్యరత్నముగ నున్నది.

ఈమె దివిజయో భూజయో తెలియకున్నది యని తొట్టతొలుత శూర్పణఖారూమును దిలకించినంత లక్ష్మణుఁ డాశ్చర్యమగ్నుఁ డగుచున్నాఁడు. అద్భుతరసము దీన నంకురించి క్రమముగా వృద్ధిఁ జెందుచున్నది. ద్వితీయాంక మగు శూర్పణఖాంకమున రాముఁడు సీతతో సంభాషించుచు నామె రూపమును దిలకించి యరణ్యవాసమునను నయోధ్యయందువలెనే మనోనేత్రముల హరించుచున్న దనియు నది చిత్రమనియు చిత్రపదముననే పేర్కొనుచున్నాఁడు. రాముఁడు 'దేవి తిష్ఠతు సర్వం',

చరణనళినసాధ్యం యానమాహార్యమంభః
శయనమవనిపృష్ఠం మండనం స్నానమాత్రమ్।
తవ తరుణి తథాపి త్వం శ్రియా చక్షుషీ మే
హరసి పురమయోధ్యామావసంతీవ చిత్రమ్॥
(అంకము 2. శ్లోకము 4.)

దేవీ! నీకు చరణకమలములే యానములు (పల్లకీలు), నీరే సమస్తవంటకములు, నేలయే పడక, స్నానమే యలంకారము, అట్టయ్యును నీ కాంతి యయోధ్యలోనున్నట్లే నా నేత్రములకు మనోహరముగ నున్నది. ఇది చిత్రము అని సీతా సౌందర్యమును మెచ్చుకొనునపుడు ఉద్బుద్ధ మగుచున్నది. తృతీయాంకమున (మాయాసీతాంకమున) లక్ష్మణుఁడు మునిజనుల సేవింప వారనుగ్రహించి యొసఁగిన యలంకరణము లని యాశ్చర్యచూడామణిని, అద్భుతాంగుళీయమును సీతారాములకుఁ జూపినపుడు వారిరువురును 'ఆశ్చర్య మాశ్చర్యం' ఆశ్చర్య మాశ్చర్య మని మిక్కిలి యచ్చెరు వందుదురు. మరల నీ యంకముననే రాముఁడు సీతతో మాయామృగమును జూడు మని హెచ్చరించినపుడు సీత 'ఆర్యపుత్ర!'

అద్భుతదర్శనబహురసః ఖలు వననివాసః (వననివాసమద్భుత దర్శనములచే ననేకరసములు గలది.) యని నుడువును. ఈ యద్భుతదర్శనమగు మాయలేడిని జూచుటచే సీతారాములు నానాకష్టములకు గురియై పలుపాట్లుపడిరి. ఈ యంకమున నీ యాశ్చర్యచూడామణ్యద్భుతాంగుళీయకముల ప్రశంసయే యద్భుతరసపోషకము, అవల జటాయువధాంకమగు చతుర్థమునఁ గూడ సీత రామవేషమున నున్న రావణునితో రథమునఁ బోవునపుడు కామావేశమున సీతకుఁ గురుల దువ్వ బోవ నప్పట్టున నాశ్చర్యచూడామణిప్రభావమున రావణుని మాయ మాయమై దశాననస్వరూపము వెలువడును. ఇం దాశ్చర్యచూడామణి ప్రభావమే యద్భుతము, అవల నశోకవనికాంక మను పంచమాంకమున రావణుని విప్రలంభాభాసమును సీతయొక్క పతివ్రతాత్వమును చాటునుండి తిలకించిన మండోదరి సీతాపాతివ్రత్యమున కచ్చెరు వంది,

"ధీరా ఖల్వేషా, మహారాజస్య శీర్షం పంకమివ పాదేన పరిహరతి,
సత్యమిదానీం కౌలీనం పృథివీసుతా సీతా పద్మనాభో రామ ఇతి."

ఈమె ధీరురాలు మహారాజుగారి శిరమును బురదనువలె పాదముతో వదలించుకొనుచున్నది. సత్యముగ సీత భూసుతయు, రాముఁడు పద్మనాభుడు నగుదురని నుడువును. ఆరవ దగు నంగుళీయాంకమున హనుమంతుఁడు, అద్భుత కార్యము లెల్ల మూర్తీభవించెనా యనిపించు నతఁడు సీతకడ కేగి యద్భుతాంగుళీయకమును రామసందేశముతో నొసఁగును. మరియు సీతనుండి యాశ్చర్యచూడామణిని గ్రహించి రామున కందఁ జేయును. ఈ యద్భుతాంగుళీయకమును గురించి సీత "ఇదం లోకాభరణస్యాభరణం, ఇదం బాణాసనగుణపరిఖిన్నం, ఇదం రాక్షసమాయాపిశునం, ఇదం రజనీషు రత్నదీపః ఇదం వదనాలంకార

వికల్పాదర్శః'' ఇది లోకాభరణుని యాభరణము. ఇది బాణాసన గుణపరిఖిన్నము. ఇది రాక్షసమాయాసూచకము. ఇది రాత్రుల రత్నదీపము. ఇది లోకాభరణస్యాభరణం, ఇదం బాణాసనగుణపరిఖిన్నము ఇది రాక్షసమాయాపిశునం, ఇదం రజనీషు రత్నదీపము! ఇది వదనాలంకారార్థము కల్పింపఁబడిన యద్దమని బహుధా యుల్లేఖించి దానిపై నాదరమును జూపును. సప్తమాంక మగు నగ్నిపరీక్షాంకమున నద్భుతముల కెల్ల నద్భుతమగు సీత యగ్నినిప్రవేశించుకార్యము జరుగును. అద్దాన సీతాపాతివ్రత్యము జగద్విదితమగును, ఇట్లీ యద్భుతరసమును గ్రమముగాఁ బెంపొందఁ జేసి యీ నాటకమును మనోహరముగ నిర్వహించినాఁడు శక్తిభద్రుఁడు.

ఈతనికైత చాలమధురమై వైదర్భీరీతివిలసితమై ప్రసాదమాధుర్యగుణ శోభితమై సహృదయహృదయాహ్లాదమును గూర్చుచున్నది. ఈతని శ్లోకములు ప్రశంసాపాత్రములైనవి కొన్ని యిటఁ బేర్కొనుచున్నాను.

సాధారణీ నయవిదాం ధరణిః కళత్ర
మస్త్రాణి మిత్రమరయః సహజాః సుతాశ్చ।
పాపాత్పరస్య పతనం నరకేషు లాభః
ద్వే చామరే చ సితమాతపవారణం చ॥

(అంకము 1. శ్లోకము 17.)

ఇంద్రాణీమహమప్సరోభిరనయం కారాగృహే గణ్యతాం
సంహారో జయతా దిశో దశ మయా స్త్రీణాం కృతః పుష్పకే।
కైలాసోద్ధరణేఽపి వేపథుమతీమద్రాక్షమద్రేస్సుతాం
దృష్టం తాసు న రూపమీదృశమహో చక్షుశ్చిరాత్సార్థకమ్॥

(అంకము 3. శ్లోకము 20.)

అవివేకమనావేక్ష్యమదాక్షిణ్యమమార్జితమ్।
ధిగహం జన్మ నారీణాం యన్మామేవం ప్రభాషసే॥

(అంకము 3. శ్లోకము 30.)

పుష్పాయుధప్రతిమ పుష్పకనామధేయా
సేయం విమానవసతిర్వసతే గుణానామ్।
యాం స్వీకృతత్రిభువనామపి సావకాశా
మాశామివాహురపరస్య పరిగ్రహాయ॥

(అంకము 7. శ్లోకము 31.)

ఈ యాశ్చర్యచూడామణియందు భాసనాటకచ్ఛాయ లనేకములు గోచరించుచున్నవి. 'నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధారః' అను నాచారము దీనియందును గోచరించుచున్నది. అభిషేకనాటకమనఁ గొన్ని వాక్యములు సదృశములుగా నున్నవి. మద్రాసుప్రభుత్వతాళపత్రపుస్తకభాండాగారమున D.C.No.12492 నెంబరుగల పుస్తకమున చూడామణి, అభిషేక ప్రతిమానాటకము లొక్కదానియందే వరుసగా వ్రాయఁబడియున్నవి. ఆ కారణమున నభిషేకప్రతిమలను గూడ నీ శక్తిభద్రుఁడే రచించియుండు నని కేరళదేశాచారసంప్రదాయములఁ బట్టి నిర్ణయింప నగునేమో యని కీ॥శే॥ యస్. కుప్పస్వామిశాస్త్రిగారు ఆశ్చర్యచూడామణినాటకో పోద్ఘాతమునఁ దెలిపియున్నారు. మరియు భాసుని దని యనుకొనుచున్న ప్రతిజ్ఞాయౌగంధరాయణనాటకవిషయము శక్తిభద్రవిరచితమగు ఉన్మాదవాసవదత్తానాటకముతోఁ జాలవరకు సరిపోవుచున్న దనియు, నీ యున్మాదవాసవదత్త మను పేరు ప్రతిజ్ఞాయౌగంధరాయణ మనుదానికి నామాంతరము గూడ నై యుండునేమో యని గూడ నుడివియున్నారు. ఇంతకు నీ శక్తిభద్రమహాకవి పేరెన్నికగన్న మహాకవులలో నొకఁడుగా

గణింపబడి, తన యాశ్చర్యచూడామణినాటకమును నిజముగ నాశ్చర్యమణి యనిపించి రామనాటక కర్తయై చిరస్థాయియగు కీర్తి నార్జించినాఁడు.

కథాసంగ్రహము

ప్రథమాంకము: ఈ నాటకము సీతాపహరణాది సీతాస్వీకరణపర్యంతము గల రామాయణకథను వర్ణించుచున్నది. సపత్నీకుఁడైన శ్రీరామునకుఁ బర్ణశాలను నిర్మింప లక్ష్మణుఁడు సన్నద్ధుఁడై యుండ దివ్యసుందరవేషమున శూర్పణఖ యాయటవీసీమకు మెరుపుఁదీగెవలె వచ్చి లక్ష్మణుని జూచి ప్రేమించును, ఆతనికి దాస్యముఁ జేయ నభిలషించి తన్ను దాసురాలిని గ్రహింపఁ గోరును. లక్ష్మణుఁ డామె నరయుదు నని నుడివి పంపివేయును, సీతారాములు ప్రవేశించి వనవాససుఖమునుగూర్చి ముచ్చటింప లక్ష్మణుఁడు రామ వనవాసకారకురాలగు కైకను దూరును. రాముఁడు లక్ష్మణు నోదార్చుచు దశరథుఁడు స్వపాపకార్యఫలముగ నసువులఁ గోల్పోయె ననియుఁ, గైక నిర్దోషిణి యనియుఁ దెల్పును, లక్ష్మణుఁడు తనదే యపరాధ మని నుడువును. సీతారామలక్ష్మణులు పర్ణశాలను జేరుదురు. శ్రీరాముఁడు పర్ణశాలను బ్రవేశించి లక్ష్మణుని సర్వతోముఖ నైపుణ్యమునుగూర్చి సీతకు నుడువును. పర్ణశాలయందు సీతారాములు సుఖ ముందురు.

ద్వితీయాంకమున శూర్పణఖ సీతారాములఁ గలసికొని రామునిసన్నిధినుండఁ బ్రార్థించును. రాముఁ డామెను మరల లక్ష్మణుఁ నొద్ద కంపును. విఫల మనోరథయై శూర్పణఖ రామలక్ష్మణులఁ గబళించి సీతను రావణున కొసఁగఁడలంచును. తొలుత స్వస్వరూప మగు రాక్షసీవేషమున లక్ష్మణుని దరిసి యాతని నెత్తుకొని యాకసమున కెగురును. సీత భయ మందును. రాముఁడు సీతను వారించి దివ్యాస్త్రమును విడువ

నెంచును. ఇంతలో లక్ష్మణుఁడు శూర్పణఖకు ముక్కుచెవులు కోసి విరూపఁ గావించి నేలఁ ద్రోయును. లక్ష్మణుఁడు రాముచెంతఁ దాను స్త్రీపై నస్త్రప్రయోగ మొనరించినందులకు సిగ్గుపడును. రాముఁడు లక్ష్మణుని గౌఁగిలించికొని యతనివలననే యయోధ్యయందువలె నరణ్యమున సుఖపడుచున్నట్లు తెల్పును. లక్ష్మణుఁడు సిగ్గిలును. శూర్పణఖ నటనుండి పొమ్మందురు. ఆమెయు వారిని తదాది వారి యుద్రేక ఫలము ననుభవింతురని నుడివి రాబోవు సీతాహరణాది కృత్యముల సూచించును.

తృతీయాంకమున విష్కంభమున నొక ఋషియు వృద్ధతాపసుఁడును మారీచాశ్రమమున సంభాషించుచు రాముఁడుఖరదూషణుల సంహరించె ననియు, రావణుఁడు మారీచుని మృగరూపమున రాముని లోభపెట్టి దవ్వులకుఁ గొనిపొమ్మని నియోగించినట్లు తెలియుచున్నది. తనకు వామభుజాస్పంద మమంగళ సూచక మని రాముఁడు నుడువ, సీత తపమే యమంగళమునకు శాంతి యని నుడువును. మారీచుఁడు రాముని పరాత్పరుఁడనిఁ ప్రశంసించి యతనిచేతఁ జావ నిచ్చగించి రావణనియోగమునకు బయలుదేరును. ఇంతలో లక్ష్మణుఁడు మునివృషభుల సేవించి వారి యనుగ్రహమునఁ గవచమును నలంకరణీయములను బడయును. తాను గవచమును ధరించి యాశ్చర్యమణ్యంగుళీయకముల సీతారాములకుఁ జూపును. ఆ మణి, రత్నాంగుళీయకముల ధరించిన వారు రిపులను దాకినచో వారి మాయ తొలఁగి స్వస్వరూపమును బడయుదు రనివాని ప్రభావమునుగూర్చి తెల్పుచు, వానిని రామున కొసంగును. కవచము బాణఘాతములనుండి మర్మములఁ గాపాడు నని నుడువును. రాముఁడు వానిని గ్రహించి చూడామణిని సీతకొప్పున నిడి యంగుళీయకమును దానే ధరించును. ఇంతలో మాయామృగము గోచరించును. మృగము మాయామృగమేమో యనియు

రాక్షసమాయ గాఁబోలు ననియు మనసునకుఁ దట్టినను రాముఁడా మృగమును వెన్నంటి చనును. లక్ష్మణుఁడు సీతను గాపాడుచుండును. సీత తనకు దక్షిణాక్షిస్పందము కలుగుటచే నమంగళము నాశంకించుచు రావణ ప్రశంసఁ దెచ్చును. లక్ష్మణుఁ డోదార్చి యమంగళమునకుఁ దావు లేదనును. సీత 'లక్ష్మణా' యను నార్తధ్వని విని రామునన్వేషింప లక్ష్మణుని బొమ్మని దూరును. లక్ష్మణుఁ డాపద రానున్న దని హెచ్చరించి రామాన్వేషణమునకై వెడలును. రావణుఁడు రామవేషమున సీతను గలసి రామునివలెనే మాటాడును. సూతుఁడు లక్ష్మణరూపముఁ దాల్చి రథ మాయత్తపరచుచు, భరతునకు శత్రుభయ మాసన్నమైన దనియు వారు వేగమె వెళ్ళవలయు ననియు తపస్విజనము నుడివి యంతర్హిత మైనట్లు మాయాలక్ష్మణుఁడు నుడువును. సీత విశ్వసించును, అంత రథారూఢులై వారు వెడలుదురు.

శూర్పణఖ సీతావేషమును బూని రాముని వంచించును. సత్యరాముఁ డును మాయాసీతయు నాకసమున సీతారావణులను జూచి తమప్రతికృతు లద్దము నందువలె నాకసమునఁ గనఁబడుట గుర్తింతురు. సత్యరాముఁడు పరపురుష సన్నిధి సీతయుండదనియు, మాయాసీత పరస్త్రీసన్నిధి రాముఁ డుండఁ దనియు నాకసమందలివ్యక్తులు మాయావ్యక్తులుగ విశ్వసింతురు. మాయాసీతయు సత్య రాముఁడును లక్ష్మణుని వెదుకఁ బోదురు. మరీచుఁడును రామరూపప్రచ్ఛన్నుఁడై లక్ష్మణుని గలసి వంచింప నెంచును. ఇంతలో రాముఁడు నిజాంగుళీయకమును లక్ష్మణునకుఁ జూప మాయా రాముఁడు మారీచుఁ డగును. రాముఁ డాతనిఁ గాలితో మీట నతఁడు చచ్చును. అది గాంచి శూర్పణఖయు నంగుళీయకమున రాక్షసమాయ బయలువడునని తానును నిజరూపముఁ దాల్చును, లక్ష్మణుఁ డామెను బెదరింప నామె యథార్థము నుడువును. రామలక్ష్మణు లామె కభయ

మిచ్చి రావణున కామెద్వారా సంహరింతు మని సందేశ మంపుదురు. రామలక్ష్మణులు సీతాన్వేషణమునకై బయలుదేరుదురు.

చతుర్థాంకమున రావణుఁడు సీతతో రథారూఢుఁడై యాకసమున నేగుచుండును. కామావేశమున నతఁడు సీతకచభారమును బంధింతు నన నావె రావణుని స్వహస్తమున వారింప నాతఁడు చూడామణిప్రభావమున స్వస్వరూపమును గొనును. సూతుఁడును నిజరూపము దాల్చును. సీత భయమంది రాక్షసహస్తమునుండి రక్షింప నాక్రోశించును. ఇంతలో జటాయువు వచ్చి రావణునితోఁ బోరి మడియును. సూతుఁడు రావణుని వారించినను గామావిష్టుఁడై హితమును బెడచెవి నిడుచున్నాఁ డని విచారపడును.

పంచమాంకమున మండోదరియుఁ జేటియు సంభాషించుచు మండోదరి యొక యమంగళపుఁ గలఁ గన్నట్లును రావణుఁడు కామాతురుఁడై తన్నొల్లని సీతావిషయమున నాతని కాముకవృత్తిని జూచి యపహసింప నశోకవననికుంజమున నొకచో డాగియున్నట్లును బ్రవేశకమునఁ దెలియుచున్నది.

రావణుఁడు కామయమానావస్థలోఁ జంద్రాద్యుపాలంభన మొనర్చుచుండును. అమాత్యుఁ డాతనిని జేరి సంభాషించుచు శ్రీరాముఁడు వాలిని జంపి సుగ్రీవసఖ్యమున సీతాన్వేషణమునకై వానరుల నెల్ల దిక్కుల కంపిన విషయమును దెల్పి, సీతను గామించుట దగ దనును. శ్రీరాముఁడు సాక్షాద్ధరియే యనును. రావణుఁడు రాముని నిందించి, సీతను జూడ శింశుపావృక్షముచెంత కరిగి తన సర్వస్వము నర్పించెద నని సాష్టాంగముగఁ బ్రణమిల్లును. సీత యంగీకరింపక పాదముల లాగికొనును. మండోదరి యది గాంచి సీతారాములు లక్ష్మీనారాయణులే అగుట

నిజమనును. సీత రాముపాదముల శరణు గొను మని రావణు ననును. రావణుఁడు కుపితుఁడై సీతను ఖడ్గమున ఖండింప యత్నించుచుండ నింతలో మండోదరి మాటుననుండి వచ్చి నడుమ నిల్చి వారించును, అందరు వెడలిపోవుదురు. సీత రామనామస్మరణమున ప్రాణముల విడువ నెంచుకొనును.

షష్ఠాంకమున హనుమంతుఁడు లంకను జేరి సంపాతిమూలమున సీత శింశుపాశ్రిత యని తెలిసికొని రామాంగుళీయకహస్తుఁడై సీతను వెదకుచుండును. సీత విలపించుచుఁ జంద్రుని సప్తర్షుల, నరుంధతిని నాకసమునఁ జూచి తనకుఁ బ్రతీకారము నుడువఁ గోరుచుండును. అత్తరి హనుమంతుఁ డగపడి రామదూత నని నుడువును. సీత, తొలుత రాక్షసమాయ యని హనుమంతుని సంశయించి, కాదనుకొని, పరీక్షింపఁ జూడామణి కలదు గదా యనుకొనును. హనుమంతుఁడును శ్రీరాము నభివర్ణించి యామెకై పలవించుచున్నాఁ డని నమ్మకము గదుర నుడువును. సీతావియోగమున రామునివిరహావస్థను వర్ణించి సుగ్రీవ సఖ్యమును దెల్పి శ్రీరాముడు నిజాంగుళీయకమును యొసఁగెనని దానిని సీతకుఁ జూపును. సీత సంతసించును. దశాస్యుని వధించి తన్ను (సీతను) గైకొందు నన్న రామసందేశవార్తను విని సీత నిజచూడామణిని రామున కందీయ హనుమానున కొసంగును. హనుమంతుఁడు ప్రోత్సాహకరములగు వాక్యములఁ బల్కి శ్రీరామునికడ కరుగును.

సప్తమాంకమున విష్కంభమున విద్యాధరదంపతులు ప్రవేశించి రావణుఁడు హతమైనట్లు తెలియఁ జేయుదురు. 'హత్వావాలినమర్ణవే' యను శ్లోకము, (అంకము 7.-శ్లోకము 11.) రావణవధాంతము గల కథనుడువును. అవల లక్ష్మణుఁడు జానకీభావశుద్ధిని బరీక్షింపవలయు ననును. సుగ్రీవుఁడు సీతను దోడ్కొని వచ్చును. రాముఁ డందరు

చూచుచుండ సీతను వెల్లడిగ గొని రాఁ గోరును. రామునకు సీత యలంకృతయై మిగుల నందముగఁ దోఁప సీతను శంకించుచు, లంకలో నిశాటవిటులఁ గూడె నని నిందించును. సీత నవ్వుచు భర్త పరుషము లాడె ననును. లక్ష్మణసుగ్రీవహనుమదాదులు సీత దండనార్హ యందురు. సీత యగ్నిని బ్రవేశించి నిజనిష్కళంకతను నిరూపించును. అగ్నిదేవుఁడే యామెశుద్ధిని జాటును. దేవతలు పూలవాన గురిపింతురు. నారదుఁడు సీతారాములు లక్ష్మీనారాయణు లని గంధర్వగానమునఁ బాడుచు రాగా రాముఁడా ఋషికిఁ బ్రణమిల్లును. దశరథాదిపితృదేవతలకు నితరదేవతాళి కెల్ల మ్రొక్కును. ఇంత యైనను రాముఁడు సీతరూపశోభ ననుమానించును. నారదుఁ డది యంతయు ననసూయాదేవివరప్రసాద మని విశదపరచును. అంత రాముఁడు నారదాజ్ఞానుసారము సీతను గ్రహించును. సీత పతివ్రత యనియే జనవాద మని విభీషణుఁడు తెల్పును. సీతారాములు సుఖముందురు. నారదుఁడు భరతవాక్యమున శుభముగ నాశీర్వదించును.

కథావిషయము

ఈ యాశ్చర్యచూడామణియందు శూర్పణఖావృత్తాంతము మొదలుకొని సీతాస్వీకరణమువరకుఁ గల రామాయణకథ చమత్కారముగా నాటకీయముగ మనోహరముగ నుండుట కనువగు మార్పులతో వర్ణింపఁ బడినది. రాముని చేష్టితములలో దండకారణ్యమునఁ గావింపఁబడిన యాశ్చర్యజనకములగు వీరకార్యముల నిందుత్తమరీతిఁ బొందుపరచుటచే దీని కీ యాశ్చర్యచూడామణియను నామ మెంతయుఁ దగియున్నది. అనేకస్థలముల వాల్మీకిరామాయణకథ నతిక్రమించి స్వాతంత్ర్యముఁ జూపి శక్తిభద్రుఁ డీ నాటకమును మిక్కిలి చమత్కారవిలసితముగ రచించినాఁడు. కథాగమనము చక్కగా సాగుచు నొక్కెడను గుంటువడని

వేగమున నద్భుతసన్నివేశములతోఁ బూర్వోత్తర సందర్భముల నదుకఁ జేయుచు కథను నడపినాఁడు.

నాటకారంభముననే యీ నాటకమున, నాదరముగలుగుటకై దక్షిణా పథమునుండి వచ్చిన దని సూత్రధారుఁడు నుడువగనే నటి.

'అత్యాహితం ఖల్వేతత్, ఆకాశం ప్రసూతే పుష్పం సికతాస్తైలముత్పాద యంతి యది దక్షిణస్యా దిశః ఆగతం నాటకనిబంధనమ్'

ఇది యసంబద్ధము, దక్షిణపుదిక్కునుండి నాటకము వచ్చినచో నాకసము పూచును, ఇసుక తైలము నొసఁగు నని యసంబద్ధ మనుటకు నిదర్శనముగా నుడివి ఆకసము పూచుట యెంత యాశ్చర్యజనకమో యట్టి యాశ్చర్యజనక సన్నివేశఘటిత మీ నాటక మని వ్యంగ్యముగాఁదెలియఁజేయు చున్నాఁడు ప్రస్తావనలో, 'ఉన్మాదవాసవదత్తాప్రభృతీనాం కావ్యానాం కర్తుః కవేః శక్తిభద్రస్యేదం ప్రజ్ఞావిలసితమ్।' అని చెప్పియుండుటచే నీ కవి ఉన్మాదవాసవ దత్తాద్యనేకకావ్యములకుఁ గర్తయని తెలియుచున్నది. కాని యాతని గ్రంథము లీ యొకటి తప్ప మరెవ్వియు నుపలబ్ధములు కాలేదు.

కథారంభము సీతారాములు పర్ణశాలలో నుండ శూర్పణఖ రామునొద్దకు వచ్చినట్లున్న రామాయణకథను గొంత మార్చి యీ నాటకమున లక్ష్మణుఁడు సీతారాములకుఁ బర్ణశాలను నిర్మింప సన్నద్ధుఁడై యుండుతరి శూర్పణఖ తొలుత లక్ష్మణునే దర్శించి ప్రేమించనట్లు చిత్రింపఁబడినది. సపత్నీకుఁడైన రాముని సమీపించినట్లున్న రామాయణకథకన్న ఈ లక్ష్మణుని తొలుతఁ జేరి ప్రేమించినట్లు శక్తిభద్రుఁడు శూర్పణఖను జిత్రించుట యెంతయు నుచితముగ నున్నది. ప్రేమవిషయమున గాక దాసురాలుగా నుండ నిట శూర్పణఖ కోరుటయు నుచితమే. ఇంతకు నీ రాక్షసి దివ్య సుందరవేషమున రామలక్ష్మణుల

వంచింప వచ్చుట కవికల్పనము. మూలరామాయణమున శూర్పణఖ తాను కామరూపిణియని విన్నవించును, ఆద్దానిని గొని కవి యిట నిర్జనారణ్యమున నబ్బురముఁ గొల్పు దివ్యసుందరరూపమున నీమెను బ్రవేశపెట్టుట యాశ్చర్యకరము. లక్ష్మణునంతటివాఁడు కూడ నామెరూపమున కచ్చెరువందును. కాని ధీరోదాత్తులగు రామలక్ష్మణులు స్థిరచిత్తతతో నామెకుఁ జూపవలసిన మర్యాదఁ జూపి తత్కాలోచితముగ నామెతో నెంతవరకు వ్యవహరింపఁ దగునో యంత మాత్రము నుడివి పంపుదురు. రామలక్ష్మణుల శీలము కూడ నిందు వ్యక్తమగుచున్నది.

పర్ణశాలఁ బ్రవేశించినతర్వాత సీతారాములు వనవాససుఖములఁ గూర్చి ముచ్చటించుచుండ లక్ష్మణుఁడు రామవనవాసకారకురాలగు కైకను దూరును. ఇట రాముఁడు మహోదారుఁడై లక్ష్మణునకు హితము గరపుచు దశరథుఁడు స్వపాపకార్యఫలముగ నసువుల దొరగె ననియుఁ గైక నిర్దోషిణి యనియు నుడువుచు నెట్లనెనో చూడుఁడు.

రామ:–మా మా తాతం ప్రతి! నిరపరాధః స గురజనః! పశ్య,

"నియమసలిలం పిత్రోర్హర్తుం నిరీక్షణవంధ్యయోః
క్షిపతి కలశం తోయాధారే పటుధ్వనితం సుతే।
ఉషసి మృగయాం యాతా రాజ్ఞా వనద్విపశంకయా
రభసమిషురున్ముక్తః కాలాదసూనహరత్స్వయమ్॥"

(అంకము 1. శ్లోకము 20.)

అని మున్నొకపరి వైశ్యమాణవకుఁడు వృద్ధులును నంధులు నగు తలిదండ్రులు నీరు గోరఁ జేరువనున్న జలాశయమునఁ గలశము ముంచ నా శబ్దము వనగజ శబ్దమని భ్రాంతిపడి దశరథుడు బాణమేయ నది యా బాలునికిఁ దాక నతఁడు మరణించెను. తత్పాపకార్యఫలమే కాలాంతరమున

నిపుడు నృపుప్రాణములనే గొనె నని యోదార్చి కైక నిర్దోషిణి యనియే నుడువును. ఇట భాసుని ప్రతిమా నాటకమున కైక సమయాంతరమునఁ దానట్టి వరద్వయమును గోరుటకుఁ గారణము మునిశాపభీతి యని తెల్పి అనగా పుత్రశోకమున దశరథునకు మృతి కల్గునను శాపోక్తుల కన్యార్థముగఁ బుత్రవియోగమున శోకమును గూర్చి తనకు శ్రీరామునెడఁ గల భూరివాత్సల్యమును దెల్పినవృత్తాంతము నంతయు సంగ్రహముగ సూత్రప్రాయముగ నీశ్లోకముననే తెలియఁ జేసి కైక నిందార్హ కాదని నుడువును.

అంతే కాక యిక్ష్వాకుల కెన్నడో వార్ధక్యమున నాచరింపఁ దగిన వన్యవృత్తి నేదో యొకమిషచే తారుణ్యముననే యలవడఁ జేసి తమకు పెద్దరికముం గూర్చెనని కైకను మెచ్చికొనును. అప్పట్టున రాముఁ డేమనుచున్నాఁడో చూడుఁడు.

'మార్గే నిర్వృతిమార్గణవరానారాధయంతో మునీన్
స్వైరం సేవితతీర్థసింధుపయసో దూరం నిరస్తాధయః।
మాత్రా లక్ష్మణ కేకయేంద్రసుతయా వ్యాజేన నీతా వయం
స్వాముత్సృజ్య ధురం భువో మునివనం యాతవ్యమిక్ష్వాకుభిః॥

(అంకము1. శ్లోకము 14.)

ఓ లక్ష్మణా! ముముక్షువు లగు ఋషిపుంగవులను మార్గమునందు గొలుచుటకును, తీర్థసింధుజలసంగతిని శోకము వాపికొనుటకును నేదియో మిష వెట్టి యిట్లు కైక మనల భూభారము డించి వానప్రస్థముం గైకొను యిక్ష్వాకులవృత్తి నలవడఁ జేసిన దచుచున్నాఁడు. మరియు రామునివిజ్ఞానము చూడుఁడు. క్షత్రియునిగురించి యేమని యభిప్రాయపడుచున్నాఁడో గమనింపుఁడు.

'సాధారణీ నయవిదాం ధరణిః కళత్రం
అస్త్రాణి మిత్రమరయః సహజాః సుతాశ్చ।
పాపాత్పరస్య పతనం నరకేషు లాభః
ద్వే చామరే చ సితమాతపవారణం చ॥'

(అంకము 1. శ్లోకము 17.)

పాపాత్ముఁడగు క్షత్రియునకు నీతివిదులు భోగించు నేలయే యాలు; శస్త్రములే మిత్రము, తోబుట్టువులు, పుత్రులును, శత్రువులు, పరు లొనరించు పాపమువలనఁ దనకును నరకబాధ; రెండు చామరములును, నొకవెల్లగొడుగును చిహ్నములు సుమా, యని రాజ్యాభిలాష తనకు లేదని తెల్పి మరియు లక్ష్మణుఁడు 'విపర్యస్తః క్రమః' వరుస తప్పిన దని నుడువ రాముఁడు నుడువుసమాధానము చాల సమంజకముగా నున్నది. తండ్రి పెద్దవాఁ డగుటచే చిన్నవాఁ డగు రామునకు రాజ్య మొసగుట న్యాయ మని తండ్రివాక్యమును లక్ష్మణుఁడు చెప్పినపుడు రాముఁడు భరతుఁడు తనకంటెచిన్న యగుట రాజ్యార్హుఁడని లక్ష్మణుని మాటకుఁ జక్కగా బదులు చెప్పి యాతనికి నచ్చఁ జెప్ప తుదకు లక్ష్మణుఁడు తానేయపరాధి నని యొప్పుకొనువరకు విడువ లేదు. ఉక్తిప్రత్యుక్తివిషయమున నెంతే వివేకముతో మెలఁగి రాముఁడు స్వీయశీలమును పెత్తనమును నిల్పుకొనునట్లు వివేకముతో శక్తిభద్రుఁ డెంతో నేర్పుతో చిత్రించినాఁడు. ఇప్పట్టున సూక్తి వైచిత్ర్యముచే శక్తిభద్రుఁడు లక్ష్మణకృతకైకేయీనిందా విషయమునకు మెరుఁగిడి రామునిచే నిట్లు పల్కించినాఁడు.

ద్వితీయాంకమున శూర్పణఖావృత్తాంతమే రామాయణమునం దున్నదాని కన్న నెంతో చమత్కారముగా నాటకీయముగ నొనరించెను. వస్తువిస్తరణ విషయమున రాఁబోవు సీతాపహరణాది సూచకముగా

శూర్పణఖను ప్రథమాంకముననే ప్రవేశపెట్టినాఁడు, ఇందుఁగూడ రాముఁడు సీతతోఁ 'వైదేహి, విదూరే సర్వం విస్మయనీయతయా శ్రూయతే' యని యారణ్యకవిస్మయముల నుడువును. ఇట రాఁబోవు మాయామృగవిషయము సూచింపఁబడుచున్నది. కొండలు నదులు దూరమునుండి వినుటకే యెంతో యాశ్చర్యముగా నుండును గాని ప్రత్యక్షముగ ననుభవమగుచో రమ్యముగా నుండు నని నుడువును. ఈ యంకమున శూర్పణఖ రామలక్ష్మణులను బర్యాయముగా దరిసి నిరాకృతయై చివరకు లక్ష్మణు నెత్తుకొని యాకసముపై కెగురును. ఇది యొక యాశ్చర్యము. ప్రేక్షకదృష్టి ననుసరించి శక్తిభద్రుఁడట్టి యద్భుతసన్నివేశముల నచ్చ టచ్చట వలసిన తావులఁ గల్పించి నాటకమును రసవంత మొనర్చినాఁడు.

సీతారాములు సంభాషించునపుడు రాముఁడు సీతను జూచి యరణ్యమున సౌందర్యాపకర్షకములగు సన్నివేశములఁ గూడ సీత యయోధ్యయం దున్నట్లే యెంతోయందముగ నున్నదని.

'చరణనళినసాధ్యం యానమాహార్యమంభః
శయనమవనిపృష్ఠం మండనం స్నానమాత్రమ్।
తవ తరుణి తథాపి త్వం శ్రియా చక్షుషీ మే
హరసి పురమయోధ్యామావసంతీవ చిత్రమ్॥'

(అంకము 2. శ్లోకము 4.)

పాదములే యానము, నీరే యాహారము, నేలయే సెజ్జ, స్నానమే తొడవు, అట్లయ్యు నా కన్నుల కందముగా నయోధ్యయందువలె నిటఁ గూడ నున్నావు అనుచున్నాఁడు. అందులకు సీత తనలోనే యనసూయాదేవియొక్క వర ప్రసాదమును దలపోసి భర్తృసన్నిధిని సీత యెప్పుడును సర్వాలంకృతయై

రూపశోభ నలరారుచుండు నను విషయము రామునకుఁ దెలియదేమో యనుకొనుచున్నది. ఈ యనసూయావరప్రసాదముననే సీత రావణవధానంతరము రామసన్నిధికిఁ దేఁబడగా నపుడు గూడ నందముగా గోచరించుటచే నిశాట విటులఁ గూడెఁ గాఁబోలు నని రాముఁడే సంశయింప తుదకు నారదుఁడు అనసూయావరవిషయముఁ దెల్పి సంశయవిచ్ఛేదము గావించును. ఈ వర విషయము రామునకుఁ దెలియకుండ కథను సాగించుటయే నాటకకర్తయొక్క నేర్పు. వస్తువిస్తరణమున కట్టి గోపనమే కొన్ని తావుల నత్యావశ్యకము.

ఈ అనసూయావరవిషయమునఁ గూడ వాల్మీకిరామాయణమున నున్న దానికన్న నలతిగ మార్చి కథ కొక క్రొత్తసోయగమును గల్పించినాఁడు కవి. రామాయణమున నిట్లున్నది,[1]

1. 'సా త్వేవముక్తా ధర్మజ్ఞా (అనసూయా) తయా ప్రీతితరాఽభవత్।
సఫలం చ ప్రహర్షం తే హంత సీతే కరోమ్యహమ్॥ 17
ఇదం దివ్యం వరం మాల్యం వస్త్రమాభరణాని చ।
అంగరాగం చ వైదేహి మహార్హం చానులేపనమ్॥ 18
మయా దత్తమిదం సీతే తవ గాత్రాణి శోభయేత్।
అనురూపమసంక్లిష్టం నిత్యమేవ భవిష్యతి॥ 19
అంగరాగేణ దివ్యేన లిప్తాంగీ జనకాత్మజే।
శోభయిష్యతి భర్తారం యథా శ్రీర్విష్ణుమవ్యయమ్॥ 20
సా వస్త్రమంగరాగం చ భూషణాని స్రజస్తథా।
మైథిలీ ప్రతిజగ్రాహ ప్రీతిదానమనుత్తమమ్॥ 21
ప్రతిగృహ్య చ తత్ప్రీతా ప్రీతిదానం యశస్వినీ।
శ్లిష్టాంజలిపుటా తత్ర సముపాస్తతపోధనామ్॥' 22
(వాల్మీకిరామాయణం-అయోధ్యాకాండ-సర్గః 118.)
'గమ్యతామనుజానామి రామస్యానుచరీ భవ।
కథయంత్యా హి మధురం త్వయాఽహం పరితోషితా॥ 10

అనసూయాదేవి సీతకు దివ్యమాల్యవస్త్రాభరణాంగరాగముల నిచ్చినట్లును నంగరాగలేపనమున భర్త కందముగ గనఁబడు ననియు నుడివెను. ఈ దివ్యమాల్య వస్త్రాభరణాదుల ప్రశంస లేకయే కేవల మామెవరప్రభావమే రామసన్నిధిని సీతనట్లు గోచరింపఁ జేయునని యనసూయావర ప్రభావమును దెల్పుటకై యీ శోభాప్రశంస గావించి యిట శక్తిభద్రుఁడు రామున కాసంగతి తెలియనట్లు చిత్రించెను. రామాయణమున సీత యనసూయ యొసగిన దివ్యమాల్యవస్త్రాభరణాదులఁ జూపి వానిప్రభావము కూడ రామునితో నుడువుటయే గాక రామునెదుట నావస్తువుల ధరించె ననియు నద్దాన గలుగు సుషమను రాముఁడు గమనించి యనసూయా ప్రీతిదానమునకు మిగుల సంతసించినట్లును గలదు.

శక్తిభద్రుఁడు వస్తుకళాపోషణమునఁ గడునేర్పరి. శూర్పణఖ స్వస్వరూపముతో గోచరించునపుడు,

"భీమదంష్ట్రమరుణోర్ధ్వమూర్ధజం
శైలవర్ష్మ జలదోదరచ్ఛవి।
తాటకాం హతవతస్తతోఽపి మే
రూపమేతదవశం భయావహమ్॥"

(అంకము 2. శ్లోకము 5.)

అలంకురు చ తావత్త్వం ప్రత్యక్షం మమ మైథిలి।
ప్రీతిం జనయ మే వత్సే దివ్యాలంకారశోభితా॥ 11
సా తథా సమలంకృత్య సీతా సురసుతోపమా।
ప్రణమ్య శిరసా తస్యై రామం త్వభిముఖీ యయౌ॥ 12
తథావిభూషితాం సీతాం దదర్శ వదతాం వరః।
రాఘవః ప్రీతిదానేన తపస్విన్యా జహర్ష చ॥ 13
న్యవేదయత్తతః సర్వం సీతా రామాయ మైథిలీ।'
(అయోధ్యాకాండ-వర్గః 119)

భయంకరములగుఁ గోరలు గలదియు, నెర్రబారిన నూర్ధ్వకేశములు గలదియు, కొండవంటి శరీరము గలదియు, మబ్బువంటి చాయ గలదియు నని శూర్పణఖా రూపము మనకన్నులయెదుట గోచరింపఁ జేయునట్లు వర్ణించినాఁడు.

శూర్పణఖ రామలక్ష్మణులఁ గబళింపఁ బోయి తుదకు లక్ష్మణునిచే ముక్కుచెవులు గోయఁబడి విరూప యగును. ఈ కార్యము తత్కాలమునకుఁ దగినదే యైనను స్త్రీ కట్టిపని చేసితి నని లక్ష్మణుఁడు చాల సిగ్గిలును. అకార్యాచరణమున నిక్ష్వాకులు ప్రవర్తింప రనియు నట్టు లకార్యమువలె గోచరించు కార్యములందుఁ బ్రవర్తిల్లి సిగ్గిలుటయు వారిశీలగౌరవమును దెల్పుచున్నది. ఆత్మస్తుతి, రామలక్ష్మణుల కెందు నెప్పుడును లేదు. రాముఁడు వెచ్చుకొనినను లక్ష్మణుఁ డాపని గావించినందుకు సిగ్గుపడుటయే లక్ష్మణుని గొప్పగుణము.

శూర్పణఖ విరూపయై రాబోవు ఖరదూషణరావణవృత్తాంతములను సూచించుటకై 'స్మరతం, మనుష్యే, యువయోరవినయం, తస్య ఫలమద్య ప్రభృతి ద్రక్ష్యథః' మీ యవినయమునకు ఫలము నేటినుండి చూడఁ గలరని బెదరించుచు వెడలిపోవును. అంతకు మున్నే 'ఆర్య రావణ, హా ఆర్య కుంభకర్ణ హా ఆర్య విభీషణ పరిత్రాయస్వ పరిత్రాయస్వ మాం తాపసవ్యాజప్రతిచ్ఛన్నయోర్మనుష్యయోరవినయాత్' అనియు రాఁబోవు కష్టములను రావణాదులఁ గాపాడుఁ డని కోరుచు సూచించుచున్నది. ఈ పూర్వోత్తరకథాసందర్భము లతుకుటకు శూర్పణఖావచనము లెంతయు నుచితములుగా నుండి నాటకీయముగా రాణించుచున్నవి. ఇదియే యీ కవినైపుణ్యము.

శక్తిభద్రుఁడు కర్మఠుఁడు. సాయంకాలము కాగానే లక్ష్మణునితో రాముఁ డేమనుచున్నాఁడో చూడుఁడు. కవి తనకర్మఠత్వమును రామవాక్యములద్వారా వ్యక్తపరచుచున్నాఁడు.

రామ:- ఏష పరిణతో దివసః। వత్స లక్ష్మణ!

'ఖడ్గం నిధేహి శిథిలీకురు కార్ముకజ్యా
మంగైరపాం విరజసామవగాహనార్థైః।
అంతర్నియమ్య మరుతః పరివర్త్య మంత్రాన్
సాయంతనం నియమమద్య వయం చరామః॥

(అంకము 2. శ్లోకము 20.)

లక్ష్మణా! సాయంకాలమైనది. కత్తి నొర నిడుము, విల్లు డింపుము, నిర్మలోదకముల తీర్థమాడి, పూతాంగులమై ప్రాణాయామపూర్వకముగా మంత్రములఁ బఠింత మనును. ఇప్పట్టున శక్తిభద్రుని బ్రాహ్మణచాదస్తము చాల ధ్వనించుచున్నది. సకాలసంధ్యావందన మాచరింపవలయు నను నీతని నియమము వ్యక్త మగుటయే కాక రాక్షసీదర్శన. సంభాషణ స్పర్శనాదికమువలన కల్గిన మైలపోగొట్టుటకు నిర్మలోదకముల స్నాన మాడుద మని యాతని యభిప్రాయము. యోగాభ్యాసపరుల కసాధ్య మెద్దియు నుండదు గనుక శక్తిభద్రుఁడు రామలక్ష్మణుల యోగాభ్యాసపరులనుగా నిటఁజూపుచు ప్రాణాయామపూర్వకముగా మంత్రజపము గావింపఁ జేయుచున్నాఁడు. దీన నీ కవి యోగాభ్యాసకుశలుఁ డనియు, పరమనైష్ఠికుఁ డనియు గోచరించుచున్నది. అఖిలతపములకుఁ యోగములకును నెల్ల ప్రాణాయామము చాల ముఖ్య మని కూడ దీనివలనఁ దెలియుచున్నది.

తృతీయాంకమున విష్కంభమం దొక ఋషియు నొకవృద్ధ తాపసుఁడును మారీచాశ్రమము చెంత సంభాషింతురు. ఖరదూషణాదులు రణమున మడిసిరనియు. రావణుఁడు మారీచుని మృగరూపమున రాముని లోభపరచి దవ్వులకుఁ గొనిపొమ్మని నియోగించినట్లును వారి సంభాషణమువలనఁ దెలియుచున్నది. వాల్మీకిరామాయణ

కథానుసారముగానే యీ విష్కంభకథావృత్తాంతము నడచినది. రామాయణమున రావణమారీచ సంభాషణ మిట్లున్నది,[1]

రావణమారీచసంభాషణము విస్తరముగా నున్నను నిట సంక్షేపముగ రావణ నిర్బంధమున మారీచుఁ డా పని కంగీకరించె నని మాత్రము, నుడివినాఁడు.

అమంగళమునకు శాంతి తపమే యని వైదికదృష్టి నిట వ్యక్తపరచుచు తపోమహిమమును వ్యంగ్యముగ నుడువుచున్నాఁడు. మారీచునంతటి రాక్షసుఁడు కూడ రాముని పరాత్పరుఁ డని ప్రశంసించి యతనిచేతఁ

1. 'ఏతదర్థమహం ప్రాప్తస్త్వత్సమీపం నిశాచర।
శ్రుణు తత్కర్మసాహాయ్యే యత్కార్యం వచనాన్మమ॥ 17

సౌవర్ణస్త్వం మృగో భూత్వా చిత్రో రజతబిందుభిః।
ఆశ్రమే తస్య రామస్య సీతాయాః ప్రముఖే చర॥ 18

త్వాం తు నిస్సంశయం సీతా దృష్ట్వాతు మృగరూపిణమ్।
గృహ్యతామితి భర్తారం లక్ష్మణం చాభిధాస్యతి॥ 19

తతస్తయోరపాయే తు శూన్యే సీతాం యథాసుఖమ్।
నిరాబాధో హరిష్యామి కృతార్థేనాంతరాత్మనా॥' 20

(అరణ్యకాండే-సర్గః 36.)

'గచ్ఛ సౌమ్య శివం మార్గం కార్యస్యాస్య వివృద్ధయే।
అహం త్వానుగమిష్యామి సరథో దండకావనమ్॥ 24

ప్రాప్య సీతామయుద్ధేన వంచయిత్వా తు రాఘవమ్।
లంకాం ప్రతి గమిష్యామి కృతకార్యః నహ త్వయా॥ 25

న చేత్కరోషి మారీచ హన్మి త్వామహమద్య వై।
ఏతత్కార్యమవశ్యం మే బలాదపి కరిష్యసి॥ 26

రాజ్ఞో హి ప్రతికూలస్థో న జాతు సుఖమేధతే।'

(అరణ్యకాండ-సర్గః 40)

జావ నిచ్చగించుచున్నాఁ డనుటలో రామమాహాత్మ్యము నినుమడింపఁ జేయుచున్నాఁడు. లక్ష్మణుఁడు మునివృషభులసేవాఫలముగఁ గవచమును, నలంకరణీయములగు నాశ్చర్యమణిరత్నాంగుళీయకములఁ బడసి రాముకడకు వచ్చును. ఆ కవచము యొక్కయు, ఆశ్చర్యమణి రత్నాంగుళీయకములయొక్కయు ప్రభావము నద్భుతమని తెలియఁజేయును. ఈ కవచమణ్యంగుళీయకవృత్తాంతము కవికల్పితము, రాక్షసమాయా నిరాసమున కవి యెంతయు నుపకరించునట్లు చేసి వీని యాశ్చర్య ప్రభావముననే సీతారామసమాగమము గలిగె ననియు, ననేకసంశయస్థలముల వీనిచే సత్య మెరుంగుట కవకాశము గల్గుటచేతను నీ యాశ్చర్యచూడామణియే యీ నాటకమున ప్రధానకీలకము. శక్తిభద్రునకు పెద్ద లన్న చాల గౌరవము. వారిమాట జవదాటఁడు. మునివృషభులు కవచమణ్యంగుళీయకముల నొసఁగిరని లక్ష్మణుఁడు నుడువ వెంటనే 'ప్రసీదత్వార్యః న మహర్షిశాసనముపేక్షణీయం' అనును. మునులనుగూర్చి రాముఁడు 'కిమాజ్ఞాపయంతి పరాపరవిదః' అని వారిమాహాత్మ్యమును పరాపరవేత్తృత్వము నుగ్గడించుచున్నాఁడు.

ఈ యంకమున శక్తిభద్రుఁడు మాయాసీతను మాయారాముని మాయా లక్ష్మణుని ముప్వురను గల్పించి పరస్పరము సందేహింపఁ జేసి కొంత కథాభాగమును రమణీయముగా సాగించెను. పదునారవశతాబ్దమున నాంగ్లదేశ సుప్రసిద్ధకవిశేఖరుఁడగు షేక్స్పియరు వ్రాసిన Comedy of errors ను గొనియాడుచుండి యట్టికల్పనలు జానకీపరిణయాదులందు గోచరించిన వానిని షేక్స్పియరునాటకానుకరణ మని కొంద రందురు. కాని 8,9 శతాబ్దముల మధ్యమువాఁడగు నీ శక్తిభద్రుఁడే యిట్టి సన్నివేశములఁ గల్పించి హైందవ నాటకరంగమున కొక నూతనోత్సాహమును దెచ్చినాఁడుకాని నాటికాలజసుల కవి నచ్చలేదేమో.

సచ్చియుండిన నీ నాటక మేల బయటికి రాకుండును? ఇందు ఈ మాయావేషకల్పన లన్నియుఁ గవికల్పితములే. సీతాపహరణమున సీతకేలాటి నందియము కలుగకుండ రావణుఁడు రామవేషమున వచ్చును. రావణసారథి లక్ష్మణవేష మూని మునులు భరతుఁ డాపదలో నున్నాఁ డనియు రామలక్ష్మణులు తత్క్షణము భరతు నరయ నేగవలయు ననియు నుడివి యొక రథము నొసఁగి యంతర్హితులైరని నుడువును. పెద్దల వాక్యములన్న నతిగౌరవము గల సీతను హరించుట కీయుపాయ మెంతయుఁ దగియున్నది. సీతయు నేమాత్ర మనుమానింపక రామవేషమున నున్న రావణుని వెంబడించును. ఈ కల్పనము శక్తిభద్రుని కల్పనాచాతుర్యము నెంతయుఁ దెల్పుచున్నది. మరల శూర్పణఖ సీతవేష మూని రాముని వంచించును. మాయాసీతయు, సత్యరాముడు నాకసమున రథమున నున్న సత్యసీతామాయారాములఁజూచి పరస్పరము మాయావ్యక్తులను కొందురు. ఇట్టి మాయాప్రపంచమును గల్పించి సందేహసాగరమునఁ గొంత సేపు ముంచి చివరకు మాయారాముఁడుగా వచ్చినమారీచుని తెలిసికొనుటకు రత్నాంగుళీయక మెంతయు నుపకరించునట్లు చేసి కవి యిట కథ నెంతో చమత్కారముగా నడపించి ప్రేక్షకలోకము నానందసాగరమున ముంచి వైచెను. ఈ నాటకమున కంతయు నాశ్చర్యజనకములగు ఘట్టములలో నిదియే గొప్పది. తుదకు మాయాసీతగా నున్న శూర్పణఖ మారీచుఁడు వెలువడి రామునికాలిమీటుటచేఁ జావగా భయపడి నిజరూపముఁ దాల్చి సీతాపహరణాది వృత్తాంతసత్యమును దెల్పును.

సీతాదేవి తనకు దక్షిణనయనస్పంద మశోభనమును సూచించుచున్న దని లక్ష్మణునితో నుడువుచు 'కుమార, ఋషిపత్నీనాం వదనాత్ శ్రుతం మయాఽస్తి విశ్రుతో వింశతిభుజో యువాభ్యాం హతయోః ఖరదూషణయోః భ్రాతేతి' రావణుఁ డిర్వదిచేతులవాఁడు

ఖరదూషణాదులభ్రాత యొకఁడు కలఁడని ఋషిపత్నులవలనఁ దాను వినినట్లు నుడువుచున్నది. రామాయణమున సీత కిట్లు ఋషిపత్నులు నుడివిరను విషయము కానరాకున్నది, పూర్వోత్తరసందర్భముల నదుకుటకై యిట్టి మార్పులు చేసి రామవేషమునఁ గాని సీతను వంచింప వీలుపడ దని రావణుని రామవేష మూనఁ జేసెను. రావణుఁడు రథమున వచ్చుసందర్భమున రథవేగనిరూపణము కాళిదాసుని రథవేగమును బోలియున్నది.

"తోయోద్గారికదంబకం జలముచామాయామమాపద్యతే
ఘంటాస్తంభితశృంఖలాశ్చపలతాముజ్ఝంతి మూకైర్ముఖైః।
కర్ణాంతే జపతీవ చామరమిదం సంస్తంభితం వాయునా
తూర్ణం త్వాముపసర్పతీవ పురతో యాతవ్యమిచ్ఛావశాత్॥"

(అంకము 3. శ్లోకము 19.)

పైశ్లోకమున తృతీయపాదమున 'చామరమిదం సంస్తంభితం వాయునా' యన్న విషయము 'నిష్కంపచామరశిఖా నిభృతోర్ధ్వకర్ణాః' యను కాళిదాసోక్తికి సరిపోవుచున్నది. రావణునకు శూర్పణఖ సీతను జూపి 'ఆర్య ఇయమస్యా ఆకృతిః ఆభరణేన జ్వలతా కథమివ శోభతే' యని యామెసౌందర్యమును గూర్చి ముచ్చటింప రావణుఁ డేమనుచున్నాఁడో చూడుఁడు. రావణః:- కిమాభరణైరస్యాః పశ్య.

"యస్య నైసర్గికీ శోభా తన్న సంస్కారమర్హతి।
కః కలాం శశినో మార్ష్టి కౌస్తుభః కేన రజ్యతే॥"

(అంకము 3. శ్లోకము 24.)

ఆమె కాభరణములతోఁ బని యేమి? సహజసౌందర్యసంపన్నులగువారి కేలాటి సంస్కారము నవసరము లేదు. చంద్రకళ నెవ్వడు శుభ్రపరచును?

కౌస్తుభమును బ్రకాశింపఁజేయునది వేరొండు కలదా? యని నుడివి 'కిమివ హి మధురాణాం మండనం నాకృతీనా' మన్న కాళిదాససూక్తి సచ్ఛాయను రచించినాఁడు శక్తిభద్రుఁడు.

తుదకు శూర్పణఖ భయపడి స్వస్వరూపము స్వీకరించి యథార్థము నుడివినపు డభయ మిచ్చి రామలక్ష్మణులు రావణునకు సందేశ మంపుచు, తాము సీతాన్వేషణమునకై యత్నింతురు. శూర్పణఖాముఖముననే సీతాపహరణ వృత్తాంతము రామలక్ష్మణు లెరుంగుట కవికల్పనము. రామాయణమున జటాయువుమూలమునఁ గాని యెరుంగరు. కథాగమనమునకై కవి యట్లు మార్చి సందర్భశుద్ధిని గూర్చినాఁడు.

నాల్గవయంకమున రావణుఁడు సీతను రథమునఁ గైకొని యాకాశమార్గమునఁ బోవుచుండును. రావణుఁడు సీతావిషయమున కాముకుఁడై రామవేషమున నెంత ప్రీతిగా మాటాడుచున్నను నాటకీయముగ సీత కామాయారామచేష్టల నన్యథా తోచున ట్లీకవి యొనర్చినాఁడు. కావుననే సీత 'కిన్ను ఖల్వపర ఇవ దృశ్యతే ఆకారేణ ఆర్యపుత్రః' అని నుడువుచున్నది. తదనుగుణముగ మాయ బయల్పడుటకు రావణుఁడు సీతాస్పర్శసుఖ మనుభవింప నెంచి యేమనుచున్నాఁడో చూడుఁడు.

'నియమాభిషేకజటిలం తపోవనే
వనవల్లరీకుసుమమాత్రమండనమ్।
రచయామి దేవి రథయానవేగతః
శ్లథితం శిరోరుహనిబంధనం తవ॥'

(అంకము 4. శ్లోకము 4.)

తపోవనమున నియమముగాఁ జేయుస్నానవిధులచే దట్టముగా జడలుగట్టి యడవి పూవులే తొడవుగా గల్గి రథవేగమున వీడి చెదరిన నీ కొప్పును బంధింతు నని స్పృశింపఁబోవును.

సీత మాయాలక్ష్మణుఁడుగా నున్న సూతుని లక్ష్మణుగా నెంచి 'నను కుమార ఆసన్నః' కుమారుఁడు లక్ష్మణుఁడు చెంత నున్నాఁడని నిజహస్తమున రావణహస్తమును వారించును. తత్క్షణమే సీత ధరించియున్న యాశ్చర్యచూడామణిప్రభావమువలన రావణుఁడు మాయ తొలఁగి స్వస్వరూపము దాల్చును. సీత భయపడి 'హా కా మే గతిః కిం మే శరణ' మ్మని కేక వేయ జటాయువు వచ్చి రావణు నెదుర్కొనును. జటాయురావణసంభాషణము వీరరసస్ఫోరకము. శైలియు రసోచితముగా నడచినది. కయ్యమున జటాయువు మరణించును. సీత యేడ్చుచు తనకై రావణహతకునితోఁ బోరి యసువులఁ దొరంగిన జటాయువునకై విచారపడును. స్త్రీహృదయము పేశలము. అందును తనకు సాయముచేయ వచ్చి రణమున మడిసినవానివిషయమునఁ జెప్పవలయునా? రావణునిసూతుఁడు కూడ రావణచేష్టితముల నొల్లఁడాయె. తాను మంచి హితము నుడివినను బెడచెవిని బెట్టుచున్నాఁడనియుఁ గామావిష్టులకు సద్గుణగ్రహణ ముండ దనియు రావణవిషయమునఁ జాల విచారపడును.

ఈ ఘట్టమున రావణునితో సూతునిగూడ రప్పించుట నూత్న కల్పనము, రామాయణమున రావణుఁడు భిక్షుకవేషమున నొంటిగ వచ్చినట్లును నొంటిగనే సీతను గొంపోయినట్లును మాత్ర మున్నది. ఇట సూతు నొకని గల్పించి వానికి లక్ష్మణవేషము చిత్రించి సీతాపహరణవిషయమున సీతకు మునివృషభులు భరతునికి సాయముగ వేగ సీతారాములు బోవలయు నని లక్ష్మణుఁడు నుడువునట్లు నుడువఁ జేసి నమ్మకము గల్గించుటకు శక్తిభద్రుఁడెంతో తెలివిగాఁ బూర్వోత్తరసందర్భశుద్ధికై యిట్లొనర్చెను. మరియు దీనివలన స్వపక్షము వారికిఁ గూడ రావణునిచేష్టము లసహ్యములుగఁదోఁపజేసి ప్రతినాయకునిపై

నేవజనింపఁ జేయుధర్మము సూచితమగుచున్నది. నాటకీయముగ ప్రేక్షకుల నిట్టివి యెంతో యాకర్షించును.

పంచమాంకమునఁ బ్రవేశమున మండోదరి చేటికతోఁ బ్రవేశించి తన దుస్స్వప్నవిషయము నుడువును. శక్తిభద్రుఁడు శకునములు, స్వప్నములు మున్నగునవి భావిఫలసూచకములను విశ్వాసము కలవాఁడని తెలియుచున్నది. రాబోవు రావణవినాశసూచకముగ సముద్రము గడ్డిపోచలు పడుటచే నెండిపోయినట్లును తన్నొకయమంగళస్త్రీ బిగ్గఁ గౌఁ గిలించికొనినట్లును గలఁ గన్నట్లు మండోదరి తెల్పును. దీన సముద్రునివంటి గంభీరుఁడు రావణుఁడు వినాశ మొందుట గాని, సేతుబంధన ప్రయత్నవిషయము గాని స్ఫురించుచున్నది. కామింపని సీతవిషయమున కాముకుఁడగు రావణుని కాముకవృత్తిని పరిశీలింప మండోదరి చేటితో పొదమాటున నుండి చూచుచుండును.

రావణుఁ డమాత్యునితో సంభాషించునపు డమాత్యుఁడు రామవృత్తాంతము దెల్పి సీతను గామింపఁ దగ దని హితము గరపును. ఈ సంభాషణముననే రామాయణకథ సీతాన్వేషణమునకై యెల్లదిక్కులకు కపులనంపుటవరకుఁ గలది సంగ్రహముగా సాగినది. అమాత్యుఁడు 'సుజనః శంసతి పథ్యమేవ భర్తుః' అని రావణునకు హితము నుడువును. ఇట కిదాతార్జునీయమునందలి భారవి వాక్యము 'న హి ప్రియం ప్రవక్తు మిచ్ఛంతి మృషా హితైషిణః' అనునది స్మరణీయము, హితైషిణులు ప్రియము కదా యని యసత్యము నుడువరు, అప్రియమైనను హితమైన ప్రియమును నుడువుదు రను భావము పైయమాత్యవాక్యములఁ దెలియుచున్నది. దీన శక్తిభద్రునివ్యవహారజ్ఞానము తేటపడుచున్నది.

ఈ యంకమున సీతాపాతివ్రత్యము వ్యక్తమగుచున్నది. కాముకుఁడై తనసర్వస్వము నర్పింప సిద్ధపడు రావణుని సీత వారించి రాముని శరణు

వేడుకొను మనుచున్నది. సీతపాదము లాన రావణుఁడు సాష్టాంగముగ నమస్కరించినపు డామె సచ్ఛీల గావున దుర్భాష లాడక కేవలము తనపాదముల లాగికొనినది. ఉత్తమనారీలక్షణ మీ సీతశీలమునఁ జూపఁ బడినది. మండోదరి యీ విషయము ప్రత్యక్షముగఁ జూచి యచ్చెరు వంది లోకులు సీతారాములు లక్ష్మీనారాయణు లనుకొనువార్త సత్య మని విశ్వసించును. శత్రుపక్షమువారికిఁ గూడ సీతారాములవిషయ మిట్లుత్తమరీతి విశ్వసింపఁజేయుచు శక్తిభద్రుఁడు వారి శీలములకు మెరుగిడెను. తుదకు రావణుఁడు సీతను ఖండింప చంద్రహాస మూనునపుడు మండోదరి తవప్రాణము లొడ్డియైన సీతను రక్షింప నెంచి యట్లు చేయును. రావణశిరస్స్పర్శమున నిజపాదము పాంసులమైన దని తటాకమున గడిగికొని పరిశుద్ధము జేసికొనునట్లు సీతనోట నుడివించి శక్తిభద్రుఁడు తన చాదస్తమును మరలతెల్పుకొనుచున్నాఁడు. అస్పృశ్యుని స్పృశించినట్లు భావించును.

షష్ఠాంకమున సీత యశోకవనమున నొంటరిగ దీనాతిదీనముగ విలపించుచుండును. ఈ సీతావచనములు దయనీయములు. ఈ యంకమున కవికల్పనము నూతనమైన దేదియుఁ గానరాదు. హనుమంతుని జూచి తొలుత రాక్షసమాయ యనుకొని యటులైనఁ బరీక్షింపఁ దనయొద్ద చూడామణి కలదు గదా యని తలఁచును. ఈ చూడామణిప్రభావము నిట్లవసరమైనసందర్భముల దప్పక తెలుపుచు దీని నీనాటకమున కీలకముగాఁ జేసినాఁడు శక్తిభద్రుఁడు. సీత హనుమానునితో సంభాషించునపుడు రామవృత్తాంతమున హర్షించుచుఁ దుదకు రామ సందేశమును దశాస్యుని వధించి తన్ను (సీతను) గైకొందు నను వార్తను విని నిజచూడామణిని రామున కందీయ హనుమానున కొసంగును. ఈ సందర్భమున సీతయొక్క ఉచితజ్ఞత, పరేంగితజ్ఞానము వ్యక్తమగుచున్నవి.

ఈ యంకవిషయ మంతయు వాల్మీకిరామాయణము ననుసరించియే సూక్తిభేదమున వెలయుచున్నది.

సప్తమాంకమున తొలుత విష్కంభమున విద్యాధరదంపతులు ప్రవేశించి రావణవధవిషయము దెల్పుదురు. ఆరంకము లైనపిదప రామరావణ యుద్ధము నభివర్ణింప నదను దొరకక కవి యిట సంక్షేపముగా నీ విష్కంభమున నడపినాఁడు. ఈ విద్యాధరమిథునము యుద్ధము నవలోకించుట భాసభవభూతుల యనుకరణము. అనంతరకరణీయ కార్యకలాపములవిషయమున జాగుసేయక కార్యోన్ముఖుఁడై వేగవేగ కథను నడపించుచు శక్తిభద్రుఁడు తుదియంకమగు దీన రావణవధానంతరము విభీషణప్రతిష్ఠ సల్పి, లక్ష్మణుఁడు సీతాభావశుద్ధిని శంకింప సీత నగ్నిప్రవేశము సేయ సెల వొసంగుటయు, సీత యట్లు చేసి శుద్ధురా లగుటయు మొదలగు నంశములు వెంట వెంట కథాగమనోన్ముఖముగ నడపించినాఁడు. లక్ష్మణుఁడు సీతాభావశుద్ధినిఁ బరీక్షింపవలయు నని యీ నాటకమున నుడువుచు నేమనుచున్నాఁడో చూడుఁడు.

"సుఖాభిలాషీ స్త్రీభావో దుర్వినీతాశ్చ రాక్షసాః।
దూరే వయమతో దేవ్యాః పరీక్ష్యా భావశుద్ధతా॥"

(అంకము 7. శ్లోకము 12.)

'స్త్రీస్వభావము సుఖము వాంఛించు ననియు రాక్షసులు దుండగీం ద్రనియు మనము (రామలక్ష్మణులు) దూరమం దున్న వారమగుట జానకీభావశుద్ధి పరీక్షింపదగిన' దనుచున్నాఁడు. లక్ష్మణసుగ్రీవులు సీతను లంకనుండి రామసన్నిధికిఁ దోడ్కొని వచ్చుచున్నాఁడు. సీత రాముసన్నిధికిఁ వచ్చునపుడు చక్కగ నలంకృతగా నుండును. ఈ లక్ష్మణసంశయము, సుగ్రీవకృతసీతానయనము, జానకీదివ్యాలంకారము ఇవి యన్నియు కవి

గావించిన మార్పులు. రామాయణమున నీ ఘట్టమున విభీషణుఁడే సీతను దోడ్కొనివచ్చినట్లును సీతయే యగ్నిప్రవేశ మొనరించెద నని లక్ష్మణుని జితిఁ బేర్చు మని యడిగినట్లును లక్ష్మణుఁడు రాముపై నలిగి రాముని యింగిత మెరింగి చితిని గావించినట్లును కలదు. అలంకార విషయమునఁ గూడ సీత తా నా వేషముతోడనే వత్తు నన విభీషణుఁడు రామవాక్యముగ భర్తృసన్నిధికి స్నాన మాచరించి నలంకరించికొనియేఁ జనఁ దగు నని నుడవ నామె యట్లు గావించినట్లును గలదు.[1] శక్తిభద్రుఁడిట కథలో గొన్ని మార్పులు గావించి ప్రేక్షకదృష్టి నాకర్షించుటకై ముందు నుడివిన యనసూయా పరప్రసాదమనువిషయము అనగా సీత భర్తృసన్నిధి నెల్లపుడును దివ్యాలంకృతగా నుండున ట్లొసఁగిన వరవిషయమున కొక

---

1. ఉవాచ మేఘసంకాశం విభీషణముపస్థితమ్॥ 6
దివ్యాంగరాగాం వైదేహీం దివ్యాభరణభూషితామ్।
ఇహ సీతాం శిరస్స్నాతాముపస్థాపయ మా చిరమ్॥ 7
....।
అస్నాతా ద్రష్టుమిచ్ఛామి భర్తారం రాక్షసాధిప॥ 10
తస్యాస్తద్వచనం శ్రుత్వా ప్రత్యువాచ విభీషణః।
యదాహ రాజా భర్తా తే తత్తథా కర్తుమర్హసి॥ 11
తస్య తద్వచనం శ్రుత్వా మైథిలీ భర్తృదేవతా।
భర్తృభక్తివ్రతా సాధ్వీ తథేతి ప్రత్యభాషత॥ 12
....
రక్షోభిర్బహుభిర్గుప్తామాజహార విభీషణః॥
(యుద్ధకాండ- అధ్యాయము 117.)

అబ్రవీల్లక్ష్మణం సీతా దీనం ధ్యానపరం స్థితమ్॥
చితాం మే కురు సౌమిత్రే వ్యసనస్యాస్య భేషజమ్।
....

పూర్వోత్తరసందర్భకల్పనమునకై యిట్లు గావించియుండ నోపు. విభీషణుఁడు లంకలోనుండి సీత బయటికివచ్చువరకు తా నందుఁ బ్రవేశింప నని నుడివిన వచనము సముచితముగనే యున్నది. విభీషణుఁడు 'అహం తావన్నగరీం న ప్రవిశామి యావద్దేవీ తతో న నిష్క్రామతి' అని యనుచున్నాఁడు. కథాగమనమున కిది యెంతయుఁ దోడ్పడుచున్నది.

శక్తిభద్రుఁడు సాధ్వాచారసంపన్నుఁడు. సీతను దోడ్కొనివచ్చునపుడు 'అహో ను ఖలు లక్ష్మణసుగ్రీవయోః సాధ్వాచారః',

'అనయోర్నమతోరద్య దూరానతశిరస్కయోః।
పతంతి రాజకన్యాయాః పాదయోరేవ దృష్టయః॥'
(అంకము 7. శ్లోకము 15.)

లక్ష్మణసుగ్రీవులు దూరమునుండియే వంచిన శిరములుగలవా రగుచు, జానకీపాదములనే చూచుచు నడచునట్లు నుడివి సాధ్వాచారము స్వామినివిషయమునఁ జూపఁదగిన గౌరవవిశేషము నిట వారిశీలపోషణవిషయమునఁ బొందుపరచి సచ్ఛీలమును బోధించు చున్నాఁడు కవి.

అలంకృతయౌ సీతను జూచి రాముఁడు శంకించి లంకలో నిశాట విటులను గూడె నని నిందించు సమయమున సీత నవ్వుచు భర్త పరుషము లాడె ననును. ఇట్టి విషమసందర్భమున సీత నట్లు నవ్వునట్లు చిత్రించుట జానకీశీలమునకుఁ గౌరంతనాపాదించునట్లు తోచుచున్నది. కాని యిటఁ

ఏవముక్తస్తు వైదేహ్యా లక్ష్మణః పరవీరహా।
అమర్షవశమాపన్నో రాఘవాననమైక్షత॥ 20

స విజ్ఞాయ తతశ్ఛందం రామస్యాకారసూచితమ్।
చితాం చకార సౌమిత్రిర్మతే రామస్య వీర్యవాన్॥ 21

(యుద్ధకాండం-119 అధ్యాయము.)

గూడ ననసూయా వరప్రభావము పనిచేయుచున్నను, సీత నవ్వుట తగదు. రాముఁ డనుమానింపఁ దగును. అట్లనుమానించి దండనార్హను గావించినపిదప శుద్ధురా లైనను శంకాకళంకము మాత్రము రామునకుఁ బోనట్లే తుదిదనుకఁ జూపి నారదుఁడు అనసూయా వరప్రభావ మని నుడివినంత సీతపై రాముఁడు నిశ్శంకుఁడై సీతను గ్రహించును.

నారదాగమనము కవి గావించినమార్పు. దీన నాటకమునకు వలయు గానము గూర్పఁబడినది. బ్రహ్మాదిదేవతలు వచ్చి రాముని స్తుతించి రను రామాయణవిషయమును దేవతాప్రతినిధిగా నీ నారదునితో గడపెను. నారదునకు శ్రీరాముఁడు మ్రొక్కి భగవత్ప్రసాదమునఁ దన్ను బ్రపూతునిగా భావించుకొనును. దేవతలు పితృదేవతలు వీరందరు రాగా వారిరాకకుఁ గారణము సీతాపాతివ్రత్యమే యని నారదుఁడు నుడువును. ఈ నారదప్రవేశము అనసూయా వర మను వస్తువును విస్తరింపఁజేయుటకై కల్పించినట్లు తోచుచున్నది. సీతాపాతివ్రత్యసూచకమున నీ యనసూయావరవిషయ మెంతయుఁ దోడ్పడుచున్నది. విభీషణుఁడును జనాపవాదము సీతపతివ్రత యనియే యని నుడివినపుడు రాముఁడు సీత యెంత మహానుభావురాలో తెలిసికొంటి ననును. భర్త, అందును ధీరోదాత్తుఁడు నగు శ్రీరామునంతటివాఁడు కేవలము పామరముగ తనభార్య సీతయెంత మహానుభావురాలో తెలిసికొంటి ననుచు 'జానే కియాననుభావో జానక్యాః' భార్యావిషయము వ్యక్తముగ నుడువుట తగ దనుకొందును. స్వగత మనియైన కవి నుడివియుండఁదగును. భార్యావిషయకప్రశంస చేయ రాదని పెద్ద లందురు.

విమానారూఢు లగుతరి సీత 'ఏషోఽంజలిః ఆశ్చర్యరత్నయోః। అన్యథాకథమిదానీం ఆర్యపుత్రం రాక్షసం చ పరమార్థతో జానామి' అని,

రాముఁడు పల్కినమాటలకు బదులు చెప్పును. రాముని సత్యముగాఁ దెలిసికొనుట కుపయోగపడిన వని యాశ్చర్యరత్నములకు నమస్కార మనును. రాముఁ డేమనెనో చూడుఁడు.

"అహం సత్యం రామః శశిముఖి న మాయీ దశముఖో
రథం భ్రాతా మే త్వాం నయతి న చ సూతో నృపసుతే।
కృతం వాచా భూయ స్సరసిజపలాశచ్ఛవిముషా
కరాంగుళ్యా ధత్సే నను సకిరణం మండనమిదమ్॥"

(అంకము 7. శ్లోకము 32.)

దేవీ, నేను మాయావియగు దశాస్యుఁడను గాను, సత్యముగ రాముఁడను నిన్ను రథమునకుఁ గొంపోవువాఁడు నా తమ్ముఁడు లక్ష్మణుఁడు గాని సారథిగాఁడు. విశ్వసింపుము. ఇక మాట లేల? యని యాశ్చర్యాంగుళీయకమును జూపును. ఇట నాశ్చర్యమణిప్రభావమునకు బూర్వోత్తరసందర్భశుద్ధిఁ జూపుటకై రామునివిషయము సీత సంశయించునేమో యని తలఁచి రాముఁడు మాయాహారమగు నాయంగుళీయకమునుజూపునట్లు చిత్రించినాఁడు కవి. కాని నిజముగ రావణవధానంతర మట్టి సంశయమునకుఁ దావు లేకున్నను నితరరాక్షస మాయ యేదైన నగునేమో యని కాని రావణమాయ లాతఁడుచనిపోయిన పిదపఁ గూడ వెరపించునంతటి వని కాని తెలియఁ జేయుటకై కవి యిట్లు మణిప్రభావమునకు మరల ప్రసక్తిఁ గల్పించి నాటకమును సాంతముగా నాశ్చర్యఘట్టములతో నింపి ప్రేక్షకహృదయమును జూరగొన్నాఁడు. ఆశ్చర్యచూడామణియను నీ నాటకము వింతగొల్పు ఘట్టముల మార్పులచే నాశ్చర్యచూడామణియే కీలకముగాఁ గలదై వాస్తవముగ నాశ్చర్యచూడామణియై యలరారుచున్నదనుట సత్యదూరము కానేరదు.

ఆశ్చర్యచూడామణిలోని సూక్తులు

1. బహూనామసాధారణో దుర్గః పంథాః। (అం. 1-పుట 6.)
   (అసాధారణమార్గము అనేకులకు దుర్గమము.)
2. గుణాః ప్రమాణం న దిశాం విభాగః। (అం. 1-శ్లో 3.)
   (గుణములే ప్రమాణమగు గాని దిశావిభాగము కాదు.)
3. న సమాధిః స్త్రీషు లోకజ్ఞః (అం. 1-పుట 19.)
   (తాపసులకు స్త్రీవిషయక లోకవృత్తాంత జ్ఞానముండదు.)
4. అసదృశమివ శరణాగతస్య ఉపేక్షణం స్త్రీజనస్య (అం. 1-పుట 20.)
   (శరణపొందిన స్త్రీజనము నుపేక్షించుట తగదు.)
5. తపోభృతః క్వ తపసాం శత్రుః క్వ సంకల్పజః (అం. 1-శ్లో 9.)
   (తాపసులెక్కడ? తాపసశత్రువగు మన్మథుఁడెక్కడ? వారికి పొత్తు కుదురదని భావము.)
6. కిం స్నేహస్తులయతి గుణదోషాన్ (అం. 1-పుట 27.)
   (స్నేహము లేక ప్రేమ గుణదోషముల తూఁచూనా?)
7. న సంత్యగుణా గుణవతామ్ (అం. 1-పుట 35.)
   (గుణవంతుల కవగుణము లుండవు.)
8. సంతోషబాహ్యానామధర్మైకరతం మనః (అం. 1-శ్లో 16.)
   (సంతోషదూరులకు మనస్సు అధర్మైకరతము.)
9. ఏష లోకస్వభావః బహుపుత్రాణా మేకస్మిన్ ఈషత్పక్షపాతః (అం. 1-పుట 40.)
   (అనేకమంది కుమారులలో నొక్కనియందు పక్షపాతముండుట లోకస్వభావము.)

10. శ్రోతుర్విస్మయనీయ వస్తువిషయాః శైలాటవీసాగరాః (అం. 2-శ్లో 1.)
(శ్రోతలకు శైలాటవీసాగరవిషయములు విస్మయమును గూర్చుచుండును.)

11. అభిసరణమయుక్తమంగనానామ్ (అం. 2-శ్లో 3.)
(అంగనలకు అభిసరణము యుక్తము కాదు.)

12. న సంసర్గమర్హతి కుటుంబినాం అనర్గళః స్త్రీజనః (అం. 2-పుట 46.)
(గృహస్థులకు స్వైరిణులతో సంపర్కము తగదు.)

13. కథ మౌష్ణ్యమగ్నేశ్ఛాద్యతే (అం. 2-పుట 72.)
(నిప్పువేడిమి నెట్లు గప్పనగును.)

14. దాక్షిణ్యమృద్వీ జనతా శఠానాం వశవర్తినీ (అం. 2-శ్లో 18.)
(జనము సాధారణముగా దాక్షిణ్యముచే మెత్తనై యొప్పుచు దుర్మార్గులకు వశవర్తియై యుండును.)

15. తప ఏవ శాంతి రమంగళస్య (అం. 3-పుట 85.)
(అమంగళమునకు తపమే శాంతి.)

16. న మహర్షిశాసనముపేక్షణీయం (అం. 3-పుట 89.)
(మహర్షిశాసన ముపేక్షింపదగినది కాదు.)

17. అద్భుతదర్శనబహురసః ఖలు వననివాసః (అం. 3-పుట 91.)
(వననివాసమద్భుతదర్శనములచే బహురసము.)

18. హతాః స్త్రియః పాపే కర్మణి పండితానతిశేరతే (అం. 3-పుట 96.)
(పాడుస్త్రీలు పాపకర్మలందు పండితులను మించుదురు.)

19. యస్య నైసర్గికీ శోభా తన్న సంస్కారమర్హతి।
కః కలాం శశినో మార్ష్టి కౌస్తుభః కేన రజ్యతే॥ (అం. 3-శ్లో 24.)

(సహజముగ సుందరమగు దానికి సంస్కార మనవసరము. చంద్రకళ నెవఁడు శోధించును? కౌస్తుభము దేన నెర్రనగును.)

20. యత్ర శ్రియస్తత్ర నను ద్విషంతః (అం. 3-శ్లో 27.)
(సిరులెటనున్న నట శత్రువు లుందురు.)

21. న బాహవః ప్రమాణం పౌరుషస్య (అం. 3-పుట106.)
(పౌరుషమునకు బాహువులు ప్రమాణము కావు.)

22. కథం రక్ష్యో రక్షతి (అం. 3-పుట 107.)
(రక్షింపఁబడఁదగిన వాఁడెట్లు రక్షించగలఁడు.)

23. అనంతరగామినీ స్త్రీణాం లక్ష్మీః (అం. 3-పుట 108.)
(స్త్రీలలో లక్ష్మియే అనంతరుని వెన్నంటును.)

24. పరివర్తతే ప్రకృతి రాపది హి (అం. 3-శ్లో 29.)
(ఆపదయందు ప్రకృతి మారును గదా.)

25. సమాధీ రక్షతి స్త్రీజనం న బాణాః (అం. 3-పుట 110.)
(స్త్రీజనమును రక్షించునది శీలము కాని బాణములు కావు.)

26. తత్పూర్వదృష్టానాం కష్టః స్త్రీణాం సమాగమః (అం. 3-శ్లో 33.)
(ప్రథమదర్శనముననే స్త్రీల సమాగమము కష్టమగును.)

27. ప్రభవతి కుతోఽనర్థః ప్రజ్ఞా న చేదపథోన్ముఖీ (అం. 3-శ్లో 42.)
(ప్రజ్ఞ యమార్గమున పోనిచో ననర్థ మేల కలుగును.)

28. క్వ మనోభవః క్వ గుణసంగ్రహణమ్ (అం. 4-శ్లో 13.)
(కామమునకును గుణగ్రహణమునకును సామానాధికరణ్యములేదు.)

29. అవస్థయా బలమబలోఽపి నీయతే (అం. 5-శ్లో 4.)
(ఆబలుఁడును అవస్థచే బలవంతుఁడగును.)

30. నను సాధ్యాపేక్షః సాధనపరిగ్రహః (అం. 5-పుట 160.)
(సాధ్యాపేక్షముగదా సాధన పరిగ్రహము.)

31. సుజనః శంసతి పథ్యమేవ భర్తుః (అం. 5-శ్లో 23.)
(సత్పురుషుఁ డెన్నడును స్వామికి హితమునే వచించును.)

32. కథం వల్మీకాత్ హార ఉత్పద్యతే (అం. 6-పుట 167.)
(పుట్టనుండి హారము పుట్టునా?)

33. నూన ముచితం లోకోఽయ మాలంబతే (అం. 7-శ్లో 5.)
(లోకము నిజముగా నుచిత వ్యాపారము నూనును.)

34. నోపనతా శ్రీరవమంతవ్యా (అం. 7-పుట 210.)
(సిరి తనంతట వచ్చిన (వలదనరాదు) నవమానింపరాదు.)

35. తస్య లక్ష్మీర్నటస్యేవ ఛత్రచామరలక్షణా।
న బధ్నాతి ఫలం యస్మి న్నర్థినాం ప్రార్థనాలతా॥ (అం. 7-శ్లో 10.)
(అర్థిజనుల ప్రార్థనలత ఫలింపనిచో శ్రీమంతుని ఛత్రచామరలక్షణ మగు సిరి నటుని సిరివలె నయనప్రీతిమాత్రఫలమగును.)

36. సుఖాభిలాషీ స్త్రీభావః (అం. 7-శ్లో 12.)
(స్త్రీభావ మెప్పుడును సుఖము నభిలషించుచుండును.)

37. క్షీరాహుతిం చితాగ్నిః కథమర్హతి (అం. 7-పుట 218.)
(చితాగ్ని క్షీరాహుతి కెట్లు తగును?)

38. నామిశ్రం హిరణ్యం హిరణ్యరేతసమర్హతి (అం. 7-పుట 231.)
(చొక్కమైన బంగారమున కగ్నిశుద్ధి యనవసరము.)

39. కథం దీపికాం తమః కళంకయతి (అం. 7-పుట 231.)
(చీకటి దీపమును కళంకపరచగలదా?)

జానకీపరిణయము-రామభద్రదీక్షితులు

జానకీపరిణయ మను నాటకము సంస్కృతరామనాటకములలోఁ బేరొందిన వానిలో నొకటి. ఇది బహుచమత్కారవిలసితము, కథాగమనమునందును ప్రేక్షకదృష్టివిషయమునను నీ నాటకమువలె మరి యేనాటకము కూడ రచింపఁబడ లేదనుట యతిశయోక్తి కానేరదు. దీనిని విరచించినది రామభద్రదీక్షితులు. నాటకారంభమున సూత్రధారవాక్యములలో నభినేతవ్యరూపకప్రసంగమున,

"సరళో యత్ర సందర్భః సరసం చార్థబంధనమ్।
తన్నస్త్వయాభినేతవ్యం రూపకం నవనిర్మితమ్॥"
(అంకము 1. శ్లోకము 4.)

అని యుండుటచే నీ నాటకము సరసార్థబంధనమును, సరళసందర్భమును గలిగిన దని తెలియుచున్నది. ప్రస్తావనలో నీనాటకకర్తనుగూర్చిన నటీవాక్యములు, "దిష్ట్యా ఇదానీం అనుబోధితాస్మి ఆర్యేణ। యస్య ఖలు కావ్యబంధస్య కవిః మహానువాద్యజ్ఞరామదీక్షితాదుత్పన్నో అర్ణవాదివ చంద్రో రామభద్ర మఖీంద్రః" అని యుండుటచే నీ కవి సింధువువలనఁ జంద్రునివలె మహానుభావుఁడగు యజ్ఞరామదీక్షితునివలన జనించిన రామభద్రదీక్షితులు అని తెలియుచున్నది. మరియు సూత్రధారవచనమువలనను గొంత తెలియుచున్నది. సూత్రధారుఁ డేమనుచున్నాఁడో చూడుఁడు.

"యస్య స్తౌతి మతిం మనీషిసదసి శ్రీనీలకంఠాధ్వరీ
కౌండాజ్యోతిషికశ్చ యస్య కురుతే సమ్మానమార్యైః సమమ్।
యత్రానుగ్రహదృష్టిమర్పయతి చ శ్రీబాలకృష్ణో గురుః
సోయం దీవ్యతి చొక్కనాథమఖినామక్రీతదాసః కవిః॥"
(అంకము 1. శ్లోకము 8.)

ఎవ్వనిబుద్ధివిశేషమును శ్రీనీలకంఠదీక్షితులు విద్వత్సభలలో గొనియాడునో, కొండాజ్యోతిషికుఁ డెవ్వని నార్యసమ్మతముగఁ సత్కరించెనో, ఎవ్వనిపై శ్రీ బాలకృష్ణగురుఁడు నిజానుగ్రహమును బర్వఁ జేసెనో, ఎవ్వఁడు చొక్కనాథ మఖివర్యుల కక్రీతదాసుఁడో అట్టివాఁ డీ రామభద్రదీక్షితకవి యని యాతనిఁ బ్రశంసించెను. అంతకన్న నీ కవినిగూర్చి యీ జానకీపరిణయ నాటకమునఁ గోచరించుటలేదు. కాని ఈ రామభద్రుని గూర్చి సహృదయపత్రికలోఁ గొంత వ్రాయఁబడి యున్నది.

రామభద్రదీక్షితులు కుంభకోణమువద్ద కంద్రమాణిక్య మను గ్రామమునఁ జతుర్వేదియజ్వవంశమునకుఁ జెందినవాఁడు. కౌండిన్యసగోత్రుఁడు. ఈతని తండ్రి యజ్ఞరామదీక్షితులు, గొప్ప వైయాకరణుఁడు, ఈతని సహోదరుఁడు రామచంద్రదీక్షితులు సరసకవి. ఈ రామచంద్రకవి వెంకటాధ్వరికృతి యగు విశ్వగుణాదర్శమును బోలిన హాస్యపుఁ గృతిని కేరళాభరణమను దానిని వ్రాసెను. మన రామభద్రదీక్షితులు శ్రీబాలకృష్ణయోగికిని. చొక్కనాథునకును శుశ్రూషఁ గావించి సాహిత్యవేదాంతముల నభ్యసించెను. చొక్కనాథునికూతును బెండ్లియాడెను. నీలకంఠదీక్షితుల కవిత్వమే యీ రామభద్రదీక్షితున కుద్బోధము గావించి కవిత్వమున నొకవిధమగు పాటవమును గూర్చినది. నీలకంఠదీక్షితులును నీతనికవితాధారను మెచ్చుకొని విద్వత్సభలలో నీరామభద్రునిఁ గడుంగడుఁ బ్రశంసించుచుండెడివాఁడట. క్రమముగ నీతని శక్తిసామర్థ్యములు ప్రబలములైనాటి తంజావురాధీశ్వరుఁడగు షహాజీ (1684–1711 A.D.) కిఁ జెవులఁబడెను. మహోదాతయగు షహాజీనరేంద్రుఁడు రామభద్రునివంశస్థుల ప్రతిభాశక్తులఁ దిలకించి వారి కొక యగ్రహారమును కావేరీతీరమున షహాజీరాజపుర మను దానిని ధారాదత్త మొనర్చెను.

అప్పటినుండి రామభద్రదీక్షితులు షహాజీరాజపురము లేక తిరువశనల్లూరు అను గ్రామముననే స్థిరనివాసియై సుఖముగను శాంతముగను గాలము గడుపుచుండెను. ఈతఁడు శిష్యవత్సలుఁడు. ఈతని యంతేవాసు లీతని అయ్య లేక అయ్యాదీక్షితు లని పిలచెడివారట. ఈ రామభద్ర దీక్షితుఁడు శ్రీరామచంద్రమూర్తిభక్తుఁడుగ నుండి యనేకగ్రంథముల వ్రాసితుదకు పదునెనిమిదవశతాబ్దారంభమునఁ గాలధర్మము నొందెను.

ఈతని కృతియగు శృంగారతిలకభాణమునందు తన్ను గూర్చి 'యశ్చతుర్వేదయజ్వేంద్రవంశవారిధికౌస్తుభః, యస్య కందరమాణిక్యగ్రామో భవతి జన్మభూః' అనియు పేర్కొని యున్నాఁడు. ఈ శృంగారతిలకభాణమునందే మధురాపురీవర్ణనము, అందలి వీథీవర్ణనము చాల చమత్కారముఁగాఁ గన్నుల యెదుటఁ గట్టినట్లు వర్ణించుటచే నీకవి మధురాపురమునఁ గొంతకాలము వసించినట్లు తోచుచున్నది.

ఈ రామభద్రదీక్షితునిచే వ్రాయబడినగ్రంథములు పెక్కు గలవు కాని యిప్పటికి లభించినవి మాత్రము 1. జానకీపరిణయము, 2. పతంజలిచరితకావ్యమ్, 3. శృంగారతిలకభాణము, 4. రామచాపస్తవము, 5. రామబాణస్తవము, 6. రామాష్టప్రాసము, 7. పర్యాయోక్తినిష్యందము, 8. ప్రాసాదస్తవము, 9. విశ్వగర్భస్తవము, 10. తూణీరస్తవము. (ఇది యిప్పటికిని దొరకలేదు.) 11. విష్ణుగర్భస్తవము, 12. రామభద్రశతకము.

ఈతనిశైలి సరళమై మధురముగ నుండును. ద్రాక్షాపాకమున వైదర్భీరీతి నలరారుచుండును. తేనె సోనలం బోలె చవులూరఁ జేయు నీతని కవితాస్రవంతిని కర్ణపేయముగఁ గ్రోలి సర్వులును ముద మందుదురు. ఈతని జానకీపరిణయనాటకము ధీరోదాత్తనాయకుఁడగు

శ్రీరామచంద్రమూర్తిని గురించి సప్తాంకపరిమితముగ నిజచమత్కృతులతో వాల్మీకిరామాయణకథానందర్భముల నచ్చటచ్చట మార్చి యతిరమణీయముగ నిర్మింపబడిది. రామకథానాటకములగు మహావీర, అనర్ఘరాఘవ, బాలరామాయణాదులకన్న మేటి దనిపించు నంతటి రసవంతముగఁ గూర్చి వ్రాయఁబడి యిది పఠితలకుఁ బ్రేక్షకులకును మానసోల్లాసమును గూర్చు ననిన సత్యదూరము కానేర దనుకొందును. ఈ జానకీపరిణయనాటకమే యీతనికి పేరుప్రతిష్ఠలఁ దెచ్చినది. ఈతని శృంగార తలకమునకే అయ్యాభాణ మని నామాంతరము గలదు. ఇందు మధురాధివాసియగు భుజంగశేఖరుని శృంగారవిలాసములు వర్ణింపబడినవి.

ఈ రామభద్రుని సమకాలికులలో ముఖ్యముగఁ బేర్కొనఁ దగినవారు వేంకటకృష్ణుఁడు. శ్రీధరుఁడు. వేంకటేశుఁడు. అప్పాదీక్షితుఁడు, మహాదేవుఁడను వారలు. వీరందరును మహాకవులై యనేకములగు గొప్ప గ్రంథముల రచించి కవికోటికీర్తులఁ బడసిరి.

ఈతనిశిష్యులును పలువురు మేధావులు కలరు. వారిలో వేంకటేశ్వరుఁడు భూమినాథుఁ డనువారు ప్రశంసాపాత్రులుగా నున్నారు. వేంటకటేశ్వరుఁడను శిష్యచూడామణి పాతంజలచరితమునకు వ్యాఖ్యానము వ్రాసెను. భూమినాథుఁడు నల్లాదీక్షితుఁ డనియుఁ బిలువఁబడుచుండి ధర్మవిజయచంపు వను కావ్యమును షహాజీరాజచరితమునే నవీనభోజుఁ డని యారాజును వర్ణించుచు రసవంతముగ రచించెను.

జానకీపరిణయ కథాసంగ్రహము

ప్రథమాంకమున శుకుఁడు సారణుఁ డను నిరువురు రావణానుచరులు జానకీపరిణయవృత్తాంతమునుగూర్చి ముచ్చటింతురు.

శుకుఁడు సీత రాముని వరించిన దనియు, జనకుఁడు రావణభయమునఁ గౌశికుని లగ్నకునిగఁ గోరి కౌశికాశ్రమమునకే కన్యాసహితముగ నేగె ననియు, కౌశికుఁడును సపుత్రదారముగ దశరథుని నిజయజ్ఞమిషమున నాహ్వానించి సీతాకల్యాణము నెరవేర్ప నెంచినట్లు నుడువును, రావణపక్షపాతి యగు సారణుఁడు కుపితుఁడై కౌశికుని, ఆతనియనుచరులగు రామాదులను తాటకసహాయమున మాయముచేసినచో, సీత, రాముఁడు మరణించె నని విశ్వసించి, రావణుని బ్రేమించు నని యొక యుపాయము నన్వేషించును. ఇంతలో పరశురామునివాక్యానుసారము రావణునిచేఁ బంపఁ బడి కౌశికయజ్ఞధ్వంసయత్నమున నున్న మారీచుని వారించుటకుఁ బోవుచున్న తాటకను మార్గమధ్యమునఁ గలసికొని తనయుపాయమును దెల్పి తాను లంక కేగి రావణవిద్యుజ్జిహ్వుల నిద్దరఁ గ్రమముగ రామకౌశికవేషములఁ దాల్చి కౌశికాశ్రమమునకుఁ దరలవలయు నని చెప్పుదు ననియు, తాటకను అయోధ్యామార్గమధ్యమున కౌశికాదుల మాయము జేయు మనియు నుడివి తాటకను బంపి తాను లంక కరుగును. ఆ ప్రకారమే సారణుఁడు చేయరావణవిద్యుజ్జిహ్వులు రామకౌశికవేషము లూని కౌశికాశ్రమమున నున్న జనకుని కడ కరుగఁ బయనమై కౌశికాశ్రమముచెంత యదృశ్యరూపమున నిల్చి యాశ్రమ శిష్య లిరువురు 'విశ్వమిత్రుఁడు సపుత్రదారముగ దశరథుని నిజాశ్రమమున కాహ్వానింప నయోధ్య కేగె ననియు, జనకుఁడు సీతాకల్యాణవిషయమున నాందోళనపడుచున్నాఁ డనియు', మాటాడుకొనుచుండుసంభాషణమును విని, యా శిష్యులాశ్రమమున కేగగ వీరును (రావణవిద్యుజ్జిహ్వులు)' చెంతనున్న మామిడి తోటలో విడిసి ముందేమి చేయవలయునో అలోచించుచుందురు.

ద్వితీయాంకమున జనకుఁడు కౌశికాశ్రమమునకు సీతతో వచ్చియుండును. ఒకనాఁడు సీత కలలో శ్రీరామచంద్రునియాకారమును

గాంచును. మరునాఁ డుదయముననే యాశ్రమసమీపోద్యానమునఁ గూర్చుండి రాముని మూర్తిని చిత్రపటమున లిఖింపఁ దలంచుచు చెలికత్తెలతో సంభాషించుచుండును. చెలికత్తెలు చిత్రలేఖనమునకు వలయు పరికరములఁ దెచ్చుట కాలస్యము చేయుదురు. ఇంతలో నీ సంభాషణమును రావణవిద్యుజ్జిహ్వులు మాటుననుండి వినుచు, సీత రాక్షసాంధంకరణి యను కంకణమును ధరించియున్నట్లు తెలిసి కొందురు. సీత రామపటమును లిఖించి వినోదించుచుండును. రావణాదు లాపటము రామపట మని యెరుంగుదురు. రావణుఁడు సారణు నెటులైన సీత యొద్దనున్న యా రాక్షసాంధంకరణి యను కంకణమును అపహరింపఁ గోరును. సారణుఁడును నొక బ్రాహ్మణబ్రహ్మచారివేష మూని తాను రామప్రియవయస్యుఁడనని సీతకు నుడివి రాముఁడొకటి రెండు దినములలో నటకురాఁ గలఁ డనియుఁ దెల్పును. అందులకు సంతసించి సీత తన కంకణముల నూడ్చి సారణహస్తముల నిడును. ఇంతలో అనసూయా సహితుఁడై యత్రిమహర్షి వచ్చెనని వారికి వందన మాచరింప జానకిని రమ్మని జనకుఁడు పిలువ నంపును. జానకియు తండ్రిమాట విన్నంతనే చిత్రపటమును సైతము తొందరలో మరచి యాశ్రమమున కేగును. అట ననసూయాదులకు వందనము సల్ప, నత్రి 'అఖిలక్షితభర్తృగామినివి గ' మ్మని ప్రీతి నాశీర్వదించును. అనసూయయు, 'మనోభీష్టము నందుము' అని దీవించి దివ్యాంగరాగచీనాంబరములను నొసఁగి, వాని నలంకరించుకొనినచో యక్షరాక్షసపిశాచాదిభయము గలుగ దనియు, శీలము నశింప దనియు దీవించును. సీతయు మరల వారలకు నమస్కరించి వారిని వీడ్కొని రామగమునమునకై నిరీక్షించుచుండును. రావణాదులును చిత్రపటమును గొని మరొకస్థలమున కేగి యాలోచింతురు.

తృతీయాంకమున విశ్వామిత్రుఁడు దారపుత్రసహితుఁడగు దశరథునితో బయలుదేరి నిజాశ్రమమునకు వచ్చుచుండును. తాటకయు మారీచ సుబాహులును వారి నెదుర్కొని పోరుదురు. ఆ పోరున తాటకయు సుబాహువును మరణింతురు. మారీచుఁడు రామునిదెబ్బ తప్పించుకొని పారిపోవును. మారీచానుచరుఁడు కరాళుఁ డనువాఁడు రామపరాక్రమము తిలకించి వెరచి మారీచునితోఁ గలసి యొక మాయ పన్నును. వారు కౌశికాశ్రమమునకు రాముని జేరకుండఁ జేసినను, మోసముచే రాముఁ డు హతుఁడైనను రావణునకు సీతను బెండ్లాడు నవకాశ ముండు నని యందులకై రామున కపకారముఁ గావింప నేగుదురు.

దశరథాదులు విశ్వామిత్రాశ్రమమునకు రెండు క్రోసుల దూరమున విశ్రమించి యుందురు. రాముఁ డొంటరిగ వేఁట కరుగును. అదియ యద నని మారీచకరాళులు మాయచేఁ గరాళుఁడు రామమిత్రుఁ డగు పింగళకుఁడుగను, మారీచుఁడు కౌశికశిష్యుఁ డగు కౌశ్యపుఁడుగను వేషములఁ దాల్తురు. కరాళుఁడు పింగళకవేషము చక్కగ నిర్వహించును. ఇంతలో మారీచుఁడు నిజమాయచే నొక మాయాసీతను రామవిరహమున నున్నదానినిగఁ గల్పించును. పింగళకుఁడు సీత రామునిపై గాఢానురాగము గలది యని తాను కాశ్యపునివలన వినినట్లు రామునితో నుడువ రాముఁ డును తన ప్రేమను సీతావిషయకముగఁ దెల్పును. ఇట్లు సంభాషించుకొనుచు వారొక వకుళవృక్షముక్రిందఁ గూర్చుండి యుందురు. వారికి సమీపముననే మారీచుఁడు మాయాసీతను, చెలికత్తెలతో సంభాషించుచు రామునిగూర్చి ముచ్చటించునట్లు మాయను బ్రవర్తింపఁ జేయును. రాముఁడు వారిమాటల నాలకించుచుండును. పింగళకుఁడు రాము నాకన్యచెంత కరుగ వలదని వారించును. అదిగాంచి మారీచుఁడు

పింగళకుని సత్యముగ రామమిత్రుఁ డగు పింగళకుఁడని భావించును, పింగళకుఁడు మాత్రము మారీచుఁ డనుకొనినట్లు మాయాసీతను గల్పించినాఁ డని రాముని వంచింప నా కన్య సీతయే యైయుండు ననియు, కౌశికాశ్రమము సమీపముననుండుటచే సీతయే యనియు రామునికిఁ దెల్పును. కాని రాముఁ డాతనిమాటల విశ్వసింపలేదు. ఇంతలో సత్యముగ విశ్వామిత్ర శిష్యుఁడు కాశ్యపుఁడు అటకు రాగా మాయాపింగళకుఁ డాతని గలసికొనఁ బోవును. ఇంతలో మాయాకాశ్యపుఁడు (మారీచుఁడు) ను రాముని సమీపింప రాముఁడాతని నా గోచరించు కన్య సీతయేనా యని యడుగ నౌనని తెల్పును. రాముఁ డాతనితోఁ బింగళకుఁ డిప్పుడే యతని (కాశ్యపుని) వెదకుచు నేగె నని నుడువును. అంత నా మాయాకాశ్యపుఁ డును రాముఁడును ముచ్చటలాడుచు నటఁ గూర్చుందురు. ఇంతలో సత్యపింగళకుఁడు రాగా మాయాకాశ్యపుఁ డాతనిని కరాశుఁ డని తలంచి మాటాడును. సత్యపింగళకుఁ డాతని ననుమానించి యది యంతయు రాక్షసమాయ యని రామునికిఁ దెల్పును. మాయాకాశ్యపుఁడు (మారీచుడు) వచ్చిన సత్యపింగళుఁడు మాయావి యగు నెవ్వఁడో రాక్షసుఁడు తనకపకృతిఁ గావింప నా పింగళాకృతిని వచ్చి యుండు నని రామునకు నుడువును. రాముఁ డామాయాకాశ్యపవచనముల నమ్మి సత్య పింగళుఁడు వేరుగ వచ్చునని కొంతతడ వా సీతావ్యామోహమగ్నుఁడై యటనే యుండును. మాయాపింగళకుఁడు సత్యకాశ్యపుని గలసి యతఁడు మారీచుఁ డనుకొని స్వేచ్ఛగా మాటాడును, కాశ్యపుఁ డతనిసందేహించి విడువు మన నా కరాళుఁ డాతనిపైఁ బడ సత్యకాశ్యపుఁడు శరణువేడుచు రామునిచెంతకు వచ్చును. ఇప్పుడు రామునియెదుట నిద్దరు కాశ్యపులు నిద్దరు పింగళకులు నుందురు. రాముఁ డచ్చెరువొంది సంశయగ్రస్తుఁ డగును. సత్య

కాశ్యపుఁడు తనవేషముఁ దాల్చి మారీచుఁడు మోసగించెనని రామునితో నుడువును. మాయాకాశ్యపుఁడు నట్ల నుడివి యితరుని జంపు మన రాముఁ డు దిజ్మూఢుఁడై నిలుచును. ఇంతలో మారీచుఁడు మరొక మాయ పన్ని యొకచెలి, రావణుఁడు జనకుని జంపి సీతను బలాత్కారముగఁ గొంపోవచ్చుచున్నాఁడనియు, హృదయభేదకమగు నా వార్త విని తనచెలులతో, సీత యగ్నిలోఁ బడి యసువులఁ దొరగవలయు నని యున్నదనియు, రామునకు విన్నవించునట్లు చేయును. ఈ మాయావ్యామోహపాశబద్ధుఁడై రాముఁడును సీతావియోగము సైపలేక యొక కొండనెత్తము నెక్కి యటనుండి భృగుపాత మొనర్ప సంకల్పించును. సత్యకాశ్యపుఁడును, సత్యపింగళకుఁడును రాము నట్లు చేయ వలదని వారింతురు. మాయవా రిరువురును రాముఁడు చచ్చును గదా యని సంతసింతురు. అత్తరి తటుకున రాముఁడు భృగుపాతమొనర్ప నిలిచిన రాయి యహల్యగా మారును. నిజరూపము తనకుఁ బ్రసాదించినందుకు రాము నామెకొనియాడును. ఇంతలో కరాళమారీచులు లేడిరూపములు దాల్చి పరుగిడి పోవుదురు. రాముఁ డహల్యను తనస్నేహితు లెవరని యడుగ నట నున్నవారే యనియు పారిపోయినవారు కరాళమారీచరాక్షసులనియుఁ నామాయ వారిదే ననియుఁ దెల్ప రాముఁడు సిగ్గిలి మిత్రుల క్షమింప వేడును. ఇంతలో పరివారమంతయు రాగా వారందరును కౌశికాశ్రమమున కేగుదురు.

చతుర్థాంకమున తాటకావధమున సంతుష్టుఁడై దేవేంద్రుఁడు చిత్రాంగదుఁ డను గంధర్వు నొక్కని రావణవృత్తాంతము లంకకుఁ బోయి కనుగొని రమ్మని పంపెను. లంక కేగి యట నొక రాక్షసివలన

రావణుఁడు సీతాకల్యాణమున సీతను బెండ్లాడుటకై సారణవిద్యుజ్జిహ్వులతో బయలుదేరి రావణుఁడు, రామవేషమునను, విద్యుజ్జిహ్వుఁడు విశ్వామిత్రవేషమునను, సారణుఁడు లక్ష్మణవేషమునను, కౌశికాశ్రమమునను న్న జనకుని వంచింప నట కరిగినట్లు తెలిసికొనును.

జనకుఁడు రామునికన్న ముందు రావణుఁడు సీతను వరించి ప్రార్థించినచో నేమి చేయుదు నని విచారపడుచున్న సమయమున శతానందుఁడు 'విచారపడవల' దనియు, విశ్వామిత్రుఁడు తప్పక తరుణమునకు వచ్చి రామునకే సీత నిప్పించు ననియు విశ్వాసము గదుర నుడువును. ఆ సమయమునకు రావణ సారణవిద్యుజ్జిహ్వులు రామలక్ష్మణకౌశికాశ్రమమునకు రాగా శతానందుఁడు వారిని యథావిధి నాహ్వానించి సత్కరించును. రావణసారణులేదియో రహస్యముగ మాటాడుకొనుచుందురు. విద్యుజ్జిహ్వుఁడు ద్వారముకడనే నిలిచి దశరథాదులరాక నెదురుచూచుచుండును. జనకుఁడు కన్యకాజనమును విశ్వామిత్రపాదాభివందనమునకై తోడ్కొని రమ్మని యొక సేవకునిఁ బంపును. సీతను కన్నులారఁ గాంచు నవకాశము గల్గుచున్నదని యువ్విళ్ళూరుచు రావణుఁడు సీత నెదురుచూచుచుండును. అప్పుడే చిత్రాంగదుఁ డటకు వచ్చి యాకసమునుండియే రావణసారణ విద్యుజ్జిహ్వులు, రామలక్ష్మణకౌశికవేషములతో సీతాకల్యాణవిషయమున జనకుని వంచింప నేతెంచి యున్నారని గట్టిగా కేక వేసి హెచ్చరించును. శతానందాదు లచ్చెరువంది యేమి చేయుటకుఁ దోచకుందురు. ఇంతలో సత్యకౌశికుఁడు. సత్యరామలక్ష్మణులతో నటకు వచ్చును. రావణాదులు మువ్వురును తిరస్కరిణీవిద్యచే నదృశ్యులయి యటనే యుందురు. జనకాదుల కనుమానము తీరకుండును. సత్యరామాదులెవ్వ రని గుర్తింప

నలవి కాకుందురు. కౌశికుఁడు రామపరాక్రమమును తాటకాంతకుఁడని ప్రశంసించి జనకుని శివధనుస్సును దేఁ గోరును. జనకుఁడద్దానివి తెప్పింప రాముఁ డందుకొని యెక్కుపెట్ట నది భగ్న మగును. అదృశ్యులుగ నున్న రావణాదులు ఖిన్ను లగుదురు. శతానందాదులు హర్షింతురు. ఇంతలో దశరథుఁడును విచ్చేయ కల్యాణమహోత్సవము మిక్కిలి వైభవముగ జరుగును.

పంచమాంకమున తమయత్నము లన్నియు విఫలములు కాగా రావణుఁడు తనవారితో లంకకు తిరిగి వచ్చును. పరశురాముని గలసికొని శివధనుస్సును రాముఁడు భగ్న మొనర్చెనని నుడివి యాతనిపైకిఁ బరశురాముని పురికొల్పి పంపును. పరశురాముఁడును శ్రీరామునిచే భంగపడి వెడలిపోవును. భార్గవభంగమును విని రామపరాక్రమును సైపలేక రావణుఁడు విద్యుజ్జిహ్వాదుల నయోధ్యకుఁ బంపి మాయలఁ బన్ని రాముని దండకాటవి కరుగునట్లు చేయఁగోరును. దశరథుఁ డయోధ్యలో రామయౌవరాజ్యపట్టాభిషేకమహోత్సవమునకై గొప్పగ నేర్పాటులు గావించుచుండును. ఆ యదను ననుకూలించుకొని విద్యుజ్జిహ్వాదులు అయోధ్యఁ జేరి యట దశరథ, కైకేయి, మంథరల శరీరములందుఁ బ్రవేశింతురు. మంథర కైకను తనకు వాగ్దానము చేసిన రెండు వరములను రాజును గోరు మని పురికొల్పును. కైకయటులే దశరథుని నిర్బంధముగఁ గోర రాము నట్లే యరణ్యమున కంపును. రాముఁడు సీతాలక్ష్మణసమేతముగా దండక కేగి పంచవటియం దుండును, విరాధశూర్పణఖలు ఖరరావణాదేశముల వలన రాముని వధింపను, సీత నపహరింపను పొంచి వేచి యుందురు. ఇరువురును నొండొరుల పనులు శక్యము కావని యెన్నుచు వెడలిపోదురు. విరాధుడు సీత నపహరింపఁ గోరును. శూర్పణఖ సీత వేష మూని రాముని బ్రేమింపఁగోరును.

రామాదు లడవి కేగినవిషయము బాధింప దశరథుఁడు క్రమముగఁ గృశించి మరణించును. భరతుఁడు రామసన్నిధి కేగి యతని మెప్పించి వేడుకొని పాదుకలఁ దెచ్చి, యయోధ్యయందుఁ బ్రతిష్ఠించి శత్రుఘ్ను నా పాదుకల బదులుగ రాజ్యము నేలుమని నుడివి తాను నందిగ్రామమున కేగి యట తాపసియై యుండును.

రావణశాసనమున ఖరుఁడు రాముని సంహరింప విరాధుని నియమించును. విరాధుఁడు రామాశ్రముచెంగటనుండి యవకాశమునకై వేచి యుండును. సీతారాము లొక కొండనెత్తమున విలాసముగ సంభాషించుకొనుచు ప్రకృతిసౌందర్యములఁ దిలకించుచుందురు. శూర్పణఖయు నటకు వచ్చి యుండును. విరాధుఁడు రామవేషమును శూర్పణఖ సీతావేషమును దాల్తురు. సీతారాములును, ఆశ్రమముననుండి లక్ష్మణుఁడును వీరెవ్వరో రాక్షసు లిట్లు చేయుచున్నారని యరయుదురు. సీతారామవేషముల నున్న శూర్పణఖావిరాధులు పరస్పర మన్యుల వంచించితి మనుకొందురు. రామవేషమున నున్న విరాధుని సత్యరాముఁ డని శూర్పణఖయు, సీతావేషమున నున్న శూర్పణఖను సత్యసీత యని విరాధుఁ డును నమ్మి పరస్పరము వంచింప నెంచుచుందురు. ఈ మాయాసీతారాములు సప్రేమముగ సంభాషింతురు. మాయసీత పూలు గోయుచుండును. కొంతసేపటి కలసి యొక సంపంగికొమ్మనుండి పూలఁ గోయ కుతూహలపడి యా శాఖయందకపోవుటచే మాయారాముని తనవీపుపై నెక్కి యాపూలఁ గోయ మనును. మాయారాముఁడు తానే వంగి తనవీపు మీఁద నెక్కి యామెనే పూలఁ గోసి కొమ్మనును. పరస్పరము వా రొండురుల నాకసమున కెత్తికొని పోఁదలఁచి యట్లభినయించి పూలుగోయుచు శూర్పణఖ పాదములతో నాతని బొదివి పైకెగసి పోవుచుండును. వీరిరువురును పరస్పరవంచనమున గెలిచితి మనుకొని పోవుచుందురు.

త్రోవలో నాకసమున జటాయువు వారికి గోచరించి బెదిరించినంత వారిరువురును నేలఁ గూలుదురు. సత్యసీతారాములును లక్ష్మణుఁడును దీని నంతయుఁ దిలకించుచుందురు. లక్ష్మణుఁ డా శూర్పణఖా విరాధులనుగూర్చి పరస్పరము వంచితులై రన వా రొండొరుల నరసికొందురు. అంత లక్ష్మణుఁడు జటాయుసాయమున విరాధునితోఁ బోరి వానిని సంహరించును. శూర్పణఖను జటాయువచనమున ముక్కుచెవులు కోసి విడుచును. అంత విరాధవధ నెరింగి ఖరుఁడు రాము నెదుర్కొన వచ్చి ససైన్యముగ హతుఁడగును. జటాయువు కూడ వెడలిపోవును.

షష్ఠాంకమున అనలాసంపాతులు, (విభీషణునికూతురు, మంత్రి) సంభాషించుచు రావణుఁడు ఖరమరణానంతరము, మారీచుని బంగరులేడిరూపమున సీతారాములఁ బ్రలోభించి, రాముని దవ్వులకుఁ గొంపొమ్మని యాదేశించిన, నతఁడట్ల చేయ రాముఁ డా మాయలేడిని వెన్నంటి పోయినట్లును, లక్ష్మణుఁ డతని వెదుకఁ బోయినట్లును, సీత యొంటిగ నుండ రావణుఁడు భిక్షుకకవేషమున వచ్చి యామె నెత్తుకొని పోవుచుండ జటాయువు త్రోవలో నెదిరించి పోరి మడిసె ననియు, సీత నా రావణుఁడు లంకలో నశోకవనమున రాక్షసీరక్షితగ నుంచె ననియుఁ దెల్పుదురు. మారీచుఁడు కూడ రామునిచే హతుఁడయ్యె ననియు, నప్పటికి సీత యేఁడు మాసములుగా నశోకవనమున నున్న దనియుఁ గూడఁ దెల్పుదురు. మరియు, రావణునకు సీతాపహరణము నాటినుండి రామవృత్తాంతము తెలియుట లేదనియు, నతనితోఁ బ్రత్యక్షముగ నుడువ నెల్లరు వెరచుచున్నా రనియు, శుక్రాచార్యుఁడు సీతాపహరణాది వాలివధాంతము గల కథ నొక నాటకముగ రచించి రావణసన్నిధి నాడింతు రనియు మడువును. అనల, సీత, వీరిరువురును రాక్షసాంధంకరణమణి

వలయముల (మున్ను సారణుఁడు సీతనుండి విశ్వామిత్రాశ్రమము చెంత గ్రహించినవి) ధరించి నాటకమును విలోకింతురు. వీరుమాత్ర మొరులకుఁ గానరాకుండ సర్వము జూచుచుందురు. సీతావియోగమునఁ బరితపించుచున్న రామపాత్రను జూచి సీత మరింత దుఃఖించుచుండును. అనల యామెకు నాటకమున నూరట గల్గఁగల దని యోదార్చుచుండును. ఆ నాటకమున రాముఁడు సీతకై వెదకుచుఁ బరితపించుట, జటాయుసమాగమము, కబంధవధము, గంధర్వవేష మూని కబంధుఁడు ఋశ్యమూకమునకుఁ ద్రోవఁ జూపుట, పంపాతీరమున హనుమంతుఁడు భిక్షురూపమునఁ గలియుట, సుగ్రీవాదివృత్తాంతము హనుమంతుఁడు రామునకుఁ జెప్పుట, వాలిదౌష్ట్యము, రాముఁడు దుందుభికాయము పాదాంగుష్ఠమునఁ జిమ్ముట, సప్తతాళభేదనము గావించి నిజపరాక్రమముఁ దెలియఁ జేయుట, సుగ్రీవసఖ్యము, వాలిని సంహరించుట, సుగ్రీవపట్టాభిషేకము, సీతాన్వేషణమునకై కపివరులు వెడలుట. హనుమంతుఁడు లంకఁ జేరుట, మున్నగు నంశములు అచ్చరలచేఁ జక్కగఁ బ్రదర్శింపఁబడును. రావణుఁడు కోపించుకొని, హనుమంతుని లంకలోనికి రాకుండ లంకను రక్షింప నాజ్ఞాపించి వెడలిపోవును. అనలాసీత లిరువురును తమ తమ స్థానముల కరుగుదురు.

సప్తమాంకమున శూర్పణఖాసంపాతులు మాటాడుచు సముద్రముపై సేతుపుఁ గట్టి రాముఁడు లంకకు వచ్చి రావణుని సంహరించెననియు, విభీషణునకుఁ బట్టముఁ గట్టె ననియు, సీత యగ్నిని బ్రవేశించి నిజపాతివ్రత్యమును జూపి శుద్ధురాలయ్యె ననియు, సీతారామాదులు అయోధ్య కేతెంచుచున్నట్లు హనుమంతునిమూలమున భరతునకుఁ గబురంపుచున్నారనియుఁ దెలియఁ జేయుదురు. శూర్పణఖ సైపోపలేక భరతునకు హనుమంతుఁడు సీతారామవృత్తాంతమును దెల్పుటకుఁ

బూర్వము, భరతున కేదేని యసత్యము నుడివి ప్రాణముల దొరగునట్లు చేయ సంకల్పించి తోడ్తో బయలుదేరి పర్ణాదిని యను తాపసివేషమూని భరతుచెంత కేగి రామలక్ష్మణులును, వారి స్నేహితులును నందరును మడిసి రని నుడువును, భరతుఁ డామె వాక్యములు సత్యములుగ భావించి తానును శత్రుఘ్నుఁడును నగ్నిని బ్రవేశింప సంసిద్ధులగుచుందురు. సరిగా నా సమయమునకే హనుమంతుఁడు వేగమ వచ్చి రామవిజయమును దెల్పి త్వరలో నటకురాఁ గల రనుశుభోదంతమునుడివి భరతు నానందింపఁ జేసి పర్ణాదిని రాక్షసి యగు శూర్పణఖ యని నుడువును. జనకుఁడు నత్తరి నటకు వచ్చి భరతు నాశ్వాసించును. ఇంతలో రాముఁడు సీతాలక్ష్మణులతోడను మిత్రబృందముతోడను వచ్చును. రాముఁడు భరతు నాలింగనము గావించికొనును. పిదప వారందరు నయోధ్య కేగ, నట వసిష్ఠవిశ్వామిత్రాదులు శ్రీరామునకుఁ బట్టాభిషేకము గావింతురు. ఎల్లరు సంతసింతురు. భరతవాక్యమున నాటకము సుఖాంతముగా ముగియును.

నాటకవిషయము:- ఈ రామభద్రదీక్షితుని 'జానకీపరిణయ' నాటకము సంస్కృతభాషావిదులకుఁ జాల పరిచితమై విశేషముగ మేటినాటక మని పొగడబడుచున్నది. ఇది ఆంగ్లనాటకకర్తయైన షేక్స్పియర్ మహాకవిరచించిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ (Comedy of Errors) ను బోలియున్నది. రెండు జతలు పాత్రలు, ఒకరు సత్యరూపులు, మరొకరు మాయారూపులు నీ నాటకమున ప్రవేశించి కొంత గందరగోళమును గలుగఁ జేయుదురు. ఇతరులకేకాక వారిలో వారికిఁ గూడ నొకరి నొకరు గుర్తింప లేనంతటి చమత్కారవేషభాషలతో నటించి కలవరపరతురు, విద్యుజ్జిహ్వుఁడు, రావణుఁడు సారణుఁడు క్రమముగా విశ్వామిత్ర, రామ, లక్ష్మణుల రూపములను, శూర్పణఖ సీతారూపమును దాల్తురు. విరాధుఁడు రామవేషమును దాల్చును. కరాళమారీచులు

పింగళకకాశ్యపవేషముల వహింతురు. ఇట్టి చమత్కారకల్పనలు మన యాంధ్రసారస్వతమందును గళాపూర్ణోదయాదిగ్రంథములందును గానవచ్చును. అందు రంభానలకూబర వేషములు రెండు జతలు గోచరింతురు. అట్లే యీ నాటకమున జతలు జతలుగా పాత్రలు ప్రవేశించి కలవరపెట్టుచు నాటకీయముగఁ బ్రేక్షకుల నానందింపఁ జేయుదురు. ఇట్టి జంటపాత్రల చిత్రించుట 8,9 శతాబ్దములవాఁడగు శక్తిభద్రుఁడు తన ఆశ్చర్యచూడామణియందును నిర్వహించియున్నాఁడు.

ఈ నాటకమున సీతాకల్యాణము జనకునిరాజధానియగు మిథిలయందు కాక విశ్వామిత్రాశ్రమముననే నిర్వహింపఁ బడును. కథావిషయము కొంతవరకు రావణాస్థానమున నంతర్నాటికారూపమునఁ దెలుపఁబడుచున్నది. ఈ యంతర్నాటికయందే రాముఁడు సీతాన్వేషణకై బయలుదేరుట మొదలుకొని వాలివధ పర్యంతము జూపబడుచున్నది. తుదియంకమున రాక్షసదుశ్చేష్టాపరిణామమున సర్వరాక్షసనిధనము గావింపఁబడినది. శూర్పణఖ తాపసీవేషమున భరతుని మోసగించి యగ్నిప్రవేశ మొనరించునట్లు చేయ సంకల్పించి యత్నించెను గాని సకాలమున హనుమానుఁడు వచ్చి మోదసందేశమును రామాగమనమును దెల్పి భరతుని గాపాడెను. రామపట్టాభిషేకముతో కథ మోదాంతముగ ముగియుచున్నది.

ఈ నాటక మిట్టి యద్భుతసన్నివేశములతోఁ గూడి నాటకరాజ మనిపించుచున్నది. ఈ రామభద్రదీక్షితులు బహుగ్రంథములను కావ్యనాటకాదులఁ దిలకించి, యా యా గ్రంథములలోని మేటి చమత్కారములును, అద్భుతములునగు విషయముల లెస్సగా గ్రహించి యా పాండిత్యముచే నీ నాటకమును అద్భుత తమముగఁ

జమత్కారవిలసితముగ రచించినట్లు తెలియుచున్నది. ఈతని శైలి, మృదుమధురమై ద్రాక్షాపాక మని నుడువఁదగు. ప్రత్యంకమందును, ప్రతిపాత్ర చిత్రణమునను. ప్రతివాక్యమునందును చమత్కృతి లేని దేదియు నిందుఁ గానరాదు. అంతర్నాటికావిషయ ముత్తరరామచరిత్రమునుండియు, శూర్పణఖ పర్ణాదినీవేష మూని భరతుని వంచించుట వేణీసంహారమున చార్వకమునివిషయమునుండియు గ్రహించి యుండును. రామాయణకథ యంతయు తీవ్రవేగమున, నెచ్చటను గమనమున కడ్డులేక చమత్కృతివిలసితములును, నద్భుతసందర్భములును గలిగి చక్కగా సాగినది. మొత్తముమీఁద నీ నాటకము రసవత్తమమనియే చెప్పదగును.

ప్రథమాంకమునఁబ్రస్తావనయందే రాఁబోవు మాయాపాత్రల జంటల విషయము నటీనటసంవాదముననే కలహంసవేషమున మాయచే కమలిని నపహరించు యత్నమును బేర్కొనుచు సీతాకల్యాణవిషయమున రావణుఁడు రామవేషమున వచ్చువిషయమును సూచించుచున్నాఁడు. శుకసారణసంభాషణమున జనకుఁడు రావణునకు భీతిలి రామానురక్తయైన సీతను రామునకు యొసఁగ నెంచి కుశధ్వజుని మిథిలయందే యుంచి తాను కౌశికయజ్ఞదర్శనవ్యాజమున సీతాసహితుఁడై కౌశికాశ్రమమున కేతెంచె ననియుఁ, గౌశికుఁడును యజ్ఞమిషముననే దశరథుని సపుత్రదారముగ నాహ్వానింప నయోధ్యకేగె ననియుఁ దెలియుచున్నది. ఈ కవి యీ నాటకమున చాల స్వతంత్రించి మూలాతిక్రమణము విశేషముగా గావించెను. జనకుఁడు సీతను వెంటబెట్టుకొని కౌశికాశ్రమమునకు వెళ్ళునట్లెందును నుడువఁబడలేదు. భవభూతి తన మహావీరచరితమున గుశధ్వజుఁడు సీతోర్మిళలతోఁ గౌశికాశ్రమమగు సిద్ధాశ్రమమున కేగినట్లును శివధనుర్భంగము గూడ నటనే నిర్వర్తింపబడినట్లును వర్ణించినాఁడు.

బహుగ్రంథద్రష్ట యగు నీ రామభద్రదీక్షితకవియు స్వీయానుభూతరామనాటక కథావిషయములను గూడ నలతిమార్పులచే మరింత సుందరములగున ట్లొనరించి యీ నాటకమునఁ గూర్చినాఁడు. అన్ని చక్కని విషయముల సందర్భము ఈ జానకీపరిణయమన్నను సత్యదూరము గానేర దనుకొందును. ఇట మన కవినేర్పు చూడుఁడు. విశ్వామిత్రునిమహిమమును వ్యంగ్యముగాఁ జాటుచున్నాఁడు. సీత రామునెడ ననురక్తయైన దనియు, వధూవరుల యిరువుర వంశప్రతిష్ఠలును బవిత్రములనియు నెరిగించి యా సంబంధమునకు మదిని మెచ్చి, వరోపసంగ్రహవిధి యందు, లంకాపతి యగు రావణునకు భీతిని. సృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేయుసాహసికుఁడగు విశ్వామిత్రమహర్షిని లగ్నకునిగాఁ గోరినట్లు నుడివియున్నాఁడు.

శ్లో॥"సా కన్యా భువనైకమంగళగుణే రామేఽనురక్తా స్వయం
శ్రుత్వా తజ్జనకేన చాభ్యుపగతం వంశప్రతిష్ఠావిదా।
కించానేన వరోపసంగ్రహవిధౌ భీతేన లంకాపతేః
సస్వర్గప్రతిసర్గసాహసనిధిర్యోగీకృతో లగ్నకః॥"

(అంకము 1. శ్లోకము 14.)

సీతను రామున కిచ్చి కల్యాణము సేయుకార్యమునందు విశ్వామిత్రుఁడే సమర్థుఁడని చెప్పకయే నుడువుచున్నాఁడు. విశ్వామిత్రుని యాగమునకు జనకుఁడు సీతతో నేగుట విశ్వామిత్రుఁడు నిజయాగమునకు దశరథుని సపుత్రదారముగ నాహ్వానించుట మొదలగు విషయము లన్నియు కవికల్పితములు. పరశురాముఁడు తన దాయాదుఁడైన విశ్వామిత్రునియాగమునకు విఘ్నము కలుగకుండఁ జేయుమని మాహేశ్వరుఁడగు రావణాసురుని బ్రార్థింప నాతనియాజ్ఞానుసారము తాటక కౌశికమఖవిఘ్ను మాచరించుచున్న మారీచుని వారింపఁ బోవుటయుఁ

గవికల్పితమే. ఈ కవీశ్వరునియూహలు చాల గొప్పవి. పూర్వోత్తరకథాసందర్భశుద్ధి లెస్సగాఁ బాటించుటకై యిట్టి కల్పనలఁ గావించి కథను చక్కగా సాగించెను. రాముఁడు మరణించినఁ గాని సీత రావణుని బెండ్లాడ దని సారణుఁ డూహించి కౌశికశ్రీరాములను గబళింపు మని తాటకను బ్రేరేచి తాను రావణుని రామవేషమున జనకునికడ కేగి సీతను గైకొను మని నుడివి వారినట్ల చేయఁ జూచును. తాటక సారణునితో రావణుఁడు సీతను బలాత్కారముగ గొనరాదా? ఏల ఈ రామవేషమును మాయావేషమును దాల్చి వంచించుట యని ప్రశ్నింపగా సారణుఁడు నుడువు సమాధానము చూడుఁడు,

"బలాదపహృతా సీతా నానురజ్యేద్దశాననే।
శైవప్రీత్యా చ జనకే తచ్చ నానుమతం విభోః॥"

(అంకము 1. శ్లోకము 20.)

బలాత్కారముగ నపహరింపఁబడినచో సీత దశాననునియెడ ననురాగముఁ జూపదు. మహేశ్వరప్రీతిచే రావణుఁడు జనకునియెడ నట్టి చేష్ట తా నాచరింప నొల్లడని తనరాజును వెనుకవేసికొని రాజభక్తిని చాటుచున్నాఁడు. మరియు బలాత్కరించుటకు రంభాశాప మొకటి కలదనియు రావణవిషయమును దెల్పుచున్నాఁడు.

"హఠాత్కృతాయా రంభాయాశ్శాపేన హిమవత్తటే।
అనిచ్ఛంత్యా బలాత్కారో న శక్యో రక్షసాం ప్రభోః॥"

(అంకము 1. శ్లోకము 21.)

మున్నొకపరి రావణుఁడు సనైన్యుఁడై హిమవన్నగమున నుండ నలకూబరుని చెంత కలంకృతయై యరుగుచున్న రంభను జూచి యామె కామింప కున్నను బలాత్కారముగ నామెచెట్టఁ బట్టి లాగి యామె నుపభోగించినట్లును, ననంతర

మావెు నలకూబరునకు జరిగినవిషయము నెరింగింప, నాతఁడు బలాత్కారముగ నకామలగు నన్యకాంతలఁ జేఁబట్టినచో శిరము సప్తధాభిన్నమగును గాక యని శాప మొసంగె నను రామాయణోత్తర కాండమందలివిషయమును గూడ సంగ్రహముగ నౌచితిని బాటించి వర్ణించినాఁడు. రామాయణమున నీ శాపవిషయ మిట్లున్నది.[1]

మోసముచే రావణుని వంచించి జనకుఁడు కౌశికయాగమిషమున కౌశికాశ్రమమున కేతెంచి యటకే రామునిరావించి యా యాశ్రమముననే రావణునకుఁ దెలియకుండ సీతారామవివాహముఁ గావింప నెంచిన జనకాదులకు మాయతోడనే రావణాదులును జనకుని వంచింప నెంచుట యెంతయుఁ జమత్కారము, వ్యాసుఁడు గూడ నొకచో 'మాయాచారే మాయయా వర్తితవ్యమ్' అని పేర్కొనియున్నాఁడు. ఈ విషయమే తాటక "విప్రలంభప్రవృత్తానాం విప్రలంభోఽపి యుజ్యతే" యనుచున్నది. మరియు నీ మాయావిషయ మంతయు తమకే తెలియు నని కూడ దశాననుఁ డనుకొని 'విజానాత్యహిరేవపదాన్యహేః' (పాముకాళ్ళుపామేయెరుగున్) అని

1. "ఏతచ్ఛ్రుత్వా తు సంక్రుద్ధస్తదా వైశ్రవణాత్మజః।
ధర్షణాం తాం పరాం శ్రుత్వా ధ్యానం సంప్రవివేశ హ॥ 52
తస్య తత్కర్మ విజ్ఞాయ తదా వైశ్రవణాత్మజః।
ముహూర్తాత్క్రోధతామ్రాక్షస్తోయం జగ్రాహ పాణినా॥ 53
గృహీత్వా సలిలం సర్వముపస్పృశ్య యథావిధి।
ఉత్ససర్జ యథా శాపం రాక్షసేంద్రాయ దారుణమ్॥ 54
అకామా తేన యస్మాత్త్వం బలాద్భద్రే ప్రధర్షితా।
తస్మాత్ స యువతీమన్యా నాకామాముపయాస్యతి॥ 55
యదాహ్యకామాం కామర్తో ధర్షయిష్యతి యోషితమ్।
మూర్ధా తు సప్తధా తస్య శకలీభవితా తదా॥" 56
(వాల్మీకిరామాయణం. ఉత్తరకాండ-26 సర్గః.)

నుడువుచున్నాడు. మాయావిషయమున విద్యుజ్జిహ్వాదులు తిరస్కరిణీవిద్యచే నదృశ్య లగుదురు. అదృశ్య లగుటయేగాక వారు సంభాషించుకొను మాటలుకూడ నితరులకు వినఁబడవట. మాయ, ఇంద్రజాలము మున్నగునవి కొన్ని తంత్రములందు హరమేఖలికాతంత్రాదులందుఁ బేర్కొనబడినవి కలవు. వానియం దదృశ్య లగుటకు తిరస్కరిణీ విద్యావిషయము మంత్రతంత్రసహితముగఁ గొన్నిప్రయోగములచే సాధ్యమగునట్లు నుడువఁబడియున్నది. కాని ఈ కవి తా నెట చూచెనోకాని, అదృశ్యులైన వారు మాటాడుకొనుమాటలును వినఁబడవట. ఇది యాశ్చర్యకరము.

ఇన్ని మాయలను బరిహరింపఁ గల సామర్థ్యము గూడ మహర్షులకుఁ గల దని వ్యంగ్యముగఁ గౌశికుని బ్రశంసించును. మారీచుఁడు వివిధమాయా విహారి యట. కౌశికునకుఁ బ్రతిభటుఁడుగ నియమింపఁబడె నట. అంతకంటె మాయావి విద్యుజ్జిహ్వుఁడు. విద్యుజ్జిహ్వారావణసారణులు ముప్వురును గ్రమముగ విశ్వామిత్ర రామ లక్ష్మణ వేషముల నూని కౌశికాశ్రమముచెంత కేగుదురు. అట సమయనిరీక్షణమునకై వేచి యుండ నాశ్రమశిష్యులు అచ్చటివిషయముల మాటాడుకొనుచుందురు. ఆ సంభాషణమున రావణునిపూర్వవృత్తాంతము వాలిచేతను, కార్తవీర్యార్జునిచేతను బరాజితుఁడైన విషయమును ముచ్చటింతురు. ఈ ప్రసంగమును కవి చాల నేర్పుతో నాటకారంభముననే వర్ణించినాఁడు. ప్రతినాయకుఁడగు రావణుని గుణశీలాదులను ప్రేక్షకులకుఁ దొలుతనే పరిచయ పరుప నెంచి కేవల మాతఁ డొక మాయలమారి యనియు, దుశ్శీలుఁ డనియుఁ దెలియఁ జేయుచున్నాఁడు. నాటకీయముగ నీ వర్ణన మెంతయో కథకు మెరుఁగిడుచున్నది. ప్రేక్షకచిత్తానందమే ప్రధానలక్ష్యముగ నెంచికొని ఈ రామభద్రదీక్షితు లీ నాటకమును వ్రాసినట్లు తోచుచున్నది.

మాటుననుండి యా యాశ్రమవటువుల సంభాషణము వినుచు తన్నవహేళన మాచరింప సైప లేక రావణుఁడు వారిని సంహరింపఁ బోయి వారింపఁ బడుటయు, తన్ను విద్యుజ్జిహ్వాసారణులు స్తుతించుటయే గాక తనకుఁ దానే కూడ స్తుతించుకొనుచున్నాఁడు. ఇది కేవలము వికత్థనత్వము, డాంబికము నగును. ధీరోద్ధతనాయకలక్షణము లిట్లు రావణునకు లెస్సగాఁ గూర్చి రావణపాత్రమును జక్కగాఁ జిత్రించినాఁడు.

ఈ ప్రథమాంకమం దంతయు నెత్తునకుఁ బైయెత్తుగా మాయాప్రయోగములచే గథను నడపించినాఁడు. కథాగమనము చాల వేగముగ సాగినది. మాయలచేఁ గన్గప్పి ప్రేక్షకుల నానందింపఁ జేయుచున్నాఁడు. రామాయణ కథకుఁ గొంత దూరమైన సన్నివేశముల నీ కవి కల్పించి యిందుఁ గూర్చినను నీ మాయలచే నవి మరుగుపరుపఁ బడిన ట్లగుచున్నవి. నాటకదృష్టిననుసరించి కథ చమత్కారముగనే సాగిన దనుటలో సంశయము లేదు.

ద్వితీయాంకమునఁ గౌశికాహూతులై యనసూయాత్రిమహర్షులు కౌశికాశ్రమమునకు దేవదత్తములగు చీనాంశుకాంగరాగములను గైకొని, సీత కొసఁగుటకై యరుగుదురు. వానిధారణమున రాక్షసులవలన భయము కలుగదు. నైసర్గికమగు సౌశీల్యము చెడదు. ఇట్టి వింతవస్తువుల ప్రశంస రామాయణమున నున్నది. కాని యిట సంర్భోచితముగ సీతకు వాని నిచ్చుటకు వచ్చినట్లు వర్ణింపబడినది. రామాయణమున ననసూయ యీ వస్తువులను సీతారామలక్ష్మణు లరణ్యవాసమున నున్నతరి నొసఁగినట్లు చెప్పబడియున్నది. కాని యిట సీతాకల్యాణమునకుఁ బూర్వమే చెప్పబడినను. రాక్షససంబంధము తొలుతనే కలుగఁ జేయుటచే నిట సందర్భోచితమై యెంతయుఁ దగియున్నది. జానకీ శీలపోషణమునను దృష్టి

నిడియే కవి యిట్టి మార్పు గావించినాఁడు. రాముఁడు సీతకుఁ గలలో గోచరించునట్లును, నాతనికై యామె విరహ మనుభవించునట్లును. విరహతాపశాంతికై సఖులు శైత్యోపచారములు సల్పునట్లును, ప్రియరూపము చిత్తరువున వ్రాయునట్లును. వర్ణించుట యంతయుఁ బ్రబంధఫక్కిని బోలిన వర్ణనములు హృద్యములుగా నున్నవి. విశ్వామిత్రాశ్రమప్రాంతారణ్యము నందనవనమును బోలిన రామణీయకమున నలరారుచున్న దని యాశ్రమవనమును వర్ణించును. ఆ వర్ణనసందర్భమున కవి నుడివినశ్లోకము కవి యనుభవముననున్న దక్షిణదేశోద్యానములశోభను దెల్పుచున్నది. దీనివలన కవి దాక్షిణాత్యుఁ డని కావేరీతీరవాసి యనియు వ్యక్తమగుచున్నది. శ్లోకముఁ దిలకింపుడు.

"పక్వాని ప్రచ్యవంతే క్రముకవిటపినాముచ్ఛ్రితానాం ఫలాని
స్పందంతే రాజరంభాః ఫలభరనమితా వాతి మందానిలోఽపి।
సంధృశ్యంతే విపాకచ్యుతమధురఫలవ్యాప్తమూలా రసాలా
భారేణామీ ఫలానాం యువతికుచభరస్పర్ధినో నాళికేరాః॥"

(అంకము 2. శ్లోకము 4.)

ఈ పోకచెట్లు, అరటిచెట్లు, మామిడిచెట్లు, కొబ్బరిచెట్లు విరివిగా దక్షిణదేశమున నున్న ట్టుత్తరదేశమున లేవు. కౌశికీతీరమునని తోటలగల్పించినను కవి దాక్షిణాత్యుఁడౌట నాతని యనుభవమున నున్నవానినే వర్ణించెను. కవి యనుభవ మిట్లు గ్రంథమున వ్యక్తమగుటయు వాఙ్మయతత్త్వము. మహర్షు లమేయ మహిమాన్వితు లనియే మనకవి యభిప్రాయము. మాయావులగు రాక్షసమాయలకుఁ బై మాయవలె రాక్షసాంధంకరణ మణికంకణముల సీతకుఁ గౌశికుఁడొసఁగి యామెరూపమును రావణున కగోచర మొనరించెను. ఈ కంకణములఁ

గోలుపోయిన సీతకు శీలభంగము కాకుండుటకై అనసూయచేఁ జీనాంశుకాంగ రాగముల నొసఁగఁ జేసినాఁడు. సారణుఁడు రామమిత్రునివేషమున నా కంకణముల హరించును గదా. కంకణరహితయై సీత మాయావులగు రాక్షసులకుఁ జిక్కి బాధ పడవలసివచ్చు నను ముందాలోచన తోడనే యిట యనసూయను గౌశికాశ్రమముననే ప్రవేశపెట్టి యా దివ్యవస్తువుల నొసగఁ జేసినాడు. పూర్వోత్తర సందర్భములు లెస్సగాఁ గూర్పఁబడి కథ చమత్కారముగా నడచినది. సీతా విషయకోత్సుకత రావణునకుఁ గల్పించి యేకపక్షానురాగము జూపి రావణుని గుణహీనుని జేయుచున్నాఁడు. ఈ విద్యుజ్జిహ్వ, రావణ సారణులు వారి వారి దుశ్చేష్టలను వారు పరస్పరము వారిలో వారు మెచ్చుకొనునట్లు చేసి యా సంఘము నొక దుష్టసంఘముగనే మన కవి మనకు గోచరింపఁ జేయుచున్నాఁడు. రావణుఁడు ప్రతినాయకుఁడు గావునఁ గొంచెమైనను నుత్తమగుణము లతని యందుఁ జూపుట యావశ్యకమని కాబోలు రావణుని శీలమునుగూర్చిన యీ శ్లోకమున మన కవి యతని స్వభావమును దెలియఁ జేయుచున్నాఁడు. విద్యుజ్జిహ్వునితో రావణుఁ డేమనుచున్నాఁడో చూడుఁడు.

"యుక్తం కిం వరవర్ణినీం వరయితుం యా నానురక్తా స్వయం
తస్యాస్సంవననాయ హంత నృపశో కిం ధర్తుమర్హం వపుః।
ఆబాల్యాదపి యస్సఖా కిముచిత స్తద్విప్రలంభోఽథవా
కిం వా మే వినిపాత్యమానయశసః కామోనురోద్ధుం క్షమః॥"

సీత రావణు నేవగించుచు నుడివిన పల్కులు స్వయముగవిని రావణుఁడు నిరాశచేఁ దనకు సీతాలాభ మశక్యమని పైశ్లోకమును నుడువును. అందలి భావ మిది. 'అనురక్త కాని వనితను వరించుట యుక్తముకాదు, ఆమెను

వశపరచుకొనుటకై యొక నరపశువు రూపము దాల్చుటయుచితము కాదు. బాల్యమిత్రుఁడగువానిని జనకుని వంచించుట తగదు. నా యశస్సు నంతయుఁ బోనడచి కామినై యీ వెడకోర్కెను దీర్చికొనుట తగునా? అని పలువిధములఁ తా జేయునది యకార్యమని గుర్తించెను. కాని ప్రక్కనున్నవారల దుర్బోధము లాలకించి కొంచెము జారి వంచనము చేయ నియ్యకొనును.'

సారణుఁడు మునికుమార వేషమునఁ దాను రామమిత్రుఁడని సీతను వంచించి మరునాడు రాముఁడు కౌశికునితో నేతెంచచున్నాఁడని నుడివి సీతా కంకణములఁ బారితోషికముగా గ్రహించును. కటకములు చేతనున్నంతదనుక సీత యెంతమాత్రమును రాక్షసులకు గోచరింపలేదు. అవి యామెను వీడినంత నామె రూపము మెరుపుదీగెవలె గోచరించెనే కాని యాకారమును పూర్ణముగ రావణుఁడు జూడలేదాయె. కామాంధత యెంతవానినైన నెంతైనఁ జేయించును గాన రావణుఁడు రామవేషముదాల్చి సీతను గ్రహింప సిద్ధపడును. ఇంతలో జనకుఁడు సీత ననసూయకు మ్రొక్క రమ్మన నామె యాశ్రమమున కేగును. సారణుఁడు మణికంకణములను రామ చిత్రపటమును దెచ్చిచూప వానిని రావణుఁడేవగించుటయు సముచితమే. రావణుఁడు రాముని తనకుఁ బ్రత్యర్థిని సైచునా? అంత సారణుఁడు వానిని ముందుపయోగపడునని విమానమున నుంచి వచ్చి తగువేషమున విద్యుజ్జిహ్వ రావణులతోఁ జేరి యందరును కౌశికాశ్రమమున జనకుని వంచింపఁ బయన మగుదురు.

ఈ ద్వితీయాంకమున కవి రావణుఁని గొంచెము గుణవంతునిగఁ జూపినను పార్శ్వవర్తులమాటల విని, వంచకుఁడౌట వర్ణించి కామలౌల్యమున నెంతటి వాఁడైన నెంతపనినైనఁ జేయ సిద్ధపడునని గొప్ప నీతిని

బోధించుచున్నాఁడు, ఇందు రాక్షసాంధంకరణ మణికంకణములను సీత కొసఁగి రాక్షసమాయను బరిహరించునేర్పు కౌశికునకుఁ గలదనియు, మహామును లమేయమహిమాన్వితు లనియుఁగూడఁ దెలియ జేయుచున్నాడు. ఈ రాక్షసాంధంకరణి, తిరస్కరిణీ, కామరూపధారణము మున్నగువిద్య లన్నియు మన యార్యవిజ్ఞాన మహిమమును వేనోళ్ళఁ జాటుచున్నవి, కవి కీ విషయమైన జ్ఞానము బహుగ్రంథ దర్శనమున నబ్బియుండు ననియుఁ దెలియనగుచున్నది. ఈ రాక్షసాంధంకరణ మణికంకణ కల్పనము వంటివి, భాస, భవభూతి, దిఙ్నాగ, కావ్యములందును గలవు. భాసుని యవిమారకమున అవిమారకుడు ధరించిన యంగుళిక ప్రభావ మట్టిదియే, ఇతరులకు తా నదృశ్యుఁడగును, భవభూతి ఉత్తరరామ చరితమున దండకాటవిని వనదేవతా వరప్రసాదమున నదృశ్యయై రామున కుపచరించును. దిఙ్నాగుని కుందమాలయందు వాల్మీకి వరమున స్త్రీజనమంతయు పరులకు గోచరింపకుందురు. దీర్ఘికాతీరమున సీత రామున కగోచరయగుచున్నది. వీనినెల్ల తిలకించియే యీ కవియు నట్టి కల్పనగా నీ రాక్షసాంధంకరణమణి వలయములఁ గల్పించినాఁడు.

తృతీయాంకమునందలి కథ యంతముఁ గవికల్పితము. ప్రథమాంకమున తాటక సుబాహు మారీచులతో నయోధ్యనుండి వచ్చు కౌశిక రాములను సంహరింప నేగుచున్నట్లు నుడువఁబడినది. ఆ విషయ మెట్లు పరిణమించెనో యిందుఁ దెల్పబడినది. అంకారంభమున మారీచ కరాళులు సంభాషించుచు రామబాణ తీవ్రతను బ్రశంసించుచు తాటకా సుబాహులు మృతులైనట్లును, మారీచుఁ డెట్టులో తప్పించుకొని రాఁగలిగినట్లును దెలియుచున్నది. ఈ తాటక సుబాహువధముకూడ రామాయణమున కౌశికాశ్రమమున నిర్వర్తింపఁబడినట్లున్నది. ఇందు

భిన్నస్థలమున నయోధ్యామార్గమధ్యమున గావింపఁబడినట్లున్నది. పూర్వోత్తర కథాసందర్భశుద్ధికై యట్లు మార్పఁబడినది.

పిమ్మట మారీచకరాళులు వేరొక యుపాయ మాలోచించి మాయాసీతను గల్పించి రాము నాకర్షించి యామె విరహము దుస్సహము కాగ నగ్నిప్రవేశ మొనర్చునట్లును, నా వార్త విని రాముఁడు నట్ల చేయఁ గలఁడని తదనుకూలముగ మాయ పన్ని మార్గమధ్యమున కౌశికాశ్రమమునకు కొంతదూరమున సన్నివేశము సిద్ధపరతురు. కరాళుడు రామమిత్రుఁడగు పింగళకుఁడుగను. మారీచుఁడు విశ్వామిత్ర శిష్యుఁ డగు కాశ్యపుఁడుగను వేషముల వేసికొందురు. రాముఁడు స్కంధావారముతో నట విడిసి మృగయార్థము కొంత దవ్వుల కరుగ నట నీ మాయా సన్నివేశముండును. మాయావులగు పింగళక కాశ్యపులు రాముని బ్రేరేచి యా మాయాసీతను మోహింపఁజేయుదురు. ఈ వేషధారులకును సత్యరూపులగు పింగళకాశ్యపులకును భేదము లేకుండ ప్రవర్తింపఁజేసి నాటకీయముగఁ బ్రేక్షకుల నానందింపఁజేయుట కిది యెంతయో తోడ్పడుచున్నది. అహల్యా శాపమోచనము చమత్కారముగా నిందు మాయా సీతకై ప్రాణత్యాగముచేయ సిద్ధపడిన రాముని పాదరజస్పర్శమున గలిగినట్లు చెప్పబడియున్నది. రామున కింతటి వ్యామోహము వివాహమునకుఁ బూర్వ మెన్నడును నెచ్చటను రామాయణమున వర్ణింపఁబడలేదు. కవి, నిజదేశకాల సభ్యానందమును గమనించి యిట్టి సన్నివేశముల నీ నాటకమునందుఁ జొప్పించి కథను మనోహరముగ సాగించినాఁడు. ఈ యంకమున మాయావుల మాయాచేష్టలు తప్పకథాభాగము సున్న యనియే చెప్పనగును. భగవత్స్వరూపుఁడని యమేయ మహిమాన్వితుఁడని పేర్కొనబడు శ్రీరామున కిట్టి మోహము వర్ణించుట కేవలయు నాటకీయ దృష్టి ననుసరించియే కవి గావించియుండునని తోచుచున్నది.

తుద కిరువురు కాశ్యపులు, నిరువురు పింగళకులును శ్రీరామునికి గోచరింప నహల్యావచనమున సత్యరూపుల గుర్తింపఁజేసి కవి రాముని గౌరవము కాపాడినాఁడు, మాయావులు తమ యాటలు సాగలేదని లేడిరూపములఁ దాల్చి పారిపోవుదురు, రాముఁడును స్కంధావారముతో కౌశికాశ్రమమున కరుగును.

ఈ యంకమును కేవల మీ మాయావేషములతోడను, మాయా సీతా కల్పనముతోడను Comedy of Errors అనుటకుఁ దగినట్లు వారిలో వారికే గుర్తింపరానంతటి నేర్పుచూపి మాయానిర్వహణము లెస్సగా సల్పి హాస్యముతో నింపినాఁడు. కథ సున్న. అంతయు మాయగానే గోచరింపఁ జేసెను.

చతుర్థాంకమున విద్యుజ్జిహ్వ రావణసారణులు విశ్వామిత్ర రామలక్ష్మణవేషములఁ బూని జనకుని వంచించి జానకిని బెండ్లాడుకోర్కెతో కౌశికాశ్రమమును బ్రవేశింతురు. కవి యిట మాయారూపులను సత్యస్వరూపులనుండి తెలిసికొనుట కుపాయముగ గంధర్వు నొక్కని రావణవృత్తాంతము తెలిసికొని వచ్చునట్లు కల్పించినాఁడు, ఈ గంధర్వుఁడు తాటకావధ ముదితుఁడగు నింద్రునిచే నియుక్తుఁడై లంక కరిగి యట రావణాదుల విషయ మరసి వారి వంచన మెరింగి కౌశికాశ్రమమున మాయావులగు విద్యుజ్జిహ్వ రావణాదులు విశ్వామిత్ర రామలక్ష్మణ వేషములతో నటకు వంచింప వేంచేసియున్నారని కేకవేసి జనకాదులఁ హెచ్చరించి వెడలిపోవును, నాటకమునకంతయు నిది కీలకమని నుడువఁ దగును. మాయా విశ్వామిత్ర రామలక్ష్మణులను సత్యరూపు లని జనకాదులు సర్వము సిద్ధముచేయుచున్న సమయమున నీ గంధర్వోక్తి యెంతయుఁ దోడ్పడి సీతను రావణుహస్తమునఁ బడకుండఁ గాపాడినది.

సత్యరూపులగు విశ్వామిత్ర రామ లక్ష్మణులు వచ్చినంత తమ మాయ బయలువడునని మాయావులు తిరస్కరిణీవిద్యచే నదృశ్యులై యటనే గమనించుచుందురు. జనకాదులు మాత్రము సత్యరూపు లెవరాయని డోలాందోళిత హృదయులే యైయుందురు. తుదకు జనకుఁడు శివధను రారోవణపణమును నిర్ణయింపఁ గౌశికానుమతిని శ్రీరాముఁడు దాని నెత్తి యెక్కువెట్ట నది భగ్నమగును. అంతకుమున్న తాటకాదుల శ్రీరాముఁడు జక్కడంచె నని రామప్రభావము నుడువుచు, దివ్యాస్త్ర మంత్రగ్రామము నాతనికిఁ గౌశికుఁడంతప్రభావవంతుడని గ్రహించియే యుపదేశించె ననియు మున్నగు రామాయణ విషయము క్లుప్తముగా నుడువఁబడినది. అదృశ్యులుగ నున్న విద్యుజ్జిహ్వరావణ సారణు లీ రామప్రభావ మంతయుఁ గని విని, తాటకాది వధమునకెంతయుఁ వగచి రాముపైఁ గ్రోధమూనుదురు. ఇట్లు రామవృత్తాంతమును దొలుతనుండియే రావణునకుఁ బ్రత్యక్షముగ నీ నాటకమున నెరుకపరచుచు నీ కవి కథను నడపించినాఁడు.

మహాప్రభావ సంపన్నుఁడగు కౌశికున కభివాద మొనర్ప సీత వచ్చినపుడామెంజూచి శ్రీరాము డేమనుచున్నాఁడో చూడుఁడు– 'కథమియం సాక్షా దేవ జానకీ'

"శ్రీఖండార్ద్రసమీరణే శిశిరతాం చంద్రే దృశోస్సౌమ్యతా
మా రామే స్పృహణీయతాం పరభృతారావే సుఖశ్రావ్యతామ్।
ఆహారే కరణీయతాం రజనిషు క్షిప్రం పరం నేయతాం
యూముష్టాదనవేక్షితా మమ పురా సైవాధునా దృశ్యతే॥" VI-50
'తదియం దృఢతరం భుజాభ్యాం బంధనీయా'

ఏ సీతను జూడకుండుటవలన నింతదనుక మలయానిల ముష్ణముగను, చంద్రుఁడు విలోకసౌమ్యతఁ జెడి రవి సదృశుఁడుగను,

కుసుమసౌరభామోద భరితమగు నారామం బనిష్టముగను, కోకిలారావ మశ్రావ్యముగను. ఆహారాదు లసహ్యముగను, రాత్రుల నిమిషములు జాములుగను గోచరించెనో యా సీత యిపుడు సాక్షాత్కరించినది. కనుక నీమెను భుజములచేత గట్టిగాఁ గౌఁగిలింపవలె ననుకొనుచున్నాఁడు.

ఇట మాత్రము రాముని యీ చేష్ట బాగుగలేనట్లు తోచుచున్నది. ఉత్తమ శీలుఁడగు శ్రీరాముఁడీ సీతను జూచినంత మోహాతిభరమున నట్లామెను భుజములచేత గట్టిగాఁ గౌఁగిలింపవలయు ననుకొనుభావము నవయౌవన భావముచే మనమునఁ బొడమినను సట్లనుకొనుట యాతని శీలమును కొరంతపరచునట్లున్నది. కవి యిప్పట్టున శ్రీరాముని పెద్దలకడ మెలఁగినవానినిగాఁ జెప్పినను నిట్టి భావ మాతని కంటగట్టుట కవికాలమునాటి ప్రేక్షకానందము ననుసరించియే యట్లు గావించియుండునని తోచుచున్నది. రామచరితముల నెందును నిట్లు శ్రీరామునకు వివాహమునకు మున్నింతటి వ్యామోహము వర్ణింపఁబడలేదు. సీతకుఁగూడ శ్రీరాముఁడు కలలలో గోచరించి తాపమును గలుగజేయుచున్నాఁ డనియు, నామె విరహవేదనమునుగూడ నీ కట వర్ణించినాఁడు. ఇది యంతయు కేవలము సామాజికదృష్టి ననుసరించి నాటకమును రసవంతముగాఁజేసి పేరు సంపాదింపవలయునను నూహచే నట్లు వ్రాసియుండును. కాని యద్దానిచే వీరల శీలమునకుఁ గొరంత గలుగుచున్న సంగతి కవి మరచినాఁడు.

శివధనుర్భంగానంతరము జనకాదులు సంతసించి కన్యకలగు సీతోర్మిళలను, రామలక్ష్మణులకును, మాండవీ శ్రుతకీర్తులను భరతశత్రుఘ్నులకు నీయఁదలఁచినట్లు సహర్షముగాఁ బల్కును, విద్యుజ్జిహ్వారావణాదు లదృశ్యులుగ నుండి రామ పరాక్రమముఁ గాంచి ఖిన్ను లగుదురు. రామునిచే తాటక వధింపఁ బడెనని తెలిసికొందురు,

తాటకను స్త్రీ యని శ్రీరాముఁడు వదలినను నాతని బాణము శరాసనమునుండి స్వయముగ వెడలి తాటకను సంహరించెనని

"వత్సే స్త్రీతి పరాఙ్ముఖేవ్యుద పదద్బాణస్స్వయం కార్ముకాత్।
భిన్నా తేన భుజాంతరే మహతి సా జీవం జహావంజసా॥" IV-36

రావణుఁడు రాముని తొలుత వధించవలయునని నిశ్చయించుకొని విద్యుజ్జిహ్వాని సలహామేరకు సీత యేరీతిఁ దన్నుఁ జేరగలదను విషయ మాలోచించి చేయుటకై మంత్రులగు మాల్యవదాదులతో సంప్రదించుటకై వారు విమానమెక్కి లంక కేగుదురు.

ఇంతలో దశరథుఁడు వేంచేయుటయు వివాహసన్నాహములు జరుగుటయు దశరథాదుల సంభావించుటయు జరుగును. ఈ యంకమునందు శివధనుర్భంగము కౌశికాశ్రమ ప్రాంతమున జరిగినట్లు వర్ణింపఁబడినది. ఈ కల్పనము భవభూతి మహావీర చరితమునుండి గ్రహింపఁబడినది. కాని యిట జనకుని రావించి సర్వము నిర్వర్తింపఁ బడినది. కవి కిందు కథావిషయమునందు కన్న నాటక కళాదృష్టియందు మక్కువ యెక్కువ యని తెలియుచున్నది. నాలుగంకములు గడచినను కథమాత్రము సాగలేదు. నాటకమందు చలనము విశేషముగఁ గలదు. మనోరంజక ఘట్టములే పెక్కుగలవు. కాని ప్రధాన కథా గమనము తక్కువ యనియే చెప్పనగును,

పంచమాంకమున విరాధ శూర్పణఖలు ప్రవేశించి విష్కంభమునఁ గొంత రామాయణకథను తెల్పుదురు. శూర్పణఖ రావణుఁడు సీత నపహరింపఁ దన్నచటకుఁ బంపినట్లు దండకాటవిని రాముని జంప ఖరు నాజ్ఞచే వచ్చిన విరాధునకు సీతా రాములకథఁ దెల్పుచున్నది. రావణుఁడు మాల్యవదాదులతో సంప్రదించి పరశురాముని ప్రేరేపించుట, భార్గవ

గర్వభంగము, విద్యుజ్జిహ్వాసారణులు మంథరా దశరథుల నావేశించి వరద్వయ నిర్వహణము గావించుట అద్దాన సీతారామలక్ష్మణు లరణ్యమునకు వచ్చుటయు, భరతుఁడు రామభక్తుఁడై పాదుకలఁ గొని యయోధ్య కేగుటయు మున్నగు నంశముల నెల్ల సంగ్రహముగా విషయ సూచిక రీతిని దెలియఁ జేసినారు. సీతారాముల వనవిహారము నవోఢదంపతుల రీతిని నేటి చంద్రికా విహారములరీతి (Honey moon) వర్ణింపఁబడినది.

సీతారాము లొక కొండనెత్తమునఁ గూర్చుండి విలాసముగఁ బ్రకృతి శోభ నరయుచుందురు. లక్ష్మణుఁడు పర్ణశాలా ద్వారమున వేచియుండును. శూర్పణఖా విరాధులు సీతారామవేషములఁ దాల్చి యొకరికొకరు తెలియకుండ నపహరించు నాశయములతో నా ప్రాంతమున మెలఁగుచుఁ దుదకు వారొండొరు లితరుల నపహరించితిమి కదా యని యాకసమున కెగసిపోవుటయు, జటాయు భర్త్సనమున నేలఁ గూలుటయు, నద్భుతకల్పనములు. గ్రంథ మంతయు నిట్టి యద్భుత సన్నివేశములతో నింపి సామాజికుల నానందింపఁ జేయుటలో నీ కవి యద్వితీయుఁడనియే చెప్పనగును. శూర్పణఖా విరాధు లీ వేషములతోఁ జేయుమాయలన్నియు సీతారాములు కొండశిఖరమునుండియు, లక్ష్మణుఁడుటజద్వారము నుండియుఁ జూచుచునే యుండినట్లు వర్ణించుటయుఁ జాల చమత్కారముగా నున్నది. జటాయురాక యీ నాటకమున నప్రసక్తముగఁ జూపినాఁడు. జటాయు నానతి విరాధుని లక్ష్మణుఁడు చంపినట్లు నుడివినాఁడు. శూర్పణఖా విరూపణమునను విరాధవధమునను ఖరుఁడు కోపించి తమపైకి రాఁగలఁడని సూచించి జటాయువు వెడలిపోవునట్లు వర్ణించినాఁడు. ఈ జటాయువు రాక వలన నాటకీయముగఁ గూడఁ బ్రయోజన మేమియు

గోచరింపదు, ఈ యంకమున శూర్పణఖా విరాధుల దురూహలు, దుశ్చేష్టలు, తత్ఫలితమును జమత్కారముగా వర్ణింపఁబడినవి.

రాముఁడు సీతతోఁ గొండనుండి దిగి పర్ణశాలకు వచ్చునపుడు త్రోవ విషమముగ నున్నదని రాముఁడు సీతకు హెచ్చరించుచున్నాఁడు. ఆ సందర్భమున నేమనుచున్నాఁడో చూడుఁడు.

శ్లో॥"హస్తేన హస్తమవలంబ్య నిజేన మే త్వం
నిశ్శంక మేహి విషమో యదయం ప్రదేశః।
ఏతాసు మా స్థలశిలాసు విలంఘ్య నిమ్న
మాయాహి కంటకమవేక్ష్య పదం నిధేహి॥" **V- 53**

మరియు,

రామ:- మా అన్యత్ర దృష్టిం నిక్షిప॥

శ్లో॥పంథాః పంకిల ఏష తత్కుటిల మప్యాక్రామ మార్గాంతరం
జంఘాభ్యాం కియదుత్క్షిపాంశుక మసావుల్లంఘ్యతే నిర్ఝరః।
మౌళిం న్యంచయ మా స్పృశంతు వదనం వానీరశాఖా నతా
స్సక్తం మోచయ మాతులుంగ విటపే సీతే దుకూలాంచలమ్॥ V- 54

'నా చేతిని నీ కరమున నవలంబముగాఁ గొని నిశ్శంకముగ రమ్ము, ఇది కడు విషమప్రదేశము, ఈ శిలలందు తొట్రిలకుము. ఇట పల్లమును దాటుము. ఈ ముండ్లకంపను జూచి యడుగిడుచు రమ్ము'

రామ:- మరొకచోట దృష్టినిల్పకుము.

ఈ మార్గము బురదగా నున్నది. కావున వంకరయైనను వేరు త్రోవన నడువుము. నీ చీరను పిక్కలపైకెత్తిపట్టుకొని యీ సెలయేరు దాటవలయును. వానీరశాఖలు వంగియున్నవి. అవి మోమును దాకకుండఁ దల వంచుము. ఈవల నీపైటకొంగు మాతులుంగ వృక్షమున దగుల్కొన్నది, వదలింపుము-

అని నుడువుచున్నాఁడు. ఇట నీ హెచ్చరిక నాటకీయముగ నభినయముం జూపుచు నెంతయో రాణించుచున్నది. ఇట్టివి కుందమాలయందు దిఙ్నాగుఁడును నుడివి యున్నాఁడు. కుందమాలయందు వాల్మీకి సీతను నిజాశ్రమమునకుఁ గొంపోవుచు త్రోవ విషమమని హెచ్చరించును. అప్పట్టున నందలి శ్లోకము తిలకింపుడు.

'వాల్మీకి:– తద్యథా యథా మార్గమాదేశయామి తథా తథా సమాగంతవ్యమ్'

"శ్లో॥ ఏతస్మిన్ కుశకంటకే లఘుతరం పాదౌ నిధత్స్వాగ్రతః
శాఖేయం వినతా నమస్వ శనకైర్గర్తో మహాన్ వామతః।
హస్తేనామృశతేన దక్షిణగతం స్థాణుం సమం సాంప్రతం
పుణ్యేఽస్మిన్ కమలాకరే చరణయోర్నిర్వర్త్యతాం క్షాళనమ్॥"
(అంకము 1. శ్లోకము 20.)

దర్భముండ్లుగల యీ చోట పాదము మెల్లగా నుంచుము. ఎదుట కొమ్మ వంగియున్నది. కొంచెము వంగుము, ఎడమప్రక్క పెద్దగొయ్యి, కుడి ప్రక్కన నున్న స్థాణువును నీ కరమున నూతగొనుము, ఇట సమముగానున్నది. ఈ పుణ్యమైన తటాకమునఁ బాదములఁ గడిగికొనుము.

మరియు, నందే లక్ష్మణుఁడు శ్రీరామునకు గోమతీతీరము కంటకిత శర్కరాశుక్తిపుట దుఃఖసంచారం బగుటచే త్రోవను జూపుచు నిట్లు హెచ్చరించుచున్నాఁడు.

"శ్లో॥ ఏతాం వేత్రలతాం విలంఘయ పదం మాస్మిన్ కృథాఃశుక్తయో
మూర్ధానం వ్యవధాయ నామయ పురో దూరావనమ్రస్తరుః।
చాపాగ్రేణ వికృష్య ముంచ పురతః శాఖాం తిరశ్చీమిమా
ముత్త్రస్యంతి పురా శరారుదయితా ధీరం పరిక్రమ్యతామ్॥"
(అంకము 3. శ్లోకము 8.)

ఈ పేమును దాటుము, ఈ ముత్తెపుచిప్పలపైఁ గాలిడకుము. దూరమున చెట్టు వంగియున్నది. శిరమును జాగ్రత్తగా వంపుము. ఎదుట అడ్డముగానున్న యీ కొమ్మను వింటి కొమ్మున లాగి వదలుము. వన్యమృగములు బెదరించుచున్నవి. ధైర్యముతో నడువుము–అని నుడువుచున్నాఁడు. నాటకమునఁ నిట్టి యభినయయోగ్యములగు సన్నివేశము లెంతయు శోభిల్లుచుండును.

షష్ఠాంకమునఁ గవి రామాయణ కథాభాగమును రాముఁడు సీత నన్వేషించుటాది వాలి వధాంతముదనుక నంతర్నాటికా మూలమునఁ బూసగ్రుచ్చిన ట్లన్ని యంశముల నెంతో చమత్కారముగ నుడివినాఁడు. ఈ యంతర్నాటికాకల్పనము భవభూతి దగు నుత్తరరామచరితమునుండి మనకవి గ్రహించి నాఁడనుటకన్న రాజశేఖరుని బాలరామాయణమునుండి గ్రహించనాఁడనుట యెంతయుఁ దగియున్నది, అంతర్నాటికా కల్పనము తొలుత భవభూతి కల్పించినమాట వాస్తవమే. కాని రాజశేఖరుఁడు రావణ సన్నిధిని రామకథనాడించినాఁడు, అట్లే యిందును రావణునెదుట రామకథ యాడఁబడుటచే నా రాజశేఖరు ననుసరించె ననుటయే యుక్తము. ఈ యంతర్నాటికయందలి యభినయాదులఁ జూచి సత్యముగ రామాదులకథయే యని రావణుఁడు ఖడ్గపాణియై లేవఁబోవుట మహాపార్శ్వుఁడు నాటకమని హెచ్చరించి వారించుట బాలరామాయణమందు రావణుఁడు నట్ల చేయ ప్రహస్తునిచే వారింపబడుటనుబోలియున్నది. ఈ కల్పనముచే రాముని వృత్తాంతము రావణునకుఁ దెలియఁజేయుట యగుచున్నది. ఒక్క రావణునికేకాదు సీతకును నిరాశఁ జెంది ప్రాణముల విడువకుండుట కామెకును దెలియఁ జేసినట్లగుచున్నది. మరియు నిందు పూర్వోత్తర కథా సంర్భముల నదికి కథను జక్కగా సాగించుటలో నీ కవి యద్వితీయుఁ డని తోచుచున్నది.

తొలుత విశ్వామిత్రాశ్రమమున సీతనుండి పారితోషికముగా సారణుఁడు గ్రహించిన రాక్షసాంధంకరణమణివలయములు నాఁడు విమానమున నిడబడి, క్రమముగా నవి విద్యుజ్జిహ్వుడు తన భార్యయగు మాయావతికిని, మాయావతి అనలకు నొసంగినట్లు నుడివి, యనల సీత కొకదాని నిచ్చి తానొకటి దాల్చి యంతర్నాటికను రాక్షసులచేఁ జూడఁబడకుండఁ జూచుట కనుకూలపడునట్లు వర్ణింపఁబడి చక్కగా కథ నడచినది. ఇందు వాలిని మాల్యవదాదులు రావణపక్షమునఁ బ్రేరేచి రాముని వధింప నియమించినట్లు తెలియుచున్నది. అంతర్నాటికలో హనుమంతుఁడు వాలినిగూర్చి రామునకు నివేదించుచుండ సత్యమని విశ్వసించి చంద్రహాసమును దడవుచు లేవబోయి

"ఆదౌ భిక్షుమిమం హత్వా హనిష్యామి తతః పరమ్।
సుగ్రీవమృశ్యమూకస్థం సమమన్యైశ్చ మంత్రిభిః॥

(అంకము 5. శ్లోకము 53.)

"(విచింత్య) కథమస్థానే మమ సంభ్రమః ననుక్షత్రియవటువధాయ ప్రహితో వాలీ తత్సుహృదోపి హనిష్యతే తామ్॥"

"తొలుత నీ భిక్షువును జంపి, యవల ఋష్యమూకమునున్న సుగ్రీవుని సచివ బృందముతోఁ గూల్తును;- (ఆలోచించి) అనవసరముగా నీ సంభ్రమము నా కెందులకు, క్షత్రియకుమారవధమునకై పంపఁబడిన వాలి, తన్మిత్రులనుగూడఁ జంపఁగలఁడు." అని నుడువుచున్నాఁడు. వాలిని రామవధార్థము ప్రేరేచుట మహావీరచరిత, అనర్ఘరాఘవ నాటకముల అనుకరణము.

ఈ యంతర్నాటికయందు వాలివధానంతరము రామాదులు ప్రస్రవణపర్వతమున విడిసి, హనుమదాదులు సీతాన్వేషణార్థము నల్దిశలు వరికించుచుండుటయు, శుకసారణు లను రావణదూతలు

హనుమంతుఁడు సముద్రము దాటి లంకకువచ్చుచున్నాడని తెల్ప రావణుఁడు లంకాధిదేవతతోఁ గపిసైన్యము ప్రవేశింపకుండుట కనువగు కార్యముల సల్పవలయునని శాసించి యనంతరకరణీయాలోచనకై వెడలిపోవును.

కవి ఈ రీతిని రామాయణకథను హనుమంతుఁడు లంకజేరువరకు గల కథను సంగ్రహముగానైనను ననేకాంశములఁ జమత్కారముగఁ గన్నులకుఁ గట్టినట్లు తెలియఁజేసినాఁడు, సీతకును దీనివలన సంతోషము కల్గినది. శుభము కల్గఁగల దను నాశ పొడమినది.

సప్తమాంకమున:- శూర్పణఖాసంపాతులు ప్రవేశించి లంకయందలి వృత్తాంతము మాటాడుదురు. వారు రాముఁడు కపిసైన్యముతో సముద్రమున సేతువును గట్టి లంకలో రావణాదుల సంహరించి, విభీషణునకు ఁబట్టముఁ గట్టి యగ్నిపరిశుద్ధయైన సీతతోడ విమానము నధిరోహించి, విభీషణునకు బట్టముఁ గట్టి యగ్ని పరిశుద్ధయైన సీతతోడ విమానము నధిరోహించి యయోధ్య కేగ నున్నాఁడని తెల్పుదురు. శూర్పణఖ తాను ముక్కిడి యగుటచే ప్రాణనాథుని దర్శింపనేగుచున్న సీత కెదురుగాఁబోయి పరిజనులచే వారింపఁబడి యపనీతయైనట్లు నుడుపుచున్నది. సంపాతి యామె విగ్ర కావున నట్లపనీత యామె నని 'ఏవంఖలు నిమిత్తవిదః ఆచక్షతే। ప్రతిష్ఠమానస్యాభిముఖం విగతనాసికాముఖదర్శనం భావినః క్లేశస్య సూచకమితి' ప్రయాణమగువారల కెదురుగా ముక్కిడివారిదర్శనము రాబోవు క్లేశమునకు సూచక మని శాకునికులు నుడువుదు రనును. దీనిచే మన కవి శకునాదులఁ బట్టుదల గలవాఁ డని తెలియుచున్నది. శూర్పణఖ భరతాదులకైన నపకారము గావించి తన కసిఁ దీర్చుకొంద మని హనుమంతుఁడు రామ విజయవార్త భరతునకుఁ దెల్పుటకుఁ బూర్వమే

భరతునికడ కేగి వంచింప యత్నించి పర్ణాదిని యను తాపసివేషముతో బయలుదేరును,

నందిగ్రామమున భరతుఁడును రాముని యారణ్యకస్థితిని గూర్చి చాల విషాద మొందును. శత్రుఘ్నునితో రామవిషయ మెట్లు నుడువు చున్నాఁడో చూడుఁడు.

"నీలం మూర్ధ్ని జటాభరం కటితటే ధౌతం నవం వల్కలం
పాణావుజ్జ్వలమక్షదామ తపసా దేహే శ్రియం కామపి।
బిభ్రాణేన నవోటజాంతరతతవ్యాఘ్రాజినాధ్యాసినా
ప్రాగ్దృష్టేన వనేఽధునాఽపి హృదయం నోన్ముక్తమార్యేణ మే॥"

(అంకము 7. శ్లోకము 5.)

మరియు,

"శ్లో॥ సంచారః కటుకీటకంటకశిలాఖండైర్వనే దుర్గమే
ప్రాయేణామ్లకషాయతిక్తకటుభిర్వృత్తిస్తరూణాం ఫలైః।
కీర్ణానోకహజీర్ణపర్ణవిరసైస్తోయై రుదన్యాశమ
శ్శయ్యా స్థండిల ఏవ తస్య విషమే యస్సర్యలోకేశ్వరః॥"

(అంకము 7. శ్లోకము 6.)

మరియు,

"శ్లో॥ జటాభారం ధత్తే మణిమకుటయోగ్యేన శిరసా
బిభర్తి క్షౌమార్హే బత కటితటే వల్కలమపి।
మణిప్రాసాదాగ్రస్థితిసముచితోఽపి ప్రతిదినం
యదార్యో వైదేహ్యా సమముటజమధ్యేఽధివసతి॥"

(అంకము 7. శ్లోకము 7.)

హంత, న దీర్యతే సహస్రధా మే వజ్రమయం హృదయం సాస్రగద్గం.

"శ్లో॥ ఆర్యా విదేహతనయా రజనీచరేణ
సీతా న జీవతి పునర్యది జీవతీయమ్।
అప్రేక్షతస్వజనమప్రతిషేధదీర్ఘ
ముచ్ఛ్వాసపక్ష్మ న కరిష్యతి రోదనం కిమ్॥"

(అంకము 7. శ్లోకము 8.)

శిరమున వినీలమగు జటాభరమును, గటిసీమ ధౌతమగు నవ్యవల్కలమును, గరమున నక్షమాలను, దపమున దేహమునఁ గొండొక నూత్నకాంతిని ధరించి పర్ణశాలయందు వ్యాఘ్రాజినమున నుపవిష్టుఁడగుచు మున్ను నాచేఁ జూడఁ బడిన రాముఁ డిప్పుడును నామది వీడకున్నాఁడు.

(అంకము 7. శ్లోకము 5.)

మరియు,

అకటా లోకేశ్వరుఁడగు నతనికిఁ గటుకీటకాశ్మకంటకవ్యాప్తమగు దుర్గమారణ్యమున సంచారము సేయవలసె. కషాయామకటుతిక్తములైన వన్యఫలంబులే యాహారము గావలసె. జీర్ణవృక్షపర్ణకలుషంబగు నీరు త్రాగవలసివచ్చె, విషమంబగు వనప్రదేశమే శయ్య కావలసివచ్చె. ఎంత కష్టము!

(అంకము7. శ్లోకము 6.)

మరియు,

మణిమకుటయోగ్యంబగు శిరమున జడలు గట్టె. తెల్లని పట్టుబట్టలఁ గట్ట నర్హమగు కటితటమున నారచీరలఁ దాల్చె, ప్రతిదినమును మణిమయాంతఃపురములలో నివసింప యోగ్యుఁడగు వాఁడు వైదేహితోఁ బర్ణశాలయందు వసించుచుండె.

(అంకము 7. శ్లోకము 7.)

అకటకటా! వజ్రమయమగు నా హృదయము వేయి ముక్కలుగాఁ బగులకున్నది. కన్నీరు గార్చుచు డగ్గుత్తికతో.

శ్లో॥ పూజ్యురాలగు సీత రక్కసునిచేఁ దీసికొనిపోఁబడిన దగుచు బ్రదుకనేరదు. బ్రదికినను స్వజనమును జూడకపోవుటచే నేడ్వ వలదని చెప్పెడి వారు లేక దీర్ఘరోదనమున రెప్పలుబ్బునట్టు లేడ్వకుండునా!

(అంకము 7. శ్లోకము 8.)

ఈపై శ్లోకములు రామునివర్ణించునవై యొక్క భరతునికే కాదు. మన కందరకును నా యవస్థలోనున్న రాముఁడు గోచరించుచునే యుండునట్లు వస్తువర్ణనము గావించి కవి తన వస్తుకళాపోషణ నైపుణ్యమును కనఁ బరచుచున్నాఁడు వీనియందు వస్తువే భావముకూడ మిళితమై యివి హృదయంగమములుగా నున్నవి.

భరతశత్రుఘ్ను లిట్లు రామవిషయము తలపోయుచుండ గుహునివలన సుగ్రీవసఖ్యాదివృత్తాంతములఁ దెలియుదురు. గుహుఁడు భరతాదులకు రామవృత్తాంతముఁ దెలియఁ జేసె ననుట కవికల్పనము. రామాయణమున శ్రీరాముఁడు రావణవధానంతరము తా నయోధ్యకు బయలు దేరుటకు ముందు తన శుభోదంతమును తొలుత శృంగిబేరపురమున గుహునకుఁ దెల్పి భరతునకుఁ దెల్పుమని హనుమంతుని బంపునట్లున్నది.[1]

శూర్పణఖ పర్ణాదిని యను పేర తాపసివేషముతో మాయలాడియై భరతాదుల కపకారము గావించు నుద్దేశముతో వచ్చునట్లు వర్ణించుటయుఁ గవికల్పనమే. వేణీసంహారమున దుర్యోధనుఁడు భీమునిచేఁ జావఁ గొట్టబడినపుడు చార్వాకుఁడు మునివేషమున వచ్చి భీముఁడే దుర్యోధనునిచేఁ గొట్టఁబడెననెడి యసత్యము నుడివి ద్రౌపదీధర్మజాదులఁ

1. యుద్ధకాండం-128 సర్గము. 1-5 శ్లోకములు.

గలవరపెట్టి నిజముగ భీముఁడే వచ్చినను కొంత సేపటికిఁ గాని నమ్మకుండునంతటి వంచనము సల్పినవిషయమును గ్రహించి యీ కవి యిచ్చో శూర్పణఖ పర్ణాదిని యను తాపసివేషమున భరతాదుల వంచించు సన్నివేశమును గల్పించియుండవచ్చును. కథ కొంతమార్చినను నీ కవి భరతుని శీలమును దీనిచే మెరుగిడు చున్నాఁడు. రామాయణమున హనుమంతుని భరతుని కడకు ముందుగాఁ బంపునపుడు భరతునిచిత్తవృత్తి యెట్టిదో కనుగొని వేగమ రమ్మని నుడివినట్లున్నది. ఆ భరతచిత్తవృత్తి పరీక్షార్థమే మనకవి యీ పర్ణాదినీ వృత్తాంతమును గల్పించి యుండనోవు. భరతుఁడు పంచప్రాణములను రాముని మీఁదనే యుంచినవాఁడు గావున తాపసీవచనములు నిజ మని నమ్మి రామవిరహితప్రపంచమునఁ దా నుండ నొల్లక యగ్నిని బ్రవేశింప సిద్ధపడును. దీనిచే భరతునకు రామునిపైఁ గల ప్రేమభక్తి విశ్వాసములు వ్యక్తమగుచున్నవి. ప్రాణము వీడుపర్యంతము నాటకకథ నుచ్చదశకుఁ దెచ్చి యెద్దియో యొక యుపాయమున దప్పించుట హైందవనాటకసంప్రదాయమై యున్నది. ఖేదాంతవిషయముల నిట్లు మార్చుటకూడ మనవారి యాచారము. ఉత్తరరామచరితాదులందు సీతాసమాగమము మరలఁ గల్పించుట కిదియే కారణమని తెలియుచున్నది. ఇట నీ నాటకమునను భరతున కట్టి ప్రమాదస్థితిపర్యంతము పర్ణాదినీవృత్తాంతముఁ గల్పించి తుదకు హనుమంతుఁడు వచ్చి రామవిషయము శుభముగ నుడివి యా ప్రమాదము నుండి భరతుని రక్షించునట్లును కథను వర్ణించి నవ్యత నాపాదించి చమత్కారముగా నడపించినాఁడు. ఇంతకుఁ గవిలక్ష్యము శీలపోషణము గానఁ దదనుకూలమగు సన్నివేశములఁ గల్పించి కథను సాగించును. భ్రాతృప్రేమను జూప కవి యిట నిట్లు కథను వర్ణించినాఁడు.

తుదకు భరతునొద్దకు రామాదులు రాగా వారి పరస్పరానందమునకు మేరలేదు. వారి కలయిక సందర్భమున సంభాషణ మెంతయు నుత్తేజకరము.

జనకుఁడు నచ్చటనే యుండునట్లీ కవి వర్ణించియున్నాఁడు. నందిగ్రామముననే కౌశిక వశిష్ఠులును, దమకుఁ బ్రణమిల్లిన రాముని దీవింతురు. రాముఁడును బెద్దల మంగళానుసంధానమువలనను బృందారకుల యనుగ్రహమునను దశకంఠుడు నిగ్రహింపఁబడె నని యెంతో వినయమున నుడివి మహోదారుఁడుగా వర్ణింపబడినాఁడు. ఈ నందిగ్రామముననే రామపట్టాభిషేకము కూడ నిర్వర్తింపఁబడుచున్నది. రాముఁడే తుదకు భరతవాక్యమును నుడువుచున్నాఁడు. కథయంతయు మోదాంతముగా ముగియుచు, నందర నానందింపఁజేయుచు నెంతో చమత్కారముగాఁ బ్రేక్షకపాఠకసామాజికులనెల్లఁ దన్మయులఁ గావించినది. అనుక్షణమును నద్భుతచమత్కార సన్నివేశములఁ గల్పించి నాటక ముత్తమరీతిని రచించి యీ మన రామభద్రదీక్షితులు ప్రసిద్ధనాటకముల సర్వస్వము నిందుఁ జక్కఁగా బొందుపరచి మేటికీర్తి నందుకో గల్గినాఁ డనుట సత్యము.

జాకకీపరిణయమున సూక్తులు

1. ప్రపన్నానాం శ్రేయః ప్రగుణయతి పుణ్యైకసులభః।
   సమాజః సాధూనామయమఖిలవంద్యశ్చ భవతి (అం. 1-శ్లో 3.)
   (పుణ్యైకసులభమగు సాధుగోష్ఠి ప్రపన్నులకు శ్రేయస్సును వృద్ధి పరచును. అందరకును ఆ సాధుగోష్ఠి వంద్య మగును.)

2. విప్రలంభాప్రవృత్తానాం విప్రలంభోఽపి యుజ్యతే. (అం. 1)
   (మోసకారులకు మోసమే తగును)

3. మానః కథం బత సహ త్రపయోజ్ఝితవ్యః (అం. 1-శ్లో 25.)
   (సిగ్గుతో మానముకూడ నెట్లు వీడఁదగును)

4. విజానాతి హ్యహిరేవ పదాన్యహేః (అం. 1-శ్లో 38.)
   (పాముకాళ్ళు పాముకే తెలియును.)

5. సర్వే జనాః స్వజనం ప్రశంసంతి (అం. 1.)
   (అందరు వారివారినే ప్రశంసింతురు.)

6. క్వచిత్కస్యచిత్ప్రతాపస్ఖలనం న దోషాయ. (అం. 1.)
   (ఒక్కొకచో నొకానొకనికి ప్రతాపస్ఖలనము దోషము కాదు)

7. అహో వృత్తానుకారితా మాయావిలాసస్య. (అం. 3.)
   (మాయావిలాసముయొక్క వృత్తానుకరణము బాగున్నది.)

8. స్వతంత్రస్యాపి క్వచిత్కస్య చిదస్తి పారతంత్ర్యమ్। (అం. 3.)
   (ఎంత స్వతంత్రుఁడైనను నొకానొకప్పుడు పారతంత్ర్యముండును.)

9. శ్రేయః కరోతి హి విధిర్జగతోఽనుకూలః (అం. 3-శ్లో 77.)
   (జగమున కనుకూలమగు శ్రేయమునే దైవము చేయుచుండును.)

10. యూనోర్యేన పరస్పరం ప్రణయినోర్యోగః ప్రశంసాస్పదమ్।
(అం. 4-శ్లో 27.)
(పరస్పరము ప్రీతిగల యువకులకలయిక ప్రశంసనీయము.)

11. దైవయోగేన కస్య కిం దుష్కరం భవేత్। (అం. 4.)
(దైవయోగమున నెవ్వని కెద్ది దుష్కరము కాగలదు? అన్నియు సుకరములగు నని భావము.)

12. అన్యేన నిక్షిప్తమన్యోఽనుభవతి భాగ్యవశాత్। (అం. 5.)
(ఒకనిచే నిక్షిప్తమైనవస్తువు మరొకడు భాగ్యవశమున ననుభవించును.)

13. న హి సలిలేన ధార్యతే పాషాణః। (అం. 6.)
(నీట పాషాణము తేలదుగదా!)

14. సత్యమప్యప్రియం వక్తుం నార్హమిత్యార్యభాషితమ్। (అం. 7-శ్లో 18.)
(సత్యమైనను అప్రియము పల్కఁ దగదని పెద్దలందురు.)

ప్రసన్నరాఘవమ్-జయదేవుఁడు

ఈ ప్రసన్నరాఘవ మేడంకముల రామనాటకము. మహాదేవపుత్రుఁడగు జయదేవుఁడు దీనికర్త. గీతగోవిందమును వ్రాసిన జయదేవుఁడు నీతఁడు నొక్కరే యని చాలమంది పొరబడుచున్నారు. వీరిరువురును భిన్నులు. కొంత శైలీసామ్య మున్నందున నట్లనుమానింప నవకాశ మున్నది. కాని సునిశితముగ విచారించి చూడ నీ కవు లిరువురును వేర్వేరు వారు. వీరిరువురి పేర్లును జయదేవుఁ డను నామమొక్కటియే కాని వీరి పితలు వేర్వేరు నామకులు. ప్రసన్న రాఘవకర్త తన నాటకప్రస్తావనయందు తన్నుగూర్చి సూత్రధారముఖమున నిట్లు పేర్కొనియున్నాఁడు,

"విలాసో యద్వాచామమృతరసనిష్యందమధురః
కురంగాక్షీబింబాధరమధరభావం గమయతి।
కవీంద్రః కౌండిన్యః స తవ జయదేవః శ్రవణయోః
రయాసీదాతిథ్యం న కిమిహ మహాదేవతనయః॥"

(అంకము 1. శ్లోకము 14.)

అపిచ,

"లక్ష్మణస్యేవ యస్యాస్య సుమిత్రాగర్భజన్మనః।
రామచంద్రపదాంభోజే భ్రమద్భృంగాయతే మనః॥"

(అంకము 1. శ్లోకము 15.)

చంద్రాలోకమను నలంకారగ్రంథమునందు ప్రతిమయూఖముచివర నిట్లు కలదు. ప్రసన్నరాఘవకర్తయే చంద్రాలోకకర్త,

"మహాదేవః సత్రప్రముఖమఖవిద్యైకచతురః
సుమిత్రాతద్భక్తిప్రణిహితమతిర్యస్య పితరౌ।

అనేనాసావాద్యః సుకవిజయదేవేన రచితే
చిరం చంద్రాలోకే సుఖయతు మయూఖః సుమనసః॥"

సత్రాదియజ్ఞవిద్యావిశారదుఁడగు మహాదేవుఁడును, అతనియందే భక్తివినివేశిత చిత్తయగు సుమిత్రాదేవియు నెవని తలిదండ్రులో, అట్టి వాఁడగు జయదేవ కవిచే రచింపఁబడిన చంద్రాలోకమందలి తొలిమయూఖము సుమనస్సులకు సుఖముఁ కలుగఁజేయు గాక.

పైశ్లోకములఁ బట్టి ఈ చంద్రాలోకప్రసన్నరాఘవముల కర్తయగు జయదేవుని తండ్రి మహాదేవుఁడనియుఁ దల్లి సుమిత్ర యనియుఁ గౌండిన్యగోత్రుఁడనియు, నమృతమును వర్షించు తీయని పల్కులవాఁ డనియు, రామభక్తుఁడనియుఁ దెలియుచున్నది. గీతగోవిందకర్త తన గీతగోవిందకావ్యమునఁ బండ్రెండవసర్గము తుదను,

"శ్రీ భోజదేవప్రభవస్య[1] రామాదేవీసుతశ్రీజయదేవకస్య।
పరాశరాది ప్రియవర్గకంఠే శ్రీ గీతగోవిందకవిత్వమస్తు॥"

(సర్గము 12. శ్లోకము 11.)

అని నుడివియుండుటచే నీతని తండ్రి భోజదేవుఁ డనియుఁ దల్లి రామాదేవి లేక రాధాదేవి యనియుఁ దెలియుచున్నది. పరాశరాదినామకు లీతని సుహృదులని కూడఁ దెలియవచ్చుచున్నది. ఈ గీతగోవిందమునందలి కొన్ని యంశములనుబట్టి యీతని సమకాలికులు కొందరు ఉమాపతిధరుఁడను మహాకవి (లక్ష్మణసేన మహారాజమంత్రి). శరణుఁడు గోవర్ధనాచార్యులు, ధోయీ అను ప్రసిద్ధకవులుండి రని తెలియుచున్నది. గీతగోవిందకావ్యారంభమున,

1. రాధాదేవీ (పాఠాంతరం). 2. వామాదేవీ.

"వాచః పల్లవయత్యుమాపతిధరః సందర్భశుద్ధిం గిరాం
జానీతే జయదేవ ఏవ శరణః శ్లాఘ్యో దురూహద్రుతేః।
శృంగారోత్తరసత్ప్రమేయరచనై రాచార్యగోవర్ధన
స్పర్ధీ కోఽపి న విశ్రుతః శ్రుతిధరో ధోయీ కవిక్ష్మాపతిః॥"

(సర్గము 1. శ్లోకము 4.)

పై మహాకవులఁ బేర్కొనుటచే వారు సమకాలికులై యుందురు. ప్రసన్న రాఘవకర్త శివభక్తుఁ డయ్యును శ్రీరామచంద్రపాదారవింద చింతనామృతపానమత్తభృంగము, అద్వైతి, శైవవైష్ణవభేదము లేనివాఁడు. నాటకాంతమున,

'దేవే కౌస్తుభధామ్ని చంద్రముకుటాద్వైతా మతిః ఖేలతు'

(అంకము 7. శ్లోకము 94.)

అని విష్ణువందును, శివునందును నద్వైతమతి యుండు గాక యని నుడువుచున్నాఁడు. గీతగోవిందకర్త వైష్ణవుఁడు.

'యద్గాంధర్వకలాసు కౌశలమభూద్ధ్యానం చ యద్వైష్ణవం'

అని పేర్కొనియున్నాఁడు. కావున మతవిషయమున వీరిరువురును భిన్నులు, ఇక కాలవిషయమునఁ గూడ వీరు భిన్నులే. గీతగోవిందకర్త లక్ష్మణసేన మహారాజునాస్థానమున వెలసినపండితుఁడు. ఆ యాస్థానమున నుండిన కవివరేణ్యుల నొకశాసనమునఁ బేర్కొనియున్నారు. శాసనకాలము 1116 A.D. అ శాసనమున నొకభాగ మిట్లున్నది,

'గోవర్ధనశ్చ శరణో జయదేవ ఉమాపతిః।
కవిరాజశ్చ రత్నాని సమితౌ లక్ష్మణస్య చ॥'

జయదేవకవియుఁ దన గీతగోవిందమునఁ గూడ పై సహవాసుల,

'వాచః పల్లవయత్యుమాపతిధరః'

అను శ్లోకమునఁ బేర్కొని యున్నాఁడు. కావున లక్ష్మణసేనునికాలమే గీత గోవిందకర్తయగు జయదేవుని కాలము కాఁగలదు.

మరియు, లక్ష్మణసేనుని శ్లోకములును, నతనితండ్రి యగు బల్లాలసేనుని శ్లోకములును, శ్రీధరదాసుని సదుక్తికర్ణామృతమునఁ బేర్కొనఁ బడియున్నవి. లక్ష్మణసేనుని పరిపాలనాకాలమున నిరువదియొకటవ సంవత్సరమున నీసదుక్తికర్ణామృతమును వ్రాసినట్లు శ్రీధరదాసుఁడు నుడివియున్నాఁడు. లక్ష్మణసేనుని పరిపాలనాకాలము A.D. 1106–1138. అని తెలియుచున్నది. సదుక్తికర్ణామృతము 1127 A.D. సంవత్సరమున వ్రాయఁబడినది. జయదేవుఁడును లక్ష్మణసేనుని యాస్థానకవి యగుట నాతఁడును నా ప్రాంతము కాలమువాఁడే కానగును. జయదేవుఁడు 1120 A.D. ప్రాంతముల నిజభౌతిక శరీరముం జాలించినట్లు తెలియవచ్చుచున్నది. పైయంశము లన్నిటింబట్టి చూడ గీతగోవిందకర్త 11–వ శతాబ్దముచివరను 12–వ శతాబ్దారంభమునను నుండినట్లు నిర్ణయింప నగును.

ఇక ప్రసన్నరాఘవకర్త యగు జయదేవుఁడు 1500–1577A.D. కాలమున నుండి యుండు నని పరంజపెగారు ప్రసన్నరాఘవ నాటకోపోద్ఘాతమున వ్రాసియున్నారు. కాని యది విశ్వసింప రాకున్నది. ప్రసన్నరాఘవకర్తయే పక్షధరమిశ్రునామాంతరుఁడు, తార్కికుఁడు. తాను తార్కికుఁ డను విషయము ప్రస్తావనయందే నటీసూత్రధారసంభాషణము ముఖమున,

'నన్వయం ప్రమాణప్రవీణోఽపి శ్రూయతే తదిహ చంద్రికాచండాతపయోరివ కవితార్కికత్వయో రేకాధికరణతామాలోక్య విస్మితోఽస్మి' అని పేర్కొనియున్నాఁడు. ఇతని ప్రసన్నరాఘవనాటకభాగములు సర్వజ్ఞసింగ భూపాలుని రసార్ణవసుధాకరమున నుదాహరింపఁబడి యున్నవి.

రసార్ణవసుధాకరమున నాళికాభేదమున కంతర్లాప కుదాహరణము–యథా ప్రసన్నరాఘవే.

"ప్రత్యంకమంకురితసర్వరసాభిరామం
నవ్యోల్లసత్కుసుమరాజివిరాజిబంధమ్।
ఘర్మేతరాంశుమివ వక్రతయాపి రమ్యం
నాట్యప్రబంధమతిమంజులసంవిధానమ్॥"

ఈ సర్వజ్ఞసింగభూపాలునికాలము 1330 A.D. అని తెలియుటచే నీ జయదేవుఁడు తత్పూర్వుఁడై యుండవలయును. మరియు నీ జయదేవుని ప్రసన్నరాఘవ శ్లోకములు శార్ఙ్గధరపద్ధతియందు నుదహరింపఁబడి యున్నవి. ఈ శార్ఙ్గధరపద్ధతి రచనాకాలము 1363 A.D. యని నిర్ణయించి యున్నారు. ఈ కారణములచే నీతఁడు 1363 A.D. కి పైవాఁడు కాఁదని తేలుచున్నది. ఇంకను నీ జయదేవుని ప్రసన్నరాఘవమందలి శ్లోకములు జల్హణుని సూక్తిముక్తావళియందును గానవచ్చుచున్నవి.[1] భోజుఁడు తన శృంగారప్రకాశమందు ప్రసన్నరాఘవశ్లోకముల నుదహరింపఁ లేదు. భోజునికాలము 1018–1063A.D. కావున భోజునికిఁ బిమ్మటను జల్హణునకుఁ బూర్వమును గావలసివచ్చుచున్నది, జల్హణుని సూక్తిముక్తావళిరచనాకాలము 1257A.D. కావునఁ దత్పూర్వుఁడును భోజునకుఁ దరువాతివాఁడును కావలయును. అందుచే నీ ప్రసన్నరాఘవకర్త జయదేవుఁడు 12–వ శతాబ్దమువాఁడు కావలయును.

శ్రావ్యమగు పదజాలమును, అనుప్రాసరచనయు నీ యిరువురు జయదేవులకును దుల్యమే. వీరి శైలులు చూచినంత నిరువురు నొక్కఁరే యైయుందురని కూడ నూహింపఁ జాలునట్లుండును. కాని వీరి తల్లిదండ్రుల పేళ్ళు భిన్నములుగా నుండుటచే వీరిరువురు కూడ భిన్నులే యగుదురు.

1. M. Krishnamachari (Classical Sanskrit Literature).

గీత గోవిందకర్త జయదేవుఁడు ప్రసన్నరాఘవ చంద్రాలోకముల రచించిన జయదేవునికిఁ బూర్వుఁడు. వీరిరువురకును సుమారు నలువది యేబది సంవత్సరముల వ్యవధాన ముండి యుండవచ్చు నని తోఁచుచున్నది. కావున నతని కాలము 12-వ శతాబ్దము పూర్వమైయుండనోవు.

కథాసంగ్రహము

ప్రథమాంకము: ప్రస్తావన కాగానే దాల్భ్యాయనుఁడను శిష్యుఁడు ప్రవేశించి భ్రమరఝుంకారమును విని యాభాషనెరింగినవానివలె నా నాదమున కర్థ మూహించి బాణాసుర రావణాసురులు సీతాపాణిగ్రహణకుతూహలమున హరచాపారోపణమునకై మిథిల కేఁగినట్లు నుడువును. అవల నా నాద మిరువురు వందుల సంభాషణ మని తెలిసికొనును.

మంజీరకనూపురకులను నిరువురు వందులు సీతాస్వయంవరార్థము వచ్చిన రాజులును, మల్లికాపీడుఁడు, కర్పూరతిలకుఁడు, వీరమాణిక్యుఁడు, మత్స్యరాజు, సింధురాజు మున్నగు రాజోత్తముల వర్ణింతురు. వీరందరును హరచాపారోపణయత్నమున నసమర్థులు కాగా నుర్వీతలము నిర్వీర మని వంది యనును. ఆ పల్కు లాలకించి దశకంఠరుఁడు సాటోపముగఁ బ్రవేశించి వాగాడంబరముఁ జూపును. వంది యాతని వాచాలుఁ డని యతని పరాక్రమమును సంశయించును. రావణుఁడు సీతాసౌందర్యమును గొనియాడును. చాపారోపణము బంధకముగ భావించి విధి కూడఁ తనకు విరోధ మాయె నని దూరును. ఇంతలో నంతఃపురమున మైత్రేయి యొసఁగిన శ్రీరాముని చిత్రపటము నతికౌతుకమున స్త్రీజనము తిలకించుచుండును. రావణుఁడు శివచాపమెత్త యత్నించుచు దానిని గదల్ప లేక ఖిన్నుఁడై ధనువు వక్రపథ మని సరళమగు నిజకరవాలధారాపథమున

సీతను గొంపోఁ దలఁచును. మానవకీటకముల కెంత ధార్ష్ట్యమని నిజరూపముననే గోచరించి భయపెట్టఁ దలంచి ప్రవేశించును. నూపురకుఁ డతనిని జోరునివలెఁ బ్రవేశించె ననఁ గుపితుఁడై జానకి యెచట నున్న దని ప్రశ్నించును. 'రావణు నెదుర్కొను వారీ రాజమండలమున నెవ్వరును లేరా' యనుచుండ సహస్రబాహుఁడగు బాణాసురుఁడు ప్రవేశించి దశముఖుని వీరడంబరము నాక్షేపించుచు బహుముఖత బహుప్రలాపితకుఁ గారణ మనును. దశకంఠుడును బాణాసురు నధిక్షేపించును, బాణాసురుఁ డు కేవలము హరచాపారోపణమున నాసక్తుఁడే కాని జనకపుత్రీపాణి గ్రహణాభిలాషి కాదనును. రావణుఁడు కేవలము జానకీకరగ్రహణమునే వాంఛించును.

అంత వారిలోఁ దారతమ్యపరీక్షకై హరచాపము ప్రమాణముగఁ గొని తొలుత బాణాసురుఁడు వేయిచేతులతో నెత్తినను జాపము చలింప లేదు. బాణరావణులు స్పోత్కర్షలఁ జాటుకొందురు. బాణుఁడు నిష్క్రమించును, రావణుఁడు సీతను బలాత్కారముగా నైనఁ గొంపోఁ దలఁచుచుండ, నింతలో నేపథ్యమున మారీచుని యా క్రందనధ్వని విని యతని నోదార్ప నేఁగును. మంజీరకనూపురకులును జనకున కా వృత్తాంతము నివేదింప నేగుదురు.

ద్వితీయాంకము: ఇరువురు రాక్షసులు తాపసభిక్షుక వేషములతో సంభాషించుచు రావణుఁడు మిథిలలో నున్నాఁ డనియుఁ దాటకాసు బాహులు మరణించి రనియు, మారీచుఁడు దూరముగ నుత్ప్లుతుడాయె ననియు, రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట మిథిల కేఁగుచున్నా రనియుఁ దెలియఁ జేయుదురు.

రామలక్ష్మణు లా యరణ్యమార్గమున నారామ రామణీయకముం బ్రశంసించుచు వసంతర్తుశోభం గొనియాడుచు సాయంతన

దేవతార్చనమునకై పూవులఁ గోయుచుందురు. ఇంతలో నచ్చట నొక చండికాయతనముచెంత శబ్దము విని యెవ్వతెయో పురాంగన యొకతె చండికార్చనమునకు వచ్చి యుండునని తలఁచి రాముఁడు పరస్త్రీ యని చూడ సంకోచించి, కన్య యని తెలిసి సీతంజూచి యామె చక్కందనమును చాల మెచ్చికొనును. సీతయు రాముని గాంచి వసంతసహచరుఁడగు మన్మథుఁడని వర్ణించును. అంత సీత చండికాయతనమున నమస్కరించును. ఆమె చెలికత్తెయు సీతకు ఇందుసుందరుఁడగు కాంతుఁడు సత్వరము లభించుఁగాక యని మ్రొక్కును. రాముఁడా పల్కులు విని పరిణయోత్సుకత నెరింగి వయస్సంధి నట్లుండు టుచిత మని భావించును. ఇంతవరకు మరుగుగ నున్న యొక లత యదృశ్యము కాగా, సీతాసఖులు రామ లక్ష్మణులును నన్యోన్యము విలోకింతురు. లక్ష్మణున కేలకో సీతం జూడగనే మాతృభావము పొడమును. జానకికిఁ గూడ లక్ష్మణునెడ వాత్సల్య మంకురించి యూర్మిళ స్మృతికి వచ్చును. సీతయు నామెచెలికత్తెయు నచ్చటి వాసంతీలతా సహకారపాదపములకడ కేగి యవి కలసియుండుటఁ గాంతురు. రాముఁడా ప్రాంతముననే లతాంతరితుఁడై సీతాసౌందర్యముం గొనియాడును. సీతయు రాముసౌందర్యముం గాంచి నేత్రానంద మనుభవించి తదేకాయత్తచిత్తయగును. సఖి యామెను మరల్పఁ గోరి నర్మాలాపము లాడును. సీతారాము లొండొరులు విలోకనాదులచేఁ జక్షూరాగ మనుభవింతురు. ఇంతలో చేటిక వచ్చి రాణులు సీత నింటికిఁ గొనివచ్చి చక్కగ నలంకరింప నాజ్ఞాపించి రని సీతను దోడ్కొని పోవును. అప్పటికి సాయంకాల మగును. రామలక్ష్మణులును సంధ్యాకాలమును జమత్కారముగా వర్ణించుచు విశ్వామిత్రునికడ కేగుదురు.

తృతీయాంకము: కుబ్జవామనకు లిరువురు ప్రవేశకమున సంభాషించుచు విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను వెంటఁ బెట్టుకొని

జనకుని యాస్థానమునకు హరచాపసందర్శనార్థ మేతెంచుచున్నట్లు తెలుపుదురు. రాముఁడు తాటకాసంహారకుఁ డని నేపథ్యమునఁ బల్కగా విని వామనకుఁడు రామునకు హరచాపారోహణము సంభావ్యమే యనుచు రాణివాసమున కావృత్తాంతముఁ దెల్ప నేగును.

సూర్యోదయము కాగానే రామలక్ష్మణవిశ్వామిత్రులు సూర్యభగవానుని వర్ణింతురు. విశ్వామిత్రుఁడు తనలో జనకుఁడు సీతను రామున కొసఁగి సంభావించునా యని వితర్కించుచుండ లక్ష్మణుని ప్రభాతవర్ణనవాక్యములు 'స్యయం లక్ష్మీర్లబ్ధవికాసపంకజకరన్యస్తా పురః స్థాప్యతే' యనుట శుభసూచకములగుటకు సంతసించును. రామవిశ్వామిత్రులు జనకుని విజ్ఞానమును బ్రశాంతతను గూర్చి ముచ్చటించుచు రాజభవనముఁ జేరుదురు. వీరి యాగమనసంతోషమున శతానందుఁడు నగరము నలంకరింపఁ జేయును, జనకవిశ్వామిత్రు లొండొరులు దర్శించి యుదాత్తముగ సంభావింతురు. జనకుని బ్రహ్మవిద్యాచాతుర్యమును విశ్వామిత్రుఁడు ప్రశంసించును. జనకుఁడును విశ్వామిత్ర పునస్సృష్టినైపుణ్యముంగొనియాడును. విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను దాశరథులని జనకశతానందులకుఁ బరిచయపరచును. విశ్వామిత్రుఁడు సంభాషణమున సీతారాముల వివాహసంబంధమును వ్యంగ్యముగ ఇందు కుముదినీ బాంధవ్య మని సూచించును. ఇంతలోఁ గౌశికుడు హరచాపమును దేఁగోరుచు జనకునకు విస్మయము గల్గునట్లు క్షీరకంఠుఁ డగు రామునే ఆనయన ఆనమనములఁ గావింపఁ గోరి రాముని బ్రోత్సహించును. జనకుఁడు రావణుఁడు గూడ నా చాపారోపణవిషయమున విఫలుఁడాయె నని రామవిషయమున ననుమానించుచు నిజచిత్తవృత్తి డోలాయమానముగ నున్న దని తెల్పును. రాముఁడు సకలాశ్చర్యకరముగ నా శివధనువు నారోపణము గావించి టంకార మొనరింప నా ధనువు

భగ్నమై బ్రహ్మాండము భేదిల్లునట్లు శబ్దించెను. సీతారాముల కల్యాణముతో నూర్మిళను లక్ష్మణునకును, మాండవీశ్రుతకీర్తుల భరతశత్రుఘ్నులకు నొసఁగి వివాహము సల్ప నిశ్చయింతురు. తత్సన్నాహతత్పరులై యెల్లరు నిష్క్రమింతురు.

చతుర్థాంకము: జనకుఁడు హరచాపారోపణపణమునఁ గన్యాదానముఁ జేయుటకుఁ బరశురాముఁడు కుపితుఁడై నిజపరశుప్రభావమును గొనియాడుచు జనకునిగర్వ మడఁప నెంచును, ఇంతలో శతానందశిష్యుఁడు తాండ్యాయనుఁడు హరశరాసనము భగ్నమయ్యె నని నుడువుచుండ నర్థోక్తిని గ్రహించి యాతనిమద మడగింప నెంచుచుండ నింతలో నేపథ్యమున కృతవివాహమంగళులగు సీతారాముల స్వస్తివాచనిక మని విని తాండ్యాయనుని మూలమున దాశరథియగు శ్రీరాముఁడే హరచాపభంగకర్తయని యెరింగి రాఘవవంశము నిర్మూలన మొనరింపఁ దలంచును. కాని స్వయముగ రాముని జూచి శృంగారవీరాద్భుతరసమూర్తి యని ప్రశంసించును. రామలక్ష్మణులును బరశురాముని ప్రభావము నుగ్గడించి వీరశాంతరసమూర్తి యని లక్ష్మణుడును విస్మయనీయశీలురలో నగ్రగణ్యుఁ డని రాముఁడును కొనియాడుచు నంజలిబద్ధులై వ్రొక్కుదురు. భార్గవుఁడు రామునివినయమునకు మెచ్చి కొంత జాలిపడుచుఁ గొంత కోపించుచు సంభాషించుచు రాముని బాహువుల ఖండింతు ననును. రాముఁడు వినయమున నిగ్రహానుగ్రహస్వాధీనుఁడని తన్ను దెల్పుచు హరచాపభంగము కాకతాళీయముగఁ దా నద్దాని నంటగనే కలిగె ననియు నద్ధాన తాను నిరపరాధి ననియు విన్నవించును. కాని జామదగ్న్యుఁడు నిష్కారణముగ శ్రీరామునికుత్తుక కత్తరింతుననును. శ్రీరాముఁడును వెరవక యేమైనను దాను మాత్రము బ్రహ్మణులపట్ల శౌర్యముఁ జూప ననఁబరశురాముఁడు

తన్ను బ్రాహ్మణమాత్రునిగ రాముఁ డెంచుచున్నాఁ డని నిజప్రతాపమును జెప్పికొనుచు రాముని ఖండింతు ననును. రామలక్ష్మణులు వినయమునఁ దమ్ము మన్నింప వేడుదురు. భార్గవుఁడు కోపమున నిజకుఠారప్రభావమున భూమి క్షత్రియకంఠరుధిరసిక్తమై నీరేణుక యయ్యె ననును, లక్ష్మణుఁ డామాట లందుకొని సత్యముగ భూమి నీరేణుక యయ్యె నన పరశురాముఁడు తనతల్లియగు రేణుకవృత్తాంతము నెత్తిపొడుచుచున్నాఁ డని మరింత కుపితుఁడై రామునిపైఁ బరశువును బ్రయోగింపఁ బూనును. ఇంతలో జనకుఁడు భార్గవుని బెదరించుచు ధనువుఁబూని వచ్చును. భార్గవుఁడు జనకుని, శతానందుని, విశ్వామిత్రుని, పెద్దల నందర దూషించుచుఁ దూలనాడును, అంత గురుధిక్కారము సైప లేక శ్రీరాముఁడు భార్గవుని తూలనాడి యాతనితోఁ బోర సిద్ధపడును. కాని భార్గవుఁ డత్తరి రామునందు విష్ణ్వంశమును దిలకించి శాంతించును. రాముఁ డును సిగ్గుపడి వినయమున నతనికిఁ బ్రణమిల్లును. భార్గవుఁడు రామునొద్ద సెలవుఁగైకొని యెటకో వెడలిపోవును.

పంచమాంకము: గంగాయమునాసరయూనదులు సంభాషించుచు సీతాకల్యాణానంతర మయోధ్యలో దశరథుఁడు కైక కిచ్చిన వరద్వయవిషయము, రామవనగమనము, నందిగ్రామమున రామాగమనమునకై భరతనిరీక్షణము, మున్నగు నంశములు తెలియఁ జేయుదురు. రాముఁడు వనమున కేఁగు నపుడు కౌసల్య యొక యుంగరమును సదా ధరింపు మని యొసఁగె ననియు వనగమనమున సీతారామలక్ష్మణు లెట్లుండి రన్న విషయమును తెల్పుదురు. అవల నొక హంస సీతారామలక్ష్మణులు గోదావరీప్రాంతముల కేగి రనియు నట శూర్పణఖను లక్ష్మణుఁడు నాసికాచ్ఛేదమొనర్చుట, జనస్థానవాసులతో రాముఁడు పోరివారిం జెండాడుట, హిరణ్మయహరిణమునకై రాముఁడు

దూరముగ నేగుట. లక్ష్మణుఁ డాతనికై యేగ భిక్షురూపమున రావణుఁడు సీతం గొనిపోవుట, అరుంధతి జానకికి భర్తృవియోగ మొక నాడైనను గలుగకుండుటకై ప్రభావవంతమగు నూపురద్వయము నొసగుట, మున్నగు విషయముల నుడివి వెడలిపోవును. అంత నా ముప్వురు గంగాయమునానదరయువులు గోదావరీసమేతలై సాగరునిఁజేరి సంభాషింతురు. వారి సంభాషణమున సీత కనసూయాదేవి నిశాచరు లంటకుండుటకై యంగరాగ మొసఁగె ననియు, రావణుఁ డా సీత నంటఁ బోగా నది మంటలుగాఁ గనఁబడె ననియు వరుణమంత్రచింతనమునఁ జల్లఁబడఁ జేసి సీత నెత్తుకొనిపోయె ననియు, జానకి హా రామ! యని యేడ్చుచుండ నింతలో జటాయువు రావణు నడ్డగించి క్షతగాత్రుఁడై మరణించె ననియు, సీత యేడ్చుచు నిజనూపురము నొకదానిని నేలఁబడవైచె ననియు, సీత రావణానీతయైన దనియుఁ దెల్ప నందరు మూర్ఛిలుదురు. కొంతవడి కొండొరుల నాశ్వాసించుకొనుచు సీతానూపురము నెవ్వఁడో కపి ఋశ్యమూకమునకు గొంపోయెననియు, రామలక్ష్మణు లా దిశకే యేగి రనియు ముచ్చటించుకొనుచుండ నింతలోఁ దుంగభద్ర ప్రవేశించి సుగ్రీవుఁడు సీతానూపురమును రామునకుఁ జూప, నా విశ్వాసమున రాముఁడు వాలిని వధించి సుగ్రీవునకుఁ గపిరాజ్యముఁ బట్టముఁ గట్టె ననియు, నందులకు సుగ్రీవుఁడు సీతాన్వేషణమునకై కపివరుల నల్దిశలకంపె ననియు నుడువ నందరును సంతసింతురు. హనుమంతుఁడు సముద్రము లంఘించును. అందరు నిష్క్రమింతురు.

షష్ఠాంకము! రామలక్ష్మణులు వనములఁ దిరుగుచుందురు. సీతా విరహము దుర్భరము కాగా రాముఁడు చాల కష్ట మనుభవించుచుఁ జంద్రాదులనెల్ల సీతం జూపుఁడని ప్రలపించును. లక్ష్మణుఁ డాతనిచిత్తమును మరల్ప యత్నించుచుండును. ఇంతలో రత్నశేఖరచంపకాపీడులను నిర్వురు

విద్యాధరు లదృశ్యులై గగనమున సంభాషించుకొనుచుందురు. రత్నశేఖరుఁడు తాను లంకలోఁ జిత్రరూపుఁడను రాక్షసునినుండి యింద్రజాలవిద్యను గ్రహించినట్లు నుడువఁ జంపకాపీడుఁ డాతని విద్యను జూపు మన సరసరమణీయమగు లంకా వృత్తాంతమునే యటఁ జూపును. అయత్నమున లభించిన యీ దృశ్యమును జూడ రాముని లక్ష్మణుఁడు హెచ్చరించును. కాని రాముఁడు సీతావిరహమున సీతను, గోదావరీతీరవాసమును స్మరించుకొనుచు సీతావచనములఁ దలపోయు చుండ, నింతలో నింద్రజాలమారంభమై సీత గోచరించును. రాముఁడామెను నిజముగ సీతయే యని యెంచి యామె చెంత కేఁగఁ గోరును. లక్ష్మణుఁ డాతని కది యింద్రజాలప్రభావ మని హెచ్చరించును. లంకలో సీతారూపముం జూచి చాల కృశించిన దని రాముఁడు జాలి చెందును. సీతయు నిజదీనావస్థం దలపోసికొనుచు రామైకజీవితయై మూర్ఛిలును. అంతఁ ద్రిజట వచ్చి సీత నోదార్చి యెద్దియో కలఁ గనియుందు వన సీత రాముని గాంచినట్లును, నది చింతాస్వప్నమనియు, రామునిచే నుపేక్షింపఁబడి. విరహమునఁ దానట్లు జీవించుట నిష్ప్రయోజన మనియుఁ దెల్పును. రాముఁడా పల్కులు విని నిజచిత్తవృత్తిని దెలియక సీత యట్లు పల్కుచున్న దని తనహృదయముననే సీత యున్న దనును. ఇంతలో రావణుఁడు సీతకడ కరుదెంచి తన్ను ప్రేమింపఁ బ్రార్థనాప్రలాపములు గావించును. సీత విముఖురాలు కాగా నామెను ఖడ్గమున ఖండింప నుంకించును. రాముఁ డా దృశ్యముం గాంచి రావణు నడంప లక్ష్మణుని ధను వందుకొనుమనును. సౌమిత్రి యింద్రజాల మని మరల రామునకు హెచ్చరించును. రావణుఁ డు సీతాకంఠము ఖండించి రుధిరము పట్టుదు నని కపాలముఁ దేఁ గోర నెవ్వరో యక్షకుమారునిశిర మాతనిచేత నిడఁ గాంచి మూర్ఛిలి. లేచి యది కపిచేష్టితమని యాతని బరిమార్ప నటనుండియేఁగును. సీత ఖిన్నయై యగ్నిని ప్రవేశింప నెంచి త్రిజట నగ్నికణముం దేఁగోరును. త్రిజట వలదని

వారింప సీత యటఁ జెంత నున్న యశోకశాఖినే వేడుకొన నందుండి యగ్నివలెఁ బ్రకాశించు రత్నాంగుళీయక మొందు గోచరింప దానిని గ్రహించి రామచంద్రుని దని యెరింగి సంతసించి, హనుమంతుని జూచి, యతనిద్వారా రామలక్ష్మణుల వృత్తాంత మెరింగి యూరటఁ జెంది యుండును. దీనినంతయు రాముఁడు కాంచి హనుమద్విలసిత మని సంతసించును. అవల హనుమంతుఁడు సీతకు నిజవృత్తాంతమును దెల్పి సీతావియోగమున జగ మంతయు విపరీతముగఁ దోఁచుచున్న దను రామసందేశము నుడువును. త్రిజటయు సీతను బ్రతిసందేశమంపఁ గోర సీతయు నిజదృష్టి సదా రామవదనశశధరలావణ్యరసపిపాసాసక్తమని ప్రతిసందేశ మంపుచు నిజచూడారత్నము నభిజ్ఞానముగఁ దీసి హనుమానునకిచ్చును. హనుమంతుఁడును సీతయొద్ద సెలవుగైకొని వెడలి పోవుచుండ లంకలో గొంద రాతని బట్టుకొని తోఁకకు నిప్పంటింప నతఁడు లంకను దహించి సాగరమున స్వాంగలగ్నాగ్నిని జల్లార్చుకొనును. దీని నంతయుఁ జూచుచున్న వారందరును హర్షవిషాదము లనుభవించుచు మహాశ్చర్యమునొందుదురు. ఇంతలో హనుమంతుఁడు సముద్రముదాఁటి రామసన్నిధికి వచ్చును. రాముఁడు సంభ్రాంతిఁజెంది నది యంతయు మహేంద్రజాల మని లక్ష్మణుఁడు హెచ్చరించును. అందరు నిష్క్రమింతురు.

సప్తమాంకము: రావణుఁడు సీతం జూడ నెంచుచుండఁ బ్రహస్తుఁ డొక చిత్రపటముం జూపును. అందు సాగరము, కపికులము, రామలక్ష్మణులు, విభీషణుఁడు, సేతుబంధము, మున్నగువానిని దిలకించుచుండగనే కపికుంజరుల కోలాహలము వినఁబడును. మండోదరి యపశకునమును గాంచితి ననును, రావణుఁడు కుపితుఁడై కుంభకర్ణమేఘాదుల రణమునకుఁ బంప వారిరువురును దాశరథుల బాణవహ్నిని శలభత్వ మందుదురు. రావణుఁడును ఖడ్గహస్తుఁడై

ప్రహస్తునితో నేగును. ఆకసమున నొక విద్యాధరీమిథునము రణముం దిలకించుచుండును. నీలుఁడు, విభీషణుఁడు, రామలక్ష్మణులు రావణునితోఁ బోరుదురు. లక్ష్మణుఁడు మూర్ఛ నొందును. రాముఁడు విలపించును. సుగ్రీవుఁడాతని నోదార్చుచుండ హనుమంతుఁడు గంధమాదనశైలమును తేఁ గా నందలి మహౌషధుల యామోద మాఘ్రాణించి లక్ష్మణుఁడు కనులు తెరచి మరల రణమునకు సిద్ధపడి రాముని సంతసపరచెను. రామరావణయుద్ధము తీవ్రముగా నుండును. ఇంద్రుఁ డు మాతలితో నొక రథమును రామున కంపును. రథస్థులైన రామరావణులు పోరుదురు. రావణుని చాపము రాముఁడు త్రుంచి సాయుధుఁడవై మరల పోరునకు రమ్మనును, మరలఁ బోరుచుండ రాముఁడు రావణుని దశశిరములఁ ద్రుంచుచుండ పదిచేతులు మరల నొక్కొక శిరము నతికించుచుండును. పోరు మరింత తీవ్రము కాగా రావణుఁడు నేల నొరగును. సీత యగ్నిని బ్రవేశించి శుద్ధురాలై బయటికి వచ్చును. విద్యాధరీమిథున మీ వార్త ఇంద్రునకుఁ దెల్ప నేగును. సీతారామలక్ష్మణవిభీషణసుగ్రీవాదులు చంద్రోదయమును బహుధా వర్ణింతురు. అవల పుష్పకము నెక్కి యందరు పయనమై చిత్రకూటమును భారద్వాజాశ్రమమును వర్ణించుచుఁ బ్రభాతసూర్యవర్ణనము జేయుదురు. పిదప యమునాసరయూనదులు దాఁటి యయోధ్యఁ జేరుదురు. వసిష్ఠభరతాదులు రామాగమనమునకై వేచి యుందురు. అందరు విమానమునుండియే సూర్యభగవానుని నమస్కరించి గురు బంధు పౌరజను లానందింప విమానమునుండి యవతరింతురు.

నాటకవిశేషములు

ప్రస్తావనయందు గుణారాముఁ డను నొక నటుని, 'భరతాధిరాజ' యని ప్రశంసించి సుగుణాభిరాముఁడగు కథానాయకుని శ్రీరాముని

స్ఫురింపఁ జేయుచున్నాఁడు. మరియు, 'యః ఖలు రతిజనకనామధేయస్య రాజ్ఞః సదసి హర చాపారోపణం నామ నాటకమభినీయ పరితుష్టేన రాజ్ఞా సమర్పితాం రంగవిద్యాధరఖ్యాతిం ప్రియామివ సమాసాదితవాన్'.....కేనాపి దాక్షిణాత్యేన నటాపసదేన మదీయమేవేదం గుణారామనామేతి వదతా రంగవిద్యాధరఖ్యాతిరపహృతా, తదాకర్ణ్య గుణారామస్తామేవ దిశం ప్రచలిత। అధునా చ శ్రుతమస్మాభిర్యత్కిల సుకంఠనామ్నా గాయకేన సహ మైత్రీం విధాయ దాక్షిణాత్యానాం భూభుజాం సదసి తేన సహ రంగసంగరము పక్రాంతవానితి'.

(రతిజనకుఁ డను పేరు గల రాజసభయందు హరచాపారోపణ మను నాటకము నభినయించి సంతుష్టుఁడైన యా రాజుచే నొసగఁబడిన రంగవిద్యాధరుఁడను ఖ్యాతిని కాంతను బోలెఁ బడసినవాడు..... దాక్షిణాత్యుఁడగు నొకానొక నటాపశదుఁడు ఈ గుణారామనామము తనదియే యని చెప్పుకొని యీతని రంగవిధ్యాధరుఁడను ఖ్యాతిని అపహరించెను. దానిని విని గుణారాముఁ డా దెసకేగె నని మే మిపుడు వింటిమి. అతఁడు సుకంఠుఁ డను గాయకునితోఁ జెలిమి చేసి దక్షిణాపథరాజసభలలో నాతనితో రంగసంగరము నారంభించె నట.....)

కవి ఈ సంవాదమున గుణారామనామముచే శ్రీరాముఁడును, రతిజనకనామముచే జనకమహారాజు, హరచాపారోపణనాటకముచే శివధనుర్భంగరూపచేష్టయు, ఖ్యాతిని కాంతను బోలె యనుటచే సీతావిషయమును, (స్త్రీలింగసారస్యముచే) దాక్షిణాత్యుఁడెవ్వఁడో నటాపశదుఁడు హరించె ననుటచే రావణప్రశంసయు రంగసంగరము దాక్షిణాత్యరాజసభలలో నారంభించె ననుటచే దశకంఠునితోడి యుద్ధమును, సుకంఠుడను మిత్రునితో ననుటచే సుగ్రీవప్రశంసయుఁ జమత్కారముగా నీ కథావస్తువు నంతయు దీన వ్యంగ్యముగాఁ దెలుపుచు నిమిడ్చినాఁడు.

మరియు, నాటకనామము నొక శ్లోకములో నిమిడ్చి ప్రత్యష్టమాక్షరసం కలనమున 'ప్రసన్నరాఘవమ్' అను పేరు వచ్చునట్లు రచించి నిజసారస్వత ప్రతిభం జాటినాడు జయదేవుఁడు. ఈ శ్లోకము చూడుఁడు.

ప్రత్యంకమంకురిత సర్వరసాభిరామం
నవ్యోల్లసత్కుసుమ రాజివిరాజిబంధమ్।
ఘర్మేతరాంశుమివ వక్రతయాపి రమ్యం
నాట్యప్రబంధమతి మంజులసంవిధానమ్॥

(అంకము 1. శ్లోకము 7.)

సభ్యుల కుత్సాహము గలిగించుటకై నాటకము ప్రత్యంకరసాభిరామ మనియు, వక్రతయాపిరమ్య మని నాటకమునఁ గ్రొత్తపోకడలు అనగా మార్పు లున్నను రమ్యముగా నుండు ననియు నీ కూర్పు మనోహర మనియు నుడివి యున్నాఁడు. ఇందే నాటకనామము నిముడ్చుట కవితాప్రౌఢిమను దెలియఁ జేయుచున్నది. కావుననే నటమూలమున కవి 'అహో దేవ్యాః కవికులకుముదవనవికాసచంద్రికాయాః ప్రసాదమహిమా సరస్వత్యాః' (కవులనెడి కలువల వికాసమునకు వెన్నెల యయిన వాగ్దేవియొక్క యనుగ్రహవిశేషప్రభావము.)

'యస్మాదేవం విధాః కవీనాం విచిత్రమధురాః సూక్తయః సముల్లసంతి' (దానివలననే కవులకు విచిత్రమధురములగు పల్కులు వెలయుచున్నవి.) అనుచున్నాఁడు.

శ్రీరాముఁ డనిన నీ కవికి మహాప్రీతి. కవుల కందరకును శ్రీరాముఁ డే వర్ణ్యుఁ డగుటఁ జమత్కారముగా సమస్తగుణములు నా రామునియందే సతత సుఖసంవాసవసతి నేర్పరచుకొనిన వని నుడువును. కవి తనగోత్రనామాదుల నుడువుచు కౌండిన్యగోత్రుఁ డనియు,

సుమిత్రామహాదేవుల తనయుఁ డనియుఁ బేర్కొనెను. ఈతని పల్కులఁ గూర్చి,

నట:– 'అహో అస్య కవేః సూక్తీనాం సరళతా కోమలతా చ।

సూత్ర:– క్వచిద్వక్రతా కఠినతా చ

నట:– కథమేతే అపి రమణీయే'

(నట:– ఆహా! యీ కవిసూక్తులు సరళములు కోమలములును,

సూత్ర:– అచ్చటచ్చట వక్రతయు, కాఠిన్యమును,

నట:– అట్లయ్యును రమణీయముగా నున్నవే.)

ఉదాత్తముగా నుడువును. నిజముగ నీ గుణము లన్నియు నీతనికవిత యందుఁ గలవు. ఈతని రచన శ్రవణ పేయము. అను ప్రాసబహుళంబైన సరళశైలి యీతని సొమ్ము. నిజపాండిత్యశౌండీర్యమును జతురములగు ప్రతిభావంతుల వాక్కుల వర్ణించుచుఁ దెలిపి పూర్వకవిస్మరణము చేయనెంచి రసవంతముగా వారిని కవితా కన్యాలంకారులుగా వర్ణించెను. ఈతని యీ కవి ప్రశంసాశ్లోకము ప్రశంసార్హము.

'యస్యాశ్చోరశ్చికురనికరః కర్ణపూరో మయూరో
భాసో హాసః కవికులగురుః కాళిదాసో విలాసః।
హర్షో హర్షో హృదయవసతిః పంచబాణశ్చ బాణః
కేషాం నైషాం కథయ కవితాకామినీకౌతుకాయ॥'

(అంకము 1. శ్లోకము 22.)

కవితాకామినికి చోరుఁడు (తన్నామకమహాకవి) కేశపాశ మనియు, మయూరుఁడు కర్ణపూర మనియు, భాసుఁడు చిరునవ్వు అనియు, కాళిదాసుఁడు విలాస మనియు, శ్రీహర్షుఁడు సంతోషమనియు, బాణుఁడు మన్మథుఁ డనియుఁ దగినట్లు లెస్సగా వర్ణించినాఁడు.

ప్రస్తావనానంతరము యాజ్ఞవల్క్యప్రియశిష్యుఁడు దాల్భ్యాయనుఁడు ప్రవేశించి యేదో మధురనాదము విని తుమ్మెదలరొద యని తెలిసి యా నాదము నుండి యర్థము గ్రహించి బాణరావణాసురులు జనకసదనమునకు సీతాస్వయంవరార్థము బయలుదేరి రని గ్రహించి క్రమముగా తుమ్మెదలరొద యనుకొనినది వందిద్వయంగాన మని తెల్పి వెడలిపోవును. తుమ్మెదలరొదనుండి యా భాషను గ్రహించు నేర్పు తనకుఁ గలదని దాల్భ్యాయనుఁ డా విషయమును గురువునుండి గ్రహించినట్లు తెల్పియున్నాఁడు. తిర్యక్కుల భాషను గూడ గ్రహించు నేర్పు మానవుల కుండెడిదని దీనఁ దెలియుచున్నది.

పిదప మంజీరక నూపురకులను నిరువురు వందులు ప్రవేశించి క్రమముగా సీతాస్వంవరనిమిత్తముగ వేంచేసియున్న రాజకుమారులను కుంతలాలంకారుఁడగు మల్లికాపీడుఁడు, కాశ్మీరతిలకుఁడగు కర్పూరతిలకుఁడు, కాంచీమండనుఁడగు వీరమాణిక్యుఁడు, మత్స్యరాజు, సింధురాజు వీరందరును హరచాపారోపణ యత్నమున నున్నట్లు తెలిపి వీరి సంరంభము లన్నియు నారంభరమణీయము లనియు, నందరు శివధనుస్సును భక్తితో నమస్కరించిరే కాని శక్తిఁ జూపఁ జాలకపోయి రనియు నుడివి, యుర్వీతలము నిర్వీర మా యని పల్క నింతలో రావణుఁ డు సాటోపముగా ప్రవేశించి డంబములు జంబముగాఁ బల్కి సీతా సౌందర్యమును వర్ణించి హరచాపము నవలీల నెత్తఁ గుతుకంపడి, చేతఁ గాక, 'అయేధనురితి వక్రః పంథాః। తత్సరలేనైవ కరవాలధారాపథేన సీతామానయామి' (ఓయీ! ధనువన వంకరపద్ధతి, కావున సరళమగు కరవాలధారాపథమున సీతను దెత్తును) అని తక్కిన రాజలోకమును ధిక్కరించి రణమునకు రమ్మని నిజరూపమున దశముఖుఁడై నిలుచును. మంజీరకనూపురకులు దశకంఠునితోఁ జమత్కారముగా సంభాషించుచుఁడ

రావణుఁడు నిజప్రతాపమును జాటుచు సీతను దోడ్కొని రమ్మనును. ఇంతలో బాణాసురుఁడు వేయిచేతులవాఁడు విని ప్రవేశించి హరచాపమారోపింపఁ బడకయే సీతందోడ్కొని వచ్చుటయా' యనును. అంత వారిరువురును వాక్కలహము సల్పుచు నొండొరులు దూషించుకొందురు, నిజప్రతాపముల డాంబికముగఁ బొగడుకొందురు, వీరిలో బాణాసురుఁడు కేవలము హరచాపారోపణమునకే వచ్చెను. రావణుఁడు కేవలము సీతాపాణిగ్రహణమునకే వచ్చెను. ఇరువురును హరచాపారోపణమున విఫలు లగుదురు. బాణాసురుఁడు వెడలిపోవును. రావణుఁడును సీతను బలాత్కారముగ నైనఁ గొనిపోదు నని ప్రేలుచుండ నింతలో మారీచుని యార్తనాదము విని యతని నోదార్ప నేగును.

ఈ బాణాసురరావణాసురులను బ్రవేశపెట్టి హరచాపారోపణమున నింతటిదోస్సారముఁ గల వారిని గూడ విఫలులుగాఁ జూపి యీ కవి కథానాయకుని బలవిక్రమముల మరింత హెచ్చుగఁ జూపుట కిట్లు కథను సాగించినాఁడు. ఈ కల్పన మంతయు నవ్యము. ప్రతినాయకుఁడగు రావణుని వాగాడంబరము, సీతయందలి కాముకత తొలుతనే చూపి రావణునెడ నేవగింపు గలుగఁ జేయుచున్నాఁడు, రావణప్రగల్భములు కొంతవరకు రాజశేఖరుని బాలరామాయణమునందలి రావణోక్తులను బోలియున్నవి. అంతియకాక సీతాస్వయంవరార్థము విచ్చేసిన రాజమండలమును వర్ణించుట మున్నగు నంశములు గూడ బాలరామాయణమునందువలెనే గోచరించుచున్నవి.

ద్వితీయాంకమునఁ దొలుత విష్కంభముననే భిక్షుక, తాపస సంభాషణమున విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను నిజయాగరక్షణమునకై దశరథుని యాచించి తెచ్చె ననియు, నందులకై కౌశికుఁడును దశరథునకు తాటంక యుగళమును దివ్యప్రభావము గల దాని నుపాయనముగ నొసగె

ననియు రామబాణముచేఁ దాటకాసుబాహులు పరలోకగతు లైరనియు, మారీచుఁడు ప్రాణావశిష్టుఁడుగఁదోలఁబడె ననియు, ప్రకృతము రామలక్ష్మణులు విశ్వామిత్రునితో మిథిల కేతెంచుచున్నారనియు మొదలగు నంశములఁ దెల్పుచున్నాఁడు. ఇందు విశ్వామిత్రుఁడు దశరథునకుఁ దాటంకయుగళము నర్పించుచున్నట్టి కల్పన మీ కవిదే. మాల్యవంతుఁడు ఆ తాటంకద్వయమును హరించి తెమ్మని తాటక నంపెననియు, దానికై తా నటకు (మిథిలోపాంతమునకు) వచ్చితి నని తాపసుఁడు తెల్ప నా విషయము మాల్యవంతుఁ డెట్లు తెలిసికొనె ననుట కొక చక్కని శ్లోకము నుడువుచున్నాఁడు చూడుఁడు,

"వార్తా చ కౌతుకవతీ విమలా చ విద్యా
లోకోత్తరః పరిమళశ్చ కురంగనాభేః।
తైలస్య బిందురివ వారిణి దుర్నివార
మేతత్త్రయం ప్రసరతి స్వయమేవ లోకే॥"

(అంకము 2. శ్లోకము 2.)

కౌతుకముగల వార్త, విమలమగు విద్య, లోకోత్తరపరిమళమగు కస్తూరివాసన, యీ మూఁడును నీటిమీఁద నూనెచుక్కవలె లోకమున స్వయముగ వ్యాపించు ననెను.

పిదప రామలక్ష్మణు లొక రమణీయారామముం బ్రవేశించి మధుమాసావతరణశోభం దిలకించి సహర్షముగ నారణ్యరామణీయకమును గొనియాడుదురు.

ఈ రమణీయారణ్యముననే చండికాలయమునఁ జండిక నర్చింప సీత చెలికత్తియతో వచ్చునట్లును, రామలక్ష్మణులు వారలఁ గాంచునట్లును, సీతా లక్ష్మణులకు మాతృపుత్రభావము లుదయించునట్లును, సీతారాములకు

బ్రేమబీజము లంకురించునట్లును, జిత్రముగా సంఘటింపఁ జేసెను. చెలికత్తె సీతకుఁ దగినదై వాసంతీమాకంద సమాగమమిషమున సీతారాముల కలయికను సూచించుచుఁ జమత్కారముగా వారిరువురఁ బ్రేమపాశబద్ధులఁ గావించును. ఈ కల్పన మంతయు నీ కవికల్పితమే. ఇతనికి తరువాతివారు జానకీపరిణయాదినాటకములం దిట్టి సీతారామసమాగమము స్వయంవరపూర్వమే వర్ణించి యితని ననుకరించిరి. ఈ ఘట్టమున రాముఁడు తొలుత యందెలరవళివిని యెవ్వతెయో పురాంగన చండికాయతనమున కరుగుచున్నదనుకొని యామెను బరకాంత గనుక చూడ నొల్లఁడు, అవల గ్రమముగా నామె యొక రాజకన్యయని తెలిసిన పిదప నామెం జూచి యామె సర్వానవద్యాంగి యని వర్ణించి మనోహరముగ నున్న దనును. సీతయు రాముం గాంచి మన్మథుఁడే యనుకొని యతనికై యువ్విళ్ళూరును. ఈ రీతి నీ కవి సీతారాముల తొలుత నీ యరణ్యమునఁ బరస్పరము చక్షూరాగ మనుభవింపఁ జేసి వారి ప్రణయమును బెంపొందింపఁ జేయుచున్నాఁడు.

తృతీయాంకమున కుబ్జక వామనకులు ప్రవేశించి, ప్రవేశకమున విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులఁ దోడ్కొని జనకమందిరమునకు వచ్చుచున్నాఁడనియు రాముఁడు తాటకను జంపుటచే హరచాపారోపణసమర్థుడును గాఁ గలఁ డనియు నుడువుదురు.

విశ్వామిత్రరామలక్ష్మణులు ప్రభాతవర్ణనము గావింతురు. విశ్వామిత్రుఁడు తనలో 'అపి నామ మయోపనీయమానం రామభద్ర మచిరాదేవ జనకస్తనూజయా సంభావయిష్యతి' (నాచేఁ దీసికొనిరాఁబడిన రామభద్రునకు జనకరాజు తనకూతునిచ్చి గౌరవించునా?) యని సందేహముగ ననుకొనుచుండ నింతలో లక్ష్మణుఁడు సూర్యోదయమును

వర్ణించు వాక్యము లా విశ్వామిత్రుని సంశయము బాపు శుభప్రశంసావాక్యములుగా నుండును. లక్ష్మణుని ప్రభాతవర్ణనము,

"యావన్నీరనిధేః ప్రభాతసమయః ప్రోద్ధృత్య లోకత్రయీ
మాణిక్యం రవిబింబమంబరవణిగ్వీథీపథే న్యస్యతి।
తావత్కర్తుమివాస్య మూల్యముచితం పద్మాకరేణ స్వయం
లక్ష్మీర్లబ్ధవికాసపంకజకరన్యస్తా పురః స్థాప్యతే॥"

(అంకము 3. శ్లోకము 4.)

(ఎందాక, ప్రభాతసమయ మను వాఁడు సముద్రమునుండి జగత్రయ మాణిక్యమను రవిబింబమును గ్రహించి అంబరమను బజారునం దుంచునో, అందాక తగు మూల్య మిచ్చి కొన నౌ నని పద్మాకర మను వాఁడు విరిసిన తామరపూవులను హస్తముల సిరి నిడుచున్నాఁడు) అని చమత్కారముగా వర్ణించినాఁడు.

ఇందు ప్రభాతసమయః జగత్రయీమాణిక్యమగు రవిబింబము. పద్మాకరేణ లక్ష్మీః అను పదసారస్యముచే త్రైలోక్యమాణిక్యమువలె రాజిల్లుచున్న శ్రీరాముని విశ్వామిత్రుడు తోడ్కొని రాగా జనకమహారాజు లక్ష్మివంటి సీతను అర్పింప సిద్ధముగా నున్నాఁ డని వ్యంగ్యముగా సూచింపఁ బడుచున్నది.

సీతను జనకుఁడు రామున కొసఁగి సన్మానించునా యని డోలాయమాన మానసుఁడగు విశ్వామిత్రునకు హర్షజనకములుగా నీ లక్ష్మణవాక్యములు సంవాదము నొసఁగినవి. అప్పట్టున ముగ్ధజనవచనములు దేవతాధిష్ఠితము లని లక్ష్మణవాక్యములు తప్పక సత్యము లని విశ్వసించుచు 'దేవతాధిష్ఠితాని హి ముగ్ధజనవచనాని భవంతి' అని నుడువును. బాలభావమున మనస్సు నిష్కపటముగ నుండుటచే వారి

పల్కులును చొక్కము లనియు దేవతలు బాలవచనముల రూపమున మనకు సందిగ్ధసమయములలో సమాధాన మిచ్చుచుందు రనియుఁ దెలిసి కొననగును.

పిదప విశ్వామిత్రుఁడు జనకు నంతికమున కేగి నపుడు వారిరువురు సంభాషించు తీరు మధురముగా నున్నది. పెద్దల పోకడలు వారి సంభాషణము తీరు తెల్పుటకై మహాకవు లిట్టి సన్నివేశములు దొరకినపు డెల్ల పాఠకులకు నాటకీయ పాత్రలద్వారా తెల్పుచుందురు. పరస్పరమహిమలఁ గొనియాడుచు నెంతో వినయముగాఁ బ్రవర్తింతురు. జనకుఁడు విశ్వామిత్ర పాదారవిందవందన సౌఖ్యము స్వర్గసుఖమునకు మించిన దని ప్రశంసించును. విశ్వామిత్రుఁడును నిమిచక్రవర్తుల ప్రభావ మనన్యసామాన్య మనును. రామలక్ష్మణులును వీరి మాటల నాలకించుచు జనకవిశ్వామిత్ర ప్రభావములఁ దెలిసికొందురు.

ఇందు హరచాపమును రాముఁడే ఆనయన, ఆనమనములఁ గావించును. వాల్మీకిరామాయణమునఁ బెక్కుమంది యా ధనువును సభాంగణమునకుఁ దెచ్చినట్లున్నది. కవి యిట రామపరాక్రమము నతిశయముగ వర్ణింపనెంచి యిట్లు వర్ణించియుండ నోపు. రాముఁడు స్వయముగా నా విల్లు నెక్కుపెట్టి టంకారము సల్ప నది భగ్నమగును. సీతారాముల వివాహమునకు విశ్వామిత్రుఁ డనుజ్ఞయొసఁగ ఊర్మిళాదులను లక్ష్మణాదుల కొసఁగి సీతాకళ్యాణముతోడనే వివాహము గావింప నిశ్చయింతురు. ఈ యంకమున కథాగమనము కుంటువడక వేగముగా చలనము గలిగి సాగినది.

చతుర్థాంకమున జామదగ్న్యుని రాకతో నారంభించును. భవభూతి, మురారి రాజశేఖరులవలెనే యీ జయదేవుఁడును పరశురాముని గర్విష్ఠునిగా

వర్ణించినాఁడు. ఇతని మాటలయం దౌద్ధత్యము తాండవించుచున్నది. తన్ను తన ప్రతాపమును మిక్కిలి పొగడుకొనుట యారభటీవృత్తిశ్లోకములు వ్యక్త మొనరించుచున్నవి. రాముని వినయోక్తులు పరశురాముని విరసపు గర్వోక్తులును సందర్భోచితములుగానున్నవి. రామునకు వైష్ణవధనువు నొసఁగి యెక్కుపెట్టు మనుట మూలాను గుణముగనే యున్నది. రాముఁడు దానిని గూడ వంచిన పిదప పరశురాముని యానందము వైదర్భీశ్లోకముల వర్ణింపబడినది. తొలుత రాముని జూడగనే పరశురాముఁడు కూడ కామునివలె నున్నాఁడనుకొని కొంత జాలి నొందుచు శృంగార వీరాద్భుతరసమూర్తి యని వర్ణించును. లక్ష్మణుఁడును భార్గవుని వీరశాంతరసమూర్తి యని యతనివేషముం జూచి వర్ణించును. ఈ వర్ణనముల కనుగుణముగనే వారి వారి భాషాచేష్టవేషములు వెలయునట్లు చిత్రింపబడినవి. ఇందు కూడ తుదకు శ్రీరాముని విష్ణ్వంశజుఁడని మెచ్చికొని యాతని యనుజ్ఞఁ గొని వెడలిపోవును. ఈ యంకాంతమునఁ బరశురాముఁడు శ్రీరాము నాశీర్వదించు శ్లోకము 'యశఃపూరందూరం' అనునది మరల సప్తమాంకాంతమునను గోచరించుచున్నది. మురారి తన నాటకమునఁ బరశురామవిజయముతోడనే తన రామకథ పూర్తి యాయె ననియు నవ్వలికథ విలాసముగఁ వ్రాసితి నన్నట్టు లీ జయదేవునకు నట్టి యభిప్రాయమే యుండి యిటనే భరతవాక్యమును బోలు నాశీస్సును గూర్చినాఁడు. రామగుణవర్ణనము నందలి యపారప్రీతియే యతని గూడ నవ్వలికథ వ్రాయించియుండ నోపుననియే తోచుచున్నది. కథాగమనము చక్కగనే సాగినది.

పంచమాంకమున సీతాకల్యాణానంతరవిషయము రామలక్ష్మణులు సుగ్రీవుని జేరి హనుమంతుని సీతాన్వేషణార్థము పంపు సందర్భము వరకును గల కథాబాగమును గంగా, యమునా, సరయూ, హంస, గోదావరీ, తుంగభద్రా

సముద్రుల సంభాషణముద్వారా తెలియుచున్నది. ఇందు శ్రీరామున కరణ్యగమనమునకుఁ బూర్వ మొక రత్నాంగుళీయకము కౌసల్య యొసఁగె నను నంశము నూతనముగ వర్ణింపఁబడినది. సీతామాంగల్యసూచకముగ నా యుంగరమును విడువవల దని రామభద్రునకు కౌసల్య యుపదేశించును. అనసూయ యొసఁగు నంగరాగాదులు రామాయణమునందువలెనే యటను సీత కొసఁగబడినట్లు తెల్పఁబడియున్నది, అరుంధతి నూపురయుగళము నొసఁ గుటయు నీ కవికల్పనమే. వనగమనమున నాటకమునకు ముఖ్యమగు నవయవచేష్టాదుల సూచించుచు పథికజన వచనములఁ జక్కగా నిరూపించినాఁడు కవి,

"పంథాః నమః సికతిలో మృదుశాద్వలా భూ
ర్వేతస్వతీ సరిదియం శిశిరా న దూరే।
అగ్రే చకాస్తి సరసీ చ కుముద్వతీయం
కాదంబకూజితకరంబతహంసనాదా॥"

(అంకము 5. శ్లోకము 21.)

అన్యచ్చ

"తరురయమితః శీతచ్ఛాయః స్రవన్మధుశీకరః
సరిదియమితః స్వల్పస్వచ్ఛప్రవాహమనోరమా।
ఇదమిదమితః స్నిగ్ధామోదం మూహుర్మధురధ్వన
న్మధుకరవధూముగ్ధాభోగం వనం సరసీరుహామ్॥"

(అంకము 5. శ్లోకము 22.)

ఈ మార్గము చక్కగా నున్నది. నేల యినుకమయమై పచ్చికమైదానముగా నున్నది. ఈ చల్లని నది చెంతనే యున్నది. అదె ముందు జలపక్షినాద మధురమౌ కల్వకొలను ప్రకాశించుచున్నది.

మరియు,

ఇది పెద్ద చెట్టు. తేనెతుంపరచేఁ జల్లని నీడ యిదిగో, అల్పప్రవాహము గల్గి తేటనీటిచే మనోహరమగు నది యిది. ఇదె చూడుము. తుమ్మెదపిండు చేయు ఝుంకారమధురమగు తామరకొలను.

అని యా యా వస్తువులను హస్తనిర్దేశమునఁ జూపించుచున్నట్లు చమత్కారముగా వర్ణించి వానిని మన కన్నులయెదుట నున్నట్లు గోచరింపఁ జేయుచున్నాఁడు. కుందమాలయందును లక్ష్మణుఁడు వాల్మీకి సీతను గోమతీతీరమునఁ దోడ్కొనిపోవునపుడు మార్గము చూపునపు డిట్టులే దిఙ్నాగుఁడును వర్ణించియున్నాఁడు. ఇట్టి వర్ణనములు నాటకీయముగ నెంతో రాణించును. అరణ్యకాండవిషయ మంతయు నీ యంకముననే కవి యిమిడ్చినాఁడు. ఈ యంకమున నదులు, హంస, సముద్రుఁడు సంభాషించుట భవభూతినుండి గ్రహించి యుండనోపు. అనసూయాదత్తాంగరాగప్రభావమున రావణుఁడు సీతను స్పృశింపఁబోగా మంటలు బయలుదేరె ననియు, నంత దశకంఠుఁడు వరుణమంత్రజపమున నగ్నిని జల్లార్చి సీతం గొంపోయె ననియు నీ కవి యంగరాగప్రభావము నుగ్గడించుటయే గాక మంత్రశక్తిని గూడ గొనియాడినాఁడు. అరుంధతీనూపుర ప్రభావముననే సీతకు సహాయార్థము జటాయువు వచ్చె ననియు నిందుఁ బొందుపరచి పూర్వోత్తరసందర్భములఁ గలిపి సార్థకముగాఁ జిత్రించెను.

షష్ఠాంకమున రాముఁడు సీతావియోగమున మతిలేక చంద్రుని చకోరమును, తరంగిణిని, తుమ్మెదను, చక్రవాకమును వరుసగా సీతావిషయ మడుగుచు దీనముగా నుండును. లక్ష్మణుఁడు రాముని చిత్తవృత్తిని మరల్ప యత్నించును. లక్ష్మణుఁడు తనలో 'కథమిదానీమన్యస్య చేతసి జానకీమయమింద్రజలమున్మీలతి' అని తలపోయుచుండ, నింతలో నాకసమున చంపకాపీడ రత్నశేఖరులను నిరువురు విద్యాధరులు

ఇంద్రజాలముసంగతి సంభాషించుచున్నట్లు వినును. రామవియోగదుః ఖమును గొంచె ముపశమింపఁ జేయ నెంచి కవి యిట, లంకలోని సీతావృత్తాంత మంతయు దూరదర్శకయంత్రమందువలెఁ గేవలము దర్శనమే కాక శ్రవణము గూడ ననుభూత మగునట్టు లీ యింద్రజాలప్రభావమున నిర్వహించుచున్నాఁడు. ఇంద్రజాలాదివిషయములు మంత్రశాస్త్రప్రసిద్ధము లీ సందర్భమునఁ గడుంగడు రమణీయముగ సందర్భోచితముగఁ బొందుపరచి కథను చమత్కారముగా సాగించినాఁడు. నేటి వైజ్ఞానిక ప్రపంచమున Television అను యంత్రసహాయమున నగు కార్యనిర్వాహ మీ యింద్రజాలమున నెరవేరినట్లు తెలియుచున్నది. ఇట్లీ యింద్రజాలప్రశంసచే నీ కవికాలమునకే యిట్టి యద్భుతశక్తులు మన దేశమునను బూర్వముండి యుండెడి వని యూహింప నవకాశము కలుగుచున్నది. ఈ యింద్రజాలకల్పనము నూతనము. రత్నావళ్యాదులందును కొంత యింద్రజాలప్రసక్తి యున్నను, ఈ ప్రసన్నరాఘవము నందలి యింద్రజాలము అద్భుతము. అనన్యసామాన్యము. దీన ప్రాచీనహైందవవిజ్ఞానగరిమ సుబోధమగుచున్నది. లక్ష్మణుఁడు నుడివిన యింద్రజాలము రామునివిరహముం గూర్చిన ప్రశంస యైనను నిట కవి చాల నేర్పుతో కథాగమనమును వస్తువిస్తరణమును నిర్వహించుచు ఇంద్రజాలమును వర్ణించుట కడుంగడు ప్రశంసనీయము. రత్నశేఖరుఁ డీ యింద్రజాలవిద్యను చిత్రరూపనామకుఁ డగు నొక దానవునొద్ద గ్రహించినట్లు నుడువును. ఇట వస్తువిస్తరణ దృష్టితో నైంద్రజాలికమున లంకలోని సీతావృత్తాంత మంతయు రామలక్ష్మణులకీ పంపాతీరముననే రత్నశేఖరుఁ డు చూపును. ఇది యొక వింత. ఇట పర్యాయముగా సీతారాముల విరహాలాపము లొండొరులు వినుచుండునట్లు గోచరింపఁజేసి కవి కొంత యూరటఁ గూర్చినాఁడు. రాముఁడు సీతావిషయకమతిభ్రమణముచే

సర్వము సీతామయముగఁ గాంచి, 'ఆమె యెట నున్నది' యని యనుచుండ నింద్రజాల మారంభవై సీత కనఁబడును. అత్తరి రాముఁడు తత్కథమదృష్టచంద్రలేఖశ్చంద్రాలోకః' చంద్రకళ లేకయే వెన్నెలగా నున్నది యని నిజమని తలంచి యచ్చెరు వందును. లక్ష్మణుఁ డది యింద్రజాల మని హెచ్చరించును. ఒకవైపు రామునకింద్రజాలమున సీతావిషయమును దెలుపుచు, మరొకవైపున సీతకు స్వప్నవృత్తాంతమువలె రామవిషయము నెరుకపరచుచు కథనెంతో రసవంతముగ ముఖాముఖి సంభాషించుకొనుచున్నట్లు కవి నేర్పుతో నిర్వహించినాఁడు. ఈ ఇంద్రజాలము కపిప్రవరుఁడు హనుమంతుఁడు లంకఁ బ్రవేశించె నని తెల్పును. మరియు రావణుఁడు కామాంధుఁడై సీతకడకు వచ్చి తన్ను బ్రేమింపఁ గోరును. సీత రావణవచనములు వినినట్లు రామచంద్రుముఖమునే చూడఁ గోరినట్లును, రావణుఁడు ప్రలపించుచున్నాఁ డని త్రిజట నుడువుటయు నీ యింద్రజాలమున రాముడు గాంచి త్రిజటను మెచ్చికొనును. 'సాధుత్రిజటే, యత్ప్రలాప ఇత్యుక్తవత్యసి' అనును. ఈ సన్నివేశము సీతాశీలము ననుమానింపకుండునట్లు కూర్పబడినది. రావణుఁడు సీతతో నాడు మాటలన్నియు రాముఁ డెదురుగాఁ జూచుచున్నట్లు భావించును. రావణుఁడు నిజవచనములలో 'రామస్తు కేవలమయం సుముఖి త్వదర్థేమాం హంతి హంతు న చిరాన్నిశితైః శరౌఘైః' అని కామః అనఁబోయి రామః అని నుడివి నిజనాశమునే కోరుకొనును. సీత నెంత తర్జనభర్జనములు చేసి తన్ను వరింపఁ గోరినను రావణున కేమాత్రమును జడియక 'యది ఖద్యోతభాసాపి సమున్మీలతి పద్మినీ' (మిణుగురుకాంతికిఁ దామర వికసించునా!) యన రామరావణులకు తపనఖద్యోతములకు వలె నంతర మని నుడివినట్లు భావించి రావణుఁడు సీతను ఖండింప ఖడ్గము నెత్తును. అత్తరి నది యంతయు సత్యమని

రాముఁడు రావణు నెదుర్కొన లేచుటయు, లక్ష్మణుఁ డది యింద్రజాల మని హెచ్చరించుటయు నాటకీయముగ నెంతో మెరుఁగిడుచున్నది. నాటకలక్షణములలో ప్రధానమగు నభినయమున కిది యాస్పదమై యద్భుతముగ నున్నది. రావణుఁడు సీతపై ఖడ్గమెత్తినపుడు రాముఁడు నుడువు శ్లోకము ప్రశంసార్హము.

"చాంద్రీం లేఖాం దశతి దశనైర్దారుణః సైంహికేయో
నవ్యాం వల్లీం దవదహనకశ్చందనీం దందహీతి।
అప్యున్మత్తః కువలయమయీం మాలికామాలునీతే
మూలాదున్మీలయతి నలినీం దుష్టహస్తీ కరేణ॥"

(అంకము 6. శ్లోకము 34.)

చంద్రకళను క్రూరుఁడగు రాహువు దంతములతోఁ గొరుకుచున్నాఁడు. సుకుమారమగు చందనలతను కార్చిచ్చు కాల్చివేయుచున్నది. అందమగు కలువపూవులను పిచ్చివాఁడు త్రుంచివేయుచున్నాఁడు. చెడ్డయేనుగు తొండముతో తామరతీగెను సమూలముగ పెల్లగించుచున్నది అని రావణచెయిదము లట్టివని నుడువుచున్నాఁడు. ఇంతలో రావణునిహస్తమున నక్షకుమారుని శిరముఁగని దుష్టకపియే యక్షకుమారుని జంపెనని యాతని దండింప నేగును. త్రిజట సీత నోదార్చుచుండును. సీత యనలప్రవేశ మొనర్ప నశోకవృక్షము నంగారకణము నీఁగోరును. హనుమంతుఁ డందు దాగి యుండి రామరత్నాంగుళీయకమును జార విడువ సీత దానిని నెర్రగా నుండుటచే దొలుత నగ్నికణ మని గ్రహించి క్రమముగా రామరత్నాంగుళీయక మని యెంతో హర్షించి దానినే సంబోధించి 'అపి తావత్కుశలం నలక్ష్మణయోః రామచంద్రచరణయోః' అని రామలక్ష్మణకుశలోదంత మడుగుచుండ హనుమంతుఁడు 'కుశలం దేవి! కుశలం' అని పటాక్షేపమున వచ్చుట మున్నగునవి నాటకమున కెంతో

సొంపు నాపాదించుచున్నవి. సీతాహనుమత్సంభాషణ మంతయు నీ యింద్రజాలముననే రాముఁడు జూచును. సీతయు నిజచూడామణి నొసఁగి ప్రతిసందేశము గూడ నంపును. హనుమంతుఁడు లంకాదహన మొనర్చుట కూడ నిందుఁ జూచి యందరు హర్షవిషాదముల నొంది యాశ్చర్యము నొందుదురు. హనుమంతుఁడును లంకావృత్తాంత మరసి రామసన్నిధికి యథార్థముగనే వచ్చును. ఇంతవరకును పరోక్షమున జరిగిన వృత్తాంతమును సరసరమణీయముగ నీ యింద్రజాలమునఁ జూపి కథ నెంతో రసవంతముగ నీ కవి సాగించి యద్భుతముగ నిర్వహించినాఁడు. ఈ నూతనకల్పనము జయదేవుని నాట్యకళానైపుణ్యమునే గాక యాతని విజ్ఞానమును గూడ వేనోళ్ళఁ జాటుచున్నది. హనుమంతునిరాకతో నీ యంకము ముగియుచున్నది. కథాభాగము చాలవరకు వాల్మీకీయముగనే నడచినది. ఇంద్రజాలమున నీ కథనుగూర్చిన కూర్పుభంగి మాత్రము నవ్యము.

సప్తమాంకమున పులస్త్యశిష్యుఁడు కరాళునితో సంభాషించుచు విష్కంభమున రావణవిభీషణసంవాదము తత్ఫలితము తెలియఁ జేయుదురు. విభీషణుఁడు రావణునకు సీతను విడిచిపెట్టు మను విషయ మెంత చాతుర్యముతో విన్నవించుచున్నాఁడో చూడుఁడు. రావణునకు వ్రాసిన లేఖలోని పద్యము,

'ఉదర్కశుద్ధిమిచ్ఛద్భిః సద్భిర్న ఖలు దృశ్యతే।
చతుర్థీచంద్రలేఖేవ పరస్త్రీఫాలపట్టికా॥'

(అంకము 7. శ్లోకము 1.)

అభ్యుదయముఁ గోరు సత్పురుషులు చవితినాటి చంద్రకళనువలె పరస్త్రీఫాలపట్టమును జూడ రని నుడువుచు మెల్లగా మందలింప యత్నించినాఁడు. అవల కోపముతోను ననురాగము తోను

పులస్త్యవంశయశశ్చంద్రునకుఁ గళంకము వాఁడవని ('హా జాతోఽసి పులస్త్యసంతతియశః శీతద్యుతేర్లాంఛనం') నుడివినాఁడు. అందుకు ఫలితముగా రావణుఁడు విభీషణుని రొమ్మునుఁ గాల దన్నెను.

'రావణేన నయధర్మభూషణస్తాడితో హృది పదా విభీషణః'

(అంకము 7. శ్లోకము 4.)

ఇట విభీషణుని రావణుఁడు కాలఁదన్నె నని మూలమునకన్న భిన్నముగా కవి చిత్రించినాఁడు. రావణదౌష్ట్యమును మరింత హెచ్చు జేసి విభీషణుని దన్నించినాఁడు. మూలరామాయణమున యుద్ధకాండమున పదునారవసర్గమున రావణుఁడు 'అస్మిన్ ముహూర్తేన భవేత్త్వాం తు ధిక్కులపాంసనమ్' అని పరుషముగా మాటాడినట్లును విభీషణుఁడు నల్గురనుచరులతో వెడలిపోయినట్లును కలదు. అభినయప్రధాన మగు నాటకమునందు కాలితో రొమ్మునఁ దన్నినట్లు చూపుట బాగుండునని యట్టి సన్నివేశమును గ్రొత్తగాఁ గల్పించినాఁడు జయదేవుఁడు. అవల విభీషణుఁడు రామసన్నిధిఁ జేరును.

రావణునకు సీతపై విరహము మిక్కుట మగును. కాముకచిత్తవృత్తిని బాగుగా నెరిగియే జయదేవుఁడు రావణపాత్రను జక్కగాఁ జిత్రించినాఁడు, బలవంతముగా తేఁబడుటచే మిక్కిలి దుఃఖించుచు సన్నగిల్లి దుమ్ము గొట్టుకొనియున్న సీతం జూచి 'జనస్థానస్థితామివాహమఖండమండనాం పశ్యామి' యని యామెయందమును మెచ్చికొని,

'ఆచాంతకాంతిరున్నిద్రైర్మయూఖైరహిమత్విషః।
ధూసరాపి కళా చాంద్రీ కిం న బధ్నాతి లోచనమ్॥'

(అంకము 7. శ్లోకము 9.)

చంద్రకళ ధూసర మైనను కంటి కింపుగా నుండును గదా యనును. ఇంతలో ప్రహస్తుఁడు రావణవినోదార్థము చిత్రపటముం జూపును. రావణవినోదార్థము ఏదేని పంపుట యను విషయము బాలరామాయణమునుండి గ్రహించి యుండనోపు. రాజశేఖరుఁడు తన బాలరామాయణమున రావణవిరహవినోదనార్థము దేవేంద్రు డొక నాటకప్రదర్శనము గావింప నటకుల నప్సరసల నంపినట్లు చిత్రించి రామగాథ సీతాస్వయంవరము దనుక చక్కగా కథాగమనము గూడ దలఁచి సాగించినాఁడు. ఈ ప్రసన్నరాఘవమునందును జయదేవుఁడు మేఘనాదవధాంతము గల రామాయణకథను సంగ్రహముగా రామవృత్తాంతమును చిత్రపటముద్వారా రావణున కెరుక పరచుచున్నాఁడు.

పిదప యుద్ధవిషయ మంతయు నొకవిద్యాధరమిథునముద్వారా సీత యగ్ని ప్రవేశ మొనరించి శుద్ధురాలై రామునిగలసినదాకగల విషయమును దెల్పుచున్నాఁడు.

పిదప సీతారామలక్ష్మణులును, సుగ్రీవవిభీషణులును సంతోషముగఁ గూడి చంద్రుని చమత్కారముగా నందరును వెవ్వేరుగా వర్ణింతురు. రాముఁడు ఏదో తూర్పుదిక్కాంతముక్కుముత్తెముకాంతి జగము నంతయు నావరించుచున్న దని వర్ణించినపుడు సుగ్రీవుఁ డందుకొని సప్తార్ణవపర్యంతము గల యీ భూమి యంతయు తెల్లనివస్తువులగు కర్పూర, కైరవ, కుంద, స్వర్ణదీకల్లోల, కేతక, చంద్రాదులకన్న తెల్లనగు రామకీర్తిచేఁ దెల్లగా నాయె నని వర్ణించును. రాముఁడు ధీరోదాత్తుఁడు గాన సుగ్రీవుని మెచ్చుకొనక 'అలం తుచ్ఛప్రాయ జల్పితేన,' అని నిజస్తుతిని మెచ్చుకొనఁడు. రామపాత్రమునకు లోపము రానీయకుండ జయదేవుఁడు మెలఁకువతోఁ జిత్రించినాఁడు.

అవల వారందరును విమానమెక్కి యయోధ్యకుఁ బయన మగుదురు. త్రోవలోఁ జిత్రకూటము భరద్వాజాశ్రమముల గుర్తించి ప్రభాతసమయము కాగా నందరును భాస్కరుని సంతసమున వర్ణింతురు. క్రమముగా గంగం దాటి సరయూతరంగశీకరశీతలపరిసర యగు నగరసీమంతమణి నయోధ్యం జేరి యట భరతానుగమ్యమానుఁడౌ వసిష్ఠుని జూచి విమానమునుండి దిగ నెంతురు. రాముఁడు సూర్యభగవానుని నమస్కరించును. తెరలో రాముఁడు ముల్లోకముల సర్వుల కానందముఁ గూర్చుఁ గాక యని శ్లోకము చదువుదురు. ఇదే శ్లోకము పరశురామజయానంతరము చతుర్థాంకమున నుడువఁబడి యున్నది,

"యశఃపూరం దూరం తనుసుతనునేత్రోత్పలవనీ
తమస్తంద్రాచంద్రాతపతపసహస్రాణి శరదామ్।
ఇయం చాస్తాం యుష్మచ్ఛరశమితలంకేశ్వరశిరః
శ్రితోత్సంగా నందత్సురనరభుజంగా త్రిజగతీ॥"

(అంకము 7. శ్లోకము 92.)

సుగ్రీవుఁడే యీ నాటకమున భరతవాక్యము పఠించుచున్నాఁడు. ఈ భరతవాక్యశ్లోకము–

"ఆబాల్యాద్వదనాంబుజే తనుభృతాం సారస్వతం జృంభతాం
దేవే కౌస్తుభధామ్ని చంద్రముకుటాద్వైతా మతిః ఖేలతు।
వాగ్దేవ్యా సహ ముక్తవైశసరసా దేవీ చ దీవ్యాదియం
శేషస్యేవ ఫణాంచలేషు సతతం లక్ష్మీః సతాం సద్మసు॥"

(అంకము 7. శ్లోకము 94.)

బాల్యము మొదలుకొని మానవుల కందరకును విద్య బాగుగా పెంపొందు గాక, హరిహరులందు సమానముగా భక్తిపొడము గాక,

ఆదిశేషునిపడగలందు భూదేవివలె, లక్ష్మియు సరస్వతితో వైమనస్యము వీడి, సత్పురుషుల యిండ్ల మెలఁగుగాక అని నుడువును. పిదప గురుజన బంధుజన పౌరజనుల నందర నానందింపఁ జేయుద మని వారందరును పుష్పకవిమానమునుండి యవతరింతురు.

ఇందు భరతవాక్యము సుగ్రీవుఁడు నుడువుట చిత్రము. పట్టాభిషేకము కూడ వర్ణింపబడలేదు. భరతవాక్యము మురారి యనర్ఘరాఘవమునందు నుడివినదానిని బోలి యున్నది. మొత్తముమీఁద నీతనికైత శ్రవణపేయము, సన్నివేశములు దృశ్యములు నాటకాలంకారములై బాగుగనే యున్నవి.

ప్రసన్నరాఘవమునందలి సూక్తులు

1. ఆకారేణైవ చతురాస్తర్కయంతి పరేంగితమ్।
గర్భస్థం కేతకీపుష్పమామోదేనైవ షట్పదాః॥ (అం. 1-శ్లో 4.)
(ఆకారముచేతనే యితరుల మనోగతాభిప్రాయములను సమర్థులూహింతురు. పరిమళముచేతనే తుమ్మెదలు వృక్షగర్భమందున్న మొగలిపూవును తెలిసికొనుచున్నవి.)

2. గుణగ్రామావిసంవాది నామాపి హి మహాత్మనామ్।
యథా సువర్ణశ్రీఖండరత్నాకరసుధాకరాః॥ (అం. 1-శ్లో 5.)
(మహాత్ములకు గుణగణములును సువర్ణ, శ్రీఖండ, రత్నాకర సుధాకర నామములవలె వారి పేళ్ళకుఁ దగినట్లుండును.)

3. చంద్రే చ రామచంద్రే చ కాంతానాం చ దృగంచలే।
నీలోత్పలసుహృత్కాంతౌ కస్య నో మోదతే మనః॥ (అం. 1-శ్లో 10.)
(చంద్రునియందును శ్రీరామచంద్రునియందును నల్లకలువవంటి కాంతాదృగంచలమునందును నందరకు సంతోషముండును.)

4. అహి ముదముపయాంతో వాగ్విలాసైః స్వకీయైః
పరభణితిషు తోషం యాంతి కిం నైవ సంతః।
నిజఘనమకరందస్యందపూర్ణాలవాలః
కలశసలిలసేకం నేహతే కిం రసాలః॥ (అం. 1-శ్లో 19.)
(సత్పురుషులు తమ వాగ్విలాసములందే కాక యితరుల వాక్యములందును సంతసింతురు. మావిడిచెట్టు తన గొప్పమకరందధారచే పూర్ణమైన పాదు కలదయ్యు కడవలతోపోయు నీరును అభిలషించుచుండును గదా.)

5. విషస్య విషమౌషధం భవిష్యతి (అం. 1)
(విషమునకు విషమే యౌషధ మగుచున్నది.)

6. వార్తా చ కౌతుకవతీ విమలా చ విద్యా
లోకోత్తరః పరిమళశ్చ కురంగనాభేః।
తైలస్య బిందురివ వారిణి దుర్నివార
మేతత్త్రయం ప్రసరతి స్వయమేవ లోకే॥ (అం. 2-శ్లో 2.)
(కౌతుకవంతమైన వార్త, విమలమగు విద్య, లోకోత్తర పరిమళమగు కస్తూరివాసన- ఇవి మూడును నీటిమీఁద నూనెచుక్కవలె దుర్నివారమై లోకమున స్వయముగనే వ్యాపించును.)

7. సంబంధిజనే పరిహాసవచనాని న ఖలు పాపకారణాని
(బాంధవజనులపట్ల పరిహాసముగ పల్కుట పాపకారణము కాదు.)

8. దేవతాధిష్ఠితాని హి ముగ్ధజనవచనాని భవంతి
(ముగ్ధజనవచనములు దేవతాధి ధృష్టితము లగును.)

9. ఏకామిషాభిలాషో హి బీజం వైరమహాతరోః
(వైరమహాతరువున కేకామిషాభిలాషయే కదా బీజము.)

10. కో జానాతి విధేః సంవిధానవైదగ్ధ్యమ్
(విధియొక్క సంవిధాన చాతుర్యము నెవ్వఁ డెరుగును?)

11. న జ్ఞాతుం నాప్యనుజ్ఞాతుం నేక్షితుం నాప్యుపేక్షితుమ్।
సుజనః స్వజనే జాతం విపత్పాతం సమీహతే॥ (అం. 5-శ్లో 2.)
(సుజనుఁడు స్వజనమునకు సంభవించిన విపత్తును తెలిసికొనుటకును, తెలిసినను నంగీకరించుటకును, కన్నులార జూచుటకును, చూచిన నుపేక్షించుటకును నిచ్చగింపఁడు.)

12. న ఖలు స్నేహానుగుణవృత్తయో మహాభూతప్రవృత్తయః
(మహాభూతప్రవృత్తులు స్నేహానుగుణవృత్తులు గావుకదా!)

13. ప్రాయో దురంతపర్యంతాః సంపదోఽపి దురాత్మనామ్।
భవంతి చ సుఖోదర్కా విపదో పి మహాత్మనామ్॥ (అం. 5-శ్లో 49.)
(దురాత్ముల సంపదలు తరచుగా దురంత పర్యంతములును మహాత్ముల విపత్తులు సుఖోదర్కములుగా నుండును.)

14. నిజేఽప్యపత్యే కరుణా కఠినప్రకృతేః కుతః (అం. 6-శ్లో 18.)
(కఠిన ప్రకృతికి నిజాపత్యమునందును కరుణ యుండదు.)

15. చాంద్రీం లేఖాం దశతి దశనైర్దారుణః సైంహికేయో
నవ్యాం వల్లీం దవదహనకశ్చందనీం దందహీతి।
అప్యున్మత్తః కువలయమయీం మాలికామాలునీతే
మూలాదున్మూలయతి నలినీం దుష్టహస్తీకరేణ॥ (అం. 6-శ్లో 34.)
(దారుణుఁడగు రాహువు చంద్రలేఖను దంతములతో కొరుకుచున్నాడు, కార్చిచ్చు సుకుమారమైన చందనలతను కాల్చివేయుచున్నది. పిచ్చివాఁడు కలువలమాలనుత్రెంచివేయుచున్నాడు. దుష్టగజము తొండముతో పద్మలతను మూలమునుండి పెరికివేయుచున్నది.)

16. ఉదర్కశుద్ధిమిచ్ఛద్భిః సద్భిర్న ఖలు దృశ్యతే।
చతుర్థీచంద్రలేఖేవ పరస్త్రీఫాలపట్టికా॥ (అం. 7-శ్లో 1.)
(శుభాకాంక్షులగు సజ్జనులు చతుర్థీ చంద్రలేఖవోలె పరస్త్రీఫాలపట్టికను చూడరు.)

17. పరస్త్రీకుచకుంభేషు కుంభేషు పరదంతినామ్।
నిపతంతి న భీరూణాం దృష్టయః శరవృష్టయః॥ (అం. 7-శ్లో 2.)
(భీరువుల దృష్టులును, శరవృష్టులును పరస్త్రీకుచకుంభములందును పరదంతికుంభములందును పడవు.)

18. నిజచిత్తవృత్తిభిత్తిభూమికానుసారీణి వాక్చిత్రాణి లోకస్య।
(లోకుల వాక్చిత్రములు వారి వారి చిత్తవృత్తిభిత్తి భూమికాసు సారములుగా నుండును.)

19. ఆచాంతకాంతిరున్నిద్రైర్మయూఖైరహిమత్విషః।
ధూసరాపి కలా చాంద్రీ కిం న బధ్నాతి లోచనమ్॥ (అం. 7-శ్లో 9.)
(సూర్యకిరణములచే గ్రోలబడిన కాంతిగల చంద్రకళ ధూసరయైనను చూచుట కింపుగా నుండునుగదా!)

20. వక్రో హి విధిః
(విధి వక్రము కదా!)

* * * *